# MUSLIM MAHILA
## (Muslim Woman-Telugu)

# ముస్లిం మహిళ


రచన
తాహిరా తన్వీర్



ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్
ఫ్లాట్ నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2
ఫోన్: 040-66710795, 9441515414

వెల........................రూ. 120/-లు





Name of the Title: Muslim Mahila Telugu (Muslim Woman)

Written by : TAHIRA TANVEER, Hyderabad-2

Editing & Proof reading: Moulana Abdul Mateen Omri, Hyderabad



All rights reserved with: Islamic Resource Centre



First Edition: (1000 Copies) April, 2005

Second Edition: April, 2006

Third Edition April, 2010

Copies: 1000

Published by: Islamic Resource Centre, Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 9441515414

Type set by: Alifain, I.R.C. Graphics, Sahara Complex-106, Pathargatti, Hyderabad-2, Ph: 9441515414

Printed at : H.S. Offset Printers, 714, Chandni Mahal, Daryaganj, New Delhi-2, Ph: 23244240

Price: Rs. 120/-


### సత్యాన్వేషకులకు ఓ సదవకాశం

ఇస్లాం సృష్టికర్త తన ప్రవక్తల ద్వారా పంపిన సంపూర్ణ సంవిధానం. కాని ఈనాడు ఇస్లాం అనుచరులైన ముస్లింలు దీన్ని పూర్తిగా ఆచరించకపోవడంవల్ల, మరోవైపు జాత్యహంకారులైన మతదురభిమానులు వ్యాపింపజేసిన అపోహల వల్ల సత్యాన్వేషకులకు ఇస్లాంను అర్థంచేసుకోవడం చాలా కష్టమైపోయింది. అనువాదాల భాషాశైలి కూడా ప్రజలకు ఆసక్తి కల్గించలేకపోతోంది. ఇప్పుడు తెలుగువారి కోసం తేటతెలుగులో ఇస్లాం గురించి సరైన సమగ్రసమాచారం అందజేయడానికి "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నడుం కట్టింది. మీ అభిప్రాయాలు ఫోన్ 9441515414 ద్వారా తెలియజేయగలరు.

# విషయసూచిక

నెం. విషయం పేజి


1. అతివాదాలు తెచ్చిన అనర్థకాలు 019
2. ఇస్లామేతర మతాలలో స్త్రీ పరిస్థితి 020
3. క్రైస్తవ మతంలో స్త్రీ స్థానం 021
4. పాశ్చాత్యనాగరికతలో పడతుల పరిస్థితి 022
5. ఆర్ట్ పేరుతో అంగాంగ ప్రదర్శనలు 024
6. ఇస్లాం మౌలిక సూత్రాలు 025
   " స్త్రీ పురుషుల సమానత్వం 026
   " రెండువర్గాల్లో మానవుల విభజన 027
7. కుమార్తెగా స్త్రీ స్థానం 027
   " ప్రతి యుగంలోనూ ఇంతే 030
   " క్షీణదిశగా బాలికల సంఖ్య, ప్రభుత్వ ఉదాసీనత 030
   " అందరికీ ఆహారమిచ్చేవాడు దేవుడే 031
   " ఉపాధి పంపిణిలో అపసవ్యతలు 032
   " ఆడపిల్లల సజీవసమాధికి కారణాలు 033
   " ఒక బాలిక బాధామయ గాధ 033
   " ఇస్లాంలో ఆడపిల్లలపై దైవకారుణ్యం 035
   " నరకానికి అడ్డుగోడలు ఆడపిల్లలే 036
   " కుమార్తెల పట్ల దైవప్రవక్త (సల్లం) వాత్సల్యం 037
   " సజీవసమాధి చేసినవారే గుండెలకు హత్తుకున్నారు 037
8. కుటుంబ నియంత్రణ 038
   " త్రికోణం తెచ్చిన తంటాలు 038
   " నారు పోసినవాడు నీరు పొయ్యడా? 039
   " ఏది చాదస్తమో కష్టాలెదురైనప్పుడే తెలుస్తుంది 040
   " ఖుర్ఆన్ వీరికి మొదటి ప్రాణం 041
   " కళ్ళకున్న గంతలు తీసి చూడు 042
   " పెరుగుతున్న భ్రూణహత్యలు 044
   " నిష్ఫలన సంపర్కం చేయవచ్చా? 044
   " పరలోకపు జవాబుదారీ భావన 045
9. వివాహనిషిద్ధ స్త్రీలు 046
   " అజ్ఞానం పాపకూపంలోకి నెడ్తుంది 046
   " పురుషుడు పెండ్లాడకూడని స్త్రీలు 047
   " అక్రమ సంతానం సమస్య 048





   " స్తన్యసంబంధాన్ని గుర్తుంచుకోవాలి 049
   " అత్తమామలు తల్లిదండ్రులతో సమానం 050
   " పెంపుడుకొడుకు భార్య సొంత కోడలు కాదు 050
   " ఏకకాలంలో వివాహబంధంలో ఉండకూడని స్త్రీలు 051
   " బహుదైవారాధక స్త్రీలు కూడా నిషిద్ధులే 051
   " పినతండ్రి, పెత్తండ్రి కుమార్తెలను పెళ్ళాడవచ్చు 052
   " క్రైస్తవ, యూద స్త్రీలను వివాహమాడవచ్చా? 052
   " క్రైస్తవ, యూద పురుషులు నిషిద్ధులు 053
   " బానిస స్త్రీల వివాహం 053
10. వివాహం 054
   " పెళ్ళి, ప్రవక్త సంప్రదాయం 054
   " ప్రేమానురాగాలే పెళ్ళి ధ్యేయం 055
   " ఇస్లాంలో పెళ్ళిచూపుల సంప్రదాయం 056
   " వరుని ఎంపిక వధువు హక్కు 057
   " నాలుగు ప్రాతిపదికలపై స్త్రీ వివాహం 058
   " తాత్కాలిక వివాహం నిషిద్ధం 059
   " వితంతు వివాహానికి ఇస్లాం ప్రోత్సాహం 060
   " నికాహ్ (వివాహం) విధానం 060
   " పండుగరోజుల్లో కూడా పెళ్ళి, పెళ్ళిపాటలు 061
   " మనస్సును మభ్యపెట్టే పాటలు, వాయిద్యాలు 061
   " వలిమావిందు ప్రవక్త సంప్రదాయం 062
11. వరకట్న రక్కసి 063
   " వరకట్నం వాడికోరల్లో వధువు విలవిల 063
   " తలకుమించిన కానుకలతో తల్లిదండ్రుల బాధ 064
   " ప్రవక్త కుమార్తె పెళ్ళిలో ఇచ్చిన కానుకలు 065
12. మహర్ (స్త్రీ ధనం) 066
   " మహర్ ఎప్పుడు ఇవ్వాలి? 067
   " స్త్రీకిచ్చిన మహర్, కానుకలన్నీ ఆమె ఆస్తులే 067
   " అవిశ్వాసుల మహర్ సమస్య 068
13. బహు భార్యత్వం 069
   " పురుషసామర్థ్యం నల్గురు స్త్రీలకు సమానమా? 070
   " సతులందర్నీ సమానదృష్టితో చూడాలి 072
   " కొత్తభార్య దగ్గర తొలిసారి మూడులేక ఏడురాత్రులు 073
   " ప్రవక్తభార్యల సంఖ్యపై ప్రత్యర్థుల దుష్ప్రచారం 073
   " విప్లవ సారథి విశిష్టతే అలాంటిది 074

14. బాధ్యతలు మరిస్తే బాధలు తప్పవు 075
" అసమంజస కార్యవిభజన తెచ్చే అనర్థకాలు 076
" ప్రదర్శనాబుద్ధితోనే పడతుల అత్యుత్సాహం 076
" పురుషుల పొగడ్తలు, పడతుల పాట్లు 077
" చైర్మన్, సెక్రటరీల బాధ్యతలు ఒకటేనా? 078
" సహజ వ్యత్యాసాలు, అసహజ మార్గాలు 078
" సమానత్వం కాదు, న్యాయం కావాలి 079
" స్త్రీపై పురుషుని ఆధిక్యత ఎందుకు? 080
" కుటుంబ పెద్ద పురుషుడే ఎందుకు? 080

15. దాంపత్య జీవితం 081
" వివాహిత స్త్రీ రక్షణ కోట 082
" వివాహం మొదటి లక్ష్యం: శీలరక్షణ 082
" వివాహం రెండవ లక్ష్యం: కారుణ్యాభిమానాలు 083
" సర్దుబాటు వైఖరి అవలంబించాలి 085
" లైంగిక భావోద్రేకాల వినియోగం 086
" పురుషులు స్త్రీలకు, స్త్రీలు పురుషులకు నష్టదాయకం! 086
" మర్మాంగాలను గురించి ప్రాథమిక హితవులు 087
" రతిక్రీడ గురించిన జాగ్రత్తలు 087
" అసహజ మైథునం ఎంత అసహ్యకరం! 088

16. భర్త బాధ్యతలు 089
" భార్యాపిల్లల పోషణ బాధ్యత 089
" ఇస్లాందృష్టిలో మంచి భర్త 090
" నోటిదురుసు పెళ్ళాంతో ఎలా వేగాలి? 091
" భార్యలందరి హక్కులను గౌరవించాలి 091
" సెక్స్‌సింబల్ కాదు, సేద్యభూమి 092
" పరస్పరం దుస్తులు వంటివారు 092
" కొడ్తే ఏడుస్తుంది, కొట్టకపోతే ఎగబడ్తుంది 093
" తుమ్మెదలు కాదు, బాధ్యతున్న సంరక్షకులు 094

17. భార్య బాధ్యతలు 094
" ఇంటికి దీపం ఇల్లాలే 094
" భర్త మీద భార్య ఆరోపణలు 095
" కృతఘ్నత, ధిక్కారాలు ఎంతో నష్టదాయకం 096
" పతి దేవుడు కాదు సతి సాష్టాంగ పడటానికి 096
" ఇస్లాం దృష్టిలో ఉత్తమ గృహిణి 097
" స్త్రీలకు కొన్ని ముఖ్యమైన హితవులు 098
" శీలవతే భర్త హృదయాన్ని ఏలుతుంది 099



" ఈ మేకప్పులు, అలంకరణలు ఎవరి కోసమో! 099
" ఖుర్‌ఆన్ దృష్టిలో అతివలకు ఆదర్శప్రాయులు 101

18. ఆత్మ సౌందర్యం 101
" ఆత్మసౌందర్యం లేనిచోట అనుమాన పెనుభూతం 102
" తప్పెవరిదైనా శిక్ష మనకే 102
" కారణం ఏదైనా మందొక్కటే 103
" అందంతో ఎంతోకాలం ఆకట్టుకోలేరు 103
" మీ చేతుల్లోనే ఉంది ఈ అమృతభాండం 104
" సుగుణవతుల లక్షణాలు 105

19. అత్తాకోడళ్ళ గొడవలు 105
" ఆధునిక భారతసంస్కృతిలో అత్తాకోడళ్ళు 106
" భార్యావిధేయుడా, తల్లిచాటు కొడుకా? 107
" పరలోకభావనే పరిస్థితిని మార్చుతుంది 107
" అత్తా ఒకింటి కోడలే 108
" అత్త మీద కోపం దుత్త మీద చూపకండి 108
" కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం 109
" కొత్తకాపురంలో కోడలిపిల్ల కోర్కెలు 109
" మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు 110
" నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది 111

20. ఆలుమగల మధ్య అపార్థాల అగాధం 112
" విష్ యూ గుడ్ లక్! 112
" కొత్త జీవితంలో సరికొత్త సమస్యలు 113
" పుండు మీద కారం చల్లినట్లయింది 114
" పిల్లల్ని కనలేకపోవడం కూడా తప్పేనా? 115
" కారుమబ్బులు వీడిన నిర్మలాకాశం 116

21. పరదా నియమాలు 117
" పరదా పడతుల కంచుకోట 117
" పురుషుల దృష్టి రక్షణ 118
" స్త్రీల దృష్టి రక్షణ 118
" వేడిరక్తంతో వాడిచూపులు వద్దంటే... 119
" దుష్ట వీక్షణలు షైతాన్ విషబాణాలు 120
" అపరిచిత స్త్రీల ముందు కూడా పరదా? 120
" స్త్రీవాంఛలేని పురుషుల ముందు పరదా? 120
" అనుమతి లేకుండా ఇంట్లో ప్రవేశించరాదు 121
" భార్య సతర్ భర్తకే పరిమితం 122
" భర్తలులేని ఏకాంత సమయంలో 122

" ముట్టుకోవడం, చేయి పట్టుకోవడం కూడా నిషిద్ధమే 123
" మహిళలకు మేలుచేసే మేలిముసుగు 123
" స్త్రీలకు మాత్రమే ఈ గంతెందుకు అంటారా? 124
" ఇది లజ్జావతుల హెల్మెట్ 124
" పడకగదిలో నిషిద్ధ సమయాలు 125

22. పరదా నుండి మినహాయింపులు 125
" సతర్ (కనీస ఆచ్ఛాదన) పరిమితులు 126
" స్త్రీపురుషుల చూపుల్లో కాస్తంత తేడా 127
" దగ్గరి బంధువుల ముందు పరదా పరిమితులు 128

23. వస్త్రధారణ, అలంకరణలు 128
" దైవప్రసాదిత వస్తువుల్ని నిషేధించుకోకండి 129
" అప్రాచ్య వస్త్రధారణ అతివలకు తగదు 129
" అలంకరణలన్నీ ఇంట్లో ఉన్నప్పుడే 130
" దుస్తులు ధరించిన దిగంబర స్త్రీలు 130
" కృత్రిమ సౌందర్య చేష్టలు నిషిద్ధం 130
" పురుషదుస్తులు స్త్రీలు ధరించకూడదు 131
" పరపురుషులతో మెతకగా మాట్లాడకండి 131

24. ఇంటి నుండి బయటికి వెళ్ళేటప్పుడు 132
" ఆడది తిరిగి చెడిపోయింది, మగాడు... 132
" అశ్లీల విషయాలపై ఆంక్షలలో తొలి ఆంక్ష 133
" ప్రయాణావస్థలో పడతుల బాడీగార్డులు 133
" మహిళలు మసీదుకు వెళ్ళవచ్చు 134
" నాణానికి ఒకవైపున్న చిత్రం చూపితే చాలదు 135
" ఇస్లాం దృష్టిలో స్త్రీ సాక్ష్యం 136

25. తలాఖ్ (విడాకులు) 137
" అనివార్య స్థితిలోనే విడాకులివ్వాలి 137
" ధర్మసమ్మతాలలో అవాంఛనీయమైనది 138
" "ఈలా" (ఒట్లు, పాపపరిహారం) 138
" 'ఈలా' వర్తింపులో ఫిఖావేత్తల మధ్య విభేదాలు 139
" జిహార్ (తల్లికాని తల్లి) 139
" గడువులోపే పునరుద్ధరణకు అవకాశం 140
" ఒకేసారి మూడు తలాఖులు శాస్త్రవ్యతిరేకం 141
" రాజీ కుదుర్చడానికి పెద్దల ప్రయత్నం 142
" రుతుకాలంలో విడాకులివ్వరాదు 143



" ఖుర్ఆన్ వెలుగులో విడాకుల విధానం 144
" "రజయీ తలాఖ్" విధానం 144
" "బాయిన్ తలాఖ్" విధానం 145
" "ముగల్లా తలాఖ్" విధానం 146
" దొడ్డిదారితో ఆత్మద్రోహం చేసుకోకండి 146
" విడాకుల తరువాత మహర్ సమస్య 147
" తలాఖ్ ఇవ్వడానికి నాలుగు విధాలు 148
" విడాకులకు ముందు పాటించాల్సిన నిబంధనలు 148
" ఆ మహాతల్లి చేతిచలువే అలాంటిది 149
" తండ్రి పరోక్ష సలహాతో కొడుకు తలాఖ్ 149
" మామ మెచ్చిన కోడలు 151

26. "ఖులా" (స్త్రీలిచ్చే విడాకులు) 153
" తలాఖ్ విడాకులకు, ఖులా విడాకులకు తేడా 153
" భార్య విడాకుల్ని భర్త ఆమోదించాలా? 154
" విడాకులిచ్చేందుకు స్త్రీకి మూడు మార్గాలు 155
" విడిపోవడానికి మొదటి మార్గం 155
" విడిపోవడానికి రెండవ మార్గం 156
" విడిపోవడానికి మూడవ మార్గం 156
" వేధించే భర్త నుండి విముక్తిమార్గమే "ఖులా" 156
" భర్త నచ్చకపోయినా ఖులా ఇవ్వచ్చు 157
" భర్త వ్యాధిగ్రస్త స్థితిలో విడాకులు 158

27. న్యాయస్థానంలో స్త్రీల సమస్యలు 158
" వివాహ విచ్ఛేదం (తఫ్రీఖ్) 159
" పత్తాలేకుండా పోయిన భర్త వ్యవహారం 159
" పత్తాలేకుండా పోయిన భర్త తిరిగొస్తే...? 160
" శీలవతులపై అపనిందలా? 161
" ఖజఫ్ (అపనింద) 163
" లిఆన్ (ప్రమాణం చేయడం) 163
" భర్త ఫిర్యాదు పునఃపరిశీలన 164
" దైవప్రవక్త (సల్లం) చేసిన మరికొన్ని తీర్పులు 165
" గర్భధారణ గురించి కొన్ని చిక్కుసమస్యలు 166
" డి.యన్.ఎ. పరీక్షల ద్వారా పరిష్కారం సాధ్యమా? 167
" అక్రమ పద్ధతులతో ఆలుమగలను విడదీయడం నేరం 168
" స్త్రీకి స్త్రీయే శత్రువు 169

28. జీవనభృతి, మనోవర్తి 169
" గడువు (ఇద్దత్) కాలం ఎవరికెంత? 170
" హ్జరత్ అస్లమియ్య (రజి) ఇద్దత్ ఉదంతం 170
" పోషణకాలం ఎవరెవరికి ఎంతెంత? 170
" ఐచ్ఛిక జీవనభృతి సముచితరీతిలో ఇవ్వాలి 171
" విభిన్న రకాల జీవనభృతులు 171
" భారతీయ శిక్షాస్మృతిలో భర్తలపై మనోవర్తి భారం 172
" షాహ్‌బాను కేసు, సుప్రీంకోర్టు తీర్పు 172
" ముస్లిం మహిళాహక్కుల రక్షణచట్టం 173
" ఏది ప్రయోజనకరమో చూడండి 173
" క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వివరాలు 174
" ముస్లిం మహిళాహక్కుల చట్టం వివరాలు 174
" వక్ఫ్‌బోర్డు పాత్ర (వారసులకు ప్రత్యామ్నాయం) 174

29. పునర్వివాహం, పాలసమస్య 175
" వితంతు పునర్వివాహం 176
" సంతానంలేని వితంతువు కష్టాలు 176
" బిడ్డకు పాలిచ్చేవారి పోషణఖర్చులు భరించాలి 177
" పితృప్రేమ, మాతృమమకారం మధ్య పిల్లలు 178

30. ఆర్థిక హక్కులు 179
" ఖైరున్ ఆస్తివాటాకు పడిన చిక్కుముడి 179
" సాద్ బిన్ రబీ (రజి) భార్యకు జరిగిన అన్యాయం 179
" భర్త నుండి భార్యకు రావలసిన ఆస్తివాటాలు 180
" మొట్టమొదట మరచిపోయే ధర్మజ్ఞానం 180
" మొత్తం ఆస్తిలో వీలునామా వాటా 181
" సూత్రప్రాయమైన ఆర్థిక విషయాలు 181
" తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తె వాటా 181
" సోదరుల ఆస్తిలో సోదరి వాటా 182
" ఇద్దరు బలహీనుల్ని గురించి తాకీదు 182
" వీలునామా వారసులకు నష్టం కల్గించరాదు 183
" కళ్ళుతెరచిన ఆధునికులు, అయినా ఆచరణ శూన్యం 184
" ఆతివలకు ఆర్థిక సమానత్వం లేదట! 184

31. విద్యార్జనా హక్కు 185
" విద్యలేనివాడు వింతపశువు 186
" బడికి పోయే బామ్మను చూడు! 187
" చదువులేని మొద్దు కదలలేని ఎద్దు 187
" అజ్ఞానం అపార్థాలకు దారితీస్తుందా? 188



" జ్ఞానకాంతిలో అపార్థాల చీకటి మటుమాయం 189
" దైవభీతే మనిషిని చెడులకు దూరంగా ఉంచుతుంది 190
" దైవాజ్ఞలతో పాటే దైవభీతి హితబోధ 191
" జ్ఞానులే దేవునికి భయపడతారు 192
" జ్ఞానార్జనకై దైవప్రవక్త (సల్లం) ప్రోత్సాహం 192
" నేటి విద్యాజాగృతిలో లోపించిన విషయం 193
" విద్యార్జనా ధ్యేయం దైవప్రసన్నతయి ఉండాలి 194
" శుష్కప్రియాలు- శూన్యహస్తాలు 194
" హ్జరత్ ఆయిషా సిద్దీఖా (రజి) విద్యాసామర్థ్యాలు 195
" హ్జరత్ ఉమ్మెసల్మా (రజి) విద్యావిశిష్టతలు 195

32. మాతృమూర్తిగా మహిళ విలువ 196
" ఖుర్‌ఆన్‌లో మాతృమూర్తి విలువ 196
" తండ్రికంటే తల్లి స్థానమే ఉన్నతమైనది 197
" తనయుల స్వర్గం తల్లి పాదాల క్రింద ఉంది 198

33. సంతాన శిక్షణ 199
" భావితరాల మంచీచెడులు తల్లి చేతిలోనే ఉన్నాయి 200
" సంతానశిక్షణ గురించి ఖుర్‌ఆన్ బోధనలు 201
" తల్లిగర్భం నుంచే శిక్షణ ప్రారంభం 201
" బిడ్డజన్మ తరువాత తీసుకునే జాగ్రత్తలు 202
" హదీసు వెలుగులో సంతానశిక్షణ 202

34. ముస్లిం పర్సనల్ లా 203
" బ్రిటిష్‌పాలనలో ముస్లిం సివిల్ చట్టాలు 204
" దేశస్వాతంత్ర్యం తరువాత దిగజారిన పరిస్థితి 204
" కొత్తచట్టం చేసినా తప్పిపోని ప్రమాదం 205
" క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని లొసుగులు 205
" రాజ్యాంగం 44వ అధికరణ ఎత్తివేయాలి 206
" ముస్లింల నిరంతర కర్తవ్యం 206
" నమ్మకం, నిరాకరణలు ఒక వరలో ఇమడని ఖడ్గాలు 208
" దైవచట్టాలా? మానవచట్టాలా? 209
" దైవచట్టాలు విధ్యుక్త సరిహద్దులు 209

35. పెడసరి ప్రశ్నకు గడసరి జవాబు 210
" ముస్లిం మహిళలపై మొసలి కన్నీరు 210
" యక్షప్రశ్నలతో వేధింపులు తగునా? 210
" ధర్మజ్ఞానమే ధైర్యసాహసాలకు ఊతం 211
" బట్టబయలయిన ద్వంద్వ మనస్తత్వం 211

36. యూనిఫాం సివిల్ కోడ్ 211
" ఎన్నటికీ రాజీపడనివారు ఇప్పుడు రాజీకొస్తారా? 212
" ప్రయోజనాలు పొందడానికేనట ఈ ఎరలు 212
" హిందూ వివాహచట్టాలలోని లొసుగులు 213
" చట్టం కోరల నుంచి తప్పించుకునే మార్గాలు 213
" కష్టాల నుంచి విముక్తి కోసం ముస్లించట్టమే గతి 214
" హిందూ కాపురాల పరిస్థితి 215
" అందంలేని పేదబాలికల దురవస్థలు 216
" తా చెడ్డ కోతి వనమెల్లా చెరచున్ 217
" ముస్లిం పర్సనల్ లాయే బహుళప్రయోజక చట్టం 218
" దోపిడీ సమాజంలోనే దురాచారాలు చెల్లుతాయి 218
" మంత్రగత్తెలా, మాయమాటలా? 219
" భార్యను వదిలించుకోవడానికి ఎన్నెన్నో సాకులు 219
" స్త్రీ రక్షణకు ఇస్లాం చేసిన కట్టుదిట్టాలు 219
" దృఢవిశ్వాసమే చట్టరక్షణకు కంచుకోట 220

37. యుద్ధరంగంలో స్త్రీల పాత్ర 221
" అత్యవసర సమయాల్లోనే అతివలకు అనుమతి 221
" ధర్మయుద్ధం పురుషులకు మాత్రమే విధి 222
" జిహాద్ చేయడం స్త్రీల కర్తవ్యం కాదు 222
" పడతుల హక్కులు-బాధ్యతల ప్రత్యేకత 223

38. ధర్మసంస్థాపనలో స్త్రీల పాత్ర 223
" స్త్రీలు వంటింటి కుందేళ్ళు కాదు 224
" ముస్లిం స్త్రీలు భర్తలను గుడ్డిగా అనుకరించరు 224
" శ్రేష్ఠ సమాజంలో స్త్రీల పాత్ర 224
" మధ్యస్త సమాజంలో మహిళల ప్రాముఖ్యం 225
" ధర్మప్రచార బాధ్యత ఇరువురిపై ఉంది 226
" ధర్మప్రచారంలో మహిళలదే ముందంజ 227
" ప్రచార రంగంలో స్త్రీపాత్ర ప్రాముఖ్యం 227
" ఇస్లాం స్వీకరించిన మొట్టమొదటి వ్యక్తి స్త్రీయే 228
" ఉమర్ (రజి) మెడలు వంచిన ఉవిద 228
" కష్టాలు అధికమించడంలో కాంతామణులే మిన్న 230
" స్థిరత్వం స్త్రీల సొత్తు 231
" ప్రవక్తప్రేమలో పతి మరణం ఖాతరుచేయని పడతి 232
" రాజ్యాధినేతలను నిలదీసిన ధీర వనితలు 232
" పారితోషికాల ద్వారా కూడా పని చేయవచ్చు 233
" మీ ఇంటికొస్తే ఏం పెడ్తారు, మా ఇంటికొస్తే ఏం తెస్తారు? 234





39. ముస్లిం మహిళ గుణగణాలు 234
" పుణ్యార్జనకు ఇల్లే ప్రధాన వేదిక 235
" మానవతులకు నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు 235
" పురుషుల మహాభాగ్యం పుణ్యవతి అయిన ఇల్లాలే 236
" ఖుర్ఆన్‌లో ముస్లింమహిళల గుణగణాలు 236

40. స్త్రీల ఆంతరంగిక విషయాలు 238
" సౌఖ్యం, అనురాగాల సాధానికి తొలిమెట్టు 239
" సతితో సంగమించడం కూడా సదఖాయే 239
" అడ్డుకున్నా నష్టమే, వదిలేసినా నష్టమే 240
" ప్రత్యేక సందర్భంలో ప్రత్యమ్నాయ మార్గం 241
" పెద్ద నష్టం భయముంటే చిన్ననష్టం భరించండి 241
" లైంగిక అశుద్ధావస్థలో పాటించాల్సిన విషయాలు 242
" బహిష్టు అయినప్పుడు గమనార్హమయిన విషయాలు 242
" రుతుమతి స్నానం (గుసుల్) 243
" బహిష్టు, గర్భధారణ, ప్రసూతి దినాలలో నమాజ్-రోజాలు 244
" రుతువ్యాధి స్త్రీలకు ప్రవక్త ఆదేశాలు 244
" ఓ ప్రియా! నా ప్రియా!! 245
" అందమైన భార్య వల్ల విధినిర్వహణలో అలసత్వం 245
" ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే... 246
" ప్రవక్త ప్రవచనాలే పతీపత్నులకు శిరోధార్యాలు 246
" శాంతికి సంభోగమే సర్వస్వం కాదు 247

41. కాంతామణులే కింగ్‌మేకర్స్ 248
" జాతుల నిర్మాణంలో స్త్రీజాతి పాత్ర 248
" ఆడసింహం ఆగ్రహిస్తే తోడేళ్ళ మందకు దడదడే 249
" కొడుకుల వీరమరణం తల్లికి గర్వకారణం 250
" తల్లుల శిక్షణలో తనయుల నిజాయితీ 251
" యోధుని రక్తంకంటే స్త్రీ స్తన్యమే విలువైనది 252
" పట్టుదల పడతుల వారసత్వం 252
" భర్తను పోషించిన భార్య 253
" ఉత్తమ తల్లులే ఉత్తమ జాతిని ఇస్తారు 253
" పండితకుమారునికి పామరతల్లి హితోపదేశం 253
" తల్లి దీవెనల ఫలితం 254
" ఊయల ఊపే చేతులే ఊళ్ళు ఏలుతాయి 255
" సంఘసేవలో కూడా స్త్రీల పాత్ర ఉంది 255
" సదా గుర్తుంచుకోవాల్సిన నగ్నసత్యం 256

# తొలిపలుకులు

ఇస్లాం ధర్మం సమాజంలో స్త్రీకి ఇచ్చిన సముచిత స్థానాన్ని నేడు ఇస్లాంవ్యతిరేక శక్తులు, పాశ్చాత్యనాగరికతా ధ్వజవాహకులు వివాదాస్పదం చేశారు. పదార్థ పూజారులు, ప్రాపంచిక వ్యామోహపరులు వారికి వంతపాడుతున్నారు. ఖుర్‌ఆన్‌ని ప్రళయం దాకా మార్పుచెందని దైవగ్రంథమని నమ్మనివారు మతదురభిమానంతో ఇస్లాం స్త్రీకిచ్చిన సముచిత స్థానాన్ని విమర్శించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కాని మతదురభిమానంలేని న్యాయప్రియులకు, సృష్టికర్త, విశ్వప్రభువయిన దేవుడ్నీ, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను విశ్వసిస్తున్నవారికి కువిమర్శలు చేయడం ఏమాత్రం శోభించదు.

అయితే ఇస్లాంలో స్త్రీ స్థానం గురించి పూర్తి వివరాలు తెలియని సహృదయులు కొందరు ఇస్లాంవ్యతిరేక దుష్ప్రచారానికి గురికావడం సహజమే. అలాంటివారు పూర్తి వివరాలు ముందుకొచ్చినప్పుడు ఇస్లాం స్త్రీకిచ్చిన స్థానం సముచితమైనదేనని అంగీక రిస్తున్నారు. దైవచిత్తమయితే ఇకముందు కూడా అంగీకరిస్తారు.

ఖుర్‌ఆన్ యావత్తు మానవాళి కోసం అవతరించిన అంతిమ దైవగ్రంథం. అవత రించి 1400 సంవత్సరాలు గడచినా మార్పు చెందని, ఇకముందు ప్రళయం దాకా మార్పుకు గురికాలేని కలియుగ వేదం, తిరుగులేని జీవిత సంవిధానం. స్త్రీపురుషులు ఇరువురినీ సృష్టించిన విశ్వప్రభువు వారివారి శారీరక, మానసిక స్థితిగతులను బట్టి న్యాయవంతమైన చట్టాలే జారీ చేస్తాడుగాని, స్త్రీలకు అన్యాయం జరిగే చట్టాలను ఎంతమాత్రం జారీచేయడు. విశ్వప్రభువు పట్ల నిజమైన భయభీతులున్న ఏ మనిషీ ఈ వాస్తవాన్ని తిరస్కరించలేడు.

ఒక్కసారి 1400 సంవత్సరాలకు పూర్వమున్న ప్రపంచ పరిస్థితులు చూడండి. ముఖ్యంగా ఆనాటిఅరబ్బుల పరిస్థితి చూడండి. త్రాగుడు, వ్యభిచారం, దురాచారాలు, అంతఃకలహాలతో పాటు వారు స్త్రీలను పశువులకన్నా నికృష్టంగా చూసేవారు. స్త్రీని సెక్స్‌సింబల్‌గా పరిగణించేవారు. ఈకారణంగానే వారు ఒక హద్దంటూ లేకుండా అనేక మంది భార్యలను చేసుకునేవారు. మోజు తీరగానే ఎప్పుడుకావాలనుకుంటే అప్పుడు విడాకులిచ్చేవారు. చీటికిమాటికి వారిని గొడ్డును బాదినట్లు బాదేవారు. అంతేకాదు, ఆడపిల్లల్ని సజీవసమాధి చేసి, అదో గొప్ప పుణ్యకార్యంగా కూడా భావించేవారు.

ఈ దుస్థితి-దురాచారాలను, అన్యాయం-అత్యాచారాలను ఇస్లాం కేవలం 23 సంవత్సరాల అతిస్వల్ప కాలంలో శాశ్వతంగా అంతమొందించి, స్త్రీజాతికి ఇంతకు పూర్వం ఏ మతం, ఏ సంస్కర్తా ఇవ్వని సముచిత స్థానం ప్రసాదించింది. ఆనాడు అరేబియాలో స్త్రీలు బంగారు నగలు ధరించి ఒంటరిగా వందలమైళ్ళు ప్రయాణం చేయగల స్థాయికి ఎదగగలిగారంటే అది ఇస్లాం కలిగించిన శుభాలే.



ఇస్లాం స్త్రీకి ప్రసాదించిన స్థానం గురించి ఉర్దూలో వివరంగా అనేక పుస్తకాలు వెలువడ్డాయి. తెలుగులో దీన్ని గురించి విపులంగా రాసిన పుస్తకాలేవీ లేనందున నేనీ రచనకు ఉపక్రమించాను. విషయాల్ని వీలైనంతవరకు అన్నికోణాల నుంచి అధ్యయనం చేసి, వివిధ గ్రంథాల నుంచి సమాచారం సేకరించి రాయడానికి ప్రయత్నించాను. అంతగా ప్రాముఖ్యంలేని వివాదాస్పదమయిన ఫిఖా విషయాలను దాటవేసి సమాజంలో స్త్రీ స్థానం గురించి ఇస్లాం ఆశయం ఏమిటో వివరించడానికి కూడా కృషిచేశాను.

కనుక లోగడ గీటురాయి మాసపత్రికలో నా రచనలను ఆదరించిన పాఠకులే కాకుండా ఇతరులు కూడా నాయీ రచనను చదువుతారని ఆశిస్తున్నాను. ఈ రచనలో నాకు తోడ్పడిన గ్రంథాలను దిగువన పేర్కొంటున్నాను. రచనలో ఏవైనా పొరపాట్లు దొర్లినట్లు పాఠకులు నా దృష్టికి తెస్తే నేను మలి ముద్రణలో వాటిని సవరించడానికి ప్రయత్నిస్తాను ఇన్షా అల్లాహ్.

## రచనకు ఆధార గ్రంథాలు


(1) ఔరత్ ఔర్ ఇస్లాం (ఉర్దూ).............మౌలానా జలాలుద్దీన్ అన్సర్ ఉమరీ

(2) హుఖూఖుల్ జౌజైన్ (ఉర్దూ)..........మౌలానా అబుల్‌ఆలా మౌదూది

(3) పర్దా, తాదాదె ఇజ్దవాజ్..................మౌలానా అబుల్‌ఆలా మౌదూది

(4) తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్...................మౌలానా అబుల్‌ఆలా మౌదూది

(5) ఔరత్ ఔర్ ఇజ్దవాజి జిందగి...........ముహమ్మద్ కలీం ఆరాయీన్ (యం.ఎ.)

(6) ఔరత్ ఔర్ కార్యానె దావత్............డాక్టర్ తస్నీమ్ కౌసర్ ఖురైషి

(7) ఇస్లాంమె ఔరత్ కా మఖామ్..........సురయ్యా బతూల్ అల్వీ (యం.ఎ)

(8) ఇస్లాం మె జిన్సీ తర్బియత్.............ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్లా నాసె అల్వాన్

(9) ఖుర్‌ఆన్ భావామృతం...................అబుల్ ఇర్ఫాన్ (గీటురాయి వారపత్రిక)

(10) ముహమ్మద్ ఆదర్శ జీవితం..........అబుల్ ఇర్ఫాన్ (గీటురాయి వారపత్రిక)

(11) మహాప్రవక్త మహితోక్తులు..............అబుల్ ఇర్ఫాన్ (గీటురాయి వారపత్రిక)

(12) ఔరత్ ఖుర్‌ఆన్ ఔర్ సున్నత్‌కీ రోష్నీమె.....మౌలానా ముఖ్తార్ అహ్మద్ నద్వీ

(13) ముస్లిం పర్సనల్ లా...మౌలానా షమ్సు పీర్జాదా, మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహి

(14) తజల్లి (ప్రత్యేక సంచిక 'తలాఖ్') 5,6,7/1974....మౌలానా ఆమిర్ ఉస్మాని

(15) మిష్కాత్ షరీఫ్ (ఉర్దూ అనువాదం)............హకీమ్ మిస్బాహుద్దీన్ మర్దాని


హైదరాబాద్-2 **తాహిరా తస్నీర్**

18-2-2005 (-రచయిత్రి-)

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# ముస్లిం మహిళ

**ఉ**ర్దూ మాసపత్రిక "హిజాబ్"లోని ఓ కథ చదువుతుంటే హఠాత్తుగా రజనీ జ్ఞాపకం వచ్చింది. ఒకప్పుడు రజనీ కథ కూడా ఈ కథలాగే ఉండేది. ఆమె భర్తకు హైదరాబాద్ నుండి ట్రాన్స్‌ఫర్ అయి పదేళ్ళయింది. ఇప్పుడామె ఎలా ఉందో ఏమో! పదహారేళ్ళ క్రితం నాటి సంఘటన ఒక్కసారిగా నా మదిలో మెదిలింది......

మధ్యాహ్నం మూడు గంటలు కావస్తోంది. ఎండ తీక్షణంగా ఉంది. నేను జుహర్ నమాజ్, భోజనం ముగించిన తరువాత వాలుకుర్చీలో నడుం వాల్చి 'ధనవికేంద్రీకరణ' పుస్తకం తెరిచాను. అంతలో-

"అమ్మా! అమ్మా!! రజనీ ఆంటీ వస్తోందే" అన్నాడు ఆరేళ్ళ మా అస్లం రొప్పుతూ.

మావాడు ఈమాట చెప్పి అలా బయటికి వెళ్ళాడో లేదో "హాయ్! తాహిరా!" అంటూ రజనీ నా డ్రాయింగ్ రూమ్‌లో అడుగు పెట్టింది.

"హల్లో రజనీ! రారా, ఇలా కూర్చో. ఏవిటీ ఈరోజు ఆఫీసుకు పోలేదా?" అన్నా నేను లేచి చేతిలోని పుస్తకం బీరువాలో పెడ్తూ.

"లేదు. ఈరోజు సెలవు పెట్టాను" అన్నది రజనీ నా ముందు కుర్చీలో కూర్చొంటూ.

"ఎందుకని? ఈరోజు మళ్ళీ శ్రీవారితో ఏదైనా తగాదా పెట్టుకున్నావా ఏమిటీ?"

"ఆ... రాత్రి మా బాస్‌తో కలసి పిక్చర్‌కు వెళ్ళాను."

"రజనీ! పరాయి పురుషులతో కలసి ఈ పిక్చర్లకు, పిక్నిక్‌ల కెళ్ళడం మానేయరాదూ."

"నువ్వు మరీ చాదస్తంగా మాట్లాడుతున్నావు. మా బాస్‌తో సోషల్‌గా ఉంటూ ఎప్పుడో ఓసారి పిక్చర్‌కు వెళ్ళడం తప్పా? పైగా మా బాస్ చాలా మంచివాడు. ఆఫీస్ హెడ్‌గా అతడ్ని గౌరవించడం కింది స్థాయి ఉద్యోగుల విధి, సభ్యత కూడా. ఆఫీసర్ ఆహ్వానాన్ని నిరాకరించి అతని అయిష్టాన్ని కొని తెచ్చుకోమంటావా?" అన్నది రజని.

"అయితే బాస్ మెప్పు కోసం భర్త అయిష్టాన్ని కొని తెచ్చుకుంటావా? చూడు రజనీ! కొందరు మగవాళ్ళు ఆడవాళ్ళకన్నా చాలా అనుమానపు మనుషులుగా ఉంటారు. వేణు కూడా అలాంటి మగవాళ్ళలో ఒకడయి ఉంటాడు. అయినా ఆత్మాభిమానమున్న ఏ మగాడూ తన భార్య పరాయి మగవాళ్ళతో కలసి తిరుగుతుంటే సహించలేడు" అన్నా నేను నచ్చజెప్పే ధోరణిలో.



"తాహిరా! నువ్వు మరీ పాతకాలం మనిషిలా ఉన్నావు. యమ్మే చదివావు, ఏం లాభం? ఈనాడు పరిస్థితులు మారిపోయాయి. స్త్రీ అన్ని రంగాల్లో ప్రవేశించి పురుషునితో భుజం భుజం కలిపి పని చేస్తోంది. రాజకీయాల్లో, రోదసిలో కూడా నేడు స్త్రీలు ఎంతో ముందంజ వేశారు. నేను మరీ విచ్చలవిడిగా తిరగడం లేదే! ఏదో కాస్త టైంపాస్ కోసం ఆఫీసు ఫ్రెండ్స్‌తో ఎప్పుడన్నా అలా పిక్చర్‌కో, పిక్నిక్‌కో వెళ్తుంటాను. అంతలో ఏం కొంప లంటుకుంటాయి? ఏమైనాసరే, బానిసలా నాలుగ్గోడల మధ్య బందీ అయి బ్రతకడం నాకిష్టం లేదు" అన్నది రజనీ సీరియస్‌గా.

"అంటే నువ్వు పరాయి పురుషులతో కలసి నవ్వుతూ త్రుళ్ళుతూ సరదాగా గడపాలనుకుంటున్నావు.....?"

"ఔను, తప్పేమిటీ?"

"కాని అది నీ భర్తకు ఇష్టం లేదు.....?"

"అదే కదా ఆయనతో వచ్చిన చిక్కల్లా."

"సరే రజనీ! ఒక విషయం చెప్పు దాచకుండా. నీకు భర్త సంతోషమంటే ఎక్కువ ఇష్టమా లేక స్నేహితుల సంతోషమంటే......?"

"తాహిరా! నేను నీ దగ్గర ఏదీ దాచలేను. ఆయన్ని నేను ఇప్పటికీ మనసారా ప్రేమిస్తున్నాను. ఆయన కూడా నన్ను బాగానే చూసుకుంటున్నారు. కాని ఆయన పద్ధతే నాకు నచ్చడం లేదు. పొరుగింటి ప్రసాదరావుతో గాని, ఆఫీస్ ఫ్రెండ్స్‌తోగాని కాస్త చనువుగా మాట్లాడితే చాలు, ఆయన ముఖం చిట్లించుకుంటారు. నేను ఉద్యోగం చేయడం కూడా ఆయనకు ఇష్టం లేదు. భార్యగా నా విధులు నేను నెరవేరుస్తున్నా కదా! నా ప్రైవేటు విషయాలతో ఆయనకు పనేమిటీ?" అన్నది రజని.

"సరే, ఈ విషయం చెప్పు. నువ్వు ఉద్యోగం ఎందుకు చేస్తున్నావు? డబ్బు కోసమా?"

"కాదు, ఆయన సంపాదిస్తున్న జీతంతో మా సంసారం సుఖంగా గడచిపోతోంది. కాని ఆయనకు లొంగి ఉండటం నాకిష్టం లేదు. ఒకవేళ నేను ఉద్యోగం మానేసి పూర్తిగా ఆయన మీద ఆధారపడితే దాన్ని ఆసరా చేసుకొని ఆయన నన్ను తన ఇష్టం వచ్చినట్లు కీలుబొమ్మలా ఆడించవచ్చు. అందుకే నేను నా కాళ్ళ మీద నిలబడటానికి ఉద్యోగం చేస్తున్నా."

"నువ్వు మీవారిని ప్రేమిస్తున్నావు కదా! అలాంటప్పుడు నువ్వు ఆయన్ని ఎందుకు నమ్మలేకపోతున్నావు?"

"వాట్ డూ యు మీన్?" రజనీ కనుబొమలు చిట్లించింది.

"నువ్వు మీవారిని ప్రేమిస్తున్నావు. మీవారు కూడా నిన్ను ప్రేమిస్తున్నారు. అలాంటప్పుడు నువ్వు ఉద్యోగం చేయడం ఆయనకిష్టం లేకపోతే దాన్నే పట్టుకొని వేల్లాడటం

దేనికి? రజనీ! నీ వేణు కోసం ఉద్యోగం త్యాగం చెయ్యలేవా? పరస్పరం ప్రేమించుకునే భార్యాభర్తల మధ్య ఈ అనుమానాలు, అపనమ్మకాలు ఉండకూడదు. వేణు నీ భర్త. ఏ లోటూ రాకుండా నిన్ను పోషించడం భర్తగా ఆయన బాధ్యత. ఇందులో లొంగి ఉండట మనేదేముంది?'' అంటూ నేను మరోసారి నచ్చజెప్పడానికి ప్రయత్నించాను.

''అంటే నేను ఉద్యోగం మానేసి వంటింటి కుందేలయి పోవాలన్నమాట! నా సోషల్‌లైఫ్‌ని నా చేజేతులా నాశనం చేసుకోవాలన్న మాట!! ఇంపాజ్బుల్, చచ్చినా అలా చేయను'' అన్నది రజని మొండిగా.

''అయితే ఓ పని చెయ్.''

''ఏమిటా పని?''

''వేణుకు విడాకులిచ్చేయి.''

''వాట్......?!''

''నీ స్వేచ్ఛా సరదాలంటే ఇష్టంలేని అలాంటి భర్త వల్ల నీకు ప్రయోజనం ఏమిటీ? నీకు అందం ఉంది, చదువూ ఉంది. నీలా స్వతంత్ర భావాలున్న యువకుణ్ని చేసుకో, నీ జీవితం ప్రశాంతంగా సాగిపోతుంది'' అన్నా నేను.

''అంటే రెండో పెళ్ళి చేసుకోమని నాకు నువ్వు సలహా ఇస్తున్నావన్న మాట!'' అంటూ పకపకా నవ్వింది రజనీ.

''పిచ్చి తాహిరా! నువ్వింకా నాలుగ్గోడల మధ్యనే బందీ అయివున్నావు. సంఘంలో ఈనాడు కన్నె పిల్లలకే పెళ్ళిళ్ళు కావడం చాలా కష్టంగా ఉంటే, నాలాంటి విడాకులు పొందిన స్త్రీని ఎవరు చేసుకుంటారు?''

''అయితే మరి నీ ఉద్దేశం ఏమిటి రజనీ?'' అన్నా నేను కాస్తంత విసుగుతో.

''నేను బ్రతికినంత కాలం ఎవరి మోచేతి నీళ్ళూ తాగకుండా స్వేచ్ఛగా ఉండ దలిచాను'' అన్నది రజని తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు చూస్తూ.

''అది నీ భర్తకు ఇష్టం లేదు.....?''

''అదే కదా నా బాధ!''

''రజనీ! నువ్వు నన్ను చాదస్తపు మనిషి అంటున్నావు. నేను, మావారు పరస్పరం సంతోషంగా ఉంటున్నా నేను నాలుగ్గోడల మధ్య బందీ అయి భర్తగారి అడుగులకు మడుగులొత్తుతున్నా వంటున్నావు. పరదాలో ఉండి పరపురుషుణ్ని కన్నెత్తి కూడా చూడ లేదంటున్నావు. అంతేకదూ?''

''కాదా మరి?''

''ఒకవేళ నేను పరదా వదిలేసి నీలా ఎక్కడైనా ఉద్యోగం చేస్తూ పరాయి మగాళ్ళ మధ్య స్వేచ్ఛగా తిరుగుతుంటే......?''



''అలా చెయ్యడం మీవారు ఎన్నటికీ ఒప్పుకోరు.''

''ఎందుకని?''

''ఎందుకంటే మీవారు ముస్లిం. ముస్లింలు తమ స్త్రీలు బురఖా లేకుండా బయట తిరగడాన్ని, పరాయి మగాళ్ళతో చనువుగా మాట్లడటాన్ని సహించరు.''

''సరే, మా ముస్లింలలో ఈ పరదా పెద్ద తప్పు కావచ్చు. కాని మీ హిందూ భర్తలు అభ్యుదయవాదులు కదా, వారికి మీ స్వతంత్రభావాలు ఎందుకు నచ్చడంలేదు?''

దీనికి రజని వెంటనే సమాధానం చెప్పలేక పోయింది. రెండు క్షణాల తరువాత ''ఈ మగవాళ్ళంతా ఒక్కటే, చాలా అనుమానపు మనుషులు'' అన్నది.

''నువ్వన్నది కొంతవరకు నిజమే. కాని పౌరుషమున్న ఏ మగాడూ తన భార్య పరాయి పురుషులతో తిరిగితే సహించడు. ఇది పురుషుని స్వభావంలోనే ఉంది. అయినా నీకంత పట్టుదల ఎందుకు? అంతగా తిరగాలనుకుంటే వేణుతో కలసి తిరగొచ్చు కదా?''

దానికీ రజని ఎలాంటి సమాధానం ఇవ్వకుండా కాస్సేపు మౌనంగా ఉండిపోయింది. తర్వాత ''సరే ఇక నేను ఇంటికి వెళ్తాను'' అంటూ లేచి నిలబడింది.

రజని నా క్లాస్‌మేట్, ప్రాణ స్నేహితురాలు. భావాలు వేరయినా బాంధవ్యం పటిష్ఠంగా ఉంది. రజని, వేణు పెళ్ళయిన కొత్తలో కొంతకాలం హాయిగానే గడిపారు. కాని రజని ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి వాళ్ళ మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. ఏదైనా తగాదా వచ్చినప్పుడల్లా రజని నా దగ్గరకు పరుగెత్తుకొస్తుంది.

నెలరోజులు తర్వాత ఓరోజు ఉదయాన్నే ఊడిపడింది రజని ముసిముసి నవ్వులతో.

''ఏం రజనీ! బాగున్నావా? శ్రీవారితో విభేదాలు ఎలా ఉన్నాయి?'' అన్నా నేను.

''ఇప్పుడు విభేదాలు, గిభేదాలేమీ లేవు.''

''ఎందుకు? అంతత్వరగా మార్పు ఎలా వచ్చింది?'' అన్నా నేను కాస్తంత ఆశ్చర్యంతో.

''నువ్వు చెప్పినట్లు నేనిప్పుడు పరాయి పురుషులతో కలిసి తిరగడం మానేశాను. ఆఫీసులో కూడా ఎవిరితోనూ అతిగా మాట్లాడకుండా నా పనేదో నేను మౌనంగా చేసుకు పోతున్నాను. టైం అయిపోగానే నేరుగా ఇంటికి వచ్చేస్తున్నా. సాయంత్రం షికారుకు వేణుతోనే కలసివెళ్తున్నా. దాంతో ఆయనిప్పుడు చాలా సంతోషంగా ఉన్నారు. నేను ఉద్యోగం కూడా మానేద్దామనుకుంటున్నాను. దానివల్ల ఒరిగిందేమిటి? పైగా వేణకు ఇష్టం కూడా లేదు'' అన్నది రజనీ ఎంతో ఉత్సహంగా.

"చాలా సంతోషం రజనీ! నాసంతోషం నీలో మార్పు వచ్చినందుకు కాదు, నువ్విప్పుడు సంతోషంగా ఉన్నందుకు. నీ స్నేహితురాలిగా నేను కోరుకునేది నీ సంతోషమే."

"థ్యాంక్యూ తాహిరా! థ్యాంక్యూ. నిన్నెలా అభినందించాలో తెలియడం లేదు. నిజంగానే నా సిద్ధాంతంలో ఏదో లోపం ఉన్నట్లనిపిస్తోంది. నీలాంటి స్నేహితురాలు దొరకడం నా అదృష్టం. సరే, తాహిరా! ఈరోజు నా బర్త్‌డే. సాయంత్రం పార్టీ ఉంది. నువ్వు, అన్నయ్య మొత్తం సకుటుంబసమేతంగా తరలి రావలెనని మా ఇద్దరి తరపున మహజరు విన్నపం సమర్పించుకుంటున్నాం" అన్నది రజని సంతోషంతో పొంగిపోతూ.

"ఇన్షాఅల్లా, అలాగే వస్తాంలే. అప్పుడే లేచావేమిటీ, కాస్త టీ అయినా తాగిపో."

"నోనో. ఇప్పుడు టైం లేదు. షాపింగ్‌కు పోవాలి. వేణు నాకోసం ఎదురు చూస్తుంటారు" అంటూ సుడిగాలిలా బయటికి వెళ్ళిపోయింది రజని.

## 1. అతివాదాలు తెచ్చిన అనర్థకాలు

నేడు మహిళాభ్యుదం పేరుతో అవలంబించిన వైఖరి చూస్తుంటే అతను నవీన మౌఢ్యానికి ఎంత చేరువయ్యాడో స్పష్టంగా గోచరిస్తోంది. సరయిన దైవజ్ఞానం లేని మానవుడు సమాజంలో స్త్రీ పాత్ర ఏమిటీ? స్త్రీ పురుషుల నైసర్గికంలో ఉన్న భేదం ప్రాతి పదికపై వారి ఆచరణ పరిధుల్లో కూడా మార్పు ఉంటుందా? ఉంటే అది ఎలా ఉండాలి? అనే సమస్యల్ని పరిష్కరించడంలో కృతకృత్యుడు కాలేకపోతున్నాడు. తత్ఫలితంగా ఒక కాలంలో స్త్రీకి అత్యున్నతమైన గౌరవం లభిస్తుంటే, మరొక కాలంలో ఆమె పశువు కన్నా హీనంగా చూడబడుతుంది. ఇక ఆధునిక మానవుడు స్త్రీ పురుషుల కార్యరంగాలను నిర్ణయించడంలో వారి మధ్య ఉన్న సహజ వ్యత్యాసాలను సైతం విస్మరించి కుక్కను, గాడిదను ఒకే గాటన కట్టేసినట్లు స్త్రీ పురుషులిద్దర్నీ ఒక వేదిక మీదికి చేర్చుతున్నాడు. ఈ విధంగా ప్రతి యుగంలోనూ సమాజంలో స్త్రీ తన సహజ స్థానం పొందలేక అతి వైఖరులకు, సమతూలనారాహిత్యానికి గురవుతూ వస్తోంది.

అయితే ప్రతి యుగంలోనూ మానవుడికి మార్గదర్శనం చేయడానికి దైవప్రవక్తలు ప్రభవిస్తున్నారు. ఎప్పటికప్పుడు వీరు అజ్ఞానం వల్ల మానవుడు అవలంబించిన ఈ అతి వైఖరులను ఎత్తిచూపి, వాటి దుష్పరిణామాలను గురించి హెచ్చరిస్తున్నారు. ఏవిధంగా నయితే దేవుడు స్త్రీ పురుషుల మధ్య కొన్ని మానసిక, శారీరక వ్యత్యాసాలను ఉంచాడో అదేవిధంగా ఆయన వారి కార్యాచరణ పరిధులు కూడా వేర్వేరుగా నిర్ణయించాడు. స్త్రీ, పురుషులు వారి సృష్టికర్త నిర్ణయించిన ఈ కార్యాచరణ పరిధుల్లో మసలుకుంటే శ్రేయస్కర మైన, ఆరోగ్యవంతమైన సమాజం ఉనికిలోకి వస్తుంది. తద్వారా మానవుడు ఇహలోకం లో శాంతీసౌఖ్యాలను పొందడమేగాక, మరణానంతరం పరలోకంలో శాశ్వత సుఖ జీవనానికి, దైవప్రీతికి కూడా అర్హుడు కాగలుగుతాడు. ఈ యదార్థాన్నే ఇస్లాం మానవులకు అనాది నుంచి బోధిస్తూ వస్తోంది.



కాని హ్రస్వదృష్టికల మానవుడు స్వార్థబుద్ధితో ప్రతి యుగంలోనూ స్త్రీకున్న సహజ వ్యక్తిత్వాన్ని అణచడానికి అనేక విధాలుగా ప్రయత్నించాడు. ఈ కుటిల యత్నంలో దేశాధినేతాలు, సంఘ పెద్దలు, అధికారులు, తత్వవేత్తలు, కవులు, రచయితలు, అందరూ పాల్గొన్నారు. వీరు తాము చేస్తున్నది తప్పని, స్త్రీ పట్ల అన్యాయమని గ్రహించక, గ్రహించినా స్వార్థప్రయోజనాలు ఆశిస్తూ వాటిని సమర్థించుకునేందుకు హేతువులు చూపుతుంటారు. స్త్రీలు కూడా కొందరు దీన్ని తమ నొసటి రాతని, మరి కొందరు అదే తమ ప్రాతివ్రత్యానికి సమీప మార్గమని, ఇంకా కొందరు (ఆధునికులు) ఇది తమ హక్కు అని అపోహపడి తృప్తిచెందుతున్నారు.

## 2. ఇస్లామేతర మతాలలో స్త్రీ పరిస్థితి

పూర్వకాలంలో సమాజంలో స్త్రీలకు ఎలాంటి సముచిత స్థానం ఉండేది కాదు. వారి జీవితమంతా పురుషుల బానిసత్వంలో గడచిపోతూ ఉండేది. ప్రతి దేశంలోనూ స్త్రీ పురుషుని ఆటబొమ్మగా, విలాస వస్తువుగా ఉపయోగించబడుతుండేది. ఏ విషయం లోనూ ఆమెకు స్వాతంత్ర్యం ఉండేది కాదు. వివాహ విషయంలో ఆమె ఇష్టాయిష్టాలకు విలువలేదు. ఆమెకు ఆస్తి హక్కు లేదు. విద్యార్జనా హక్కు లేదు. పుట్టింటిలో ఆమె తండ్రి సంరక్షణలో, వివాహానంతరం భర్త సంరక్షణలో, వితంతువయినప్పుడు కొడుకు సంరక్షణలో ఉండవలసి వచ్చేది.

నాలుగు వేల సంవత్సరాల పూర్వం ఇరాఖ్‌లోని అప్పటి రాజధాని 'ఉర్' నగరంలో "నన్నార్" అనే విగ్రహం యావత్తు దేశానికే పెద్ద దైవంగా ఉండేది. ఈ దేవుడి మందిరంలో పూజారులేగాక అనేకమంది దేవదాసీలు కూడా ఉండేవారు. ఆలయంలోనే ఓ భాగంలో అందమైన ఓ పడకగది ఉండేది. ప్రతిరోజూ రాత్రి ఒక దేవదాసి నూతన వధువులా అలంకరించుకొని ఈ గదికి వచ్చి తన దేహాన్ని పరపురుషునికి అర్పిస్తుంది. ఇలాంటి స్త్రీకి మోక్షం లభిస్తుందని ప్రజలు నమ్ముతుండేవారు. పూజారులతో పాటు సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అయ్యేవారు సైతం ఇలా మతం పేరుతో పచ్చి వ్యభిచారానికి పాల్పడుతుండేవారు. ఈ దేవదాసీల వ్యవస్థ ఈనాటికీ పరోక్షంగా ఇస్లామేతల మతాల్లో గుట్టుచప్పుడు లేకుండా కొనసాగుతోంది.

హిందూ సమాజంలో భర్త చనిపోతే భార్యకు బ్రతికి ఉండటానిక్కూడా హక్కులేదు. భర్త మృతదేహంతో పాటు ఆమె చితాగ్నిలో పడి సహగమనం చేసుకోవాల్సిందే. సతీ సహగమనం అనే ఈ దురచారం ఇప్పటికీ రాజస్థాన్ రాష్ట్రంలో కొనసాగుతోంది. అలాగే పురుషులు దైవదాసీల పేరిట స్త్రీలను పూజా మందిరాలలో ఉంచి తమ కామదాహాన్ని తీర్చుకునే దురాచారం కూడా కొన్నిచోట్ల రహస్యంగా కొనసాగుతోంది. వితంతువులకు పునర్వివాహం హక్కు ఉండేది కాదు. వారిని దుశ్శకునంగా పరిగణించడం జరుగుతుండేది. శుభకార్యాల్లో వారికి ప్రవేశం ఉండేదికాదు.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రభవించక ముందు అరేబియాలో ఒక స్త్రీ భర్త చనిపోతే, ఆ భర్త యొక్క మరొక భార్య కుమారుడు తండ్రి ఆస్తితో పాటు సవతి తల్లిని కూడా తన సొత్తు చేసుకునే దురాచారం ఉండేది. అంతేకాదు, ఆడ శిశువు పుట్టేనే తన వ్యక్తిత్వానికి, వంశానికి అవమానకరమని, వేరే కుటుంబంలోని మనిషిని అల్లుడిగా చేసుకోవడం నామోషి అని, ఆర్థికంగా కుటుంబభారమని భావించేవారు. వీటిని భరించలేక కొందరయితే ఆనాడు ఆడపిల్లల్ని సజీవసమాధి కూడా చేసేవారు.

## 3. క్రైస్తవమతంలో స్త్రీ స్థానం

క్రైస్తవ సమాజంలో స్త్రీకి ఇంతకన్నా నికృష్టమైన స్థానం కల్పించబడింది. పురుషునికి స్త్రీ సహచర్యం ఆధ్యాత్మిక వికాసానికి గొడ్డలిపెట్టుగా భావించబడింది. స్త్రీ దైవసాన్నిధ్యం పొందదలచుకుంటే అవివాహితగానే ఉండి దైవారాధనలో జీవితమంతా గడపవలసి ఉంటుంది. 19వ శాతాబ్దం ప్రారంభం వరకు క్రైస్తవమతం ప్రాబల్యం ఉన్న యూరప్ దేశాల్లో స్త్రీలు ఎంతటి హీన స్థితిలో ఉన్నారో చరిత్రే సాక్ష్యమిస్తోంది. సంకుచిత మత తత్వ ధోరణికి బలయిపోయిన అనేకమంది అమాయక స్త్రీల దయనీయ పరిస్థితి చరిత్ర పుటలకెక్కి మానవ హృదయాలలో సహజసిద్ధంగా ఉంచబడిన మమతా మమకారాల బాంధవ్యాన్ని వెక్కిరిస్తోంది.

క్రైస్తవ తత్వశాస్త్రంలో స్త్రీ నరకానికి ద్వారం లాంటిది. ప్రపంచంలోని యావత్తు చెడులకు, మానవ ఆపదలకు స్త్రీయే మూలకారణం. స్త్రీని గురించి ప్రఖ్యాత తత్వవేత్తలు వ్యాఖ్యానించినట్లు, తాను స్త్రీ అయినందుకు ఆమె సిగ్గుపడాలట! ఇంతకంటే ఆశ్చర్య కరమైన విషయం మరొకటి ఉంది. క్రీ.శ. 585లో మేకన్‌లో జరిగిన ఒక సదస్సులో కాకలుతీరిన బిషప్పులు "స్త్రీలు అసలు మానవజాతికి చెందినవారా, కారా?" అన్న విషయంపై తర్జన భర్జనలు చేసి, సుదీర్ఘచర్చలు జరిపి చివరికి స్త్రీలు కూడా మానవజాతికి చెందినవారేనని నిర్ధారణకు వచ్చారట!

హజ్రత్ ఈసా ప్రవక్త (అలైహి) ప్రపంచం నుండి నిష్క్రమించిన రెండు శతాబ్దాలకే క్రైస్తవులు ఆ మహనీయుని బోధనలు విస్మరించి వైరాగ్య వ్యవస్థ ఏర్పరచుకున్నారు. ఈ వ్యవస్థ ప్రారంభంలో క్రైస్తవ మతగురువులు స్త్రీ ముఖం చూడటమే పాపంగా భావించే వారు. తరువాత స్త్రీలను కూడా సన్యాసినిలుగా చేసి తమ స్వయంకృత వైరాగ్యవ్యవస్థలో చేర్చుకున్నారు. దాంతో అశ్లీలధ్యాయం ప్రారంభమయి క్రమంగా పరాకాష్ఠకు చేరుకుంది. పాలస్తీనా క్రైస్తవమఠాలు వ్యభిచార కూపాలుగా మారిపోయాయని సెయింట్ గ్రెగోరీ లాంటి ప్రముఖ మతనాయకులు వాపోయారు.

18వ శతాబ్దంలో యూరప్‌లోని కొందరు మేధావులు వ్యక్తి హక్కుల పరిరక్షణ కోసం సమాజానికి ప్రత్యేకించి క్రైస్తవతత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాన్ని లేవదీసే టప్పటికి స్త్రీలలో కూడా కొంత చైతన్యం వచ్చింది. స్త్రీలలో వచ్చిన ఈ నూతన చైతన్యం



ఫ్రాన్స్ విప్లవానంతరం క్రమక్రమంగా పరిణితి చెంది ప్రస్తుత పాశ్చాత్య నాగరికతలో ఓ ప్రముఖ స్థానం ఆక్రమించుకుంది.

జీవితంలోని ప్రతి రంగంలోనూ పాశ్చాత్యులతో పోటీ పడుతూ, వారి అంతర్జాతీయ నాయకత్వాన్ని గుడ్డిగా ఆమోదించి అనుసరిస్తున్న ఇతర జాతులు మహిళా స్వాతంత్ర్యం విషయంలో కూడా పాశ్చాత్యుల నినాదాలకు ప్రభావితులయి, వారి అడుగుజాడలల్లోనే నడవడం ప్రారంభించాయి. ఫలితంగా వారు వివాహం, విడాకుల చట్టాలలో మునుపటి కాఠిన్యాన్ని తగ్గించారు. కొంతవరకు సాంఘికహక్కులు ఇవ్వబడ్డాయి. స్త్రీజాతిని అవమాన పరిచేలా ఉన్నటువంటి నైతిక చట్టాలను సవరించారు. ఉన్నత విద్యనభ్యసించేందుకు అర్హత కల్పించారు. మహిళా సంక్షేమం కోసం ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టారు. మొత్తం మీద సమాజంలో స్త్రీకి ఉన్నత స్థానం ఇవ్వబడింది.

## 4. పాశ్చాత్యనాగరికతలో పడతుల పరిస్థితి

అయితే ఈ ఉద్యమానికి మూలకారణమైన ఆలోచనా సరళిలో, తత్సంబంధిత కార్యాచరణ విధానంలో సమదృష్టి లోపించింది. పాశ్చాత్య స్త్రీ సమాజం మూడు ప్రధాన సిద్ధాంతాల ప్రాతిపదికపై నిర్మించబడింది:

(1) స్త్రీ పురుషుల సమాన ప్రతిపత్తి

(2) స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం

(3) స్త్రీ పురుషుల మధ్య స్వేచ్ఛాయుతమైన సంబంధాలు.

1. స్త్రీ పురుషుల సమాన ప్రతిపత్తి అంటే మానవ హక్కులు, నైతిక విలువలల్లోనే గాకుండా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో కూడా పట్టణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ ప్రతి విషయంలోనూ పురుషులతో పాటు మహిళలక్కూడా సమాన హక్కులు ఉండాలని నిర్ణయించడం, దాన్ని అమలుపరచడం. అంటే స్త్రీలు తమ వ్యక్తి వికాసంకోసం, సాంఘిక పురోభివృద్ధి కోసం, సమాజంలో సముచిత స్థానం పొందడం కోసం వివిధ ఉద్యోగాలలో, ప్రభుత్వ కార్యకలాపాలలో, పార్లమెంటు చర్చల్లో, వాణిజ్యసంస్థల్లో, క్రీడారంగంలో, సేవాసదనాల్లో పాల్గొనాలన్న మాట.

అయితే వీటిని నిర్వహించడంలో దాంపత్య జీవిత బాధ్యతలు, గృహనిర్వహణ విధులు, సంతాన శిక్షణ మొదలైన సమాజ మూల కర్తవ్యాలుగా భావించబడుతున్న ప్రధాన విషయాలను త్రోసిపుచ్చినా పర్వాలేదు! పాశ్చాత్యనాగరికతా దృక్పథం రీత్యా మహిళల స్వేచ్ఛా వికాసాలకు ఈ విషయాలు అడ్డుగోడలుగా భావిస్తే వాటిని నిస్సంకోచంగా కూలగొట్టి ముందుకు పురోగమించవచ్చు!! ఇలాంటి నీతిబాహ్యమైన నాగరికత ఆవిర్భవించడం వల్లనే మానవసంస్కృతి మనుగడకు మూలాధారమైన కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమయి మనిషికి గృహజీవితంలో మనశ్శాంతి కరువయి పోయింది.

2. స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం ఆమెను పురుషునిపై ఏమాత్రం ఆధారపడకుండా చేసింది. "పురుషుడు సంపాదించాలి, స్త్రీ ఇంటి పనులు చక్కబెట్టాలి" అనే పూర్వకాల సిద్ధాంతం మారిపోయి ఇప్పుడు "స్త్రీ పురుషులు ఇద్దరూ సంపాదించాలి, గృహనిర్వహణ బాధ్యతలను బజారుపాలు చేయాలి" అనే నూతన సిద్ధాంతం అమల్లోకి వచ్చింది. ఇక ఒక్క లైంగిక విషయంలో తప్పితే స్త్రీ పురుషుల్ని కలిపి ఉంచగల శక్తి ప్రపంచంలో ఏదీ లేదనే చెప్పాలి. చివరికి కామవాంఛను తీర్చుకోవడానికి మాత్రమే భర్తపై ఆధారపడ వలసిన ఖర్మ ఈ నవనాగరిక నారీమణికి ఎందుకు పడ్తుంది?

నైతిక విలువల చేత స్త్రీ వ్యక్తిత్వాన్ని బంధించిన ఆ పాత సంప్రదాయాలకు ఏనాడో కాలదోషం పట్టింది. పాపం ఆలోచన మత విసర్జనతోనే అంతమయి పోయింది. వ్యభిచారం వల్ల సమాజంలో ఎలాంటి భయంలేదు. పోతే అక్రమ సంతానం పుడ్తుందనే ప్రమాదం నుంచి బయటపడాలంటే గర్భధారణ జరగకుండా చేసుకోవడానికి సులవైన అనేక మార్గాలు కనిపెట్టబడ్డాయి. అథవా వాటివల్లయినా, లేదా వాటి ప్రమేయం లేకుండా అయినా సరే అనుకున్న ఉద్దేశ్యం నెరవేరక గర్భధారణ జరిగితే, గర్భవిచ్ఛిత్తి చేసుకోవడంలో ఎలాంటి దోషం లేదు. అందులో కూడా సఫలం కాకపోతే పుట్టిన బిడ్డను చడీచప్పుడు కాకుండా గొంతు నులిమి పారేయవచ్చు.

ఒకవేళ గొంతు నులిమి పారేస్తే ఏదైనా గొడవ వస్తుందని భయముంటే, లేదా దురదృష్టవశాత్తు సహజ సిద్ధమైన మాతృప్రేమ పెల్లుబికితే ఆ పని మానేసి నిక్షేపంగా అక్రమ శిశువుకు తల్లిగా కూడా ఉండవచ్చు. ఎందువల్లనంటే అవివాహిత తల్లి (Unmarried Mother) విషయం ఇప్పటికే ఎంతో ప్రచారమై ఉంది. పొరపాటున ఈ విషయంలో పూర్వాచార పరాయణుడైన ప్రబుద్ధుడు ఎవరైనా నోరుజారి తన అయిష్టత వ్యక్తపరిస్తే అతనికి అనాగరికుడు, ఛాందసుడు, స్త్రీసంక్షేమ వ్యతిరేకి, సాంఘికాభివృద్ధి నిరోధకుడు వగైరా బిరుదులు బహూకరిస్తుంది నేటి సమాజం.

కేవలం కామవాంఛతో ఏర్పడిన భార్యాభర్తల అనుబంధాలు అనతి కాలంలోనే విచ్ఛినం కాక తప్పదు. పర్యవసానం కోర్టులు, విడాకులు, ఆ తరువాత వ్యభిచారం, సుఖవ్యాధులు. ఇలాంటివి ఎన్నో సంసారాలు సంవత్సరం తిరక్క ముందే, ఒక్కో సందర్భంలో వైవాహిక చిహ్నాల నూతనత్వం మాయకముందే విచ్ఛిన్నం కావడం, ఆత్మ హత్యలకు దారితీయడం నేడు మనం చూస్తూనే ఉన్నాం.

3. స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుతమైన కలయిక వల్ల స్త్రీ సౌందర్య ప్రదర్శన, అశ్లీలతలు బాగా ప్రబలిపోయాయి. ఇలాంటి సమాజంలో స్త్రీ పురుషుల్లోని ప్రతి వ్యక్తీ ఎంతసేపటికీ కామోద్రేకంతో ఎదుటి వ్యక్తిలో లీనం కావడానికే ప్రయత్నిస్తాడు. ఒకవేళ ఎదుటి వ్యక్తి అయిష్టత వ్యక్తపరిస్తే, పురుషుడైతే స్త్రీని బలాత్కరించైనా అనుభవిస్తాడు; స్త్రీ అయితే పురుషునిముందు తన అందచందాలను, అసభ్యప్రవర్తనను ఎరగా ఉంచు తుంది. ఇలాంటి వ్యక్తులు, సమాజం అనుక్షణం కామపిపాస తీర్చడానికి కావలసిన



సర్వసాధనలను సమీకరించే ప్రయత్నంలో ఉంటారు. వాటిని సాధించడానికి అనేక మార్గాలు అన్వేషిస్తారు. ఎన్నో ఉద్యమాలు లేవదీస్తారు. ఫలితంగా లైంగికసాహి త్యం, నగ్నచిత్రాలు, నైట్‌క్లబ్బులు, నృత్యప్రదర్శనలు, అసభ్య సంగీతం, రెచ్చగొట్టే వస్త్రధారణ, కామోద్రేకం కలిగించే సినిమాలు, ఫ్యాషన్‌షోలు వగైరా ఉనికిలోకి వచ్చాయి.

వీటన్నిటిని మనిషి కామాగ్నిని ప్రజ్వరిల్లజేసే సమిధలని తప్ప మరేం అనగలం? ఇలాంటి అశ్లీలతలు కుటుంబ శాంతికి, సమాజ ఆరోగ్యానికి భంగకరమైనవని గ్రహించక పోగా ఈ బలహీనతలను కప్పిపుచ్చుకునేందుకు దానికి "ఆర్ట్" అని పేరు పెట్టారు.

# 5. ఆర్ట్ పేరుతో అంగాంగ ప్రదర్శన

ఈ ఆర్ట్ వెనుక సమాజంలో ఎంతటి పోకిరితనం, వ్యభిచారం వ్యాపిస్తున్నాయో వర్ణించలేం. స్త్రీ స్వాతంత్ర్యం పేరుతో నేటి నాగరిక ప్రపంచం స్త్రీని పురుషుల మధ్యకు తీసుకొచ్చి ఆమె పాతివ్రతామానాల్ని రచ్చకీడుస్తోంది. స్త్రీకి కూడా సమాన హక్కులున్నా యని ఆమెను పురుషునితో పాటు నడిబజారులోకి తెచ్చి నిలబెట్టింది. ఎప్పుడయితే స్త్రీ వీధికెక్కిందో వేలాది కెమెరాలు ఆమెకు స్వాగతమిచ్చాయి. సినిమాలలో, పత్రికలలో, కేలండర్లలో, టెలివిజన్లలో ఈ కెమెరాలు స్త్రీ స్వాతంత్ర్యం విషయంలో ఎలాంటి పాత్ర నిర్వహిస్తున్నాయో మనం చూస్తూనే ఉన్నాం.

పాశ్చాత్యులు తెచ్చిపెట్టిన ఈ స్వాతంత్ర్యాన్ని గురించి ప్రణయ వేదాంతంలో ఓ విచిత్రమైన మార్పు వచ్చింది. ప్రణయం, పరిణయం, హృదయానురాగం, శరీరానుభూతి సమస్తం ఒక్కనికే అంకితం చేయాలనే పాతసిద్ధాంతం ఏనాడో భూస్థాపితం చేయ బడింది. ఇప్పుడు పరిణయం, శరీరానుభూతుల విషయంలో ఒక వ్యక్తితో సంబంధం కలిగివుంటూనే మరొక వ్యక్తితో ప్రణయం, హృదానురాగాల సంబంధాన్ని కూడా స్వేచ్ఛగా ఏర్పరచుకోవచ్చట! ఈ సిద్ధాంతాన్ని అర్థంచేసుకున్న స్త్రీ పురుషులు అందం, అంతస్తులతో ఆకర్షించబడి వివాహం చేసుకున్న తరువాత పరులతో (ముఖ్యంగా కళాకారులు, ఇతర ప్రజ్ఞా విశేషాలుగల వారితో) కూడా స్వేచ్ఛగా మానసిక సంబంధాలు కలిగి ఉండవచ్చు. అంటే పరవ్యక్తులలోని కళావిశిష్టత, అసాధారణ ప్రజ్ఞావ్యక్తిత్వాలను ప్రేమించడం అన్న మాట. ఈ విచిత్ర సంబంధంలో కాలుజారినా జారవచ్చు. అది వేరే విషయం.

ఒడిదొడుకులు లేకుండా ఇలాంటి దాంపత్య జీవితం గడపడానికి స్త్రీ పురుషులు ఇద్దరూ (అంటే సంఘం దృష్టిలో భార్యాభర్తలు) ఈ సిద్ధాంతాన్ని సరిగా అర్థం చేసుకొని ఉండాలి. వీరిద్దరిలో ఏ ఒక్కరు అర్థం చేసుకోకపోయినా దాంపత్యవ్యవస్థ ముక్క చెక్కలై విడాకులు, హత్యలు, కోర్టులకు దారితీయడానికి కావలసినంత ఆస్కారం ఉంది.

గార్హ్యస్థ ధర్మాన్ని త్యజించి నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో, వాణిజ్య సంస్థలలో, సినిమా థియేటర్లలో, రిక్రియేషన్ క్లబ్బుల్లో, పబ్లిక్ పార్కుల్లో ఎంత మంది మగువలు తమ అందచందాలను ఎరవేసి పురుషుల్ని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారో మన

నిత్యానుభవంలో వస్తున్న విషయాలే. అలాంటి స్త్రీలకు మరీ సన్నిహితమవడానికి అదను కోసం ఎదురు చూస్తున్న పురుష పుంగవులు కొందరు మహిళా స్వాతంత్ర్యం, మహిళా సంక్షేమం పేర్లతో సమాజంపై, ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారు.

మహిళా స్వాతంత్ర్యం వెనుక దాగివున్న ఈ సిగ్గుమాలినతనం ఎంతవరకు దిగ జారిందంటే ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా వంటి నాగరిక దేశాలలో "స్ట్రీకింగ్" అనే నగ్నసంచార ఉద్యమాలు కూడా బయలుదేరాయి. ఈ స్ట్రీకింగ్‌లో స్త్రీ పురుషులు వివస్త్రలయి పూర్తి దిశమొలలతో కొన్ని గంటల పాటు విహరించడం ఆరోగ్యమట! వారీ అసభ్య స్వాతంత్ర్యం కోసం తగిన చట్టాలు చేయమని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమల్ని ప్రపంచం గుర్తించేలా ఒక పటిష్ఠమైన సంస్థను రూపొందించుకొని, ఇప్పటికే కొన్ని లక్షల మందిని ఆకట్టుకొని సభ్యులుగా చేర్చుకున్నారట. ఇంతకంటే స్త్రీ జాతికి అవమానకరమైన విషయం ఇంకే ముంటుంది?

స్త్రీ పురుషుల కామోద్రేకాల్లో ఉన్న అసహనం, మానసిక ఉద్రిక్తతలను తగ్గించి ప్రశాంతంగా జీవనయాత్ర కొనసాగించేందుకు కొందరు ఈమధ్య ఓ కొత్తచిట్కా కనిపెట్టారు. ప్రకృతిలో ఉన్న ఇతరజీవుల మాదిరిగానే స్త్రీ పురుషులు కూడా సాంఘిక, ధార్మికపరమైన ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా కలసిమెలసి సహజ ధోరణిలో స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో మసలుకుంటే ఒకరి పట్ల ఒకరికున్న వ్యామోహ ఉద్రిక్తతలు తగ్గిపోయి ప్రశాంతజీవనం గడుపుతారట! అంటే పశువుల్లాగా పెళ్ళిపెటాకులు లేకుండా వావీవరసలు లేకుండా కలసిమెలసి ఉండాలన్న మాట. కాని సెక్స్‌కు సంబంధించిన భావోద్రేకాల విషయంలో మనుషులకు, జంతువులకు చాలా తేడా ఉందన్న సంగతి ఈ చిట్కా కనిపెట్టినవారికి తెలియదా?

## 6. ఇస్లాం మౌలిక సూత్రాలు

స్త్రీ పురుషుల బాంధవ్యం విషయంలో ఇస్లాంకున్న ప్రధాన ఉద్దేశానికి ఒక విశిష్ఠత ఉంది. అది మానవుని కామశక్తిని ఆవేశం, అశ్లీలతల్లో వృధాపోనీయడానికి బదులు దాన్ని ఒక పవిత్రమైన, అత్యుత్తమ సంస్కృతి నిర్మాణానికి దోహదపడేలా చేస్తుంది. ఈ ఆశయాన్ని సాధించడానికి ఇస్లాం ఒక వైపు వివాహ విడాకుల చట్టాన్ని సులభతరం చేసింది. ముఖ్యంగా స్త్రీ తానెప్పుడు కోరితే అప్పుడు తన ఇష్టానుసారం ఎలాంటి ప్రతి బంధకాలు లేకుండా వివాహం చేసుకోవడానికి, విడాకులివ్వడానికి, పునర్వివాహం చేసు కోవడానికి అవకాశాలు కల్పించింది; మరోవైపు వ్యభిచారం, అసభ్యకరాలను సమాజం నుంచి సమూలంగా నిర్మూలించేందుకు ఎన్నో అవరోధాలు, అడ్డంకులు ఏర్పడేలా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టింది.

దీనికి వ్యతిరేకంగా పాశ్చాత్య సంస్కృతి లౌకిక వ్యవహారాల్లో స్త్రీ పురుషులిద్దర్నీ ఒకే వేదిక మీదకు తెచ్చి భౌతిక పురోభివృద్ధిని వేగిరపరుస్తుంది. దాంతోపాటు కామోద్రేకా



లను నిత్య జీవితంలో మనస్సును రంజింపజేసి భోగలాలసకు అలవాటు చేసే సంగీత, నృత్య కళల్లో, వినోద కార్యకలాపాల్లో వినియోగింపజేస్తుంది.

ఇస్లామీయ సమాజంలో ముందు పరిణయం, ఆ తరువాత ప్రణయం ఉంటే, పాశ్చాత్య సమాజ శకటం దీనికి పూర్తిగా రివర్స్ గేరులో నడుస్తుంది. ఇక్కడ పరిణయం తర్వాత జరిగే ప్రణయానికి విలువలేదు. ఇది కరుడుగట్టిన అనాగరికతకు చిహ్నం. కాని పాశ్చాత్య సాహిత్యంలో పరిణయంలేని ప్రణయం స్త్రీ స్వేచ్ఛకు, ఆమె వ్యక్తి వికాసానికి తొలిమెట్టని పొగడబడింది. ఇలాంటి నాగరికత మానవజాతికి శాపం వంటిది. ముఖ్యంగా ఇది స్త్రీజాతికి తీరని కళంకం. దీని దుష్ప్రభావం వల్ల ఎంతమంది జీవితాలు దుర్భరమవుతున్నాయో, ఎన్ని సంసారాలు నాశనమవుతున్నాయో చెప్పలేం.

క్రైస్తవుల స్వయంకృత తత్వంతో విసిగిపోయిన పాశ్చాత్యులు ఇలాంటి లోప భూయిష్టమైన నాగరికతను ఏర్పరుచుకొని నాస్తిక భౌతిక వాదాలకు సన్నిహితులవుతూ తమ నిజప్రభువును, ఆయన మానవాళి కోసం ప్రకటించిన సహజ సిద్ధాంతాలను గుర్తించ లేక పోతున్నారు. విచాకరమైన విషయం ఏమిటంటే దీని దుష్ప్రచారానికి ఇతర జాతులు కూడా అతి వేగంగా గురవుతున్నాయి.

పాశ్చాత్యులు వ్యాపింపజేస్తున్న ఈ భయంకర నాగరికతా ప్రవాహాన్ని అరికట్ట గలిగే సాహిత్యం, సిద్ధాంతాలు ముస్లిమేతరుల దగ్గర ఉంటే వారీ పనికి పూనుకోవాలి. లేకపోతే ఇస్లాం వారిని సాదరంగా ఆహ్వానిస్తోంది. సత్యాన్వేషకుల ధార్మిక జ్ఞానపిపాసకు పరిమితం ఉండకూడదు. అంచేత రాజకీయ దుర్బుద్ధితో బ్రిటిష్‌వాళ్ళు రాసిన చరిత్రను, అది సృష్టించిన అపోహలు, అపార్థాలు, విభేదాలు, వైషమ్యాలను విడనాడి నిష్పక్షపాతంగా ఇస్లాం సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి.

ఇస్లాం ప్రపంచంలోని సమస్తజాతుల కోసం ఆవిర్భవించిన ప్రకృతిధర్మం. సమస్త కాలాలకు పనికి వచ్చేలా విశ్వప్రభువుచే నిర్ణయించబడిన సార్వజనీన సమగ్ర జీవన వ్యవస్థ. ఒకానొకప్పుడు విజయవంతంగా అమలుపరచబడి ప్రపంచవ్యాప్తంగా సంచలనం గావించిన దైవచట్టం. స్త్రీ వికాసానికి, ఆమె సుఖజీవనానికి ఇస్లాం చూపిన మార్గం ఏమిటో, సమాజంలో స్త్రీకి అది ప్రసాదించిన స్థానం ఎలాంటిదో తెలుసుకోదలచిన జిజ్ఞాసపరులకు ఈ పుస్తకం వారి జ్ఞానపిపాసను కొంతవరకైనా తీర్చగలదని ఆశించవచ్చు.

## స్త్రీపురుషుల సమానత్వం

ఇస్లాం దృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానులే. ఖుర్‌ఆన్‌లోని "నిసా" (స్త్రీలు) అధ్యాయంలో పేర్కొనబడిన మొట్టమొదటి సూక్తిలోనే ఈ భావం ఉంది.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా

మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి దేవుని పేరును సాధనంగా చేసుకుంటారు. అలాంటి దేవునికి భయపడండి. రక్త సంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి." (ఖుర్‌ఆన్–4:1).

ఈ సూక్తిలో స్త్రీల పట్ల పురుషులకున్న అహంభావం రద్దు చేయబడింది. సమాజంలో ఇస్లాం మహిళలకు పురుషులతో పాటు అన్నిరంగాల్లో సమాన స్థాయిని కలగజేస్తోంది. కర్మఫలంలో కూడా ఇస్లాం ఇద్దరికీ సమాన అవకాశాలను కల్పిస్తోంది:

"నేను మీలో ఎవరి కర్మలను కూడా వృధాచేయను. పురుషులయినా, స్త్రీలయినా మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాసికి చెందినవారు. నా(ప్రసన్నత) కోసం ఎవరెవరు తమ స్వస్థలాలు వదలివచ్చారో, ఎవరెవరు తమ ఇండ్ల నుండి వెడలగొట్టబడ్డారో, ఎవరెవరు వేధించబడ్డారో, ఎవరెవరు పోరాడారో, (ఆ పోరాటంలో ఎవరెవరు) హతమార్చబడ్డారో వారందరి పొరపాట్లు మన్నించి వారిని సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాను." ఇదీ దేవుని దగ్గర (వారికి) లభించే ప్రతిఫలం. దేవుని దగ్గరే శ్రేష్ఠమైన ప్రతిఫలం ఉంది. (ఖుర్‌ఆన్–3:195)

## రెండువర్గాల్లో మానవుల విభజన

ఇస్లాం సమస్త మానవుల్ని రెండేరెండు వర్గాలుగా విభజించింది. ఒక వర్గం సజ్జనులు, విశ్వాసులు. రెంతో వర్గం దుర్జనులు, అవిశ్వాసులు. సజ్జనులంటే దేవునికి భయపడుతూ ఆయన తనప్రవక్తల ద్వారా పంపిన ఆజ్ఞల్ని పాటించేవారని అర్థం.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుషల జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిస్సందేహంగా దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు." (ఖుర్‌ఆన్–49:13)

ఒకే తల్లిదండ్రుల సంతానం అయిన దృష్ట్యా స్త్రీపురుషులిద్దరూ సోదరసోదరీలు అవుతారు. మానవతా ప్రాతిపదికపై ఇద్దరూ సమానులే. "స్త్రీలు పురుషులకు చెందిన ఒక భాగమ"ని మహాప్రవక్త (సల్లం) అన్నారు. "స్త్రీల పట్ల ప్రేమాభిమానాలు నా ప్రవృత్తిలో వేరుగొని ఉంద"ని కూడా ఆయన అన్నారు.

# 7. కుమార్తెగా స్త్రీ స్థానం

"మళ్ళీ ఆడపిల్లేనట!" ఈవార్త విని పాపం అత్తమామల మూతులు ఎన్ని వంకర్లు పోతాయో కదా! అత్తమామలు, అమ్మనాన్నల సంగతి ఎందుకు? స్వయంగా ఆడపిల్లల్ని కన్నవాళ్ళు సంతోషిస్తున్నారా? అదేమోగాని షాహిద్ మాత్రం అలాంటివాడు కాదు...



షాహిద్ క్యాంపు నుంచి రాగానే షీమ ఈసారి ఎందుకో ఎన్నడూలేని విధంగా సిగ్గుతో వంకర్లు తిరిగిపోతూ స్వాగతం చెప్పింది.

షాహిద్ అనుమానంతో ఆమెను కళ్ళు చించుకొని ఆపాదమస్తకం పరికించి చూశాడు. కాని అతని మొద్దు బుర్రకు విషయం అర్థం కాలేదు. ఆ తరువాత అతను సాయంత్రం దాకా ఆఫీసు పనుల్లో పడిపోయి ఆ సంగతే మరచిపోయాడు.

రాత్రి భోజనాలయ్యాక షాహిద్ ఒంటరిగా తన రూంలో కూర్చొని ఆరోజే వచ్చిన గీటురాయి ప్రతికను తిరిగేస్తున్నాడు. షీమ మరొకసారి సిగ్గుదొంతర్లతో పచ్చపచ్చగా అతని ముందు ప్రత్యక్షమయ్యింది.

"ఏమిటీ ఈరోజు నీ ముఖం వెలిగిపోతోంది?" అన్నాడు షాహిద్ అర్ధాంగి ముఖం లోకి సూటిగా చూస్తూ.

"శ్రీవారికి శుభవార్త" అన్నది షీమ ముక్తసరిగా నేలచూపులు చూస్తూ. "శుభవార్తా! ఏమిటీ.... దుబయ్ నుంచి మా బాబాయి నాకు మంచి టేప్‌రికార్డర్ తెస్తానన్నాడు, తెచ్చాడేంటి?" అడిగాడు షాహిద్.

"అబ్బ! మీకెప్పుడూ టేప్‌రికార్డర్ల పిచ్చే!!" సీరియస్‌గా మారిపోయింది షీమ.

"మరింకేమిటా శుభవార్తా...?" తల గోక్కున్నాడు షాహిద్.

"చెప్పుకోండి చూద్దాం" కవ్వించింది షీమ.

"ఊ.... మా చెల్లాయికి సంబంధం ఖాయమైందనుకుంటా."

"ఊహు... మరేమో...."

"ఆ, మరేమో... చెప్పు డియర్! త్వరగా చెప్పు మరీ."

"ఏమండీ! మరేమో... నాకు..."

"ఆ... ఆ...నీకు...?"

"అబ్బ! నాకు సిగ్గేస్తుందండీ!"

"ఓ...ఐ-సి. ఇప్పుడర్థమయిందిలే. అయితే త్వరలోనే నాకో ముద్దుల కూతుర్ని ఇవ్వబోతున్నావన్న మాట" అన్నాడు షాహిద్ సంతోషంతో ఎగిరి గంతేస్తూ.

"ఉహు. నాకు ముద్దుల కొడుకే కావాలి."

**"నో, నో. నాకు కూతురే కావాలి."**

"అదేం కుదరదు. నాకు కొడుకే కావాలి."

"నో, కూతురే..."

"కాదు, కొడుకే..."

ఇదండీ వరస! మొత్తానికి షాహిదే తన పంతం నెగ్గించుకున్నాడు. అయితే షీమ తన అందాల కూతుర్ని చూసుకొని మురిసిపోయిందేకాని బాధపడలేదు. సరిగ్గా మరొక సంవత్సరానికి మరో అమ్మాయి పుట్టింది. షాహిద్ తన ఇద్దరు కూతుర్లని తన రెండు కంటిపాపలుగా భావించుకున్నాడు. షీమాకు రెండవ కూతురిపై కాస్త శ్రద్ధ తగ్గింది. ఆ తరువాత రెండేళ్ళకు మళ్ళీ అమ్మాయే పుట్టింది. షాహిద్ కాస్తంత నిరుత్సాహపడ్డాడు. షీమ సంగతి సరేసరి. మూడు మణుగుల బరువు మీదపడినట్లు తెగ బాధపడిపోయింది.

"ఎందుకే పిచ్చిదానా! అంత బాధ పడిపోతావు? నా ముగ్గురు కూతుళ్ళు మూడు రత్నాలే, రత్నాలు" అన్నాడు షాహిద్ భార్యను సముదాయించే ధోరణిలో.

"ఆ... రత్నాలే! ముగ్గురికీ పెళ్ళిళ్ళు చేసేటప్పటికి తెలుస్తుందిలెండి ఈ రతనాల విలువ... మైనస్ లక్షల రూపాయల్లో" అన్నది షీమ కట్నం చురకతో ఎత్తిపొడుస్తూ.

"నిజమే. ఈ కట్నాల భయం వల్లే తల్లులు ఆడపిల్లల్ని నిరాదరణకు గురిచేస్తున్నారు. ఆడపిల్లలు ఎక్కువైనకొద్దీ తండ్రులక్కూడా వారిపట్ల శ్రద్ధ క్రమంగా సన్నగిల్లుతుంది. కాని కట్నాల మూలంగానే ఆడపిల్లలు నిరాదరణకు గురికావడం లేదు. మగపిల్లవాడైతే సంపాదించి పెడ్తాడని, ఆడపిల్ల కూర్చొని తింటూ, ఉన్నది కాస్తా హరించివేస్తుందని తల్లి దండ్రులు భావిస్తారు. అందుకే వారు మగపిల్లల్ని చూసినట్లు ఆడపిల్లల్ని చూడలేక పోతున్నారు....

"ఇస్లాం ఈ వివక్షను అంతమొందిస్తుంది. ఆడపిల్లయినా, మగపిల్లోడయినా ఒకేదృష్టితో చూడాలని, ఇద్దర్నీ సమానస్థాయిలో పెంచిపోషించాలని ఆదేశిస్తోంది .....ఇస్లాంలో ఇంతటి మంచి బోధనలు ఉన్నా మన దేశంలో ముస్లింలు ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం విచారకరం. దీనికి ప్రధాన కారణం అజ్ఞానం, సహవాసదోషాలే...." అంటూ షాహిద్ ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"నిజమేనండీ, నా కళ్ళు తెరిపించారు. ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా ఉంది" అన్నది షీమ తృప్తిగా నిట్టూర్పు విడుస్తూ.

"అంతేకాదు, మగపిల్లోడికి చదువు చెప్పించి మంచి శిక్షణ ఇస్తే అతనొక్కడే బాగు పడతాడు. అదే ఆడపిల్లయితే మొత్తం కుటుంబాన్నే సంస్కరిస్తుంది. గొప్పవాళ్ళుగా చరిత్ర కెక్కినవారి ఔన్నత్యానికి పునాదులేసింది ఎవరనుకున్నావు? వారి తల్లులే కదా!" మరింత వివరించాడు షాహిద్.

"అలాగానా? అయితే మన నిషాత్‌కి చదువుకునే ఈడొచ్చిందిగా, ఏ బళ్లో వేద్దాం?"

"ఎక్కడో ఎందుకు, ఇక్కడ మన వీధిలోనే 'జామిఅతుల్ హుమైరా' ఉందికదా! అది ప్రత్యేకంగా ఆడపిల్లల కోసం ఎంతో మంచి పాఠశాల. అందులో ధార్మిక విద్యతో పాటు సైన్సు, సోషల్, మాథ్స్ లాంటి ఆధునిక విద్యలు కూడా బోధిస్తారు."



"ఔనండీ, ఆ సంగతి మరచేపోయాను. మొన్న ఇస్తిమాకు పోతే ఎవరో చెప్పారు ఆ పాఠశాల గురించి. రేపే పోయి కనుక్కో రండి. మన నిషాత్‌ని చేర్పిద్దాం" అన్నది షీమా సంతోషంతో.

"నాన్నా! మలేమో... ఇందాక అమ్మ చాకలెత్తు కొన్పెత్తమంతే కొన్పెత్త లేదు" అప్పుడే అక్కడికొచ్చిన మూడేళ్ళ నిషాత్ తండ్రికి ఫిర్యాదు చేసింది.

"కొనిపెడ్తానమ్మా! తప్పకుండా కొనిపెడ్తాను. ఒకటి కాదు, పది చాక్లెట్లు కొనిపెడ్తా, సరేనా?" అంటూ షీమా కూతుర్ని అమాంతం ఎత్తుకొని ముద్దులలో ముంచెత్తింది.

ఇదండీ! ఆడపిల్లల విషయంలో ఈనాడు మన ధోరణి............!!

## ప్రతి యుగంలోనూ ఇంతే

ప్రతి యుగంలో కూడా ప్రజలు స్త్రీ సంతానానికి పురుష సంతానంకంటే తక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈనాడు కూడా తల్లిదండ్రులు ఆడపిల్లల కన్నా మగపిల్లలకే ఎక్కువ ప్రాధాన్యత నివ్వడం అందరికీ తెలిసిందే. సంఖ్యాపరంగా కూడా ఆడపిల్లల కంటే మగ పిల్లలనే ఎక్కువగా కోరుకుంటారు తల్లిదండ్రులు. కేవలం ముగ్గురు పిల్లలుంటే చాలనుకునే నవనాగరికతా ప్రియులైన తల్లిదండ్రులు సైతం ఆ ముగ్గురిలో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉండాలని కోరుకుంటారు.

ఇలా స్త్రీ సంతానంపై తల్లిదండ్రులకు ఇంత తక్కువ చూపెందుకు? మగపిల్లలు పెద్దవారయ్యాక సంపాదించిపెడ్తారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తారు. అదే ఆడపిల్లలైతే వారిని పెంచి పోషించడానికే ఆస్తి హరించిపోతుంది. చివరికి ఆ అమ్మాయిని ఒక అయ్య చేతిలో పెట్టవలసి వస్తుంది. పైగా ఈరోజుల్లోనైతే ఆమెను పెద్దఎత్తున కట్నకానుకలు ఇచ్చిమరీ అత్తవారింటికి పంపవలసి వస్తుంది. అందువల్లనే ఆడపిల్లల్ని అల్పదృష్టితో చూస్తున్నారు. ఈ కారణంగానే ఆనాడు, ఈనాడు కూడా కుమార్తెల సంఖ్యను వీలైనంత తగ్గించడానికి రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నారు.

## క్షీణదిశగా బాలికల సంఖ్య- ప్రభుత్వ ఉదాసీనత

మన దేశంలో ఆడపిల్లల హత్య ఈనాడు కూడా జరుగుతోంది. 1994లో "కమ్యూనిటీ సర్వీస్ గిల్డ్" అనే సంస్థ తమిళనాడులోని సేలం జిల్లాలో పరిశోధన జరిపి ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించినట్లు "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రిక వెల్లడిచేసింది. ఆ పరిశోధనా నివేదికలో కొన్ని సంఘటనలు ఇలా ఉన్నాయి:

అగ్రవర్ణానికి చెందిన ఓ గృహిణి ఈవిధంగా తెలియజేసింది- "మాకు ఒక ఆడపిల్ల పుట్టిన తరువాత ఒక నెలదాకా ఎలాగో కాపాడగలిగాం. తరువాత మా కుటుంబ సభ్యులు, కులస్థులు వత్తిడి చేయడం మొదలెట్టారు. చివరికి నేను వారి వత్తిడి భరించ లేక నలభై రోజుల వయస్సన్నా పూర్తికాక ముందే ఆ పాపను చంపేయాల్సి వచ్చింది. బాధగానే ఉంది. కాని నన్నేం చేయమంటారు?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది.

సేలం జిల్లాలో అనేక మంది మహిళలు "ఆడపిల్లల్ని చంపడం మాకు ఈనాడు కొత్తేమీ కాదు. అప్పుడే పుట్టిన ఆడశిశువును చంపడం మా కుటుంబ ఆచారం మరి" అంటూ అదేదో సాధారణ విషయంలా చెప్పుకొచ్చారు. ఒక మహిళామణి అయితే ఏ మాత్రం సంకోచించకుండా "మా అమ్మ నా తర్వాత ముగ్గురు ఆడపిల్లల్ని చంపేసింది. నేను నా నలుగురు కూతుళ్ళను చంపేశాను. ఇందులో ఆశ్చర్యపడాల్సిన సంగతి ఏముందని?" అంటూ రాగాలాపన చేసింది.

మరో వనితావాణి వినండి: "మా పాపకు నేను పురుగుల మందు తాగించాను. అప్పటికీ ఆ పిల్ల చావకపోవడంతో తీవ్రజ్వరం పోగొట్టేందుకు వాడే మందును పెద్ద మోతాదులో ఇచ్చి చంపి పీడా వదిలించుకున్నా. ఇదంతా మా కుటుంబం, మా తల్లి దండ్రుల కోరిక మేరకే చేశాను."

'సాన్‌లాప్' (SANLAP) కార్యకర్త కుమారి ఇంద్రాణి పరిశోధన ప్రకారం ఆ ప్రాంతంలో అప్పుడే పుట్టిన ఆడపిల్లల్ని హతమార్చడం బడుగువర్గాల్లో చాలా పరిపాటి. ఒక గ్రామంలో లంబాడీ తెగకు చెందిన ఓ మంత్రసాని తాను ఒక్కర్తే ఇరవై ఒక్కరు ఆడ శిశువుల్ని గొంతుపిసికి చంపేసినట్లు ఒప్పుకుంది.

మన దేశంలో ఆడపిల్లల పుట్టుకను అరికట్టే చర్యలు ఈనాడు యదేచ్ఛంగా సాగుతున్నాయి. రాజస్థాన్‌లో 1000 మంది బాలురకు 909 మంది బాలికలే ఉన్నారు. అంటే 91 మంది ఆడపిల్లలను పుట్టక ముందే హతమారుస్తున్నారని తెలుస్తోంది. సిక్కు, జైన, బౌద్ధ మతస్థులలో ఆడపిల్లల సంఖ్య ప్రమాదస్థాయిలో తగ్గిపోయింది.

రాజస్థాన్‌లో ఆరేళ్ళ లోపు పిల్లల్లో 1000 మంది సిక్కు బాలురకు 828 బాలికలు, 1000 మంది జైన బాలురకు 878 మంది బాలికలు, 1000 మంది బౌద్ధ బాలురకు 840 మంది బాలికలు ఉన్నారు. పోతే ముస్లింలలో ప్రతి 1000 మంది మగపిల్లలకు 925 మంది ఆడపిల్లలు ఉన్నారు. జాతీయస్థాయిలో గ్రామాలలో కంటే చదువు నాగరికతలు పెరిగిన పట్టణాలలోనే భ్రూణహత్యల ద్వారా ఆడపిల్లల సంఖ్య ఎక్కువగా తగ్గిపోతోందని సర్వే రిపోర్టులు తెలుపుతున్నాయి.

నానాటికీ పెరుగుతున్న జనాభాకు అడ్డుకట్ట వేయడానికి ఈమాత్రం ఉడుతాభక్తి సహాయం కూడా పనికొస్తుందని భావిస్తుందేమో ప్రభుత్వం కూడా చూసీచూడనట్లు ఉండి పోతోంది. ఇక ఆడపిల్లల హత్యలను ఆ దేవుడే అడ్డుకోవాలి.

## అందరికీ ఆహారమిచ్చేవాడు దేవుడే

"దేవుడు భూమ్యాకాశాలకు యజమాని, సార్వభౌముడు. తాను తలచిన ప్రతిదాన్నీ సృష్టించగలడు. తాను కోరినవిధంగా కొందరికి మగసంతానం, కొందరికి ఆడసంతానం, మరి కొందరికి ఆడ, మగ సంతానం ప్రసాదిస్తాడు. అలాగే తాను కోరినవారిని సంతాన హీనులుగా కూడా చేస్తాడు. ఆయన గొప్ప జ్ఞానసంపన్నుడు, సమస్తకార్యాలు చేయగల సమర్థుడు." (ఖుర్ఆన్–42:49,50)



"దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చుకోకండి. మేము మీకూ ఆహారమిస్తున్నాము, వారికీ ఆహారమిస్తున్నాము." (6:151) "దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం, మీకూ ఇస్తున్నాం. వారిని చంపడం ఘోరమైన పాపం." (ఖుర్ఆన్–17:31)

దేవుడు సృష్టికర్త, ఆరాధ్యుడు మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధి ప్రదాత నిజానికి దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి కుడా పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం నేడు వ్యవసాయరంగంలో అద్భుత విధానాలు, అసాధారణ సాంకేతిక పద్ధతుల్ని మానవులకు అనుగ్రహించినవాడు ఆ ప్రభువే.

## ఉపాధి పంపిణిలో అపసవ్యత

మనదేశంలో యాభైయేళ్ళ క్రితంనాటి 45కోట్ల జనాభా జీవనప్రమాణం కంటే నేడు 100కోట్ల జనాభా జీవనప్రమాణం మెరుగ్గాఉంది. ఇతరదేశాల్లో కూడా అంతే. ఎక్కడో కొన్నిచోట్ల మాత్రమే కొందరు కనీసావసరాలు దొరక్క బాధపడ్తున్నారు. దీనికి కారణం భూమిపై ఆహారోత్పత్తి తగ్గిపోయిందని అర్థం కాదు. మానవులు దైవబోధనలు వదలి అనుసరిస్తున్న అసహజ ఆర్థికవిధానాలే ఉపాధిపంపిణిలో అపసవ్యత, సమతూలనారాహిత్యాలను సృష్టిస్తున్నాయి.

తత్ఫలితంగా లక్షలాదిటన్నుల ఆహారధాన్యాలు గిడ్డంగులలో ఏళ్లతరబడి పంపిణీకి నోచుకోలేక ముక్కిపోతున్నాయి. కొన్ని దేశాల్లోనైతే అదనంగా పండిన ఆహారోత్పత్తుల్ని పెద్దఎత్తున తగలబెట్టడమో, సముద్రంలో పారవెయ్యడమో జరుగు తోంది. ఈ నిర్వాకం కోసం ఆదేశాలు కోట్లాది డాలర్లు ఖర్చుపెడుతున్నాయి.

నేటి పాలకులు, ఆర్థికవేత్తలు సరైన ఆర్థికవిధానాలతో ఆహారోత్పత్తులు సక్రమం గా పంపిణీ చేయలేక ఏకంగా సంతానోత్పత్తినే అరికట్టే చర్యల్ని ప్రోత్సహిస్తున్నారు. అంటే తోటి మానవసంతతినే హతమార్చుతున్నారన్నమాట. ఇంతకంటే ఆత్మహత్యా సదృశం మరొకటి ఉండదు.

"ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి దేవుడు అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు." (ఖుర్ఆన్–41:10)

అనాది నుండి అంతిమదినం వరకు పుట్టే సమస్త ప్రాణికోటికి సరిపడ ఆహార సామగ్రి, ఇతర జీవితావసరాలరను దేవుడు ప్రపంచంలో ఏర్పాటు చేశాడు. అయితే ఈ ఆహారం అవసరమయిన మేరకు అందాలంటే దేవుడు నిర్దేశించిన జీవన విధానం ప్రకారం ఆర్థికవిభజన ప్రక్రియ న్యాయంగా, నిష్పక్షపాతంగా నిరంతరం జరుగుతూ ఉండాలి.

కాని స్వార్థమే పరమార్థంగా భావించిన నేటి మానవుడు దేవుడు నిర్దేశించిన సత్య ధర్మాన్ని, ఆర్థిక న్యాయాన్ని త్రోసిపుచ్చి అన్యాయం, అక్రమం, దగా, దోపిడీ, హింసా దౌర్జన్యాలతో కొన్ని వర్గాలకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాడు. ఆ విధంగా కూడబెట్టిన ఆర్థిక ఒనరుల్ని ఎరగా చూపుతూ దేవుని దాసుల్ని తన దాసులుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు ఆధునిక మానవుడు.

“వీరు దేవునిదాసులలో కొందరిని ఆయనకు సంతానం అంటగట్టారు. మానవుడు నిజంగా పరమ కృతఘ్నుడు. దేవుడు తన సృష్టితాలలో కొందరిని తనకు కూతుళ్ళుగా ఎంచుకొని, మీకు మాత్రం కోరి కొడుకుల్ని ప్రసాదించాడా? (ఎంతఅపచారం?) అయితే వారు కరుణామయుడయిన దేవునికి ఏ ఆడసంతానం అంటగట్టారో ఆ సంతానం గురించిన శుభవార్తే వారిలో ఎవరికైనా విన్పిస్తే అతను ముఖం మాడ్చుకొని పుట్టెడు దుఖంతో క్రుంగిపోతాడు. ఆభరణాలలో అల్లారుముద్దుగా పెరుగుతూ, వాదనలో తన అభిప్రాయాన్ని కూడా సరిగా వివరించలేని ఆడపిల్ల దేవుని వాటాలోకి వచ్చిందా?” (ఖుర్ఆన్–43:15-18)

## ఆడపిల్లల సజీవసమాధికి కారణాలు

పూర్వం అరేబియాలో ఆడపిల్లల్ని చంపడానికి మూడుకారణాలు ఉండేవి.

(1) ఆర్థిక దుస్థితి. మగపిల్లలను పెంచి పెద్దచేస్తే సంపాదనాపరులవుతారు. కాని ఆడపిల్లలు పెరిగి పెద్దయ్యే వరకు వారి పోషణ ఖర్చులు భరించి చివరికి వారికి పెళ్ళి చేసి బయటికి పంపవలసి వస్తుంది.

(2) కూతురికి పెళ్ళిచేసి వేరేవ్యక్తిని అల్లుడు చేసుకోవడం నామోషిగా భావించే వారు. (16:59, 43:18 సూక్తులు చూడండి.)

(3) యుద్ధాలలో మగపిల్లలయితే తండ్రి రక్షణకు ఉపయోగపడతారు. ఆడపిల్ల లయితే శత్రువుల బారినుండి స్వయంగా వారినే రక్షించడానికి తండ్రి నానా తంటాలు పడవలసి వస్తుంది. ఈ మూడు కారణాలతో ఆడపిల్లల్ని సజీవసమాధి చేసేవారు. పైగా దాన్ని పవిత్ర మతకార్యంగా భావించేవారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వచ్చి ఏకేశ్వరవాద శంఖారావం గావిస్తూ ఆనాటి దురాచారాల్ని ఒక్కొక్కటిగా నిషేధించడం ప్రారంభించారు. అలాంటి దురాచారాలలో ఆడపిల్లల్ని సజీవసమాధి చేసే దుష్టకార్యం కూడా ఉండేది. ఈ విషయంలో దైవప్రవక్త అనుచరుడొకాయన ఇస్లాం స్వీకరించకపూర్వం తన కుమార్తెల్ని ఎలా సజీవ సమాధిచేశాడో, ఆ హృదయవిదారక వృత్తాంతాన్ని తెలుసుకుందాం.

## ఒక బాలిక బాధామయ గాథ

దైవప్రవక్త (సల్లం) ఓరోజు కొందరు అనుచరులతో సమావేశమయి ఉన్నప్పుడు హజ్రత్ ఖైస్ బిన్ ఆసిమ్ (రజి) ఆయన సన్నిధికి వచ్చారు. మాటల సందర్భంలో ఒక



అన్సారీ ముస్లిం ఆడపిల్లల్ని సజీవసమాధి చేసే విషయాన్ని ప్రస్తావించారు.

అప్పుడు ఖైస్ బిన్ ఆసిమ్ (రజి) స్పందిస్తూ “నిజంగా నేను నేను నా కుమార్తెల నందర్నీ అవమాన భయంతో నేలలో పాతిపెట్టాను” అని చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని “దాన్ని గురించి ఎప్పుడైనా నీకు జాలి అంటూ ఏమీ కలగలేదా?” అని అడిగారు.

అప్పుడా సహాబీ (అనుచరుడు) ఇలా చెప్పుకు వచ్చారు:

“నేను ప్రయాణం నుండి తిరిగొచ్చిన తర్వాత ఇంటి పరిస్థితులు విచారించాను. నా భార్య పరిస్థితులు వివరిస్తూ ‘ఒక ఆడపిల్ల పుడ్తే నేను దాన్ని భూమిలో పాతి పెట్టాను’ అని చెప్పింది. ఈమాట విని నేను మౌనంగా ఉండిపోయాను. నిజానికి ఆ పిల్లను ఆమె చంపలేదు. ఆ పాప వేరేచోట క్రమంగా పెరిగి కొంతకాలానికి పెద్దదయి పోయింది.”

“ఓరోజు ఆమె తన తల్లిని చూడటానికి వచ్చింది. సరిగ్గా అదే సమయంలో నేను ఇంటికి తిరిగొచ్చాను. ఆమె తల్లి ఆమెకు తలదువ్వి, జడవేసి, ఉతికిన బట్టలు తొడిగించింది. అప్పుడా పాప ముఖంలోని అమాయకత్వం, అందచందాలు నన్ను ఎంతో ముగ్ధుణ్ణి చేశాయి. నేను ‘ఈ పాప ఎవరి కూతుర’ని అడిగాను.”

“ఈమాట విని ఆమె తల్లి ఏడ్వడం మొదలుపెట్టింది. ‘ఈ పిల్ల మీ కూతురే నండీ!’ అంటూ జరిగిన విషయం పూర్తిగా చెప్పింది. నేనీ విషయం విని మిన్నకుండి పోయాను. మరేమాటా ప్రస్తావించలేదు. కొన్నాళ్ళకు నా భార్య ఆ విషయమే మరచి పోయింది. ఆ పాప మా ఇంట్లో నిక్షేపంగా ఉండసాగింది...”

“నేను అవకాశం చూసి ఓరోజు పాపను బయటికి (నిర్జనప్రదేశానికి) తీసికెళ్ళాను. (అక్కడ) ఓ గుంట త్రవ్వడం ప్రారంభించాను. నేనా గుంట ఎందుకు తవ్వుతున్నానో ఆ అమాయకపు పిల్లకు బొత్తిగా తెలియదు. గుంట తవ్వుతున్నప్పుడు మట్టి ఎగిరెగిరి వచ్చి నా శిరోజాలపై పడుతుంటే, ఆ పాప తన లేతచేతులతో నాతల తుడుస్తుండేది. నాకు అప్పుడు కూడా ఆ పాప మీద ఏమాత్రం జాలి కలగలేదు.”

“గుంట తవ్వడం పూర్తయ్యాక నేనా అమ్మాయిని గుంటలోకి తోశాను. ఆ పాప గుంటలోకి దభేలున పడిపోయి గావుకేక పెట్టింది. నేను వెంటనే పైనుంచి మట్టి పోయడం మొదలెట్టాను. పైనుండి గుంటలో మట్టి పోస్తుంటే ఆ పాప కేకలు పెడ్తూ ‘నాన్నా! నా మీద మట్టి పోసి కప్పివేస్తావా? నన్నిక్కడ ఒంటరిదాన్నిగా వదిలేసి వెళ్ళి పోతావా?’ అంటూ ఏడ్వసాగింది. నేనా గుంటను పూడ్చి నేలమట్టానికి చేసే వరకూ ఆమె అలా అంటూ విలపిస్తూనే ఉండింది. చివరికి ఆమె కంఠస్వరం ఆగిపోయింది... ఈ చర్యపట్ల ఆ తర్వాత నేనెంతో పశ్చాత్తాపం చెందాను. అది ఇప్పటికీ నా హదయాన్ని పట్టి పీడిస్తోంది.”

విశ్వ కారుణ్యమూర్తి అయిన మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ దుర్ఘటన సంగతి విని ఎంతో చలించిపోయారు. ఆయన కళ్ళు అశ్రుపూరితాలయి పోయాయి. "నిజంగా ఇది ఎంతో నిర్దాక్షిణ్యమైన చర్య. ఏ ఒక్కరిపై జాలి చూపని మనిషిని ఎవరూ కనికరించరు" అన్నారు ఆయన.

ఇదీ ఆనాటి అరబ్ సమాజంలో ఆడపిల్లల పట్ల ప్రజలు అవలంబించిన క్రూరాతి క్రూరమైన వైఖరి! అత్యంత కర్కశమైన దుష్ట సంప్రదాయం!!

ఇస్లాం వచ్చి ఈ అమానుష చర్యను ఎండగడ్తూ శాశ్వతంగా నిషేధించింది. అందరికీ ఉపాధి ఇచ్చేవాడు, రక్షించేవాడు దేవుడు మాత్రమేనని చెప్పి, ఆడపిల్లల సంరక్షణను గొప్ప పుణ్యకార్యంగా పరిగణించింది. ఈ ఘోరపాపానికి పాల్పడేవారు తీవ్రంగా నష్టపోతారని కూడా హెచ్చరించింది.

## ఇస్లాంలో ఆడపిల్లలపై దైవకారుణ్యం

స్త్రీజాతికి జరుగుతున్న ఈ అన్యాయాన్ని అంతమొందించడానికి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈనాటి స్త్రీ విమోచనా ఉద్యమాల్లో ఎలాంటి ప్రత్యేక ఉద్యమాన్ని లేవదీయలేదు. ఆయన ప్రజలలో దైవభీతిని, పరలోక జవాబుదారీ భావనను కలిగిస్తూ స్త్రీ కూడా పురుషుని లాగానే దేవుని సృష్టితం అని, ఆమెకు కూడా పురుషుని మాదిరిగానే సమాన హక్కులు ఉన్నాయని లోకానికి ఎలుగెత్తి చాటి చెప్పారు. బాలికల సంరక్షణపై ఇస్లాం ప్రత్యేక దృష్టి సారించింది. బాలికలను ఉత్తమ రీతిలో పెంచి పోషించినవారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని తెలిపింది. దైవప్రవక్త (సల్లం) వివిధ సందర్భాలలో ఇలా ఉపదేశించారు:

"ఒక వ్యక్తికి ఓ కుమార్తె ఉండి, అతనా బాలికను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి బాధలకు, అవమానాలకు గురిచేయకుండా, ఆమె కంటే కొడుక్కు ఎక్కువ ప్రాధాన్యమివ్వకుండా పోషించేవానికి దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు". (అబూదావూద్)

"ఏ దాసునిపై లేక దాసిపై దేవుడు కుమార్తెల (పోషణ, సంరక్షణల)బాధ్యతను మోపినప్పుడు అతను లేక ఆమె ఆ కుమార్తెల పట్ల మంచిగా ప్రవర్తిస్తారో, ఆ ఆడపిల్లలు అతడ్ని లేక ఆమెను నరకం నుండి కాపాడే సాధనాలుగా మారుతారు." (బుఖారి, ముస్లిం)

"బాలికలను ద్వేషించకండి. వారు దుఃఖితురాళ్లు, ఎంతో విలువయిన వాళ్ళు." (ముస్నద్ అహ్మద్)

ఒకసారి ఆయన "ముగ్గురు కుమార్తెలు లేక ముగ్గురు చెల్లెళ్ళు పెరిగి పెద్ద వారయి ఎవరిమీదా ఆధారపడకుండా ఉండే స్థితికి చేరుకునే వరకూ వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, వారిపట్ల ప్రేమ, వాత్సల్యభావంతో ప్రవర్తించిన వ్యక్తికి దేవుడు విధిగా స్వర్గప్రాప్తి కలిగిస్తాడు" అని బోధించారు.



అప్పుడు ఒకతను "దైవప్రవక్తా! మరి ఇద్దరు ఉంటేనో?" అని అడిగాడు. దానికి ఆయన "అప్పుడు కూడా" అన్నారు. జనం అప్పుడు ఒక్క ఆడపిల్లను గురించి అడిగినా దైవప్రవక్త (సల్లం) అదే సమాధానమిచ్చేవారని ఈ హదీసు ఉల్లేఖకుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ అన్నారు. (షరహ్‌సున్న, తిర్మిజి, అబూదావూద్)

## నరకానికి అడ్డుగోడలు ఆడపిల్లలే

మరోసారి దైవప్రవక్త (సల్లం) హితోపదేశం చేస్తూ "ఏ దాసుడు ఇద్దరు ఆడపిల్లల (సంరక్షణ) బాధ్యత వహిస్తూ వారిని యుక్తవయస్సు వచ్చే వరకు (సరిగా) పోషిస్తాడో, ప్రళయదినాన అతను, నేను (పరస్పరం) ఈవిధంగా వెంట ఉంటాం" అని అన్నారు. హజ్రత్ అనస్ (రజి) ఈ హదీసును ఉల్లేఖిస్తూ దైవప్రవక్త (సల్లం) తన చేతి (రెండు) వ్రేళ్ళను పూర్తిగా కలిపి చూపించారని తెలిపారు. (ముస్లిం)

పై హదీసుల ద్వారా మూడు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఒకటి, తల్లి దండ్రుల సత్ప్రవర్తన ఆడపిల్లల హక్కు. రెండు, ఆడపిల్లల పట్ల సత్భావంతో మెలిగిన తండ్రి లేక తల్లి ప్రళయదినాన దైవప్రవక్త (సల్లం)కు అతి చేరువులో ఉంటారు. మూడు, అతనికి లేక ఆమెకు నరకం నుండి విముక్తి కలిగి స్వర్గప్రవేశం లభిస్తుంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఒక సంఘటన గురించి ఈ విధంగా తెలిపారు:

"ఒకరోజు ఓ (పేద)స్త్రీ ఇద్దరు బాలికల్ని వెంటబెట్టుకొని నా దగ్గరకు యాచించ డానికి వచ్చింది. అప్పుడు నా దగ్గర ఒక ఖర్జూరపండు తప్ప మరేమీలేదు. ఆ ఖర్జూర పండునే నేనామె చేతిలో పెట్టాను. ఆమె దాన్ని తన ఇద్దరు కూతుళ్ళకు చెరి సగం పంచిపెట్టి తను మాత్రం దాన్ని కాస్తయినా రుచిచూడ లేదు. ఆ తరువాత ఆమె లేచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాక దైవప్రవక్త (సల్లం) నాఇంటికి వచ్చారు. నేనాయనకు ఈ సంఘటన గురించి చెప్పాను. అప్పుడాయన ఇలా అన్నారు:

"ఆడపిల్లల (సంరక్షణ బాధ్యత) ద్వారా పరీక్షకు గురిచేయబడిన ఏ మనిష యినా వారి పట్ల మంచిగా ప్రవర్తిస్తే అతని కోసం ఈ బాలికలు నరకానికి అడ్డు (గోడలు)గా తయారవుతారు." (ముత్తఫఖున్ అలైహ్)

పేదలకు దానం చేయడం గొప్ప పుణ్యకార్యం. అది నరకాగ్ని నుండి కాపాడే ముక్తిసాధనం. అందువల్ల 'మీ దగ్గర ఒక ఖర్జూరపు పండయినా ఉంటే దానంచేసి నరకాగ్ని నుండి కాపాడుకోండి' అన్నారు దైవప్రవక్త (సల్లం) అలాంటి "దానాలలో గొప్ప దానం (సదఖా) ఏమిటో మీకు చెప్పనా?" అన్నారు ఆయన ఓసారి తన అనుచరులతో. "తప్పకుండా చెప్పండి దైవప్రవక్తా!" అన్నారు అనుచరులు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా చెప్పారు: "(విడాకులివ్వబడటం వల్లగాని, లేదా వితంతువయినందు వల్లగాని) నీ దగ్గరకు తిప్పిపంపబడిన నీ

కుమార్తెకు నువ్వు తప్ప మరెవరూ సంపాదించిపెట్టేవారు లేనప్పుడు నువ్వామెకు మేలు చేయాలి." (ఇబ్నెమాజ)

## కుమార్తెల పట్ల దైవప్రవక్త (సల్లం) వాత్సల్యం

స్వయంగా దైవప్రవక్త (సల్లం)కూడా తన కుమార్తెలను ఎంతో ప్రేమించేవారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. వారందర్నీ ఆయన ఎంతో అల్లారు ముద్దుగా పెంచారు. వారిలో హజ్రత్ ఫాతిమా (రజి) అందరికన్నా చిన్న కుమార్తె. ఓసారి దైవ ప్రవక్త (సల్లం) ఆమెను గురించి ప్రస్తావిస్తూ "ఫాతిమా నా బంగారుకొండ. ఆమెకు ఎవరైతే కోపం కలిగిస్తారో వారు నాకు కోపం కలిగించినట్టే" అని అన్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి)ను దైవప్రవక్త (సల్లం) ఎంతగా ప్రేమించేవారంటే ఆమె ఇంటికి వస్తే ఆయన ఆమెకు స్వాగతం చెప్పడానికి లేచి నిలబడేవారు. ఆమెను తన పక్కన కూర్చోబెట్టుకొని ప్రేమగా ఆమె నుదుటిని ముద్దాడేవారు. ఎక్కడికైనా ప్రయాణ మయి బయలుదేరితే అందరికన్నా చివర్లో ఆమె దగ్గర్నుంచే వీడ్కోలు తీసుకునేవారు. ప్రయాణం నుంచి తిరిగొచ్చాక అందరికన్నా ముందుగా హజ్రత్ ఫాతిమా (రజి)నే కలుసు కొని ఆమె యోగక్షేమాలు విచారించేవారు.

దైవప్రవక్త (సల్లం) కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)కు ఒక కూతురు ఉంది. ఆ పాప పేరు ఉమామా. దైవప్రవక్త (సల్లం) చిన్నారి ఉమామాను కూడా ఎంతో ప్రేమించేవారు. నమాజు చేయడానికి మసీదుకు వెళ్తే ఆమెను వెంటబెట్టుకునేవారు. ఆయన నమాజు చేస్తున్నప్పుడు ఆ పాప తాతయ్య వీపు మీదికి ఎక్కి కూర్చుంటుంది. దైవప్రవక్త (సల్లం) రుకూ, సజ్దాలు చేయవలసి వచ్చినప్పుడు ఆమెను వీపు మీది నుంచి మెల్లిగా దించి వేస్తారు. రుకూ, సజ్దాల నుంచి లేవగానే ఆ పాప మళ్ళీ తాతయ్య వీపు మీదికి ఎక్కి కూర్చునేది.

## సజీవసమాధి చేసినవారే గుండెలకు హత్తుకున్నారు

దైవప్రవక్త (సల్లం) ఆచరణ, ఆయన చేసిన హితవులతో ప్రభావితులైన ఆయన అనుచరులు ఆడపిల్లల పట్ల ప్రవర్తించిన తీరు కూడా చూడండి:

హజ్రత్ హమ్జా (రజి) ఉహద్ యుద్ధంలో అమరగతి పొందడంతో ఆయన చిన్న కుమార్తె ఉమామా అనాథగా మిగిలిపోతుంది. ఆ పాప బాబాయి బాబాయి అంటూ రాగానే హజ్రత్ అలి (రజి) ఆమెను వళ్ళోకి ఎత్తుకుంటారు. తరువాత ఆ పాపను తన అర్ధాంగి హజ్రత్ ఫాతిమా (రజి)కు అందిస్తూ "ఇదిగో తీసుకో నీ పినతండ్రి కూతుర్ని" అంటారు.

అయితే హజ్రత్ జాఫర్ తయ్యార్ (రజి) అభ్యంతరం చెబుతూ "ఈ పాపతో నాకు రెండు విధాల బంధుత్వం ఉంది. ఈమె నా పినతండ్రి కూతురు. ఈమె పిన్ని నా ఇంట్లో ఉంటున్నది. కనుక ఈ పాపను నా కివ్వండి" అని అంటారు.



హజ్రత్ జైద్ (రజి) ముందుకు వచ్చి "దైవప్రవక్తా! ఈ పాప నాకు లభించాలి. హమ్జా (రజి) నా ధార్మిక సోదరుడు" అని అంటారు. హజ్రత్ అలి (రజి) తన వాదన విన్పిస్తూ "ఈ పాప నా చెల్లెలు, అందరికన్నా ముందు ఈమె నా ఒడిలోకే వచ్చింది. కాబట్టి ఈ పాప నాకే దక్కాలి" అని అంటారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన అనుచరుల హృదయాల్లో అనాథ బాలిక పట్ల పెల్లుబికిన ప్రేమ, సానుభూతుల్ని చూసి పరమానందభరితులవుతారు. ఆ మహ నీయుని అమృత బోధనల ఫలితంగా బాలికలను సజీవసమాధి చేసిన రాతిగుండెలు సైతం మైనంలా కరిగిపోయాయి. ఆ హృదయాల్లో ఇప్పుడు అనాథ బాలికల పట్ల అపార ప్రేమాభిమానలు జనించాయి.

చివరికి దైవప్రవక్త (సల్లం) "పినతల్లి కన్నతల్లితో సమానమవుతుంది. కనుక ఈ పాప జాఫర్ (రజి) ఒడిలోకే వస్తుంద"ని చెప్పి ఈ సమస్యను పరిష్కరించారు.

# 8. కుటుంబ నియంత్రణ

"అజ్ఞానాంధకారంలో పడి తమ సంతానాన్ని హతమార్చినవారు, దేవుడు ప్రసాదిం చిన ఆహారవస్తువుల్ని దేవుని మీద అబద్ధాలుమోపి నిషేధించుకున్నవారు ఘోరంగా నష్టపోతారు. వారు పూర్తిగా మార్గభ్రష్టులై పోయారు." (ఖుర్ఆన్–6:140)

ఇలాంటి అజ్ఞానులు ప్రతి యుగంలో, ప్రతి జాతిలోనూ దారిద్ర్య భయంతో తమ సంతానాన్ని హతమార్చుతున్నారు. కుటుంబ నియంత్రణ పేరుతో నేడు నాగరికులమని చెప్పుకునేవారు మానవజాతిని ప్రపంచంలోకే రానీయకుండా మాతృగర్భంలోనే మట్టు పెడ్తున్నారు. ట్యుబెక్టమీ-వేసక్టమీ ఆపరేషన్ల ద్వారా, మందులు-కండోమ్‌ల ద్వారా పిండో త్పత్తిని అరికడ్తున్నారు. దైవం ప్రసాదించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

## త్రికోణం తెచ్చిన తంటాలు

ప్రజల అజ్ఞానానికి ప్రభుత్వ ప్రోత్సాహం, డాక్టర్ల అత్యుత్సాహం తోడయితే 'త్రికోణం' మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. కొందరు జ్ఞానకాంతిలో కూడా వాస్తవం చూడలేరు. అలాంటివారు పర్యవసానం ముందుకొచ్చినప్పుడు పశ్చాత్తాపం చెందుతారు. డాక్టర్ సుధారాణి కూడా అలాంటి కోవకు చెందిన మహిళే. దాదాపు పాతికేళ్ళ క్రితం నాటి సంఘటన....

నలుగురు ఆడపిల్లల తరువాత ఇప్పుడు మగబిడ్డ పుట్టినందుకు ఆయిషా ఎర్రగా, బుర్రగా ఉన్న ఆ బాబునే మాటిమాటికి చూసుకుంటూ మురిసిపోతోంది.

కాని... పిల్లోడి ఎడంకాలు వేలాడబడి ఉంది. తల్లి గర్భం నుంచే వికలాంగుడిగా పుట్టాడు. బాబును ఇలా వికలాంగుడిగా పుట్టించడంలో దేవుని యుక్తి ఏమయి ఉంటుందోనని తలచి ఆయిషా సరిపెట్టుకుంది.

బిడ్డ వికలాంగుడిగా పుట్టినందుకు ఆపరేషన్ చేసిన సర్జన్ డాక్టర్ సుధారాణి, ఆయిషా పట్ల ఎంతో సానుభూతి వెలిబుచ్చింది.

## నారు పోసినవాడు నీరు పొయ్యడా?

"పోనీలేమ్మ! జరిగిందేదో జరిగిపోయింది. అసలు నేను ఇంతకుముందు కాన్పులోనే ఆపరేషన్ చేయించుకోమని చెప్పాను. మీరేమో వినకపోతిరి. అప్పుడే ఆపరేషన్ చేయించుకొని ఉంటే ఈరోజీ పరిస్థితి ఎదురయ్యేది కాదు" అన్నది ఆమె తన సలహా పాటించనందుకు విచారం వెలిబుచ్చుతూ.

"మీ సానుభూతికి కృతజ్ఞతలు. కాని పుట్టించినవాడే పోషణభారం వహిస్తానని వాగ్దానం చేసినప్పుడు నేనెలా ఆపరేషన్ చేయించుకోనూ? ఇక ఈబాబు సంగతంటారా! దైవం తలచుకుంటే వీడు తల్లిదండ్రులకే కాదు, సమాజానికే సేవ చేయవచ్చు. భవిష్యత్ నిర్ణయం మన చేతుల్లో లేదు కదా!" అన్నది ఆయిషా పెద్దగా చదువుకోకపోయినా.

"అది కాదమ్మా నేననేది. గుమస్తాగా నీ భర్తకు వచ్చే చిన్న జీతంతో ఇంతమంది సంతానాన్ని సాకుతూ చదువులు చదివించడం, నలుగురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం ఈరోజుల్లో మాటలు కాదు. వాటికి తోడు ఇప్పుడీ బాబు కూడా వికలాంగుడయి పుట్టి మీకు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టాడు. సాటి స్త్రీగా నా మాటలు అర్థం చేసుకుంటావనే ఇదంతా చెబుతున్నాను" అన్నది డాక్టర్ సుధారాణి పేషంట్‌ని కన్విన్స్ చేయడానికి ప్రయత్నిస్తూ.

ఆ తరువాత ఆమె ఆయిషా గది నుంచి బయటికి వెళ్ళిపోయింది. సరిగ్గా అదే సమయంలో ఆయిషా భర్త అబ్దుల్లా అటువైపే వస్తూ తలుపు దగ్గర కన్పించాడు. కొడుకు పుట్టాడని తెలియగానే అతను ఆఫీసు వదిలేసి రెక్కలు కట్టుకొని మరీ ఆస్పత్రి ముందు వాలాడు. డాక్టర్ సుధారాణిని చూడగానే సంతోషిస్తూ అన్నాడు:

"కంగ్రాచ్యులేషన్స్ మేడం! మీ సారథ్యంలో ఆపరేషన్ సక్సెస్ అయిందని తెలిసింది. థ్యాంక్యూ డాక్టర్! థ్యాంక్యూ వెరీమచ్!!"

"కాని, సారీ మిస్టర్! మీ బాబు వికలాంగుడిగా పుట్టాడు" అన్నది సుధారాణి.

"ఆసంగతి ఇప్పుడే తెలిసింది. కానివ్వండి ఏం చేస్తాం? అంతా ఆ పైవాడి లీల" అన్నాడు అబ్దుల్లా ఏమాత్రం బాధపడకుండా.

"ఒక కాలు పూర్తిగా వేలాడబడి ఉంది. ఇలాంటి పిల్లవాడు ప్రపంచంలో అసలు పుట్టకపోతే ఎంత బాగుంటుంది!" అన్నది సుధారాణి.

ఈమాటలు విని అబ్దుల్లాకు కన్నీళ్ళ పర్యంతమయింది. ఈనాటి డాక్టర్లు ఇలాంటి మాటలు చెబుతారని అతనికి తెలియకపోదు. కాని ఇలా మొహమ్మీదే



చెబుతారని మాత్రం అతను ఊహించలేక పోయాడు. ఆ బాధను బయటికి వ్యక్త పరచకుండా ప్రశాంత వదనంతో ఇలా అన్నాడు:

"చూడండి డాక్టర్! సంతానం దైవప్రసాదితం. కుంటివాళ్ళయినా, గుడ్డివాళ్ళయినా సంతానం తల్లిదండ్రులకు మంచివాళ్ళే. మీరు పెద్దవారు. పెద్ద చదువులు చదువుకున్నవారు. ప్రతి విషయాన్నీ లాభనష్టాల దృష్టితో చూస్తారు. కాని **దేవుడు ఏ మానవుణ్ణీ ఒక లక్ష్యమంటూ లేకుండా పుట్టించడు.** ఈ పిల్లవాడి పుట్టుకలో కూడా ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. ఏమైనాసరే మా అన్వర్‌ని డాక్టర్‌ని చేయాలని ఉంది. దైవచిత్తమయితే మా బాబు తప్పకుండా డాక్టర్ అన్వర్‌గా ప్రసిద్ధిచెందుతాడు."

సుధారాణికి ఈ వేదాంతం మింగుడు పడలేదు. అంచేత ఆమె మారుమాట్లాడకుండా "వీళ్ళదంతా చాదస్తం, పైగా కొడుక్కి పేరు కూడా ముందే పెట్టుకున్నారు" అని గొణుక్కుంటూ స్టాఫ్ రూంకేసి నడిచింది.

"హల్లో సుధా! కంగ్రాచ్యులేషన్స్!! సర్జరీ సక్సెస్ అయిందటగా!" అన్నది సివిల్ సర్జన్ డాక్టర్ ఖైసర్ బేగం ఆమెను చూడగానే అభినందిస్తూ.

"థ్యాంక్యూ! నీలాంటి ఫ్రెండ్స్ సలహాల వల్ల సక్సెస్ అయింది."

"మొత్తానికి తొలి అనుభవంలోనే విక్టరీ కొట్టేశావు, టెన్నిస్ స్టార్ స్టెఫీగ్రాఫ్‌లా. తొందర్లోనే పైకొస్తావు. విష్ యూ స్పీడ్ ప్రోగ్రెస్ అండ్ ఎర్లీ ప్రమోషన్! సరే, ఇంతకూ పార్టీ ఏమైనా ఉందా లేదా?"

"ష్యూర్ ష్యూర్, తప్పకుండా ఇస్తాను. కాని ఆ 'పార్టీ' గురించే నేను చాలా సేపటి నుంచి ఆలోచిస్తున్నాను" అన్నది సుధారాణి.

## ఏది చాదస్తమో కష్టాలెదురైనప్పుడే తెలుస్తుంది

"ఏమయింది ఆ పార్టీకి?" ఆత్రంతో అడిగింది ఖైసర్ బేగం.

"ఒట్టి చాదస్తపు మనుషులు. చెప్పేది కాస్త కూడా అర్థం చేసుకోరు. అదేమంటే దేవుడు, దయ్యం అని ఒకటే సోది. నేనేదో వాళ్ళ మేలు కోరి చెబితే నన్నే వాళ్ళు తమ వేదాంతంలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు" అన్నది సుధారాణి విసుక్కుంటూ.

"అసలు విషయం ఏమిటే? ట్యూబెక్టమీ చేయించుకోవడానికి ఇష్టపడలేదనా?"

"వాట్ డూ యు మీన్!" సీరియస్ అయిపోయింది సుధారాణి.

"ఐ మీన్ ఇటీస్ మోర్ అండ్ మోర్ నెసెసరి ఇన్ దీజ్ డేస్, ఎస్పెషల్లీ ఇన్ అవర్ ఇండియా. సరే, ఇంతకూ ఏమయిందో ఏకరవు పెట్టూ" అన్నది ఖైసర్ బేగం.

"నేను లోగడ కాన్పులోనే ట్యూబెక్టమీ చేయించుకోమని చెబితే వినలేదు. దాని పర్యవసానం ఇప్పుడు చవిచూశారు. ఆవిడ కుంటి పిల్లోడ్ని కన్నది. ఆ విషయాన్నే

గుర్తు చేస్తే ఈ కుంటి పిల్లోడి పుట్టుకలో కూడా ఏదో దేవుని యుక్తి ఉండవచ్చని ఆ దంపతులు తెగ సంబరపడిపోతున్నారు. ఇలాంటి మూఢులు ఉండబట్టే దేశంలో జనాభా అదుపు లేకుండా పెరిగిపోతోంది'' అన్నది సుధారాణి అసహనంగా.

## ఖుర్‌ఆన్ వీరికి మొదటి ప్రాణం

"ఈ ముస్లింలు ఒక పట్టాన తమ నమ్మకాలు వదులుకోలేరే! ఒకవైపు దారిద్ర్య రేఖకు క్రిందికి దిగజారుతున్నా గంపెడు పిల్లలు కావాలి. ఖుర్‌ఆన్ వీరికి మొదటి ప్రాణం. ఆ తర్వాతే ఏదైనా'' అన్నది ఖైసర్ బేగం ఆమెను సమర్థిస్తూ.

''మరి ఖురాన్‌లో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోకూడదని ఉందా?''

"అఫ్‌కోర్స్, అలా అని స్పష్టంగా లేదనుకో. అయినా ఈ విషయంలో ధార్మిక తీర్పులు ఇవ్వడానికి మనం అర్హులం కాముకదా!"

"అయితే అర్హులైనవాళ్ళు తీర్పులిస్తే నువ్వు ఒప్పుకుంటావన్న మాట!" అంటూ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది సుధారాణి.

"అలా గుడ్డిగా ఒప్పుకునేంత చాదస్తపురాల్ని కానులే, భయపడకు. ఎమైనా మరో సెంచరీదాకా మన దేశం ఈ మతపిచ్చి నుండి బయటపడేలా లేదు. సుధా! నువ్వు నమ్మూ నమ్మకపో. నమ్మకం అనేది ఎలాంటిదైనా అది నమ్మకమే. మనం దానిజోలికి పోకపోవడమే మంచిదేమో అన్పిస్తోంది నా మట్టుకు'' అన్నది ఖైసర్ బేగం.

"నీ వరస చూస్తుంటే ఎప్పుడో ఒకప్పుడు నువ్వు కూడా ఈ ఊబిలోకి దిగేలా కన్పిస్తున్నావు'' చురక అంటించింది సుధారాణి.

"వాట్ నాన్‌సెన్స్ యు ఆర్ టాకింగ్! ఫ్యాక్ట్ చెప్పినంత మాత్రాన నన్ను మత చాదస్తంలోకి నెట్టేస్తావా? అలా అయితే ఇక మన చదువులకు సార్థకం ఏమిటీ?'' అన్నది ఖైసర్ బేగం కాస్తంత సీరియస్‌గా.

"సరేలే తల్లీ! చాలించిక ఈ టాపిక్. ఇవ్వాళ నేను కాస్త పెందలాడ ఇంటికి వెళ్ళాలి. ఈరోజు శ్రీవారితో సినిమాప్రోగ్రాం ఉంది. వస్తా మరి, బై బై'' అని స్టైతస్కోపు ఊపుకుంటూ బయటికి పరుగెత్తింది డాక్టర్ సుధారాణి పరుగులరాణి ఉషాతో పోటీ పడ్తున్నట్లుగా.

సుధారాణి ఆధునిక సమాజంలోని అభ్యుదయ భావాలన్నీ పుణికిపుచ్చుకున్న స్వేచ్ఛాజీవి. దేశంలో నానాటికీ జటిలమవుతున్న జనాభా సమస్యను గురించే ఆమె ఎల్లప్పుడూ ఆందోళనపడుతుంటుంది. కొన్నాళ్ళ తర్వాత సమాజానికి తన వంతు సేవ చేద్దామన్న ఆదర్శంతో ఆమె కావాలని మరీ ఫ్యామిలీప్లానింగ్ విభాగంలో డ్యూటీ వేయించుకుంది.



కాని విచిత్రమేమిటంటే పెళ్ళయి అయిదేళ్ళు గడిచినా ఆమెకు సంతానం కలగ లేదు. తర్వాత వరుసగా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. తన ఆదర్శాన్ని ఆచరణలో పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఆ ఇద్దరితోనే తృప్తిపడదామనుకుంది మొదట్లో. కాని అంత రంగంలో అణగివున్న **ఆమె మాతృత్వం ఒక మగబిడ్డ కోసమైనా వేచిచూడమని ప్రాధేయపడింది.** దాంతో ఆమె ఆపరేషన్ చేయించుకునే ఆలోచనను తాత్కాలికంగా విరమించుకుంది.

ఈ నిరీక్షణలో మరో అయిదేళ్ళు ఇట్టే గడచిపోయాయి. ఈలోగా ఆ ఇద్దరు ఆడ పిల్లలు కూడా కలరా సోకి ఆమెను వీడిపోయారు. రెండేళ్ళ తర్వాత ఆర్నెల్ల గర్భవతిగా ఉన్నప్పుడు ఆమె భర్త కూడా కేన్సర్ వ్యాధితో కాలం చేశాడు. వెనువెంట జరిగిన ఈ విషాద సంఘటనలు ఆమెను బాగా క్రుంగదీశాయి. చివరికి పండంటి బాబు పుట్టడం తో ఆమె దిగులు కాస్తా దూరమైపోయింది. ఆ అబ్బాయి మీదే తన ఆశలన్నీ పెంచు కుంటూ ప్రశాంత జీవితం గడపసాగింది.

కాలం సుధారాణి జీవితంలోని ఎగుళ్ళు దిగుళ్ళతో నిమిత్తం లేకుండా తన డ్యూటీ ప్రకారం గంటకు అరవై నిమిషాల వేగంతో పరుగిడుతూనే ఉంది. కాలం వెంట సుధా రాణి కొడుకు కూడా పరుగెత్తుతూ ఏడో తరగతిలో ప్రవేశించాడు.

ఒకరోజు ఆ అబ్బాయి స్కూల్ నుంచి తిరిగొస్తుంటే ఓ టూరిస్టు బస్సు రోడ్ డివైడర్ దాటి వచ్చి అతడ్ని ఢీకొన్నది. తలకు, ఒక చేతికి బలమైన గాయాలయ్యాయి. తల ఆపరేషన్ చేయాల్సి వస్తుందని అన్నారు డాక్టర్లు. ఆ రోజు మొట్టమొదటి సారిగా సుధారాణికి దేవుడు గుర్తుకొచ్చాడు. "దేవా! ఆపరేషన్ సక్సెస్ అయ్యేలా చేసి నా ఆశా జ్యోతిని కాపాడు ప్రభూ!'' అంటూ ఆమె చేతులు జోడించింది.

రెండవరోజు ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ థియేటర్ నుంచి డాక్టర్ శివకుమార్ బయటికి రాగానే సుధారాణి పరుగెత్తుకెళ్ళి అడిగింది "ఆపరేషన్ సక్సెస్ అయిందా డాక్టర్!'' అని.

"బాబు ప్రాణం కాపాడటంలో మాత్రం మేము విజయం సాధించగలిగాం. కాని అతని కళ్ళనే కాపాడలేక పోయాం. వెరీసారీ!'' అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

## కళ్ళకున్న గంతలు తీసి చూడు

సుధారాణికి ఒక్కసారిగా ప్రపంచమంతటా చీకటి ఆవరించినట్లు అన్పించింది. స్వయంగా తన కళ్ళకే అంధత్వం వచ్చినట్లు ఫీలయింది. హఠాత్తుగా పాతికేళ్ళ క్రితం తాను ఆపరేషన్ చేసి తీసిన కుంటి పిల్లవాడు ఆమె మదిలో మెదిలాడు. "కుంటివాళ్ళ యినా, గుడ్డివాళ్ళయినా సంతానం తల్లిదండ్రులకు మాత్రం మంచివాళ్ళే'' అన్న అతని తండ్రి మాటలు ఆమె చెవిలో ప్రతిధ్వనించాయి. ఆ పిల్లవాడ్ని గురించి ఆరోజు హేళనగా మాట్లాడినందుకు ఈరోజు పశ్చాత్తాప పడుతోంది.

సుధారాణి ఈ పరిస్థితిని సహనంతో ఎదుర్కోవాలనుకుంది. కొడుకు కంటిచూపు కోసం పేరుమోసిన అనేకమంది డాక్టర్ల దగ్గర చికిత్స చేయించింది. ఎన్నో మందులు వాడిచూసింది. కాని ఫలితం లేకపోయింది. ఓరోజు ఉదయాన్నే ఖైసర్ బేగం వచ్చి ఓ కొత్త వార్త విన్పించింది.

"మన సిటీకి కొత్తగా అన్వర్ మహ్మూద్ అని ఓ ఫేమస్ స్పెషలిస్టు వచ్చాడట. ఇలాంటి కేసుల్ని కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నాడని విన్నాను. మన బాబుని ఓసారి అతనిక్కూడా చూపిస్తే బాగుంటుందేమో!"

ఖైసర్ బేగం చెప్పిన మాటలు వినగానే సుధారాణిలో ఆశలు మళ్ళీ చిగురిఁచాయి. కాని ఆమె అంతకు రెండురోజుల క్రితం నుంచే ఫ్లూ జ్వరంతో చాలా బాధపడుతోంది. అందువల్ల ఖైసర్ బేగమే బాబును డాక్టర్ అన్వర్ మహ్మూద్ దగ్గరికి తీసికెళ్ళి చూపించింది.

ఆ డాక్టర్ పరీక్షించి చూపు వస్తుందని చెప్పాడు. నిర్ణీత తేదీ ప్రకారం ఆపరేషన్ జరిగే రోజు కూడా ఖైసర్ బేగమే బాబును డాక్టర్ దగ్గరికి పిలుచుకెళ్ళింది. సుధారాణి ఆరోజు కూడా హాస్పిటల్‌కు వెళ్ళలేక పోయింది.

ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. బాలుడికి చూపు వచ్చింది. ఆరోజు సుధారాణి ఆనందం అవధులు దాటింది. ఆమె హృదయం దైవంపట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. జ్వరం నుంచి కాస్త కోలుకోగానే కొడుకును తీసుకొని కొత్త డాక్టర్‌కు కృతజ్ఞతలు చెప్పడానికి అతని ఇంటికి వెళ్ళింది.

ఎవరో పనిమనిషి కాబోలు గేటు తెరచి సుధారాణిని లోపలికి పిలుచుకెళ్ళింది. "అయ్‌గోరు బోంచేస్తున్నారు, కాసేపు ఈ గదిలో కూకోండి" అని చెప్పి ఆమె లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. సుధారాణి డ్రాయింగ్ రూంలో సోఫా మీద కూర్చొని డాక్టర్ కోసం ఎదురుచూడసాగింది.

అయిదు నిమిషాల తరువాత లోపలి నుంచి ఆరడుగుల అందమైన యువకుడు ఒకడు కృత్రిమ కాలుతో "గుడ్‌మార్నింగ్ మేడం!" అంటూ డ్రాయింగ్ రూంలో అడుగు పెట్టాడు. అంతే..... సుధారాణికి వెంటనే మాట పెగలక నోరుతెరచి ఆ యువకుడి వంకే తదేకంగా చూస్తూ ఉండిపోయింది.

☮-☮-☮-☮-☮

ఇప్పుడు పాఠకులకు ఆ యువకుడెవరో అర్థమైందనుకుంటాను. సుధారాణికి కొడుకు మీద ఎంత ప్రేముందో చూడండి! అదే కూతురైతే....? ఆమె సంగతేమిటో గాని, సాధారణంగా మన మహిళలకు మగపిల్లల మీదున్నంత ప్రేమ ఆడపిల్లల మీద ఉండదు. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోవడానికి ఇది మొదటి కారణం. ఇతర కారణాలు ఇక్కడ అప్రస్తుతం.



## పెరుగుతున్న భ్రూణ హత్యలు

గర్భస్థ పిండం ఆడశిశువా లేక మగశిశువా అని తెలుసుకోవడానికి ఇప్పుడు లింగ నిర్ధారణ పరీక్షలు వచ్చాయి. అయితే ఈ పరీక్షల ద్వారా కడుపులోని పిండం ఆడశిశువు అని తెలియగానే దాన్ని గర్భవిచ్ఛిత్తి (అబార్షన్) చేయించి తీసేస్తున్నారు.

మన దేశంలో ఈ పరీక్షలను దుర్వినియోగం కాబడకుండా ఉండేందుకు 1972లో "మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్" అనే చట్టం ఉనికిలోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇతర వైద్యసంస్థల్లో గర్భస్థ పిండం శారీరకంగాగాని, మానసికంగాగాని దెబ్బతిని ఉందని తేలినప్పుడు మాత్రమే అబార్షన్‌లు చేయించుకోవాలి. కాని ఈ చట్టాన్ని పట్టించుకునే నాథుడే లేడు. ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు.

ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, చెన్నయి లాంటి మెట్రోపాలిటన్ నగరాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే అబార్షన్ క్లినిక్కులు క్రమంగా పెరిగిపోతున్నాయి. ప్రజలు ఎంత ఫీజయినా చెల్లించి అబార్షన్‌లు చేయించుకుంటూ ఆడశిశువుల్ని కళ్ళు తెరవక ముందే హతమారుస్తున్నారు. ఈ హత్యలసంఖ్య ఏటా పెరుగుతూ ఇప్పుడు వేల నుంచి లక్షలకు చేరుకుంది. 1989-90 మధ్యకాలంలో ఒక్క ముంబాయి నగరంలోనే ఏడువేల మంది ఆడశిశువుల్ని అబార్షన్ ద్వారా హతమార్చడం జరిగింది.

లింగనిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువుల్ని మాతృగర్భంలోనే మట్టుపెట్టే వ్యాధి అత్యధిక జనానాగల భారత్, చైనాలలోనే గాకుండా ఐరోపా, అమెరికా దేశాలలో కూడా సర్వసామాన్యమైపోయింది. పదేళ్ళ క్రితంనాటి 'న్యూయార్క్ టైమ్స్' నివేదిక ప్రకారం అమెరికాలో ఉంటున్న భారతీయ సంతతికి చెందిన తల్లిదండ్రులకు 99 శాతం మగపిల్లలే పుడుతున్నారట! తమకు సంతానం కనే హక్కు ఎలాఉందో అబార్షన్ చేయించుకునే హక్కు కూడాఉందని అమెరిక మహిళలు బల్లగుద్ది చెబుతున్నారట!!

చైనాపౌరులకు ఒక్కబిడ్డ కన్నా ఎక్కువమందిని కనే హక్కు లేదు. అయినా అక్కడ జనాభా తామరతంపరగా పెరిగిపోతూనే ఉంది. చైనాప్రజలు ఆ ఒక్కబిడ్డ మగబిడ్డయితే బాగుంటుందని భావించి ఆడశిశువుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. ఈ పరిస్థితి ఎంత తీవ్రరూపం దాల్చింది అంటే ఈనాడు కొన్ని రాష్ట్రాల్లో స్త్రీజనాభా విపరీతంగా తగ్గిపోయి మగపిల్లలకు పెళ్ళిళ్ళు కావడమే గగనమయి పోయింది. ఇలాంటివే ఇంకా అనేక సమస్యలు అక్కడ ఎదురవుతున్నాయి.

## నిష్ఫలన సంపర్కం చేయవచ్చా?

పూర్వం అరబ్బులు సంతానోత్పత్తిని అరికట్టేందుకు సంపర్క సమయంలోనే వీర్యం స్త్రీ గర్భంలోకి పోకుండా నిరోధించేవారు. దైవప్రవక్త (సల్లం) ఈ చర్య పట్ల అయిష్టత వెలిబుచ్చుతూ **"ప్రళయం వరకు పుట్టవలసిన పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ పుట్టితీరుతారు"** అన్నారు.

దైవప్రవక్త (సల్లం) అనుచరులు కొందరు నిష్ఖలన సంపర్కం గురించి ప్రస్తావిస్తూ "దైవప్రవక్తా! సంపర్కం తర్వాత స్త్రీ గర్భం దాల్చకుండా ఉండేందుకు మేమేదైనా పని చేయవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "మీరు నిష్ఖలనసంపర్కం చేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. దేవుడు ఏ మానవుణ్ని పుట్టించాలని విధివ్రాతలో రాశాడో అతను ఎలాగూ పుట్టితీరుతాడు" అన్నారు. (బుఖారి)

ప్రవక్త అనుచరుడొకాయన నిష్ఖలన సంపర్కం గురించి ప్రస్తావిస్తూ, ఇలా చేయ వచ్చా? అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"ప్రతి వీర్యబిందువు ద్వారా పిల్లవాడు పుట్టాల్సిన అవసరం లేదు. దేవుడు ఎవరి నైనా పుట్టించదలచుకుంటే ఆయన నిర్ణయాన్ని ఏ యుక్తీ అడ్డుకోజాలదు." (ముస్లిం)

ఆనాడు అరబ్బులు పాలు తాగే పిల్లవాడికి తల్లిపాల వల్ల నష్టం కల్గుతుందన్న భయంతో ఆమెతో సంభోగిస్తున్నప్పుడు వీర్యం లోపలికి పోకుండా చేసేవారు. కాని దైవ ప్రవక్త (సల్లం) అలా చేయడాన్ని కూడా ఇష్టపడలేదు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి అనేకమంది అనుచరుల మధ్య కూర్చొని మాట్లాడుతూ "స్త్రీ బిడ్డకు పాలిచ్చే కాలంలో భర్త ఆమెతో సంభోగించడంపై నేను మొదట్లో ఆంక్ష విధించాలనుకున్నాను. కాని రోమన్లు, పారసీలు ఈవిధంగా చేస్తున్నప్పటికీ వారి పిల్లలకు ఎలాంటి నష్టం వాటిల్లక పోవడం నేను గమనించాను" అని అన్నారు. ఆ తరువాత అనుచరులు నిష్ఖలన సంపర్కం గురించి అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా సమాధానమిచ్చారు:

"నిష్ఖలన సంపర్కం చేయడమంటే పరోక్షంగా (బిడ్డను) సజీవసమాధి చేయడమే. ఈ పని 'సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏతప్పు వల్ల చంపబడ్డావని అడిగి నప్పుడు...' (ఖుర్‌ఆన్-81:8) అనే సూక్తి లాంటిదే." (ముస్లిం)

## పరలోకపు జవాబుదారీ భావన

మనిషి మరణానంతరం తన కర్మలకు తాను ఎవరిముందూ బాధ్యుడు కానని భావించినప్పుడు ఎలాంటి దుష్కార్యానికైనా పాల్పడతాడు. అందుకే ఇస్లాం ఏకేశ్వరుడి పట్ల, ఆయనప్రవక్త పట్ల విశ్వాసం ప్రకటించిన తరువాత మానవుడు మరణానంతరం పరలోకంలో తన కర్మలకు ప్రతిఫలం అనుభవించవలసి వస్తుందని తెలియజేస్తూ పరలోక విషయాల్ని కూడా విశ్వసించాలని చెబుతోంది. దుష్కర్మలకు నరక శిక్షలు చవిచూడవలసి ఉంటుందన్న భయముంటే మనిషి దుష్కార్యాలకు పాల్పడేందుకు సాహసించలేడు.

నేడు ప్రజలు అనుసరిస్తున్న రకరకాల కుటుంబనియంత్రణ పద్ధతుల ద్వారా కూడా మగశిశువుల సంఖ్య కంటే ఆడశిశువుల సంఖ్యే ఎక్కువగా తగ్గిపోతోంది. ఈ వివక్ష అరేబియాలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రభవించక పూర్వం



మరింత ఎక్కువగా ఉండేది. దైవప్రవక్త (సల్లం) వారిని ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా నయాన భయాన ఎంతగానో నచ్చజెప్పారు. ముఖ్యంగా ఖుర్‌ఆన్‌లోని పరలోకపు జవాబుదారీ భావన, పరలోక దుష్పరిణామాలను గురించి తెలియజేసి వారిని తీవ్రంగా హెచ్చరించారు. ఈక్రింది సూక్తి చూడండి:

"సూర్యుడు నిస్తేజమై చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరి కాంతి కోల్పోయి నప్పుడు, పర్వతాలు కదలి నడచినప్పుడు, పది నెలల సూడి ఒంటెలు వాటి మానాన వదలివేయబడినప్పుడు, క్రూరమృగాలు (భీతావహంతో) ఒకచోట గుమి గూడినప్పుడు, సముద్రం (ఉప్పొంగి తీవ్రంగా) ప్రజ్వరిల్లినప్పుడు, ఆత్మలు (దేహాలతో) అనుసంధానం చేయబడినప్పుడు, **సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏ తప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు,** కర్మలచిట్టా తెరవబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు, నరకం దహించబడినప్పుడు, స్వర్గం సమీపానికి తేబడినప్పుడు– ఆ...అప్పుడు ప్రతి మనిషికీ తానేమి వెంట తెచ్చుకున్నాడో (స్పష్టంగా) తెలుస్తుంది." (ఖుర్‌ఆన్-81:1-14)

ఈ సూక్తులు ఆనాడు అరబ్బు సమాజంలో పెద్ద సంచలనం సృష్టించాయి. ఇస్లాం స్వీకరించని బహుదైవారాధకులు సైతం ఆడపిల్లల్ని సజీవసమాధి చేయడానికి భయపడటం మొదలెట్టారు. ఆ తరువాత అనతికాలంలోనే ఈ వ్యవహారం గురించి అరబ్బులో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. వారు ఆడపిల్లల్ని మగపిల్లలతో పాటు సమానంగా చూసుకోవడం ప్రారంభించారు. రెండే రెండు దశాబ్దాలలో స్త్రీస్వాతంత్ర్య ప్రభంజనం అరేబియా దశదిశలా వీచి యావత్తు స్త్రీజాతినే ఆశ్చర్యపరిచింది.

# 9. వివాహ నిషిద్ధ స్త్రీలు

నా చిన్నతనంలో మా దూరపు బంధువుల్లో ఒక వితంతువుకు జరిగిన వివాహం గురించి ఇప్పుడు ఆలోచిస్తుంటే నా హృదయం మూగగా రోదిస్తోంది. నా బాధ ఆ స్త్రీకి పునర్వివాహం అయిందని కాదు. ఆమెను చేసుకున్న పురుషునికి అంతకుముందే ఒక భార్య ఉందని కూడా కాదు. ఆ ఇద్దరు మహిళలు సొంత అక్కచెల్లెళ్ళయి ఉండి కూడా ఒకరికొకరు సవతులయి పోయారే అన్నదే నా బాధ. ఒక పురుషుడు ఏకకాలంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళను భార్యలుగా ఏలడాన్ని ఇస్లాం నిషేధించింది. ఆ చర్య ఘోరమైన పాపం. ఇలాంటి పాపపంకిలంలో కూడా పడిపోయారే మన స్త్రీలు అన్నదే నా విచారం.

## అజ్ఞానం పాపకూపంలోకి నెడ్తుంది

ధర్మవిద్య అంతగాలేని మారుమూల గ్రామాల్లో ఇలాంటి ఘోరాలు నేటికీ జరుగు తున్నాయి. ప్రాపంచిక విద్యాపరంగా గ్రామాలకు సైతం ఉన్నత పాఠశాలలు, కళాశాలలు విస్తరిస్తున్న నేటికాలంలో ధర్మవిద్య కూడా వృద్ధిచెందవలసింది పోయి అది మరింత క్షీణిస్తూ పోవడం చాలా శోచనీయం. ఇలాంటి పరిస్థితుల్లో అజ్ఞానానికి స్వార్థం కూడా

తోడయితే ఫలితాలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో చెప్పనవసరం లేదు. అందుకే ప్రతి ముస్లిం పురుషుడైనా, స్త్రీ అయినా విధిగా విద్య నేర్చుకోవాలని ఇస్లాం చెబుతోంది. చదవడం నేర్చుకున్న మహిళలు ఇస్లాం గురించి కూడా కనీస విషయాలనైనా తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

ఇస్లాం దృష్టిలో నికాహ్ (వివాహం) ఓ పవిత్రమయిన బంధం. ఈ పవిత్రబంధం కోసం పురుషుడు ఏ స్త్రీని బడితే ఆ స్త్రీని వివాహమాడటాన్ని ఇస్లాం అంగీకరించదు. దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) అనుమతించిన స్త్రీలను మాత్రమే వివాహం చేసుకోవలసి ఉంటుంది. వారిని తప్ప ఇతర స్త్రీలను వివాహమాడటం నిషిద్ధం, ఘోరమైన పాపం. అందువల్ల వివాహం కోసం ఇస్లాం ఏఏ స్త్రీలను ధర్మసమ్మతం చేసిందో తెలుసుకోవాల్సిన బాధ్యత వివాహమాడ దలచిన ప్రతి యువతీ యువకునిపై కూడా ఉంది. అలా తెలుసుకోక పోతే ఒక్కొక్కసారి పెద్దలు చేసే పొరపాటులో సంబంధిత యువతీ యువకులు కూడా భాగస్థులయ్యే ప్రమాదం ఉంది.

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమయిన పవిత్ర సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమయిన కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుంది. దీని వల్ల కుటుంబంలోనేగాక, మొత్తం సమాజంలో అశాంతి ఏర్పడుతుంది; సుఖవ్యాధులు ప్రబలుతాయి; హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతాయి. భయంకరమైన ఈ రుగ్మతలను నివారించడానికి ఇస్లాం పటిష్ఠమైన వివాహవ్యవస్థ నెలకొల్పదలచింది.

“ఆయన భూమ్యాకాశాలకు సృష్టికర్త. ఆయనే మీ జాతి నుండి మీకు తోడుగా జంటల్ని పుట్టించాడు.” (ఖుర్‌ఆన్‌-42:11)

దివ్యఖుర్‌ఆన్‌లో ‘నిసా’ (స్త్రీలు) అనే అధ్యాయంలోని 22, 23 సూక్తులలో వివాహ మాడకూడని స్త్రీల జాబితా ఒకటి ఉంది. 22వ సూక్తిలో దైవదౌత్యానికి పూర్వం అరబ్బులు అజ్ఞానంతో తండ్రుల మరణానంతరం తమ సవతితల్లులను వివాహమాడే దురాచారాన్ని ఖండిస్తూ, ఇకముందు అలాంటి చేష్టలకు పాల్పడకూడదని ఇది అవాంఛనీయమైన అశ్లీలపు చేష్ట అని హెచ్చరించడం జరిగింది. ఆ తరువాత 23వ సూక్తిలో పేర్కొనబడిన మిగతా నిషిద్ధ స్త్రీల వివరాలు ఇలా ఉన్నాయి:

## పురుషుడు పెండ్లాడకూడని స్త్రీలు

“మీ (1)తల్లులు, (2)కుమార్తెలు, (3)అక్కాచెల్లెళ్ళు, (4)మేనత్తలు, (5)పినతల్లులు, (6)పెత్తల్లులు, (7)మేనకోడళ్ళు, (8)సోదరకుమార్తెలు, (9)మీకు పాలుపట్టిన స్తన్య సంబంధ తల్లులు, (10)మీరు పాలు పంచుకున్న స్తన్యసంబంధ సోదరీలు, (11)మీ భార్యల తల్లులు, (12)మీతో లైంగికసంబంధం ఏర్పడిన మీభార్యలకు (గతభర్తల ద్వారా) పుట్టి మీసంరక్షణలో పెరిగిన కుమార్తెలు - మీకు నిషేధించబడ్డారు. (వీరిని మీరు వివాహమాడరాదు.)”



“పోతే, మీతో లైంగిక సంబంధం ఇంకా ఏర్పడకుండా (పెళ్ళి మాత్రమే జరిగి) ఉంటే (అలాంటి భార్యల్ని వదలి వారి కుమార్తెల్ని చేసుకోవడంలో) ఎలాంటి తప్పు లేదు. ఇక (13) కన్నకొడుకుల (వితంతువులైన లేక విడాకులు పొందిన) భార్యలు (అంటే కోడళ్ళు) కూడా మీకు నిషేధించబడ్డారు. అంతేకాదు, (14) ఒక వివాహ బంధంలో (ఏకకాలంలో) ఇద్దరు అక్కాచెల్లెళ్ళను ఉంచడం కూడా నిషిద్ధమే. లోగడ జరిగిందేదో జరిగిపోయింది. దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు.”

“ఇక (యుద్ధంలో) మీ చేతికి చిక్కిన స్త్రీలు తప్ప (15) ఇతరులు వివాహమాడిన స్త్రీలు కూడా మీకు నిషేధించబడ్డారు. ఇది దైవశాసనం. దాన్ని పాటించడం మీ విధ్యుక్త ధర్మం.” (దివ్యఖుర్‌ఆన్‌-4:23,24)

ఈ సూక్తిలో పురుషుని వివాహానికి నిషేధించబడిన స్త్రీలతో పాటు కొన్ని హదీసుల్ని బట్టి ఈ క్రింది స్త్రీలు కూడా నిషేధించబడ్డారు:

(1)మారు(సవతి) తల్లులు, (2)మారుకుమార్తెలు, (3)మనుమరాళ్ళు, (4)మారుతల్లి కుమార్తెలు, (5)మారుసోదరీలు), (6)మారుతండ్రి కుమార్తెలు (మారుసోదరీలు), (7)మారుమేనత్తలు, (8)మారుపినతల్లులు, (9)మారుపెత్తల్లులు, (10)మారు మేన కోడళ్ళు, (11)మారుసోదర కుమార్తెలు. (12)మారుసోదరి కుమార్తెలు.

ఇక్కడ సూత్రప్రాయమైన ఒక విషయాన్ని గుర్తుంచుకోవడం ఎంతో అవసరం. ఈ సూక్తిలో పురుషుని వివాహానికి నిషేధించబడిన స్త్రీలలో (1)రక్తసంబంధ స్త్రీలు, (2)సవతి సంబంధ స్త్రీలు, (3)స్తన్యసంబంధ స్త్రీలు అని మూడురకాల సంబంధాలున్నాయి. పురుషుడు వివాహానికి ముందు ఈ మూడు సంబంధాలను పరిశీలించి, వాటి పరిధిలోకి రాని స్త్రీని మాత్రమే వివాహమాడాలి.

23వ సూక్తిలోని తల్లులకు సంబంధించిన నిషేధాజ్ఞలో అమ్మమ్మలు, నాయనమ్మలు కూడా చేరిఉన్నారు. అలాగే ఈసూక్తిలోని కుమార్తెలకు సంబంధించిన నిషేధాజ్ఞలో మనుమరాళ్ళు కూడా చేరిఉన్నారు. అంటే మనుమరాళ్ళను వివాహమాడటం కూడా నిషిద్ధమే నన్నమాట. ఈ నిషేధాజ్ఞలో రక్తసంబంధమైన మనుమరాళ్ళతో పాటు, స్తన్య సంబంధమైన మనుమరాళ్ళు, సవతి సంబంధమైన మనుమరాళ్ళు కూడా ఉన్నారు.

## అక్రమ సంతానం సమస్య

పోతే తండ్రితో అక్రమ సంబంధం ఏర్పడిన స్త్రీని కొడుకు వివాహమాడవచ్చా లేదా అనే విషయంలో ధర్మవేత్తల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నాయి. కొందరు అలాంటి స్త్రీలను వివాహమాడటంలో తప్పు లేదంటున్నారు. మరికొందరు అది కూడా నిషిద్ధమేనని చెబుతున్నారు. పైగా తండ్రి కామేచ్ఛతో తాకిన స్త్రీని సైతం కొడుకు పెళ్ళాడటం వారి దృష్టిలో నిషిద్ధమే. అదేవిధంగా కొడుకుతో అక్రమ సంబంధం ఏర్పడిన స్త్రీని తండ్రి పెళ్ళాడే విషయంలో కూడా ధర్మవేత్తలలో భేదాభిప్రాయాలు ఉన్నాయి.

ఇక కొడుకు లేక కూతురి అక్రమసంబంధం వల్ల పుట్టిన బాలికను వివాహమాడ వచ్చా లేదా అనే విషయంలో కూడా ధర్మవేత్తల మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయి. హ్జజత్ ఇమాం అబూహనీఫా(ర) అభిప్రాయం ప్రకారం అలాంటి అక్రమసంబంధం వల్ల కలిగిన బాలిక కూడా కన్నకూతురిలా నిషిద్ధ స్త్రీయే. ఆమెను కూడా చేసుకోకూడదు.

పై సూక్తిలో ప్రస్తావించబడినట్లు పురుషుడు ఏ స్త్రీ పాలు త్రాగాడో ఆ స్త్రీ కుమార్తెలు, తన తల్లి పాలు త్రాగిన ఇతర స్త్రీలు కూడా అతని వివాహానికి నిషేధించబడ్డారు. అలాగే ఒక భార్య ఉండగానే ఆమె సోదరీని వివాహమాడటం కూడా నిషిద్ధమే.

## స్తన్యసంబంధాన్ని గుర్తుంచుకోవాలి

కొందరు అజ్ఞానం వల్ల స్తన్యసంబంధాన్ని రక్తసంబంధంతో సమానమైన విషయంగా భావించరు. అంచేత స్తన్యసంబంధమైన సోదరీని కూడా చేసుకుంటున్నారు. ఇది తెలిసి కూడా చేస్తున్న ఘోరమైన పాపకార్యం. మరికొందరు ముస్లింలు స్తన్యసంబంధం సంగతి మరచిపోయి పెళ్ళిళ్ళు చేస్తారు. ఇది కూడ ఘోరమైన పొరపాటే. స్తన్యసంబంధం ఏర్పడితే ఆ విషయాన్ని వ్రాత పూర్వకంగా నమోదు చేసుకొని గుర్తుంచుకోవాలి. వివాహం చేయ బోతున్నప్పుడు సంబంధిత యువకుడు లేక యువతి వేరే స్త్రీ పాలు తాగి ఉన్నారా లేదా అని ఆలోచించాలి.

హ్జజత్ ఆయిషా (రజి) కథనం: ఓరోజు దైవప్రవక్త (సల్లం) నా దగ్గర (ఇంట్లో) ఉన్నప్పుడు బయట నుంచి ఒకతని మాటలు విన్పించాయి. అతను (మా అక్క) హ్జజత్ హఫ్సా (రజి) ఇంట్లో ప్రవేశించడానికి ఆమె అనుమతి అడుగుతున్నాడు. అప్పుడు నేను దైవప్రవక్త (సల్లం)తో "దైవప్రవక్తా! బహుశా ఆయన హఫ్సా (రజి) గారి స్తన్యసంబంధం పినతండ్రి కావచ్చనుకుంటా. ఆయన మీ ఇంట్లోకి (అంటే హఫ్సా ఇంట్లోకి) రావడానికి అనుమతి అడుగుతున్నారు" అని అన్నాను. దానికి దైవప్రవక్త (సల్లం) "(ఔనౌను.) ఈయన ఫలానా వ్యక్తి హఫ్సా (రజి)కు స్తన్య సంబంధం పినతండ్రి అవుతాడు" అని అన్నారు. అప్పుడు నేను "అయితే నాకు స్తన్య సంబంధం పినతండ్రి అయిన ఫలానా వ్యక్తి బ్రతికి ఉంటే ఆయన కూడా నా ముందు (పరదా లేకుండా) రావచ్చా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు-

"రక్తసంబంధ బంధువులు ఎలా వివాహ నిషిద్ధులవుతారో అలాగే స్తన్యసంబంధం వల్ల ఏర్పడిన బంధువులు కూడా వివాహ నిషిద్ధులవుతారు." (బుఖారి, ముస్లిం)

హ్జజత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "స్తన్య సంబంధంతో కలిగిన (ఒకే స్త్రీ పాలు తాగిన) వారంతా (దగ్గరి) బంధువులయి పోతారు. అనువంశిక బంధుత్వం (రక్తసంబంధం) వల్ల ఏవిధంగా నిషేధం ఏర్పడుతుందో వీరి మధ్య కూడా పరస్పర వివాహం నిషిద్ధమవుతుంది." (బుఖారి, ముస్లిం)



హ్జజత్ ఆయిషా (రజి) కథనం: హ్జజత్ అఫ్లా (రజి) లోపలికి రావడానికి అనుమతి అడిగితే నేనాయనకు అనుమతి ఇవ్వలేదు. అప్పుడాయన "ఏమిటీ, నువ్వు నా ముందు కూడా పరదా పాటిస్తున్నవా? నేను నీ బాబాయినమ్మా!" అని అన్నారు. నేను "ఎలా?" అని అడిగాను. "నీకు నా సోదరుడి భార్య పాలిచ్చింది. ఆమెలో ఆ పాలు నా సోదరుడి వల్లనే పడ్డాయి" అన్నారు ఆయన. ఆ తరువాత నేను దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం)ను అడిగితే "అఫ్లా చెప్పింది నిజమే. ఆయన్ని లోపలికి రావడానికి అనుమతించు" అని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

## అత్తామామలు తల్లిదండ్రులతో సమానం

భార్యతల్లి (అత్త) ఇస్లాం దృష్టిలో కన్నతల్లితో సమానం. భార్యతండ్రి కన్నతండ్రితో సమానం. కనుక అత్తను చేసుకోవడం ఘోరమైన పాపం. పిల్లనిచ్చిన అత్త కన్నతల్లితో సమానం కనుక ఆమె తన అల్లుడి ముందు పరదా పాటించనవసరం లేదు.

దీన్నిబట్టి ఇస్లాం దృష్టిలో అత్తా-అల్లుళ్ళు, మామా-అల్లుళ్ళ సంబంధం తల్లీ కొడుకులు, తండ్రీకొడుకుల సంబంధంలా ఎంత పవిత్రమయినదో ఊహించవచ్చు. అదేవిధంగా ఇస్లాం దృష్టిలో **కోడలికి అత్తమామలు తల్లిదండ్రులతో సమానం.** ఈ అనుబంధాన్ని గనక ఉభయపక్షాలు అర్థం చేసుకొని ఆచరిస్తే నేడు మన సమాజంలో అల్లుడు- అతని అత్తామామల మధ్య, కోడలు- ఆమె అత్తామామల మధ్య నెలకొని ఉన్న ఉద్రిక్త వాతావరణం చాలా వరకు సమసిపోయే అవకాశం ఉంటుంది.

ఈసూక్తిలో "మీతో లైంగికసంబంధం ఏర్పడిన మీభార్యలకు (గతభర్తల ద్వారా) పుట్టి మీసంరక్షణలో పెరిగిన కుమార్తెలు" అన్న పదం మనకు వింతగా అన్పిస్తుంది. మీ సంరక్షణలో లేక మీ వడిలో పెరగడం అనే పదం సొంతకూతుళ్ళు అని నొక్కి చెప్పడానికి మాత్రమే ఇక్కడ ఉపయోగించబడింది. నిషేధాజ్ఞ క్రింద సొంతకూతుళ్ళే కాదు, సవతికూతుళ్ళు కూడా చేరివున్నారు. అంటే తన భార్యకు గత భర్త వల్ల జన్మించిన కుమార్తెలను కూడా పురుషుడు వివాహం చేసుకోకూడదన్నమాట. వారు కూడా తన సంరక్షణలో పెరిగినా, వారి కన్నతండ్రి సంరక్షణలో పెరిగినా, మరెక్కడ పెరిగినా సరే తన సొంత కూతుళ్ళ క్రిందికే వస్తారు.

## పెంపుడుకొడుకు భార్య సొంతకోడలు కాదు

పోతే ఈ సూక్తిలోని "మీ కన్నకొడుకుల (వితంతువులైన లేక విడాకులు పొందిన) భార్యలు (అంటే కోడళ్ళు) కూడా మీకు నిషేధించబడ్డారు" అనే వాక్యంలో "కన్నకొడుకులు లేక కడుపున పుట్టిన కొడుకులు" అనే మాటను ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం- మూఢకాలంలో అరబ్బులు తమ పెంపుడు కొడుకు విడాకులిచ్చిన స్త్రీని లేదా అతని వితంతు భార్యని సొంత కోడలుగానే పరిగణించి ఆమెను వివాహమాడటాన్ని పెద్ద తప్పుగా భావించేవారు. కాని అలాంటి స్త్రీ సొంత

కోడలు కాజాలదని, పెంపుడు కొడుకు విడాకు లిస్తే లేదా చనిపోతే ఆమెను చేసుకోవడంలో తప్పు లేదని ఖుర్‌ఆన్ చెబుతోంది.

దైవప్రవక్త (స) కొడుకుగా పెంచుకున్న జైద్ (రజి) తన భార్య జైనబ్ (రజి)కు విడాకులిచ్చిన తరువాత ఆమెను దైవప్రవక్త (స) చేసుకున్న విషయం ఇక్కడ గమనార్హం. దీనిపై ఆనాటి బహుదైవారాధకులు ముహమ్మద్ (స) కోడలిని వివాహం చేసుకున్నారని పెద్ద దుమారం లేవదీశారు. ఈ సంఘటనకు సంబంధించిన విషయాలు అహ్‌జాబ్ సూరాలో ప్రస్తావించబడ్డాయి. ఈ దురాచారాన్ని అంత మొందించడానికే దేవుడు దైవప్రవక్త-జైనబ్‌ల వివాహం జరిపించాడని ఖుర్‌ఆన్ తెలియజేస్తోంది.

(వివారాలకు ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ నుండి వెలువడిన "ఖుర్‌ఆన్ భావామృతం"లోని 33:37,50 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

## ఏకకాలంలో వివాహబంధంలో ఉండకూడని స్త్రీలు

వివాహనిషిద్ధ స్త్రీల జాబితాలో సొంత అక్కాచెల్లెళ్ళయిన స్త్రీల ప్రస్తావన కూడా ఉంది. పురుషుడు ఏకకాలంలో సొంత అక్కాచెల్లెళ్ళయిన ఇద్దరు స్త్రీలను భార్యలుగా కలిగి ఉండకూడదు. మొదట ఒకామెను చేసుకొని, ఆమెకు విడాకులిచ్చిన తరువాతనో లేదా ఆమె మరణించిన పక్షంలోనో ఆమె సోదరిని వివాహమాడవచ్చు. మనిషి అజ్ఞానం వల్ల ఇలా ఇద్దర్నీ ఏకకాలంలో చేసుకుంటే దేవుడు క్షమించే అవకాశం ఉందని ఖుర్‌ఆన్ చెబుతోంది. అయితే అది పొరపాటు, పాపం అని తెలిసిన తరువాత అతను వెంటనే ఆ ఇద్దరిలో ఒకామెను విడాకులిచ్చి వదిలేయవలసి ఉంటుంది.

అదేవిధంగా సోదరుని కుమార్తె-సోదరి కుమార్తె, మేనత్త-పిన్నమ్మ ఏకకాలంలో ఒక పురుషుని వివాహబంధంలో ఉండటం కూడా నిషిద్ధమే. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఏ స్త్రీ కూడా తన పిన్ని లేక మేనత్తతో కలసి ఒకరి వివాహబంధంలో ఉండకూడదు." (బుఖారి, ముస్లిం)

## బహుదైవారాధక స్త్రీలు కూడా నిషిద్ధులే

వివాహనిషిద్ధ స్త్రీలలో బహుదైవారాధకులు కూడా ఉన్నారు. ముస్లింలు బహు దైవారాధకుల్ని వివాహమాడటం ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లదు. ఈ విషయం ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా పేర్కొనబడింది.

"బహుదైవారాధకురాలైన స్త్రీలు (సత్యాన్ని) విశ్వసించనంత వరకు వారిని మీరు ఎలాంటి పరిస్థితిలోనూ వివాహమాడకండి. బహుదైవారాధకురాలైన స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమెకంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిసమహిళే ఎంతో మేలు. అలాగే బహు దైవారాధకులైన పురుషులు (సత్యాన్ని) విశ్వసించనంతవరకు వారితో మీ స్త్రీల వివాహం చేయకండి. బహుదైవారాధకుడైన పురుషుడు మీకు ఎంత నచ్చినా, అతనికంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిస పురుషుడే ఎంతో శ్రేష్ఠుడు. బహుదైవారాధకులు మిమ్మల్ని నరకాగ్ని



వైపు పిలుస్తారు. దేవుడు మిమ్మల్ని దయతో స్వర్గం వైపు, క్షమాభిక్ష వైపు పిలుస్తున్నాడు. ప్రజలు దారికి వచ్చేందుకు దేవుడు తన ఆజ్ఞలను ఇలా విడమరచి తెలియజేస్తున్నాడు." (ఖుర్‌ఆన్-2:221)

"అపవిత్ర పురుషులకు అపవిత్ర స్త్రీలు, అపవిత్ర స్త్రీలకు అపవిత్ర పురుషులే తగిన జంటలు. అలాగే పవిత్ర పురుషులకు పవిత్ర స్త్రీలు, పవిత్ర స్త్రీలకు పవిత్ర పురుషులు మాత్రమే (వివాహానికి) యోగ్యులు. జనం చెప్పుకునే (తప్పుడు) మాటలకు అతీతంగా వారు పరిశుద్ధులు, పవిత్రులు. వారికోసం మన్నింపు, ఉదారమైన ఉపాధి ఉన్నాయి." (ఖుర్‌ఆన్-24:26)

4:23 సూక్తిలో పేర్కొన్న స్త్రీలను తప్ప ఇతర ఏ స్త్రీలనైనా మహర్ చెల్లించి నిక్షేపంగా వివాహమాడవచ్చని ఆ తరువాత సూక్తి (4:24) సూచిస్తోంది.

"వీరు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధన వినియోగం ద్వారా (అంటే మహర్ చెల్లించి) మీరు వివాహమాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వ మయి ఉండకూడదు." (4:24)

## పినతండ్రి, పెత్తండ్రి కుమార్తెలను పెళ్ళాడవచ్చు

అలాంటి స్త్రీలలో పినతండ్రి లేక పెత్తండ్రి కుమార్తెలను వివాహమాడవచ్చు. కాని ఈనాడు కొందరు ముస్లింలు దీన్ని పెద్ద తప్పుగా భావిస్తున్నారు. ఇది కూడా వారి అజ్ఞానాన్నే సూచిస్తోంది. దేవుడు ఒక విషయాన్ని ధర్మసమ్మతం చేసినప్పుడు దాన్ని ముస్లింలు నిషే ధించుకోవడం అంటే ఆయన నిర్ణయాలను సందేహించడమే అవుతుంది. కనుక మహిళలు ఇలాంటి విషయాలకు సంబంధించిన జ్ఞానాన్ని కూడా కలిగి ఉండటం నేటి సామాజిక వాతావరణంలో ఎంతో అవసరం.

వివాహనిషిద్ధంకాని స్త్రీలలో గ్రంథప్రజల స్త్రీలు కూడా ఉన్నారు. గ్రంథప్రజల స్త్రీలు అంటే యూద స్త్రీలు, క్రైస్తవ స్త్రీలు అని అర్థం. ఈ విషయం ఖుర్‌ఆన్‌లోనే మరో అధ్యాయంలో ఈవిధంగా ఉంది:

## క్రైస్తవ, యూద స్త్రీలను వివాహమాడవచ్చా?

"ఈరోజు మీకు పరిశుద్ధ వస్తువులన్నీ ధర్మసమ్మతం చేయబడ్డాయి. గ్రంథప్రజల ఆహారం మీకు, మీ ఆహారం గ్రంథప్రజలకు ధర్మసమ్మతం చేయబడింది. శీలవతులైన ముస్లిం స్త్రీలు, గ్రంథప్రజలకు చెందిన శీలవతులు కూడా (వివాహానికి) మీకు ధర్మసమ్మతం చేయబడ్డారు. కాకపోతే వారికి చెల్లించవలసిన మహర్ సొమ్ము చెల్లించి, వారిని వివాహ బంధంలో సురక్షితంగా ఉంచాలి. అంతేగాని, వారితో విచ్చలవిడిగా కామక్రీడలకు పాల్పడ టంగాని, దొంగచాటుగా అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని చేయకూడదు. సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తే మనిషి తన జీవితంలో సాధించినదంతా వ్యర్థమవుతుంది. చివరికి అతను పరలోకంలో ఘోరంగా నష్టపోతాడు." (ఖుర్‌ఆన్-5:5)

ఈ సూక్తిలో గ్రంథప్రజల స్త్రీలంటే ఇస్లామీయ రాజ్యంలో జిమ్మీ పౌరులుగా నివసించే యూద, క్రైస్తవ స్త్రీలని; దారుల్‌హరబ్ (శత్రు దేశం), దారుల్‌కుఫర్ (అవిశ్వాసులు పాలించే దేశం)లో నివసించే యూద, క్రైస్తవ స్త్రీలను వివాహమాడటం సరికాదని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు.

హనఫీ ఫిఖావేత్తలు ఈ అభిప్రాయంతో కొంచెం విభేదిస్తూ "విదేశాలకు చెందిన యూద, క్రైస్తవ స్త్రీలను వివాహమాడటం హరాం (నిషిద్ధం) కాదుకాని, అవాంఛనీయమైన దని మాత్రం చెప్పవచ్చు" అని అభిప్రాయపడ్డారు. ఈ రెండిటికి భిన్నంగా సయీద్ బిన్ ముసయ్యిబ్, హసన్ బస్రీ (రహ్మాలై)లు జిమ్మీ (ఇస్లామీయ రాజ్యపౌరుడు), గైర్‌జిమ్మీ (ఇస్లామేతర రాజ్యపౌరుడు) అని తేడా లేదని అన్నారు.

ఏమయినప్పటికీ ఈ సూక్తిలో పేర్కొన్నట్లు ఆ స్త్రీలు మానమర్యాదలు గల శీలవతు లయి మాత్రం తప్పకుండా ఉండాలి. అలాంటి స్త్రీలనే వివాహమాడటానికి ముస్లిం పురుషులకు అనుమతి ఉంది. అయితే ఈ అనుమతిని దుర్వినియోగం చేయకుండా వారు ఇస్లాం పట్ల తమ విశ్వాసాలు, నీతినడవడికలను గురించి జాగ్రత్త వహిస్తుండాలి. ఆ స్త్రీల అందచందాలు, వారి మనోవాంఛల వలలో పడిపోతే మాత్రం ముస్లిం భర్తల పుణ్యకర్మలన్నీ వ్యర్థమైపోతాయి.

## క్రైస్తవ, యూద పురుషులు నిషిద్ధులు

ఖుర్‌ఆన్ కొన్ని షరతులలో ముస్లింలకు క్రైస్తవ, యూద మతాలకు చెందిన స్త్రీలను వివాహమాడే అనుమతి ఇచ్చింది కాని, వారు తమ స్త్రీలను క్రైస్తవ, యూద మతాలకు చెందిన పురుషలకు ఇవ్వడానికి మాత్రం అనుమతి ఇవ్వలేదు.

ప్రభావితమయ్యే, అంగీకరించే స్వభావం పురుషునిలో కంటే స్త్రీలోనే ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ ముస్లిం స్త్రీని ముస్లిమేతర పురుషునికి ఇచ్చి పెళ్ళిచేస్తే ముస్లిం స్త్రీ ఇస్లాం సంప్రదాయాలను ఆచరిస్తూ ముస్లిమేతర భర్తను మనస్ఫూర్తిగా ప్రేమించలేదు. పైగా ఆమె ఇస్లామేతర మతవిశ్వాసాలతో ప్రభావితురాలయ్యే ప్రమాదం కూడా ఉంది. ఈ కారణంగానే ముస్లిం మహిళలు ముస్లిమేతర పురుషుల్ని వివాహమాడటానికి ఇస్లాం సుతరామూ అంగీకరించదు.

## బానిస స్త్రీల వివాహం

పోతే స్వతంత్ర స్త్రీలను వివాహమాడలేని నిరుపేద ముస్లిం యువకులు ఇస్లాం స్వీకరించిన బానిస యువతుల్ని వివాహమాడ వచ్చని కూడా ఖుర్‌ఆన్ చెబుతోంది. ఇది పూర్వకాలంలో ఎదురైన సమస్య. ప్రస్తుతం ఈ సమస్య లేదు.

"మీలో ఎవరికైనా విశ్వసించిన స్వతంత్ర స్త్రీలను వివాహమాడే స్తోమత లేకపోతే అలాంటివారు తమ అధీనంలోకి వచ్చిన ముస్లిం బానిస స్త్రీలను వివాహమాడాలి. దేవునికి మీ విశ్వాసస్థితి బాగా తెలుసు. మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాశికి చెందినవారు. కనుక



బానిస స్త్రీలను వారి యజమానుల అనుమతి తీసుకొని వివాహమాడండి. చట్టం ప్రకారం వారికి చెల్లించవలసిన మహర్ ధనం కూడా చెల్లించాలి. అయితే వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచండి. విచ్చలవిడిగా చెడు తిరుగుళ్ళు తిరగనివ్వకండి. దొంగచాటుగా ప్రేమకలాపాలకు పాల్పడనీయకండి."

"ఒకవేళ వారు వివాహబంధంలోకి వచ్చి భద్రత పొందిన తరువాత దుర్నడతకు పాల్పడితే అలాంటివారికి స్వతంత్ర స్త్రీలకు విధించే శిక్షలో సగంశిక్ష విధించాలి. వివాహం చేసుకోని కారణంగా తమ ధర్మనిష్ఠకు భంగం కలుగుతుందని భయపడేవారికి మాత్రమే ఈ సౌకర్యం ఉంది. అయితే మీరు (అలాంటి పరిస్థితిలో పెళ్ళిచేసుకోకుండా) సహనం వహిస్తే ఎంతో మంచిది. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (4:25)

"ప్రజలు నిన్ను స్త్రీల విషయంలో (దేవుని) ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "దేవుడు మీకీ విషయంలో తన ఆజ్ఞ తెలియజేస్తున్నాడు. దాంతోపాటు ఈ గ్రంథంలో ఇదివరకు మీకు తెలిపిన ఆజ్ఞలు కూడా గుర్తుచేస్తున్నాము. అంటే (మీ సంరక్షణలో వుండే) అనాథ బాలికల గురించిన ఆజ్ఞలు. వారి హక్కులు మీరు నెరవేర్చరు; వారికి పెళ్ళిళ్ళు చేసి పంపరు. (లేదా పేరాశతో మీరే వారిని పెళ్ళాడగోరుతారు.) అలాగే బలహీనులైన పసిపిల్లలకు సంబంధించిన ఆజ్ఞలు కూడా. అనాథబాలల విషయంలో న్యాయంగా వ్యవహరించాలని దేవుడు మిమ్మల్ని ఉపదేశిస్తున్నాడు. మీరు ఏ మంచిపని చేసినా అది దేవునికి తెలుస్తుంది." (4:127)

# 10. వివాహం

మనిషిలోని లైంగికశక్తి సహజ విషయం. దాన్ని అరికట్టడాన్ని లేదా దుర్వినియోగ పరచడాన్ని ఇస్లాం అంగీకరించదు. లైంగికశక్తిని అణచి ఆజన్మ బ్రహ్మచారిగా ఉండి పోవడం, లేదా భార్యను వదిలేసి సన్యాసిగా మారిపోవడం నిషిద్ధం. అలాగే చెడు తిరుగుళ్ళు తిరుగుతూ దాన్ని దుర్వినియోగ పరచడం కూడా నిషిద్ధమే. ఈ రెంటిని కాదని ఇస్లాం లైంగికశక్తిని సద్వినియోగం చేయడానికి వైవాహిక వ్యవస్థను నెలకొల్పింది.

"విశ్వాసులారా! దేవుడు మీ కొరకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువుల్ని నిషే ధించుకోకండి" అని దేవుడు స్పష్టంగా చెప్పాడు. (ఖుర్‌ఆన్–5:87)

## పెళ్ళి ప్రవక్త సంప్రదాయం

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒకసారి ముగ్గురు వ్యక్తులు దైవప్రవక్త (సల్లం) భార్యల ఇండ్లకు వచ్చి దైవప్రవక్త (సల్లం) ఆరాధనా పరిస్థితి గురించి అడిగారు. దాన్ని గురించి తెలుసుకున్న తరువాత వారు దైవప్రవక్త (సల్లం) చేసే ఆరాధనను స్వల్పమైనదిగా భావించి "దైవప్రవక్త (స) ఆరాధనకు, మన ఆరాధనకు పోలికేమిటీ? దైవప్రవక్త (సల్లం)కు సంబంధించిన భూత భవిష్యత్ కాలాల పొరపాట్లన్నీ మన్నించ బడ్డాయి. (మనం సామాన్యులం గనక దైవాన్ని ఇంకా ఎక్కువ ఆరాధించాలి)" అని

చెప్పుకున్నారు. అందువల్ల వారిలో ఒకతను "నేనిక నుండి ఎల్లప్పుడూ రాత్రి తెల్లవార్లూ మేల్కొని నమాజు చేస్తుంటాను" అన్నాడు. రెండవతను మాట్లాడుతూ "నేనిక నుండి ప్రతిరోజూ ఉపవాసం పాటిస్తాను. ఒక్కరోజు కూడా నాగా చేయను" అన్నాడు. మూడవ తను తన నిర్ణయం తెలుపుతూ "నేనిక నుంచి స్త్రీల జోలికే పోను. ఎప్పటికీ పెళ్ళి చేసుకోను. (దైవారాధనకే నా జీవితమంతా అంకితం చేస్తాను.)" అని అన్నాడు.

అంతలో దైవప్రవక్త (సల్లం) అక్కడికి వచ్చారు. వారు చెప్పుకుంటున్న మాటలు విని ఇలా అన్నారు: "ఏమిటీ, మీరేనా ఈ మాటలు అంటున్నది! వినండి. నేను మీ అందరికంటే ఎక్కువ దేవునికి భయపడేవాడ్ని. మీ అందరికంటే ఎక్కువ దైవభీతి పరాయ ణుడ్ని అయినప్పటికీ నేను ఉపవాసాలు పాటిస్తున్నాను, వాటిని వదిలేస్తున్నాను కూడా. అలాగే రాత్రిళ్ళు నమాజు చేస్తున్నాను, నిద్ర కూడా పోతున్నాను. స్త్రీలను వివాహం కూడా చేసుకుంటున్నాను. గుర్తుంచుకోండి! నా సంప్రదాయాలను విడనాడే వాడితో నాకెలాంటి సంబంధం లేదు. (అతనసలు ముస్లిమే కాదు.)" (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి)ని బ్రహ్మచారిగా ఉండ వద్దని వారించారు. హజ్రత్ సాద్ బిన్ అబీవఖాస్ (రజి) ఈ విషయం తెలిపిన తరువాత "దైవప్రవక్త (సల్లం) గనక ఆయన్ని వివాహం చేసుకోకుండా ఉండేందుకు అనుమతించి ఉంటే మేమంతా (కామవాంఛను అణచే పద్ధతులు అవలంబించి) నపుంసకులుగా మారిపోవడానికి ఇష్టపడే వాళ్ళము" అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "యువకుల్లారా! మీలో వివాహం చేసుకునే శక్తి కలవారు వివాహం చేసుకోవాలి. ఆ శక్తి లేనివారు ఉపవాసవ్రతం పాటించాలి. ఉపవాసం కామవాంఛను అదుపులో ఉంచుతుంది." (బుఖారి, ముస్లిం)

## ప్రేమానురాగాలే పెళ్ళి ధ్యేయం

సమాజంలో అశ్లీలతను నివారించి ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి వైవాహిక వ్యవస్థ ఎంతో పటిష్ఠమైన వ్యవస్థ. వివాహానికి మొట్టమొదటి ఆకర్షణ స్త్రీపురుషుల మధ్య ప్రేమ, సంతృప్తులే.

"దేవుడే మిమ్మల్ని ఏకైక ఆత్మ నుండి సృష్టించాడు. అదే జీవి నుండి దాని జతను కూడా సృష్టించాడు, దాని దగ్గర సౌఖ్యం పొందడానికి." (ఖుర్ఆన్-7:189)

"ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి." (ఖుర్ఆన్-30:21)

వైవాహిక సౌధానికి ప్రేమానురాగాలే పునాదిరాళ్ళు. ప్రేమ-పెళ్ళి, పెళ్ళి-ప్రేమ అనే విషయాలపై రచయితలు లక్షల కొలది పంక్తులు రాశారు. ప్రేమించి పెళ్ళి



చేసుకున్నప్పుడే ఆ సంసారం కలకాలం సవ్యంగా సాగుతుందని కొందరు రాస్తే, పెళ్ళి చేసుకున్న తరువాతనే ప్రేమించాలని మరికొందరు రచయితలు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. నిజానికి ఈ రెండు అభిప్రాయాలు కూడా అతివాదాలే.

పెళ్ళికి పూర్వం ప్రేమకు, పెళ్ళి తరువాత ప్రేమకు ఎంతో తేడా ఉంది. ఈ తేడా గ్రహించని యువతీ యువకులు తమకు తోచిన రీతిలో ప్రేమాయణం సాగించి పెళ్ళి చేసుకుంటారు. ఎన్నో బాసలు చేసుకొని మరీ ఒకటయి పోతారు. కాని ఉడుకురక్తం పొంగు కాస్తా చల్లారగానే వారి కాపురాల్లో చిటపటలు మొదలవుతాయి. పర్యవసానం తుఫానులో చిక్కుకొని అటు గమ్యం చేరలేక, ఇటు నీట మునగలేక అలల తాకిడికి సతమతమయ్యే నావలా తయారవుతుంది వారి సంసారం.

అలాగే పెళ్ళికి ముందు పెళ్ళాడదలచిన యువతిని లేదా యువకుడ్ని చూడటం, ప్రేమించడం తప్పు అన్న అభిప్రాయం కూడా శుద్ధతప్పే. ప్రేమ అనేది మానసిక భావోద్రేకా లకు సంబంధించిన అతిసున్నితమైన విషయం. ఇది అందరిలోనూ ఒకే విధంగా ఉండక పోవచ్చు. అందరూ నల్లగా ఉందని ఈసడించుకున్న లైలాను గాఢంగా ప్రేమించిన మజ్నూ ప్రేమాయణాన్ని ఇందుకొక తార్కాణంగా పేర్కొనవచ్చు.

ఈవిషయం గ్రహించని కొందరు తల్లిదండ్రులు తమ కొడుకులు, కూతుళ్ళ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, కనీసం ముఖపరిచయమైన లేకుండా ఇతరులకిచ్చి పెళ్ళిళ్ళు చేస్తారు. ముఖ్యంగా మిడిమిడి జ్ఞానంగల ఛాందస ముస్లింలు సాధారణంగా ఇలా చేస్తుంటారు. దీనికి ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. ఏమైనప్పటికీ పెద్దలు చేసిన ఈ నిర్వాకానికి మనసులు కలవకపోతే వారి పిల్లల జీవితాల్లో విషాదఛాయలే మిగులుతాయి.

## ఇస్లాంలో పెళ్ళిచూపుల సంప్రదాయం

ఇస్లాం ఈ రెండు అతివాదాలను ఖండిస్తోంది. పెళ్ళికి ముందే పెళ్ళాడదలచిన యువజంట ఏకాంతంగా కలుసుకోవడాన్ని, విచ్చలవిడిగా తిరగడాన్ని ఇస్లాం సుతరామూ అంగీకరించదు. పెళ్ళికి పూర్వం అది ఎలాంటి వెకిలి చేష్టల్ని సహించదు. అలా అని అది ముక్కు మొహం తెలియని వ్యక్తిని చేసుకొమ్మని కూడా శాసించదు.

ఇస్లాం ఈ రెండు వాదాలను త్రోసిపుచ్చి ఓ మధ్యేమార్గాన్ని సూచిస్తోంది. పెళ్ళి చేసుకోదలచినవారు మనోతృప్తి కోసం పెళ్ళికి ముందు పరస్పరం ఒకసారి చూసుకోవాలని బోధిస్తోంది. ఇది 'ఆజ్ఞ' కాకపోయినా, పటిష్ఠమైన వైవాహిక బంధం, సుఖమయమైన జీవితం కోసం ఇవ్వబడిన అతిముఖ్య హితవు అన్న సంగతి ఇక్కడ గ్రహించాలి. షరీఅత్ వేత్తలు దీన్ని "ముస్తహబ్" (అభిలషనీయమైనది)గా పేర్కొన్నారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పెళ్ళిచూపుల విషయం గురించి నొక్కిచెబుతూ "మీలో ఎవరైనా ఏదైనా స్త్రీని వివాహమాడ దలచుకుంటే అతనా స్త్రీని వీలైనంత

వరకు ప్రత్యక్షంగా చూసి, వివాహం వైపుకు ఆకట్టుకోలేని దోషం ఏదీ ఆమెలో లేదన్న సంగతి నిర్ధారించుకొని తృప్తిచెందాలి" అని అన్నారు. (అహ్మద్, అబూదావూద్)

హజ్రత్ ముగైరా బిన్ షోబా (రజి) కథనం: నేనొక స్త్రీని పెండ్లాడదలచి కబురు పంపాను. ఈ సంగతి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తే, ఆయన "మరి నువ్వామెను చూశావా?" అని అడిగారు. నేను లేదన్నాను. "అయితే నువ్వామెను ఒకసారి చూసుకో. దీనివల్ల మీ ఇద్దరిలో శాశ్వతంగా పరస్పర ప్రేమానురాగాలు జనించే అవకాశం ఉంటుంది" అన్నారు ఆయన.

నేనీ మాట విన్న తరువాత ఆ స్త్రీ ఇంటికి వెళ్ళాను. ఇంట్లో ఆమె తల్లిదండ్రులు ఉన్నారు. ఆమె తెర వెనుక ఉంది. నేను వాళ్ళతో "దైవప్రవక్త (సల్లం) నాకు కాబోయే భార్యను చూసుకోమని చెప్పారు" అని అన్నాను. ఈమాట విని ఆమె తల్లిదండ్రులు మౌనంగా ఉండిపోయారు. అప్పుడా అమ్మాయి తెర వెనుక నుండి తొంగిచూస్తూ "నన్ను చూడమని దైవప్రవక్త (సల్లం) మిమ్మల్ని ఆదేశించి ఉంటే నేను తెర నుండి బయటికి వస్తాను, మీరు నన్ను చూసుకోవచ్చు. దైవప్రవక్త (సల్లం) అలాంటి ఆజ్ఞ ఏదీ ఇవ్వకపోతే మీరు నన్ను చూడకూడదు" అని అన్నది. అప్పుడు నేను ఇది దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞే నంటూ ఆమెను చూశాను. నేను (సంతృప్తి చెంది) ఆ తరువాత ఆ అమ్మాయిని చేసుకున్నాను. (అబూదావూద్)

"వితంతువు లేక విడాకులుపొందిన స్త్రీ నోటిమాట ద్వారా తన అంగీకారం తెలియ జేయనంత వరకు ఆమె వివాహం కాజాలదు. అలాగే కన్య తన ఆమోదం తెలపనంత వరకు ఆమె వివాహం కూడా కాజాలదు" అన్నారు దైవప్రవక్త (సల్లం)

ప్రవక్త అనుచరులు ఈ చివరి మాట విని "ఎలాంటి ఆమోదం?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నిరాకరించకుండా మౌనంగా ఉండిపోవడమే ఆమె ఆమోదం అవుతుంది" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

## వరుని ఎంపిక వధువు హక్కు

ఒకసారి ఒక స్త్రీ దైవప్రవక్త (స) వద్దకు వచ్చి తన తండ్రి తన వివాహం తన అభీష్టా నికి వ్యతిరేకంగా చేశాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు దైవప్రవక్త (స) "నీకు ఆ వివాహాన్ని రద్దుచేయడానికి లేదా అమోదించడానికి అధికారముంది" అని సెలవిచ్చారు.

అలాగే మరొకస్త్రీ కూడా తనఇష్టానికి వ్యతిరేకంగా తనతండ్రి తనవివాహం తన పినతండ్రి కుమారునితో జరిపించాడని ఫిర్యాదు చేసింది. దానికి దైవప్రవక్త (స) "ఈ సంబంధం ఇష్టమైతే ఒప్పుకోవచ్చు లేదా రద్దుచేయవచ్చ"ని తెలియజేశారు. అప్పుడా స్త్రీ "దైవప్రవక్తా! నా తండ్రి చేసినదంతా నేను ఒప్పుకున్నాను. (ఇలా అడగడంలో) నా ఉద్దేశ్యం ఈ వ్యవహారంలో తమ తండ్రులకు ఎలాంటి అధికారం లేదని స్త్రీలకు తెలియపరచడం తప్ప మరేమీ కాదు" అని అన్నది. (అబూదావూద్, నిసాయి)



ఇదే సారాంశం మరో హదీసులో ఇలా ఉంది: మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ హమ్‌జా (రజి) కుమార్తె వివాహం పిన్న వయస్సులోనే హజ్రత్ అమ్ బిన్ అబీ ముస్లిం (రజి)తో చేయించారు. ఆ సందర్భంలో ఆయన "యుక్తవయస్సు రాగానే ఆమెకు ఈ సంబంధం విషయంలో అంగీకరించేందుకు లేదా రద్దు పరిచేందుకు అధికారం ఉందని సెలవిచ్చారు.

ఇలా పెళ్ళిచూపుల్లో కాబోయే వధూవరులు ఇద్దరూ పరస్పరం చూసుకొని ఇష్ట పడటం చాలా అవసరమని పై హదీసుల ద్వారా స్పష్టమవుతోంది. అదీగాక వివాహ బంధం ఒక ఒడంబడిక కనుక వివాహ ఒడంబడికలో వధూవరుల అంగీకారం అతి ముఖ్యమైన షరతుగా ఉంది. వధూవరుల్లో ఏ ఒక్కరు అంగీకారం తెలుపకపోయినా ఆ వివాహం నెరవేరదు. బలవంతంగా ఒప్పించి జరిపే పెళ్ళి సంసారంలో అశాంతి బీజాలు నాటుతుంది. అందువల్ల హృదయపూర్వక అంగీకారం కోసం పెళ్ళికి ముందే ఇద్దరూ ఒకర్నొకరు చూసుకొని తృప్తిచెందడం ఎంతో అవసరం.

ఒకవేళ సామాజిక స్పృహరాని లేతవయసులో పెళ్ళి కావడం జరిగితే చట్ట ప్రకారం ఆ పెళ్ళి చెల్లుతుంది కాని, వివాహం తరువాత వారిద్దరిలో ఎవరికైనా సరే ఆ విహాన్ని ఆమోదించడానికి లేదా రద్దు చేసుకోవడానికి (అంటే తలాఖ్ ద్వారా విడిపోవడానికి) పూర్తి అధికారం ఉందని కూడా పై హదీసుల ద్వారా తెలుస్తోంది. వివాహాంగీకారం ఇద్దరు ఒకర్నొకరు చూసుకొని ఇష్టపడటం మీదనే ఆధారపడుతుంది. దీన్నిబట్టి వివాహానికి పెళ్ళిచూపులు తప్పనిసరి అని తెలుస్తోంది. తొలిచూపులోని ఇష్టమే కాబోయే వధూవరుల మధ్య ప్రేమగా మారుతుంది.

పెళ్ళికి ముందు కాబోయే వధూవరుల మధ్య ఏర్పడే పరస్పర సంతృప్తి, ఇష్టాలే స్వచ్ఛమైన ప్రేమకు, మానసిక బంధనాలకు నాంది పలికి వివాహం తరువాత మొగ్గ తొడిగి వికసిస్తాయి. అయితే అంతమాత్రాన ఈ ప్రేమాంకురం ఫలపుష్పాదులతో వికసించి ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది. దానికి నీరు పోయాలి, ఎరువు వేయాలి, పురుగుల మందు చల్లాలి, కంచెకట్టి కంటికి రెప్పలా కాపాడుతూ ఉండాలి. అంటే భార్యాభర్తలిద్దరూ దైవం నిర్దేశించిన హద్దుల్లో ఉంటూ ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తూ ఉండాలి.

## నాలుగు ప్రాతిపదికలపై స్త్రీ వివాహం

అమ్మాయి నచ్చడం, నచ్చకపోవడం ఆమె ధర్మపరాయణత, గుణగణాలపై ఆధార పడిఉండాలిగాని, ఆమె అందం, ఐశ్వర్యంపై కాదు. ఈ రోజుల్లో మగపిల్లల తల్లిదండ్రు లు అందచందాలతో పాటు పెద్దఎత్తున కట్నకానుకలు తీసుకొచ్చే కోడళ్ళ కోసం అన్వే షిస్తున్నారు. **కొడుకు అందంగా లేకపోయినా కోడలు మాత్రం కుందనపు బొమ్మలా ఉండాలి!** దాంతోపాటు భారీఎత్తు సిరులుకూడా కావాలి. స్కూటర్, టి.వి., ఫ్రిజ్, సోఫా మొదలైన ఖరీదైన వస్తువులేగాక లక్షలాదిరూపాయల నగదుపైకం కూడా కావాలి.

దాంపత్యజీవితం దినాభివృద్ధి చెందుతూ పుష్కలమైన ఫలపుష్పాదులతో ఎదగాలంటే వధువు లేక వరుని ఎంపిక కోసం ఒక మంచి ప్రమాణం కావాలి. ఆ ప్రమాణం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"సాధారణంగా స్త్రీని నాలుగు విషయాల ప్రాతిపదికపై వివాహమాడుతారు. (1) ఆమె సిరిసంపదలు చూసి చేసుకుంటారు. (2) ఆమె కుటుంబం వంశాలను చూసి చేసుకుంటారు. (3) ఆమె అందచందాలు చూసి చేసుకుంటారు. (4) ఆమె ధర్మపరాయణతను చూసి చేసుకుంటారు. కనుక మీరు ధర్మపరాయణురాలయిన స్త్రీని చేసుకొని సాఫల్యం పొందండి. అలా చేసుకోకపోతే మీ చేతులకు మట్టి అంటుకుంటుంది. (చివరికి మీకు పశ్చాత్తాపమే మిగులుతుంది.) (బుఖారి, ముస్లిం)

## తాత్కాలిక వివాహం నిషిద్ధం

వివాహ వ్యవస్థ ఓ పవిత్రమైన బంధం. శీలరక్షణతో పాటు ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణంలో కీలకపాత్ర వహించగల కుటుంబవ్యవస్థకు ఇది పటిష్ఠమైన పునాది. అందువల్ల వివాహం జరిగిన తరువాత అకారణంగా దాన్ని విచ్ఛేదం చేయడానికి, లేదా నిర్ణీత ప్రతిఫలం ఇచ్చి నిర్ణీత గడువు షరతుపై వివాహం చేసుకొని గడువు తీరిపోగానే విడిపోవడానికి ఇస్లాం అనుమతించదు.

నిర్ణీతపైకం చెల్లించి నిర్ణీతగడువు షరతుపై వివాహమాడే పద్ధతిని "ముత్‌ఆ" అంటారు. అంటే తాత్కాలిక వివాహం అన్నమాట. మరో మాటలో చెప్పాలంటే ఇది ఒప్పందంతో కూడిన పచ్చివ్యభిచారం. ఈ ఒప్పందం ద్వారా నిర్ణీతకాలం కోసం ఏకమయ్యే స్త్రీపురుషుల్ని **"అద్దెపెళ్ళాం, అద్దెమొగుడు"** అని మాత్రమే చెప్పవలసి వస్తుంది. ఈ దురాచారం అజ్ఞాన కాలంనాటి అరబ్బులలో ఉండేది. ఇస్లాం ప్రారంభ కాలంలో, అంటే ధర్మశాస్త్రం ఆదేశాలు పూర్తిగా వెలువడని రోజుల్లో దైవప్రవక్త (సల్లం) దీని కొనసాగింపుకు తాత్కాలిక అనుమతి ఇచ్చారు. తర్వాత ఈ దురాచారాన్ని శాశ్వతంగా అంతమొందించారు.

హజ్రత్ సబ్రా జహ్నీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రజలారా! నేను మీకు మొదట్లో 'ముతా' (తాత్కాలిక వివాహం) చేసుకోవడానికి అనుమతి ఇచ్చాను. అయితే దేవుడు ఇప్పుడు దీన్ని ప్రళయందాకా (శాశ్వతంగా) నిషేధించాడు. కనుక మీలో ఎవరి దగ్గరయినా తాత్కాలిక వివాహం చేసుకున్న స్త్రీ గనక ఉంటే ఆమెను వదిలేయండి. ఆమెకిచ్చిన ప్రతిఫలం మాత్రం వాపసు తీసుకోకండి." (ముస్లిం, అహ్మద్)

హజ్రత్ అలి (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "ఖైబర్ యుద్ధకాలంలో దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని 'ముత్‌ఆ' చేయకూడదని, గాడిద మాంసం తినకూడదని వారించారు." (బుఖారి, ముస్లిం)



## వితంతు వివాహానికి ఇస్లాం ప్రోత్సాహం

ఇస్లాం వితంతు వివాహాన్ని ఎంతగానో ప్రోత్సహించింది. దివ్యఖుర్‌ఆన్ ఆదేశం ఈ విధంగా ఉంది: "మీలో భార్యావిహీనులుగా, భర్తవిహీనులుగా ఉన్నవారికి పెళ్ళిళ్ళు చేయండి." (24:32) ఈ ఆజ్ఞలో పెళ్ళికాని కన్యలు, విడాకులివ్వబడిన స్త్రీలతో పాటు వితంతువులు కూడా చేరి ఉన్నారు.

వితంతు వివాహం విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"పేదలు, వితంతువుల సంక్షేమం కోసం పాటుపడే మనిషి దైవమార్గంలో (ధర్మ సంస్థాపన కోసం) పోరాడే యోధుడి లాంటి వాడు. అంతేకాదు, పగలల్లా ఉపవాసాలు పాటిస్తూ రాత్రివేళల్లో ఉదయందాకా నమాజుచేసే భక్తుడిలాంటివాడు కూడా." (బుఖారి)

"కళావిహీనమైన చెక్కిళ్ళుగల స్త్రీ (అంటే వితంతువు), నేను ప్రళయదినాన ఈ విధంగా దగ్గరయి ఉంటాము." ఈ హదీసును ఉల్లేఖించినవారు ఈవిధంగా అంటూ తన చూపుడు వ్రేలు, మధ్యవ్రేలు చూపించారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో మాట్లాడుతూ "ప్రళయదినాన అందరికంటే ముందు నేను స్వర్గంలో ప్రవేశించడానికి స్వర్గ ద్వారం తెరుస్తాను. అయితే ఒక స్త్రీ నా కంటే కూడా ముందు స్వర్గంలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంది. నేనామెను 'ఎవరు నీవు?' అని అడుగుతాను. దానికామె 'నేను కొందరు చిన్న చిన్న అనాథ పిల్లలు ఉన్న ఒక వితంతువుని' అని అంటుంది." (అబూదావూద్)

## నికాహ్ (వివాహం) విధానం

ఇస్లాంలో వివాహం చేసుకోవడం చాలా సులభం. ప్రాజ్ఞులు, వయోజనులయిన ఇద్దరు ముస్లిం స్త్రీపురుషులు పరస్పరం ఒప్పుకుంటే నికాహ్ (వివాహం) అవుతుంది. పరస్పర అంగీకారం తప్పనిసరిగా ఉండాలి. ఇది మొదటి షరతు.

వివాహం కావడానికి రెండవ షరతు సాక్ష్యం. సాక్ష్యం లేకుండా వివాహం సరికాదు. వధూవరులు పరస్పరం ఒప్పుకున్నట్లు సాక్ష్యం తప్పనిసరిగా ఉండాలి. ప్రాజ్ఞులు, వయో జనులయిన కనీసం ఇద్దరు ముస్లిం పురుషులుగాని లేదా ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలుగాని సాక్షులుగా ఉండాలి.

మూడవ షరతు వరుడు తప్పనిసరిగా వధువుకు చెల్లించవలసిన మహర్. మహర్ స్త్రీ ఆస్తి అవుతుంది. దాన్ని వరుడు వివాహ సందర్భంలోనే వధువుకు ఇచ్చేస్తే మంచిది. వెంటనే ఇవ్వలేని పక్షంలో ఆ తరువాతయినా వీలైనంత త్వరగా ఇచ్చేయాలి.

వివాహం చేసుకునే రెండవ పద్ధతి వకీలు (న్యాయవాది) ద్వారా చేసుకునే పెళ్ళి. పైన పేర్కొన్న మూడు షరతులతో వకీలు సమక్షంలో వివాహం చేసుకోవచ్చు. వివాహం అనేది ఒక స్త్రీ, ఒక పురుషుని మధ్య జరిగే ఒప్పందం. అందువల్ల వకీలు సంతకంతో

పాటు వధూవరుల సంతకాలు, సాక్షుల సంతకాలు, మహర్ ధనం, తేదీ, స్థలం వగైరా వివరాలను దస్తావీజులో తీసుకోవడం చాలా అవసరం.

ఇలాంటి పెళ్ళి కోసం ముహూర్తం పెట్టుకొని తేదీ, సమయం, స్థలం గురించి ఒక ప్రకటన చేస్తూ బంధుమిత్రుల్ని ఆహ్వానించాలి. ఇది ప్రవక్త సంప్రదాయం. దైవప్రవక్త (సల్లం) తన ప్రియకుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి)ను హజ్రత్ అలీ (రజి)కి ఇచ్చి వివాహం చేస్తున్న సందర్భంలో ఆయన తన అనుచరుల్లో కొందరిని పిలిపించారు.

## పండుగరోజుల్లో కూడా పెళ్ళి, పెళ్ళిపాటలు

పండుగరోజుల్లో కూడా పెళ్ళిళ్ళు చేయవచ్చు. పెళ్ళి సందర్భంలో పాటలు కూడా పాడవచ్చు. డప్పు కూడా వాయించవచ్చు.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "నా వివాహం షవ్వాల్ నెలలో పండుగ నెలవంక రోజున జరిగింది. నా వీడ్కోలు కూడా షవ్వాల్ నెలలో పండుగ నెలవంక రోజునే జరిగింది. ఇప్పుడు మీరే చెప్పండి, దైవప్రవక్త (సల్లం) భార్యలలో నాకంటే ఎక్కువ అదృష్టవంతురాలు ఎవరుంటారు?'' (ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "మా ఇంట్లో అన్సార్ కుటుంబానికి చెందిన ఒక అమ్మాయి ఉండేది. నేనా అమ్మాయికి పెళ్ళి చేశాను. అప్పుడు దైవప్రవక్త (సల్లం) 'ఆయిషా! నువ్వు ఎవరిచేతనైనా పాట పాడించవా? ఈ అన్సార్ ప్రజలకు పాటలంటే చాలా ఇష్టం' అని అన్నారు. (ఇబ్నెహబాన్)

హజ్రత్ రబీ బిన్తె మావుజ్ (రజి) కథనం: "నా పెళ్ళి అయిన తరువాత పుట్టింటి నుండి మెట్టింటికి వచ్చాను. అప్పుడు దైవప్రవక్త (సల్లం) నాకు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చారు. ఆయన నా పడక మీద కూర్చున్నారు. అంతలో మా వంశానికి చెందిన కొందరు అమ్మాయిలు వచ్చి డప్పు వాయిస్తూ పాట పాడటం ప్రారంభించారు. వారిలో ఒక అమ్మాయి 'మా దగ్గర దైవప్రవక్త (సల్లం) ఉన్నారు. ఆయనకు రేపు జరగబోయే విషయాలు కూడా తెలుసు' అని పాడింది. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని 'ఈమాట వదలి ఇంతకు ముందు చెప్పిన మాటలే చెబుతూ పాడు' అని అన్నారు."

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒక అన్సార్ యువతికి (పెళ్ళయి) వీడ్కోలు జరిగింది. పెళ్ళి చాలా నిరాడంబరంగా జరిగింది. అప్పుడు దైవప్రవక్త (స) మాట్లాడుతూ "మీ దగ్గర డప్పు వగైరాలాంటి వినోద సామగ్రి ఏదీ లేదా? ఇలాంటి శుభసందర్భాలలో అన్సార్‌లు పాటలు, వాయిద్యాలంటే చెవికోసుకుంటారు'' అని అన్నారు. (బుఖారి)

## మనస్సును మభ్యపెట్టే పాటలు, వాయిద్యాలు

ఈ పాటలు, వాయిద్యాలు హద్దుమీరితే దైవాగ్రహానికి కారణభూతమవుతాయి. ఖుర్ఆన్‌లో మనస్సును మభ్యపెట్టే విషయాలను తీవ్రంగా నిరసించడం జరిగింది.



"మానవుల్లో మనసును మభ్యపెట్టే వ్యర్థ వస్తువుని కొనితెచ్చేవాడు కూడా ఒకతను ఉన్నాడు. అతను (సరైన) జ్ఞానం లేకుండా ప్రజల్ని దైవమార్గం నుండి తప్పించి, ఆ ప్రచారాన్ని పరిహసించడానికే ఇలాంటి చేష్టలకు పాల్పడ్డాడు. ఇటువంటి వారికి అవమాన కరమైన శిక్ష కాచుకొని ఉంది." (ఖుర్ఆన్–31:6)

ఈసూక్తిలో 'మనస్సును మభ్యపెట్టే వ్యర్థవస్తువు' అనే పదమున్నచోట మూలభాష లో 'లహ్వల్‌హదీస్' అనే పదం వచ్చింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ని లహ్వల్‌హదీస్ అంటే ఏమిటని అడిగితే, ఆయన దేవునిపై ప్రమాణంచేసి "లహ్వల్‌హదీస్ అంటే పాటలు (సంగీతం)'' అని మూడుసార్లు నొక్కిచెప్పారు. (ఇబ్నె జరీర్, బైహఖి)

''పాటలుపాడే స్త్రీలను అమ్మడం, కొనడం, వారి వ్యాపారం చేయడం ధర్మసమ్మతం కాదు'' అన్నారు దైవప్రవక్త (సల్లం)- (తిర్మిజి). ఆయన మరో సందర్భంలో "పాటలు పాడే బానిసస్త్రీ సభలో కూర్చొని, ఆమె పాటలు వినేవాడి చెవిలో ప్రళయదినాన కరిగించిన సీసం పోయబడుతుంద''ని అన్నారు. (అహ్‌కాముల్ ఖుర్ఆన్- ఖాజీ అబూబకర్)

ఈనాడు ఆర్ట్ పేర అశ్లీలాన్ని వ్యాపింపజేస్తూ, కల్చరల్ ప్రోగ్రాం పేర అర్ధనగ్న విన్యాసాల్ని ప్రదర్శిస్తూ జీవిత ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరలింపజేసే వ్యర్థ కార్యకలాపాలన్నీ 'లహ్వల్ హదీస్' క్రిందికే వస్తాయి.

## వలిమా విందు ప్రవక్త సంప్రదాయం

పెళ్ళితంతు ముగిసిన తరువాత ఒక సాంప్రదాయక ప్రసంగం, సామూహిక ఆశీర్వాదాలు ఉంటాయి. ఆ తరువాత వధువు మెట్టింటికి చేరుకున్నాక వరుని తరపున "వలీమా" చేయాలి. పెళ్ళి సంతోషాన్ని పదిమందితో పంచుకోవడానికి బంధుమిత్రులకు విందు భోజనం ఏర్పాటు చేయడం కూడా ప్రవక్త సంప్రదాయమే.

హజ్రత్ అనస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జైనబ్ (రజి)ను వివాహ మాడినప్పుడు ఎంతోమంచి వలీమా విందు ఇచ్చారు. అంతటి మంచివిందు మరే భార్యను చేసుకున్నప్పుడు కూడా ఇవ్వలేదు. హజ్రత్ జైనబ్ (రజి) వివాహంలో ఆయన ఒక మేకను కోసి వలీమా విందు చేశారు.'' (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఖైబర్ యుద్ధం నుండి మదీనా తిరిగొస్తూ దైవప్రవక్త (సల్లం) దారిలో ఒకచోట హజ్రత్ సఫియా (రజి)ను వివాహమాడారు. అప్పుడు నేను (ఆయన ఆజ్ఞతో) ముస్లింలను వలిమావిందుకు ఆహ్వానించాను. తర్వాత ఆయన ఆదేశంతో భోజన వస్త్రం పరిచాను. దాని మీద కొన్ని ఖర్జూరపండ్లు, జున్ను ముక్కలు, నెయ్యి మాత్రమే పెట్టబడ్డాయి. అంతకు మించి మరేమీ లేవు.'' (బుఖారి)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) బట్టల మీద పసుపుపచ్చ రంగు చూసి ఇదేమిటీ అని అడిగారు. దానికి హజ్రత్ అబ్దుర్రహ్మాన్

(రజి) సమాధానమిస్తూ “నేను పెళ్ళి చేసుకున్నానండీ! పావు తక్కువ పదహారు (తులాల) బంగారం మహర్‌గా నిర్ణయమయింది” అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ శుభవార్త విని “దేవుడు నీకు శుభం చేకూర్చుగాక! సరే, నువ్వు ఒక మేకయినా సరే కోసి వలిమా విందు చెయ్యి” అని చెప్పారు. (ముత్తఫఖున్ అలై)

# 11. వరకట్న రక్కసి

ఈనాడు మహర్, కన్యాశుల్కాల స్థానంలో వరకట్న రక్కసి చోటుచేసుకొని కరాళ నృత్యం చేస్తోంది. ఎవరైనా సంబంధం తీసుకురాగానే అబ్బాయి తల్లిదండ్రులు మొట్ట మొదట అడిగే ప్రశ్న **“కట్నం ఎంతిస్తారట?”** అనేదే. అంతేగాని, ఆ అమ్మాయి చదువు, సంస్కారం, గుణగణాలు ఎలాంటివి, ఆమె కుటుంబ మర్యాదలు ఏమిటీ అని విచారించరు. సంబంధం నిశ్చయమైందని తెలియగానే ఇరుగుపొరుగు అమ్మలక్కలు కూడా వచ్చి అమ్మాయి తరపువాళ్ళు ఎంత కట్నం ఇస్తున్నారు, ఏమేం కానుకలు ఇస్తున్నారు అని అడుగుతారు.

ఇప్పుడు కట్నం వేరు, కానుకలు వేరు. కట్నం అంటే నగదు పైకం. ఇది వేల నుండి లక్షల్లో ఉంటుంది. కానుకలు అంటే వస్తురూపేణ ముట్టవలసిన ముడుపులు. ఇది చెంబు, తపేళ, కంచం, మంచం లాంటి సాధారణ వస్తువులు కాదు. సాధారణ ఉద్యోగి సయితం స్కూటర్, టీవీ, ఫ్రిజ్ మొదలయిన ఎంతో విలువయిన వస్తువుల్ని డిమాండ్ చేస్తున్నాడు. పెళ్ళికి ముందే వరుని తల్లిదండ్రులు కట్నం,కానుకల విషయం లో బేరసారాలు సాగించి మరీ సంబంధానికి తమ ఆమోదముద్ర వేస్తారు. కొన్ని చోట్ల కట్నం డబ్బు అడ్వాన్సుగా పెళ్ళికి ముందే తీసుకుంటున్నారు.

ఇలా పెళ్ళిళ్ళు ఓపెద్ద లాభసాటి వ్యాపారంగా తయారై, మగపిల్లలు సంతలో సరుకుల్లా ఆడపిల్లల తల్లిదండ్రులకు అమ్ముడుపోతున్నారన్నమాట!

వరకట్నం ప్రపంచంలో భారత ఉపఖండంలోనే సాగుతుంది. ఇదసలు హిందూ ఆచారాల పర్యవసానంగా ఉనికిలోకి వచ్చింది. దాని దుష్ప్రభావం ముస్లిమ్ సమాజంపై కూడా పడింది. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం కుమార్తెకు తండ్రి ఆస్తిలో వాటా ఉండదు కనుక, పెళ్ళి సమయంలోనే కట్న కానుకల రూపంలో కొత్త సంసారం కోసం పెద్దఎత్తున వస్తుసామగ్రినిచ్చి ఆమెను కాపురానికి పంపుతారు. ఈ ఆచారమైనా మొదట్లో ఉన్నత కుటుంబాల్లోనే ఉండేది. తర్వాత క్రమంగా ఇది ఇతర వర్గాలలో కూడా వ్యాపించి మొత్తం హిందూసమాజాన్ని తన కర్కశకోరల్లోకి తీసుకుంది.

## వరకట్నం వాడికోరల్లో వధువులు విలవిల

మన దేశంలో ప్రతి ఏడూ వేలాదిమంది స్త్రీలు కట్నం కోరలకు బలవుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఉన్నప్పటికీ, ఎన్నో మహిళా సంస్థలు, స్త్రీ స్వాతంత్ర్య ఉద్యమాలు సాగుతున్నప్పటికీ కట్నం రాక్షసి యథేచ్ఛంగా స్వైరవిహారం చేస్తోంది. స్త్రీల హత్యలకు,



ఆత్మహత్యలకు తొంభయి శాతం కారణం ఈ కట్నాలు, కానుకలే అంటే అతిశయోక్తి కాదు. కట్నంజాడ్యం ఇప్పుడు ముస్లిం సమాజాన్ని కూడా పట్టి పీడిస్తోంది. ముస్లిం సమాజంలో ఈ దురాచారం చొచ్చుకురావడానికి సహవాస దోషం కారణమైనా ధర్మం పట్ల సరయిన అవగాహన, దైవం ఎడల తగిన భయభక్తులు కొరవడటం వల్ల ఇది మరింత తీవ్రరూపం దాల్చింది.

కేవలం మగపిల్లలు ఉన్న తల్లిదండ్రులు మాత్రమే కట్నాలు, కానుకల ద్వారా వేధింపు చర్యలకు పాల్పడటం లేదు. ఆడ, మగ సంతానమున్న తల్లిదండ్రులు కూడా తమ కొడుకుల విషయంలో ఇలాంటి అన్యాయాలకు, అక్రమాలకు వడిగడ్తున్నారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీరు తమ కుమార్తెల విషయంలోనూ తమపై ఇతరులు ఇలాంటి అన్యాయానికి పాల్పడతారని గ్రహించడం లేదు. గ్రహించినా వీరసలు కట్నాన్ని నేరంగా, పాపకార్యంగా భావించడానికి బదులు దాన్ని తప్పనిసరి రివాజుగా తలుస్తున్నారు.

ఏమైనప్పటికీ కట్నాలు, కానుకలు కోరుతూ వత్తిడి, బలాత్కారాల ద్వారా ఇతరుల ఆడపిల్లల్ని, వారి తల్లిదండ్రుల్ని పీడించడం విశ్వాసికి ఏ విధంగానూ శోభించదు. విశ్వాసుల వ్యవహారాలన్నీ పరస్పర అంగీకారంతో జరగాలి. కట్నం, కానుకల పేరిట వత్తిడి తెచ్చి తోటి సోదరుని హక్కును కొల్లగొట్టడం అన్యాయం, అధర్మం. షరీఅత్‌లో వీటికి ఎలాంటి స్థానం లేదు.

“మీరు ఒకరి ధనాన్ని మరొకరు అక్రమంగా కబళించకండి. అలాగే ఇతరుల సొత్తును అన్యాయంగా కాజేసే ఉద్దేశ్యంతో ఆ వ్యవహారాన్ని అధికారుల దగ్గరకు తీసి కెళ్ళకండి.” (ఖుర్‌ఆన్–2:188)

“విశ్వాసులారా! **మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి.** పరస్పర ఆమోదంతో వ్యాపార లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్య, ఆత్మహత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చు కోకండి. దేవుడు మీ విషయంలో ఎంతో దయామయుడని తెలుసుకోండి. అన్యాయం, అక్రమాలతో ఇలాంటి పనులు చేసేవాడ్ని మేము త్వరలోనే నరకాగ్నిలో విసిరేస్తాం.” (ఖుర్‌ఆన్– 4:29,30)

## తలకుమించిన కానుకలతో తల్లిదండ్రుల బాధ

వివాహ సమయంలో తల్లిదండ్రులు తమ కుమార్తెకు, అల్లుడికి సంతోషంతో ఏదైనా కానుకలు ఇస్తే వాటిని తీసుకోవచ్చు. అలా తప్పనిసరిగా ఇవ్వాలన్న నియమం కూడా ఏమీ లేదు. చాలామంది తల్లిదండ్రులు నేటి వరకట్న పరిస్థితికి తలవొగ్గి తలకు మించిన కానుకలు ఇస్తున్నారంటే అది వారు మనస్ఫూర్తిగా ఇస్తున్నారని భావించ కూడదు. కాని మగపిల్లల తల్లిదండ్రులు వాటితో కూడా తృప్తిపడక మరిన్ని

కానుకలు అడగడం ఆడపిల్లల తల్లిదండ్రుల విషయంలో **మూలిగే నక్కపై తాటిపండు** విసరడమే అవుతుంది.

అజ్ఞానం, అనాగరికం మూలంగా ఎవరైనా ఇలాంటి దురాచారాలకు, దుష్టకార్యాలకు పాల్పడుతున్నారంటే అది కొంతవరకు సబబైనదే. కాని నమాజులు చేస్తూ, రోజాలు పాటిస్తూ గొప్ప ధార్మికులనబడేవారు సయితం వధువు తల్లిదండ్రుల నుంచి లక్షలు గుంజడం ఎంతో శోచనీయమైన విషయం. పైగా కొందరు కట్నకానుకల్ని ధర్మబద్ధమైన విషయాలుగా చిత్రించడానికి అతితెలివిని ఉపయోగిస్తూ, హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళిలో ఇవ్వబడిన కొన్ని సాధారణ గృహోపకరణాల ఉదాహరణ ఇస్తారు. కాని ఈ గృహోపకరణా లను దైవప్రవక్త (సఅసం) ఎలా తెచ్చిచ్చారు, వాటిని ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది మొదలైన వాస్తవాలను వీరు విస్మరిస్తున్నారు.

## ప్రవక్తకుమార్తె పెళ్ళిలో ఇచ్చిన కానుకలు

హజ్రత్ ఫాతిమా (రజి) పెళ్ళి అయ్యేదాకా హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (సఅసం) సంరక్షణలోనే పెరిగారు. ఆయనకు దైవప్రవక్త (సల్లం) తప్ప ఇతర ఆప్తులు కూడా లేరు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) వారిద్దరి కొత్తకాపురం కోసం కావలసిన కనీస గృహోప కరణాలు ఇవ్వడం అనివార్యమయ్యింది. అదైనా హజ్రత్ అలి (రజి) మహర్ చెల్లించ వలసి ఉన్నందున దైవప్రవక్త (సల్లం) ఆయన దగ్గరున్న యుద్ధకవచం తీసుకొని అమ్మి వీటిని కొనిచ్చారు.

సీరత్ గ్రంథాల అధ్యయనాన్ని బట్టి దైవప్రవక్త (సల్లం) ఆ యుద్ధకవచం అమ్మగా వచ్చిన డబ్బుతో ఒక పడక, ఒక తలగడ, కొన్ని మట్టి పాత్రలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన 'మహర్'ని అడ్వాన్సుగా తీసుకొని వీటిని కొనిచ్చారు. ఇలా అడ్వాన్సు మహర్ పైకం తీసుకొని కొత్త సంసారానికి కావాల్సిన సామగ్రిని కొనిచ్చే సంప్రదాయం ఈనాడు కూడా ఈజిప్ట్ తదితర దేశాల్లో కొనసాగుతోంది.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా గృహోపకరణాలను హజ్రత్ ఫాతిమా (రజి)కు మాత్రమే ఇచ్చారు గాని, తన ఇతర కుమార్తెలెవరికీ ఇచ్చినట్లు చరిత్రలో మనకు ఎక్కడా ఆధారాలు లభించవు. దీన్ని సాకుగా తీసుకొని వేలాది రూపాయల కానుకల్ని గుంజడం ఏ విధంగానూ ధర్మసమ్మతం కాజాలదు, పైగా అది ఇహలోకంలో దేశచట్టం దృష్టి లోనూ, పరలోక పర్యవసానం రీత్యానూ ఘోరమైన నేరం అవుతుంది.

అడిగి లేదా వత్తిడిచేసి తీసుకున్న కట్నం కూడా ఒక విధమయిన లంచంలా అధర్మమేనని కొందరు ధర్మవేత్తలు అన్నారు. కనుక ఎవరైనా తెలియక తీసుకుంటే తిరిగి ఇచ్చివేయడం వాజిబ్ (విధి) అని కూడా వారు పేర్కొన్నారు. ఈ కాలానికి భిన్నంగా పూర్వం ఒకప్పుడు వధువు తల్లిదండ్రులే వరుని తల్లిదండ్రుల నుంచి కొంత పైకం తీసుకొని తమ కూతుర్ని అత్తవారింటికి పంపించేవారు. ఆనాడు ఫిఖావేత్తలు దీన్ని లంచంగా, అధర్మంగా పరిగణించి తిరిగిచ్చేయాలని తీర్పిచ్చారు.



వధువు తల్లిదండ్రులు కూతుర్ని పంపేటప్పుడు అల్లుడి నుంచి ఏదైనా పైకం తీసుకునివుంటే దాన్ని వాపసు తీసుకునే హక్కు ఆ అల్లుడికి ఉంటుందని "ఫతావా ఆలంగీర్"లో ఉంది. "ఫతావా షామియా" మరో అడుగు ముందుకువేసి, ఇచ్చేవాడు సంతోషంగా ఇచ్చినాసరే ఈ పైకం 'సుహత్' (అధర్మం) అవుతుందని పేర్కొన్నది.

మగపిల్లవాడి నుండి కట్నం తీసుకోవడం ఎలా అధర్మం అవుతుందో ఆడపిల్ల లేదా ఆమె తల్లిదండ్రుల నుండి తీసుకోవడం కూడా అధర్మం అవుతుంది. ఆడపిల్ల తల్లిదండ్రులు కనీసం పదిహేనేళ్ళపాటు తమ కూతురిపోషణ, శిక్షణలకై డబ్బు ఖర్చు పెట్టి ఆమెను ఒక అయ్య చేతిలో పెట్టేందుకు తయారుచేసి ఉంచుతారు. అందువల్ల కట్నం తీసుకునే విషయానికొస్తే అలా తీసుకునే హక్కు ఆడపిల్ల తల్లిదండ్రులకే ఉండాలని మానవమేధ అంటుంది. కాని ఆడపిల్ల తల్లిదండ్రులు కూడా కట్నం తీసుకోవడాన్ని షరీఅత్ వేత్తలు నిషేధించారు. అలాంటప్పుడు మగపిల్లవాని తరఫువారు తీసుకునే కట్నం ఏవిధంగా ధర్మసమ్మతమవుతుంది?

కనుక ఏవిధంగా చూసినా పురుషుడు కట్నం, కానుకలు తీసుకోవడం పూర్తిగా అధర్మమని, పాపమని స్పష్టమవుతుంది. దీన్ని నిరోధించడానికి తక్షణచర్యలు గైకొనాలి. శక్తి, అధికారం కలిగినవారు ఇలాంటి సామాజిక రుగ్మతల్ని నిర్మూలించకపోతే దాని దుష్పరిణామాలను మొత్తం సమాజం చవిచూడవలసి వస్తుంది.

"మీలో పాపాలు చేసినవారికి మాత్రమే పరిమితమయిపోని ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దేవుడు అతి కఠినంగా శిక్షించేవాడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-8:25)

# 12. మహర్ (స్త్రీ ధనం)

స్త్రీపురుషుల కోసం దేవుడు నిర్ణయించిన కార్యాచరణ పరిధుల్ని వారు అతిక్రమించినప్పుడల్లా కుటుంబ జీవితంలో కలతలే చెలరేగుతుంటాయి. అందువల్ల ఇస్లాం స్త్రీ పురుషుల బాధ్యతల్ని, హక్కుల్ని వారి ఇష్టాయిష్టాలకు వదలేయకుండా స్వయంగా వాటి స్వరూపస్వభావాల్ని నిర్ణయించింది. ముఖ్యంగా భార్యభర్తలు నిర్వహించవలసిన హక్కులు, బాధ్యతలకు కుటుంబవ్యవస్థలో ఎంతో ప్రాముఖ్యంఉంది. వివాహబంధం ద్వారా స్త్రీపురుషులు భార్యాభర్తలు అవడంతో కుటుంబ వ్యవస్థకు పునాదులు పడతాయి. పరస్పర అంగీకారం, మహర్ చెల్లింపులతో వివాహబంధం ఏర్పడుతుంది.

మహర్ అనేది పురుషుడి నుండి స్త్రీకి సంక్రమించవలసిన ఆర్థిక హక్కు. కనుక వధువుకు వరుడు మహర్ (వధుకట్నం) చెల్లించాలి. ఏదైనా కారణం వల్ల మహర్ వివాహ సమయంలో చెల్లించలేకపోతే ఆ తరువాతయినా వీలైనంత త్వరగా చెల్లించాలి. ఇది స్త్రీ ఆస్తిహక్కు. దాన్ని ఆమెకు తప్పకుండా ఇచ్చేయాలి. ఇవ్వకపోతే పురుషుడు ఘోరమైన పాపం చేసినవాడవుతాడు; ప్రళయదినాన పట్టుబడతాడు.

మహర్ త్వరగా చెల్లించకుండా ఏళ్ళతరబడి గడపడం మంచిది కాదు. అందునా రోజురోజుకు ధరలు పెరుగుతూ, రూపాయివిలువ తరుగుతున్న ఈరోజుల్లో మహర్ చెల్లింపులో జాప్యం చెయ్యడమంటే భార్యహక్కును తొక్కిపట్టడమే. స్త్రీ హక్కును త్వరగా నెరవేర్చినప్పుడే పురుషుడు స్త్రీతో కాపురం చేయడానికి అర్హుడవుతాడు.

## మహర్ ఎప్పుడు ఇవ్వాలి?

భర్త ఆర్థిక దుస్థితి గమనించి స్త్రీ మహర్ పైకం చెల్లించడానికి తన భర్తకు కొంత వ్యవధి ఇయ్యవచ్చు లేదా మహర్ కొంచెం తగ్గించి తీసుకోవచ్చు. అవసరమైతే మహర్ మొత్తం అసలు తీసుకోకుండా వదలి పెట్టవచ్చు.

"(వివాహ నిషిద్ధులయిన) ఈ స్త్రీలు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధనవినియోగం ద్వారా మీరు వివాహమాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వ మయి ఉండకూడదు. మీరు వారి వల్ల అనుభవించే దాంపత్య సుఖానికిగాను వారికి చెల్లించవలసిన నిర్ణీత మహర్‌ధనాన్ని విధిగా భావించి చెల్లించాలి. కాకపోతే మహర్ నిర్ణయం జరిగిన తరువాత మీరిద్దరు ఆ విషయంలో పరస్పరం ఇష్టపూర్వకంగా ఏదైనా చేయదలచుకుంటే చేయవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు. దేవుడు సమస్తం ఎరిగినవాడు; ఎంతో వివేచనాపరుడు. (ఖుర్ఆన్-4:24)

"స్త్రీలకు లభించవలసిన మహర్ (వధుకట్నం)ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు గనక సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు." (ఖుర్ఆన్-4:4)

కాని స్త్రీధనం విషయంలో నేటి ముస్లింల పరిస్థితి చాలా శోచనీయంగా ఉంది. ఎంతో నాగరికత అభివృద్ధి చెందిన నేడు కూడా స్త్రీలకు ఇవ్వడానికి బదులు స్త్రీల నుండే పురుషులు కట్నాలు, కానుకల రూపంలో లక్షలు గుంజుతూ వారి జీవితాలను దుర్భరం చేస్తున్నారు. దస్తావీజుల్లో మటుకు మహర్ చెల్లిస్తామని వ్రాయిస్తారు. కాని ఆ స్త్రీ చనిపోయే వరకూ ఇవ్వరు. స్త్రీకి ముందు పురుషుడు చనిపోతే మహర్ పైకం మాఫీ చేయమని ఆమెపై బంధువులు వత్తిడి చేస్తారు. శోకమూర్తి అయిన ఆ స్త్రీ భర్తకు చెల్లించాల్సిన మహర్‌ను మాఫీ చేయడం తప్ప గత్యంతరం ఉండదు.

## స్త్రీకిచ్చిన మహర్, కానుకలన్నీ ఆమె ఆస్తులే

పురుషుడు పెళ్ళయిన తరువాత భార్యకు ఇవ్వబడిన నగలు తదితర కానుకల్ని తనవిగా భావించి దుర్వినియోగం చేయకూడదు.

"విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మసమ్మతం కాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్ ధనంలో కొంతభాగం కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు." (ఖుర్ఆన్-4:19)



మహర్ సొత్తు, ఇతర కానుకల రూపంలో పురుషుడు స్త్రీకి ఎంత పెద్ద ధనరాసి ఇచ్చి ఉన్నా అవన్నీ ఆమె సొంత ఆస్తుల క్రిందికి వస్తాయి. వాటిని పురుషుడు మళ్ళీ తీసుకోకూడదు. అలాగే మహర్‌కు పరిమితి విధించి అంతే చెల్లించాలని షరతులు పెట్టడానికి కూడా ఎవరికీ అధికారం లేదు.

"మీరు గనక ఒకభార్య స్థానంలో మరొక భార్యను చేసుకోవడానికి నిర్ణయించుకుంటే, మొదటి భార్యకు మీరు (మహర్‌గా) ఎంతపెద్ద ధనరాసి ఇచ్చివున్నా దాన్ని ఎలాంటి పరిస్థితిలోనూ మళ్ళీ తీసుకోరాదు. మీరామెపై నీలాపనిందలు వేసి, మరీఅంత అన్యాయంగా దాన్ని తిరిగి తీసుకుంటారా? (ఎంత సిగ్గుచేటు!) మీరిద్దరు ఒకరి ద్వారా మరొకరు సుఖం అనుభవించారు. ఆమె మీదగ్గర (వివాహం ద్వారా) గట్టి వాగ్దానం తీసుకుంది. అలాంటప్పుడు మీరామె ధనాన్ని బలవంతంగా ఎలా తీసుకుంటారు?" (ఖుర్ఆన్-4:20,21)

మహర్ చెల్లింపు విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఎగవేసే ఉద్దేశ్యం పెట్టుకొని మహర్ కింద కొంత పైకం చెల్లించే ఒప్పందంతో ఏదైనా స్త్రీని వివాహమాడిన పురుషుడు వాస్తవంగా ఒక వ్యభిచారి. అప్పు తీసుకొని తిరిగి చెల్లించే ఉద్దేశ్యం లేనివాడు వాస్తవంగా ఒక దొంగ." (హదీసు)

"మీలో ఎవరికైనా విశ్వసించిన స్వతంత్ర స్త్రీలను వివాహమాడే స్తోమత లేకపోతే అలాంటివారు తమ అధీనంలోకి వచ్చిన ముస్లిం బానిస స్త్రీలను వివాహమాడాలి. దేవునికి మీ విశ్వాసస్థితి బాగా తెలుసు. మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాశికి చెందినవారు. కనుక బానిస స్త్రీలను వారి యజమానుల అనుమతి తీసుకొని వివాహమాడండి. చట్టం ప్రకారం వారికి చెల్లించవలసిన మహర్ ధనం కూడా చెల్లించాలి. అయితే వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచండి. విచ్చలవిడిగా చెడు తిరుగుళ్ళు తిరగనివ్వకండి. దొంగచాటుగా ప్రేమకలాపాలకు పాల్పడనీయకండి." (దివ్యఖుర్ఆన్-4:25)

## అవిశ్వాసుల మహర్ సమస్య

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు, హిజ్రత్ (వలస) చేసి మీ దగ్గరకు (మదీనా) వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఓసారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే ఇక వారిని అవిశ్వాసుల దగ్గరికి తిప్పి పంపకండి. వారు అవిశ్వాసులకు (భార్యలుగా) ధర్మసమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మ సమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్ ధనాన్ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చి వేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ ధనం చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు."

"స్వయంగా మీరు కూడా అవిశ్వాసులయిన స్త్రీలను మీ వైవాహిక బంధంలో అట్టే ఆపి ఉంచకండి. అవిశ్వాసులైన మీ భార్యలకు మీరిచ్చిన మహర్ ధనాన్ని అడిగి

తీసుకోండి. అలాగే అవిశ్వాసులు కూడా తమ ముస్లింభార్యలకు లోగడ ఇచ్చిన మహర్‌ధనాన్ని వారి నుండి అడిగి తీసుకోవచ్చు. ఇది దైవాజ్ఞ. దేవుడు మీమధ్య (ఈ విధంగా) తీర్పుచేస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు. ఎంతో వివేకవంతుడు."

"ఒకవేళ మీరు (అవిశ్వాసులైన) మీభార్యలకు ఇచ్చిన మహర్ అవిశ్వాసుల నుండి మీకు తిరిగిలభించని పక్షంలో, మీవంతు వచ్చినప్పుడు, అవిశ్వాసులకు మీరు చెల్లించ వలసిన ధనాన్ని (వారికందజేయకుండా) ఇటు మహర్ నష్టపోయినవారికి ఇచ్చేయండి. మీరు విశ్వసించిన దేవునికి భయపడుతూ మసలుకోండి." (ఖుర్‌ఆన్- 60:10,11)

"దేవుడు తన సూక్తులు వివరిస్తూ మీకు పూర్వం సజ్జనులు నడచిన బాటలోనే మిమ్మల్ని నడపగోరుతున్నాడు. ఆయన మిమ్మల్ని కటాక్షించదలిచాడు. దేవుడు గొప్ప జ్ఞానసంపన్నుడు, ఎంతో వివేకవంతుడు. ఆయన మిమ్మల్ని కటాక్షించదలిచాడు. అయితే మనోవాంఛలకు బానిసలయినవారు మిమ్మల్ని సన్మార్గం నుంచి తప్పించి దూరంగా ఉంచగోరుతున్నారు. మానవుడు (సహజంగానే) బలహీనుడిగా పుట్టాడు. అందువల్ల దేవుడు మీపై ఉన్న ఆంక్షల భారాన్ని తగ్గించదలిచాడు." (ఖుర్‌ఆన్-4:26-28)

ఇస్లాం మూఢాచారాలు, అన్యాయంతో కూడిన కఠోరనియమాల్ని సమూలంగా తుడిచి పెట్టదలచింది. తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు వాటా ఇవ్వకపోవడం, వితంతువుని అత్తవారి ఆంక్షల నుండి బయటపడకుండా అణచిపెట్టడం, (గడువు తీరినా స్త్రీకి రెండవ పెళ్ళికి స్వేచ్ఛ నివ్వక పోవడం, ముట్టయిన స్త్రీని అంటరానిదిగా చేసి ఆమెపై అనేక ఆంక్షలు విధించడం, సవతితల్లిని పెండ్లాడటం, ఏకకాలంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళను వివాహబంధంలో ఉంచడం, ధన వికేంద్రీకరణను నిరోధించే దత్తస్వీకార విధానం, పెంపుడుకొడుకును కన్నకొడుకుగా పరిగణించి రక్త సంబంధాలు ఏర్పరచడం మొదలైన దురాచారాలను ఇస్లాం నిర్మూలించ పూనుకుంది.

కాని మూఢులైన సనాతనవాదులు, కపటులు, యూదులు, స్వార్థపరులు ఈ సంస్కరణలను చూసి గగ్గోలు పెడ్తూ సంస్కరణ మార్గంలో అవరోధాలు సృష్టించడానికి, దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ ఇస్లాం తన సంస్కరణోద్య మాన్ని విజయవంతంగా ముందుకు తీసికెళ్ళింది.

## 13. బహుభార్యత్వం

ఖుర్‌ఆన్ ఒక ప్రత్యేక జాతి కోసం, ఒక ప్రత్యేక కాలం కోసం అవతరించలేదు. అంచేత దేశకాల స్థితులకు అతీతంగా అది కొన్ని షరతులతో బహుభార్యత్వానికి అనుమతి ఇచ్చింది. అయితే కొందరు ఖుర్‌ఆన్ సూక్తుల్ని అపార్థం చేసుకొని ఈ అనుమతి ఆ కాలం వరకే పరిమితం అని లేదా ఖుర్‌ఆన్ ఉద్దేశ్యం బహుభార్యత్వాన్ని క్రమేణా నిర్మూలించడం అని అనడం మనం వింటున్నాము. కొందరు తెలిసి కూడా ప్రజల్లో దుష్ప్రచారం చేస్తూ ముస్లిం వ్యక్తిగత చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు. కాని వాస్తవిక



దృష్టితో చూస్తే అన్ని విధాల న్యాయం చేయగలిగిన పురుషుడు ఒకరి నుంచి నల్గురు స్త్రీల వరకు వివాహంహ చేసుకోవచ్చని, అలా చేయలేకపోతే ఒక్కరితోనే తృప్తిపడమని ఖుర్‌ఆన్ బోధిస్తున్నట్లు గ్రహించగలరు.

"ఒకవేళ మీరు అనాథ బాలికలను పెళ్ళాడే పక్షంలో వారికి న్యాయం చేయలేమని భయపడితే (వారినొదలి) మీకు నచ్చిన (ఇతర)స్త్రీలలో ఇద్దర్నిగాని, ముగ్గుర్నిగాని, నల్గుర్ని గాని పెళ్ళి చేసుకోవచ్చు. అయితే వారిమధ్య కూడా మీరు న్యాయంగా వ్యవహరించలేమని భావిస్తే ఒక్కర్నే వివాహమాడండి; లేదా మీఅధీనంలోకి వచ్చిన (బానిస)స్త్రీలను వివాహ మాడండి. ఈ విధంగా న్యాయం చేయలేమన్న భయం మీకిక ఉండదు." (ఖుర్‌ఆన్-4:3)

పూర్వం అరబ్బులు అనేక మంది స్త్రీలను వివాహమాడేవారు. ఒక్కొక్కరి దగ్గర పదేసి మంది భార్యలు కూడా ఉండేవారు. తమ సంరక్షణలో ఉండే అనాథ బాలికల్ని కూడా చేసుకొని వారి ఆస్తుల్ని హరించేవారు. అదీగాక భార్యలందరి పట్ల సమానత్వం పాటించేవారు కాదు. కొందర్ని వేధించేవారు. ఈ స్థితిలో ఇస్లాం వచ్చి భార్యల సంఖ్యపై ఆంక్షలవేటు వేసింది. ఏకకాలంలో ఒక పురుషుడు నల్గురు భార్యలకన్నా ఎక్కువ మందిని కలిగి ఉండరాదని ఒక హద్దు ఏర్పరచింది. అంటే ఇది గరిష్ఠసంఖ్య అన్నమాట.

ఇస్లాం ఈ నలుగురిని కూడా కొన్ని షరతులు విధిస్తూ పెళ్ళిచేసుకునే అనుమతి ఇచ్చింది పురుషునికి. అంటే ఒకరి వైపు పూర్తిగా మొగ్గిపోయి మరొకర్ని నిర్లక్ష్యం చేయ కుండా భార్యలందరినీ సమానదృష్టితో చూస్తూ వారి పట్ల న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కొత్తగా పెళ్ళి చేసుకున్న పడుచుపెళ్ళాం మూలంగా కొందరు పురుషులకు పాతభార్యల మీద మోజు తగ్గిపోతుంది. దాంతో దాంపత్య జీవితం దుర్భరమై పోతుంది. అలాంటి పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంటే ఒక్క భార్యతోనే తృప్తిచెందాలని ఇస్లాం చెబుతోంది.

### పురుషసామర్థ్యం నల్గురు స్త్రీలకు సమానమా?

"లైంగికపరంగా, స్త్రీలో కంటే పురుషునిలోనే సామర్థ్యం, దుడుకు స్వభావం (Aggressive nature) ఎక్కువగా ఉంటాయి. అందువల్ల స్త్రీ ఒకే భర్త కలిగి ఉండేలా, పురుషుని భార్యలు పూర్వం నుండి వస్తున్న మితిమీరిన బహుభార్యత్వాన్ని కొన్ని షరుతు లతో గరిష్ఠంగా నలుగురికి పరిమితం అయ్యేలా ఇస్లాం చట్టాలు రూపొందాయి. అదీగాక బహుభార్యత్వం ఒక నైతిక, సాంస్కృతిక అవసరం కూడా. వైద్యకారణంతో లేదా మరేదైనా కారణంతో ఉన్నఒక భార్య ద్వారా సుఖం పొందలేని పురుషునికి రెండవ వివాహం చేసుకునే అవకాశం లేకపోతే అతను జీవితం మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకోవచ్చు. లేదా వ్యభిచారానికి పాల్పడవచ్చు. లేదా ఉన్న ఒక్క భార్యను శాశ్వతంగా కడతేర్చి మరో స్త్రీని వివాహమాడవచ్చు.

బహుభార్యత్వాన్ని నిషేధించి దాన్ని కఠినంగా అమలుపరుస్తున్న నేటిసమాజంలో ఇలాంటి వ్యభిచారం, హత్యలు, ఆత్మహత్యలు సర్వసాధారణమవుతున్నాయి. మరోవైపు

కట్నకానుకల వల్ల వివాహం కాకుండా ఏండ్ల తరబడి కూర్చునే యువతులు కూడా నిరాశానిస్పృహలకు లోనయి ఆత్మహత్యలకో, అక్రమపద్ధతులకో పాల్పడే ప్రమాదం ఉంది. ఏకపత్నీవ్రతాన్ని బోధించే సమాజాల్లోనూ అధికశాతం ప్రజలు క్రియాజీవితంలో బహుభార్యత్వాన్ని దోషబుద్ధి (Guilty conscience)తో అమలు జరుపుతున్నారు. కాని బహుభార్యత్వాన్ని వ్యతిరేకించే బడా మనుషులు కూడా దీన్ని ఆక్షేపించకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది!

అభ్యుదయ వాదులమని చెప్పుకునే కొందరు స్త్రీలు- "పురుషులు మాత్రమే నల్గురు భార్యల్ని ఎందుకు చేసుకోవాలి? స్త్రీకి నలుగురు భర్తల్ని చేసుకునే హక్కెందుకు ఉండ కూడదు?" అని ప్రశ్నిస్తారు. స్త్రీలకు వ్యభిచారం చేసే హక్కు కూడా కావాలని నినాదాలు మార్మోగుతున్న నేటి నవసమాజంలో బహుభర్తృత్వహక్కు కావాలని డిమాండు చేయడంలో ఆశ్చర్యం లేదు. కాని అలా డిమాండుచేసే స్త్రీలలో కనీసం ఇద్దరు భర్తలున్న వారెవరూ ఇంతవరకు నా దృష్టికి రాలేదు.

(పైన పేర్కొన్న నాలుగు పేరాలు ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ నుండి వెలువడిన "ఖుర్ఆన్ భావామృతం" నుండి గ్రహించబడ్డాయి.)

సరైన ఇస్లామీయ పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఈనాడు ముస్లింలలో కూడా అనేక మంది దురాచారాలకు, దురవస్థలకు లోనవుతున్నారు. వాటి ప్రభావం వల్ల స్త్రీలు తరచుగా కొన్ని కష్టనష్టాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలు తమకు ఇస్లాం ప్రసాదించిన హక్కులు పూర్తిగా పొందలేక పోతున్నారు. ఈ పరిస్థితి ఇస్లాంను అప్రతిష్ఠ పాలుచేయడానికి మతదురభిమానులకు, పాశ్చాత్యనాగరికతా ధ్వజవాహకులకు మంచి ఊతమిస్తోంది.

సరే, మీరు ఎనభై యేళ్ళ వృద్ధుడి దగ్గరికెళ్ళి "తాతయ్యా! రెండో పెళ్ళి చేసు కుంటావా?" అని అడగండి, ఏం సమాధానం వస్తుందో. ఆ పండుముదుసలి "నాకెవరు ఇస్తారు బాబూ!" అంటాడు. అంతేగాని కనీసం "నాకెందుకు నాయనా ఈ వయసులో?" అని కూడా అనడు. అదే పెళ్ళయిన ఓ యువతి దగ్గరికెళ్ళి **"నీకు ఎంతమంది భర్తలమ్మా?"** అని అడగండి. వెంటనే మీ చెంప ఛెళ్ళుమంటుంది.

ఒక పురుషుడికి వందమంది స్త్రీలనిచ్చి ఒక యేడాది పాటు కలసి ఉండే చాన్సు ఇచ్చామనుకోండి. అప్పుడు సంవత్సరాంతంలో వందమంది పిల్లలు పుట్టే అవకాశం ఉంటుంది. అలాగే ఒక స్త్రీని, వందమంది పురుషుల్ని ఒక యేడాది పాటు కలిపి ఉంచి చూడండి. అప్పుడు సంవత్సరాంతంలో వందమంది పిల్లలు పుడ్తారా? పోనీ పదిమందైనా పుడ్తారా? లేదు. మహాఅయితే ఒక్కరు పుట్టవచ్చు. అది కూడా గ్యారంటీ లేదు. ఇంతమంది పురుషుల ఒడుల్లో నలిగిన ఆ స్త్రీ గర్భాశయంలో వందమంది విభిన్న పురుషుల వీర్యకణాలు పరస్పరం ఘర్షించుకొని అసలు పిండోత్పత్తికి ఆస్కార మిస్తాయో లేదో చెప్పలేము.



పాశ్చాత్య బాకాలకు శివమెత్తినవారు, కొందరు మతదురభిమానులు ముస్లింలు నల్గురేసి భార్యలను చేసుకుంటున్నారని, వారి జనభా విపరీతంగా పెరిగిపోతోందని గగ్గోలు పెడుతున్నారు. కాని వాస్తవదృష్టితో పరిశీలిస్తే ముస్లిమేతరుల్లోనే ఉపపత్నుల (ఉంపుడుగత్తెల) రూపంలో బహుభార్యత్వం ఎక్కువగా కన్పిస్తుంది. ఇస్లాంలో బహు భార్యత్వం అనేక షరతులతో కూడిన ఒక అనుమతి మాత్రమే. పైగా క్లిష్ట పరిస్థితుల్లో అదొక సామాజిక అవసరం కూడా.

## సతులందర్నీ సమానదృష్టితో చూడాలి

అయినా ఈనాడు ఒక భార్యను పోషించడమే కష్టమయి పోతున్నప్పుడు ముగ్గురు నల్గురు భార్యలను ఎలా చేసుకుంటారు? ఇస్లాం షరతులకు లోబడినవారు ఎవరో కొందరు మాత్రమే ఇద్దరు భార్యలను కలిగి ఉంటున్నారు. ఇక నీతిని గోతిలో పాతిపెట్టి కేవలం భోగలాలసతో ఇద్దరు ముగ్గురు భార్యలను చేసుకునేవారు ముస్లింలలోనూ ఉన్నారు; ముస్లిమేతరుల్లోనూ ఉన్నారు. ఒకరికంటే ఎక్కువమంది భార్యలున్నప్పుడు వారందర్నీ సమానదృష్టితో చూస్తూ పూర్తి న్యాయం చేకూర్చడం శక్తికి మించిన పనని కూడా ఇస్లాం చెబుతోంది.

"భార్యలందరి పట్ల సమాన దృష్టితో మసలుకుంటూ వారికి పూర్తి న్యాయం చేకూర్చడం మీ శక్తికి మించిన పని. మీరు తలచినా అలా చేయలేరు. అయినప్పటికీ మీరు ఒక భార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి. మీ వైఖరి సరిదిద్దుకొని దేవునికి భయపడుతూ మసలుకోండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్-4:129)

ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది భార్యలు ఉన్నప్పుడు పురుషుడు వారి మధ్య అన్ని విధాలా సమానత్వం పాటించలేడు. భార్యల మధ్య ఉండే అందం, వయస్సు, స్వభావం, ఆరోగ్యం మొదలైన వ్యత్యాసాల కారణంగా అతను వారందర్నీ సమాన దృష్టితో చూడటం, ఒకేవిధంగా ప్రేమించడం సహజంగానే సాధ్యం కాదు. అయితే అంతమాత్రాన ఆకర్షణ లేని భార్యను పూర్తిగా విస్మరించి ఆకర్షణగల భార్యవైపు మొగ్గడం కూడా భావ్యం కాదు. ఇతర వ్యవహాలలో భార్యగా ఆమె హక్కులు తప్పక గౌరవించాలి. అంటే లైంగిక వ్యవహారంలో పూర్తి సమానత్వం పాటించకపోయినా ఇతర వ్యవహారాల్లో మటుకు సంపూర్ణ సమానత్వం పాటించాలి. సమానత్వం పాటించనివారి విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

"ఎవరికయినా ఇద్దరు భార్యలు ఉండి, వారిద్దరి హక్కులను న్యాయంగా, నిష్పక్షపాతం, సమానంగా, సమంజసంగా నిర్వర్తించకపోతే, తీర్పుదినాన అతను సగం శరీరం కోల్పోతాడు. ఆ స్థితిలోనే అతను (అంటే అర్థశరీరంతో సమాధి నుండి) లేచివస్తాడు." (తిర్మిజి)

## కొత్తభార్య దగ్గర తొలిసారి మూడు లేక ఏడురాత్రులు

లైంగిక విషయంలో ఆకర్షణలేని భార్య వైపు అంతగా మొగ్గు చూపలేకపోవడం మానవుని సహజ దౌర్బల్యం. ఈ విషయంలో సజ్జనులు, దుర్జనులు అన్న తేడా లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) దైవాన్ని ఇలా ప్రార్థించారు:

"దేవా! (భార్యలతో కలియక గురించిన) నా విభజన నాకున్న శక్తిసామర్థ్యాల మేరకే. నా శక్తి పరిధిలోలేని విషయంలో నన్ను తప్పుపట్టకు." (అబూదావూద్)

ఒకరికంటే ఎక్కువ భార్యలు ఉన్నప్పుడు భర్త ఒక్కొక్క రాత్రి వారి కోసం కేటాయించాలి. లేదా ఒక భార్య దగ్గర మూడేసి రాత్రులు గడిపితే, మిగతా భార్యల దగ్గర కూడా మూడేసి రాత్రులు గడపవలసి ఉంటుంది. ఈవిధంగా భార్యల మధ్య విభజన సమానంగా ఉండాలి.

ముందునుంచే ఒకరిద్దరు భార్యలు ఉన్నప్పుడు కొత్తగా మరో భార్యను చేసుకున్న పక్షంలో కొత్తభార్య దగ్గర భర్త మొదటిసారి మూడు లేక ఏడు రాత్రులు గడపవలసిఉంటుంది. అంటే ఆ కొత్తభార్య కన్య అయితే ఆమె దగ్గర ఏడు రాత్రులు గడపాలి. కొత్తభార్య ప్రౌఢ (వితంతువు లేక విడాకులు పొందిన స్త్రీ) అయితే ఆమె దగ్గర మూడు రాత్రులు గడపాలి. ఆ తరువాత నుంచి మామూలే.

"ప్రవక్త సంప్రదాయం ప్రకారం మొదటిసారిగా పడుచుభార్య అయితే ఆమె దగ్గర ఏడు రాత్రులు గడపాలి; ప్రౌఢభార్య అయితే ఆమె దగ్గర మూడు రాత్రులు గడపాలి. ఆ తరువాత నుంచి నిర్ణీత వంతులవారిగా గడపాలి." (బుఖారి, ముస్లిం)

ఇమామ్ మాలిక్ (రహ్మలై) హదీసుగ్రంథంలో ఇబ్నెషిహాబ్ ఉల్లేఖించిన కథనం ప్రకారం హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) ఒక యువతిని వివాహం చేసుకున్నారు. అంతకుముందు నుంచే ఆయన వివాహబంధంలో హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లిం (రజి) గారి కుమార్తె ఉంది. హజ్రత్ రాఫె (రజి) రెండవ పెళ్ళి చేసుకున్న తరువాత పడుచు భార్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వసాగారు. అందువల్ల ఆయన మొదటి భార్య దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి భర్త మీద ఫిర్యాదు చేసింది.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ రాఫె (రజి)ని పిలిచి "నీ భార్యలిద్దరి పట్ల న్యాయంగా మసలుకో లేదా ఈమెను వదలిపెట్టు" అని చెప్పారు.

## ప్రవక్తభార్యల సంఖ్యపై ప్రత్యర్థుల దుష్ప్రచారం

ముస్లింలకు గరిష్ఠంగా నలుగురు భార్యల్ని మాత్రమే వివాహమాడటానికి ఇస్లాంలో అనుమతి ఉంది. అయితే ఈ అనుమతికి భిన్నంగా దైవప్రవక్త (సల్లం)కు నలుగురికంటే ఎక్కువమంది స్త్రీలను వివాహమాడేందుకు దేవుడు అనుమతి ఇచ్చాడు. ఈ విషయంపై ఇస్లాం వ్యతిరేక శక్తులు పెద్ద దుమారం లేవదీశాయి. ముహమ్మద్ (సల్లం) సాధారణ ముస్లింలకు భిన్నంగా నలుగురి కంటే ఎక్కువ మంది



స్త్రీలను వివాహమాడి స్త్రీలోలు డయ్యారని ఈ శక్తులు విమర్శిస్తూ ఈనాటికీ దుష్ప్రచారం సాగిస్తున్నాయి. కనుక దీన్ని గురించి వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరముంది.

మహనీయ ముహమ్మద్ (సల్లం) 25 సంవత్సరాల నిండు యౌవనంలో తనకంటే 15 యేళ్ళు ఎక్కువ వయసుగల వితంతువైన హజ్రత్ ఖదీజా (రజి)ని వివాహమాడారు. ఆమెతో కలసి 25 సంవత్సరాలు ఎంతో అన్యోన్యంగా కాపురం చేశారు. ఈ 25 యేండ్ల కాలంలో ఆయన మరో స్త్రీని వివాహమాడే తలంపును కూడా తన మనసులోకి రానివ్వ లేదు. హజ్రత్ ఖదీజా (రజి) చనిపోయిన తర్వాతనే ఆయన రెండవ పెళ్ళి చేసుకున్నారు. ఆమె కూడా వయస్సుమీరిన స్త్రీయే (హజ్రత్ సౌదా-రజి). ఆమెతో 4 ఏళ్ళు సంసారం చేశారు. ఆ తరువాత 53, 54 సంవత్సరాల వయస్సులో ఆయన స్త్రీలోలుడయ్యారని, ఆయనలో లైంగికవాంఛ పరవళ్ళు తొక్కిందని ఎవరైనా అనగలరా?

## విప్లవ సారథి విశిష్ఠతే అలాంటిది

మహనీయ ముహమ్మద్ (సల్లం)పై మోపబడిన దైవదౌత్య భారం అసాధారణమైనది. దాన్ని సులభంగా నిర్వహించడానికి నలుగురు భార్యల నిబంధన నుండి ఆయన్ని మినహాయించడం జరిగింది. అదీగాక అత్యున్నతమైన సభ్యతా సంస్కృతులతో కూడిన సమాజం ఆవిష్కరణ కోసం ఆయన పురుషులకే గాక స్త్రీలక్కూడా తగిన శిక్షణ ఇవ్వవలసి ఉండింది. నూతన ఇస్లామీయ సమాజంలో స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత కలియికపై ఆంక్షలు ఉండటం వల్ల, ఆ ఆంక్షల్ని అతిక్రమించకుండా స్త్రీలకు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వడం సాధ్యం కాదు. విభిన్న వయస్సులు, శక్తిసామర్థ్యాలు గల అనేకమంది స్త్రీలను వివాహమాడటం ద్వారానే ఈ మహాకార్యం సాధ్యమవుతుంది. అంతేకాదు, ఇస్లామీయ విప్లవమార్గంలో అవరోధంగా ఉన్నవారి శక్తిని, శత్రువులసంఖ్యను తగ్గించడా నికి కూడా అనేకమంది స్త్రీలను వివాహమాడటం అనివార్యమయింది.

పిన్న వయస్సులో హజ్రత్ ఆయిషా (రజి)ను వివాహమాడటం వల్ల, దైవప్రవక్త (సల్లం) దివంగతులైన తరువాత కూడా ఆమె ద్వారా ముస్లింజగత్తుకు అనేక దశాబ్దాల పాటు ప్రవక్త ప్రవచనాలు, ఆయన సంప్రదాయాలు లభిస్తుండేవి. హజ్రాత్ ఉమ్మెసల్మా, ఉమ్మెహబీబా (రజి)లను వివాహమాడటం వల్ల వారి వంశం, తెగల నుండి ఎదురైన విరోధం కొంతవరకు తగ్గింది. యుద్ధ ఖైదీలైన హజ్రాత్ సఫియా, జువైరియా, రైహానా (రజి)లను విడుదలచేసి వివాహమాడటంతో, ఆయా యూదతెగల ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలు చాలావరకు మందగించాయి. ఆనాటి అరబ్ సంప్రదాయం ప్రకారం ఒక వ్యక్తి ఏదైనా తెగకు చెందిన స్త్రీని వివాహమాడితే, ఆవ్యక్తి ఆ స్త్రీ తెగ మొత్తానికే అల్లుడిగా పరిగణించబడేవాడు.

ఈ కారణాల వల్లనే దైవప్రవక్త (స) దేవుని అనుజ్ఞతో నలుగురిని మించి స్త్రీలను చేసుకోవలసి వచ్చింది. ఇస్లాంవ్యాప్తిలో ఇది కూడా ప్రముఖపాత్ర వహించింది.

దేవుడు ముహమ్మద్ (స)కు దైవప్రవక్తగా ఇతర ముస్లింలకు లేని కొన్ని ప్రత్యేక తలు ఇచ్చాడు. ఉదాహరణకు: (1) తహజ్జుద్ నమాజ్ దైవప్రవక్త (స)కు మాత్రమే విధిగా చేయబడింది. ఇతరులకిది ఐచ్ఛిక(నఫిల్) నమాజ్. (2) దానం(సదఖా) స్వీకరించడం దైవప్రవక్త (స)కు, ఆయన వంశస్థులకు నిషిద్ధం. ఇతర ముస్లింలు స్వీకరించ వచ్చు. (3) దైవప్రవక్త (స) ఆస్తికి వారసత్వపు విభజన లేదు. ఇతర ముస్లింల ఆస్తులు వారి వారసుల్లో విభజించబడతాయి. (4) దైవప్రవక్త (స) నల్గురిని మించి భార్యలను చేసుకోవచ్చు. ఇతరులు నలుగుర్ని మించి చేసుకోవడం నిషిద్ధం. (5) తననుతాను సమర్పించుకున్న స్త్రీని దైవప్రవక్త (స) మహర్ చెల్లించకుండా వివాహమాడవచ్చు. ఇతరులు ఏస్త్రీని వివాహమాడినా మహర్ చెల్లించాలి. (6) దైవప్రవక్త (స) తదనంతరం ఆయన భార్యలను ఇతర ముస్లింలు వివాహమాడటం నిషిద్ధం.

## 14. బాధ్యతలు మరిస్తే బాధలు తప్పవు

విఖారుద్దీన్, అజీముద్దీన్‌లు పరస్పరం ప్రాణస్నేహితులు. ఇద్దరూ ఒకేసారి యంకాం పట్టా పుచ్చుకున్నారు. ఆ తరువాత ఇద్దరూ ఒకేసారి యం.బి.ఏ. కూడా పూర్తిచేశారు. ఇద్దరూ శ్రీమంతుల బిడ్డలైనందున ఉద్యోగాన్వేషణలో పడకుండా బిజినెస్ చేద్దామని నిశ్చయించుకున్నారు. వెంటనే వారు చెరొక యాభైలక్షల వాటా చొప్పున మొత్తం కోటి రూపాయల పెట్టుబడితో ఓ మందుల కంపెనీని నెలకొల్పుకున్నారు.

భాగస్తులిద్దరు తమ తమ అభిరుచులు, శక్తిసామర్థ్యాలను పరిశీలించుకున్న మీదట మొదట అజీముద్దీన్ కంపెనీ అంతర్గత వ్యవహారాలు చూసుకోవడానికి ఒప్పుకున్నాడు. నాణ్యమైన మందులను ఉత్పత్తిచేయడం, కార్మికుల పనితీరును పర్యవేక్షించడం లాంటి బాధ్యతల్ని అతను స్వీకరించాడు. ఇక కంపెనీ బయటి పనులన్నీ తాను చూసుకుంటానని విఖారుద్దీన్ అన్నాడు. కెమికల్స్ ఫ్యాక్టరీలతో సంప్రదించి ముడిపదార్థాలను దిగుమతి చేయించడం, కంపెనీలో ఉత్పత్తయిన మందుల శాంపిల్స్‌ను మెడికల్‌షాపుల్లో, డిస్ట్రి బూటర్స్ సంస్థల్లో చూపించి ఆర్డర్లు బుక్ చేయడం వగైరా బాధ్యతల్ని అతను చేపట్టాడు.

ఈవిధంగా అజీముద్దీన్ ప్రొడక్షన్ మేనేజర్‌గా, విఖారుద్దీన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు పంచుకొని మందుల కంపెనీని నిర్వహించసాగారు. రెండేళ్ళలోనే కంపెనీ ఎంతో అభివృద్ధిచెందడంతో మిత్రులిద్దరూ అనూహ్యమైన లాభాలు గడించారు. విఖారుద్దీన్‌లోని మాటకారితనం, ప్రజాసంబంధ సామర్థ్యం, డ్యాషింగ్ నేచర్‌ల వల్ల మంచి లాభాలతో పెద్ద పెద్ద ఆర్డర్లు వస్తున్నాయి. అలాగే అజీముద్దీన్‌లోని సాంకేతిక నైపుణ్యం, కార్మికుల పట్ల సద్వర్తనం, సహనస్వభావం, వారిపై అజమాయిషీ లాంటి సుగుణాల కారణంగా నాణ్యమైన ఉత్పత్తులతో పని సవ్యంగా, సాఫీగా సాగిపోతోంది.



ఇలా ఆ ఇద్దరు మిత్రులు తాము స్వీకరించిన ఆయా బాధ్యతలకు తామే అర్హులమని నిరూపించుకున్నారు.

### అసమంజస కార్యవిభజన తెచ్చే అనర్థకాలు

అయితే కొన్నాళ్ళకు అజీముద్దీన్‌కు ఓ దుర్బుద్ధి పుట్టింది. విఖారుద్దీన్ బయటి వ్యవహారాలు చూస్తూ పెద్దపెద్ద వాళ్ళతో, రాజకీయ నాయకులతో సంబంధాలు పెంచుకొని సంఘంలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకుంటున్నాడని అజీముద్దీన్ అసూయ చెందాడు. అదీగాక వంటింటి కుందేల్లా ఎప్పుడూ కంపెనీ లోపలే పని చేయడం వల్ల బోర్ కొడ్తోందని, బయటైతే హాయిగా కాలర్ పైకెత్తి తిరుగుతూ పెద్దపెద్ద వాళ్ళను పరిచయం చేసుకొని సంఘంలో మంచిపేరు తెచ్చుకోవచ్చని భావించాడు. ఈ ఆలోచనతో అతను మేనేజింగ్ డైరెక్టర్‌గా బయటి వ్యవహారాలు చూసుకుంటానని పట్టుబట్టాడు.

విఖారుద్దీన్ ఎంతగానో నచ్చజెప్పి చూశాడు. కాని అజీముద్దీన్ ససేమిరా అన్నాడు. ఇక చేసేదిలేక విఖారుద్దీన్ కంపెనీ బయటి పనులు అజీముద్దీన్‌కే అప్పగించి తాను కంపెనీ లోపలివ్యవహారాలు చూసుకునే ప్రొడక్షన్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాడు.

ఈ మార్పు జరిగిన తరువాత కంపెనీ ఆదాయం క్రమంగా తగ్గిపోసాగింది. కొన్ని మందులు ఎలర్జీ తెచ్చిపెడ్తున్నాయని, మరికొన్ని మందులు రియాక్షన్ ఇస్తున్నాయని కంప్లయింట్స్ రాసాగాయి. అటు కార్మికులు తమ వేతనాలు పెంచకపోతే సమ్మె కడ్తామని బెదిరించసాగారు. మరొకవైపు కెమికల్ ఫ్యాక్టరీలు ముడి సరుకుల్ని సకాలంలో పంపడంలో ముప్పతిప్పలు పెడ్తున్నాయి. వేరొక వైపు డిస్ట్రిబ్యూటర్ల నుండి ఉత్పత్తులకు సరిపడ ఆర్డర్లు రావడం లేదు. మార్పు జరిగిన యేడాది తిరక్కముందే కంపెనీ దీవాళా తీసే పరిస్థితికి చేరుకుంది.

పాపం విఖారుద్దీన్ విచారసముద్రంలో పడిపోయాడు. అజీముద్దీన్‌కు తల తిరిగిపోయింది. చివరికి మిత్రులిద్దరు ఓరోజు ప్రశాంతంగా కూర్చొని పరిస్థితి సమీక్షించారు. కంపెనీ ఇంత అధ్వాన్న స్థితికి చేరుకోవడానికి నువ్వు కారణమంటే నువ్వు కారణమంటూ కాస్సేపు ఒకర్నొకరు నిందించుకున్నారు. విఖారుద్దీన్ కాస్త నమ్రతగా మాట్లాడుతూ “మనిద్దరిలో ఎవరూ కారకులు కాదు. సంవత్సరం క్రితం జరిగిన మన స్థానాల మార్పే ఈ దుస్థితికి మూలకారణమ”ని అన్నాడు.

అజీముద్దీన్‌కు అప్పటికిగాని తన తప్పు తెలిసిరాలేదు. “అయితే నేను మునుపటి లాగానే కంపెనీ లోపలి వ్యవహారాలు చూసుకుంటాను. నువ్వు బయటి పనులు చూసుకో” అన్నాడతను. విఖారుద్దీన్ సంతోషంతో స్నేహితుడ్ని కౌగలించుకున్నాడు.

### ప్రదర్శనాబుద్ధితోనే పడతుల అత్యుత్సాహం

సమాజంలో స్త్రీ, పురుషుల స్థానాలు కూడా ఇలాంటివే. మందుల కంపెనీలో అజీముద్దీన్, విఖారుద్దీన్ బాధ్యతలు వంటివే కుటుంబంలో స్త్రీ, పురుషుల బాధ్యతలు.

కంపెనీ అనే కుటుంబానికి మేనేజింగ్ డైరెక్టర్ పురుషుడయితే, ప్రొడక్షన్ మేనేజర్ స్త్రీ అవుతుంది. మందుల కంపెనీలో అజీముద్దీన్, విఖారుద్దీన్ లాంటి స్నేహితుల మాదిరిగా కుటుంబంలో భార్యభర్తలు ఎవరి విధులు వారు నిర్వహిస్తున్నప్పుడే సంసార శకటం సాఫీగా సాగుతుంది; ఉత్తమ సంతానం ఉత్పత్తి అవుతుంది; తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఉనికిలోకి వచ్చి సర్వత్రా శాంతికుసుమాలు వెల్లివిరుస్తాయి.

మానవ బలహీనతల్లో ప్రదర్శనా బుద్ధి, పేరుపలుకుబడుల వాంఛ చాలా ప్రమాదకర మైనవి. మనిషి పరలోకజీవితాన్ని నాశనంచేసే మొట్టమొదటి విషయాలు ఇవే. తమ పరలోకజీవితాన్ని స్వర్గధామంగా మలచుకోదలచిన పడతులు వీటికి దూరంగా ఉండటం ఎంతో అవసరం. ఈ బలహీనతల నుండి బయటపడలేని మహిళలే సాధారణంగా తమ సహజ కార్యాచరణపరిధి దాటి రచ్చకెక్కడానికి ఉబలాట పడతారు.

ఈ ఉబలాటం వారిని సాధారణ కార్యాలయాల నుండి సచివాలయాలు, శాసన సభలు వంటి అత్యున్నత స్థానాల దాకా చేర్చగలుగుతుంది. పైగా వారి ఉడుపుల్ని ఒక్కొటిగా ఒలచివేస్తుంది. **స్లీవ్‌లెస్ బ్లౌజుల నుండి బికినీల దాకా** చేరుస్తుంది. కాని వారి కుటుంబ జీవితం మటుకు అనూహ్యమైన అశాంతి, అసంతృప్తుల లావాతో లోలోనే నిరంతరం కుతకుతలాడుతూ ఉంటుంది. చివరికది ఏదో ఒకరోజు పేలి బ్రద్దలయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు.

శారీరకంగాను, మానసికంగాను స్త్రీ పురుషుల మధ్య ఉన్న సహజ వ్యత్యాసాల కారణంగా ఇస్లాం స్త్రీపై పురుషునికి కొంత ఆధిక్యతనిచ్చి, వారిరువురి కార్యాచరణ పరిధుల్ని వేరుచేసింది. ఇంటి లోపలి బాధ్యతల్ని స్త్రీకి, ఇంటి వెలుపలి బాధ్యతల్ని పురుషు నికి అప్పగించింది. ఈ బాధ్యతల పంపిణీ స్త్రీ పురుషుల సమానత్వానికి వ్యతిరేకం కాదు. స్త్రీ పురుషులు ఇద్దరినీ ఒకే పరిధిలో బంధించిపెట్టే పాశ్చాత్యతరహా సమానత్వాన్ని ఇస్లాం అంగీకరించదు. స్త్రీ పురుషుల్ని వారి వారి సహజస్థానాల్లో ఉంచి, ఎవరిహక్కులు వారికి న్యాయంగా ఇప్పించడమే నిజమైన సమానత్వమని చెబుతోంది.

## పురుషుల పొగడ్తలు, పడతుల పాట్లు

పూర్వకాలంలో స్త్రీ ఘోరమయిన అతివాదాలకు గురయింది. ఒకప్పుడు ఆమెను అతిగా పైకెత్తి దేవతామూర్తి అని పొగిడి పూజిస్తే, మరొకప్పుడు కట్టుబానిసగా, చరణ దాసిగా మారేవరకు ఆమె స్థాయిని దిగజార్చారు. అదేవిధంగా నేటి నాగరికయుగంలో కూడా పురుషులతో సమానహక్కులన్న నినాదం చాటున స్త్రీని రచ్చకీడ్చి పురుషుల సరసన నిలబెట్టారు. **'లేడీస్ ఫస్ట్' నుంచి 'కాల్‌గర్ల్'** దాకా పోయిందీ నినాదం. అన్ని రంగాల్లోను పురుషులతో భుజం భుజం కలిపి పనిచేయడంలోనే స్త్రీ గౌరవ ప్రతిష్ఠలు న్నాయని ఆమెను కుటుంబ బాధ్యతల నుండి తప్పించారు. ఫలితంగా ఆమె సహజ స్త్రీత్వం, సౌకుమార్యం, శీలం, మానమర్యాదలు ప్రమాదంలో పడిపోయాయి.



ఈ అమాయకురాలు స్త్రీస్వేచ్ఛా ధ్వజవాహకులైన పురుషపుంగవుల పొగడ్తలకు ఉబ్బిపోయి, తన అంగసౌష్ఠవంతో, ఆధునిక అలంకరణలతో, అర్ధనగ్న వస్త్రధారణ లతో పురుషులుండే ప్రతి వేదికపై, ప్రతిరంగంలో కన్పించడానికి ప్రయత్నిస్తోంది. స్త్రీలు (ముఖ్యంగా శీలవతులు) వాటి చేదుఅనుభవాలు కూడా అనుదినం చవిచూస్తున్నారు.

స్త్రీపురుషుల స్వభావాలరీత్యా వారి ఆలోచనాతీరుల్లో కొంత వ్యత్యాసం గోచరి స్తుంది. భర్త, అత్తామామలు, ఆడపడుచులు, తోడికోడళ్ళ మధ్య దుర్భరకష్టాలకు లోనవుతున్న ఏస్త్రీ అయినా **"స్త్రీ అయి పుట్టడంకన్నా పురుషుడయి పుడ్తే బాగుండేది"** అని ఎప్పుడైనా అనుకుంటుందా? ప్రకృతివిరుద్ధమైన ఇలాంటి ఆలోచన ఆమె తనమనస్సులోకే రానివ్వదు. దానికిబదులు ఇలాంటి స్త్రీల విషయంలో "ఆడదై పుట్టడం కన్నా అడవిలో మ్రానయి పుట్టడం మేలు" అన్న సామెత పుట్టింది.

## చైర్మన్, సెక్రటరీల బాధ్యతలు ఒకటేనా?

ఇస్లాం కుటుంబం అనే సంస్థకు పురుషుడ్ని చైర్మన్‌గా, స్త్రీని సెక్రటరీగా నియ మించి ఎవరి బాధ్యతల్ని, హక్కుల్ని వారికి న్యాయవంతంగా కేటాయించింది. అంతేగాక ఆ చైర్మన్, సెక్రటరీలు ఎవరి విధుల్ని వారు సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడే కుటుంబం అనే సంస్థ సవ్యంగా, సాఫీగా, సజావుగా సాగుతుందని చెబుతోంది.

ఏ దేశంలోనూ ఇద్దరు అధ్యక్షులు లేదా ఇద్దరు ప్రధానులు ఉండరు. ఏ సైనిక దళంలోను ఇద్దరు సేనాపతులు ఇమడలేరు. ఏ కార్యాలయంలోనూ సమానస్థాయి గల ఇద్దరు అధికారులు పని చేయలేరు. ఏ సంఘాన్నీ ఇద్దరు నాయకులు నడపలేరు. అలాగే కుటుంబం అనే సమాజ వ్యవస్థ కేంద్రకార్యాలయం సవ్యంగా సాగాలంటే భార్యా భర్తల్లో ఒక్కరే అధికారిగా ఉండాలి. శారీరక, మానసిక సామర్థ్యాల్లో స్త్రీకన్నా పురుషుడు కొంత ఆధిక్యత కలిగివున్నందున కుటుంబవ్యవస్థకు ఇస్లాం పురుషుడ్ని నాయకునిగా నిర్ణయించింది. భార్య అతని సహాయకురాలు మాత్రమే.

కనుక చైర్మన్ పురుషుడు, సెక్రటరీ స్త్రీ సమానత్వం పేరుతో రచ్చకెక్కి సంసారం లో చిచ్చు రగుల్చుకోవలసిన పనిలేదు. హక్కులు, బాధ్యతలు సంస్థ నిబంధనావళి (ఖుర్‌ఆన్)లో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. ఈ బాధ్యతల్ని విస్మరిస్తే ఆ కుటుంబంలో మిగిలేది అశాంతి, అలజడులే.

## సహజ వ్యత్యాసాలు, అసహజ మార్గాలు

"మేము మీలో కొందరికి ఇతరులకన్నా ఎక్కువగా ప్రసాదించినదాన్ని మీరు ఆశించకండి. పురుషులకు వారు సంపాదించుకున్నదానికి తగినప్రతిఫలం ఉంది. అలాగే స్త్రీలక్కూడా వారు సంపాదించుకున్నదానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. అయితే మీరు దేవుని అనుగ్రహం వేడుకోండి. నిస్సందేహంగా ఆయన ప్రతివిషయం ఎరిగినవాడు." (దివ్య ఖుర్‌ఆన్-4:32)

దేవుడు మానవులందరినీ ఒకే స్థాయిగా పుట్టించలేదు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక వ్యత్యాసాలు ఉంచాడు. కొందరిని తెల్లవాళ్ళుగా, మరికొందరిని నల్లవాళ్ళుగా, కొందరిని అందగాళ్ళుగా, మరికొందరిని అందవిహీనులుగా, కొందరిని బలవంతులుగా, మరి కొందరిని బలహీనులుగా, కొందరిని పొడుగు వాళ్ళుగా, మరికొందర్ని పొట్టివాళ్ళుగా, కొందరిని ఎక్కువ తెలివిగలవారిగా, మరి కొందరిని తక్కువ తెలివిగలవారిగా, కొందరిని ధనవంతులుగా, మరికొందరిని పేద వాళ్ళుగా పుట్టించాడు.

అయితే ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తిలో దేవుడు అందవిహీనుడు అందాన్ని, బల హీనుడు బలాన్ని, పేదవాడు ధనాన్ని కోరుకోవడం తప్పని చెప్పలేదు. అందగాళ్ళను, బలవంతుల్ని, ధనికుల్ని చూసి అసూయ చెందడం; లేనిదాన్ని పొందడానికి అసహజమైన మార్గాల గుండా, అక్రమ పద్ధతుల ద్వారా ప్రయత్నించడం మాత్రమే తప్పని చెబుతున్నాడు.

అలా జరిగినప్పుడల్లా సమాజంలో అశాంతి, అరాచకాలే చెలరేగుతాయిగాని, ఆశించిన ప్రయోజనాలు సాధించలేము. నేడు స్త్రీ-పురుషుల మధ్య, ధనిక-పేదల మధ్య కృత్రిమ సమానత్వం కోసం జరుగుతున్న అక్రమ విధానాలు ఎన్ని అనర్థాలు సృష్టిస్తున్నాయో చెప్పనవసరం లేదు.

## సమానత్వంకాదు, న్యాయం కావాలి

కొందరు ప్రతిచిన్న విషయానికీ ఇస్లాం స్త్రీపురుషుల మధ్య వివక్ష చూపుతోందని, సమానత్వం పాటించడం లేదని విమర్శిస్తారు. కాని వారు స్త్రీ శరీరాకృతికి, పురుష శరీరాకృతికి మధ్య తేడా గమనించడం లేదా? స్త్రీ మానసిక స్థితికి, పురుషుని మానసిక స్థితికి వ్యత్యాసం లేదా? ఏ స్త్రీ అయినా తనకు గడ్డం, మీసాలు ఉండటాన్ని సహిస్తుందా? ఏ పురుషుడైనా చీర, జాకెట్టు కట్టుకోవడానికి ఇష్టపడతాడా? సహజ సిద్ధమైన ఇలాంటి చిన్న చిన్న వ్యత్యాసాలను సయితం వదిలేసి అంతా సమానం అన్నప్పుడే లేనిపోని సమస్యలు వచ్చి సమాజం అశాంతికి గురవుతుంది. మనకు కావలసింది సమానత్వం కాదు. న్యాయం కావాలి. న్యాయంలేని స్త్రీపురుష సమానత్వం ఎందుకండీ?

"సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకు కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒకమెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు అసాధారణ శక్తిమంతుడు, అద్భుత వివేచనాపరుడు. (ఖుర్‌ఆన్-2:228)

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులయిన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి



కనుసన్నలలో నడచుకుంటారు. పురుషులు (ఇంటి పట్టున) లేనప్పుడు దేవుని రక్షణలో వారి హక్కులు కాపాడుతూ ఉంటారు." (ఖుర్‌ఆన్-4:34)

ఇలా స్త్రీకంటే పురుషుడు అధికుడనడం ఖుర్‌ఆన్ ప్రతిపాదించిన స్త్రీ స్వేచ్ఛా సమానత్వాల సిద్ధాంతానికి వ్యతిరేకం కాదు. స్త్రీ స్వాతంత్ర్యం ఒక నైతికవిధి. స్త్రీ పురుష భేదం ఒక భౌతిక ధర్మం. స్త్రీ స్వేచ్ఛా ధజవాహకులు సృష్టిస్తున్న అపోహలకు గురికాకుండా మహిళలు వాస్తవదృష్టితో ఈ విషయాన్ని పరిశీలిస్తే వారికి యాదార్థం అర్థమవుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు.

## స్త్రీపై పురుషుని ఆధిక్యత ఎందుకు?

ఈ విషయాలు విన్న తరువాత ఇస్లాం స్త్రీకి ఎన్నో మేళ్ళు చేసిందని, అది ఇతర మతాలకన్నా ఆమెకు ఎక్కువ హక్కులు ప్రసాదించి ఆమె సామాజిక స్థాయిని పెంచిందని కొందరు అంగీకరిస్తారు. అయితే కొన్ని విషయాల్లో ఇస్లాం కూడా స్త్రీపై పురుషునికి ప్రాధాన్యత నిచ్చిందని, మరికొన్ని విషయాల్లో ఆమె హక్కులను కాలరాసిందని వారు విమర్శిస్తారు. ఉదాహరణకు, ఇస్లాం పురుషుడ్ని కుటుంబ పెద్దగా నిర్ణయించి స్త్రీని అతని క్రింద పనిచేసే ఉద్యోగిని (సబార్డినేట్)గా చేసిందని, విడాకులిచ్చే అధికారం పురుషునికి మాత్రమే ఇచ్చిందని, అలాగే వారసత్వపు ఆస్తిలో స్త్రీ వాటాను పురుషుని వాటాలో అర్థ భాగంగా నిర్ణయించిందని చెబుతారు.

ఈ ఆరోపణలు పైకి ఎంతో సమంజసంగా కన్పించి, ఇస్లాంలో కూడా స్త్రీ పీడితురాలేనని అనిపిస్తుంది మనకు. కాని ఈ ఆరోపణలను కాస్త న్యాయదృష్టితో పరిశీలిస్తే ఈ అభిప్రాయం పూర్తిగా నిరాధారమైనదని తెలుతుంది.

కొన్ని విషయాల్లో ఇస్లాం పురుషునికి స్త్రీపై ప్రాధాన్యత ఇచ్చిందంటే అతనామె హక్కుల్ని హరించివేయడానికి, ఆమె స్థాయిని దిగజార్చడానికి ఇవ్వలేదు. కౌటుంబిక జీవితంలో క్రమశిక్షణ ఏర్పడటానికి, కుటుంబ సభ్యులంతా కలిసిమెలిసి పరస్పర సహకారంతో గృహవ్యవస్థను సక్రమంగా నడపడానికి మాత్రమే పురుషునికి స్త్రీపై ప్రాధాన్యత నిచ్చింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఇస్లాం ఆదర్శవంతమైన కుటుంబాన్ని నిర్మించడంలో, దాని ప్రగతీవికాసాలలో తగిన పాత్ర నిర్వహించేందుకు వీలైన హక్కులు పురుషునికి ప్రసాదించింది. అలాగే గృహపాలనకు, సంతానశిక్షణకు సంబంధించిన బాధ్యతలు నిర్వహించడానికి కావలసిన హక్కులు స్త్రీకి ఇచ్చేసింది.

## కుటుంబ పెద్ద పురుషుడే ఎందుకు?

ఇస్లాం పురుషుడ్ని కుటుంబానికి నాయకునిగా, అధ్యక్షునిగా నిర్ణయించి, స్త్రీని ఆమె అధీనంలో ఎందుకిచ్చిందీ అనే సమస్యను ముందుగా పరిశీలిద్దాం. ఈ విషయంలో సూత్రప్రాయమైన ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. అధీనంలో ఇవ్వడం (సబార్డినేషన్) అనేది అవమానానికి, అధోగతికి కారణభూతమయ్యే విషయం కాదు. ప్రపంచంలో ప్రతి మనిషీ ఒకస్థాయిలో అధికారిగా, మరొక స్థాయిలో క్రిందిఉద్యోగిగా పనిచేసేటట్లు

దేవుడు ఈ ప్రపంచవ్యవస్థను రూపొందించాడు. ప్రపంచంలో గొప్ప నియంతగా, తిరుగులేని నాయకునిగా, సర్వస్వతంత్రునిగా, స్వయంనిర్ణయాధికారిగా భావించబడే మనిషి సయితం విశ్వప్రభువు ముందు జవాబుదారుడే; ఆయన క్రింది ఉద్యోగియే.

అందువల్ల 'అధీనత' వల్ల మనిషి గౌరవానికి, హోదా అంతస్తులకు భంగం వాటిల్లు తుందని భావించకూడదు. దేశపాలనా నిర్వహణ కోసం అధ్యక్షుడికి, ప్రధానమంత్రికి ఇతరుల కంటే ఎక్కువ అధికారాలు ఉంటాయి. ప్రజలంతా వారి స్థాయి, హోదాలను అంగీకరించి చట్టసమ్మతమైన వ్యవహారాల్లో సంతోషంగా వారికి విధేయులయి ఉంటారు. వారిలో ఉన్నత విద్యావంతులు, గొప్ప కవులు, సాహిత్యవేత్తలు, ప్రముఖ తత్వవేత్తలు, మత నాయకులు, రాజకీయనేతలు, డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అందరూ ఉంటారు. అయితే వారు దేశాధినేతకు అధీనులయినప్పటికీ వారి కీర్తి ప్రతిష్ఠలు, గౌరవాదరణలు రోజురోజుకు ఇనుమడిస్తూనే ఉంటాయి గాని తగ్గిపోవు.

అంతేకాదు, వారిలో ఏఒక్కడూ తాను పాలకుల విధేయతను సమ్మతించి తనను తాను కించపరచుకున్నానని ఎన్నటికీ భావించడు. దేశాధినేతలకు ప్రత్యేక అధికారాలు లభించడంలోనే తనశ్రేయస్సు, దేశశ్రేయస్సు ఇమిడివున్నాయని ప్రతిఒక్కరూ భావిస్తారు. అందువల్ల దేశ ప్రజలంతా పాలకులకు విధేయులై ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ విధంగా జరగకపోతే దేశవ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైపోతుంది.

గృహవ్యవస్థ కూడా ఓ చిన్న దేశవ్యవస్థ లాంటిదే. దాని సక్రమ నిర్వహణ, ప్రగతి వికాసాల కోసం కూడా ఒక నాయకుడంటూ ఉండటం ఎంతో అవసరం. అతను బానిసల చేత వెట్టిచాకిరి చేయించుకునేటటువంటి యజమాని కాదు. అతను ప్రేమించే భర్త, గారాబం చేసే తండ్రి. అతని అధీనంలో ఇవ్వబడిన స్త్రీ దాసీ కాదు, బానిసా కాదు. ఆమె గౌరవప్రదమైన ఇంటికి యజమానురాలు.

## 15. దాంపత్య జీవితం

పై వివరణ వల్ల స్త్రీ పురుషుల ఆచరణ పరిధులు వేరయ్యాయి. పురుషుడు గృహం వెలుపలి వ్యవహారాలలో ప్రవేశించి ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల అభ్యున్నతి కోసం పాటుపడుతుంటే, స్త్రీ లోపలి వ్యవహారాలలో నిమగ్నమయి ఇంటి వస్తువుల సద్వినియోగం, కుటుంబ గౌరవం, భావిపౌరుల ప్రాథమిక శిక్షణ మొదలైన రంగాలను అభివృద్ధి పరుస్తూ భర్తకు సహాయకారిగా (Assistant) ఉంటుంది. ఈవిధంగా స్త్రీ పురుషు లిద్దరూ దైవం నిర్ణయించిన వివిధ బాధ్యతల్ని నిర్వహిస్తూ బండి చక్రాల్లా సమాజంలో సమానత్వం కలిగిఉంటారు.

**మానవ సమాజ సౌధానికి మూలస్తంభం కుటుంబమే.** భార్యాభర్తల కలియక వల్లనే కుటుంబం ఏర్పడుతుంది. భార్యాభర్తల మధ్య పరస్పర సదవగాహన, మానసిక ప్రేమానురాగాలు ఉంటే వారి జీవితం ఎలాంటి వడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా



సాగుతుంది; కుటుంబ సంబంధాలు పటిష్ఠంగా ఉంటాయి; సంతానానికి సరైన శిక్షణ లభిస్తుంది. దంపతుల మధ్య ప్రేమానురాగాలు కొరవడితే వారి జీవితం నరకతుల్యం అవుతుంది. కుటుంబ సంబంధాలు క్రమంగా విచ్ఛిన్నమవుతాయి. సంతానం దారం తెగిన గాలిపటాల్లా మారిపోతారు.

### వివాహిత స్త్రీ రక్షణ కోట

ఇస్లామీయ దాంపత్య చట్టం లక్ష్యాలలో శీలరక్షణ మొట్టమొదటి లక్ష్యం. ఇస్లాం వ్యభిచారాన్ని నిషేధిస్తుంది. స్త్రీపురుషులు తమ సహజ బాంధవ్యం విషయంలో శీలం, సంస్కృతులను కాపాడగలిగే ఓ నైతిక నియమావళికి కట్టుబడి ఉండేలా చేస్తుంది. అందుకే ఖుర్‌ఆన్ నికాహ్ (వివాహబంధం)ను 'ఎహ్సాన్'తో పోల్చింది. 'హిస్న్' అంటే కోట. 'ఎహ్సాన్' అంటే కోటనిర్మాణం. వివాహం చేసుకున్న పురుషుణ్ణి 'ముహ్సాన్' అంటారు. అంటే అతను కోటనిర్మాత అన్నమాట. అతను వివాహమాడిన స్త్రీని 'ముహ్సానా' అంటారు. అంటే కోటలో ఆశ్రయం పొందిన స్త్రీ అని అర్థం. మరో మాటలో చెప్పాలంటే స్త్రీ వ్యక్తిత్వాన్ని, ఆమె మానాన్ని, శీలాన్ని వివాహం అనే కోట కాపాడుతుందన్న మాట.

గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల) స్త్రీలను వివాహమాడవచ్చని ఖుర్‌ఆన్ అనుమతించింది. అయితే ఇస్లాం దృష్టిలో ఈ సంబంధం కూడా అవాంఛనీయమైనదే. ముఖ్యంగా ఈనాడు అలాంటి స్త్రీలతో వివాహం మరింత అవాంఛనీయమైనది. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) గ్రంథప్రజలలోని ఒక స్త్రీని వివాహమాడదలచినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన్ని వారిస్తూ "ఆమె నిన్ను ముహ్సాన్ (కోటనిర్మాత) చేయలేదు" అన్నారు.

దీన్ని బట్టి వివాహ లక్ష్యాలలో స్త్రీ శీలాన్ని, ఆమె మానమర్యాదలను కాపాడటం మొట్టమొదటి లక్ష్యమని తెలుస్తోంది. వివాహ రూపంలో నిర్మించబడిన ఈ కోటను దాంపత్య చట్టం పటిష్ఠ పరుస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

### వివాహం మొదటి లక్ష్యం: శీలరక్షణ

"(మీకు నిషేధించబడిన) ఈ స్త్రీలు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధన వినియోగం ద్వారా మీరు వివాహమాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వమయి ఉండకూడదు." (4:24)

"కనుక బానిస స్త్రీలను వారి యజమానుల అనుమతి తీసుకొని వివాహమాడండి. చట్టం ప్రకారం వారికి చెల్లించవలసిన మహర్ ధనం కూడా చెల్లించాలి. అయితే వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచండి. విచ్చలవిడిగా చెడుతిరుగుళ్ళు తిరగనివ్వకండి. దొంగచాటుగా ప్రేమకలాపాలకు పాల్పడనీయకండి." (4:25)

"వారికి చెల్లించాల్సిన మహర్ సొమ్ము చెల్లించి, వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచాలి. అంతేగాని, వారితో విచ్చలవిడిగా కామక్రీడలకు పాల్పడటంగాని, దొంగచాటుగా అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని చేయకూడదు." (5:5)

పైసూక్తుల్ని పరిశీలిస్తే స్త్రీపురుషుల దాంపత్య సంబంధాలలో శీలం, మానమర్యాదలు, నీతినడవడికలకు పూర్తి భద్రత ఉండాలన్నదే ఇస్లాం దృష్టిలో అతి ముఖ్యమైన విషయమని తెలుస్తుంది. ఈ లక్ష్య సాధన కోసం అవసరమయితే ఇతర విషయాలను త్యాగం చేయవలసి ఉంటుంది. అంతేగాని ఇతర విషయాల కోసం ఈ లక్ష్యాన్ని మటుకు త్యాగం చేయడానికి వీల్లేదు.

దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడివుంటూ తమ సహజ కోర్కెలను తీర్చుకోవడానికి వారిని ఇలా వివాహబంధంలో బంధించడం జరిగింది. ఒకవేళ ఏదైనా వివాహబంధంలో దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేని పరిస్థితులు ఏర్పడితే, వాటి పరిరక్షణ కోసం వివాహబంధాన్ని త్యాగం చేయడమే మంచిది. సారంలేని వివాహబంధం కొనసాగించేందుకు దైవపరిమితుల్ని త్యాగం చేయకూడదు.

ఈ కారణంగానే తన భార్యతో సంభోగించనని ప్రమాణం చేసే పురుషునికి నాలుగు నెలలు మాత్రమే గడువు ఇవ్వబడింది. అంటే ఈ నాలుగు నెలలలోపే అతను తన ప్రమాణాన్ని భంగపరచి భార్యను కలుసుకోవలసి ఉంటుంది. ఒకవేళ అతను నాలుగు నెలలు గడువు దాటిన తరువాత కూడా భార్యను కలుసుకోవడానికి సిద్ధంకాకపోతే, ఆమెను అట్టే తన వివాహబంధంలో కొనసాగించడానికి అతనికెలాంటి అధికారం లేదు.  అలాగే ప్రమాణం చేయకపోయినా సరే, నాలుగు నెలలకు మించి భార్యను పడక మీదికి రానీయకుండా ఉండటం కూడా మంచిది కాదు.

గడువు దాటాక భార్యతో సంభోగించడానికి లేదా ఆమెకు విడాకులు ఇవ్వడానికి అంగీకరించకపోతే దాని పర్యవసానం చాలా ఘోరంగా ఉంటుంది. ఆ పీడిత స్త్రీ తన సహజమైన కోర్కెలను తీర్చుకోవడానికి దైవనిర్ణీత పరిమితుల్ని అతిక్రమించవలసిన దుస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితిని దైవచట్టం ఎన్నటికీ సహించదు. అదేవిధంగా ఇద్దరు ముగ్గురు స్త్రీలను వివాహమాడే పురుషులకు “మీరు ఒక భార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండ”ని ఖుర్‌ఆన్ గట్టి తాకీదు చేసింది. ఏ స్త్రీ కూడా ఇలాంటి దుస్థితికి గురికాకూడదన్నదే ఈ ఆజ్ఞ ఉద్దేశ్యం కూడా.

## వివాహం రెండవ లక్ష్యం: కారుణ్యాభిమానాలు

వివాహం రెండవ లక్ష్యం- స్త్రీపురుషుల మధ్య దాంపత్యసంబంధం కారుణ్యాభిమానాల ప్రాతిపదికపై ఉండాలి. కారుణ్యాభిమానాల ప్రాతిపదికపై ఏర్పడిన వైవాహిక బంధం ద్వారా మాత్రమే దంపతులు పరస్పరం సహకారంతో సంస్కృతీ సభ్యతలకు సంబంధించిన లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుంది. పైగా వారు తమ సాంసారిక జీవితంలో సుఖసంతోషాలు కూడా పొందగలుగుతారు. ఈ లక్ష్యం గురించి ఖుర్‌ఆన్ వర్ణించిన తీరును గమనిస్తే ఇస్లాం దృష్టిలో దాంపత్యమంటే కారుణ్యాభిమానాలే అన్న భావన మనకు తప్పకుండా కలుగుతుంది. నిజానికి స్త్రీపురుషులు ఒకరి ద్వారా మరొకరు సౌఖ్యం పొందడానికే దంపతులవుతారు.



ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి పరిశీలించండి: “ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారిదగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి.” (30:21)

ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి కూడా గమనించండి : “దేవుడే మిమ్మల్ని ఏకైక ఆత్మ నుండి సృష్టించాడు. అదే జీవి నుండి దాని జతను కూడా సృష్టించాడు, దాని దగ్గర సౌఖ్యం పొందడానికి.” (7:189)

ఖుర్‌ఆన్‌లోనే వేరొక చోట ఈవిధంగా ఉంది : “వారు మీకు, మీరు వారికి దుస్తులు వంటివారు.” (2:187)

ఇక్కడ భార్యాభర్తలను ఒకరికొకరు దుస్తులుగా పోల్చడం జరిగింది. దుస్తులు దేహానికి అంటివుంటాయి. ఆచ్ఛాదనంగా ఉపయోగపడుతూ, బాహ్య వాతావరణంలోని దుష్ప్రభావాల నుండి కాపాడుతాయి. భార్యభర్తల్ని దుస్తులతో పోల్చడంలోని ఉద్దేశ్యం దేహానికి, దుస్తులకు మధ్య ఎలాంటి అవినాభావ సంబంధం ఉంటుందో ఆలుమగల మధ్య వైవాహిక బంధం కూడా అలాంటిదే ఉండాలని తెలియజేయడమే.

అంటే వారి హృదయాలు, ఆత్మలు పరస్పరం కలిసివుండాలి. వారు ఒకరి కొకరు ఆచ్ఛాదనగా, రక్షణ కవచంగా ఉండాలి. తమ గౌరవప్రతిష్ఠలకు, నీతినడవడికలకు భంగం కలిగించే దుష్ప్రభావాల నుండి వారు పరస్పరం కాపాడుకోవాలి. దంపతుల మధ్య కారుణ్యాభిమానాలు ఉన్నప్పుడే ఈ లక్ష్యాలు సాధ్యమవుతాయి.

ఇస్లాం దృక్పథం రీత్యా భార్యాభర్తల సంబంధానికి కారుణ్యాభిమానాలే ఊపిరి. ఈ ఊపిరే గనక లేకపోతే భార్యాభర్తల సంబంధం ప్రాణంలేని దేహం మాదిరిగా మాత్రమే  మిగిలిపోతుంది.

దాంపత్య వ్యవస్థకు సంబంధించిన దైవశాసనాల వల్ల ఇస్లాం ఉద్దేశ్యం భార్యభర్తలు ఒకరికొకరు సరిగా అర్థం చేసుకొని సుఖమయమైన జీవితం గడపాలన్నదే. ఈ ఉద్దేశ్యం నెరవేరని పక్షంలో ఆ బాంధవ్యం ఆత్మలేని అందమైన శవం వంటిదవుతుంది. అందువల్ల దంపతులు పరస్పరం ప్రేమానురాగాలతో జీవించాలి. ఒకరి హక్కులు మరొకరు గౌరవించాలి. ఒకరి పట్ల ఒకరు క్షమాగుణం కలిగి ఉండాలి. పరస్పర సంబంధాలు, సమస్యల విషయంలో విశాల హృదయంతో, దూరదృష్టితో మసలుకోవాలి. ఇలా కాకుండా ఎల్లప్పుడూ ఎడముఖం పెడముఖంతో కలసిఉండటం ఏమాత్రం మంచిది కాదు. చివరికి ఈ ఎడముఖం, పెడముఖాలే తీవ్రమైన కలతలకు దారితీస్తాయి. అలాంటి పరిస్థితిలో విడిపోవడమే మంచిది.

“ముస్లిములయిన, విశ్వసించిన, విధేయులయిన, నిజాయితీపరులైన, సహనశీలురయిన, దానశీలురయిన, మర్మాయవాలు కాపాడుకునే, ఉపవాసవ్రతాలు పాటించే,

అణుకువ వినయం కలిగివుండే, దేవుడ్ని అత్యధికంగా స్మరించే స్త్రీ పురుషుల కోసం దేవుడు మన్నింపు, గొప్ప ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు." (ఖుర్‌ఆన్-33:35)

## సర్దుబాటు వైఖరి అవలంబించాలి

ఆలుమగల మధ్య సదవగాహన, ప్రేమానురాగాలు ఉన్నప్పుడు సాధారణంగా ఎలాంటి పొరపొచ్చాలు రావు. అయినప్పటికీ ఒక్కొక్కసారి షైతాన్ దంపతుల మధ్య లేనిపోని అపోహలు సృష్టించి వారి సంసారంలో చిచ్చు రగల్చడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి పరిస్థితిలో దంపతులు పరస్పరం సర్దుబాటు వైఖరి అవలంబించాలి. దైవభీతి పరాయణులకు సర్దుబాటు వైఖరిలోనే సంసార సౌఖ్యం ఉంటుంది.

ప్రపంచంలోని భార్యాభర్తలందరికీ అలి, ఫాతిమా (రజి)లు ఆదర్శ దంపతులనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే భార్యభర్తలు అన్నాక ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో వారిమధ్య కీచులాటలు రాకుండా ఉండవు. ఒక రోజు ఫాతిమా (రజి) ఏదో విషయంలో భర్త మీద అలిగి తండ్రి ఇంటికి వెళ్ళిపోయారు. కాస్సేపటికి అలి (రజి) కూడా ఆమె వెనకాల దైవప్రవక్త (సల్లం) ఇంటికి వెళ్ళారు.

ఫాతిమా (రజి) చేసిన ఆరోపణలన్నీ దైవప్రవక్త (స) విన్నారు. కాని అంతమాత్రాన ఆయన కూతుర్ని వెనకేసుకొని రాలేదు. పైగా కూతురికి గుణపాఠం గరిపే విధంగా "**లోకంలో ఏ భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రాకుండా ఉంటాయమ్మా!** అయినా ప్రతి విషయంలోనూ భర్త భార్యమాట వినాల్సిన అవసరం ఏముంది?'' అన్నారు.

తలుపు చాటున నిలబడి తండ్రీకూతుళ్ళ సంభాషణ విన్న హజ్రత్ అలి (రజి)ని ఈమాటలు ఎంతో ప్రభావితంచేశాయి. తానిక ఎన్నటికీ ఫాతిమా మనస్సు నొప్పించనని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. ఫాతిమా (రజి) కూడా తండ్రి మాటలు విన్న తరువాత ఇకముందు ఏ విషయంలో కూడా భర్తకు ఎదురుచెప్పకుండా మసలుకుంటానని నిశ్చయించుకున్నారు.

(పై మూడు పేరాలు ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్ నుండి వెలువడిన "మహనీయ ముహమ్మద్(స) ఆదర్శజీవితం'' అనే గ్రంథం నుండి గ్రహించబడ్డాయి.)

అందువల్ల భార్యాభర్తలు పరస్పరం ప్రేమానురాగాలతో, సమైక్యతా సఖ్యతలతో, సర్దుబాటు వైఖరితో సంసారం సాగించాలి; ఒకరి హక్కులు మరొకరు గౌరవిస్తూ పరస్పర సంబంధాల విషయంలో ఉదార స్వభావం కలిగి ఉండాలి. విశాల హృదయంతో ఒకరి పొరపాట్లు మరొకరు మన్నిస్తూ జీవితనౌకను సవ్యంగా నడపడానికి కృషిచేయాలి.

అలా చేయకపోతే ఆ దాంపత్య సంబంధం ప్రాణంలేని దేహంగా మారి దుర్గంధం వ్యాపింప జేస్తుంది. అంటే సంసార జీవిత వాతావరణం విషతుల్యమవుతుంది. అందుకే దివ్య ఖుర్‌ఆన్ దంపతులను ఇలా ఆదేశిస్తోంది:



"ఏ స్త్రీ అయినా భర్త తనను వేధిస్తున్నాడని లేదా సరిగా ఆదరించడంలేదని భావించినప్పుడు భార్యాభర్తలు పరస్పరం సంప్రదించుకొని సర్దుకుపోతే తప్పులేదు. అసలు వారు సర్దుకుపోవడమే సర్వదా శ్రేయస్కరం. హృదయాలు సంకుచితత్వం వైపు ఎక్కువగా మొగ్గుతాయి. అయితే మీరు పరస్పరం శ్రేయోభిలాషతో, దైవభీతిపరాయణతో వ్యవహరిస్తూ ఉండండి. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్‌ఆన్-4:128)

## లైంగిక భావోద్రేకాల వినియోగం

స్త్రీపురుషుల్లోని లైంగిక శక్తి సద్వినియోగం ద్వారా ఈ క్రింది విధంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయి.

(1) లైంగిక ఉద్రేకం చల్లారిపోయి తృప్తి కలుగుతుంది. దైనందిన కార్యకలాపాలు కొనసాగించడానికి ఏకాగ్రత లభిస్తుంది.

(2) భార్యాభర్తల మధ్య సహజ సిద్ధమైన ప్రేమానురాగాలు వృద్ధి చెందుతాయి. దాంపత్య బంధనం పటిష్ఠమవుతుంది.

(3) మానవసంతతి ఉత్పత్తికి అంకురార్పణ జరిగి, ఆ నూతన మానవుల పోషణ, శిక్షణల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఈ విధంగా ఆరోగ్యవంతమైన సమాజానికి కావల్సిన పటిష్ఠమైన కుటుంబ వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది.

భార్యాభర్తలు ఈ మూడు ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని తమ లైంగికభావోద్రేకాలను వినియోగించుకోవాలి. వీటికి భిన్నంగా వినియోగిస్తే అది పశుపక్షుల సంభోగం లాంటి లైంగికక్రీడగా మాత్రమే మిగిలిపోతుంది. ఇలాంటి పచ్చిసంభోగం కోసం ఉబలాటపడే పురుషులు మాత్రమే స్త్రీని సెక్స్ సింబల్‌గా పరిగణించి, ఆమెను ఏవిధంగానైనా ఇంటి నుంచి లాగి రచ్చకెక్కించడానికి ప్రయత్నిస్తారు. దాని కోసం స్త్రీ స్వేచ్ఛ, మహిళాభ్యుదం పేర్లతో ఉద్యమాలు కూడా నడుపుతారు.

## పురుషులు స్త్రీలకు, స్త్రీలు పురుషులకు నష్టదాయకం!

సత్కార్యాల నుండి నిరోధిస్తూ దుష్కార్యాల వైపు పురిగొల్పే స్త్రీలూ ఉంటారు; పురుషులూ ఉంటారు. కనుక విశ్వాసులైన స్త్రీపురుషులు ఇలాంటి దుష్ట స్త్రీపురుషుల పట్ల జాగ్రతగా మసలుకోవాలి. బహుశా దీన్ని గురించే దైవప్రవక్త (స) ఇలా హెచ్చరించారు:

"ప్రతిరోజూ ఉదయం ఇద్దరు దైవదూతలు ఒక ప్రకటన గావిస్తూ 'పురుషులకు స్త్రీలు నష్టదాయకం, స్త్రీలకు పురుషులు నష్టదాయకం' అని అంటారు." (ఇబ్నెమాజ)

"ఇహలోకం సుమధురమైన పచ్చటి వస్తువు. దేవుడు మిమ్మల్ని ఇలాంటి భోగ భాగ్యాల ప్రపంచానికే వారసులుగా చేస్తాడు. కనుక మీరు ప్రాపంచిక రంగేళికి దూరంగా ఉండండి. అలాగే స్త్రీల ద్వారా ఎదురయ్యే పరీక్షల నుండి కూడా మిమ్మల్ని మీరు కాపాడుకోండి. మీకు పూర్వం ఇస్రాయీల్ సంతతి ప్రజలకు ఎదురైన మొదటి పరీక్ష కూడా స్త్రీల ద్వారానే వచ్చింది.'' (ఇబ్నెమాజ, ముస్లిం)

"మీలో ఎవరికైనా ఒక స్త్రీ అందంగా కన్పించి మీరామె పట్ల ఆకర్షించబడితే, (వెంటనే) అతను తన భార్య దగ్గరకు వెళ్ళి ఆమెతో రమించాలి. ఈ విధంగా అతనిలో జనించిన అక్రమ లైంగికాలోచనలు సమసిపోతాయి." (ముస్లిం, తిర్మిజి)

## మర్మాంగాలను గురించి ప్రాథమిక హితవులు

భార్యాభర్తల కలియక విషయంలో తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు, పాటించ వలసిన కొన్ని హితవులు ఉన్నాయి. వాటిని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

"ఎవరైతే తన నోరు, మర్మావయవాల రక్షణ గురించి నాకు హామీ ఇస్తారో అలాంటి వ్యక్తికి నేను స్వర్గ ప్రవేశం గురించి హామీ ఇస్తాను." (బుఖారి, తిర్మిజి)

"దేవుడు ఎవరి నోరు, మర్మావయవాల కీడు నుండి కాపాడుతాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." (తిర్మిజి)

"ఏ స్త్రీ తనభర్త ఇంట్లో కాదని వేరేచోట దుస్తులు విడిచిపెడ్తుందో ఆమె తనకు, తన ప్రభువుకు మధ్య గల (భక్త) సంబంధాన్ని త్రెంచివేసినట్లే." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం: మేము ఒక యుద్ధం నుండి తిరిగొచ్చిన తరువాత మా ఇండ్లకు పోవడానికి సిద్ధమవుతుంటే దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని వారిస్తూ ఇలా అన్నారు: "ఆగండి, అప్పుడే వెళ్ళకండి. చీకటిపడ్డాక రాత్రి సమయంలో వెళ్ళండి. ఈలోగా స్త్రీలు నాభిక్రింది వెండ్రుకలు తొలగించి, తలదువ్వుకొని జడే వేసుకుంటారు. అలాగే భర్తలు ఎక్కడికైనా పోయివున్న స్త్రీలు కూడా వారు వచ్చే ముందు నాభిక్రింది వెండ్రుకలు తొలగించి స్నానంచేసి సిద్ధంగా ఉంటారు." (బుఖారి, ముస్లిం, ముత్తఫఖున్ అలై)

## రతిక్రీడ గురించి పాటించవలసిన జాగ్రత్తలు

రతిక్రీడ విషయంలో దంపతులు పాటించవలసిన కొన్ని జాగ్రత్తలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"భార్యాభర్తలు కలుసుకునే ముందు 'బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్ నష్షయితాన వ జన్ని బిష్షయితాన మా రజఖ్తనా' (దేవుని పేరుతో ప్రారంభం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానం దగ్గరికి షైతాన్ రాకుండా వాడ్ని దూరంగా ఉంచు.) అని వేడుకోవాలి. ఇలా వేడుకొని కలిస్తే విధివ్రాత ప్రకారం ఆమె గర్భం దాల్చుతుంది. ఆ తరువాత సంతానం కలిగితే ఆ సంతానానికి షైతాన్ ఎన్నడూ కీడు తలపెట్టలేడు." (బుఖారి, ముస్లిం)

"భార్యతో సంభోగించడం దానం (సదఖా) చేసినంత పుణ్యకార్యం." (ముస్లిం)

"మీలో ఎవరైనా తన భార్యతో సంభోగిస్తున్నప్పుడు వారిద్దరు గాడిదల్లా (పూర్తిగా వివస్త్ర అయి) నగ్నమవకుండా పరదా పాటించాలి." (ఇబ్నెమాజ)



"భార్యతో సంపర్కంజరిపి, దాని రహస్యవిషయాలు జనంతో చెప్పుకుంటూ తిరిగే పురుషునికి ప్రళయదినాన ప్రజలందరిలోకెల్లా అతి చెడ్డ నివాసం లభిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: "నేను దైవప్రవక్త 'సతర్' (నాభి నుండి మోకాళ్ళ వరకుండే శరీర) భాగాన్ని ఏనాడు చూడలేదు."

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం: "భార్యతో వెనుక వైపునుంచి సంభోగిస్తే పిల్లలు అవిటివాళ్ళుగా పుట్టారని యూదులు అనేవారు. దానికి సమాధానంగా (ఖుర్ఆన్‌లో) 'మీ భార్యలు మీకు వ్యవసాయ క్షేత్రాల్లాంటివారు. మీరు మీ వ్యవసాయ క్షేత్రాలకు మీకిష్టమైన రీతిలో వెళ్ళవచ్చు.' (2:223) అనే సూక్తి అవతరించింది." (బుఖారి, ముస్లిం)

## అసహజ మైథునం ఎంత అసహ్యకరం!

అయితే తన భార్యతో పృష్ఠసంపర్కం జరిపే పురుషుడ్ని దైవప్రవక్త (సల్లం) శపిస్తూ ఇలా అన్నారు: "తన భార్యతో పృష్ఠసంపర్కం జరిపే పురుడిపై దేవుని అభిశాపం, ఛీత్కారం పడుగాక!" (అబూదావూద్)

"సత్యం తెలపడానికి దేవుడు ఏమాత్రం సిగ్గుపడడు. మీరు మీ భార్యలతో అనుచిత సంపర్కం జరపకండి. వారితో పృష్ఠసంపర్కం కూడా జరపకండి." (అహ్మద్)

"తన భార్యతోగాని, బాలుడితోగాని పృష్ఠసంపర్కం జరిపిన, లేదా మరేదైనా అనుచిత సంపర్కం జరిపిన పురుషుడ్ని దేవుడు (ప్రళయదినాన) కన్నెత్తి కూడా చూడడు." (ఇబ్నెమాజ, అబూదావూద్)

నాలుగువేల సంవత్సరాలకు పూర్వం లూత్‌జాతిపై భయంకరమైన దైవశిక్ష విరచుకు పడింది. ఈనాడు మనం 'మృతసముద్రం' పేరుతో పిలుస్తున్న సముద్రప్రాంతం ఆ శిక్షకు సంబంధించిన అవశేషాలే. లూత్‌జాతి వినాశానికి ఖుర్ఆన్ ప్రకారం మూడు కారణా లున్నాయి. ఒకటి-బహుదైవారాధన, రెండు-పురుషులలో స్వజాతిసంపర్కం, మూడు- దారిదోపిడీలు. ఈ మూడింటిలో స్వజాతిసంపర్కం అశ్లీలతా అసహ్యతలకు పరాకాష్ఠ అని తెలుస్తోంది.

ఈ అసహజ మైథునం (Sodomy, Paederastry) ఘోరపాపం క్రిందికి వస్తుంది. దీనికి శిక్షగా "చేసినవాడ్ని చేయించుకున్నవాడ్ని హతమార్చండి; పైవాడ్ని, క్రిందివాడ్ని ఇద్దర్నీ రాళ్లతో కొట్టి చంపండి" అని హదీసుల్లో వచ్చింది. హజ్రత్ అలి (రజి) ప్రకారం ఇలాంటి నేరస్థుడ్ని చంపి అతని శవాన్ని కాల్చివేయాలి. ఈ అభిప్రాయంతో హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ఏకీభవించారు. ఇమాం అబూహనీఫా (రహ్మలై) ప్రకారం దేశ, కాల పరిస్థితుల్ని బట్టి ఏదైనా కఠినశిక్ష విధించాలి.

ఈ అసహజ మైథునం పురుషుడు తన భార్యతో జరిపినా ఘోరమైనపాపమే. తిర్మిజీ గ్రంథంలో దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ఇలా ఉంది: 'రుతుమతితో సంగ మించినవాడు, స్త్రీతో లూత్‌జాతి నిర్వాకానికి పాల్పడినవాడు, లేక జ్యోతిష్కుడి

దగ్గరికెళ్ళి అతను చెప్పిన జోస్యం నమ్మినవాడు ముహమ్మద్ (సల్లం)పై అవతరించిన బోధనలు తిరస్కరించిన వాడవుతాడు."

ఎంతో నాగరికులమని చెప్పుకునే పాశ్చాత్య ప్రజలలో స్వజాతిసంపర్కం నేడు ఒక అంటు వ్యాధిలా అతివేగంగా ప్రబలుతోంది. ఈ వ్యాధిగ్రస్తులు దీన్ని తమ ప్రాథమిక హక్కుగా ప్రకటించుకున్నారు. వీరి డిమాండ్లకు తలవొగ్గి కొన్ని దేశాల ప్రభుత్వాలు దీన్ని చట్టసమ్మతం చేయడం కూడా జరిగింది. ఎయిడ్స్ వంటి భయంకరమయిన వ్యాధికి కారణం వ్యభిచారం, స్వజాతిసంపర్కాలేనని తెలిసి కూడా వీటిని నిరోధించడం గురించి నేటి మానవుడు ఆలోచించడం లేదు.

# 16. భర్త బాధ్యతలు

పురుషుడు వివాహసందర్భంలో ఏదయినా కారణం వల్ల మహర్ చెల్లించలేకపోతే, వివాహం తరువాత వీలైనంత త్వరగా మహర్ చెల్లించాలి. ఇది భర్త నెరవేర్చవలసిన మొదటి బాధ్యత. తరువాత అతను తన స్తోమతను బట్టి ఆమె పోషణఖర్చులు భరించాలి. భర్త ఈ పోషణబాధ్యత నుండి ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేడు.

## భార్యాపిల్లల పోషణ బాధ్యత

"ధనికుడు తన ఆర్థిక స్తోమతను బట్టి ఈ పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన (పేద)వాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి." (ఖుర్ఆన్-65:7)

హజ్రత్ సూబాన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"మనిషి తన భార్యాపిల్లల కోసం ఖర్చు చేసే దీనార్ (డబ్బు), జిహాద్ వాహనం కోసం ఖర్చుచేసే దీనార్, దైవమార్గంలో తన సహచరుల కోసం ఖర్చుచేసే దీనార్- ఈ దీనార్ అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమయినది."

"మీరు దైవప్రసన్నత కోసం ఏ పని చేసినా దాని పుణ్యఫలం మీకు తప్పకుండా లభిస్తుంది. చివరికి మీరు మీ భార్య నోటికి ఒక అన్నంముద్ద అందించినా దానికీ పుణ్య ఫలం లభిస్తుంది." (బుఖారి, ముస్లిం)

"ఒక ముస్లిం పుణ్యఫలాపేక్షతో తన భార్యాపిల్లల కోసం ఖర్చు పెడ్తుంటే అదంతా అతని పాలిట దానం (సదఖా) చేసే పుణ్యంతో సమానమవుతుంది." (బుఖారి)

భర్త తన భార్యాపిల్లల కోసం ఖర్చుపెట్టడంలో పిసినారితనం వహిస్తే భార్యకు భర్త అనుమతి లేకుండా తన పిల్లల కోసం సరిపడేంత డబ్బు తీసుకునే హక్కుంది.

హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి) భార్య హజ్రత్ హిందా (రజి) ఓసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నా భర్త చాలా పీనాసి మనిషి. నా పిల్లల పోషణకు సరిపడే టంత కూడా (డబ్బు) ఆయనగారు సంతోషంగా ఇవ్వడు. మరి నేను ఆయన



డబ్బు నుంచి కొంత తీసుకొని నా పిల్లలకు అన్నపానీయాలు సమకూర్చుకోవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీకు, నీ పిల్లలకు సరిపడేటంత తీసుకుంటూ ఉండు. (అందులో తప్పు లేదు.)" అని అన్నారు.

ఒకతను దైవప్రవక్త (సల్లం)ను "మా మీద భార్యకు ఉన్న హక్కేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "నీవు తినగలిగే ఆహారం ఆమెకు పెట్టాలి. నీవు ధరించగలిగే వస్త్రాలు ఆమెకు ఇవ్వాలి. (నీ పట్ల అవిధేయతకు పాల్పడినప్పుడు) నీవామె ముఖంపై కొట్టకూడదు. ఇంట్లో తప్ప మరెక్కడా ఆమెను వదలిపెట్ట కూడదు" అని అన్నారు. (అబూదావూద్)

## ఇస్లాం దృష్టిలో మంచి భర్త

దైవప్రవక్త (సల్లం) ఒకసారి మంచి భర్తను గురించి చెబుతూ "తన భార్య కోసం ఉత్తముడయినవాడే మీలో ఉత్తముడు" అని అన్నారు. (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో మహిళల హక్కుల్ని గురించి ప్రస్తావిస్తూ "గుర్తుంచుకోండి! స్త్రీలకు అన్నవస్త్రాలు ఇవ్వడంలో వారి పట్ల మంచిగా మసలుకోండి. ఇది మీమీద స్త్రీలకున్న హక్కు" అని తాకీదు చేశారు. (తిర్మిజి)

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "ఎవరు తన భార్యాపిల్లల విషయంలో మంచివాడో అతనే మీలో మంచివాడు. నేను కూడా నా భార్యాపిల్లల విషయంలో మంచివాణ్ణి." (తిర్మిజి)

వేరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "విశ్వాసులలో అందరికన్నా ఎక్కువ గుణవంతుడే పరిపూర్ణ విశ్వాసి. అలాగే మీ భార్యల పట్ల మంచివాడే మీలో అందరికన్నా శ్రేష్ఠుడు." (తిర్మిజి)

మొగుళ్ళను కొంగులకు కట్టుకొని వాళ్ళ చేత ధర్మవ్యతిరేక పనులు చేయించుకునే భార్యలు కూడా ఉంటారు. పెళ్ళామే బెల్లం అనుకొని ఆమె చెప్పే ప్రతి విషయానికీ తలూపితే, ఇహలోకం సంగతి అలా ఉంచితే పరలోకంలో మాత్రం భర్త ఘోరంగా నష్టపోతాడు. అలాంటి భార్యల పట్ల భర్తలు జాగ్రత్తగా మసలుకోవాలి.

భార్యావిధేయులయిన భర్తలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: **"భార్యలకు విధేయులయ్యే భర్తలు నాశనమవుతారు."** (ముస్తదరక్ హాకమ్)

ఎంత మంచి భార్యాభర్తలైనా ఏవోకొన్ని బలహీనతలు ఉండటం సహజం. బలహీన తలులేని మానవులు ఎవరూ ఉండరు. స్త్రీపురుషులు వివాహబంధం ద్వారా ఏకమయి నప్పుడు వారు పరస్పరం ఒకరి బలహీనతలను మరొకరు ఉపేక్షిస్తూ, ఒకరి హక్కుల్ని మరొకరు గౌరవిస్తూ వీలైనంతవరకు అన్యోన్యంగా సంసారం చేయడానికి కృషిచేయాలి.

## నోటిదురుసు పెళ్ళాంతో ఎలా వేగాలి?

హజ్రత్ లఖీత్ (రజి) కథనం: నేను ఓరోజు దైవప్రవక్త (స) సన్నిధికెళ్ళి నా భార్య నోటిదురుసు గురించి ఆయనకు ఫిర్యాదు చేశాను. దైవప్రవక్త (స) నా ఫిర్యాదు విని “నీవు నీభార్య నోటిదురుసును భరించలేకపోతే ఆమెకు విడాకులివ్వు” అన్నారు.

దానికి నేను “దైవప్రవక్తా! నేను మొదట పిల్లల్ని గురించి ఆలోచిస్తున్నాను. తరువాత ఆమె నాతో ఓ సుదీర్ఘకాలం సంసారం చేసింది. అంచేత ఆమెకు విడాకులివ్వడానికి నాకు మనసొప్పడం లేదు” అని అన్నాను.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా సలహా ఇచ్చారు: “అయితే ఆమెకు మంచితనంతో, నేర్పుగా హితబోధ చెయ్యి. ఆమె నైజంలో మంచి అనేది ఉంటే నీ మాట విని నీవు చెప్పినట్లు నడుచుకుంటుంది. అయితే (ఒక విషయం గుర్తుంచుకో.) బానిసను కొట్టినట్లు ఆమెను కొట్టడం ధర్మసమ్మతం కాదు.” (అబూదావూద్)

## భార్యలందరి హక్కులను గౌరవించాలి

“వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు.” (ఖుర్ఆన్-4:19)

“భార్యలందరి పట్ల సమానదృష్టితో మసలుకుంటూ వారికి పూర్తిన్యాయం చేకూర్చడం మీ శక్తికి మించిన పని. మీరు తలచినా అలా చేయలేరు. అయినా మీరు ఒక భార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి. మీ వైఖరి సరిదిద్దుకొని దేవునికి భయపడుతూ మసలుకోండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. ఒకవేళ దంపతులిరువురూ విడిపోవడానికే నిర్ణయించుకుంటే దేవుడు తన అపార శక్తియుక్తులతో వారిని ఒకరిపైమరొకరు ఏమాత్రం ఆధారపడని వారిగా చేయగల్గుతాడు. దేవుడు సర్వోపగతుడు, ఎంతో వివేచనాపరుడు.”(ఖుర్ఆన్-4:129,130)

ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది భార్యలున్నప్పుడు పురుషుడు వారి మధ్య అన్నివిధాలా సమానత్వం పాటించలేడు. భార్యల మధ్యఉండే అందం, వయస్సు, స్వభావం, ఆరోగ్యం వగైరా తేడాల కారణంగా అతను వారందర్నీ సమానదృష్టితో చూడటం, ఒకేవిధంగా ప్రేమించడం సహజంగానే సాధ్యంకాదు. అయితే అంతమాత్రాన ఆకర్షణలేని భార్యను పూర్తిగా విస్మరించి ఆకర్షణగల భార్యవైపు మొగ్గడం భావ్యంకాదు. లైంగిక వ్యవహారంలో పూర్తిగా సమానత్వం పాటించకపోయినా ఇతర వ్యవహారాల్లో మటుకు సంపూర్ణ సమానత్వం పాటించాలి.

“ఎవరికైనా ఇద్దరు భార్యలుండి, వారిద్దరి హక్కుల్ని న్యాయంగా, సమానంగా, సమంజసంగా నిర్వర్తించకపోతే, తీర్పుదినాన అతను సగం శరీరం కోల్పోతాడు. ఆ స్థితిలోనే (అర్ధశరీరంతో సమాధినుండి) లేస్తాడు” అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)



## సెక్స్ సింబల్ కాదు, సేద్యభూమి

పురుషుడు స్త్రీని సెక్స్ సింబల్‌గా భావించి బలవంతంగా అనుభవించడం మంచిది కాదు. ఇద్దరి మధ్య పరస్పర అవగాహన, ప్రేమానురాగాలు ఉన్నప్పుడే ఆ కలియకలో నిజమైన ఆనందం, తృప్తి కలుగుతాయి. అలాగే రుతుకాలంలో అసలు కలుసుకోకూడదు. దీన్ని గురించి ఖుర్ఆన్ స్పష్టంగా ఇలా పేర్కొన్నది:

“వారు నిన్ను రుతుస్రావం గురించి ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: “అది అపరిశుద్ధావస్థ. ఆ స్థితిలో మీరు స్త్రీల (పడకల)కు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధులు కానంతవరకు వారిదగ్గరకు వెళ్ళకండి. వారు పరిశుద్ధులైన తర్వాత దేవుడు మిమ్మల్ని ఆదేశించిన రీతిలో వారి దగ్గరకు యథాప్రకారం వెళ్ళవచ్చు. దేవుడు తన వైపు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు.”

“మీ భార్యలు మీకు సేద్యభూముల్లాంటివారు. మీరు మీ సేద్యభూములకు మీ కిష్టమైన రీతిలో వెళ్ళవచ్చు. కాకపోతే మీరు మీ భవిష్యత్ (పరలోకం) గురించి జాగ్రత్త వహించండి. దేవుని పట్ల సదా భయభక్తులు కలిగిఉండాలి. ఒకరోజు మీరంతా ఆయన సన్నిధికే పోవలసిఉంది. ప్రవక్తా! సత్యస్వీకారులకు శుభవార్త వినిపించు.” (దివ్య ఖుర్ఆన్-2:223)

ఇక్కడ భార్యాభర్తల సంబంధాన్ని సేద్యభూమికి, రైతుకు ఉండే సంబంధంతో పోల్చడం జరిగింది. రైతు తన సేద్యభూమిలో మంచి పంట పండించుకోవడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. పొలాన్ని దున్ని అదను చూసి విత్తనం నాటుతాడు. ఎరువు వేస్తాడు. కలుపు మొక్కలు పీకేస్తాడు. చీడపురుగులు పట్టకుండా మందు చల్లుతాడు. పండిన పంట నాశనం కాకుండా అనేక విధాలుగా రక్షణ కల్పిస్తాడు.

అదేవిధంగా భర్త కూడా లైంగికానందం కోసమేగాక సంతానోత్పత్తి లక్ష్యంతో కూడా భార్యపట్ల తగినవిధంగా మసలుకుంటాడని ఈసూక్తి తెలుపుతోంది. అంతేగాని, భార్యను విలాస వస్తువుగా పరిగణించి ఆమె పట్ల విశృంఖలంగా వ్యవహరించడానికి ఎంతమాత్రం వీల్లేదు.

ఇంతకూ ఈసూక్తి ఏ సందర్భంలో అవతరించిందో వినండి. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం “భార్యతో వెనుక వైపు నుండి సంభోగిస్తే మెల్లకండ్లుగల పిల్లలు పుడ్తారని యూదులు అనేవారు. దానికి సమాధానంగా ఈసూక్తి అవతరించింది”. (బుఖారి, ముస్లిం). అయితే పృష్ఠసంపర్కం నిషిద్ధం. (82వ పేజీ చూడండి.)

## పరస్పరం దుస్తులు వంటివారు

ఉపవాసం ఉన్నప్పుడు ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడం, త్రాగడం, సంభోగించడం నిషిద్ధం. కాని పూర్వం అరబ్బులు రాత్రుళ్ళలో కూడా సంభోగించడం మానేసి దాన్ని పుణ్యకార్యంగా భావించేవారు. ఖుర్ఆన్ దీన్ని ఖండించింది.

"ఉపవాసకాలం రాత్రివేళల్లో మీరు మీభార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు. మీరు (మీ భార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందు వల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీ భార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసిన దాన్ని (అంటే దాంపత్య సుఖాన్ని) అనుభవించండి."

"మీరు (ఉపవాస కాలంలో) కడరేయి నలుపు తగ్గి తొలిజాము తెలుపు (ఉషోద యకాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆతర్వాత సూర్యాస్త మయమై చీకటి పడేవరకు ఉపవాసంపాటించాలి. అయితే మీరు మసీదుల్లో ఎతెకాఫ్ (తపోనిష్ఠ) పాటిస్తున్నప్పుడు మాత్రం మీ భార్యలను కలుసుకోకూడదు."

"ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు. వాటి దరిదాపులకు వెళ్ళకండి. ప్రజలు (పెడత్రోవ తొక్కకుండా) భయభక్తులతో మెలిగేందుకే దేవుడు ఈవిధంగా తన ఆదేశాలు విడమరచి తెలియజేస్తున్నాడు." (ఖుర్‌ఆన్-2:187)

దేహానికి దుస్తులకు ఎలాంటి అవినాభావ సంబంధముందో భార్యాభర్తలకు కూడా అలాంటి సంబంధమే ఉందని, కనుక రమజాన్ రాత్రివేళల్లో పురుషులు తమ భార్యల్ని ఎలాంటి సంకోచంలేకుండా కలుసుకోవచ్చని దేవుడు తెలియజేస్తున్నాడు.

## కొడ్తే ఏడుస్తుంది, కొట్టకపోతే ఎగబడ్తుంది

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా బోధించారు: "మీరు స్త్రీల పట్ల మృదువుగా వ్యవహరించండి. స్త్రీలు ప్రక్కటెముకలతో సృజించబడ్డారు. ప్రక్కటెముకలలో కూడా అన్నిటికంటే ఎక్కువ వంకరగా ఉండే పైఎముకతో సృజించబడ్డారు. మీరు దాన్ని సరిచేయడానికి ప్రయత్నిస్తే అది విరిగిపోతుంది. ఒకవేళ దాని మానాన వదిలేస్తే అది అలా వంకరగానే ఉంటుంది. కనుక మీరు స్త్రీలతో మంచిగా (మృదువుగా) మసలు కోండి." (బుఖారి, ముస్లిం)

"మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయమున్న స్త్రీలకు (నయాన భయాన) నచ్చజెప్పండి. (అలా దారికి రాకపోతే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ మీ మాట వినకపోతే) కొట్టండి. ఆ తరువాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచుకోండి." (ఖుర్‌ఆన్-4:34)

కొందరు స్త్రీలు చేయిచేసుకోనిదే దారికి రారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే భార్య ముఖమ్మీద కొట్టరాదని, శరీరం కందిపోయే వస్తువులతో కొట్టరాదని, నిర్దయగా కొట్టరాదని దైవప్రవక్త (సల్లం) అన్నారు. ఏమైనప్పటికీ **ఆయన భార్యల్ని కొట్టేవారిని అభిమానించేవారు కాదు.**



## తుమ్మెదలు కాదు, బాధ్యతున్న సంరక్షకులు

మనిషి తన భార్యలో ఏదో విషయం నచ్చలేదని తొందరపడి వివాహబంధాన్ని తెంచుకోకూడదు. అనివార్య పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే విడాకులిచ్చే అనుమతిని వినియోగించుకోవాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"ధర్మసమ్మతమైన పనుల్లో దేవునికి అన్నిటికంటే తలాఖ్ (విడాకులు) ఎంతో అప్రియమైన పని."

"రకరకాల పూవుల మాధుర్యం ఆస్వాదిస్తూ తిరిగే తుమ్మెదల్లాంటి స్త్రీ పురుషుల్ని దేవుడు అభిమానించడు. కనుక మీరు వివాహం చేసుకోండి, విడాకులివ్వకండి."

"విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. ఆ నరకాగ్నికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు." (ఖుర్‌ఆన్-66:6)

ఒక వ్యక్తిపై తన భార్యాపిల్లల సంరక్షణబాధ్యత ఎలా ఉందో, వారిని సన్మార్గ గాములుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత కూడా ఉంది. దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతని సంరక్షణలో ఉండేవారిని గురించి (పరలోకంలో) ప్రశ్నించబడతాడు. పాలకుడు పాలితుల సంరక్ష కుడు. అతను తన పాలితుల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారివిషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతనిపిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి, ముస్లిం)

# 17. భార్య బాధ్యతలు

"భర్తల ఇండ్లలో మన హక్కులు ఏమిటీ?" అని అడగడం కన్నా భార్యలుగా మన బాధ్యతలు ఏమిటీ అని ఆలోచించడమే మహిళలకు శ్రేయస్కరం. బాధ్యతలను విస్మరించి హక్కుల డిమాండు చేయడం అర్థరహితం. శీలవతి అయిన భార్యను గురించి దేవుడు ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రస్తావించాడు:

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు." (ఖుర్‌ఆన్-4:34)

## ఇంటికి దీపం ఇల్లాలే

స్త్రీపై పురుషునికి ఆధిక్యత నివ్వడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, శారీరకంగా, మానసికంగా స్త్రీ కన్నా పురుషుడు ఎక్కువ శక్తిమంతుడు, సమర్థుడు. రెండు, ఈ కారణంగా భార్యాపిల్లల పోషణబాధ్యత పురుషుని మీదే మోపబడింది.

స్త్రీలోని సుకుమారత్వం, కోమలత్వం, మార్దవం, లజ్జ, బిడియంల రక్షణ దృష్ట్యా ఆమె ఇంటిపట్టున ఉండటమే మంచిది. సమాజ శ్రేయస్సు కూడా అందులోనే ఉంది. స్త్రీ బయట పురుషులతో కలసి పనిచేయడం వల్ల అనేక సామాజిక రుగ్మతలు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.

ఈ కారణంగానే "ఏజాతి తన వ్యవహారాల నిర్వహణ బాధ్యతను స్త్రీకి అప్పగిస్తుందో ఆ జాతి ఎన్నటికీ బాగుపడదు" అన్నారు దైవప్రవక్త (స)- (బుఖారి)

పోతే ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి ఆధారంగానే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మహిళలకు ఇలా ఉపదేశించారు:

"స్త్రీ తన భర్త ఇంట్లో అతని అనుమతి లేకుండా ఏ వస్తువూ దానం చేయకూడదు. ఒకవేళ ఆమె అలా చేస్తే పుణ్యఫలం భర్తకు పోతుంది, ఆమెకు పాపం మిగులుతుంది."

"భర్త అనుమతి లేనిదే భార్య అతని ఇంటి నుండి బయలుదేరకూడదు." (అంటే భర్త వద్దన్నా అతని ఆజ్ఞను ధిక్కరించి బయటికి పోకూడదని అర్థం.)

"భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా రమజాన్ ఉపవాసాలు తప్ప ఆమె ఇతర ఐచ్ఛిక (నఫిల్) ఉపవాసాలు పాటించకూడదు."

హ్జత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఒక స్త్రీ దగ్గర (హజ్‌యాత్ర చేయగలిగినంత) ధనం ఉన్నప్పటికీ ఆమె భర్త హజ్‌యాత్ర జరిపే అనుమతి ఇవ్వకపోతే, అతని అనుమతి లేకుండా ఆమె హజ్ యాత్ర జరపలేదు." (దారుల్ ఖుత్నీ)

## భర్త మీద భార్య ఆరోపణలు

హ్జత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం: ఓరోజు మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉంటే ఒక స్త్రీ వచ్చి తన బాధామయ గాధను ఇలా ఏకరువు పెట్టింది- "దైవప్రవక్తా! నా భర్త సుఫ్వాన్ బిన్ ముఅత్తల్ నమాజు చేస్తున్నందుకు నన్ను కొడ్తున్నారు. ఆయనేమో పొద్దెక్కిన తరువాత లేచి నమాజు చేస్తారు. నేనెప్పుడైనా ఉపవాసం పాటిస్తే ఉపవాసం పాటించవద్దని వారిస్తున్నారు."

ఈ ఆరోపణలు చేస్తున్నప్పుడు ఆమె భర్త సుఫ్వాన్ అక్కడే కూర్చొని ఉన్నారు. దైవ ప్రవక్త (సల్లం) విషయం ఏమిటని అడిగితే హ్జత్ సుఫ్వాన్ "ఈమె నమాజులో సుదీర్ఘ మైన రెండు సూరాలు పఠిస్తుంది. అంత పెద్ద సూరాలు పఠించవద్దని మాత్రమే నేను చెప్పాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "నువ్వు ఒక్క సూరా పఠించినా సరిపోతుంది" అని చెప్పారు ఆ స్త్రీకి.

ఆ తరువాత సుఫ్వాన్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నేనీమె ఉపవాసాలను నిరోధిస్తున్నానని ఆరోపిస్తోంది. కాని ఈవిడ నఫిల్ (ఐచ్ఛిక) ఉపవాసాలు పాటించడం



మొదలెడితే వాటికి విరమించకుండా రోజుల తరబడి అలా పాటిస్తూనే ఉంటుంది. కాని, నేనేమో యువకుడ్ని, నిగ్రహించుకోలేక పోతున్నాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి విని "భర్త అనుమతి లేకుండా ఏ స్త్రీ కూడా నఫిల్ ఉపవాసాలు పాటించకూడదు" అని ఆదేశించారు.

సుఫ్వాన్ (రజి) మూడో ఆరోపణకు సంజాయిషీ ఇస్తూ "దైవప్రవక్తా! మేము కష్ట జీవులం. పొద్దుపొడవనిదే నిద్రలేవని వంశస్థులుగా పేరుపడ్డాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "సరే సుఫ్వాన్! నిద్రనుంచి మేల్కోగానే నమాజ్ చేస్తుండ"మని ఉపదేశించారు.

## కృతఘ్నుత, ధిక్కారాలు ఎంతో నష్టదాయకం

దైవప్రవక్త (స) ఓసారి కొందరు స్త్రీలను సంబోధిస్తూ ఇలా ఉపదేశించారు:

"మహిళల్లారా! మేలు చేసినవారికి మీరు ఎల్లప్పుడూ కృతజ్ఞులయి ఉండండి. మీలో ఎవరైనా ఒకరు తమ తల్లిదండ్రుల దగ్గర కాలం గడుపుతూ ఉంటారు. తరువాత దేవుడు ఆమెకు భర్తను అనుగ్రహిస్తాడు. ఆ తరువాత ఆమెకు సంతానభాగ్యం కూడా కలిగిస్తాడు. కాని ఎప్పుడయినా భర్తతో ఏదైనా చిన్నగొడవ వస్తే చాలు, 'నీ వల్ల నేనెప్పుడు సుఖపడ్డానని' అంటారు స్త్రీలు (లోగడ చేసిన మేళ్ళన్నీ మరచిపోయి)." (బుఖారి)

భర్తలు తమ అవసరాలన్నీ తీరుస్తున్నా ఎప్పుడైనా ఏదైనా విషయంలో కాస్తంత వెలితి కన్పిస్తే గతంలో చేసిన ఉపకారాలన్నీ మరచిపోయి భర్తను తెగడటం స్త్రీలలోని ఓ బలహీనత. ఈ బలహీనత వారి సత్కార్యాలను హరించే ప్రమాదం ఉంది. అందువల్ల స్త్రీలు తమకు భర్త చేసిన గత ఉపకారాలు దృష్టిలో పెట్టుకొని సర్దుకు పోవాలి.

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "రెండు రకాల మనుషులు ఉన్నారు. వారు చేసే నమాజులు వారి శిరస్సుల ఎత్తుకు మించి పైకి పోలేవు. ఒకటి, తన యజమానిని వదలి పారిపోయి తిరిగిరాని బానిస చేసే నమాజు. రెండు, తన భర్త ఆజ్ఞలను ధిక్కరించి ఇక ఎన్నటికీ దారికిరాని భార్య చేసే నమాజు." (హదీసు)

## పతి దేవుడు కాదు సతి సాష్టాంగ పడటానికి

సాష్టాంగ ప్రణామం దేవుని హక్కు మాత్రమే. మానవులు తమ తోటి మానవులతో సహా ఏ సృష్టితానికి కూడా సాష్టాంగ ప్రణామం చేయకూడదు. అలాంటి సాష్టాంగ ప్రణామం విషయంలో దైవప్రవక్త (సల్లం) మరో దృక్కోణంతో ఏం చెప్పారో చూడండి:

"ఆరాధనకు, సాష్టాంగ ప్రణామానికి అల్లాహ్ మాత్రమే అర్హుడు. ఆయన ముందు తప్ప మరెవరి ముందూ మోకరిల్లడానికి అనుమతి లేదు. ఒకవేళ అలాంటి అనుమతి ఏదైనా అల్లాహ్ తరఫున ఇచ్చివుంటే మొట్టమొదట భర్తకు సాష్టాంగ పడమని భార్యకు ఆజ్ఞ వచ్చి ఉండేది." (హదీసు)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు: "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ఏ స్త్రీ అయినా తన భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఆమె తన ప్రభువు (దేవుని) హక్కుల్ని కూడా నెరవేర్చనట్టే." (హదీసు) వేరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఏ స్త్రీ కూడా విశ్వాసంలోని మాధుర్యం ఆస్వాదించలేదు." (హదీసు)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీపై మీ స్త్రీల హక్కులున్నాయి. మీ స్త్రీలపై మీ హక్కులున్నాయి. మీపై మీ స్త్రీలకున్న హక్కులు- మీరు వారి పట్ల మంచిగా ప్రవర్తించండి; అన్నవస్త్రాలు ఇవ్వడంలో కొరత రానివ్వకండి. మీ స్త్రీలపై మీకున్న హక్కులు- వారు మీ పడకలపై ఇతర పురుషులు ఎవరినీ పడుకో నీయకూడదు; మీ అనుమతి లేకుండా ఇతరులెవరినీ మీ ఇంట్లోకి రానీయకూడదు." (ఇబ్నెమాజ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "స్త్రీ తన భర్త పడక వదలి అతని నుండి వేరయి రాత్రి గడిపితే, ఆమె అతని దగ్గరకు తిరిగి రానంతవరకూ దైవదూతలు ఆమెను శపిస్తూ ఉంటారు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "భర్త తన భార్యను పిలిచినప్పుడు ఆమె పొయ్యి దగ్గరున్నా సరే వెంటనే వచ్చేయాలి." (తిర్మిజి-మిష్కాత్)

## ఇస్లాం దృష్టిలో ఉత్తమ గృహిణి

భర్త పట్ల భార్య విధేయత కలిగి ఉండాలి. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "ఉత్తమ స్త్రీ అంటే నీవామెను చూడగానే నీ మనస్సు సంతోషంతో పొంగిపోవాలి. నీవు ఆజ్ఞాపించిన వెంటనే ఆమె నీకు విధేయురాలవ్వాలి. నీవామె దగ్గర లేనప్పుడు నీ హక్కులయిన నీ ఆస్తిని, తన శీలాన్ని ఆమె కాపాడుకోవాలి."

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. భర్త ఏ ఆజ్ఞ ఇచ్చినా అది ఇస్లాం పరిధిలోనే ఉండాలి. ఇస్లాంకు విరుద్ధమైన పనులు చేయమని ఆజ్ఞాపిస్తే ఆమె తన భర్త ఆజ్ఞను పాటించనవసరం లేదు. పైగా అలాంటి ఇస్లాంవ్యతిరేకమైన ఆదేశాన్ని పాటించడం వల్ల ఆమెకు తన కర్మలచిట్టాలో పాపమే వచ్చి చేరుతుంది. భర్త ఇస్లాం స్వభావానికి అనుకూలమైన ఆజ్ఞ ఇచ్చినప్పుడు దాన్ని పాటిస్తే వాస్తవానికి ఆమె పరోక్షంగా దేవుని ఆజ్ఞను శిరసావహించినట్లే అవుతుంది.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను "దైవప్రవక్తా! స్త్రీ మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అనడిగాను. దానికాయన "ఆమె భర్తకు ఉంది" అని అన్నారు. మళ్ళీ నేను "పురుషుని మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని ప్రశ్నించాను. ఆయన "అతని తల్లికి ఉంది" అని చెప్పారు. (ముస్తదరక్ హాకిమ్)

దైవభీతి పరాయణురాలైన పతివ్రత పాటించాల్సిన విధులేమిటో పై హితోక్తుల్లో వచ్చాయి. అంతేకాదు, కుటుంబవ్యవస్థ ఏకాంతాన్ని చక్కదిద్ది పటిష్ఠమైన పునాదులను



ఏర్పరచే విషయాలపై సైతం శ్రద్ధ తీసుకొని జాగ్రత్తగా మసలుకోవలసి ఉంటుంది. అప్పుడే ఆమె ఇల్లు స్వర్గధామమయి సుఖసంతోషాలతో అలరారుతుంది. ఇంటిని స్వర్గసీమగా తీర్చిదిద్దుకోవడానికి పాటించాల్సిన ఈ విషయాల్ని గమనించండి:

## స్త్రీలకు కొన్ని ముఖ్యమైన హితవులు

- మీ భర్తకు ఇష్టంలేని పనిని ఎన్నటికీ చేయకండి.
- అతను ఇష్టపడని వ్యక్తిని, బంధువుల్ని ఇంట్లోకి రానివ్వకండి. ముఖ్యంగా మీ భర్త ఇంట్లో లేనప్పుడు ఈ విషయాన్ని మరింత సీరియస్‌గా తీసుకోవాలి.
- భర్త తరపు బంధువుల్ని ఆదరించడంలో ఎలాంటిలోపం రానివ్వకండి. వారికి ఆతిథ్యం ఇవ్వాల్సివస్తే అది మీ కర్తవ్యమని భావించి ఉదారబుద్ధితో ఇవ్వండి. అంతే గాని "మీమేనత్త వస్తే అది చేశా, మీబాబాయి వస్తే ఇది చేశా" నంటూ చేసిన మేలు గురించి భర్త ముందు గొప్పలు చెప్పుకోకండి. ఇవి మీఇద్దరి హృదయాల మధ్య దూరాన్నే పెంచుతాయి. అలాగే పుట్టింటివాళ్ళను గురించి మెట్టింట్లో పొగడకండి.
- భర్త తల్లిదండ్రుల్ని మీ తల్లిదండ్రులుగా భావించి వారిపట్ల గౌరవమర్యాదలతో ప్రవర్తించండి. భర్త తల్లిదండ్రులకు సేవ చేయవలసిన బాధ్యత మీమీద లేకపోయినా భర్త ప్రేమానురాగాలను దృష్టిలో పెట్టుకొని, పెద్దవాళ్ళుగా, గౌరవనీయులుగా భావిస్తూ వారికి సేవ చేయడానికి ప్రయత్నించండి.

ఈవిధంగా భర్త తల్లిదండ్రులకు సేవ చేస్తే వారి దగ్గర మీ గౌరవం ఇనుమడిస్తుంది. వారు మిమ్మల్ని సొంత కూతురిలా ప్రేమిస్తారు. దీనివల్ల స్వయంగా మీ భర్త కూడా మిమ్మల్ని గౌరవదృష్టితో చూస్తాడు. భర్తప్రేమ కోసం అతని తల్లిదండ్రుల్ని తన తల్లిదండ్రులుగా భావించి సేవచేసే ఇల్లాలు దేవుని దృష్టిలో కూడా ఉత్తమ గృహిణిగా పరిగణించబడుతుంది.

- ఒకవేళ ఎప్పుడైనా భర్త వల్ల ఏదైనా బాధ కలిగితే అతడ్ని క్షమించి మునుపటి లాగానే స్నేహసఖ్యతలతో, ప్రేమానురాగాలతో మసలుకోండి. వాటిలో ఎలాంటి లోపం రానీయకండి. తాత్కాలికంగానైనా సరే భర్త మీద అలిగి సంకుచిత మనస్కులుగా మారకండి. భర్తను గురించిన ఆరోపణలు ఇతరుల ముందు ఏ మాత్రం ప్రస్తావించకండి.

"భర్త పట్ల కృతఘ్నురాలయి ఉండే స్త్రీ వైపు దేవుడు తీర్పుదినాన కన్నెత్తి కూడా చూడడ"ని దైవప్రవక్త (సల్లం) తెలిపారు.

- కేవలం భర్త కోసమే మేకప్, అలంకరణలు చేసుకోవడం ఉత్తమ ఇల్లాలి లక్షణం. కేవలం భర్త కోసం, అతను ఇంట్లో ఉన్నప్పుడు లేక ఇంటికొచ్చే ముందు భార్య అలంకరణలు చేసుకోవడం భర్త హక్కని ఇస్లాం చెబుతోంది.

" దైవప్రవక్త (స) తన సహచరులకు ఇలా బోధించారు: "మీరు (ప్రయాణం నుంచి) తిరిగొస్తే, వచ్చేముందు మీరాక గురించి కబురు పంపండి. దాని వల్ల మీ భార్యలు అలంకరించుకొని మీకోసం ఎదురుచూడటానికి సిద్ధంగా ఉంటారు.

" ఇంటిని శుభ్రంగా ఉంచాలి. ఇంట్లో వస్తువులను చిందరవందరగా ఎక్కడ పడితే అక్కడ ఉంచకుండా క్రమపద్ధతిలో, చూసేవారిని ఆకట్టుకునేలా సర్దిఉంచాలి. మరోవైపు మీ పిల్లలకు క్రమశిక్షణ, నాగరికత, విద్యాబుద్ధులు కూడా నేర్పాలి.

పరిశుభ్రత అర్థవిశ్వాసమని ఇస్లాం చెబుతోంది. "చేసిన తప్పుకు తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతూ అత్యధికంగా క్షమాపణ చెప్పుకునేవారిని, ఎల్లప్పుడూ ఎంతో పరిశుభ్రంగా ఉండేవారిని దేవుడు ప్రేమిస్తాడు."

## శీలవతే భర్త హృదయాన్ని ఏలుతుంది

నాలుగు వస్తువులు లభించినవారికి ఇహపరలోకాల మేళ్ళు లభించినట్లేనని దైవ ప్రవక్త (సల్లం) తెలిపారు. ఆ నాలుగు వస్తువులు ఇవి:

(1) కృతజ్ఞతతో ఉండే హృదయం.
(2) ఎల్లవేళలా దైవాన్ని స్మరించే నోరు.
(3) కష్టాలను సహించే శరీరం.
(4) దైవభీతితో తన మానమర్యాదలు, భర్త ధనసంపత్తి విషయంలో అతని అవిధే యతకు దూరంగా ఉండే ఇల్లాలు.

ఒక మనిషి ఎల్లప్పుడూ దేవుని పట్ల కృతజ్ఞుడై, ఆయన పవిత్రతా ఔన్నత్యాలను స్మరిస్తూ, దైవమార్గంలో ఎదురయ్యే కష్టాలను సహిస్తూ పవిత్రజీవితం గడుపుతున్నా డంటే నిస్సందేహంగా ఇది దైవం నుండి అతనికి లభించిన గొప్ప వరమనే చెప్పాలి. అలాగే దైవం పట్ల భయభక్తులు కలిగివుండటంతో పాటు తనకు విధేయురాలిగా ఉండే భార్య లభించడం కూడా గొప్పవరమే. అందుకే దైవప్రవక్త (స) ఇహపరలోకాల శుభాలు, సౌభాగ్యాల జాబితాలో ఉత్తమ ఇల్లాలిని కూడా చేర్చి భార్యగా, గృహిణిగా స్త్రీ నిర్వహించవలసిన ప్రధాన బాధ్యతల్ని ఈ హదీసులో స్పష్టం చేశారు. నిజానికి శీలవతి అయిన ఇల్లాలే భర్త హృదయాన్ని ఏలగలుగుతుంది.

## ఈ మేకప్పులు, అలంకరణలు ఎవరి కోసమో!

ఈరోజుల్లో ముస్లిం మహిళల్లో చాలామంది ఇల్లు దాటి బయటికి వెళ్లాలను కుంటే ఖరీదైన చీరలు, ఆభరణాలతో ఆపాదమస్తకం పూర్తిగా సింగారించుకొని గాని బయలుదేరరు. కాని ఇంట్లో ఉన్నప్పుడు నగలన్నీ తీసేసి శిరోజాలు చిందరవందరగా పడేసుకొని, మ్యాచింగ్‌లేని మాసిన బట్టలతో నిర్లక్ష్యంగా, నిరాసక్తతతో ఉంటారు. భర్త ముందు అందంగా ముస్తాబయి ఉండే హక్కును దైవప్రవక్త (సల్లం) ఇచ్చి ఉన్నప్పుడు ముస్లిం మహిళలు దాన్ని ఎందుకు వినియోగించుకోరు?



కేవలం భర్తసంతోషం కోసం మంచిబట్టలు వేసుకొని అతని రాక కోసం ఎదురు చూడటం అనేది భర్త హక్కు కూడా. దాన్ని నెరవేర్చడం భార్య కర్తవ్యం. బయటికి వెళ్ళేటప్పుడు ముఖ్యంగా సభల్లో, వివాహాది శుభకార్యాల్లో పాల్గొనేటప్పుడు సాధారణ దుస్తులు మాత్రమే ధరించి అలంకరణలు ఏమీలేకుండా నిరాడంబరంగా ఉండాలి.

కాని మన సమాజంలో ఈనాడు దీనికి పూర్తి భిన్నంగా ఉంది. సుగుణవతులైన స్త్రీలయినా, మాడ్రన్ మహిళలైనా సరే, పరదా పాటించే పడతులైనా, బురఖా వేసుకోని బూబమ్మలైనా సరే అందరూ గడప దాటితే చాలు, ఇంట్లో ఉన్న మేకప్ సరంజా మంతా తీసి ముస్తాబవుతారు. ఇంటికి రాగానే భర్త పిలుపుకు వెంటనే స్పందించ కుండా **"ఆ..వస్తున్నా ఉండండి, చీర మార్చుకుంటున్నా.... కాస్త ఆగండి బాబూ! నగలు తీసి బీరువాలో పెడ్తున్నా"** అంటూ అలంకరణ వస్తువులన్నీ పూర్తిగా తీసేసి మరీ భర్త ఎదుటికి వస్తారు. ఈధోరణి కొంతకాలానికి భర్త అసంతృప్తికి కారణమవు తుంది. దంపతుల మధ్య దూరాలు పెరిగే ప్రమాదం కూడా లేకపోలేదు.

కనుక ఈజాడ్యం సమసిపోవాలి. స్త్రీలు బయటికి పోయేటప్పుడు మామూలు దుస్తులు ధరించి, మేకప్ చేసుకోకుండా నిరాడంబరంగా పోవడం, ఇంటికి వచ్చి నప్పుడు భర్త ముందు అలంకరణలతో అందంగా తీర్చిదిద్దుకోవడం గనక చేస్తే ప్రస్తుత సమాజ పరిస్థితి చాలావరకు మారిపోతుంది. అప్పుడు మీ భర్త ముందు ఎవరైనా పరస్త్రీ పరదాలేకుండా వచ్చినా అతని మనస్సు అదుపు తప్పదు. అతని దృష్టి ఆమెపై ప్రత్యేకంగా పడదు. ఎందుకంటే అతను భార్యవల్ల తృప్తిచెంది ఇంటి నుంచి వచ్చాడు. అలాంటప్పుడు అతను ఇతర స్త్రీలను కామదృష్టితో ఎందుకు చూస్తాడు?

సాధారణంగా భర్తల్లో అసంతృప్తి, అసహనాలు తమ భార్యల వేషభాషల వలనే జనిస్తాయి. కాబట్టి మహిళలు తమ అలంకరణలు, అందచందాలను భర్తలకు మాత్రమే అంకితంచేసి వారికి అణుకువగా, అనుకూలంగా మసలుకోవడం ఎంతో అవసరం. అందులోనే మహిళల శ్రేయస్సు ఉంది.

ధన వికేంద్రీకరణ



**డబ్బంటే ఎవరికి చేదండీ?**

కాని ధర్మాధర్మాల విచక్షణ చేయకుండా అడ్డదారుల గుండా సంపాదిస్తూ, విచ్చలవిడిగా ఖర్చుచేసేవారికి ఈ ధనమే పరలోకంలో పరమ చేదుగా మారుతుంది. మీకింకా నమ్మకం కుదరలేదా? అయితే ఈ పుస్తకం చదవండి.

ఇందులో ధనవ్యామోహం, గ్లోబలైజేషన్, ఆర్థిక న్యాయం, వడ్డీ, దళారీ వ్యవస్థ, వ్యాపారం, షేర్‌మార్కెట్, ఇస్లామిక్ మార్కెట్, జకాత్, ఆస్తిపంపిణి, సమరసొత్తు, వీలునామా వగైరా శీర్షికలు ఉన్నాయి.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:224, వెల: రూ. 75/-)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.106, సహారా కాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2, ✆ 66 710 795, 944 1515 414**

## ఖుర్‌ఆన్ దృష్టిలో అతివలకు ఆదర్శప్రాయులు

"అవిశ్వాసుల విషయంలో దేవుడు నూహ్, లూత్ (ప్రవక్త)ల భార్యల్ని ఉదాహరణ లుగా పేర్కొంటున్నాడు. ఆ స్త్రీలిద్దరు పుణ్యాత్ములైన మా భక్తులిద్దరి దాంపత్యంలో ఉండే వారు. కాని వారు తమభర్తల పట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారు. అంచేత వారా స్త్రీలను దేవుని (శిక్ష) నుండి ఏమాత్రం కాపాడలేక పోయారు. వారిద్దరితో 'వెళ్ళండి, అగ్నిలో పడేవారితోపాటు మీరూ అగ్నిలోకి పోయిపడండి' అని చెప్పడం జరిగింది." (ఖుర్‌ఆన్-66:10)

ఈ స్త్రీలిద్దరూ తమ భర్తల పట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారంటే నీతి బాహ్యా మైన చేష్టలకు ఒడిగట్టారని అర్థం కాదు. వారు ధర్మం విషయంలో తమ భర్తలతో సహకరించ లేదు. పైగా దాన్ని తిరస్కరించి సత్యతిరస్కారులతో చేతులు కలిపారు. హజ్రత్ నూహ్ (అలైహి) భార్య దుర్మార్గులు, దౌర్జన్యపరులైన తన జాతి నాయకులకు విశ్వాసుల్ని గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తుండేది. అలాగే హజ్రత్ లూత్ (అలైహి) భార్య కూడా తనభర్త ఇంటికి వచ్చేవారిని గురించి దుర్మార్గులైన తన జాతి నాయకులకు సమాచారం అందజేస్తుండేది.

"విశ్వాసుల విషయంలో దేవుడు ఫిరౌన్‌భార్య గాధను దృష్టాంతంగా పేర్కొంటు న్నాడు. ఆమె (దైవాన్ని ప్రార్థిస్తూ) "ప్రభూ! నాకోసం నీ దగ్గర స్వర్గంలో ఒక గృహం నిర్మించు. నన్ను ఫిరౌన్ బారినుండి, అతని (దుష్ట)కర్మల (కీడు)నుండి కాపాడు. (ఈ) దుర్మార్గపు జాతి నుండి నాకు విముక్తి కలిగించు" అని అన్నది.

"అలాగే దేవుడు ఇమ్రాన్ కుమార్తె మర్యంని కూడా ఉదాహరణగా పేర్కొంటు న్నాడు. ఆమె తన మానాన్ని కాపాడుకున్న పరమ శీలవతి. మేము మావైపు నుండి ఆమె (గర్భం)లోకి ఒక ఆత్మను ఊదాము. ఆమె తనప్రభువు బోధనల్ని, ఆయన గ్రంథాలను విశ్వసించి, దైవవిధేయులలో చేరిపోయింది." (ఖుర్‌ఆన్-66:10-12)

# 18. ఆత్మసౌందర్యం

"అందమే ఆనందం, ఆనందమే జీవిత మకరందం" అన్నాడు ఓ సినీకవి. ఆ కవిహృదయంలోని 'అందం'లో ఆత్మసౌందర్యం ఉందో లేదో తెలియదుగాని, ఆత్మ సౌందర్యంలేని అందం వల్ల తాత్కాలికమైన జీవిత మకరందం మాత్రమే లభిస్తుంది. అందంతో పాటు ఆత్మసౌందర్యం కూడా ఉంటే జీవిత మకరందంతో సహా శాశ్వత మైన ఆత్మానందం కూడా లభిస్తుంది.

దేవుని దృష్టిలో, దైవదాసుల దృష్టిలో కూడా అందరికీ అన్నిటికన్నా ఎంతో విలువ యినది, విలువకట్టలేనిది, కొనలేనిది ఈ లోకంలో ఏదయినా ఉందంటే, అది ఆత్మసౌందర్యం మాత్రమే. అలాంటి ఆత్మసౌందర్యమే మనిషిలో కొరవడితే అతను ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు పాటించినా ప్రయోజనం లేదు. ముఖ్యంగా ఈ ఆత్మ సౌందర్యం వనితలకు ఎంతో విలువైన ఆభరణం అవుతుంది.



స్త్రీలకు అందంతో పాటు ఆత్మసౌందర్యం కూడా ఉంటే అమెను చేసుకునే వాడు ఎంతో అదృష్టవంతుడని చెప్పవచ్చు. ఆత్మసౌందర్యంలేని అందం ఆడదానికి అహంకారం తెచ్చిపెడ్తుంది. అందానికి అహంకారం తోడయితే ఇక ఆ సుందరాంగి ఏఒక్కచోటా నాలుగు కాలాలపాటు నిలదొక్కుకోలేదు.

దంపతుల్ని జీవితాంతం గట్టిగా కలిపిఉంచే బంధనాలు పరస్పర సదవగాహన, ప్రేమానురాగాలే. ఇవి రెండు ఆత్మసౌందర్యంలోని భాగాలే. భార్యాభర్తల మధ్య సదవ గాహన లోపించినప్పుడు ప్రేమానురాగాలు క్రమంగా క్షీణిస్తాయి. ప్రేమానురాగాలు క్షీణించినప్పుడు సదవగాహనకు తూట్లు పడతాయి.

## ఆత్మసౌందర్యం లేనిచోట అనుమాన పెనుభూతం

దాంపత్య జీవితానికి పునాదులయిన ఈ రెండు విషయాలు ఒకదానితో మరొకటి అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయి. కనుక ప్రశాంత దాంపత్య జీవితం గడపదలచు కున్న మహిళలు ఈ రెండు విషయాలను సొంతం చేసుకోవాలి. ప్రేమలేని భార్యను భర్త చీటికిమాటికి అనుమానించే ప్రమాదం ఉంటుంది. చివరికి ఈ అనుమానం పెను భూతమయి దంపతుల మధ్య దూరాన్ని పెంచుతుంది.

ఇలాంటి సంసారాలు సాధారణంగా చిన్నచిన్న విభేదాలతో ప్రారంభమై లేనిపోని అనుమానాలతో వేడెక్కి చివరికి రణభూములుగా మారిపోతాయి. దీన్నంతటికీ కారణం నువ్వేనని భర్త నిందిస్తే, ఈదుస్థితికి మీరే బాధ్యులని భార్య ఆరోపిస్తుంది. ఏమైనప్ప టికీ పరిస్థితిని ఉభయులూ సహనంతో, సదవగాహనతో ఎదుర్కోవడానికి ప్రయత్నిం చాలేగాని, ఒకర్నొకరు నిందించుకుంటూ అనుమానాల వాతావరణంలో ఎడ మొగం, పెడమొగంగా ఉండకూడదు. కుటుంబాన్ని చక్కదిద్దుకోవడానికి ముస్లింలకు ఖుర్‌ఆన్, హదీసుల రూపంలో నిర్దిష్ట ప్రమాణాలు, చక్కని మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. ఆచరణపరంగా వారి ముందు దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరుల ఆదర్శాలు ఉన్నాయి. వాటిని ఆచరిస్తే వారి గృహం స్వర్గధామమే అవుతుంది.

## తప్పు ఎవరిదైనా శిక్ష మనకే

"అరిటాకు వచ్చి ముల్లు మీద పడినా, ముల్లు పోయి అరిటాకు మీద పడినా అరిటాకుకే నష్టం" అన్న సామెత అందరికీ తెలిసిందే. ఆలుమగల మధ్య రేకెత్తే చిటపటలు, కీచులాటల వల్ల సాధారణంగా భార్యే ఎక్కువగా కష్టాల పాలవుతుంది. ముఖ్యంగా భౌతికారాధన ప్రధానమైన ఆధునిక నాగరికతతో కలుషితమైన నేటి మిశ్రమ సమాజంలో స్త్రీ అడుగడుగునా ఇక్కట్ల పాలవుతోంది. అందువల్ల స్త్రీలు ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని భర్తలపై తమకున్న హక్కులేమిటని ప్రశ్నించకుండా భార్యగా తమ బాధ్యతలు ఏమిటో తెలుసుకొని మసలుకోవడం చాలా అవసరం.

పరిస్థితి ఎంత జటిలమైనా దంపతుల పొరపొచ్చాల రోగానికి ప్రేమానురాగాలే సరైన చికిత్స అనడంలో ఎలాంటి సందేహం లేదు. హృదయాన్ని జయించగల్గిన

ప్రేమ శరీరాన్ని సులువుగా వశపరచుకుంటుంది. భర్త తనను ప్రేమిస్తున్నాడా లేదా అన్న విష యంతో నిమిత్తంలేకుండా భార్య మనస్ఫూర్తిగా తన భర్తను ప్రేమించడానికి ప్రయత్నిం చాలి. ఒకవేళ ఏదైనా బలమైన కారణం వల్ల ఆమె తన భర్తను మనస్ఫూర్తిగా ప్రేమించ లేని పక్షంలో దాని ప్రభావం, ఫలితాలనైనా వ్యక్తపరచడానికి ప్రయత్నించాలి.

## కారణం ఏదయినా మందొక్కటే

ప్రేమ ఇద్దరినుండి వ్యక్తంకావాల్సిన విషయమే అయినప్పటికీ ఏదైనా కారణం వల్ల ఆ ప్రేమ ఒకరిలో లోపించినప్పుడు అతనిలో దాన్ని రెండోవ్యక్తి జనింపజేయడం అసాధ్యమేమీ కాదు. అంతేగాని దాన్ని గురించే ఆలోచించి కుమిలిపోతూ కాలం వృధాచేయకూడదు. ఈకారణాల్లో కొన్ని దూరం కానటువంటివి కూడా ఉండవచ్చు.

కారణం ఏదైనా ఎదుటి వ్యక్తిలో లోపించిన ప్రేమను తిరిగి జనింపజేయవచ్చు. తలనొప్పికి ఎన్నో కారణాలుంటాయి. కొన్ని రకాల తలనొప్పులకు కారణాలే తెలియవు. అయినా డాక్టర్లు సాధారణమైన యాస్ప్రిన్ మందు వాడి దాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తారు. అలాగే **భార్య ప్రేమనే మందుతో భర్తలోని వ్యతిరేకత పోగొట్టగల్గుతుంది.**

కొందరు స్త్రీలు తాము ఏమంత అందంగా లేనందున తమ భర్తలను తృప్తి పరచలేకపోతున్నామని, అంచేత వారు తమ పట్ల సఖ్యతగా ఉండటం లేదని వాపోతారు. ఇలాంటి స్త్రీలు ఎల్లప్పుడూ తమ దురదృష్టాన్ని నిందించుకుంటూ నిస్పృహతో జీవితం గడుపుతారు. శారీరక అందచందాలు ప్రేమకు బలం చేకూర్చుతా యన్నది నిజమే. కాని ఒక్క శారీరకసౌందర్యమే ప్రేమానురాగాలకు రాచబాట నిర్మించలేదు. నిజం చెప్పాలంటే శారీరకసౌందర్యం ద్వారా పొందలేని ప్రేమమాధుర్యాన్ని ఒక్క ఆత్మసౌందర్యం ద్వారానే పొందవచ్చు. వివాహబంధాన్ని పటిష్ఠంగా ఉంచే అసలు సౌందర్యం ఆత్మసౌందర్యమే. భర్తమనస్సు గెలుచుకోవడానికి ఆత్మసౌందర్యమే అసలైన సూదంటురాయి.

## అందంతో ఎంతోకాలం ఆకట్టుకోలేరు

శారీరకంగాను, మానసికంగాను స్త్రీకంటే పురుషుడు ఒక మెట్టు ఎక్కువని వైద్య శాస్త్రంరీత్యా కూడా ధృవపడిన విషయమే. స్త్రీస్వేచ్ఛ, స్త్రీ సమానత్వం అనే నినాదాల వరవడిలో కొట్టుకుపోయి వాస్తవాన్ని నిరాకరిస్తే అది అవాస్తవం ఎన్నటికీ కాజాలదు. అంచేత స్త్రీపై పురుషుని ఆధిక్యతాభావం సహజసిద్ధమైనదని మనం అంగీకరించక తప్పదు. పురుషునిలోని ఈ ఆధిక్యతాభావం కారణంగానే అతను స్త్రీ పెత్తనాన్ని సహించలేడు. ఆత్మసౌందర్యం లోపించిన సుందరాంగులు తమ భర్తలను కొన్నాళ్ళు మాత్రమే తమకొంగులకు కట్టి ఉంచగలరుగాని, ఎల్లకాలం వారిని తమ అందచందాలతో బంధించి ఉంచలేరు. అదే ఆత్మసౌందర్యంగల స్త్రీలయితే పెద్దగా



అందగత్తెలు కాకపోయినా తమ సద్వర్తనం, సాధు స్వభావాలతో భర్తల హృదయాల్ని సునాయాసంగా చూరగొన గలుగుతారు. ఇలాంటి స్త్రీల రూపురేఖల పట్ల వారి భర్తలు వివాహమైన తొలిరోజుల్లో కొంత అసంతృప్తి, అసహనాలు వెలిబుచ్చినప్పటికీ చివరికి భార్యల ఆత్మ సౌందర్యానికి ముగ్ధులైపోయి త్వరలోనే రాజీపడతారు.

అందువల్ల మహిళలు అసాధ్యమయిన శారీరక అందచందాలను గురించి అట్టే ఆలోచిస్తూ కాలయాపన చేయకుండా సాధ్యమైన ఆత్మసౌందర్యాన్ని పెంపొందించుకునే విషయం పట్ల తగిన శ్రద్ధ వహించాలి. భర్తలను వశం చేయగల శక్తిమంతమైన మంత్రదండం ఆత్మసౌందర్యమే అన్న విషయాన్ని వారు ఎన్నటికీ మరచిపోకూడదు. శారీరక సౌందర్యం ప్రయత్నించినా పొందలేని భౌతికవస్తువు. ఆత్మసౌందర్యం తలచుకుంటే సాధించగల అమృతభాండం.

## మీ చేతుల్లోనే ఉంది ఈ అమృతభాండం

కనుక సోదరీమణులారా! ఈ అమృతభాండం మీ చేతుల్లోనే ఉంది. దాన్ని మీ భర్తల హృదయాలపై చిలికించి చూడండి. భర్త ఇంటికి రాగానే అందంగా ముస్తాబై చిరునవ్వుతో స్వాగతమివ్వండి. ఇంట్లో అతను చేయబోయే పనులకు పరుగెత్తి చేయూత నివ్వండి. భర్త ఏదైనా వస్తువు కోసం వెతుకుతుంటే "అబ్బబ్బ! మీరెప్పుడూ ఇంతే, ఒకచోట పెట్టి మరోచోట వెతుక్కుంటారు" అంటూ కొందరు అసహనంతో దాన్ని భర్త చేతికందిస్తారు. మరికొందరైతే భర్త వస్తువు కోసం వెతుకుతుంటే తమ దైనందిన పనులలో తలమునకలై అతని వైపు కన్నెత్తి కూడా చూడరు. మీరలా చేయకండి. మీరు చేస్తున్నపని మానేసైనా సరే వెంటనేవచ్చి ఆ వస్తువుని వెతికివ్వండి.

అలాగే భర్త బయటికి వెళ్తుంటే అతను అడక్క ముందే అతనికి కావాల్సిన వస్తువుల్ని సమకూర్చి పెట్టండి. అతను ఏదైనా విషయంపై తప్పుడు అభిప్రాయం వెలిబుచ్చితే మొండిగా దాన్ని ఖండించకండి. "అలా చేయడం వల్ల ఈ నష్టం ఉంది, ఇలా చేస్తే ఈ లాభాలు ఉన్నాయి" అని నిదానంగా వివరించి చెప్పండి. తప్పులేని విషయాల్లో మీరు మీ విషయాన్ని, అంటే మీ అభిప్రాయాన్ని ఉపసంహరించుకొని లేదా వాయిదావేసుకొని భర్త అభిప్రాయానికే ప్రాధాన్యం ఇవ్వండి.

**త్యాగంలేని ప్రేమ నిజమైన ప్రేమ అన్పించుకోదు.** మీరు నిజంగా మీ భర్తను ప్రేమిస్తుంటే మీ అవసరాలు, ఇష్టాలను కొంత త్యాగం చేయకతప్పదు. భర్త ఆదరణ, అనురాగాలలోనే మీ సంసార సుఖసంతోషాలు ఉంటాయన్న వాస్తవాన్ని ఎన్నటికీ మరచిపోకూడదు. మీ సంసారసుఖం మీరు భర్త పట్ల చూపే ప్రేమ పైనే ఆధారపడి ఉంది. ఆ ప్రేమ పతిసేవ ద్వారానే మీకు ప్రాప్తమవుతుంది. పతిసేవను మీరు భర్తకు చేసే మహోపకారమని అపోహపడకండి. పతిసేవ మీ విధి, విధ్యుక్తధర్మం. ఇహపర సాఫల్యాల కోసం ఇది దైవం మీపై మోపిన ధార్మికబాధ్యత.

## సుగుణవతుల లక్షణాలు

సుగుణవతులయిన భార్యలను గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) బోధించిన ఈ మహితోక్తులు చూడండి:

స్త్రీ (రోజా) ఐదు వేళల నమాజ్ చేస్తూ, రమజాన్‌నెల ఉపవాసాలు పాటిస్తూ, తన శీలాన్ని కాపాడుకుంటూ భర్తపట్ల వినయంతో మసలుకుంటూ ఉంటే ఆమె పర లోకాన స్వర్గద్వారాల్లో తనకు నచ్చిన ద్వారం గుండా ప్రవేశించవచ్చు." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం)ను ఒకతను ఉత్తమ మహిళ ఎవరని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఏ స్త్రీ అయితే భర్త తనవైపు చూసినప్పుడు అతడ్ని సంతోష పెడ్తుందో, అతను ఏదైనా చెయ్యమన్నప్పుడు ఎదురుచెప్పకుండా అతనికి విధేయత చూపుతుందో, ఎవరు తన విషయంలో, తన సొత్తు విషయంలో భర్త మనస్సు నొప్పించే వైఖరి అవలంబించకుండా ఉంటుందో ఆమే ఉత్తమ మహిళ." (నసాయి)

ఈ హితోక్తుల్ని దృష్టిలో పెట్టుకొని భర్తసేవ ఎంత ముఖ్యమైన కర్తవ్యమో ఆలో చించండి. భర్త తాగుబోతు కానివ్వండి, తిరుగుబోతు కానివ్వండి- వాటి దుష్ఫలాలు అతనే పరలోకంలో చవిచూస్తాడు. కాని ఈ కారణాల వల్ల మీరు మీ భర్తను ద్వేషించి అతనికి సేవచేయడం మానేస్తే దాని దుష్ఫలం మీరు అనుభవించవలసి వస్తుంది.

అయితే పతిసేవంటే భర్త చేసే అక్రమ పనుల్లో కూడా అతనికి తోడ్పడుతూ, అతనిచ్చే ధర్మవ్యతిరేక ఆజ్ఞలకు సైతం తలూపుతూ కట్టుబానిసలా పడి ఉండమని అర్థం కాదు. ధర్మబద్ధ విషయాల్లో మాత్రమే భర్తతో సహకరిస్తూ, అనుక్షణం అతని మంచిచెడ్డలు విచారిస్తూ మసలుకోవాలి. అంతేగాని ధర్మవ్యతిరేక పనులు చేయమని ఆదేశించడం జరిగితే అలాంటి ఆజ్ఞల్ని ఏమాత్రం పాటించకూడదు.

స్త్రీ విషయంలో పురుషునికి అంతర్గతంగా ఓ విధమైన అహంకారం ఉంటుంది. భర్తలో ఇలాంటి అహంకారం ఏదైనా ఉంటే భార్య దాన్ని నేర్పుతో వదలగొట్టి అతడ్ని దారికి తీసుకురావడానికి ప్రయత్నించాలిగాని, మాటకుమాట ఎదురుచెప్పి అతడ్ని రెచ్చగొట్టకూడదు. దానివల్ల సంసారంలో చిటపటలు తప్ప పకపకలు కన్పించవు.

# 19. అత్తాకోడళ్ళ గొడవలు

భర్తను ఎలాగో కిందామీదా పడి దారికి తెస్తాం అనుకోండి, కాని అత్తగారి సంగతి? అందులో గయ్యాళి అత్తయితే......అమ్మో అంటున్నారా! భయపడకండి. అత్త మనసును అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

అప్పుడే మస్జిద్ నుంచి ఇంటికొచ్చి ఆఫీసు ఫైళ్ళు ముందేసుకొని కూర్చున్న మా శ్రీవారికి నేను 'టీ' ఇచ్చి రేడియో ఆన్ చేశాను వార్తలు విందామని. కాని గడియారం ఓ నిముషం ఫాస్టుగా ఉందేమో, రేడియో ఆన్ చేయగానే "అత్తలేని కోడలు ఉత్తము



రాలు ఓయమ్మో! కోడలులేని అత్త గుణవంతురాలు ఓ యమ్మా!" అంటూ పాట అందుకుంది రేడియో.

నేను కాస్సేపు ఆ పాటనే చెవియొగ్గి వింటూ ఆలోచించసాగాను. రెండు చరణాలు వినగానే నాకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. వెంటనే రేడియో కట్టేసి కలం, కాగితాలు తీసుకొని కూర్చున్నాను.

నిజానికి అత్తాకోడళ్ళు ఇద్దరూ సాధారణ పరిస్థితుల్లో మంచివాళ్ళే అన్పించింది నాక్కూడా. అయితే పాట రాసిన రచయిత ప్రకారం అత్తకు కోడలు, కోడలికి అత్త ఉండకూడదు. ఇదెలా సాధ్యం? మరి సాధ్యంకాని సందర్భంలో పరిస్థితి ఏమిటీ? తీవ్రమైన ఆలోచనలతో నా మెదడు వేడెక్కింది. గతాన్ని ఒక్కసారి నెమరేసుకున్నాను. కలం విదిలించి కాగితమ్మీద పెట్టాను.

## ఆధునిక భారతసంస్కృతిలో అత్తాకోడళ్ళు

ఆధునిక భారతీయ సంస్కృతిలో పుట్టిపెరిగిన అత్తాకోడళ్ళ మనస్తత్వాలు బహు విచిత్రమయినవి. వీరిద్దర్నీ నిప్పు, నీళ్ళతో పోల్చవచ్చునేమో! నిప్పు, నీళ్ళు ఒకచోట కలసి ఉండలేనట్లే అత్తాకోడళ్ళు ఒక ఇంట్లో ఇమడలేరు. వీరిద్దరు ఎక్కడ కూడి ఉంటారో ఆ ఇంట్లో శాంతీసామరస్యాలు తుదిఘడియలు లెక్కపెట్టుకోవలసిందే! ఇదీ మన భారతదేశ మిశ్రమ నాగరికత తెచ్చిపెట్టిన ప్రభావ మహిమ!!

అత్త కోడలిని కట్టడిచేసి ఆమెపై పెత్తనం చెలాయించడానికి ప్రయత్నిస్తుంది. తన మాట గనక వినకపోతే కొడుకు ముందు చాడీలు చెప్పి తప్పంతా కోడలిదే అన్నట్లు చిత్రిస్తుంది. కోడలు కూడా తానేమీ తక్కువ తినలేదన్నట్లు రుసరుసలాడు తుంది. భర్తకు లేనిపోనివన్నీ చెప్పి అతడ్ని తన కొంగుకు కట్టుకోవడానికి ప్రయత్ని స్తుంది. అందులో ఆత్మాభిమానం మెండుగా ఉన్న కోడలైతే అత్తగారి అధికారాన్ని ససేమిరా సహించదు. చివరికి ఆ కుటుంబంలో, బయటి బంధువుల్లో కూడా తప్పెవరిదో తెలియకపోవడం వల్ల అత్తాకోడళ్ళ గొడవలు సాధారణ విషయాలుగా భావిస్తారు. బహుశా ఈ భావన నుండే "అత్త అమ్మ కాజాలదు, కోడలు కూతురు కాజాలదు" అన్న సామెత ఉనికిలోకి వచ్చింది.

అత్తాకోడళ్ళ గొడవల్లో సాధారణంగా కోడలి బంధువులు అత్త మీదే నిందారోపణ వేస్తారు. ఈ విషయంపై రాయబడిన రచనల్లో చాలావరకు పక్షపాతమే తొంగి చూసింది. **"అత్త పెట్టే ఆరళ్ళే కనపడతాయిగాని కోడళ్ళు చేసే కొంటె పనులు కనపడవట!"** ఇంకా చెప్పాలంటే "అత్తను కొట్టి అటకెక్కే అతివలు", "మొగుడ్ని కొట్టి మొగసాల కెక్కే మహిళామణులు" కూడా మన సమాజంలో ఎంతమంది లేరు?

రచయితలు సమస్యను రెండుకోణాల నుంచి పరిశీలించకుండానే తమ తీర్పును కుండబద్దలు చేసినట్లు ప్రకటిస్తారు. ఉదాహరణకు ఎవరైనా ఒకతను తన

కూతురితోనో, చెల్లెలితోనో ఆమె అత్తకు గొడవ వచ్చిందనుకోండి. అప్పుడతను ముందూ వెనుకా ఆలోచించకుండా కూతుర్ని లేక చెల్లెల్నే సమర్థిస్తూ ఆమె అత్తను గయ్యాళిగా చిత్రించేందుకు ప్రయత్నిస్తాడు. కాని నిదానంగా ఆలోచించి నిజానిజాలేమిటో తెలుసుకుంటే అత్తాకోడళ్ళు ఇద్దరిలో ఏఒక్కరూ గయ్యాళీకాదు, గంగగోవూ కాదని గ్రహించగలం.

## భార్యా విధేయుడా, తల్లిచాటు కొడుకా?

అత్తాకోడళ్ళ గొడవల మధ్య పురుషుడు ఎంతవరకు న్యాయం చేయగలడో చెప్పడం కష్టమే. మాతృమమకారంతో తల్లిని సమర్థిస్తే తల్లిచాటు కొడుకని అంటారు జనం. భార్యను సమర్థిస్తే పెళ్ళాం మాటలు వినే భార్యా విధేయుడంటారు.

అత్త తన కొడుకుని బాల్యం నుంచి అల్లారుముద్దుగా పెంచి, పోషించి, జీవిత ప్రగతిశిఖరాలకు చేర్చుతుంది. కొడుకు ఎప్పుడు పెద్దవాడయిపోతాడా, ఎప్పుడతడ్ని పెళ్ళి కుమారుడ్ని చేసి చూసుకొని మురిసిపోతానా అని ఎదురుచూస్తుంది. ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో కోడల్ని చేసుకొని ఇంటికి తెచ్చుకుంటుంది. చివరికి అలాంటి కొడుకు పట్ల ఆమె శత్రుభావం ఎందుకు వహిస్తుంది? ఆమె మమతామమకారాలు ఎందుకు తగ్గి పోతాయి? ఆమె సూటిపోటి మాటలతో కోడలి మనస్సుని గాయపరచి కొడుకు దాంపత్య జీవితాన్ని ఎందుకు విషతుల్యం చేస్తుంది? తప్పంతా అత్తలోనే ఉందా? అందులో కోడలి పాత్ర ఏమీలేదా? లోపం అసలు ఎక్కడుంది?

కొడుకు భార్యసంగతి పట్టించుకోకుండా తల్లిమాటే వింటాడన్న వాదనను నేను అంగీకరించను. పెళ్ళయిన తరువాత తల్లి చెప్పే ప్రతిమాటకు తలూపే కొడుకులు ఈ రోజుల్లో ఎవరుంటారు? తల్లిని తల్లిగా భావిస్తూ ఆమె హక్కుల్ని పూర్తిగా గౌరవించే అదృష్ట తనయులు నూటికో, కోటికో ఒకరుంటారు. ఎవరైనా అభాగ్యురాలు తనభర్త హృదయంలో చోటుచేసుకోలేక పోయిందన్నది వేరే విషయం. కాని భర్తే తన భార్యను నిరాదరణకు గురిచేస్తే, అప్పుడు అత్త తన కొడుకు ముందు కోడలిపై ఫిర్యాదు చేస్తే ఈ పరిస్థితి అతడ్ని పుండుమీద కారం చల్లినట్లు అవుతుంది. అంతకుముందు నుంచే భార్యపై చిరుబుర్రులాడే భర్త ఇప్పుడామెను మరింత చీదరించుకుంటాడు. ఇలాంటి పరిస్థితిలో అతని తల్లి నిందితురాలని మనం ఆరోపించలేము.

## పరలోకభావనే పరిస్థితిని మార్చుతుంది

నేనిలా రాస్తున్నందుకు నాకు అత్త లేదని భావించకండి. నాక్కూడా అత్తయ్య ఉంది. అయితే మాఅత్తయ్య ఎంతో మంచిది. నా పెళ్ళయిన తొలిరోజుల్లో ఖుర్ఆన్, హదీసులతో నాకు అంతగా పరిచయం లేకపోవడం వల్ల నేనామెతో ఎడ్జస్టు కాలేక, ఆమె నా స్వభావం అర్థం చేసుకోలేక కొంతకాలం మాఇద్దరి మధ్య చిన్నచిన్న గొడవలు జరిగాయి. తరువాత మా శ్రీవారు ఇచ్చిన ధార్మిక పుస్తకాలు ఒక్కొక్కటి వరుసగా



చదివాక, కొంత అనుభవం కూడా వచ్చాక నేనామెను, ఆమె నన్ను పరస్పరం అర్థం చేసుకొని మసలుకోవడం ప్రారంభించాం. ఈవిధంగా మా ఇద్దరి మధ్య నిల్చిన గొడవల దయ్యాన్ని శాశ్వతంగా పాతిపెట్టాం.

అంచేత అత్తయినా, కోడలయినా నిజమైన ముస్లిములుగా మనమంతా మన ఆంతర్యాలలో తగిన దైవభీతిని, పరలోకంలో మన కర్మలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉందన్న జవాబుదారీ భావనను పటిష్ఠపరచుకోవాలి. ఇస్లాం సమగ్ర స్వరూపాన్ని, దాని ఆశయం వెనుకున్న విస్తృతభావాన్ని, దాని మానవతాసిద్ధాంతాన్ని అర్థంచేసుకోవాలి.

## అత్తా ఒకింటి కోడలే

ఆ తరువాత అత్తని కోడలు, కోడల్ని అత్త పరస్పరం అర్థం చేసుకోవాలి. ఆపై అత్త తన కోడల్ని కన్నకూతురిగా, కోడలు తన అత్తను కన్నతల్లిగా భావించి మసలుకున్నట్ల యితే ఈ గొడవలకు శాశ్వతంగా తెరపడుతుంది. రేపు తన కూతురు ఒకింటి కోడలైతే అక్కడ ఆమె పరిస్థితి ఏమిటని అత్త, తన తల్లి అత్తగా మారితే కోడలి పట్ల ఆమె ఎలా ప్రవర్తిస్తుందని కోడలు ఆలోచించాలి. అంతేగాని చీటికిమాటికి ఒండరులపై తమతమ ఆధిక్యతలను చాటుకునే చర్యలకు పాల్పడకూడదు.

అత్తాకోడళ్ళ అనుబంధం తల్లీకూతుళ్ళ అనుబంధం లాంటిదేనన్న విషయాన్ని అత్తే బాగా అర్థం చేసుకోవాలి. కాని ఈరోజుల్లో అత్తల పరిస్థితి దీనికిభిన్నంగా ఉందని చెప్పడా నికి నేను విచారిస్తున్నాను. అత్త తన కోడల్ని సొంతకూతురిగా ఎందుకు భావించలేక పోతోంది? ఆమె పొరపాట్లను మాతృ మమకారంతో ఎందుకు క్షమించలేక పోతోంది? మనం కోడళ్ళుగా మన అత్తల నుంచి మాతృ మమకారాన్ని ఆశించడంతో పాటు వారి హృదయాలను చూరగొనడానికి కూడా కృషిచేయాలి. కోడలి హృదయంలో అత్తకు స్థానం లభించనంతవరకు ఆమె మాతృమమకారానికి ఆ కోడలు అర్హురాలు కాజాలదు.

## అత్తమీద కోపం దుత్తమీద చూపకండి

కొందరు స్త్రీలు అత్తను అర్థం చేసుకోలేకనో లేక ఆమెను ఎదిరించలేకనో "అత్త మీద కోపం దుత్త మీద" అన్నట్లు ఇంట్లోని వస్తువులు గిరాటువేస్తూ తమ అసహనాన్ని వెళ్ళబోసుకుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. అత్త జారీచేసే ఆజ్ఞలను గౌరవించక పోయినా ఆమె వయస్సునయినా గౌరవించాలి కోడలు.

అత్త తనను తాను సర్వాధికారిణని ఎందుకు తలుస్తుంది? దీనికి నా సమాధానం ఒక్కటే. ఆమె ఈఇంటికి యజమానురాలు. ఈఇంటిని ఆమె రూపొందించి అభివృద్ధి పరిచింది. ఈ ఇంటిలో ఆమె యౌవనదశలో అడుగుపెట్టింది. ఇప్పుడు వృద్ధాప్యంలో ప్రవేశించింది. అంతటి సుదీర్ఘకాల త్యాగాలుచేసిన తర్వాత ఈ ఇంటికి యజమానురాలయ్యే అర్హత తప్పనిసరిగా ఆమెకే దక్కుతుంది.

అంతేకాదు, ఈ ఇల్లు ఆమెదయినందున ఇతరులపై ఆధిక్యత చూపే హక్కు ఆమెకుంటుంది. కోడలి భర్త ఆమె సొంతం. తల్లిగా ఆమె కొడుకు నుంచి తన మాతృ హక్కును డిమాండ్ చేయగలుగుతుంది. లేని అధికారాన్ని చెలాయించే కోడలి అవిధేయతా చేష్టలకు బాధపడి ఆమెపై కొడుక్కు ఫిర్యాదు కూడా చేయగలుగుతుంది. అతనామె ఒడిలో పెరిగి పెద్దవాడయ్యాడు. ఆమె తన మమతామృతాన్ని రంగరించి పాలిచ్చింది. అతని సుఖసంతోషాల కోసం తన జీవితాన్ని ధారపోసింది. అందువల్ల ఆమె కన్నీరు కొడుకుని కదిలించి తననే సమర్థించేలా చేస్తుంది.

## కరవమంటే కప్పకు కోపం, విడమంటే పాముకు కోపం

ఈ వాస్తవాన్ని గ్రహించి కోడలే ఒక అడుగు వెనక్కి తగ్గడం శ్రేయస్కరం. ఆమె తన భర్త దగ్గర అత్తమీద చాడీలు చెప్పడాన్ని మానెయ్యాలి. కొడుకు లేక భర్త యాదార్థ పరిస్థితిని అర్థ్యం చేసుకోలేకనో లేదా ఎవరో ఒకరిపట్ల అధిక ప్రేమ కలిగి వుండటం వల్లనో అతను ఇద్దరిలో ఎవరివైపు మొగ్గినా రెండవ వ్యక్తికి తంటాయే. ఒకవేళ తప్పు ఇద్దరిలోనూ ఉన్నప్పుడు "కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం" అన్నట్లు అతను సంకటస్థితిలో పడి లోలోనే బాధపడుతుంటాడు. చివరికి ఈ పరిస్థితి అతని దాంపత్యజీవితంలో చేదుఫలాలనే మిగుల్చుతుంది..

ఏమైనప్పటికీ అత్తాకోడళ్ళ గొడవలకు అసలు కారణం వారిద్దరూ కాకపోవచ్చు. చాలావరకు పరిస్థితులు, వయోవ్యత్యాసాలే వారినలా మార్చుతాయి. అంచేత మనం సమస్యని రెండు కోణాల నుంచీ నిశితంగా పరిశీలించాలి. అత్త తన కొడుక్కి పెళ్ళిచేసి కోడల్ని ఇంటికి తెచ్చుకున్నప్పుడు ఆమె హృదయంలో పాలకురాలు, పాలితురాలు అన్న భావమే ఉండదు. దీనికి భిన్నంగా ఆమె మనస్సులో కోడలి కాపురాన్ని గురించి ఎన్నో మధురాతి మధురమైన కోరికలు పరవళ్ళు తొక్కుతుంటాయి.

## కొత్తకాపురంలో కోడలిపిల్ల కోర్కెలు

కొత్తగా కాపురానికి వచ్చిన కోడలు సహజంగానే అనుభవశూన్యురాలై ఉంటుంది. కొత్త కోరికలు, నూతనుత్సాహం పాలపొంగులా ఆమె ప్రవృత్తిలో ఎగిరెగిరి పడుతుంటాయి. ఆమె తన సంసార గమ్యాన్ని తానే అన్వేషించగోరుతుంది. తన సమయాన్ని తన కిష్టమైన రీతిలో వెచ్చించదలుస్తుంది. తన ఆకాంక్షల గుర్రాలకు ఆంక్షల కళ్ళెం పడటాన్ని సహించజాలదు. అత్త జారీచేసే ప్రతి ఆజ్ఞనూ శిరసావహించడానికి ఆమె స్వాభిమానం సిద్ధంగా ఉండదు. తన వల్ల జరిగే ప్రతి పొరపాటుకూ అత్త ముందు చేతులు జోడించి క్షమాపణ చెప్పుకోవడానికి ఆమె ఆత్మాభిమానం అంగీకరించదు. ఇది ఆమె తప్పుకాదు, ఆమెలోని యువరక్తం ప్రభావం!

సరిగ్గా ఇక్కడ్నుంచే అత్తాకోడళ్ళ మధ్య గొడవలు మొదలవుతాయి. అత్త, జీవితాన్ని కాచి వడబోసిన అనుభవజ్ఞురాలయి ఉంటుంది. ఆమె ఏది మాట్లాడినా తన అనుభవం ప్రాతిపదికపైనే మాట్లాడుతుంది. ఆమె తన కోడల్ని శాసిస్తుందంటే



ఆ ఆజ్ఞ నిజానికి ఆమెది కాదు, ఆమె వయస్సుది. వయోభారంతో ఆమె మనోమస్తిష్కాలు బలహీనమయి పోవచ్చు. అప్పుడామె స్వభావంలో విసుగు, చిరాకులు కూడా చెలరేగవచ్చు.

అత్తాకోడళ్ళ పరస్పర ఈ విరుద్ధభావాలు, స్వభావాల మూలంగానే గొడవల గోడకు శంకుస్థాపన జరుగుతుంది. ఇది చిలికి చిలికి గాలివానలా మారి సంసార గోడల్ని సైతం సమూలంగా కూలగొట్టవచ్చు.

పోతే గొడవల మిగతా కారణాలన్నీ అసలు కారణానికి అనుబంధాలు, సాకులు మాత్రమే. ఉదాహరణకు ఇంటికొచ్చే బంధుమిత్రులకు అతిథిమర్యాదలు జరిపే తీరునే తీసుకోండి. అత్త వైపునుంచి వచ్చే చుట్టాలకు కోడలు, కోడలి వైపు చుట్టాలకు అత్త సరైన గౌరవమర్యాదలు చేయకపోవడం వల్ల కూడా ఈ గొడవలు వస్తాయి. అయితే ఈ విషయంలోనూ మనమే జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

కోడలిచుట్టాలు వచ్చినప్పుడు వారికామె అతిగా ఆతిథ్యమిచ్చి తనవైపు బంధువులు వచ్చినప్పుడు మామూలు గౌరవమర్యాదలు జరపడాన్ని ఏ అత్తా సహించదు. అంచేత కోడలు ఇరువైపు బంధువుల్ని సమానదృష్టితో చూసి అతిథిమర్యాదలు చేయాలి. ఆ మాటకు వస్తే అత్త తరపు బంధువుల్నే కాస్తంత ఎక్కువగా గౌరవించాలి.

మరికొందరు కోడళ్ళు తమ వైపు బంధువులకు చాటుమాటుగా డబ్బు, వస్తు సామగ్రి కట్టబెడ్తుంటారు. ఇది మంచి విషయం కాదు. ఇంటి యాజమాన్యంపై అత్తా, భర్తలకే హక్కు ఉన్నందున వారి అనుమతి లేకుండా ఇలా చేయడం భావ్యం కాదు. ఆమె తరపు బంధువులు అంతగా పేదవాళ్ళయితే వారికి సహాయపడేందుకు భర్త చేత ఒప్పించగలగాలేగాని, ఆర్థిక పెత్తనాన్ని స్వయంగా తన చేతిలోకి తీసుకోకూడదు.

## మొగుడు కొట్టినందుక్కాదు, తోడికోడలు నవ్వినందుకు

స్త్రీకి అంతర్గత శత్రువులు చాలామంది ఉన్నారు. వారిలో అత్త, సవతులు ముఖ్యమైన వాళ్ళు. ఆ తరువాత ఆడపడుచులు, తోడికోడళ్ళు వస్తారు. ఈ జాబితాలో ఇరుగు పొరుగు అమ్మలక్కలు కూడా ఉన్నారు. వీరంతా మనజాతికి చెందినవాళ్ళు. పురుష జాతిలో భర్త తరువాత మామను మాత్రమే తీసుకోవచ్చు. స్త్రీజాతిలోనే మన శత్రువులు ఎక్కువగా ఉన్నారు. అందుకే స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నారు అనుభవజ్ఞులు.

అత్త తరువాత ఆడపడుచు కోడలికి పక్కలో బల్లెమయి ఉంటుంది. అందుకే **"ఆడపడుచు అర్ధ మొగుడు"** అనే సామెత ఉనికిలోకి వచ్చింది. తాను కూడా ఒకింటి కోడలేనని, లేదా కాబోయే కోడలని గ్రహించని ఆడపడుచు అటుమాటలు ఇటు, ఇటు మాటలు అటు చేరవేస్తూ తమాషా చూస్తుంది. అలాంటి పరిస్థితికి ఆస్కారం ఇవ్వకుండా జాగరూకతో మసలుకోవడానికి ప్రయత్నించాలి.

పోతే ఉమ్మడి కుటుంబంలో తోడికోడళ్ళ పోరు కూడా తక్కువేమీ కాదు. తోడి కోడళ్ళు నలుగురయిదుగురు ఉంటే వారిలో ముఠాతత్వం పుట్టుకొచ్చే ప్రమాదం లేక పోలేదు. అలాంటి పరిస్థితిలో సాధారణంగా ఒకరు మాత్రమే ఏకాకిగా మిగులుతారు. ఆ ఒక్క కోడలి బాధ వర్ణనాతీతం. భర్త వేధింపులకు ముందే ఏడుస్తుంటే ఈ తోడికోడలు గారు పుండు మీద కారం చల్లినట్లు చిరునవ్వులు చిందిస్తూ అక్కసు వెళ్ళబోసుకుంటారు. అందుకే 'మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు' అన్నారు పెద్దలు. ఇదంతా ఆధునిక భారతీయ సంస్కృతీ ప్రభావం.

అందువల్ల స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకొని కోడలు తన భర్త తరువాత ముందుగా అత్తను మంచి చేసుకోవాలి. ఉమ్మడి కుటుంబంలో రిమోట్ కంట్రోల్ అత్తగారే అన్న సంగతి మరచిపోకూడదు. ఈ రోజుల్లో అత్తకన్నా కోడలే రెండాకులు ఎక్కువ చదివి ఉంటుంది. అత్త మెట్రిక్ వరకు చదివి ఉంటే, కోడలు డిగ్రీ తీసుకొని ఉంటుంది. అయితే ఈ రెండాకుల అదనపు చదువుని ఆమె తన ఆధిక్యతను చాటు కోవడానికి, అతితెలివి ప్రదర్శించడానికి ఉపయోగించకూడదు. కోడలు సాధారణ విద్యతో పాటు, ధర్మవిద్య కూడా అత్తకన్నా ఎక్కువ నేర్చుకొని ఉండటం నేటి తక్షణావశ్యకత. దీనివల్ల ఆమెలో కుటుంబ సభ్యుల పట్ల సరయిన అవగాహనతో పాటు, సహనాన్ని అలవరచుకునే స్పృహ కూడా కలుగుతుంది.

## నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది

తన సంసార నందనవనంలో శాంతికుసుమాలు వెల్లివిరియాలంటే కోడలు సహ నంతో పరిస్థితుల్ని ఎదుర్కోవాలి. ముఖ్యంగా ఆమె తన నోటిని అదుపులో ఉంచు కోవాలి. నోరు పారేసుకోవడాన్ని ఇస్లాం సహించదు. ""మీరు నాకు నోటిని గురించి హామీ ఇస్తే, నేను మీకు స్వర్గం గురించి హామీ ఇస్తాన"ని దైవప్రవక్త (సల్లం) అన్నారు. మన తెలుగునాట కూడా "నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది" అన్న సామెత ఉంది. సాధారణంగా నోటిదురుసు పురుషులకన్నా స్త్రీలలోనే ఎక్కువ.

దైవప్రవక్త (సల్లం) దగ్గర ఆయన అనుచరుడొకాయన ఇద్దరు స్త్రీల ప్రవర్తనను గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు: "దైవప్రవక్తా! ఫలానా స్త్రీ అనేక నఫిల్ నమాజులు (ఐచ్ఛిక ప్రార్థనలు) చేస్తుంది; నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. దానధర్మాలు కూడా ఎక్కువగానే చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరు కూడా సంపాదించింది. అయితే ఆమె తన నోటి ద్వారా తన ఇరుగుపొరుగును బాధిస్తుంది." దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "ఆమె నరకానికి పోతుంది" అని చెప్పారు. ఆ అనుచరుడు తిరిగి మాట్లా డుతూ "దైవప్రవక్తా! ఫలానా స్త్రీ చాలా అరుదుగా నఫిల్ నమాజులు చేస్తుంది. అరుదు గానే నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. కొన్ని జున్ను ముక్కలు దానం చేస్తుందని కూడా ప్రతీతి. అయితే ఆమె తన నోటి ద్వారా ఇరుగుపొరుగును బాధించదని కూడా (జనం) చెప్పుకుంటారు" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఈమె స్వర్గానికి పోతుంది" అని తెలియజేశారు. (మిష్కాత్)



కనుక స్త్రీలు నోటిని వీలైనంతవరకు అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా కోడలు తనఅత్త విషయంలో సహనంతో మసలుకోవాలి. కోడలికి సహనమే శక్తిమంతమైన ఆయుధం. **"దేవుడు సహనవంతులకే తోడుగా ఉంటాడ"** ని ఖుర్ఆన్ చెబుతోంది. సహనగుణం అలవరచుకోదలచిన వారికి దేవుడు సహనం ప్రసాదిస్తాడని, సహనం కంటే శ్రేష్ఠమైనది, ఇతోధికంగా మేళ్ళు సమకూర్చేది మరో దైవానుగ్రహం లేదని మహాప్రవక్త (సల్లం) బోధించిన మహితోక్తిని కూడా మనం సదా గుర్తుంచుకోవాలి.

భర్త విషయంలో మాటకు మాట పెంచకుండా సహనం, సంయమనాలతో సాధ్య మయినంత వరకు **సర్దుకు పోవడంలోనే సతి సంక్షేమం ఉంది.** దీని కోసం 'అహం' మీద అదుపు సాధించడానికి ప్రయత్నించాలి. ఈ విషయంలో ఒక అడుగు వెనక్కి తగ్గి భార్యే ముందు చొరవ తీసుకోవాలి.

"ఏ స్త్రీ అయినా భర్త తనను వేధిస్తున్నాడని లేదా సరిగా ఆదరించడంలేదని భావించినప్పుడు భార్యాభర్తలు పరస్పరం సంప్రదించుకొని సర్దుకుపోతే అందులో తప్పు లేదు. అసలు వారు సర్దుకుపోవడమే సర్వదా శ్రేయస్కరం. హృదయాలు సంకుచితత్వం వైపు ఎక్కువగా మొగ్గుతాయి. అయితే మీరు పరస్పరం శ్రేయోభిలాషతో, దైవభీతి పరాయణతో వ్యవహరిస్తూ ఉండండి. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (దివ్యఖుర్ఆన్-4:128)

# 20. ఆలుమగల మధ్య అపార్థాల అగాధం

సహనమే అన్నిటికీ మూలమంత్రంకాదు. కాస్తంత నేర్పు, వివేకం కూడా ఉండా లంటారు అమ్జద్ గారు. అన్నిటికీ భర్తలనే నిందించడం సరికాదంటారు ఆయన. ఒక్కోసారి మన ప్రమేయం లేకుండానే షైతాన్ భార్యాభర్తల మధ్య అపార్థాలు సృష్టిస్తా డంటూ ఆయనగారు ఏకరువు పెట్టిన సంగతి మా శ్రీవారు ఇలా వివరించారు:

"ఇక మీరు సంకోచంలేకుండా నేను చెప్పినట్లు రెణ్ణెల్లపాటు ఇలా చేసి చూడండి. ఇన్షాఅల్లాహ్ మీ మిసెస్ మామూలు మనిషి అయిపోతారు" అన్నాడు ప్రఖ్యాత సైక్యాట్రిస్ట్ డాక్టర్ రిజ్వాన్ ఖురైషి.

"కాని డాక్టర్! మొన్నటిదాకా నన్నెంతో ప్రేమిస్తూవచ్చిన మా మిసెస్ విషయంలో ఇప్పుడిలా వేషం మార్చాలంటే ఎందుకో నాకు మనస్సొప్పడంలేదు" అన్నాడు అమ్జద్.

## విష్ యూ గుడ్ లక్!

"డోంట్ హెసిటేట్. మీరు చెయ్యరాని పనేమీ చెయ్యబోవడం లేదు. అనివార్య పరిస్థితిలో షరీఅత్ మనకు సడలింపులు ప్రసాదిస్తుంది. ఇస్లామీయ కార్యకర్తగా మీకింత కంటే వివరంగా చెప్పనవసరం లేదు."

"సరే, అలాగే ప్రయత్నిస్తాను. ఇక నాకు సెలవియ్యండి."

"ఓకే. విష్యూ గుడ్‌లక్. ఖుదాహాఫిజ్!"

అమ్జద్ క్లినిక్ నుంచి హుషారుగా ఇంటికొచ్చాడు. అస్మా శూన్యంలోకి తదేకంగా చూస్తూ, వరండాలోని వాలు కుర్చీలో కూర్చొని ఉంది. అమ్జద్ చొక్కా, ప్యాంటు విప్ప దీసి లుంగీ చుట్టుకుంటూ అన్నాడు:

"అస్మా! ఈపూట భోజనం ఏమైనా వడ్డిస్తావా లేక ఆకాశంలో అలా నక్షత్రాలు లెక్కబెడ్తూ గంటల తరబడి అక్కడే కూర్చుంటావా?"

"ఆ... వడ్డిస్తాను రండి" అంటూ అస్మా లేచి వంటగదిలోకి వెళ్ళింది. అమ్జద్ ఆమె వెనకాలే నడిచాడు.

"ఏమండీ! ఆ కొత్త డాక్టర్ దగ్గరికి వెళ్ళొచ్చారా?" అన్నది అస్మా అమ్జద్‌కు అన్నం వడ్డించి తనూ ఓ కంచంలో పెట్టుకుంటూ.

"ఊ... వెళ్ళొచ్చాను. మంచి అనుభవంగల డాక్టర్" అన్నాడు అమ్జద్.

"అయితే ఏమన్నాడండీ? మనకు పిల్లలు కల్గించే చిట్కా ఏదైనా ఉందటనా ఆయన దగ్గర?" అడిగింది అస్మా ఆశగా.

"ఫస్ట్‌క్లాస్ మందిచ్చాడు. ఇదిగో, రాత్రి పడుకోబోయే ముందు వేసుకోవాలి. కాని సంతానం కల్గించే శక్తి అసలు దేవుని చేతిలో ఉందనికదా మన విశ్వాసం. అస్మా! ఆ దయామయుడు తలచుకుంటే త్వరలోనే నీకు తప్పక పండంటిబాబు పుడ్తాడు. ఆతర్వాత వరస పడిందనుకో, ఇక చూస్కో- ఏడాదికొకరు చొప్పున, ఇక వద్దు బాబోయ్ కనలేక చస్తున్నా అనేదాకా పుట్టుకొస్తారు. మరి నీఇష్టం" అన్నాడు అమ్జద్.

"పోండి, మీరు మరీను" అన్నది అస్మా కిలకిల నవ్వుతూ.

ఆమె నవ్వు, చలాకీతనం ఆ కాస్సేపే. తెల్లారితే మళ్ళీ మామూలే.....అదే పరధ్యానం, అవే పిచ్చాలోచనలు, మతిమరుపు పనులు.

## కొత్త జీవితంలో సరికొత్త సమస్యలు

మరుసటి రోజు అస్మా లక్ష నక్షత్రాలు లెక్క పెట్టినా అమ్జద్ ఇంటికి చేరుకోలేదు. ఎప్పుడో పొద్దుపోయి వచ్చాడు. అస్మా మరబొమ్మలా లేచి అన్నం వడ్డించింది.

"అబ్బ! మంట!! కూరలో ఇంత కారం తగలేస్తే తినమనా, చావమనా?" అంటూ అమ్జద్ చేయి కడుక్కొని దిగ్గున లేచి బయటికెళ్ళాడు.

పాపం అస్మా బిత్తరపోయింది. "నిజానికి తాను కూరలో అంతగా మంట పుట్టించే కారమేమీ వేయలేదు. మరి ఈరోజు భర్త ఇలా ఎందుకు ప్రవర్తించినట్లు?" అస్మా భర్త వెళ్ళిన వైపే కాస్సేపు చూసి ఆలోచనలో పడిపోయింది.



ఆరోజు నుంచి అమ్జద్ చీటికిమాటికి శ్రీమతి ముందు చిరచిరలాడటం ప్రారంభించాడు. ప్రతిరోజూ చాలా పొద్దుపోయి రాసాగాడు. అదేమిటంటే ఆఫీసులో పని వత్తిడి ఎక్కువయిందని సమాధానమిచ్చేవాడు.

భర్త ధోరణి చూస్తుంటే అస్మాకు తన ప్రాణాన్ని బలవంతంగా ఎవరో తన నుంచి దూరంచేస్తున్నట్లు అన్పించింది. భర్తలో వచ్చిన ఈ మార్పుతో సంతానలేమివల్ల వచ్చిన పరధ్యానం పరదాలు నెమ్మదిగా తొలగిపోసాగాయి. భర్తకు వీలైనంత దగ్గర కావడానికి శాయాశక్తులా ప్రయత్నిస్తోంది. ఆఫీసుకు, మసీదుకు పోబోతున్నప్పుడు మాత్రం కాస్త చిరునవ్వు ముఖంతో కన్పిస్తాడు. తిరిగిరాగానే చిర్రుబుర్రులాడ్తాడు. ఏమిటో ఈ వింత ప్రవర్తన అస్మాకు అర్థంకావడంలేదు.

అలా రోజులు, నెలలు గడచిపోతున్నాయి. అస్మా భర్తను సంతోషపెట్టడానికి చేయవలసిన మంచి పనులన్నీ చేస్తూనే ఉంది. ప్రతి నమాజు తరువాత సుదీర్ఘమైన దుఆలు కూడా చేస్తోంది. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఎప్పుడో ఏదో నవలలో చదివిన సంగతి గుర్తొచ్చి హఠాత్తుగా ఓ అనుమానం వచ్చి ఆమె మైండును తొలచివేయడం మొదలెట్టింది.

"తనకు పిల్లలు కలగలేదన్న కోపంతో ఆయన రెండో పెళ్ళి చేసుకోవాలని చూస్తున్నారా? అందుకేనా తననిలా ప్రతి విషయానికీ కసురుకుంటూ దూరంగా మసలు కుంటున్నది? ఒకవేళ అదే నిజమయితే.....?" అస్మా ఆ తరువాత ఆలోచించలేక మూగగా విలపించింది.

ఆరాత్రి ఆస్మాకు ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. తెల్లవారిన తరువాత అద్దం ముందు నిల్చుంటే కళ్ళు ఉబ్బి ఎర్రగా మారినట్లు కన్పించాయి. అమ్జద్ మాత్రం అదేమీ పట్టించుకోలేదు. అస్మాకు ఏడ్పు ముంచుకొచ్చింది. తన గుండెను ఎవరో కోసి తీసికెళ్తున్నట్లుగా, పచ్చని తన దాంపత్య జీవిత వృక్షం మలమల మాడిపోతున్నట్లుగా భావించి తల్లడిల్లిపోయింది.

ఎంత ప్రయత్నించినా భర్త తనవైపు మరలకపోవడంతో అస్మా మూడ్ చెడిపోయి భర్తపట్ల ముభావంగా ఉండసాగింది. అమ్జద్ అంతకంటే ఎక్కువ పెడమొగంగా ప్రవర్తిస్తున్నాడు. ఇలా వారిద్దరి మధ్య కొన్నాళ్ళపాటు మౌనయుద్ధం సాగింది.

అయితే అమ్జద్ ముఖం మీద అప్పుడప్పుడు అప్రయత్నంగా చిరునవ్వు నాట్యమాడేది. అదే భాగ్యమనుకొని అస్మా ఆనందడోలికల్లో ఊగిపోయేది.

## పుండు మీద కారం చల్లినట్లయింది

కాని ఆ రోజుల్లోనే ఆమె ప్రాణ స్నేహితురాలు పర్వీన్ ఓ పిడుగులాంటి వార్త విన్పించింది. నిన్న సాయంత్రం అమ్జద్ ఎవరో ఓ అమ్మాయిని వెంటబెట్టుకొని తిరుగుతుండగా తాను చూశానని ఆమె అస్మా చెవిలో ఊదేసింది.

అంతే.... అస్మా కాళ్ళ కింద భూమి బ్రద్దలయింది. మిన్ను విరిగి మీద పడింది. అసూయ, ఆగ్రహాలతో ఆమె హృదయం కుతకుతలాడి పోయింది. ఆ అమ్మాయిని కసితీరా శాపనార్థాలు పెట్టింది.

“ఎంత నటన! అందుకే కాబోలు ఈ మధ్య ఆయనకు షోకులు ఎక్కువయి పోయాయి. మొన్న తనను సంప్రదించకుండానే ఆయన కొత్తబట్టలు కుట్టించు కున్నారు” అస్మా మనస్సు చివుక్కుమంది. భర్తతో ఇప్పుడు మాట్లాడటానిక్కూడా ఆమెకు మనస్క రించడం లేదు.

ఓరోజు అమ్జద్ ఆఫీసుకు వెళ్ళిన తర్వాత అస్మా మేజాబల్ల సొరుగు లాగి చూసింది. అందులో కన్పించిన వస్తువును చూసి ఆమె నిలువెల్లా కంపించిపోయింది. సొరుగులో బంగారు పూలడిజైన్ ఉన్న తెల్లటి నైలెక్స్ చీర మెరసిపోతోంది. దాన్ని ఫరఫర చించి పేలికలు చేసి పారేద్దామా అన్పించింది అస్మాకు. కాని కాస్త తమా యించుకొని అమ్జద్ రాగానే అడిగింది.

“ఓ... అదా? అది నీ కోసమే తెచ్చాను అస్మా! నీకివ్వడం మరచిపోయా. అనవ సరంగా నన్ను అపార్థం చేసుకోకు” అన్నాడు అమ్జద్ నవ్వుతూ.

అతని మాట పూర్తికాక ముందే అస్మా విసవిసలాడుతూ చరచరా పడగ్గదిలోకి దూరి తలుపేసుకుంది. బెడ్ మీద బోర్లాపడుకొని వెక్కివెక్కి ఏడ్వసాగింది. ఈ సంఘటన తరువాత వాళ్ళిద్దరి మధ్య మళ్ళీ మౌనయుద్ధం మొదలయింది.

## పిల్లల్ని కనలేక పోవడం కూడా తప్పేనా?

“కేవలం పిల్లల్ని కనలేదని తనను భర్త ఇలా హింసించాలా? సంతానం కలగక పోవడం తన తప్పా? ఇలా మాటిమాటికి చిత్రహింసలు పెట్టేకన్నా ఒక్కసారి గొంతు పిసికితే పీడా వదలిపోతుందిగా. అప్పుడు హాయిగా ఆ వయ్యారిభామతోనే కులక వచ్చు.” ఒకవైపు కోపం మరోవైపు దుఃఖంతో ఆమె హృదయం కకావికలమైపోయింది.

అమ్జద్ తనఅర్ధాంగి పట్ల మామూలు ధోరణితోనే ప్రవర్తిస్తున్నాడు. అప్పుడప్పుడు ఛలోక్తులతో ఆమెను నవ్వించడానికి కూడా ప్రయత్నిస్తున్నాడు. కాని అస్మా మరింత బిగుసుకుపోయేది.

“సంతానాన్నిచ్చే శక్తి దేవునికి మాత్రమే ఉంది. ఆయన తాను తలచుకున్న వారికి సంతానం ప్రసాదిస్తాడు. తాను తలచుకున్న వారికి అసలు సంతానమే లేకుండా చేస్తాడు. పురుషునికి నలుగురు భార్యలదాకా చేసుకునే హక్కు ఉండవచ్చు. కాని తనకు పిల్లలు పుట్టలేదన్న కారణమ్మీద తన భర్త రెండవ పెళ్ళి చేసుకోవడానికి ఏ దైవాజ్ఞలు అనుమతి ఇస్తాయి? ఉహు.... అసలు విషయం అది కాదు. అమ్జద్‌కు తన మీద మోజు తీరిపోయింది. అందుకే ఆ వన్నెలాడి వల్లో పడి......” మిట్ట మధ్యాహ్నామే అస్మాకు ప్రపంచ మంతా అంధకారమయినట్లు తోచింది.



“పెళ్ళయిన కొత్తలో అమ్జద్ నాటిన ఈ గులాబి మొగ్గ ఎంత ఏపుగా పెరిగింది! ఈ గులాబిచెట్టు పక్కనే తాను వేసిన ఈ సన్నజాజి లత దాన్ని అల్లుకొని, గట్టిగా పెన వేసుకొని ఎంత విరగ బూసింది!!” గత మధురస్మృతులు ఒక్కొక్కటిగా జ్ఞాపకం వస్తుంటే వాటిని ప్రస్తుత పరిస్థితితో పోల్చుకొని కంటికిమింటికి ఏకధాటిగా ఏడ్వ సాగింది ముప్ఫయి ఆరేళ్ళ అస్మా.

సూర్యుడు తన దైనందిన బాధ్యతాభారంతో అలసి సొలసి కృశిస్తూ పడమటి కొండల్లోకి క్రుంగిపోతున్న ఓ విషాదవేళ.... అమ్జద్ ఇంట్లో అడుగుపెట్టాడు.

లోపలి గదిలో ‘ఇస్లాంలో స్త్రీ స్థానం’ అనే పుస్తకం చదువుతూ కూర్చున్న అస్మా భర్త కంఠం విని బయటికొచ్చింది. రోజూ రాత్రి పది దాటందే రాని భర్త ఈరోజు ఇంత పెందలాడే రావడం చూసి ఆమెకు ఆశ్చర్యం వేసింది. కాని ఆమె ఆశ్చర్యం నుంచి ఇంకా తేరుకోక ముందే అమ్జద్ వెనకాల సిగ్గుతో నేలచూపులు చూస్తూ నిలబడిన ఓ పదహారేళ్ళ అందాలభరిణ కన్పించింది.

ఆ యువతిని చూడగానే అస్మా కళ్ళు ఒక్కసారిగా బైర్లు కమ్మాయి. కాని వెంటనే సంబాళించుకొని భర్త మీద విమానవిధ్వంసక క్షిపణిలా విరుచుకుపడింది-

“చివరికి నేననుకున్నదే జరిగిపోయింది. ఇప్పుడు మీ కళ్ళు చల్లబడ్డాయిగా. ఇక దాంతోనే హాయిగా గడపండి, పొండి” అంటూ గిర్రున వెనక్కి తిరిగింది.

“బాబాయి! పిన్ని ఏదో కోపంతో ఉన్నట్లుందే!” అన్నది అమ్జద్ వెంట వచ్చిన అమ్మాయి కాస్తంత బెరుకుబెరుకుగా చూస్తూ. బాబాయి అన్న మాట చెవిలో పడగానే అస్మా ఆశ్చర్యంతో ఠక్కున ఆగి పోయింది.

## కారు మబ్బులు వీడిన నిర్మలాకాశం

“ఎవరమ్మా నువ్వు? ఏమంటున్నావు?” అన్నది ఆమె దగ్గరికొస్తూ.

“అస్మా! నీకీ సంగతి చెప్పడం మరచిపోయాను. ఈ అమ్మాయి ఓ అనాథబాలిక. నా చిన్ననాటి స్నేహితుడి కూతురు. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయి దూరపు బంధువుల ఇంట్లో ఉంటూ బాధలు పడుతుంటే చూడలేక పిలుచుకొచ్చాను. ఈ అమ్మాయి ఇక నుంచి మన అమ్మాయే, మన కూతురు. రేపటి నుంచి అల్లుడి కోసం అన్వేషణ ప్రారంభించబోతున్నా. పెళ్ళి ఘనంగా జరిపించాల్సిన బాధ్యత నీదే” అన్నాడు అమ్జద్ తాపీగా చిరునవ్వు నవ్వుతూ.

ఈ మాటలు వినగానే అస్మా కోపాగ్ని ఒక్కసారిగా చల్లారిపోయి ఆమె హృదయంలో అప్రయత్నంగా మాతృమమత పెల్లుబికింది.

“ఏవిటండీ, ఈపాప మన అమ్మాయా! నా కూతురా!!... పాపా!” అంటూ ఆమె ఆ బాలికను గుండెలకు హత్తుకొని ఆమె నుదుటిపై ముద్దులవర్షం కురిపించింది.

"అల్ హమ్దులిల్లాహ్" అన్నాడు అమ్జద్ కేసు సక్సెస్ అయినందుకు దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో.

"ఏవండీ నన్ను క్షమించండీ! మిమ్మల్ని అపార్థం చేసుకొని లేనిపోని అనుమానాలతో మీ మనస్సు నొప్పించాను" అన్నది అస్మా పశ్చాత్తాపంతో భర్తవైపు చూస్తూ.

"ఇంచుమించు నేనూ అంతే అస్మా! పరస్పరం సహించుకునే, క్షమించుకునే స్త్రీ పురుషులే దేవుని దృష్టిలో ఉత్తములు" అన్నాడు అమ్జద్.

"ఎంత మంచివారండీ మీరు! నా ప్రభువు నా మొరాలకించాడు. ఉండండి, ఇప్పుడే వస్తాను" అంటూ అస్మా లోపలి గదిలోకి పరుగెత్తి సజ్దాలో పడిపోయింది దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకోవడానికి.

## 21. పరదా నియమాలు

పరదా ప్రగతికి ప్రతిబంధకమా? లేక పరదా పడతికి భద్రకవచమా? ఈ విషయాన్ని గురించి ఇంతకుముందే చర్చించడం జరిగింది. పరదాలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటి అంశం కనీస శరీర భాగాలను కప్పవలసిన ఆచ్ఛాదన. దీన్ని సతర్ అంటారు. రెండవ అంశం ముంజేతులు, పాదాలు తప్ప మొత్తం శరీరాన్ని కప్పే బురఖాలాంటి ఆచ్ఛాదన. ఇందులో ముఖం కన్పించకుండా ధరించే మేలిముసుగు కూడా ఉంటుంది. ముందుగా మనం సతర్ గురించి తెలుసుకుందాం.

"సతర్" ఆజ్ఞలను పాటిస్తూ స్త్రీలు వివాహమాడటానికి ధర్మసమ్మతంకాని పురుషులు (ముహ్రిమ్) ముందు ఇంట్లో స్వేచ్ఛగా మసలుకోవచ్చు. అయితే ఇల్లు వదలి బయటికి పోవలసి వచ్చినప్పుడు పరపురుషుల (గైర్‌ముహ్రిమ్) వీక్షణల నుంచి తప్పించుకోవడానికి ఆమె సతర్‌ఆజ్ఞలతో పాటు మరికొన్ని ఆజ్ఞలను కూడా పాటించవలసి ఉంటుంది. వాటినే పరదా నియమాలు అంటారు. ఇస్లాంలో పరదా పడతుల శీలరక్షణ కోసం కంచుకోట కన్నా పటిష్ఠమైన ఆశ్రయం.

## పరదా పడతుల కంచుకోట

పూర్వం మూఢకాలంలో అరబ్ మహిళలు తల మీద వస్త్రం కట్టుకొని ఒక విధమైన ముడి వేసుకునేవారు. అది వారి జడలపై వ్రేలాడుతుంది. గౌను పైభాగాన ఆచ్ఛాదన ఉండేది కాదు. దానివల్ల గొంతు, ఛాతీ పైభాగం స్పష్టంగా కన్పిస్తుండేది. వక్ష స్థలాలాపై గౌను తప్ప మరెలాంటి వస్త్రం ఉండేది కాదు. తరువాత దైవప్రవక్త (స) ద్వారా పరదా ఆజ్ఞలు అవతరించాయి. వాటిలో "వారు తమ వక్షస్థలాలను తమ ఓణీలతో కప్పుకోవాలి" (24:31) అనే ఆజ్ఞ రాగానే ముస్లిం మహిళలు దాన్ని శిరసావహించారు.

దాన్ని గురించి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా వివరించారు: దైవప్రవక్త (సల్లం) 'నూర్' అధ్యాయం అవతరించినప్పుడు దాన్ని ప్రజలకు పఠించి విన్పించగానే వారు తమతమ ఇండ్లకు వెళ్ళిపోయి తమ భార్యలకు, కుమార్తెలకు, అక్కాచెల్లెళ్ళకు ఆ



సూక్తులు తెలియజేశారు. అన్సార్ స్త్రీలు ఈ సూక్తులు విన్న మరుక్షణమే లేచి వాటిని ఆచరణలో పెట్టే పనుల్లో నిమగ్నులయిపోయారు. కొందరు తమ దుప్పట్లు తీసి, మరికొందరు తమ నడుంకట్టు తీసి ఓణీలుగా తయారుచేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం వారందరూ తలల మీద నుంచి వక్షస్థలాల క్రింది వరకూ ఓణీలు కప్పుకొని నమాజు కోసం మసీదుకు వచ్చారు. (తఫ్సీరె ఇబ్నెకసీర్, అబూదావూద్)

హజ్రత్ వహ్యా కల్బీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) దగ్గరకు ఈజిప్టులో తయారైన ఒక సన్నటి వస్త్రం వచ్చింది. అందులో నుంచి ఒక భాగం చించి నాకిచ్చారు ఆయన. అప్పుడు ఆయన "ఇందులో ఒక ముక్క చించి నీవు చొక్కా కుట్టించుకో. మిగిలినదాన్ని నీ భార్యకు ఇచ్చెయ్యి, దుప్పటి తయారు చేసుకుంటుంది. అయితే శరీర ఛాయలు లోపలి నుంచి కనపడకుండా ఆ దుప్పటి క్రింద మరో గుడ్డ వేసి తయారు చేసుకోవాలని ఆమెకు చెప్పాలి" అని అన్నారు. (అబూదావూద్)

## పురుషుల దృష్టి రక్షణ

"ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలు కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికిది చాలా శ్రేష్ఠమైన పద్ధతి. వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు." (24:30)

ఇక్కడ ఖుర్‌ఆన్‌లో పురుషులకు మొట్టమొదట ఇచ్చిన ఆజ్ఞ దృష్టిని క్రిందకు దించమని అంటే కళ్ళను ఎప్పుడూ క్రిందకు దించుకునే ఉండమని అర్థంకాదు. పురుషుని దృష్టి అకస్మాత్తుగా స్త్రీపై పడ్డ వెంటనే దృష్టి పక్కకు తిప్పుకోవాలి. పరస్త్రీలపై కాకతాళీయంగా ఒకసారి చూపుపడితే తప్పులేదు. కాని ఉద్దేశ్యపూర్వకంగా మళ్ళీ మళ్ళీ చూస్తేనే తప్పు. అలాంటి వ్యక్తిని దేవుడు క్షమించడు.

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలి (రజి)తో ఇలా అన్నారు: "అలీ! **(యాదృచ్ఛికంగా) ఒకసారి (పరస్త్రీపై) దృష్టిపడిన తర్వాత, రెండవసారి దృష్టి సారించకు.** మొదటిసారి చూపుకు క్షమాపణ ఉంది కాని, రెండవసారి చూపుకు లేదు." (అబూదావూద్)

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి) పరస్త్రీలపై దృష్టి పడటం గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తూ "అకస్మాత్తుగా దృష్టి పడితే ఏం చెయ్యాలి?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "వెంటనే దృష్టి వేరే వైపుకు మరల్చుకో లేదా క్రిందికి దించుకో" అని సమాధానమిచ్చారు. (ముస్లిం, తిర్మిజి, అబూదావూద్)

## స్త్రీల దృష్టి రక్షణ

"విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషుల నుండి వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. అదీగాక వారు తమ అలంకరణలను బయటికి కనబడనీయకూడదు. ఒకవేళ వాటంతటవే బయటపడితే ఎలాంటి తప్పు లేదు. వారు తమ వక్షస్థలాలను ఓణీలతో కప్పుకోవాలి." (ఖుర్‌ఆన్–24:31)

"భర్తలు, తండ్రులు, భర్తల తండ్రులు, కన్నకొడుకులు, భర్తల కొడుకులు (అంటే సవతి కొడుకులు), అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అక్కచెల్లెళ్ళ కొడుకులు, తమతో కలసిమెలసిఉండే సహచరస్త్రీలు, సొంతబానిసలు, తమ అధీనంలోని స్త్రీవాంఛ లేని పురుషులు, స్త్రీల ఆంతరంగిక విషయాలు తెలియని బాలురు- వీరి ఎదుట తప్ప ఇతరుల ముందు స్త్రీలు తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదు. ఇంకా తాము దాచిన అలంకరణల సంగతి ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్ళను నేలకేసి కొడ్తూ నడవకూడదు. విశ్వాసులారా! మీరంతా కలసి దేవుడ్ని క్షమాపణ కోరుకోండి. అప్పుడే మీరు కృతార్థులయ్యే అవకాశముంటుంది." (ఖుర్ఆన్- 24:31)

స్త్రీలు కూడా పరపురుషుల్ని కళ్ళు చించుకొని చూడకూడదు. పురుషుల్ని చూసే విషయంలో స్త్రీలకు కూడా పురుషుల గురించిన ఆజ్ఞలే వర్తిస్తాయి.

హజ్రత్ ఉమ్మె ఖలాద్ (రజి) కుమారుడొకతను ఒక యుద్ధంలో వీరమరణం పొందాడు. అప్పుడు హజ్రత్ ఉమ్మె ఖలాద్ (రజి) తన కొడుకు పరిస్థితి విచారించడానికి (యుద్ధమైదానంలో ఉన్న) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. ఆ సమయంలో కూడా ఆమె ముఖముసుగుతో వచ్చారు. ప్రవక్త అనుచరులలో కొందరు ఆమెను చూసి "ఇలాంటి సమయంలో కూడా నీవు ముఖముసుగు ధరించి వచ్చావా! (కొడుకు వీరమరణం విషాదవార్త విన్న తరువాత తల్లికి స్పృహ ఉండదు. అలాంటిది నీవు తాపీగా ముఖ ముసుగుతో సహా బురఖా ధరించి వచ్చావా!!)" అని అన్నారు.

హజ్రత్ ఉమ్మె ఖలాద్ (రజి) ఈ మాటలు విని "నేను కొడుకుని పోగొట్టుకున్నాను గాని, సిగ్గుబిడియాలు పోగొట్టుకో లేదు" అని అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "మేము వీడ్కోలు హజ్‌యాత్ర కోసం దీక్ష బూని మక్కా వెళ్తుంటే దారిలో బాటసారులు మా సమీపం నుండి పోయేవాళ్ళు. అప్పుడు మేము వెంటనే మాదుప్పెట్లు ముఖాల మీదికి లాక్కునేవాళ్ళం. వారు దూరం వెళ్ళిపోయాక మేము మా ముఖాల పైనుండి వస్త్రం తీసేసే వాళ్ళము." (అబూదావూద్)

## వేడిరక్తంతో వాడిచూపులు వద్దంటే...

హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్‌యాత్ర) సందర్భంలో దైవప్రవక్త (సల్లం) తమ పిన తండ్రి (యువ) కుమారుడు ఫజల్ బిన్ అబ్బాస్ (రజి)ని తన వెనుక ఒంటె మీద కూర్చో బెట్టుకొని 'మష్అరిల్ హరం' నుండి తిరిగొస్తున్నారు. దారిలో కొందరు స్త్రీలు ఎదురయి వెళ్ళిపోతుంటే ఫజల్ బిన్ అబ్బాస్ (రజి) వారి వైపే తదేకంగా చూడసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయన ముఖం పట్టి వేరే వైపుకు తిప్పారు. (అబూదావూద్)

ఒక స్త్రీ దారిలో దైవప్రవక్త (స)ను ఆపి హజ్ గురించి ఒక ప్రశ్న అడిగింది. అప్పుడు ఫజల్ (రజి) ఆ స్త్రీని తదేకంగా చూడసాగారు. దైవప్రవక్త (స) అది గమనించి ఆ యువకుని ముఖం పట్టి వేరే వైపుకు తిప్పారు. (బుఖారి, అబూదావూద్, తిర్మిజి)



## దుష్ట వీక్షణలు షైతాన్ విషబాణాలు

దైవప్రవక్త (సల్లం) దేవుడు అన్న మాటలను ఇలా తెలిపారు: "షైతాన్ వదిలే విషబాణాలలో ఒకటి (మానవుని వాడి) చూపు. కనుక నాకు భయపడి అలాంటి చూపుల్ని మానుకునే మనిషికి నేను దృఢమైన విశ్వాసభాగ్యం ప్రసాదిస్తాను. దాని మాధుర్యం అతను తన మనసులో గ్రహిస్తాడు." (తబ్రాని)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా అన్నారు: "ఒక ముస్లిం దృష్టి ఏదైనా స్త్రీ అందచందాలపై పడినప్పుడు అతను వెంటనే తన దృష్టిని వేరే వైపుకు మరల్చుకుంటే దేవుడు అతనికి ఆరాధనలో అమిత మాధుర్యం ప్రసాదిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

"మనిషి తన ఇంద్రియాలన్నిటితోనూ వ్యభిచరిస్తున్నాడు. చూడటం కళ్ళ వ్యభిచారం. ఆసక్తిగా మాట్లాడటం నోటివ్యభిచారం. ధ్వని ద్వారా మాధుర్యం ఆస్వాదించడం చెవుల వ్యభిచారం. చేత్తో తాకడం, దురుద్దేశ్యంతో నడచివెళ్ళడం కాళ్ళుచేతుల వ్యభిచారం. వ్యభిచారానికి సంబంధించిన ఈ ఉపోద్ఘాతాలన్నీ నెరవేరిన తర్వాత మర్మాంగాలు ఆ పని పూర్తి చేస్తాయి లేదా పూర్తిచేయడానికి సిద్ధపడతాయి." (బుఖారి)

## అపరిచిత స్త్రీల ముందు కూడా పరదా?

ఈ సూక్తి (24:31)లో "...తమతో కలసిమెలసిఉండే సహచరస్త్రీలు, .... వీరి ఎదుట తప్ప ఇతరుల ముందు స్త్రీలు తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదు." అని ఉంది. అంటే "తమతో కలసిమెలసిఉండే సహచరస్త్రీలు" తప్ప ఇతర స్త్రీల ముందు కూడా ముస్లిం మహిళలు తమ అందచందాలను, అలంకరణలను బహిర్గతం చేయకూడదని అర్థం, ఆ స్త్రీలు విశ్వాసులైనా, అవిశ్వాసులైనా సరే.

మరోమాటలో చెప్పాలంటే లజ్జావతులైన ముస్లిం స్త్రీలు అపరిచిత స్త్రీల ముందు కూడా తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదన్న మాట. ఇక్కడ ముస్లిం స్త్రీయా, ముస్లిమేతర స్త్రీయా అన్నది కాదు ప్రశ్న. ముక్కూ మొహం తెలియని ఆ స్త్రీ సిగ్గుబిడియాలు, నీతినడవడికలు ఎలాంటివో తెలియనప్పుడు లజ్జావతులు ఆమె ముందు కూడా పరదా విషయంలో జాగ్రత వహించాలని ఈ సూక్తిలో చెప్పబడింది.

## స్త్రీవాంఛలేని పురుషుల ముందు పరదా?

పై సూక్తి (24:31)లోనే స్త్రీవాంఛలేని పురుషుల ముందు పరదా పాటించనవసరం లేదన్న భావం కూడా ఉంది. అయితే స్త్రీవాంఛలేని పురుషుల్లో కొందరు (ఖొజ్జాలు) స్త్రీల అందచందాలను, ఆంతరంగిక విషయాలను వేరే పురుషుల ముందు ప్రస్తావిస్తారు. ఇది చాలా ప్రమాదకరమైన విషయం. అందువల్ల ఇలాంటి నపుంసకుల్ని స్త్రీలు తమ ఇండ్లలోనికి రానీయకూడదని దైవప్రవక్త (సల్లం) అన్నారు.

మదీనాలో ఇలాంటి ఖొజ్జా ఒకడుండేవాడు. ప్రవక్త భార్యలతో సహా ఇతర స్త్రీలు కొందరు అతను స్త్రీవాంఛలేనివాడు గనక పరదా పాటించనవసరం లేదని

భావించి అతడ్ని తమ ఇండ్లకు రానిస్తుండేవారు. ఒక రోజు దైవప్రవక్త (సల్లం) తన అర్థాంగి ఉమ్మెసల్మా (రజి) ఇంటికి వెళ్ళారు. అప్పుడా ఖొజ్జా ఉమ్మెసల్మా (రజి) సోదరుడు అబ్దుల్లా బిన్ ఉమయ్యా (రజి)తో మాట్లాడుతూ "రేపు గనక తాయెఫ్ పట్టణం మన స్వాధీనంలోకి వస్తే గైలాన్ సఖఫీ కూతురు మారియాను తప్పకుండా చేపట్టాలి" అన్నాడు. అంతటితో ఆగకుండా అతను ఆమె అందచందాలను, చివరికి ఆమె రహస్యావయవాలను గురించి కూడా వర్ణించడం మొదలెట్టాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "ఓరీ దైవవిరోధీ! నీ పాపిష్టి కళ్ళు ఆ స్త్రీపై అంతగా పడిపోయాయా!" అంటూ ఆగ్రహం వ్యక్తపరిచారు. తరువాత ఆయన హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)తో "ఇతని ముందు పరదా పాటించు. ఇకముందు ఇతడ్ని మీ ఇండ్లలోకి రానీయకండి" అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఆ ఖొజ్జాను మదీనా నుండి తీసేయించి వేరే చోటికి పంపివేశారు. ఈ ఉదంతంతో ఆయన ఇతర నపుంసకుల్ని కూడా స్త్రీలు తమ ఇండ్లలోనికి రానీయకూడదని గట్టిగా తాకీదు చేశారు. దీన్నిబట్టి మనిషిలో లైంగికశక్తి లేకపోయినా అతనిలోని అణగారిన కోర్కెల వల్ల ప్రమాదం ఉంటుందని తెలుస్తోంది.

ఈ సంఘటనను బుఖారి, ముస్లిం, అబూదావూద్, నసాయి, వగైరా హదీసు వేత్తలు హజ్రత్ ఆయిషా, ఉమ్మెసల్మా (రజి)ల ద్వారా గ్రహించి గ్రంథస్తం చేశారు.

## అనుమతి లేనిదే ఇంట్లో ప్రవేశించరాదు

అలాగే కొందరు సన్నిహిత బంధువులు తప్ప ఇతర పురుషులు అనుమతి లేకుండా స్త్రీలు ఉండే ఇండ్లలోకి ప్రవేశించకూడదు.

"ప్రవక్త భార్యల తండ్రులు, వారి కొడుకులు. అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడు కులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు, వారితో కలసి మెలసి తిరిగే స్త్రీలు, వారి బానిసలు (పరదా నియమాలు పాటించకుండా) వారి ఇండ్లలోకి ప్రవేశిస్తే ఎలాంటి దోషం లేదు. (వనితల్లారా!) మీరు దేవునికి భయపడండి. దేవుడు ప్రతి దానికీ సాక్షిగా ఉన్నాడు." (ఖుర్ఆన్-33:54,55)

"విశ్వాసులారా! అనుమతి లేకుండా దైవప్రవక్త ఇండ్లలోకి ప్రవేశించకండి. భోజన సమయంలో (అనవసరంగా) అక్కడ తారట్లాడుతూ ఉండకండి. ఒకవేళ మిమ్మల్ని భోజనా నికి పిలిస్తే మీరు నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. అయితే భోజనం చేయగానే అక్కడ్నుంచి లేచి వెళ్ళండి. అంతేగాని కబుర్లు చెబుతూ అక్కడే (గంటలతరబడి) కూర్చోకండి. ఈవైఖరి ప్రవక్తకు బాధ కలిగించవచ్చు. అతను బిడియం, మొహమాటం వల్ల మిమ్మల్ని ఏమీ అనలేదు. దేవుడు యదార్థం చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడడు. ఒకవేళ మీరు ప్రవక్త భార్యల్ని ఏదయినా అడగదలచుకుంటే తెర వెనుక నిలబడి అడగండి. ఇది చిత్తశుద్ధి కోసం మీకూ, వారికీ ఎంతో మంచి పద్ధతి." (ఖుర్ఆన్-33:53)



## భార్య సతర్ భర్తకే పరిమితం

పరదా విషయంలో ఇస్లాం సూచించే మొట్టమొదటి ఆజ్ఞ 'సతర్'. ఇతరుల ముందు ప్రదర్శించకూడని కనీస దేహభాగాన్ని ఇస్లామీయ పరిభాషలో "సతర్" అంటారు. అంటే ఈ భాగాన్ని తప్పనిసరిగా వస్త్రంతో కప్పి ఉంచుకోవాలి. పురుషుడయితే కనీసం నాభి నుంచి మోకాళ్ళ వరకు గల భాగం, స్త్రీకి అయితే ముఖం, ముంజేతులు తప్ప మిగతా శరీర భాగమంతా వస్త్రంతో కప్పి ఉంచుకోవాలి.

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఒక హదీసులో ఇలా ఉంది: "స్త్రీ యుక్తవయసుకు చేరుకోగానే ఆమె ముఖం, మణికట్టు నుంచి ముంజేతుల వరకున్న భాగం తప్ప ఇతర ఏ దేహభాగం కూడా కన్పించకూడదు." (అబూదావూద్)

స్త్రీ తన 'సతర్'ని భర్త ఎదుట తప్ప మరెవరి ముందూ బహిరంగ పరచకూడదు. చివరికి తన తండ్రి, సోదరుడు, సోదరుని కొడుకు, సోదరి కొడుకు దగ్గర కూడా. అంతేకాదు, తోటి స్త్రీ ముందు కూడా 'సతర్' విభాగం బహిరంగ పరచడాన్ని ఇస్లాం అంగీకరించదు. ఏవిధంగా ఒక పురుషుని సతర్ మరో పురుషుడు చూడటం నిషేధమో అలాగే ఒక స్త్రీ యొక్క నాభి నుంచి మోకాళ్ళ వరకు గల శరీర భాగాన్ని తోటి స్త్రీ చూడటం కూడా నిషిద్ధమే. అది తప్ప మిగతా శరీర భాగాన్ని తోటి స్త్రీ చూడటం అంతగా నిషేధం లేదు. స్త్రీ మలమూత్రాల విసర్జన సందర్భంలో తప్ప ఇతర వేళల్లో ఒంటరిగా ఉన్నప్పుడు నగ్నంగా ఉండటం కూడా తప్పే.

## భర్తలు లేని ఏకాంత సమయంలో

అలాగే భర్త, లైంగిక భావాలు జనించని బాలురు తప్ప (వివాహమాడటానికి ధర్మ సమ్మతమైన పురుషుల్లో) ఏ ఒక్క పురుషుడూ ఒంటరిగా ఉన్న స్త్రీ దగ్గర కూర్చోవటం లేదా ఆమె శరీరాన్ని తాకడాన్ని ఇస్లాం నిరసిస్తోంది. దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని గురించి ఇలా ప్రవచించారు:

"దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించిన మనిషి ఒంటరిగా ఉన్న (పర) స్త్రీ దగ్గరకు పోకూడదు. అలా పోయినప్పుడు (వారిద్దరితో పాటు) మూడోవాడు షైతాన్ అవుతాడు. కనుక ఆ స్త్రీకి తోడుగా ముహ్‌రిమ్ పురుషుడు లేనంతవరకు పరపురుషుడు ఆమె దగ్గరకు పోకూడదు." (అహ్మద్)

"ఏ స్త్రీ అయినా సరే తన ముహ్‌రిమ్ పురుషుడెవరూ లేకుండా ఒంటరిగా ఉన్నప్పుడు పరపురుషులెవరూ ఆమె దగ్గరకు పోకూడదు. అలాగే ఏ స్త్రీ అయినా ముహ్‌రిమ్ పురుషుడు తోడు లేకుండా (ఒంటరిగా) ప్రయాణం చేయకూడదు." (బుఖారి, ముస్లిం)

"స్త్రీల దగ్గరికి వారి భర్తలు లేనప్పుడు వెళ్ళకండి. ఎందుకంటే మీలో ప్రతి ఒక్కరి ఆంతర్యంలో షైతాన్ రక్తంలా ప్రవహిస్తున్నాడు." (ముస్లిం)

ఒకసారి రాత్రి సమయంలో దైవప్రవక్త (సల్లం) తన అర్ధాంగి హజ్రత్ సఫియా (రజి)ను వెంట బెట్టుకొని ఆమె ఇంటికి వెళ్తున్నారు. దారిలో ఇద్దరు అన్సార్ పురుషులు ఎదురయ్యారు. దైవప్రవక్త (సల్లం) వారిని ఆపి "నా వెంట ఉన్న ఈవిడ నా భార్య సఫియా" అని చెప్పారు. వారిద్దరు అనుచరులు ఈమాట విని "దేవుడు పరిశుద్ధుడు! దైవప్రవక్తా! మీ విషయంలో కూడా ఎవరైనా అనుమానిస్తారా?" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "షైతాన్ మనిషి శరీరంలో రక్తంలా తిరుగుతుంటాడు. వాడు మీ హృదయాల్లో కూడా దురాలోచన రేకెత్తిస్తాడేమోనని నేను భయపడ్డాను. (అంచేత) నేనిలా చెప్పవలసి వచ్చింది.)" అని అన్నారు. (అబూదావూద్)

## ముట్టుకోవడం, చేయి పట్టుకోవడం కూడా నిషిద్ధమే

అయితే స్త్రీ శరీరాన్ని తాకే విషయంలో వివాహమాడటానికి ధర్మసమ్మతంకాని పురుషులు (ముహ్రిమ్), ధర్మసమ్మతమైన పురుషుల్లో (గైర్ ముహ్రిమ్) చాలా వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు, అన్న తన సోదరి చేయి పట్టుకొని వాహనం మీద ఎక్కించడం, దించడం చేయవచ్చు. కాని ఈపని ఇతర పురుషులు చేయడానికి వీల్లేదు. దైవప్రవక్త (సల్లం) ఎప్పుడైనా ప్రయాణం నుంచి తిరిగిరాగానే కూతురు హజ్రత్ ఫాతిమా (రజి)ను కౌగలించుకొని ఆమె తలపై ముద్దుపెట్టుకునేవారు.

దైవప్రవక్త (సల్లం) పురుషుల చేత ప్రమాణం చేయించవలసి వచ్చినప్పుడు వారి చేతిని తన చేతిలోకి తీసుకొని చేయించారు. కాని స్త్రీల చేత ప్రమాణం చేయించవలసి వచ్చినప్పుడు ఆయన ఏనాడూ స్త్రీల చేతిని పట్టుకోలేదు.

"దైవప్రవక్త (సల్లం) చేయి ఏనాడూ ఏ పరస్త్రీ శరీరాన్ని కూడా తాకలేదు. స్త్రీల చేత ప్రమాణం చేయించవలసివస్తే ఆయన వారి చేత నోటిమాటల ద్వారా మాత్రమే ప్రమాణం చేయించేవారు. వారలా ప్రమాణం చేసిన తరువాత 'ఇక వెళ్ళండి, మీచేత ప్రమాణం చేయించడం అయిపోయింది' అని చెప్పేవారు." (అబూదావూద్)

## మహిళలకు మేలుచేసే మేలి ముసుగు

పరదా విషయంలో రెండవ ఆజ్ఞను ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది: "ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు. దేవుడు క్షమాశీలి, దయామయుడు." (33:59)

అంటే స్త్రీలు ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలన్నమాట. కాకపోతే కళ్ళు కన్పించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి వస్త్రధారణవల్ల పోకిరీలతో సహా పరపురుషులంతా, వీరు గౌరవ ప్రదమైన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారి వైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటా నికి కూడా సాహసించలేరు.



ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమయిన పవిత్ర సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమైన కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుంది. ప్రజలకు మనశ్శాంతి కరువయి పోతుంది. హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతాయి. అంచేత ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీల విషయాలపై కూడా ఆంక్షలు విధించి, వాటిని మొగ్గలోనే త్రుంచి వేయదలచింది. అలాంటి ఆంక్షలలో పరదా ఒకటి.

## స్త్రీలకు మాత్రమే ఈ గంతెందుకు అంటారా?

స్త్రీ పురుషుల మధ్య సహజ లైంగికాకర్షణ దుర్వినియోగం కాకుండా వివాహ వ్యవస్థతో పాటు పరదా విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది ఇస్లాం. అయితే పరదాపద్ధతి స్త్రీలు మాత్రమే ఎందుకు పాటించాలి, పురుషులు ఎందుకు పాటించకూడదు? అన్న ప్రశ్న కొందరిలో రేకెత్తవచ్చు. స్త్రీ పురుషుల దేహదారుఢ్యం, లైంగిక భావోద్రేకాలు ఒకే విధంగా లేవు. స్త్రీ స్వభావంతో పోల్చితే పురుషుడు స్త్రీ పట్ల తొందరగా, తీవ్రంగా ఆకర్షితుడవుతాడు. అతనిలో దుడుకు (Aggressive) స్వభావం ఉంది. స్త్రీని బలవంతంగా అనుభవించే శక్తి కూడా ఉంది. వీటికి భిన్నంగా స్త్రీకి పురుషుని పట్ల ఆకర్షణ తక్కువగా ఉంటుంది. ఆమె నైజంలో పారుబోతుదనం (Escaping) ఉంది. ఆమె పురుషుడ్ని బలవంతం చేసి లైంగికానందం పొందలేదు. ఈ సహజ వ్యత్యాసాల దృష్ట్యా ఇస్లాం స్త్రీకి మాత్రమే పరదా (బురఖా) పద్ధతి ప్రతిపాదించింది.

మూఢకాలంలో కుటుంబస్త్రీలు, బానిసస్త్రీలు అంతా బురఖా లేకుండా మామూలు దుస్తులతోనే బయట తిరిగేవారు. అప్పుడు కొందరు పోకిరీలు వారి వెంటపడేవారు. అందువల్ల దేవుడు గౌరవప్రదమైన స్త్రీలు దుప్పటి కప్పుకోవాలని ఆదేశించాడు. ఇలా వారు ధరించిన దుస్తుల్ని బట్టి పోకిరీలు 'వీరు సంస్కారవంతమైన స్త్రీల'ని తెలుసుకొని వారి వెంటపడి వేధించడాన్ని మానుకుంటారు అని ఈ సూక్తి స్పష్టం చేస్తోంది.

## ఇది లజ్జావతుల హెల్మెట్

ఈ సూక్తిలోని రెండవ విషయం పరదాహద్దుల్ని నిర్ణయించడం. స్త్రీలు ఏదైనా అవసరం రీత్యా ఎక్కడికయినా బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు వారు తమ దుప్పటికి చెందిన ఒక భాగాన్ని ముఖం మీద కప్పుకోవాలి. మరో భాగాన్ని దేహానికి చుట్టుకోవాలి. ఒక్క కాబాయాత్ర దీక్ష(ఇహ్రామ్)లో ఉన్నప్పుడు మాత్రమే ముసుగు వేసుకోవడాన్ని దైవప్రవక్త (సల్లం) నిషేధించారు. అయితే పరపురుషులు ఎదురుపడినప్పుడు తిరిగి ముసుగు వేసుకోవాల్సిందే. అంటే ముఖముసుగుతో సహా పూర్తి పరదా పాటించాలి.

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "వాహనాలపై మనుషులు మా ముందు నుంచి పోతుండేవారు. మేము ఆడవాళ్ళం దైవప్రవక్త (సల్లం)తో పాటు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నాం. అంచేత ఆ మనుషులు మాకు దగ్గరగా వచ్చినప్పుడల్లా మేము వెంటనే మా దుప్పట్లను (బురఖాలను) తల

మీద నుంచి ముఖం మీదికి లాగి వేసుకునేవాళ్ళం. వారు వెళ్ళిపోగానే (ముసుగు తీసి) ముఖం బయట పెట్టుకునే వాళ్ళం.'' (అబూదావూద్)

పురుషుని కామ వీక్షణల నుండి కాపాడుకోవడానికి పడతికి పరదా డాలు వంటిది. **అశ్లీల రహితమైన సమాజానికి పరదా ప్రహరీగోడ లాంటిది.** పటిష్టమయిన ఈ ప్రహరీ  గోడ కూల్చిన తరువాత అందులోని అందమైన సౌధవం తూట్లు పడకుండా ఎంతోకాలం సురక్షితంగా ఉండదు.

## పడకగదిలో నిషిద్ధ సమయాలు

ఒక ఇంట్లో ఉండే పిల్లలు, నౌకర్లు, వృద్ధ మహిళల విషయంలో కూడా ఖుర్ఆన్ కొన్ని ఆజ్ఞలు ఇచ్చింది. ముస్లింలు ఈ ఆజ్ఞల్ని కూడా పాటించవలసి ఉంటుంది.

"విశ్వాసులారా! మీ బానిసలు, ప్రాజ్ఞత వయస్సుకు చేరుకోని మీ బాలబాలికలు (పడకగదిలో) మీదగ్గరకు రావాలంటే వారు మూడు వేళల్లో మాత్రం మీ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. అవి– ప్రాతఃకాల ప్రార్థనకు ముందు, మధ్యాహ్నం వేళ మీరు (విశ్రాంతి కోసం) మీ పైఉడుపులు తీసివేసినప్పుడు, రాత్రివేళ ప్రార్థన తరువాత."

"ఈ మూడువేళలు మీకోసం ఏకాంత సమయాలు. అవి గడచిపోయిన తరువాత వారు మీ అనుమతి లేకుండా వస్తే అందులో మీ తప్పులేదు, వారి తప్పులేదు. మీరు మాటిమాటికి ఒకరి దగ్గరకు మరొకరు రావలసిన అవసరముంటుంది. (అందువల్ల ఈ ఆజ్ఞ ఇవ్వబడింది.) ఈవిధంగా దేవుడు తన సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (24:58)

"మీ పిల్లలు ప్రాజ్ఞత వయస్సుకు చేరుకున్న తరువాత వారు తమ పెద్దలలాగే (ఎప్పుడైనా సరే) అనుమతి తీసుకొని రావాలి. ఈవిధంగా దేవుడు తనసూక్తులు మీకు విశదీకరిస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (24:59)

"యౌవనదశ దాటిపోయి, పెళ్ళి ఆశలేని (వృద్ధ)మహిళలు తమ బురఖాలు తీసివేస్తే ఎలాంటి తప్పులేదు. కాకపోతే వారు అలంకరణ ప్రదర్శనకు పాల్పడనివారై ఉండాలి. ఆ చేష్టలు కూడా మానేసి లజ్జావతులుగా మసలుకుంటే అది వారికెంతో శ్రేయస్కరం. దేవుడు సమస్తం వింటున్నాడు, సర్వం తెలిసినవాడు." (ఖుర్ఆన్–24:60)

# 22. పరదా నుండి మినహాయింపులు

ఇక్కడ కొన్ని మినహాయింపులున్నాయి. పురుషుడు తాను పెళ్ళి చేసుకోదలచిన స్త్రీని ముందుగా చూడవచ్చు. హజ్రత్ ముగైరా (ర) వివాహం చేసుకోవడానికి నిర్ణయించు కున్నప్పుడు ఆయన్ని దైవప్రవక్త (స) "నీవా స్త్రీని చూశావా?'' అనడిగారు. దానికాయన చూడలేదన్నారు. "అయితే ఆమెను (ఓసారి) చూసుకో. దీనివల్ల మీఇద్దరి మధ్య సానుకూలత ఏర్పడే అవకాశముంటుంది'' అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి, నసాయి)



హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "నేనొక రోజు దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు ఒకతను వచ్చి 'దైవప్రవక్తా! నేను అన్సారుల్లో ఒక స్త్రీని వివాహమాడ దలిచాను' అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "మరి నువ్వామెను చూశావా?'' అనడిగారు. దానికతను చూడలేదన్నాడు. "అయితే ఓసారి ఆమెను చూసుకో. అన్సారుల కళ్ళలో సాధారణంగా ఏదో కాస్త లోపం ఉంటుంది'' అన్నారు దైవప్రవక్త (స)  (ముస్లిం)

అలాగే ఒక ఇంటిలో నివసించే స్త్రీపురుషులు (బంధువులు) పరస్పరం చూసు కోవడంలోనూ తప్పులేదు. నేరపరిశోధన సమయంలో అనుమానాస్పద స్త్రీని చూడవచ్చు. న్యాయస్థానంలో సాక్ష్యమిచ్చేటప్పుడు న్యాయమూర్తి, సాక్ష్యమిచ్చే స్త్రీని చూడవచ్చు. డాక్టర్ వ్యాధిగ్రస్త స్త్రీని చూడవచ్చు. ప్రమాదంలో ఉన్న స్త్రీని సంబంధిత బంధువులు, ఎవరూలేని అనివార్య పరిస్థితిలో ఇతర పురుషులు చూడటం, తాకడం మాత్రమేగాక ఆమెను వళ్ళోకి ఎత్తుకొని వాహనంలో ఎక్కించి ఆసుపత్రికి చేర్చవచ్చు కూడా. పోతే పాస్‌పోర్ట్‌లు, ఐడెంటిటీ (గుర్తింపు) కార్డులు వగైరా సందర్భాలలో సంబంధిత పురుషులు తత్సంబంధ స్త్రీలను చూడవచ్చు.

## సతర్ (కనీస ఆచ్ఛాదన) పరిమితులు

పురుషుడు పరస్త్రీని చూసే నిబంధనలకన్నా స్త్రీ పరపురుషుని చూసే నిబంధనలు కాస్త మృదువుగా ఉంటాయి. శరీరంపై బట్ట కప్పవలసిన కనీస ఆచ్ఛాదనా భాగాన్ని "సతర్'' అంటారు. నాభి నుండి మోకాళ్ళ క్రింది వరకుగల భాగం పురుషుని సతర్‌గా నిర్ణయించబడింది. ఆ భాగాన్ని అతను తన భార్య ముందు తప్ప మరెవరి ముందూ బహిర్గతం చేయకూడదు.

పోతే స్త్రీ కోసం ఆమె ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప ఇతర శరీరభాగ మంతా సతర్‌గా నిర్ణయమయింది. ఆమె ఆ శరీరభాగాన్ని తనభర్త ముందు తప్ప ఇతర పురుషుల ముందు బహిర్గతం చేయకూడదు. కాకపోతే ఇంట్లో తండ్రి, బాబాయి, అన్న దమ్ములు తదితర బంధువుల ముందు, ఆమె ఇంటిపనులు చేస్తున్నప్పుడు అవసరమైతే  ముంగాళ్ళ మీదుండే దుస్తులు పైకెత్తి కట్టుకోవచ్చు.

తోటిస్త్రీల ముందు ఆమె నాభినుండి మోకాళ్ళ వరకుండే భాగాన్ని విధిగా కప్పు కోవాలి. ఇది తోటిస్త్రీల ముందు స్త్రీ కోసం నిర్దేశించబడిన 'సతర్.'  అలా అని ఆమె తోటిస్త్రీల ముందు అర్థనగ్నావతారంతో విచ్చలవిడిగా తిరగొచ్చని అర్థంకాదు. కనీస 'సతర్' కోసం నిర్దేశించబడిన ఆమేర శరీరాన్ని తోటిస్త్రీల ముందు విధిగా కప్పిఉంచాలి.

పోతే నగలు, ఆకర్షణీయమైన బట్టలు, ఇతర మేకప్ సామగ్రి ఆమె తన భర్తకు మాత్రమే పరిమితం చేయాలి. ఇంటినుంచి బయటికెళ్తే ముఖముసుగుతో సహా బురఖా వేసుకొని పరదా పూర్తిగా పాటించాలి. అయితే వివాహానికి ధర్మసమ్మతంకాని బంధువుల ముందు పరదా పాటించనవసరం లేదు.

ఈ వివరణను బట్టి ఇస్లాం ఉద్దేశ్యం స్త్రీ పురుషులు ఒకరికొకరు చూసుకోవడాన్ని నిషేధించడమే గాకుండా, అది అశ్లీలతను పూర్తిగా అరికట్టదలచిందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఆజ్ఞ పురుషులకే కాదు, స్త్రీలకు కూడా వర్తిస్తుంది. కాకపోతే స్త్రీ పురుషుడ్ని చూసే విషయంలో పురుషుడు చూసేటంత పరదా కఠినంగా ఉండదు.

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: " ఓసారి నేను, మైమూనా దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉన్నాము. అంతలో ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) వచ్చారు. ఆయన అంధులు. దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఆయన ఎదుట పరదా పాటించమని అన్నారు. అప్పుడు నేను "దైవప్రవక్తా! ఆయన అంధులు కదా! మమ్మల్ని చూడలేరు, గుర్తించలేరుగా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (సల్లం) మీరిద్దరు కూడా అంధులేనా? ఆయన్ని మీరు చూడటం లేదా?" అని ఎదురు ప్రశ్నవేశారు." (మిష్కాత్-హదీసు)

## స్త్రీ, పురుషుల చూపుల్లో కాస్తంత తేడా

అయితే స్త్రీ పురుషుని చూడటంలో, పురుషుడు స్త్రీని చూడటంలో మానసిక పరమైన ఓ సూక్ష్మభేదం ఉంది. పురుషుని స్వభావంలో పురోగమనం ఉంది. కాని స్త్రీ స్వభావంలో పారుబోతుతనం ఉంది. స్త్రీలో ఉన్న ఈ సహజ గుణం పూర్తిగా నిర్వీర్యం కానంతవరకు ఆమె తాను కోరిన వస్తువును హస్తగతం చేసుకునేంతటి ధైర్యం చేయ జాలదు. ఈ భేదాన్ని దృష్టిలో పెట్టుకొని దైవప్రవక్త (సల్లం) పురుషుల విషయంలో చూపినంతటి కాఠిన్యం స్త్రీల విషయంలో చూపలేదు. హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ఒక పండుగ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ఆమెకు నీగ్రోల వేడుక చూపించారు అని ఉంది.

అంధ అనుచరుడయిన ఇబ్నె ఉమ్మె మఖ్తూమ్ (రజి) విషయంలోనే మరో సందర్భాన దైవప్రవక్త (స) ఆయన ఇంట్లో హజ్రత్ ఫాతిమా బిన్తె ఖైస్ (రజి)ను (విడాకుల తరువాత పాటించే) రుతుగడువు గడపమని ఆదేశించారు. అసలామె మొదట తన రుతుగడువును హజ్రత్ ఉమ్మెషరీక్ (రజి) ఇంట్లో గడపదలచుకున్నారు.

కాని దైవప్రవక్త (సల్లం) ఆ ఇంట్లో గడపడం గురించి ఫాతిమా (రజి)ను వారిస్తూ "ఆ ఇంటికి తరచుగా జనం (ఉమ్మెషరీక్ బంధువులు) వస్తూపోతుంటారు. అంచేత నీవు ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) ఇంట్లో ఉండు. ఆయన అంధుడు. ఆయన ఎదుట నీవు పరదా లేకుండా మసలుకోవచ్చు" అని చెప్పారు.

ఇస్లాం ఎక్కడైతే ప్రమాదం పొంచి ఉందని భావిస్తుందో అక్కడ స్త్రీలు ఉండటాన్ని వ్యతిరేకిస్తుంది. బలమైన కారణం లేకుండా, అంటే షరీఅత్ పరమైన కారణం లేకుండా స్త్రీలు తమకు సంబంధంలేని పురుషులతో కలసి ఒక చోట కూర్చోవడాన్ని, చూడటాన్ని, వాళ్ళతో మాట్లాడటాన్ని ఇస్లాం నిరోధిస్తుంది.



## దగ్గరి బంధువుల ముందు పరదా పరిమితులు

ఒకే ఇంట్లో ఉండే బంధువులు, ఇతర సన్నిహిత బంధువుల ముందు స్త్రీలు పాటించవలసిన పరదా నియమాలు కూడా ఎంతో గమనార్హమయినవి. ఈ క్రింది హదీసు గమనిస్తే ఇస్లాం 'ఉమ్మడి కుటుంబం'ను ప్రోత్సహించదని స్పష్టంగా తెలుస్తుంది.

దైవప్రవక్త (స) ఒకసారి అనుచరులతో మాట్లాడుతూ "మీరు ముహ్రిమ్ స్త్రీల (పరస్త్రీల) దగ్గరకు వెళ్ళకుండా మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అని అన్నారు. ప్రవక్త అనుచరుల్లో ఒకాయన ఈమాట విని "దైవప్రవక్తా! భర్త సోదరుడు తమ వదిన దగ్గరకు నిరాఘాటంగా రావచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "స్త్రీ విషయంలో అతను మృత్యువులాంటి వాడు" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు: "స్త్రీలు తమ భర్తల తరపు బంధువుల ముందు పరదా నియమాలు కఠినంగా పాటించాలి. వారి పట్ల మృత్యువుని గురించి భయపడేటంతటగా భయపడాలి." (తిర్మిజి)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: ఆమె సోదరి హజ్రత్ అస్మా (రజి) ఒకసారి పల్చటి బట్టలు ధరించి దైవప్రవక్త (సల్లం) ఎదుటికి వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆమెను చూసిన వెంటనే ముఖం తిప్పుకుంటూ "అస్మా! స్త్రీ పుష్పవతి అయిన తరువాత ఆమె తన ముఖం, చేతులు తప్ప శరీరంలోని మరే భాగం కూడా కన్పించేలా ఉండటం ధర్మసమ్మతం కాదు" అని చెప్పారు. (అబూదావూద్)

పై హదీసుల్ని బట్టి స్త్రీలు తమ ముఖం, చేతులు తప్ప ఇతర శరీర భాగాలు కన్పించే వస్త్రధారణతో తండ్రి, సోదరుడు వగైరా అతి సన్నిహిత బంధువుల ముందుకు కూడా రాకూడదని తెలుస్తోంది.

దైవప్రవక్త (సల్లం) మరదలు (అంటే భార్య సోదరి) హజ్రత్ అస్మా (రజి) దైవప్రవక్త (సల్లం) జీవించి ఉన్నంతకాలం ముఖం, చేతులపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ఆయన ఎదుటికి వస్తుండేవారు. అలాగే దైవప్రవక్త (సల్లం) పెదనాన్న కుమార్తె ఉమ్మెహాని (రజి) కూడా ముఖం, చేతులపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా దైవప్రవక్త (సల్లం) ఎదుటికి నిరాఘాటంగా వస్తుండేవారు. అంటే వారిద్దరు ముఖం, చేతుల విషయంలో మాత్రం దైవప్రవక్త (సల్లం) ముందు పరదా పాటించేవారు కాదన్న మాట.

# 23. వస్త్రధారణ, అలంకరణలు

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే **అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతో శ్రేష్ఠమైనవి.** ఇది (వస్త్రధారణ) దేవుని సూచనల్లో ఒక సూచన. మీరు విషయం గ్రహిస్తారని (చెబుతున్నాం)." (ఖుర్ఆన్–7:26)

"ఆదం సంతానమా! ప్రార్థన చేసే ప్రతిసారీ పూర్తి వస్త్రధారణతో మిమ్మల్ని మీరు అలంకరించుకోండి. తినండి, త్రాగండి. (హాయిగా ఉండండి.) కాని హద్దులు మాత్రం మీరకండి. హద్దులు మీరేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు." (ఖుర్ఆన్-7:31)

## దైవప్రసాదిత వస్తువుల్ని నిషేధించుకోకండి

"ముహమ్మద్ (స)! వారినడుగు: 'దేవుడు తన దాసుల కోసం సమ్మతించిన ఈ అలంకరణలను ఎవరు నిషేధించారు? ఎవరు దేవుడు ప్రసాదించిన పరిశుద్ధ వస్తువుల్ని నిషేధించినది?' చెప్పు: 'ఇవన్నీ ఇటు ప్రపంచ జీవితంలోనూ విశ్వాసుల కోసమే ఉన్నాయి; అటు ప్రళయదినాన కూడా ప్రత్యేకంగా వారికే లభిస్తాయి.' ఈవిధంగా మేము గ్రహించేవారి కోసం మా సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాం." (ఖుర్ఆన్-7:32)

ఖుర్ఆన్ అవతరణకు పూర్వం అరబ్బులు కాబాగృహాన్ని నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. అది దేవుడు ఆదేశించిన మతాచారమని భావించేవారు. ఖుర్ఆన్ ఈ దురా చారాన్ని నిషేధించింది. ఈనాడు కూడా కొన్ని జాతులు నగ్నసంచారాన్ని, నగ్న ప్రదక్షిణను మతాచారంగా, పుణ్యకార్యంగా భావించి ఆచరిస్తున్నాయి.

## అప్రాచ్య వస్త్రధారణ అతివలకు తగదు

పోతే ఎంతో నాగరికులకుం, అభ్యుదయవాదులం అని చెప్పుకునే నేటి పాశ్చాత్య నాగరికతా ప్రేమికులు పురుషులకు ఫుల్‌సూట్ ప్రతిపాదించి, స్త్రీలను మాత్రం అర్ధనగ్న వస్త్రధారణలో చూడదలచుకున్నారు. అంతేకాదు, వారిలో కొందరైతే మరికొంత ముందుకుపోయి స్త్రీలకు శరీరం మీద పదిశాతం కూడా లేని బికినీలు ధరింపజేసి వారి అందం, అంగసౌష్ఠవాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శింపజేస్తున్నారు. పాశ్చత్యదేశాలలో ఒంటిపై ఒక్క నూలుపోగు కూడా లేని సౌందర్య ప్రదర్శనలను సైతం అక్కడి మహిళాభ్యుదయవాదులు లొట్టలేసుకుంటూ చూస్తున్నారు. ప్రాచ్యదేశాలలో నగ్నప్రదర్శనలను సెన్సార్ చేస్తుం డటం వల్ల ఈ దేశాలలో నగ్నదేహ ప్రదర్శనల ఉద్యమాలు ఇంకా రేకెత్తలేదు.

తాత్విక దృష్ట్యా స్త్రీ పురుషులు ఇద్దరూ సమానం అయినా పుట్టుక రీత్యా వారిద్దరిలో కొంత వ్యత్యాసం ఉందనే విషయాన్ని మనం అంగీకరించక తప్పదు. దేహదారుఢ్యం లోనూ, బుద్ధిబలంలోనూ ఈ తేడా స్పష్టంగా గోచరిస్తుంది. స్త్రీకి ఉన్న సౌకుమార్యం, మృదుత్వం, కోమలత్వం, ఇతర శారీరక బలహీనతల కారణంగానే ఆమెకు ఇష్టంలేక పోయినా పురుషుడు ఆమెను బలాత్కారం చేసి అనుభవించ గలుగుతాడు. పురుషుని అక్రమ బలాత్కారం నుంచి స్త్రీని కాపాడటానికి, అశ్లీలతల వ్యాప్తికి తావులేకుండా ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రాథమిక చర్యగా ఇస్లాం స్త్రీకి పరదా విధానం నియమించి, స్త్రీ సౌందర్యం ఆమె భర్తకే పరిమితం కావాలన్నది ఈ విధానంలోని ప్రధాన సూత్రం. అందువల్ల ఇస్లామీయ సమాజంలో స్త్రీకి పరదా నియమాన్ని పాటించడం అనివార్యమయింది.



## అలంకరణలన్నీ ఇంట్లో ఉన్నప్పుడే

స్త్రీల అలంకరణ విషయంలో ఇస్లాం కొన్ని ఆదేశాలు బోధించింది. ఆమె అలం కరణతో భర్త, తండ్రి, కొడుకు, సవతి కొడుకు, సోదరుడు, అన్నదమ్ముల కొడుకులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు, తన సేవకులు, తనకు విధేయులయివున్న నపుంసకులు, కామదృష్టితో చూడని సత్పురుషులు, యుక్తవయసుకురాని బాలురు తప్ప ఇతర పురుషుల ఎదుటకు రాకూడదు.

ఈ ఆజ్ఞలన్నీ యుక్త వయస్కులయిన మహిళల కోసం మాత్రమే. రుతుస్రావం ఆగిపోయి, లైంగికాసక్తి నశించిన వృద్ధ మహిళలు ఇంట్లో ఉన్నప్పుడు ఓణి తీసేసి తిరిగినా పరవాలేదు. "నూర్" (జ్యోతి) అధ్యాయంలోని 8వ సూక్తిలో ఈ విషయం స్పష్టం చేయబడింది. ఇలాంటి స్త్రీలు ఒంటరిగా ఉన్నప్పుడు ఏ పురుషుడయినా ఆమె దగ్గర కూర్చోవచ్చు, చేత్తో తాకవచ్చు.

## దుస్తులు ధరించిన దిగంబర స్త్రీలు

స్త్రీకి మానం ఒక అమూల్య ఆభరణం. స్త్రీ మానానికి ఇస్లాంలో విస్తృత భావం ఉంది. ఎలాంటి చేష్టలతో ఒక స్త్రీ తన భర్తను మోహపూర్వకంగా ఆకర్షిస్తుందో అలాంటి చేష్టల్ని పరపురుషుని ముందు ప్రదర్శించడం ఇస్లాంలో నిషిద్ధం.

ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం పరపురుషులు తారసపడినప్పుడు స్త్రీలు తమ వస్త్రధారణ, అలంకరణ విషయాల్లో చాలా నిరాడంబరత కలిగివుండాలి. వారితో మాట్లాడవలసి వచ్చినప్పుడు తెర వెనుక ఉండి మాట్లాడాలి. పలుకుల్లో మెతకదనం వహించకుండా గాంభీర్యత, కరకుదనం వ్యక్తపరచాలి. ధ్వని కలిగించే ఆభరణాలు ధరించకూడదు. సువాసనలు వాడటాన్ని కూడా ఇస్లాం అంగీకరించదు.

"సతర్"శరీరం కప్పుకోవడానికి ధరించే ఉడుపులు లోపలి దేహం కన్పించేటంత పల్చగా ఉండకూడదు. బట్టలు ధరించి కూడా నగ్నంగా కన్పించే స్త్రీలను దైవప్రవక్త (సల్లం) శపించారు.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి ఇలా అన్నారు: "దుస్తులు ధరించి కూడా దిగంబరంగా ఉండి ఇతరుల్ని ఆకట్టుకోవడం, ఇతరులచే ఆకర్షించబడటం చేస్తూ మదపు ఒంటెలా మెడ వంకరపెట్టి మిడిసిపడుతూ నడిచే స్త్రీలు ఎన్నటికీ స్వర్గంలో ప్రవేశించలేరు. అసలు దాని వాసన కూడా వారు ఆఘ్రాణించలేరు." (ముస్లిం)

## కృత్రిమ సౌందర్య చేష్టలు నిషిద్ధం

స్త్రీల అలంకరణలను దైవప్రవక్త (సల్లం) నిషేధించలేదు. పైగా వాటిని ప్రోత్స హించారు. అయితే కృతిమించిన అలంకరణలు, ఫ్యాషన్లపై ఆయన ఆంక్షలు విధించారు. ఆనాడు కృత్రిమ సౌందర్యం కోసం అరబ్బు స్త్రీలలో ఉండే ఈ క్రింది చేష్టలను ఆయన దైవాగ్రహానికి గురయ్యే, జాతుల పతనానికి కారణమయ్యే విషయాలుగా పరిగణించారు.

శిరోజాలలో ఇతరుల శిరోజాలు కలిపి తమకు పొడవైన, గుబురు శిరోజాలు ఉన్నాయని అన్పించుకోవడానికి ఆరాటపడటం, శరీరం మీద అనేక చోట్ల కృత్రిమ మచ్చలు (పచ్చబొట్లు) వేయించుకోవడం, వెంట్రుకలు పీకేసి కనుబొమలు సన్నగా చేయడం, ముఖాన్ని వత్తి వత్తి నున్నగా చేయడం, పళ్ళను అరగదీసి సన్నగా చేయడం, కృత్రిమ రంగులు పూసుకొని ముఖాన్ని అందంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రయత్నించడం మొదలైన కృత్రిమ చర్యలు ఇస్లాంలో వికృత చేష్టలుగా పరిగణించబడ్డాయి. వీటి ప్రస్తావనలు బుఖారి, ముస్లిం, తిర్మిజి, అబూదావూద్, నసాయి, అహ్మద్ వగైరా హదీసు గ్రంథాలలో పటిష్టమైన ప్రమాణాలతో ఉల్లేఖించబడ్డాయి. ఈనాడు కూడా ఇవి బ్యూటీ పార్లర్లలో జరుగుతున్నాయి. ధర్మపరాయణురాలయిన శీలవతులకు ఇలాంటి చేష్టలు ఏమాత్రం శోభించవు.

## పురుష దుస్తులు స్త్రీలు ధరించకూడదు

ఇల్లు దాటి బయటికెళ్ళేటప్పుడు సెంటు, అత్తరు, ఫర్ఫ్యూమ్స్ పూసుకోవడం, సువాసనలు వచ్చే పువ్వులు పెట్టుకోవడం కూడా నిషిద్ధమే. అలాగే పురుష దుస్తులు స్త్రీలు, స్త్రీదుస్తులు పురుషులు ధరించడం కూడా నిషిద్ధమే. ఈ విషయాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు.

“ఏ స్త్రీ అత్తరు పూసుకొని మనుషుల మధ్య గుండా నడచి పోతుందో ఆమె తిరుగుబోతు స్త్రీ వంటిది.” (తిర్మిజి)

“స్త్రీలను అనుకరించే స్త్రీవేష పురుషులు, పురుషుల్ని అనుకరించే పురుషవేష స్త్రీలు మనలోనివారు కారు.” (ముస్నద్ అహ్మద్)

“స్త్రీ దుస్తులు ధరించే పురుషుల్ని, పురుష దుస్తులు ధరించే స్త్రీలను దైవప్రవక్త (సల్లం) శపించారు.” (అబూదావూద్)

## పరపురుషులతో మెతకగా మాట్లాడకండి

మహిళలు పర పురుషులతో, అపరిచితులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు నవ్వుతూ, తుళ్ళుతూ ఎన్నడూ మాట్లాడకూడదు. అలాగే వారితో మెతకగా కూడా మాట్లాడకూడదు.

“ఒకవేళ మీరు ప్రవక్తభార్యల్ని ఏదైనా అడగదలచుకుంటే తెరవెనుక నిలబడి అడగండి. ఇది చిత్తశుద్ధి కోసం మీకూ, వారికీ ఎంతో మంచి పద్ధతి.” (ఖుర్ఆన్–33:53)

“మీరు దేవునికి భయపడే వారైతే (పరపురుషులతో) మెతకదనం వ్యక్తమయ్యేలా మెల్లిగా మాట్లాడకండి. ఆంతర్యంలో ‘చెడు’ ఉన్నవాడ్ని ఈ మెతకదనం పేరాశకు పురిగొల్పే ప్రమాదం ఉంటుంది. అందువల్ల మీరు పరపురుషులతో మాట్లాడ వలసివచ్చినప్పుడు స్పష్టంగా, కరాఖండిగా మాట్లాడండి. (ఖుర్ఆన్–33:32)



# 24. ఇంటినుండి బయటికి వెళ్ళేటప్పుడు

సాధారణంగా స్త్రీ కార్యాచరణ పరిధి ఆమె గృహమే. అందుకే ఆమెను “గృహిణి” అన్నారు పెద్దలు. “ఇంటికి దీపం ఇల్లాలే” అనే సామెత కూడా ఈ వాస్తవాన్నే ధృవీకరిస్తుంది. గృహనిర్వహణ బాధ్యతలను పురుషునికంటే స్త్రీయే చక్కగా నిర్వహిస్తుంది. ఇంట్లోని చిన్న చిన్న పనులు అనేకం చేయగల శక్తి, సామర్థ్యాలు ఆమెకే ఉంటాయి. ఇంటిని చక్కదిద్దుకోగల నేర్పు ఆమె సహజ లక్షణం. ఆ లక్షణాన్ని వదిలేస్తే ఆమె ఇల్లు కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుంది.

అలాఅని ఆమె ఇంటి నాల్గుగోడల మధ్య బందీ అయిపోవాలని ఎవరూ చెప్పరు. గృహనిర్వహణ బాధ్యతల్ని విస్మరించకుండా వాటి కోసం అవసరమొచ్చినప్పుడు ఆమె బయటికి కూడా వెళ్ళవచ్చు. ఇతర పనుల కోసం అనివార్యమయితేనే బయటికి వెళ్ళాలి. బయటికెళ్ళినప్పుడు స్త్రీ స్త్రీగానే మసలుకోవాలిగాని, మగరాయుడిగా ప్రవర్తించకూడదు. స్త్రీకి అన్ని రంగాల్లోనూ పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పడం ఎంత తప్పో, ఆమెకసలు స్వేచ్ఛే లేదని చెప్పడం కూడా అంతే తప్పు.

హజ్రత్ ఆయిషా (రజి) పరదా ఆజ్ఞలు అవతరించిన తరువాత జరిగిన ఒక సంఘటన గురించి ఇలా తెలియజేశారు:

హజ్రత్ ఉమర్ (రజి) ఒకరోజు ప్రవక్త సతీమణి హజ్రత్ సౌదా (రజి)ని బయట (వీధిలో) ఉండటం చూసి విమర్శించారు. అప్పుడామె (ఎలాంటి సమాధానం ఇవ్వ కుండా) ఇంటికెళ్ళి ఆ సంగతి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావించారు. ఈ ప్రస్తావన వచ్చిన వెంటనే ఆయనపై దివ్యావిష్కృతి పరిస్థితి ఆవహించింది. అది తొలగిపోయిన తర్వాత ఆయన ఇలా అన్నారు: “నిస్సందేహంగా దేవుడు మీకు (స్త్రీలకు) మీ అవసరాల నిమిత్తం ఇంటి నుండి బయటికి వెళ్ళేందుకు అనుమతి ఇచ్చాడు.” (బుఖారి)

## ఆడది తిరిగి చెడిపోయింది, మగాడు...

ఏమైనప్పటికీ ఇంటి బాధ్యతలన్నీ స్త్రీయే నిర్వహించాలి. బయటి బాధ్యతలన్నీ పురుషుడు నిర్వహించాలి. ఈ సహజపరిధిని అతిక్రమించి స్త్రీ బయటికెళ్ళి పురుషుడు చేసే పనుల్లో జోక్యం చేసుకుంటే కుటుంబ పతనం ప్రారంభమయి, సామాజిక సంక్షోభం ఏర్పడుతుంది. నేడు పాశ్చాత్యదేశాల్లో జరుగుతున్నదిదే. “ఆడది తిరిగి చెడిపోయింది, మగాడు తిరగక చెడిపోయాడు” అనే సామెత తెలుగు ప్రజలకు సుపరిచితమే.

ఈ కారణంగానే ఇస్లాం పరదావ్యవస్థలోని తొలి సూత్రంగా ఇలా పేర్కొన్నది:

“మీరు మీ ఇండ్లలోనే ఆగి ఉండండి. పూర్వం మూఢకాలంనాటి స్త్రీలు తిరిగి నట్లు సింగారం చూపుకుంటూ తిరగకండి.” (ఖుర్ఆన్–33:33)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: “స్త్రీ భద్రంగా దాచబడవలసిన సృష్టితం. ఆమె ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరినప్పుడు షైతాన్ ఆమె వైపు తొంగిచూస్తాడు.”

స్త్రీ ఇంటి నుంచి బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు పరపురుషుల వీక్షణల నుంచి తప్పించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలలో మొట్టమొదటి జాగ్రత్త పూర్తిస్థాయి పరదా వస్తుంది. విశ్వప్రభువు స్పష్టంగా ఇలా ఆదేశిస్తున్నాడు:

"ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం మహిళలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరయిన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా (పోకిరీ పురుషులు) గుర్తించి వేధిస్తారనే భయముండదు." (ఖుర్ఆన్-33:59)

## అశ్లీల విషయాలపై ఆంక్షలలో తొలి ఆంక్ష

అంటే స్త్రీలు ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలని ఈ సూక్తి సూచిస్తోంది. కాకపోతే కళ్ళు కన్పించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి వస్త్రధారణ వల్ల పోకిరీలతో సహా పరపురుషులంతా, వీరు గౌరవప్రదమయిన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారివైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేరు.

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమైన పవిత్ర సమాజాన్ని నిర్మించగోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమయిన కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుంది. ప్రజలకు మనశ్శాంతి కరువైపోతుంది. హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతాయి. అందువల్ల ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీలవిషయాలపై కూడా ఆంక్షలు విధించి, వాటిని మొగ్గలోనే త్రుంచివేయదలచింది. అలాంటి ఆంక్షలలో పరదా ఒకటి.

## ప్రయాణావస్థలో పడతుల బాడీగార్డులు

పరదా నియమాలు వచ్చిన తరువాత స్త్రీ ఎక్కడికయినా ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు కూడా ఆమె కొన్ని విషయాలు గమనించాల్సిన అవసరం గురించి ఇస్లాం బోధించింది. స్త్రీ తన అందచందాలు, అలంకరణలు, హావభావాలతో ఆకర్షించేందుకు ప్రయత్నించడం తప్ప ఆమె క్రియాత్మంగా పురుషుడ్ని బలవంతం చేయలేదు. కాని పురుషుడు సులభంగా స్త్రీని బలాత్కరిస్తున్నాడు. అందువల్ల పరదా మొదలైన నియమాలతో పాటు ఇస్లాం స్త్రీని ఒంటరిగా ప్రయాణం చేయడాన్ని కూడా ఇష్టపడదు.

దైవప్రవక్త (సల్లం) స్పష్టంగా ఇలా చెప్పారు: "దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించే ఏ స్త్రీ అయినా వెంట ఆమె తండ్రిగాని, సోదరుడుగాని, భర్తగాని, కుమారుడుగాని లేదా మరెవరయినా ముహ్రిమ్ పురుషుడుగాని లేకుండా మూడు రోజులుగాని, లేదా అంత కన్నా ఎక్కువ రోజుల ప్రయాణం చేయడం ధర్మసమ్మతం కాదు." (తిర్మిజి)

"ఎవరైనా ముహ్రిమ్ పురుషుడు వెంటలేకుండా స్త్రీ ఒక రాత్రి, పగలుగల ప్రయాణం చేయకూడదని దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చినట్లు హ్జ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు." (తిర్మిజి)



అసలు విషయం ఇక్కడ ఒకరోజు, రెండురోజుల ప్రయాణాన్ని గురించి చెప్పడం కాదు. ఉపద్రవానికి కారణభూతమయ్యే ఒంటరిగా తిరిగే స్వేచ్ఛను స్త్రీకి ఉండరాదనేదే ఈ హదీసు ముఖ్యోద్దేశ్యం.

## మహిళలు మసీదులకు వెళ్ళవచ్చు

సామూహిక నమాజ్ విషయంలో ఇస్లాం పురుషులకు ఇచ్చిన ఆదేశాలకు, స్త్రీలకు ఇచ్చిన ఆదేశాలకు చాలా తేడా ఉంది. పురుషులు మసీదులో సామూహికంగా చేసే నమాజే ఉత్తమోత్తమమైన నమాజ్‌గా పరిగణించబడింది ఇస్లాంలో. కాగా ఇంట్లో ఒంటరిగా చేసే నమాజ్ స్త్రీల కోసం అత్యుత్తమ నమాజ్‌గా ఇస్లాం పేర్కొన్నది.

హ్జ్రత్ ఉమ్మె హమీద్ సాయిదియా (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు మీతోపాటు (మసీదులో) నమాజ్ చేయాలని ఉంది" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "నీవు ఇలా అడుగుతావని నాకు తెలుసు. కాని నీవు నీ గది (మధ్య)లో నమాజ్ చేయడం కంటే ఒక మూలలో నమాజ్ చేయడం శ్రేష్ఠం. నీవు నీ ఇంటి ప్రాంగణంలో చేసే నమాజ్ కంటే ఇంటి గదిలో చేసే నమాజే శ్రేష్ఠమయినది. మీ వీధిలో ఉండే మసీదులో నమాజ్ చేయడం కంటే మీ ఇంటి ప్రాంగణంలో నమాజ్ చేయడం ఉత్తమం. జామియా మసీదులో కంటే వీధి మసీదులో నమాజ్ చేయడం చాలా మంచిది." (తబ్రాని)

అయితే దైవప్రవక్త (సల్లం) స్త్రీలకు మసీదుకు పోయే స్వేచ్ఛపై ఆంక్షలు విధించ లేదు. వారికి నమాజు కోసం మసీదుల కన్నా వారి ఇండ్లే మంచివని చెబుతూ ఇలా అన్నారు: "మీ స్త్రీలను మసీదులకు పోనీయకుండా నిరోధించకండి. కాని వారి కోసం వారి గృహాలే శ్రేష్ఠమయినవి." (అహ్మద్, అబూదావూద్)

నమాజు కోసం మసీదుకు పోవడం పురుషునికి విధి అయివుంటే, స్త్రీకి ఇది అనుమతి మాత్రమే. అదైనా చివరివరుసలో ఉండి నమాజ్ చేయడాన్నే ఇస్లాం ఎక్కువగా ఇష్టపడుతుంది. అయినా దైవప్రవక్త (స) వారి స్వేచ్ఛను హరించలేదు. పైగా హ్జ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు:

"మీ భార్యలు మసీదుకు వెళ్ళడానికి అనుమతి అడిగితే, వారిని అనుమతించ కుండా నిరోధించకండి."; "స్త్రీలకు రాత్రివేళ మసీదులకు వెళ్ళడానికి అనుమతివ్వండి." (బుఖారి)

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా చెబుతున్నారు: హ్జ్రత్ ఉమర్ (రజి) భార్యలలో ఒకరు ఫజర్, ఇషా వేళల నమాజులు చేయడానికి మసీదుకు వెళ్ళేవారు. "స్త్రీలు మసీదుకు వెళ్ళడాన్ని ఉమర్ (రజి) ఇష్టపడరని, ఈ విషయంలో ఆయన ఎంతో అభిమానంగల మనిషని తెలిసి కూడా మీరు ఇంటి నుండి బయటికి ఎందుకు వెళ్తున్నారు?" అని ఒకరు అడిగారు ఆమెను. దానికామె "అయితే ఉమర్ (రజి) నన్నెందుకు నిరోధించడం లేదూ?" అని ఆమె ఎదురుప్రశ్న వేశారు.

"ఎందుకంటే దేవుని దాసీలను దేవుని ఆలయానికి వెళ్ళడాన్ని నిరోధించకండని దైవప్రవక్త (సల్లం) అన్నారు. ఈ ప్రవచనమే మిమ్మల్ని నిరోధించకుండా ఆయనకు అడ్డు తగిలింది'' అని అన్నాడా మనిషి. (బుఖారి.)

స్త్రీలు అవసరం లేకపోయినా పరపురుషులతో మాట్లాడటం మంచిది కాదు. అంతగా మాట్లాడవలసిన అవసరమొస్తే నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడకూడదు.

స్త్రీలు తమ కంఠస్వరం పరపురుషులకు విన్పించడాన్ని దైవప్రవక్త (సల్లం) ఇష్ట పడేవారు కాదు. మసీదులో ఇమామ్ నమాజ్ చేయిస్తున్నప్పుడు అతని వల్ల ఏదైనా పొరపాటు జరిగితే అతని వెనుక నమాజు చేస్తున్న పురుషులు 'సుబ్‌హానల్లహ్' అని పలకాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. కాని స్త్రీలయితే రెండు చేతులు కలిపి చప్పుడు చేయడం ద్వారా మాత్రమే ఇమామ్‌ని హెచ్చరించాలని దైవప్రవక్త (సల్లం) చెప్పారు. (బుఖారి, ముస్లిం, అహ్మద్, తిర్మిజి)

హజ్‌యాత్ర స్త్రీ పురుషులిద్దరికీ విధి అయిఉంది. కాని కాబాప్రదక్షిణ చేసేటప్పుడు స్త్రీలు పురుష సమూహంలోకి జొరబడకుండా ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి. షరీఅత్ సరిహద్దులు అతిక్రమించకుండా స్త్రీలు ఇతర ప్రదేశాలను కూడా దర్శించవచ్చు.

## నాణానికి ఒకవైపున్న చిత్రం చూపితే చాలదు

కొందరు సంస్కరణవాదులు పాశ్చాత్యతరహా స్త్రీస్వేచ్ఛకోసం ప్రవక్తసతీమణి ఆయిషా (రజి) జమల్‌యుద్ధంలో పాల్గొనడాన్ని ప్రమాణంగా చూపెడుతున్నారు. కాని అమె ఆ తర్వాత పశ్చాత్తాపం చెందిన సంగతి వీరు విస్మరిస్తున్నారు. అబ్దుల్లా బిన్ హంబల్, ఇబ్నెమున్జిర్, ఇబ్నెఅబీ షైబా, ఇబ్నెసాద్ వంటి ప్రముఖులు తమ గ్రంథాల్లో మస్రూఖ్ కథనాన్ని ఉల్లేఖిస్తూ, ఆయిషా (రజి) ఖుర్‌ఆన్ పఠనం సందర్భంగా జమల్ యుద్ధంలో తనవల్ల జరిగిన పొరపాటు జ్ఞాపకం వచ్చి, ఈసూక్తి దగ్గరికి వచ్చేటప్పటికి అప్రయత్నంగా దుఃఖించేవారని, కన్నీటితో ఆమె ఓణి తడిసిపోయేదని వ్రాశారు.

ప్రకృతి సిద్ధమైన వ్యత్యాసంరీత్యా మానసికంగానూ, శారీరకంగానూ స్త్రీ పురుషుని కంటే కొంచెం బలహీనురాలనేది కాదనలేని యదార్థం. స్త్రీ నెలకు కనీసం మూడు రోజులు రుతుస్రావంతో ఉంటుంది. సాధారణంగా అప్పుడు స్త్రీ చిరాకుతో పరధ్యానంగా ఉంటుంది. టైపిస్టులుగా నియమించబడిన మహిళలు రుతుకాలంలో తరచుగా తప్పులు టైప్ చేయడం సామాన్య విషయమే. ప్రసవానికి ముందు రెండు నెలలు, ఆ తరువాత రెండు నెలలు ఇంటి పనులు చేసుకోవడానికి కూడా స్త్రీ అశక్తురాలయి ఉంటుంది. ఈ కారణం దృష్ట్యానే మహిళా ఉద్యోగినులకు ప్రత్యేకంగా ప్రసూతి సెలవులు మంజూరు చేస్తారు. పోతే స్త్రీకున్న సహజసిద్ధమైన శారీరక బలహీనత వల్ల మహిళా కార్మికులకు తక్కువ వేతనాలు నిర్ణయించడం, క్రీడారంగంలో స్త్రీ పురుషుల వేర్వేరు జట్టులను ఏర్పరచడం, వైజ్ఞానిక రంగంలో వనితలు పురుషుల స్థాయికి చేరుకోక పోవడం మొదలైనవి మనం గమనిస్తున్న విషయాలే.



## ఇస్లాం దృష్టిలో స్త్రీ సాక్ష్యం

ఇస్లాంలో స్త్రీల సాక్ష్యానికి పురుషుల సాక్ష్యానికి కొంచెం తేడా ఉంది. సాక్ష్యం గురించి ఖుర్‌ఆన్‌లో మనకొక సూత్రప్రాయమైన విషయం లభిస్తుంది. ఖుర్‌ఆన్‌లోని రెండవ అధ్యాయం (గోవు)లో ఈవిధంగా ఉంది:

"ఒకవేళ అప్పు తీసుకునేవాడు బుద్ధి మాంద్యం కలవాడో, బలహీనుడో, లేదా చెప్పి వ్రాయించే శక్తి లేనివాడో అయితే అతని సంరక్షకుడు చెప్పి న్యాయంగా వ్రాయించాలి. (దీన్ని గురించి) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టుకోండి. పురుషులు ఇద్దరు లభించక పోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒక స్త్రీ మరచిపోతే రెండవ స్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోదయోగ్యమైనవారుగా ఉండాలి. సాక్ష్యం కోసం పిలిచినప్పుడు సాక్షులు (నిర్ణీత సమయానికి, నిర్ణీత స్థలానికి రావడానికి) నిరాకరించకూడదు." (ఖుర్‌ఆన్-2:282)

"స్త్రీ సాక్ష్యం పురుషుని సాక్ష్యంలో అర్ధ సాక్ష్యంతో సమానం'' (బుఖారి)

పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ సూక్తితో పాటు, బుఖారీ హదీసును బట్టి ఒక పురుషుని సాక్ష్యానికి ఇద్దరు స్త్రీల సాక్ష్యానికి సమానమని తెలుస్తోంది. దానికి కారణం కూడా ఈ సూక్తిలో చెప్పబడింది. అంటే పురుషుని మానసిక సామర్థ్యం కంటే స్త్రీ మానసిక సామర్థ్యం కొంచెం తక్కువన్న మాట. ముఖ్యంగా బహిష్టుకాలంలో వారి మానసిక సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ యదార్థాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవక్త ప్రత్యక్ష అనుచరులు (సహాబీలు), ఆ తరువాత వచ్చిన ఫిఖావేత్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలు చూడండి:

హజ్రత్ ఉమర్ (రజి) నికాహ్ (వివాహం) విషయంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీల సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా పరిగణించారని హజ్రత్ అతా బిన్ అబూరబాహ్ (రహ్మలై) తెలియజేస్తున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) విడాకుల విషయంలో స్త్రీల సాక్ష్యాన్ని నమ్మదగిన సాక్ష్యంగా పరిగణించారని హజ్రత్ అబూలబైద్ (రజి) అన్నారు.

ఇమామ్ షాఫై (రహ్మలై) అభిప్రాయం ప్రకారం పురుషుని సాక్ష్యం లేకుండా ఎంత మంది స్త్రీలు సాక్ష్యమిచ్చినా అది ధర్మసమ్మతమైన సాక్ష్యం కాజాలదు.

అయితే ఆయన ప్రసవం, స్త్రీల ఆంతరంగిక రహస్యాలను గురించి పురుష సాక్ష్యం లేకుండానే కేవలం స్త్రీల సాక్ష్యం ధర్మసమ్మతమేనన్న విషయంతో తాను కలుసుకున్న పండితులెవరూ విభేదించలేదని అన్నారు. ఆయన ఈ అభిప్రాయానికి రావడానికి ఈ క్రింది ఆధారాలు కూడా కావచ్చు:

హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికి నలుగురు స్త్రీలు వచ్చి ఫలానా మనిషి తాగుడు మైకంలో ఉండి తన భార్యకు విడాకులిచ్చాడని సాక్ష్యమిచ్చారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) ఆ తాగుబోతు భర్త నుండి అతని భార్యకు విముక్తి కలిగించారు.

"కేవలం స్త్రీ సాక్ష్యం స్త్రీలకు తప్ప మరెవరికీ తెలియని వ్యవహారాలలో మాత్రమే ధర్మసమ్మతమ"ని హజ్రత్ ఉమర్ (రజి) అన్నారు. అంటే రుతుస్రావం, గర్భధారణ, ప్రసవం లాంటి విషయాలలో నిర్ణయం తీసుకోవడానికి స్త్రీల సాక్ష్యమే సరిపోతుంది.

దైవప్రవక్త (సల్లం), ఆ తరువాత శ్రేష్ఠ ఖలీఫాలయిన హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు శిక్షాస్మృతి (హుదూద్), ప్రతీకార శిక్ష (ఖిసాస్)ల వ్యవహారాల్లో స్త్రీ సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా భావించేవారు కాదు.

(స్త్రీసాక్ష్యానికి సంబంధించిన ఈ సమాచారమంతా ముహమ్మద్ కలీం ఆరాయీన్, యం.ఎ. గారి గ్రంథం "ఔరత్ ఔర్ ఇజ్దివాజి జిందగి" నుండి గ్రహించబడింది.)

# 25. తలాఖ్ (విడాకులు)

సమాజానికి మూలం కుటుంబం. కుటుంబం అంటే ముఖ్యంగా దాంపత్య వ్యవస్థే. సమాజం మనుగడ భార్యాభర్తల మధ్య దాంపత్య జీవితం తీరుతెన్నులపై ఆధారపడి ఉంటుంది. దాంపత్య జీవితం ఎలాంటి వడిదుడుకులు లేకుండా సవ్యంగా, సాఫీగా సాగితే ఆరోగ్యవంతమైన సమాజం ఉనికిలోకి వస్తుంది. దానికి భిన్నంగా దాంపత్య జీవితం ఎల్లప్పుడూ అశాంతి, అసంతృప్తులతో ప్రజ్వరిల్లుతుంటే, అందులో నుంచి మొలకెత్తి పెరిగే సమాజ వృక్షం కూడా చేదుఫలాలనే ఇస్తుంది.

అందువల్ల భార్యాభర్తలు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తూ పరస్పరం సదవగాహన, సదభిప్రాయాలు కలిగి ఉండటంతో పాటు, సర్దుకుపోయే స్వభావం కూడా అలవరచుకోవాలి. ముఖ్యంగా స్త్రీలు భర్తలపట్ల అణుకువతో మసలుకుంటూ ఇబ్బందులు ఎదురయినప్పుడు వాటిని సహనంతో, సంయమనంతో అధిగమించడానికి ప్రయత్నించాలి. అంతేగాని మాటకుమాట ఎదురుచెబుతూ రెచ్చగొట్టే వైఖరి అవలంబించకూడదు.

## అనివార్యస్థితిలోనే విడాకులివ్వాలి

అయితే వివాహంలో వధూవరుల పరస్పర ఎంపిక ఎంత కచ్చితంగా జరిగిందనుకున్నా శారీరక, స్వాభావిక, భావపరమైన అసమానతలు, అపసవ్యతలు కాస్తయినా ఉండక పోవు. వీటి మూలంగా ఆలుమగల మధ్య అప్పుడప్పుడు ఏవో విభేదాలు, పొరపొచ్చాలు రావడం సహజం. అయితే ఈ కీచులాటలు హద్దుమీరి జీవితం దుర్భరమయిపోయి నప్పుడు దంపతులు విడిపోవడం తప్ప గత్యంతరం లేదు. భార్యాభర్తలు ఇలా అనివార్య స్థితిలో విడిపోవడాన్నే "తలాఖ్" అంటారు.

తలాఖ్ అంటే శాబ్దిక అర్థం బాధ నుంచి విముక్తి గావించడం. షరీఅత్ పరిభాషలో తలాఖ్ అంటే "స్త్రీ నుండి విడిపోవడానికి ఇవ్వబడిన అధికారాన్ని పురుషుడు వదలుకోవడం" అని అర్థం.



కాని మనిషి తన భార్యలో ఏదో విషయం నచ్చలేదని తొందరపడి వివాహబంధాన్ని త్రెంచుకోకూడదు. అనివార్య పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే విడాకులిచ్చే అనుమతిని వినియోగించుకోవాలి. దాంపత్య స్పర్థలను నివారించడానికి చివరి ఆయుధం విడాకులు. విడాకుల విషయంలో స్త్రీ పురుషులకు విస్తృతాధికారాలు ఇచ్చినప్పటికీ ప్రతి చిన్న విషయానికీ విడాకులిచ్చి వేయడాన్ని ఇస్లాం అంగీకరించదు. ఇస్లాం ఎల్లప్పుడూ సమైక్యతను కోరుతుంది కాని, వేర్పాటును కాదు. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

## ధర్మసమ్మతాలలో అవాంఛనీయమైనది

దైవప్రవక్త (సల్లం) ఒక సందర్భంలో తలాఖ్‌ను అవాంఛనీయమైన విషయమని, మరో సందర్భంలో షైతాన్ చర్య అని అన్నారు. ఆయన ఇలా ప్రవచించారు:

"దంపతుల మధ్య వేర్పాటు కలగజేయడం షైతాన్‌కు ఎంతో ఆనందదాయకమైన విషయం." (ముస్లిం)

"దేవుని దగ్గర ధర్మసమ్మతమైన విషయాలలో అన్నిటికన్నా అప్రియమైన విషయం విడాకులే." (అబూదావూద్)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం: దైవప్రవక్త (స) నాతో ఇలా అన్నారు- "ముఆజ్! యావత్తు భూగోళంపై బానిసను బానిసత్వం నుండి విముక్తి కలిగించడం కంటే దేవునికి ప్రియమైన విషయం మరేదీ లేదు. అలాగే దేవుని దృష్టిలో యావత్తు భూగోళంపై తలాఖ్ కంటే పరమ అసహ్యకరమైన విషయం మరేదీ లేదు." (మిష్కాత్)

"వివాహమాడండి. కాని (చీటికి మాటికి) విడాకులు ఇవ్వకండి. రుచులు కోరే వారిని దేవుడు ప్రేమించడు." (హదీస్)

భార్యాభర్తల మధ్య సాధారణంగా విభేదాలు రావడం సహజం. ఇవి మరీ దుర్భర స్థితికి చేరుకుంటే తప్ప పురుషుడు తొందరపడి విడాకులు ఇవ్వకూడదు.

"వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారంచేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు." (ఖుర్ఆన్-4:19)

## "ఈలా" (ఒట్లు, పాపపరిహారం)

కొందరు పురుషులు తమ భార్యల మీద అలిగి, లేదా భార్యలను వేధించడానికి వారిని కలుసుకోమని ఒట్లు వేసుకుంటారు. ఇది హద్దు మీరితే వివాహవిచ్ఛేదానికి దారి తీస్తుంది. అందువల్ల ఈ విషయంలో పురుషులు జాగ్రత్త వహించవలసి ఉంటుంది. దీన్ని షరీఅత్ పరిభాషలో "ఈలా" అంటారు.

"తమ భార్యలను కలుసుకోమని ప్రమాణం చేసేవారికి నాలుగు నెలల గడువు ఉంటుంది. ఒకవేళ వారు (ఈ గడువులోగా) దాన్ని ఉపసంహరించుకుంటే దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు (అని తెలుసుకోండి). దానికి బదులు వారు విడాకులు ఇవ్వడానికే నిర్ణయించుకుంటే గుర్తుంచుకోండి; దేవుడు అన్నీ వింటున్నాడు, ఆయనకు సమస్త విషయాలు తెలుసు." (ఖుర్ఆన్–2:226–227)

భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రావడం, దానివల్ల తాత్కాలికంగా దాంపత్య ప్రక్రియకు దూరంగా ఉండటం సహజం. అయితే ఈ అలుగుడు, కోపతాపాలతో దాంపత్య ప్రక్రియకు దూరంగా ఉండవలసిన గడువు నాలుగు నెలలు మాత్రమే. ఈలోగా వారుభయులు పొరపొచ్చాలు దూరం చేసుకొని ఏకమవ్వాలి. అప్పుడు కొందరు ఫిఖ్హావేత్తలు ప్రమాణభంగం చేసినందుకు భర్త పాపపరిహారం చెల్లించవలసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరికొందరు ఫిఖావేత్తలు పాపపరిహారం చెల్లించనవసరం లేదని అభిప్రాయం వెలిబుచ్చారు.

ఈ గడువు దాటితే భర్త ఒక తలాఖ్ (తలాఖెబాయిన్) ఇచ్చినట్లయి వివాహబంధం తెగిపోతుంది. అయితే భార్యాభర్తలు రాజీపడితే తిరిగి వివాహంచేసుకోవచ్చు. ఇదీ 'ఈలా' విధానం.

## 'ఈలా' వర్తింపులో ఫిఖావేత్తల మధ్య విభేదాలు

'ఈలా' ఆజ్ఞను వర్తింపజేయడంలో ఫిఖావేత్తల మధ్య కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఫిఖావేత్తలు భర్త ఒట్టేసుకొని మరీ భార్యను కలుసుకోకుండా ఉన్నప్పుడు మాత్రమే సదరు భర్తకు ఈలా ఆజ్ఞ వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు. ఒట్టేసు కోకుండా భార్య మీద అలిగి ఆమెను కలుసుకోకుండా పదేళ్ళు వేరుగా ఉన్నా ఈలా వర్తించదని వారి అభిప్రాయం.

దీనికి భిన్నంగా మాలికియా ఫిఖ్హావేత్తలు భర్త ఒట్టేసుకోకపోయినా, అంటే ప్రమాణం చేయకపోయినా సరే భార్యను వేధించే ఉద్దేశ్యంతో ఆమెను నాలుగు నెలలదాకా కలుసు కోకుండా ఉంటే అతనికి ఈలా వర్తింపజేయాలని అన్నారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)లు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ "నాలుగు నెలలు గడచిపోవడం అంటేనే భర్త విడాకులు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాడని అర్థం. కనుక ఆ గడువు ముగిశాక అతనికిక తన భార్యను పరిగ్రహించడానికి అధికారం లేదు" అని అన్నారు. ఈ అభిప్రాయాన్ని ప్రముఖ తత్వవేత్త మౌలానా మౌదూదీ కూడా సమర్థించారు.

## జిహార్ (తల్లికాని తల్లి)

అజ్ఞానకాలంలో అరబ్బులు తమ భార్యలతో పోట్లాడి వారిని వదిలించుకోవడానికి "నువ్వు నాకు తల్లివంటి దానవు" అని చెప్పేవారు. ఇది ఆనాడు విడాకులకు దారితీసే చర్య అవుతుంది. ఈ దురాచారం ప్రకారం పురుషుడు ఇక ఆమెను తిరిగి దాంపత్యం



లోకి తీసుకోవడానికి వీల్లేదు. దీన్ని షరీఅత్ పరిభాషలో "జిహార్" అంటారు. ఆనాడు హజ్రత్ ఖౌలా బిన్త్ సాలబా (రజి) కూడా ఇలాంటి పరిస్థితే ఎదురయింది. ఆమె దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, భర్త దూరమయితే తాను చిక్కుల్లో పడవలసి వస్తుందని, తన పిల్లలు నాశనమవుతారని విన్నవించుకున్నారు. అప్పుడు దేవుడు ఆమెభర్త వైఖరిని తీవ్రంగా గర్హిస్తూ ఈ క్రింది సూక్తులు అవతరింపజేశాడు.

"(ప్రవక్తా!) నీతో తనభర్త విషయంలో వాదిస్తూ దైవాన్ని మొరపెట్టుకున్న స్త్రీ మాటల్ని దేవుడు విన్నాడు. దేవుడు మీ ఇద్దరి సంభాషణ వింటున్నాడు. ఆయన సర్వం వినేవాడు, సమస్తం చూసేవాడు. మీలో ఎవరు తమభార్యల్ని తల్లుల వంటివారని చెప్పి, వారిపట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారి భార్యలు నిజానికి వారికి తల్లులు కాలేరు. వారి తల్లులు వారిని కన్నవారే అవుతారు. వీరు అనుచితమైన అబద్ధం పలుకుతున్నారు. (ఈ వైఖరి పట్ల వారిపై దైవశిక్ష విరుచుకుపడేదే, కాని) దేవుడు అపార దయామయుడు, గొప్ప క్షమాశీలి." (ఖుర్ఆన్–58:1,2)

"ఎవరు తమ భార్యల్ని తల్లుల వంటివారని చెప్పి వారిపట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారు (తప్పు తెలుసుకున్న తరువాత) దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించు కోవడానికి సిద్ధమైనప్పుడు, దంపతులు పరస్పరం కలుసుకోక ముందే (భర్త) ఒక బానిసకు బానిసత్వం నుండి విముక్తి కలిగించాలి. దీనిద్వారా మీకు హితోపదేశం చేయబడుతోంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు."

"ఒకవేళ బానిస లేకపోతే, ఇద్దరు కలుసుకోక ముందే అతను రెణ్ణెల్లు నిరంతరాయంగా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది పేదలకు అన్నదానం చేయాలి. మీరు దేవుడ్ని, ఆయన ప్రవక్తను (మనస్ఫూర్తిగా) విశ్వసించడానికే ఈ ఆజ్ఞ ఇస్తున్నాం. ఇవి దేవుడు నిర్ణయించిన పరిధులు. (వాటిని అతిక్రమించకూడదు. ఈ) సత్యాన్ని తిరస్కరించినవారికి దుర్భరశిక్ష పడుతుంది." (ఖుర్ఆన్–58:3,4)

"గతంలో కొందరు దేవుడ్ని, ఆయన ప్రవక్తను వ్యతిరేకించినప్పుడు దేవుడు వారిని నికృష్ట స్థితికి దిగజార్చాడు. నేడు కూడా అలాంటి వైఖరి అవలంబించినవారికి అదే గతి పడ్తుంది. మేము (మాత్రం ఎలాంటి అరమరికలులేని) నిర్దిష్టమైన సూక్తులు అవతరింపజేశాము. (కనుక) అవిశ్వాసులకు అవమానకరమైన శిక్ష తప్పదు." (ఖుర్ఆన్–58:5)

## గడువులోపే పునరుద్ధరణకు అవకాశం

"విడాకులు పొందిన స్త్రీలు తమంతటతాము మూడు రుతువులదాకా వేచివుండాలి. దేవుడు వారి గర్భాలలో సృజించినదాన్ని (పైకి చెప్పకుండా) దాచడం వారికి భావ్యం కాదు. అల్లాహ్ను, అంతిమదినాన్ని విశ్వసించేవారైతే వారీ విషయాన్ని బహిర్గతం చేయాలి. వారి భర్తలు పూర్వసంబంధాలను పునరుద్ధరించుకోదలిస్తే ఈ గడువులోగా తమ భార్యల్ని తిరిగి దాంపత్యంలోకి తీసుకునేందుకు వారికి పూర్తి హక్కుంది." (ఖు–2:228)

భర్త భార్య నుండి శాశ్వతంగా వేరవడానికి విడాకులిస్తున్నానని ఆమె జీవితకాలంలో మూడుసార్లు మాత్రమే ప్రకటించవలసి ఉంటుంది. ఒకవేళ అతను రెండుసార్లు మాత్రమే తలాఖ్ ప్రకటించి, భార్యతో రాజీపడి సంసారంసాగిస్తూ, ఆతర్వాత మరెప్పుడైనా ఇద్దరి మధ్య మళ్ళీ పొరపొచ్చాలు వస్తే అప్పుడతను భార్య నుండి శాశ్వతంగా విడిపోవడానికి తలాఖ్ ప్రకటన ఒక్కసారి మాత్రమే చేయవలసి ఉంటుంది.

## ఒకేసారి మూడు తలాఖులు శాస్త్రవ్యతిరేకం

మానవ జీవితానికి సంబంధించిన ప్రతి వ్యవహారంలోను దేవుడు కొన్ని హద్దులు నిర్ణయించాడు. మనిషి ఈ హద్దులు అతిక్రమిస్తే ఉభయలోకాల్లోనూ నష్టమే. విడాకుల విషయంలోనూ అంతే. **విడాకులంటే ఆషామాషీ విషయం కాదు**. పెద్దల సమక్షంలో ఒక స్త్రీ, ఒక పురుషుడి మధ్య వివాహరూపంలో ఏర్పడిన పవిత్ర బంధాన్ని విడాకులి స్తున్నానని ఏకకాలంలో మూడుసార్లు పలికితే ఆ బంధం తెగిపోవచ్చుగాని, ఆ చర్య ఘోరమైన తప్పుగా మిగిలిపోతుంది. ఖలీఫా ఉమర్ (రజి) అలాంటి వ్యక్తిని కొట్టేవారు. ఆతర్వాతే ఆయన విడాకుల్ని అమలు పరచేవారు.

మహ్మూద్ బిన్ లబీద్ (రజి) ఉల్లేఖనం: ఒకతను తన భార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇచ్చిన సంగతి దైవప్రవక్త (సల్లం) దృష్టికి తెచ్చినప్పుడు ఆయన ఆగ్రహంతో దిగ్గున లేచి “ఏమిటీ, నేను మీ మధ్య జీవించి ఉండగానే దైవగ్రంథంతో ఆడుకోవడం జరుగుతోందా?” అని అన్నారు. అప్పుడు ఒకతను లేచి “దైవప్రవక్తా! మరి నేనా వ్యక్తిని హతమార్చనా?” అని అన్నాడు. (నసాయి-మిష్కాత్)

హజ్రత్ మాలిక్ (రజి) ఉల్లేఖనం: ఒకతను హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరికి వచ్చి “నేను నా భార్యకు వంద తలాఖులు ఇచ్చాను. మరి నా సంగతేమిటీ?” అని అడిగాడు. దానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) సమాధానమిస్తూ “నీ భార్య మూడు తలాఖులకే నీ నుండి వేరయిపోయింది. మిగిలిన తలాఖులన్నిటితో నీవు దైవ సూక్తుల్ని పరిహసించావు” అని అన్నారు. (ముఅత్తా)

హజ్రత్ రుకానా బిన్ అబ్దయజీద్ (రజి) తన భార్య సుహైమాకు ‘బిత్తా తలాఖ్’ (వివాహవిచ్ఛేద విడాకులు) ఇచ్చారు. ఆసంగతి ఆయన దైవప్రవక్త (సల్లం) దృష్టికి తెస్తూ “దైవసాక్షి! నేను ఒక్క తలాఖ్ ఉద్దేశ్యంతోనే తలాఖ్ ఇచ్చాను” అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని “నువ్వు దేవుని మీద ప్రమాణం చేసి నిజంగా ఒక తలాఖ్ ఉద్దేశ్యంతోనే ఇచ్చానని చెబుతున్నావా?” అని అడిగారు. దానికి హజ్రత్ రుకానా (రజి) ”ఔను దైవప్రవక్తా! దేవుని మీద ప్రమాణం చేసిమరీ చెబుతున్నాను. నేను నిజంగా ఒక తలాఖ్ ఉద్దేశ్యంతోనే విడాకులిచ్చాను” అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయనకు భార్యను తిరిగి దాంపత్యంలోకి తీసుకునే అనుమతిచ్చారు. (అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ, దార్మి- మిష్కాత్)



భార్యాభర్తలు విడిపోవడానికి గడువు కాలం నిర్ణయమయింది. ఆ గడువు లోపల విభేదాలు దూరంచేసుకోవడానికి, రాజీపడటానికి ప్రయత్నించాలి. ఇక పొసగదని తేలినప్పుడే గడువు (ఇద్దత్) ముగిసిన తరువాత మూడవసారి విడాకులిచ్చి భర్త తన భార్య నుండి విడిపోవలసి ఉంటుంది. భార్య రుతుస్రావం ఆగిపోయి స్నానంచేసిన తర్వాత అతనామెకు ఒకసారి తలాఖ్ ఇస్తున్నట్లు చెప్పాలి. తరువాత రెండవసారి రుతుస్రావం ఆగి స్నానం చేసిన పిదప రెండవసారి తలాఖ్ ఇవ్వాలి. ఆ తర్వాత మూడవ సారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసేవరకు వేచివుండాలి.

ఈ మూడు రుతుక్రమాల కాలాన్ని ఇద్దత్ (గడువు) అంటారు. ఈ గడువు దాటక ముందే (అంటే మొదటిసారి తలాఖ్ తరువాతగాని, లేదా రెండవసారి తలాఖ్ తరువాత గాని) భర్త విడాకుల ఉద్దేశ్యం మానుకుంటే యధాప్రకారం భార్యతో తిరిగి కాపురం చేయవచ్చు. ఒకవేళ గడువు దాటిపోతే (అంటే మూడవసారి రుతుస్రావం కల్గిన తర్వాత) వారిద్దరి వివాహం విచ్ఛేదమవుతుంది. అతను తన భార్యతో మళ్ళీ కాపురం చేయాలంటే ఆమెను కొత్తగా మరోసారి వివాహం (నికాహ్) చేసుకోవలసి ఉంటుంది. అయితే ఆమె మూడవసారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేశాక అతను మూడవసారి కూడా తలాఖ్ ఇస్తున్నానని ప్రకటిస్తే మాత్రం ఇక ఆమె అతనికి శాశ్వతంగా దూరమయిపోతుంది. పునర్వివాహానికి అవకాశం లేదు.

మూడువిడాకుల సమస్యగురించి చాలా వివరణఉంది. ఇక్కడ దాని ఔట్‌లైన్స్ మాత్రమే ఇవ్వబడుతున్నాయి. వివరణ కోరేవారు ఫిఖాగ్రంథాల్లో చూసుకోవచ్చు.

## రాజీ కుదుర్చడానికి పెద్దల ప్రయత్నం

ఇస్లాం దృష్టిలో దాంపత్యబంధం ఎంతో ముఖ్యమైన పవిత్రబంధం కనుక విభేదాలు వచ్చినప్పుడు అనాలోచితంగా దాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించ కూడదు. భార్యాభర్తల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరి ఉద్రిక్త వాతావరణం ఏర్పడినప్పుడు పెద్దలు వాటిని నివారించి వారి సంసారాన్ని చక్కబెట్టేందుకు శతవిధాల కృషి చేయాలి. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

“మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయమున్న స్త్రీలకు (నయాన భయాన) నచ్చజెప్పండి. (అలా దారికిరాకపోతే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ మీ మాట వినకపోతే) కొట్టండి. ఆ తరువాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచుకోండి.” (4:34)

“భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని భయముంటే భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని పెట్టుకోండి. వారిద్దరు కలసి పరిస్థితిని చక్కదిద్దదలచుకుంటే దేవుడు దంపతుల మధ్య సానుకూలత కలిగిస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు.” (4:35)

## రుతుకాలంలో విడాకులివ్వరాదు

స్త్రీకి విడాకులు ఎప్పుడు పడితే అప్పుడు ఇవ్వడానికి వీల్లేదు. స్త్రీ బహిష్టు అయి ఉన్నప్పుడు తలాఖ్ ఇవ్వకూడదు. రుతుస్రావం ఆగిపోయి ఆమె స్నానం చేసిన తరువాతే ఒకసారి తలాఖ్ ఇచ్చానని చెప్పాలి. అయితే అలా చెప్పిన తరువాత ఇక ఆమెతో ఏమాత్రం లైంగికసంబంధం పెట్టుకోకూడదు. ఈవిధంగా రెండవసారి కూడా రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తర్వాతే తలాఖ్ ఇవ్వాలి. ఈలోగా భార్యాభర్తలు రాజీపడటానికి ప్రయత్నించాలి. చివరి ప్రయత్నం కూడా ఫలించకపోతే మూడవసారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాత విడాకులిచ్చానని చెప్పి ఆమె నుండి శాశ్వతంగా వేరైపోవాలి.

రుతుకాలంలో సాధారణంగా స్త్రీలు చిరచిరలాడుతూ ఉద్దేశ్యరహితంగా విడాకులకు దారితీసే మాటలు పలకడానికి ఆస్కారముంది. ఇదొక వైద్య సంబంధమైన యదార్థం. అందువల్ల రుతుకాలంలో తలాఖ్ ఇవ్వడాన్ని ఇస్లాం వారించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) రుతుకాలంలో తన భార్యకు విడాకులిచ్చారు. దీన్ని గురించి ఆయన తండ్రి దైవప్రవక్త (సల్లం) దగ్గర ప్రస్తావిస్తే, ఆయన ఆగ్రహిస్తూ వెంటనే అతడ్ని ఉపసంహరించుకోమని ఆదేశించారు.

రుతుకాలంలో విడాకులిచ్చిన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)కు దైవప్రవక్త (సల్లం) ఇస్లాం ధర్మాన్ని ఎలా వివరించారో చూడండి:

"ఇబ్నె ఉమర్! నీవు సరైన పద్ధతి అవలంబించలేదు. సరైన పద్ధతి అంటే రుతుస్రావం ఆగిపోయి స్త్రీ స్నానం చేసేవరకు నీవు వేచివుండాలి. తర్వాత ప్రతి రుతుకాలం అనంతరం ఒక్కొక్క విడాకులివ్వాలి. మూడవసారి స్త్రీ పరిశుద్ధురాలైన తరువాత (చివరి సారిగా) విడాకులు ఇవ్వవచ్చు లేదా విడాకులివ్వకుండా (ఆ స్త్రీతోనే) సంసారం చేయవచ్చు."

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఈ మాటలు విని "నేనామెకు మూడు (సార్లు) విడాకు లిచ్చిన తరువాత ఉపసంహరించుకునే హక్కున్నదా నాకు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "లేదు. ఆమె వేరయిపోతుంది; ఇది పాపమవుతుంది" అన్నారు. (బైహఖి, తబ్రాని, దారుల్ ఖుత్ని)

ఈ విషయం గురించి హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)ని కొందరు అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పేవారు: "నీవు నీ భార్యకు ఒకటి లేదా రెండుసార్లు విడాకులివ్వడం జరిగితే, అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (సల్లం) నన్ను నా భార్యను తిరిగి దాంపత్యంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ నీవు మూడు తలాఖులు ఇస్తే ఇక నీభార్య మరో పురుషుడ్ని పెళ్ళాడనంతవరకు ఆమె నీకు నిషిద్ధమవుతుంది. (అంటే నీ నుండి వేరై పోతుంది.) పైగా నీవు పాపం చేసినవాడవు కూడా అవుతావు." (ముస్లిం)



## ఖుర్ఆన్ వెలుగులో విడాకుల విధానం

విడాకులకు సంబంధించిన ఇతర విషయాలు ఖుర్ఆన్ ఈవిధంగా పేర్కొన్నది:

"విడకులు ఇస్తున్నానని రెండుసార్లు మాత్రమే చెప్పాలి. ఆ తరువాత (నిర్ణయం మార్చుకుంటే) సముచిత రీతిలో (భార్యను) వివాహబంధంలో కొనసాగించాలి; లేదా (అంటే  నిర్ణయం మార్చుకోకపోతే విడాకులిస్తున్నానని మూడవసారి కూడా చెప్పేసి ఆమెను) ఉత్తమ రీతిలో వదిలేయాలి."

"అప్పుడు మీరామెకు (మహర్ లేదా ఇతర కానుకల రూపంలో) ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం మీకు ధర్మసమ్మతంకాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం."

"దంపతులిద్దరు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని భయపడినప్పుడు స్త్రీ తన భర్తకు ఏమైనా ఇచ్చి అతని నుండి వేరుపడదలచుకుంటే వారిద్దరి మధ్య ఏదైనా ఒప్పందం కుదరడంలో తప్పు లేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వాటిని అతిక్రమించకండి. దైవపరిమితుల్ని అతిక్రమించేవారే దుర్మార్గులు." (ఖుర్ఆన్–2:229)

"(మూడవసారి కూడా) విడాకులిస్తే, ఇక ఆ స్త్రీని దాంపత్యంలోకి తీసుకోడం అతనికి ధర్మం కాదు, ఆమె మరోవ్యక్తిని వివాహమాడి అతనామెకు విడాకులిస్తే తప్ప. ఒకవేళ మొదటి భర్త, ఈ స్త్రీ, ఇద్దరూ తాము దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండగలమనుకుంటే (ఇలా) వారు పరస్పరం తిరిగి ఏకమవడంలో తప్పులేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వీటిని ఆయన విజ్ఞులకోసం వివరిస్తున్నాడు." (ఖురాన్–2:230)

"మీరు స్త్రీలకు (రెండుసార్లు) విడాకులిచ్చిన సందర్భంలో వారి గడువు పూర్తికావస్తున్నప్పుడు వారిని సక్రమంగా (మీ ఇంట) ఉండనివ్వండి. లేదా (మూడవసారి కూడా విడాకులిస్తున్నట్లు ప్రకటించి) సహృదయంతో సాగనంపండి. అంతేగాని, చీటికి మాటికి వేధిస్తూ అన్యాయం తలపెట్టే ఉద్దేశ్యంతో వారిని ఆపి ఉంచకండి. ఇలా ప్రవర్తించేవాడు నిజానికి తనకుతానే అన్యాయం చేసుకుంటున్నాడు."

"దేవుని ఆజ్ఞల్ని నవ్వులాటగా చేసుకోకండి. ఆయన మీకు ప్రసాదించిన మహా భాగ్యాలను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. మీ శ్రేయస్సు కోసం అవతరింపజేసిన దివ్య గ్రంథాన్ని, (అందులోని) వివేకవంతమైన విషయాలను గౌరవించడం నేర్చుకోవలసిందిగా ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు. (ప్రతి విషయంలోనూ) దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన సర్వం ఎరిగినవాడని తెలుసుకోండి." (2:231)

## "రజయీ తలాఖ్" విధానం

పురుషుడు తన భార్యకు విడాకులిస్తున్నానని ఒకసారి చెప్పినా, రెండుసార్లు చెప్పినా, మూడుసార్లు చెప్పినా అది ఇద్దత్ (మూడు రుతుకాలాల గడువు) దాటిన

తరువాతే అమల్లోకి వస్తుంది. ఈ గడువుకాలంలో అతను ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోకూడదు.

భర్త ఒకటి లేక రెండుసార్లు తలాఖ్ ఇచ్చినట్లు స్పష్టంగా చెప్పిన తర్వాత గడువు లోపే పశ్చాత్తాపంచెంది తన భార్యతో దాంపత్యజీవితం కొనసాగదలచుకుంటే అలా చేయవచ్చు. అలాంటి పరిస్థితిలో భర్త తన భార్యను మళ్ళీ దాంపత్యంలోకి తీసుకోవ డానికి ఆమె అనుమతి అవసరం లేదు. ఆమెను మళ్ళీ వివాహం కూడా చేసుకోనవ సరం లేదు. అంటే ఆమెను నికాహ్ చేసుకోకుండానే పరిగ్రహించవచ్చు. ఇలాంటి తలాఖ్‌ను "రజయీ తలాఖ్" అంటారు. ఖుర్‌ఆన్‌లోని ఈసూక్తి చూడండి:

"వారి భర్తలు గనక పూర్వసంబంధాలను పునరుద్ధరించుకోదలిస్తే ఈ గడువులోగా తమ భార్యల్ని తిరిగి దాంపత్యంలోకి తీసుకునేందుకు వారికి పూర్తి హక్కుంది." (2:228)

## "బాయిన్ తలాఖ్" విధానం

పురుషుడు స్పష్టమైన పదాలలో ఒకటి లేక రెండుసార్లు తలాఖ్ ఇచ్చినట్లు చెప్పిన తర్వాత మూడు రుతుకాలాల గడువు గడచిపోయినా అతను తన భార్యను పరిగ్రహించ కపోతే దాన్ని "బాయిన్ తలాఖ్" అంటారు. బాయిన్ తలాఖ్‌లో వివాహబంధం పూర్తిగా తెగిపోతుంది. ఇలా వివాహబంధాన్ని తెంచేసే విడాకుల్ని **"బిత్తా తలాఖ్"** అని కూడా అంటారు. బిత్తా అంటే అరబీలో అనేక అర్థాలున్నాయి. వాటిలో ఒకటి "తెంచివేయడం" అనే అర్థం కూడా ఉంది. ఇలాంటి తలాఖ్ ఇచ్చిన పక్షంలో కొన్నాళ్ళకు అతను తన భార్యను తిరిగి దాంపత్యంలోకి తీసుకోదలచుకుంటే కొత్తగా ఆమెను మళ్ళీ నికాహ్ (వివాహం) చేసుకోవలసి ఉంటుంది. అదైనా భార్య ఇష్టపడితేనే చేసుకోగల్గుతాడు.

అందువల్ల పురుషుడు ఒకటికి నాలుగు సార్లు బాగా ఆలోచించి విడాకులివ్వాలి. దాని కోసం పురుషుడు తన భార్యకు మూడు రుతుకాలాలలో మూడుసార్లు విడాకు లిస్తున్నానని చెప్పాలి. అంతేగాని ఏకకాలంలో అంటే ఒకేసారి మూడుసార్లు విడాకు లిస్తున్నానని కూడా చెప్పకూడదు.

గడువు (ఇద్దత్) లోపు పురుషుడు భార్యకు ఒకసారి విడాకులిస్తున్నానని చెప్పినంత మాత్రాన భార్యాభర్తలు శాశ్వతంగా విడిపోలేరు. అయితే మూడు రుతుకాలాల గడువు గడవక ముందే అతను తిరిగి తన భార్యతో సంసారం కొనసాగించవచ్చు. మూడు రుతుకాలాల గడువు (ఇద్దత్) గడచిపోయిన తరువాత విడాకులిస్తున్నానని మొదట చెప్పిన ఒకసారికే అది విడాకులకు దారితీస్తుంది.

తలాఖ్ (విడాకులు) సూరాలోని "మీరు మీ స్త్రీలకు విడాకులివ్వదలిస్తే వారి గడువు (ఆరంభం)లో విడాకులివ్వండి" (65:1) అనే సూక్తిపై హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "విడాకులు బహిష్టు కాలంలో ఇవ్వకూడదు. అలాగే రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాత ఆమెతో భర్త సంభోగించిన



పక్షంలో కూడా విడాకులివ్వకూడదు. ఈ రెండు పరిస్థితులు తప్పించి ఆమె రుతుస్రావం ఆగి స్నానం చేసిన తర్వాత ఒకసారి తలాఖ్ ఇవ్వాలి. ఆ విధంగా ఒకసారి తలాఖ్ ఇచ్చిన తరువాత "ఇద్దత్" గడువు ముగిసేదాకా అతనామెను తిరిగి దాంపత్యంలోకి తీసుకోకపోతే ఆ ఒక్కసారి ఇచ్చిన తలాఖ్‌కే ఆమె వేరయిపోతుంది." (ఇబ్నెజరీర్)

## "ముగల్లా తలాఖ్" విధానం

ఒకేసారి మూడు తలాఖులిస్తే మూడురుతుకాలాల గడువు దాటాక దాంపత్య బంధం తెగిపోతుంది. కాని ఇది షరీఅత్ ఆశయాన్నే కాలరాసే దుష్టచర్య అవుతుంది. అంతేకాదు, దైవాగ్రహానికి గురయ్యే పాపకార్యం కూడా అవుతుంది. ఇలాంటి అజ్ఞాన వైఖరి వల్లనే ఇస్లామీయ విడాకుల పద్ధతిని ప్రత్యర్థులు ఎద్దేవా చేయగల్గుతున్నారు. నిజానికి ఇది వ్యక్తుల అజ్ఞానం, బలహీనతలేగాని, ఇస్లాం లోపం ఎంతమాత్రం కాదు.

ఒకతను తన భార్యకు ఏక కాలంలో మూడుసార్లు విడాకులిచ్చాడు. కొందరు అతని విషయం ఏమిటని హజ్రత్ ఉమర్ (రజి)ని అడిగితే, ఆయన జవాబిస్తూ "అతను తన ప్రభువాజ్ఞను ధిక్కరించాడు" అని అన్నారు.

విడాకులు ఇవ్వదలచిన వ్యక్తి మొదటి రుతుకాలం గడచిన తరువాత ఒకసారి విడాకులు ఇవ్వాలి. మళ్ళీ రుతుకాలం తరువాతనే రెండవసారి విడాకులు ఇవ్వాలి. ఆ తరువాత మూడవ రుతుకాలం వరకు వేచిఉండాలి. ఈలోపుగా భార్య తన సత్ప్రవ ర్తనతో భర్తను మెప్పించి విడాకులు ఉపసంహరింప జేయించుకునేందుకు అవకాశం ఉంటుంది. లేదా భర్తే ఒకటికి నాల్గుసార్లు ఆలోచించి, భార్య విషయంలో ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని సరిదిద్దుకొని మూడోసారి విడాకులివ్వకుండా యథాప్రకారం భార్యతో కాపురం చేయవచ్చు. మూడవ రుతుకాలం వరక్కూడా భార్యాభర్తల మధ్య పొంతన కుదరని పక్షంలో మూడో రుతుకాలం ముగిశాక మూడవసారి విడాకులిచ్చి శాశ్వతంగా భార్యను వేరుచేయాలి. ఇలాంటి తలాఖ్‌ను "ముగల్లా తలాఖ్" అంటారు.

మూడుసార్లు విడాకులిచ్చిన తరువాత ఆ స్త్రీని తిరిగి చేపట్టడానికి పురుషునికి అవకాశం లేదు. అప్పుడతను పశ్చాత్తాపం పడినా ప్రయోజనం లేదు. ఒకవేళ తానే తప్పు చేశానని, తన భార్య ఎలాంటి పాపం ఎరగదని బాధపడుతూ ఆమెనే తిరిగి వివాహమాడదలిస్తే ఇస్లాం ఒక షరతుతో ఒక విచిత్రమార్గం చూపిస్తుంది. వివాహ విచ్ఛేదం గావించబడిన ఆ స్త్రీని మరొక పురుషుడు వివాహమాడి అతనామెతో సంభోగించి విడాకులిస్తే ఇతను (తొలి భర్త) ఆమెను మళ్ళీ వివాహం చేసుకోవచ్చు.

## దొడ్డిదారితో ఆత్మద్రోహం చేసుకోకండి

కొంతమంది ఈ షరతు నుంచి తప్పించుకోవడానికి, ఆ స్త్రీని రెండవ పురుషునితో నామమాత్రపు వివాహం జరిపించి దాంపత్య ప్రక్రియ జరగనీయకుండానే ఆమెను విడాకు లిప్పించి మొదటి భర్తతో పెళ్ళి చేయిస్తున్నారు. ఇది చాలా విచారకరమైన

విషయం, అక్రమపద్ధతి. షరీఅత్ స్వభావానికే విరుద్ధం. దీనికి దాంపత్య ప్రక్రియలేని వివాహం సరిపోదు. రెండవ పురుషుడు ఆ స్త్రీ దగ్గర దాంపత్యసుఖం అనుభవించనంత వరకు ఆమె మొదటి భర్తకు ధర్మపత్ని కాజాలదని దైవప్రవక్త (స) స్పష్టంగా చెప్పేశారు.

ఒకతను తన భార్యకు విడాకులిస్తే ఆమె మరొక వ్యక్తిని వివాహమాడింది. కాని అతను కూడా విడాకులివ్వడంతో ఈ విషయాన్ని కొందరు దైవప్రవక్త (సల్లం) దృష్టికి తెచ్చి "ఆ స్త్రీ తన మొదటి భర్తను తిరిగి వివాహమాడటం ధర్మసమ్మతమేనా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "కాదు. ఆమె మొదటి భర్తలా ఈ భర్త కూడా ఆమెను అనుభవించనంత వరకు ఆమె తిరిగి అతడ్ని వివాహమాడటం ధర్మసమ్మతం కాదు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: హజ్రత్ రిఫా ఖుర్జీ (రజి) గారి మాజీభార్య ఓరోజు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను రిఫా (రజి)గారి మాజీభార్యను. ఆయన నాకు మూడు విడాకులు ఇచ్చేశారు. ఆ తరువాత నేను అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్ (రజి)ని వివాహమాడాను. కాని ఏం లాభం? ఆయనగారి దగ్గర గుడ్డకుచ్చు లాంటి వస్తువు తప్ప మరెలాంటి విలువైన వస్తువు లేదు" అని అన్నది. దైవప్రవక్త (స) ఈ మాటలు విని చిరునవ్వు నవ్వుతూ "అయితే నువ్వు మళ్ళీ రిఫా దగ్గరికి పోవాలనుకుంటున్నావా? కాని నువ్వు అబ్దుర్రహ్మాన్‌ని, అబ్దుర్రహ్మాన్ నిన్ను ఆస్వాదించనంతవరకు ఇది సాధ్యం కాదు" అని చెప్పారు. (ముత్తఫఖున్ అలై)

## విడాకుల తరువాత మహర్ సమస్య

స్త్రీకి మహర్ చెల్లింపు పురుషుని బాధ్యత. దాన్ని తప్పనిసరిగా చెల్లించాలి.

"మీరు మీభార్యలను కలుసుకోవడానికి ముందు వారి మహర్ నిర్ణయంకాని పక్షంలో వారికి విడాకులిస్తే తప్పులేదు. అలాంటి స్థితిలో వారికి ఎంతో కొంత (సొమ్ము) తప్పనిసరిగా ముట్టజెప్పాలి. ధనికుడైనా, పేదవాడైనా తన శక్తిమేరకు తగిన రీతిలో దీన్ని అందజేయాలి. **ఇది సత్పురుషులు నెరవేర్చవలసిన విధి.**" (ఖుర్ఆన్-2:236)

"మీరు మీభార్యలను కలుసుకోడానికి ముందే వారికి విడాకులు ఇవ్వవలసివస్తే, నిర్ణీతమహర్‌లో సగం సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. అయితే స్త్రీ మృదువైఖరి అవలంబించి (మహర్ తీసుకోకపోయి)తే, లేదా వివాహబంధం తన అధీనంలో వున్న పురుషుడు మృదువైఖరి అవలంబించి (మహర్ పూర్తిగా ఇచ్చివేసి)తే అది వేరేవిషయం. మీరే (అంటే పురుషులే) సహృదయంతో మీ హక్కును వదలుకుంటే మరీ మంచిది. ఇది దైవభీతికి చాలా దగ్గరిమార్గం. పరస్పరం ఉదారస్వభావంతో మసలుకోవడం మరచిపోకండి. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు." (ఖుర్ఆన్-2:237)

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలను వివాహమాడిన తరువాత వారిని తాకక ముందే మీరు వారికి విడాకులివ్వడం జరిగితే, వారిని గడువుకాలం పూర్తిచేయమని



అడిగే అధికారం మీకేమాత్రం లేదు. వారికి ఎంతో కొంత ధనమిచ్చి సహృదయంతో సాగనంపండి." (ఖుర్ఆన్-33:49)

## తలాఖ్ ఇవ్వడానికి నాలుగు విధాలు

మహర్‌ని బట్టి, దాంపత్య సుఖాన్ని బట్టి తలాఖ్ నాలుగు విధాలుగా ఉంది:

(1) నికాహ్(వివాహం) సందర్భంలో మహర్ ధనం నిర్ణయించబడకుండా ఉండి, భార్యతో కలవక ముందే ఆమెకు తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:236)

(2) నికాహ్ సందర్భంలో మహర్ ధనం నిర్ణయించబడి ఉండి, భార్యతో కలవక ముందే ఆమెకు తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:237)

(3) మహర్‌ధనం నిర్ణయించబడి ఉండి, భార్యతో కలవడం కూడా జరిగిపోయిన తరువాత తలాఖ్ ఇవ్వడం. (ఖుర్ఆన్-2:229)

(4) మహర్ ధనం నిర్ణయించబడకుండా ఉండి, భార్యతో కలవడం జరిగిపోయిన తరువాత తలాఖ్ ఇవ్వడం.

## విడాకులకు ముందు పాటించాల్సిన నిబంధనలు

తలాఖ్ ఇవ్వడానికి ఈ క్రింది నిబంధనలు కూడా పాటించాలి:

(1) తలాఖ్ ఇచ్చే వ్యక్తి చైతన్యవంతుడై ఉండాలి. "అపస్మారక స్థితిలో ఉన్నవాడు, బుద్ధీజ్ఞానాలు సవ్యంగా లేనివాడు ఇచ్చే తలాఖ్ తప్ప ప్రతి (మనిషి ఇచ్చే) తలాఖ్ ధర్మసమ్మతమే" అని దైవప్రవక్త (సల్లం) అన్నారు. (తిర్మిజి)

(2) తలాఖ్ ఇచ్చే వ్యక్తి తన ఇష్ట ప్రకారమే తలాఖ్ ఇవ్వాలి. ఇతరుల బలవంతంతో తలాఖ్ ఇస్తే అది నెరవేరదు. (అంటే చట్టం ప్రకారం భార్య వేరుకాదు.)

(3) తలాఖ్ ఇచ్చే వ్యక్తి వయోజనుడయి ఉండాలి. యుక్తవయస్సు రాని పిల్లలు తలాఖ్ ఇస్తే నెరవేరదు.

"ముగ్గురు వ్యక్తులను (పరలోకంలో) విచారించడం జరగదని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. ఒకడు, నిద్రపోయేవాడు మేల్కొనంతవరకు. రెండోవాడు, బాలుడు యుక్తవయస్సుకు రానంతవరకు. మూడోవాడు, బుద్ధీజ్ఞానాలు మందగించినవాడు స్పృహలోకి రానంతవరకు." (ఇబ్నెమాజ)

(4) రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాతనే స్త్రీకి తలాఖ్ ఇవ్వాలి.

(5) **తలాఖ్ ఇవ్వడానికి కనీసం ఇద్దరు ముస్లిం పురుషులు సాక్షులుగా ఉండాలి.** ఇద్దరి సాక్ష్యం లేకుండా తలాఖ్ సరికాదు. ("మీలో న్యాయం పాటించే ఇద్దర్ని సాక్షులుగా పెట్టుకోండి. (వారు) దేవునికోసం ఉన్నదిఉన్నట్లు సరిగ్గా సాక్ష్యమివ్వాలి."(ఖుర్ఆన్-65:2)

సాధారణంగా దంపతుల మధ్య పరస్పర అవగాహన, ప్రేమానురాగాలలో ఏదైనా లోపం కలిగినప్పుడే తలాఖ్ సమస్య వచ్చిపడుతుంది. అయితే భార్యభర్తలిద్దరూ ఎలాంటి కీచులాటలు లేకుండా అన్యోన్యంగా సంసారం సాగిస్తున్నప్పటికీ వారిలో ఎవరైనా ధార్మిక, నైతిక విలువల్ని కాలరాస్తుంటే వారి తల్లిదండ్రులకు వారిని విడదీసే హక్కుంది. ఓసారి గతంలోకి తొంగిచూడండి. ఇంకా లోపలికి పోయి చూడండి. ఇంకా....

## ఆ మహాతల్లి చేతిచలువే అలాంటిది!

అది ఈ మధ్యనే కొత్తగా వెలసిన గ్రామం. చుట్టూ కొండలు, గుట్టలు, ఇసుక తిన్నెలు, అక్కడక్కడ కొన్ని చెట్లతో ప్రకృతిఒడిలో ప్రశాంతంగా కూర్చున్నట్లుందా ఊరు.

ఆ ఊరు మొత్తానికి ఒకే ఒక ఊటబావి ఉంది. దాని పక్కనే ఓ చిన్న కుటీరం ఉంది. ఆఇంట్లో నివసించే వృద్ధమహిళ, ఆమె కొడుకు అంటే ఆ ఊరి ప్రజలకు ఎనలేని అభిమానం, అమితమైన గౌరవం. అందుకే నీటి కోసం ఆ బావికి వచ్చే జనం ఆ తల్లీ, కొడుకుల్ని ఎంతో అప్యాయంగా పలకరించి యోగక్షేమాలు విచారించేవారు.

కాని వృద్ధురాలు ఓరోజు హఠాత్తుగా కొడుకుని ఏకాకిచేసి దైవసన్నిధికి వెళ్ళి పోయింది. ఆరోజు యావత్తు గ్రామస్తులపై విషాదఛాయలు అలుముకున్నాయి. తాము ఎంతగానో అభిమానించే ఆ మహాతల్లి పోయినందుకు కంటతడి పెట్టనివారు లేరు.

ఆమె చనిపోయేనాటికి కొడుకు వయస్సు పదిహేనేండ్లే. తల్లిమరణంతో ఆ అబ్బాయి హృదయం తల్లడిల్లి పోయింది. గ్రామస్తులు అతణ్ని ఓదార్చారు. కాని ఎంత మంది ఎంత సానుభూతి కురిపించినా తల్లిలేని లోటును ఎవరు తీర్చగల్గుతారు?

తల్లి పోయిన తర్వాత ఆ అబ్బాయికి ఇక ఆ ఊళ్ళో ఉండటానికి మనస్కరించ లేదు. కొన్నాళ్ళ తర్వాత ఆఊరు వదలి మరేదైనా ఊరికి పోయి ఉందామని నిర్ణయించు కున్నాడు. అతని నిర్ణయం తెలియగానే ప్రజలు చాలా కలవరపడ్డారు. తక్షణమే ఊరి పెద్దలు నూనూగు మీసాల ఆ నవయువకుని దగ్గరకు పరుగెత్తారు. తమను వదలి పోవద్దని ఎంతగానో బ్రతిమాలారు. చివరికి గ్రామస్తులు చూపుతున్న ఆదరాభిమానాలు కాదనలేక ఆ యువకుడు పెద్దల అభ్యర్థనను మన్నించాడు.

తరువాత గ్రామస్తులంతా కలసి ఆ యువకునికి ఓ అమ్మాయినిచ్చి పెళ్ళిచేశారు. దాంతో అతనికి కాస్తంత మనశ్శాంతి లభించింది.

## తండ్రి పరోక్ష సలహాతో కొడుకు తలాఖ్

రోజులు గడచిపోతున్నాయి. సంసారం సవ్యంగానే సాగిపోతోంది. కాని ఇంటి ఆర్థిక పరిస్థితి పట్ల అతని భార్య లోలోన అసంతృప్తి చెందుతోంది. భార్య కోరికలు తీర్చలేని భర్త అన్న భావన ఆమెలో నానాటికి బలపడసాగింది. పైగా సంపాదన కోసం భర్త ఉదయం పోతే చీకటిపడ్డాకే ఇంటికి చేరుకుంటాడు. అలాంటి భర్తతో ఇలా ఎంత కాలమని....?



ఇలా ఆలోచిస్తుంటే ఓరోజు ఆ ఇంటిముందు ఒంటెపై ఓ కొత్త వ్యక్తి వచ్చి ఆగాడు. అతనొక బాటసారి. తల, గడ్డం పూర్తిగా నెరసిన పండుముసలి. అతనికి ఆ ఊరితో ప్రగాఢ సంబంధం ఉన్నట్లుంది. ఊళ్ళో ప్రవేశించగానే జనం ఆయన్ని చుట్టుముట్టి క్షేమసమాచారాలు అడిగారు. ఆ తరువాత తామెంతో అభిమానిస్తున్న ఆ మహాతల్లి తమల్ని శాశ్వతంగా వీడిపోయిందని చెప్పుకున్నారు. ఈ విషాదవార్త విని ఆ వృద్ధుడు కూడా విచారం వ్యక్తపరిచాడు.

అతను ఒంటె మీద నుంచి దిగకుండానే, ఇంట్లోవారిని పిలిచాడు. కొత్త కంఠం విని ఆ యువతి బయటికొచ్చింది. ఈ ఇంట్లో ఉండే ముసలమ్మ చనిపోయిందటగా, ఎప్పుడు చనిపోయింది, ఎలా చనిపోయింది అని అడిగాడు ఆ కొత్త వ్యక్తి. యువతి వివరంగా అన్ని విషయాలు చెప్పింది.

"మరి నీ భర్త ఏడమ్మా, ఎక్కడికి పోయాడు? అతణ్ని కలుసుకోవడానికి వచ్చేనే నేను!" అన్నాడు బాటసారి.

యువతి భర్త సంగతి తెలియజేస్తూ అతనిపై ఉన్న తన అసంతృప్తిని కూడ వెళ్ళ బోసుకుంది. "ఏం చెప్పమంటారు ఆయనగారి సంగతి! ఆయన సంపాదనా మార్గం అడవికి పోయి కట్టెలు కొట్టి తేవడం తప్ప మరో పని చేయరు. దాని మీదే పూట గడుస్తోంది. పొద్దున పోతే చీకటిపడితేగాని కొంపకు చేరుకోడు. రేయింబవళ్ళు అక్కడే గడుపుతాడు. అందుకే ఆయన ఇప్పుడు ఇంట్లో లేరు."

ఈమాటలు వినగానే బాటసారికి ఆమె మనస్తత్వం తెలిసిపోయింది. భర్త పట్ల అసంతృప్తిగా ఉందని, అతనికి విధేయురాలిగా ఉండటంలేదని ఆయన గ్రహించాడు.

"సరేనమ్మా! ఇక నేను వెళ్తాను. నీ భర్త రాగానే నేను సలాం చెప్పానని చెప్పు. అంతా బాగానే ఉందికాని, ఈఇంటి గడప బాగాలేదు. దాన్ని మార్చేయమని నీ భర్తకు చెప్పు" అని ఆ వృద్ధుడు మళ్ళీ వచ్చిన దారే వెళ్ళిపోయాడు.

చీకటి పడింది. యువకుడు వేట నుండి తిరిగొచ్చాడు.

"ఏమండీ! ఈరోజు మీ కోసం ఎవరో ఒక ముసలాయన వచ్చాడు. తల, గడ్డం పూర్తిగా తెల్లబడి ఉంది. ఒంటె మీద నుంచి దిగకుండానే మిమ్మల్ని, మీ అమ్మను గురించి పరిస్థితులు అడిగి వెళ్ళిపోయాడు. వెళ్తూవెళ్తూ ఈ ఇంటిగడప బాగాలేదు, దాన్ని వెంటనే మార్చమని నీ భర్తకు చెప్పమని అన్నాడండీ!" అన్నది అతని భార్య.

"అలాగానే! ఆ వృద్ధుడు ఎవరో కాదు, మా నాన్నే. ఆయనకు నచ్చని నా ఇంటి గడప నువ్వే. ఇక నువ్వు నా ఇంట్లో ఉండటానికి యోగ్యురాలివి కావు. వెళ్ళిపో, నీకు విడాకులిస్తున్నాను" అన్నాడు యువకుడు.

దాంతో ఆమెకు నిషా దిగిపోయింది. కాని నిషా దిగిన తర్వాత చూస్తే ఏముంది? విడాకులు! **భర్తను దూరం చేసుకున్న బతుకుభారం!!** ప్చ్! పరిస్థితి చేజారిపోయింది!!

ఆ తర్వాత ఆ యువకుడు మరో యువతిని చేసుకున్నాడు. ఈమె చాలా సుగుణ వతి. ఉన్న దాంతోనే తృప్తిపడుతూ భర్త పట్ల వినయవిధేయతలతో ఉండసాగింది.

## మామ మెచ్చిన కోడలు

అతని సంసారం ఇప్పుడు ఎలాంటి అపశృతులు లేకుండా సాఫీగా, సుఖంగా సాగిపోతోంది. అంతటి శీలవతి అయిన భార్య దొరికినందుకు నిజంగా ఆ యువకుడు ఎంతో అదృష్టవంతుడని చెప్పాలి. అపశృతులులేని సంసారచక్రం సహజంగానే చకచకా తిరుగుతుంది. చూస్తుండగానే మరో వసంతం ఇట్టే దొర్లిపోయింది.

ఆ బాటసారి మళ్ళీ వచ్చాడు. ఊళ్ళో విశేషాలు తెలుసుకుంటూ ఆ యువకుని ఇంటి ముందు మళ్ళీ ఆగాడు. ఈసారయినా ఆ యువకుడ్ని కలుసుకుంటానన్న ఆశతో ఇంట్లోకి కేక వేశాడు. కాని అదేమిటోగాని ఈసారి కూడా ఆ యువకుడు ఇంట్లో లేడు. రెండు క్షణాల తరువాత ఇంట్లో నుంచి బయటికి వస్తున్న ఓ కొత్త ముఖాన్ని చూశాడు. బహుశా ఈమె అతని రెండో భార్య కాబోలు అనుకున్నాడు.

"ఏమ్మా! నీ భర్త ఇంట్లో లేడా? ఆయన్ని కలుసుకోవడానికి వచ్చాను" అన్నాడు వృద్ధ బాటసారి ఒంటె మీద కూర్చొనే.

"లేరండీ! ఈ సమయంలో ఆయన ఇంటి పట్టున ఉంటే బాగుండేది. మీలాంటి మహాత్ముల్ని కలుసుకునే భాగ్యం లభించేది. సరే చెప్పండి. నేను మీకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను"అంటూ యువతి వృద్ధఅతిథి పట్ల ఎంతో గౌరవమర్యాదలు చూపింది.

అంతేకాదు, తొందరతొందరగా లోపలికెళ్ళి భోజనం పట్టుకొచ్చి ఇచ్చింది. వృద్ధుడు ఒంటెమీద కూర్చొనే ఆమె అందించిన భోజనం తీసుకొని తిన్నాడు. ఆమె మళ్ళీ లోపలి కెళ్ళి చల్లని మంచినీళ్ళు తెచ్చింది. వృద్ధుడు ఆ నీళ్ళు తాగి సంతోషిస్తూ అమితమైన వాత్సల్యంతో ఆమె వంక చూశాడు. నిండుహృదయంతో ఆమెను ఆశీర్వదించాడు.

"మహానుభావా! ఎంత దూరం నుంచి వచ్చారో ప్రయాణం వల్ల మీ తల, గడ్డం మాసిపోయి ఉన్నాయి. మీరిష్టపడితే కడిగి శుభ్రంచేస్తాను" అన్నది యువతి వినయంగా.

"సరే అలాగే కడుగు తల్లీ!" అంటూ వృద్ధుడు ఒంటె మీద నుంచి దిగకుండానే తల కిందికి వంచాడు.

యువతి లోపలికెళ్ళి నీళ్ళుతెచ్చింది. అతని తల, గడ్డం శుభ్రంగా కడిగి తువాలుతో తుడిచింది. మళ్ళీ ఇంట్లోకెళ్ళి నూనె తెచ్చి రాసింది. దువ్వెనతో అతని తల, గడ్డం దువ్వి వెండ్రుకల్ని సరిచేసింది. దీనివల్ల వృద్ధుడికి ఎంతో హాయి కలిగింది. ప్రయాణ బడలిక తీరినట్లు అన్పించింది. ఆ తర్వాత అతను ఇంటి పరిస్థితులు అడుగుతూ-

"అమ్మాయ్! ఇంట్లో జరుగుబాటు ఎలా ఉంది? నీ భర్త తెచ్చే సంపాదన సరి పోతుందా?" అని అడిగాడు.



"దేవుని దయవల్ల అంతా సవ్యంగానే గడచిపోతుందండీ! ఎలాంటి లోటు లేదు. దేవుడు మాకు మంచి ధర్మసంపాదనే ప్రసాదిస్తున్నాడు. మా ఆయన వేటాడి తెచ్చిన దాంతో మాకు సుఖంగా గడచిపోతోంది. ఇతరులకంటే మేమెంతో హాయిగా బతుకు తున్నాం. అంతా ఆ పైవాడి దయ" అన్నది యువతి సంతృప్తి వెలిబుచ్చుతూ.

ఈ మాటలు విని వృద్ధుడు చాలా సంతోషించాడు. "ఇక నేను సెలవు తీసుకుంటా నమ్మా! నీ పెనిమిటి వచ్చాక ఆయనకు నా సలాం చెప్పు. తరువాత ఈ ఇంటిగడప ఎంతో బాగుంది, నా అభిమతానికి అనుగుణంగా ఉందని చెప్పు. దానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కనిపెట్టుకొని ఉండమని చెప్పు" అన్నాడు వృద్ధుడు.

ఈ మాటలు చెప్పి అతను వెళ్ళిపోయాడు. అతను పోయిన తరువాత సాయంత్రం ఆ యువతి భర్త వేట నుంచి తిరిగొచ్చాడు. రాగానే ఆమె వృద్ధ అతిథిని గురించి చెప్పింది. అతనికి తాను చేసిన గౌరవమర్యాదలు, సేవాశుశ్రూషలు తెలిపింది. ఆ తరువాత ఇలా అన్నది:

"మరండీ! ఆ మహానుభావుడు పోతూ పోతూ మనింటి గడప ఎంతో బాగుందని, తనకిష్టమయిన రీతిలో ఉందని అన్నాడు. దీనికి నష్టం కలగకుండా జాగ్రత్తగా కాపాడు కోవాలని మీకు చెప్పమని తాకీదు చేసి మరీ పోయాడండీ!"

ఈసంగతి విని యువకుడు పరమానందభరితుడయ్యాడు.

"ఇంతకు ఆ మహాత్ముడు ఎవరనుకున్నావు? మా నాన్నగారే! దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహి). నువ్వు చాలా అదృష్టవంతురాలివి. ఆయన మెచ్చుకున్న గడపంటే అర్థం నువ్వే. నువ్వు నా పేదరికపు స్థితిలో కూడా నాపట్ల సంతృప్తిగా, విశ్వాసపాత్రు రాలిగా ఉన్నావు. దేవునికి, ఆయన ప్రవక్తకు కూడా ప్రీతిపాత్రురాలివయి పరలోకంలో సుఖసంతోషాలతో ఉంటావు" అన్నారు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి).

విన్నారు కదా! వినయవతుడయిన కొడుకు పరోక్షంగా తండ్రి ఇచ్చిన సలహాను తక్షణమే అమలుపరిచాడు.

హజ్రత్ ఉమర్ (రజి) కుమారుడు అబ్దుల్లా (రజి)కు ఒక భార్య ఉండేది. ఆమెను ఆయన ఎంతో ప్రేమిస్తుండేవారు. కాని హజ్రత్ ఉమర్ (ర)కు ఆమె చేసే కొన్ని చేష్టలు నచ్చేవికావు. అందువల్ల ఆమెకు విడాకులివ్వమని కొడుకును ఆదేశించారు ఆయన. కాని కొడుకు అబ్దుల్లా (రజి) అందుకు నిరాకరించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అబ్దుల్లా! నీ భార్యకు విడాకులిచ్చేయి" అని ఆజ్ఞాపించారు. (తిర్మిజి)

హజ్రత్ అబూదర్దా (రజి) దగ్గరకు ఒకతను వచ్చి "నా తల్లి నా భార్యకు విడాకు లిచ్చేయమని నన్ను వత్తిడి చేస్తోంది. దీనికి మీ సలహా ఏమిటో చెప్పండి" అని అన్నాడు. దానికి హజ్రత్ అబూదర్దా (రజి) సమాధానమిస్తూ "నేను దైవప్రవక్త (సల్లం) నోట

విన్న మాటనే నీకు చెబుతాను. 'తల్లిదండ్రులు స్వర్గద్వారాలలో మధ్య ఉండే ద్వారాలు వంటివారు' అని ప్రవచించారాయన. ఇప్పుడు నీఇష్టం, ఆ ద్వారాల్ని కాపాడుకుంటావో లేక నాశనం చేసుకుంటావో నీవే నిర్ణయించుకో" అని అన్నారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లం) ప్రవచనం విని తన భార్యకు విడాకులిచ్చేశాడు. (తిర్మిజి)

దైవప్రవక్త (సల్లం) బోధించిన మరో హితోక్తి కూడా ఇక్కడ ఎంతో గమనార్హమైనది. ఆయనిలా అన్నారు: "భార్య దుర్నడతగల స్త్రీ అని తెలిసి కూడా విడాకులు ఇవ్వకుండా ఆమెను అలాగే దగ్గర పెట్టుకునేవాడు స్వర్గంలో ప్రవేశించడు." (అహ్మద్)

## 26. "ఖులా" (స్త్రీలిచ్చే విడాకులు)

ఇస్లాం పరిభాషలో పురుషుడు స్త్రీకి ఇచ్చే విడాకుల్ని "తలాఖ్" అని, స్త్రీ పురుషుని కిచ్చే విడాకుల్ని "ఖులా" అని అంటారు. ఖులా అంటే వదిలేయడం, విడిపోవడం, వేరుపడటం అనే అర్థాలు ఉన్నాయి. షరీఅత్ పరిభాషలో ఖులా అంటే స్త్రీ తన భర్తను వదిలేయడం లేక తన భర్త నుండి వేరుపడటం" అని అర్థం. విడాకుల విషయంలో పురుషునికి ఎంత అధికారం ఉందో స్త్రీకి కూడా అంతే అధికారం ఉంది. అయితే భార్య ఇచ్చేసిన విడాకుల్ని భర్త ఆమోదించవలసి ఉంటుంది.

"సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు శక్తిమంతుడు, వివేచనాపరుడు." (ఖుర్ఆన్-2:228)

### తలాఖ్ విడాకులకు, ఖులా విడాకులకు తేడా

(1) భార్యను వదిలేయడానికి భర్త ఆమెకిచ్చే విడాకుల్ని తలాఖ్ అంటారు. భర్త నుండి విడిపోవడానికి భార్య అతనికిచ్చే విడాకుల్ని ఖులా అంటారు.

(2) స్త్రీ బహిష్టు, ప్రసూతి మైల, వీర్యస్ఖలనం లాంటి అపరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు భర్త ఆమెకు తలాఖ్ ఇవ్వకూడదు. కాని స్త్రీ అలాంటి అపరిశుద్ధావస్థలో ఉన్నప్పటికీ ఆమె తన భర్తకు ఖులా ఇవ్వచ్చు.

(3) భర్త తలాఖ్ ఇచ్చినప్పుడు దానికి ఇతరులెవరి ఆమోదం అవసరం లేదు. భార్య ఖులా ఇచ్చినప్పుడు దానికి ఆమె భర్త ఆమోదం ఉండాలి.

(4) భర్త తలాఖ్ ఇస్తే లోగడ తానిచ్చివున్న మహర్ ధనం భార్య నుండి వాపసు తీసుకోకూడదు. భార్య ఖులా ఇస్తే భర్త నుండి తీసుకున్న మహర్ ధనం అతనికి వాపసు చేయవలసి ఉంటుంది. (ఖుర్ఆన్-2:229)

అయితే ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) అభిప్రాయం ప్రకారం భర్త ఖులా విషయం లో భార్యను వేధిస్తూ వత్తిడి చేసి ఆమె నుండి నష్టపరిహారం వసూలు చేయడం అధర్మం (హరాం) అవుతుంది. దానికి ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులే ఆధారం:



" "మీరామెకు (మహర్ లేదా ఇతర కానుకల రూపంలో) ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం మీకు ధర్మసమ్మతంకాదు." (2:229)

" "విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మ సమ్మతంకాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్‌లో కొంతభాగం కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు." (4:19)

" "మీరామెపై నీలాపనిందలు వేసి, మరీఅంత అన్యాయంగా దాన్ని తిరిగి తీసు కుంటారా? (ఎంత సిగ్గుచేటు!) మీరిద్దరు ఒకరి ద్వారా మరొకరు సుఖం అనుభవించారు. ఆమె మీదగ్గర (వివాహం ద్వారా) గట్టి వాగ్దానం తీసుకుంది. అలాంటప్పుడు మీరామె ధనాన్ని బలవంతంగా ఎలా తీసుకుంటారు?" (4:21)

### భార్య విడాకుల్ని భర్త ఆమోదించాలా?

భార్య ఇచ్చే (ఖులా) విడాకులకు భర్త ఆమోదం ఉండాలనడానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉన్నాయి.

(1) అందులో ఒకటి- ఇస్లాం విడాకుల్ని ధర్మసమ్మతం చేసింది కాని, దాన్ని ప్రోత్స హించలేదు. ఈ హక్కును మార్గాంతరం లేని పరిస్థితిలో మాత్రమే వినియోగించుకోవాలని చెప్పింది. సమాజంలో విడాకులు ఎక్కువయి పోవడాన్ని, తరచుగా సంసారాలు కూలి పోవడాన్ని ఇస్లాం ఎన్నటికీ కోరుకోదు. వీటికి అడ్డుకట్ట వేయడానికే ఇస్లాం విడాకుల హక్కును మౌలికంగా పురుషునికి ఇచ్చింది. ఈ హక్కును వినియోగించే ముందు అతను అన్ని విధాలా క్షుణ్ణంగా ఆలోచించుకోవలసి ఉంటుంది.

ఉదాహరణకు- పెళ్లిపెటాకుల కోసం పురుషుడు చాలా డబ్బు భరించవలసి వస్తుంది. మహర్ పైకం చెల్లించవలసి ఉంటుంది. గడువు (ఇద్దత్) కాలంలో విడాకులు తీసుకున్న భార్య పోషణ, వసతి ఖర్చులు భరించవలసి ఉంటుంది. రెండో పెళ్ళి చేసుకోవా లంటే ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఇన్ని ఖర్చులు ఉండగా అతను విడాకుల హక్కును అంత సులువుగా ఎలా వినియోగించగల్గుతాడు? స్త్రీ మీద ఇన్ని బాధ్యతలు ఉండవు గనక ఆమె విడాకుల హక్కును పురుషునికంటే సులభంగా వినియోగించుకో గలుగుతుంది. అందుకే ఇస్లాం తలాఖ్ హక్కును స్త్రీకి ఇవ్వకుండా పురుషునికి ఇచ్చింది.

(2) రెండో కారణం- విశ్వపాలకుడు పిల్లల పెంపకం లాంటి అతిముఖ్యమైన, ఎంతో సున్నితమైన బాధ్యతను స్త్రీ మీద మోపాడు. ఇలాంటి బాధ్యత నెరవేర్చాలంటే సున్నితమైన మనస్తత్వం, తీవ్రమైన భావోద్రేకాలు, సత్వర చర్యలకై వేగిరపాటు మొదలైన లక్షణాలు ఎంతో అవసరం. ఈ లక్షణాలు పురుషునికన్నా స్త్రీలోనే ఎక్కువ ఉన్నాయి. పిల్లవాడికి ఎప్పుడు ఏమవసరం వస్తుందోనని ఆమె కనిపెట్టుకొని ఉంటూ ఏదైనా అవసరం రాగానే తక్షణమే దాన్ని తీర్చడానికి ఆమె ఎంతో ఆరాటపడుతుంది. ఒకవేళ

విడాకుల హక్కు గనక స్త్రీకి ఇస్తే పిల్లల పెంపకానికి, వారి సుశిక్షణకు ఎంతో ప్రయోజన కరమైన ఈ లక్షణాలు విడాకులహక్కు వినియోగంలో నష్టపోతాయి.

(3) మూడో కారణం- పురుషుడు స్త్రీకి మహర్ పైకం చెల్లించడంతో పాటు ఆమె పోషణ, మానమర్యాదల పరిరక్షణ బాధ్యతలు స్వీకరించి ఆమెపై యాజమాన్య హక్కులు సంపాదించాడు. ఎంతో ఖర్చుపెట్టి, మరెంతో బాధ్యత తీసుకొని తన సొంతం చేసుకున్న ఒక విలువైన వస్తువు తన అనుమతి లేకుండా తనను వదిలేసి వేరే చోటికి పోవడాన్ని ఏ మనిషైనా సహించగలడా? సహించలేడు. కాబట్టి ఆ వస్తువు తన నుండి విడిపోవడానికి అతని అనుమతి తప్పనిసరిగా కావలసి ఉంటుంది.

## విడాకులిచ్చేందుకు స్త్రీకి మూడు మార్గాలు

ఇవన్నీ నిజమే అయినప్పటికీ ఒక్కోసారి ఆమె భర్తతో కలసి జీవించి ఉండలేనంత పరిస్థితులు ఏర్పడవచ్చుకదా అంటారు కొందరు. స్త్రీకి విడాకుల హక్కు లేకుండా చేస్తే అప్పుడు భర్తఇల్లు ఆమెకు నరకప్రాయమయి ఆమె జీవితం దుర్భరం అవుతుంది. ఆమె అన్నివిధాల నిస్సహాయురాలై భర్త దయాదాక్షిణ్యాల మీద బతుకుబండి లాగుతూ అష్టకష్టాలు అనుభవించవలసివస్తుంది. ఇదేంన్యాయం అంటారు వీరు. ఈ అభిప్రాయం పైకి ఎంతో సమంజసంగా కన్పించినా వాస్తవం దాని మరుగున పడిపోయింది.

ఇలాంటి అనుమానం రేకెత్తడానికి కారణం ఇస్లామీయ విడాకుల చట్టం గురించి వారికి సరైన అవగాహన లేకపోవడమే. సాధారణంగా స్త్రీకి ఇస్లాం విడాకులిచ్చే అధికారం ఏమాత్రం లేకుండా చేసిందని, దుర్మార్గుడయిన భర్త కబంధహస్తాల నుండి విముక్తి పొందడానికి ఇస్లాం ఆమెకు ఎలాంటి సౌకర్యం కల్పించలేదని చాలా మంది భావిస్తారు. కాని ఇది పూర్తిగా తప్పుడు భావన. ఇస్లాం ఈ హక్కును కొంతవరకు స్త్రీకి ప్రసాదించింది. ఈ హక్కును వినియోగించుకోవడానికి మూడు మార్గాలు ఉన్నాయి.

## విడిపోవడానికి మొదటి మార్గం

(1) మొదటి మార్గం- వివాహ సమయంలో స్త్రీ తనకు కాబోయే భర్త నుండి విడాకుల అధికారం వ్రాతపూర్వకంగా తీసుకోవాలి. పురుషుడు తనకు సంక్రమించిన విడాకుల అధికారం తన భార్యకు ధారాదత్తం చేయడానికి ఇస్లామీయ చట్టం ఆతనికి అనుమతిస్తుంది. కాని బహుతక్కువ మంది మహిళలు ఈ హక్కును వినియోగించు కుంటున్నారు. బహుశా తమకు ఇలాంటి హక్కు కూడా ఉందని వారికి తెలియదు. అందుకే ముస్లిం మహిళలు ధర్మజ్ఞానం నేర్చుకొని ఉండాలి.

ఈ హక్కును ఇలా ఉపయోగించుకోవాలి: పెళ్ళికిముందు సదరు స్త్రీగాని లేదా ఆమె సంరక్షకుడుగాని ఇద్దరుసాక్షుల సమక్షంలో కాబోయే భర్త నుండి ఒక ఒప్పందం రాయించుకోవాలి. అంటే "నేనొకవేళ షరీఅత్ ప్రకారం నాభార్య హక్కుల్ని నెరవేర్చకపోతే లేదా ఆమెపై ఏదైనా అన్యాయానికి, దౌర్జన్యానికి పాల్పడితే ఆమె తన మీద ఒక



'తలాఖ్ బాయిన్' చేసుకొని నా నుండి దాంపత్య బంధాన్ని తెగతెంపులు చేసుకోవచ్చు. ఈ అధికారం నేనామెకు ఇస్తున్నాను" అని ఒప్పంద పత్రంలో రాయించుకోవాలి.

ఈ ఒప్పందం వల్ల పురుషుడు తన భార్య హక్కులను నెరవేర్చడానికి, ఆమెతో గౌరవప్రదంగా సంసారం చేయడానికి శాయాశక్తులా కృషిచేస్తాడు, ఎలాంటి శక్తివంచనకు పాల్పడలేడు. ఒకవేళ భర్త ఆమెను వేధించడం మొదలెడితే, ఆమె హక్కులను నెరవేర్చక పోతే లేదా మరేదైనా తీవ్రమైన ధార్మిక, సామాజిక అవసరం ఏర్పడితే గత్యంతరంలేని పరిస్థితిలో ఆమె విడాకులు తీసుకొని భర్త నుండి విడిపోతుంది.

## విడిపోవడానికి రెండవ మార్గం

(2) భర్త నుండి విడాకులు పొందే రెండవ మార్గం- ఏదైనా కారణం వల్ల స్త్రీ తన భర్తను ద్వేషిస్తుంది. ఉదాహరణకు భర్త పిచ్చివాడయి పోవడం, అతనికి కుష్టు, బొల్లిలాంటి భయంకర వ్యాధులు సోకడం, అతనిలో లైంగికశక్తి తగ్గిపోవడం, నపుంస కత్వం, అక్రమసంబంధం ఏర్పరచుకొని లేదా మరేవైనా వ్యాపకాలు అలవాటు చేసుకొని భార్యను నిర్లక్ష్యం చేయడం, ఆమె ఆర్థిక అవసరాలు తీర్చకపోవడం, భర్త అతికోపిష్టి, దౌర్జన్యపరుడై పోవడం మొదలైనవి. అలాంటి పరిస్థితులు ఏవైనా ఎదురైనప్పుడు ఇక భర్తతో ఏమాత్రం పొసగదని భావించి కలసి ఉండదలచుకోకపోతే భర్త నుండి విడిపోవడానికి ఇస్లాం ఆమెకు అధికారమిస్తుంది.

దాని కోసం ఆమె తన భర్త నుండి విడాకులు ఇప్పించమని న్యాయస్థానాన్ని కోరాలి. ఇస్లామీయ న్యాయస్థానాలు లేకపోతే పలుకుబడి గల కొందరు ధర్మవేత్తలు, ముస్లింపెద్దల ముందుకు ఈ వ్యవహారం తీసికెళ్ళి భర్త నుండి విడిపోవచ్చు.

## విడిపోవడానికి మూడవ మార్గం

(3) భర్త పొడ గిట్టని స్త్రీ అతని నుండి విడిపోవడానికి ఉన్న మూడవ మార్గం 'ఖులా'. ఖులా అంటే స్త్రీ తనభర్త నుండి మహర్ ధనాన్ని తిరిగి ఇచ్చేసి, లేదా మరేదైనా ఇచ్చి తలాఖ్ తీసుకోవడానికి అతడ్ని ఒప్పించడం అని అర్థం.

"మీరామెకు ఇచ్చిన వస్తువుల్లో కొంతైనాసరే, మళ్ళీ తీసుకోవడం మీకు ధర్మసమ్మతం కాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం. దంపతులిద్దరు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని భయపడినప్పుడు స్త్రీ తన భర్తకు ఏమైనా ఇచ్చేసి అతని నుండి వేరుపడ దలచుకుంటే వారిద్దరి మధ్య ఏదైనా ఒప్పందం కుదరడంలో తప్పు లేదు." (ఖుర్ఆన్-2:229)

## వేధించే భర్త నుండి విముక్తిమార్గమే "ఖులా"

భర్త తన భార్యకు విడాకులు ఇవ్వకుండా వేధిస్తుంటే, అతని కబంధహస్తాల నుంచి ఆమెను విడాకులిప్పించి విముక్తి చేయడానికి ఇస్లామీయ న్యాయస్థానికి పూర్తి

అధికారం ఉంది. భర్త విడాకులివ్వడానికి నిరాకరిస్తే న్యాయస్థానం వివాహవిచ్ఛేదం చేసి స్త్రీని అతని నుండి శాశ్వతంగా వేరుచేస్తుంది.

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) దగ్గరకు ఒక స్త్రీ తనభర్త వ్యవహారం తీసుకొచ్చి అతని నుండి తనకు విడాకులిప్పించమని అడిగింది. హజ్రత్ ఉమర్ (రజి) ఆమెకు సహనం వహిస్తూ భర్తతో కలసి ఉండమని నచ్చజెప్పారు. కాని ఆమె అందుకు అంగీకరించ లేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఆమెను ఒక ఇంట్లో ఉంచి, ఆ ఇంట్లో కసువు నింపి తలుపులు మూయించారు. ఆ విధంగా మూడు రోజులు ఉంచిన తరువాత "ఇప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంది?" అని ప్రశ్నించారు.

దానికా మహిళ "దైవసాక్షి! నాకు ఈ మూడు రాత్రుళ్ళలోనే కాస్తంత సుఖం లభించింది" అన్నది. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని ఆమె భర్తను "ఈమె చెవిపోగు లైనా సరే తీసుకొని ఈమెకు విడాకులిచ్చేయి" అని ఆదేశించారు. (కష్ఫుల్ నామ)

ఖలీఫా ఉస్మాన్ (రజి) కాలంలో రబీ బిన్త్ మౌజ్ బిన్ ఇఫ్రా (రజి) తన దగ్గరున్న ధనమంతా తీసుకొని తనకు విడాకులివ్వమని భర్తను ఎంతగానో ప్రాధేయపడ్డారు. కాని ఆ భర్త ఆమెకు విడాకులివ్వడానికి నిరాకరించాడు. అప్పుడామె ఈ వ్యవహారం ఖలీఫా దృష్టికి తీసికెళ్ళారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆమె భర్తను పిలిపించి "ఈమె జడకుప్పె సైతం తీసుకొని విడాకులిచ్చేయి" అని ఆజ్ఞాపించారు. (ఫత్హుల్‌బారి)

## భర్త నచ్చకపోయినా ఖులా ఇవ్వచ్చు

దైవప్రవక్త (స) కాలంలో "ఖులా"ను గురించి హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) ఉదంతం చాలా ప్రసిద్ధికెక్కింది. ఆయన భార్యలలో జమీలా (రజి) బిన్త్ అబీబిన్ సలూల్ అనే ఆమె తన భర్తను గురించి దైవప్రవక్త (స)కు ఇలా ఫిర్యాదు చేశారు:

"దైవప్రవక్తా! నన్ను ఆయనతో ఏ విషయమైనా సరే ఎన్నటికీ కలపజాలదు. నేను నా ముసుగు పైకెత్తి చూస్తే ఆయన కొందరు వ్యక్తులతో కలసి వస్తున్నారు. వారిలో అందరికన్నా ఆయన నల్లగా, పొట్టిగా, వికృతంగా కన్పించారు." (ఇబ్నెజరీర్). "దైవసాక్షి! మతవిషయంలోగాని, శీలంలోగాని ఆయన్ని నేను శంకించడం లేదు. అయితే నాకు ఆయన వికృతరూపం నచ్చలేదు." (ఇబ్నెజరీర్). "దైవసాక్షిగా చెబుతున్నాను. నాకు దేవుని పట్ల భయమే గనక లేకపోయివుంటే, నా దగ్గరకు వచ్చినప్పుడు నేనతని ముఖమ్మీద ఊసే దాన్ని." (ఇబ్నెజరీర్)

దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "సరే, అతను నీకు (మహర్ కింద) ఇచ్చిన తోటను తిరిగివ్వగలవా?" అని అడిగారు. దానికామె "ఇస్తాను. అతనింకా ఎక్కువ అడిగినా ఇవ్వగలను" అని అన్నారు. "ఎక్కువ అక్కరలేదు. అతను ఇచ్చిన తోట తిరిగిచ్చేయి చాలు" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం). ఆ తరువాత ఆయన దాన్ని ఒప్పుకోవలసిందిగా హజ్రత్ సాబిత్ (రజి)ని ఆదేశించారు.



అదేవిధంగా హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) రెండవ భార్య హబీబా బిన్త్ సుహైల్ అన్సారియా (రజి) కూడా దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి భర్త రూపురేఖలు తనకు నచ్చలేదని, తనకు దైవభీతి లేకపోయివుంటే అతని ముఖమ్మీద ఊసే దాన్నని ఫిర్యాదు చేశారు. దైవప్రవక్త (సల్లం) ఆమెకు కూడా విడాకులు ఇప్పించారు. (ఇబ్నెమాజ)

భర్త తనకు తాను విడాకులు ఇస్తే తాను భార్యకు ఇచ్చిన మహర్‌ను వదలు కోవలసిందే. అంతేకాదు, భర్త పెట్టే బాధలు భరించలేక భార్య విడాకులు (ఖులా) కోరినప్పుడు కూడా అతను మహర్‌ను తిరిగి తీసుకోవడం అధర్మమే అవుతుంది.

"అప్పుడు మీరామెకు (మహర్ లేదా ఇతర కానుకల రూపేణ) ఇచ్చిన వస్తువులలో కొంతైనాసరే, వాపసు తీసుకోవడం ధర్మసమ్మతం కాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం." (ఖుర్‌ఆన్-2:229)

## భర్త వ్యాధిగ్రస్త స్థితిలో విడాకులు

పురుషుడు వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి భార్యకు తలాఖ్ ఇచ్చినప్పుడు ఇద్దత్ (మూడు రుతుకాలాల గడువు) ముగిసిపోక ముందే అతను చనిపోతే అతని ఆస్తిలో చట్టప్రకారం భార్యకు లభించవలసిన వాటా లభిస్తుంది. ఒకవేళ ఆ వ్యాధిగ్రస్త భర్త ఇద్దత్ ముగిసిన తర్వాత చనిపోతే అతని ఆస్తి నుండి భార్యకు వాటా లభించదు.

భర్త వ్యాధిగ్రస్త స్థితిలోఉన్నప్పుడు భార్య కోరికపై అతను విడాకులివ్వడం జరిగితే భర్త ఇద్దత్ ముగిసిపోక ముందు చనిపోయినా లేదా ఇద్దత్ ముగిసిన తర్వాత చని పోయినా అతని ఆస్తిలో ఆమెకు వాటా లభించదు. ఒకవేళ భార్య తన వ్యాధిగ్రస్త భర్తకు 'ఖులా' ఇచ్చి దాన్ని ఆమోదింపజేసుకున్న తరువాత ఇద్దత్ గడువు ముగిసిపోక ముందే భర్త చనిపోవడం జరిగితే అతని ఆస్తిలో ఆమెకు వాటా లభిస్తుంది.

వ్యాధిగ్రస్త భర్త తనభార్యతో 'నీవు ఇంటినుండి వెళ్ళిపోతే నీకు తలాఖ్' అని చెప్పినా భార్య వినకుండా వెళ్ళిపోతే ఆమెకు భర్త ఆస్తి నుండి వాటా లభించదు.

# 27. న్యాయస్థానంలో స్త్రీల సమస్యలు

భార్యాభర్తల మధ్య సంబంధాలు సరిగా లేనప్పుడు ముందుగా వారుభయులే సహనం, సంయమనాలతో సర్దుకుపోవడానికి ప్రయత్నించాలి. సమస్య తీవ్రమయి వారి నుంచి చేజారి పోయినప్పుడు భార్య వైపు బంధువులు కొందరు, భర్త వైపు బంధువులు కొందరు కలసి కూర్చొని సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి. వారి వల్ల కూడా సమస్యకు పరిష్కారం కన్పించకపోతే న్యాయస్థానానికి పోవాలి.

ఇస్లామీయ న్యాయస్థానం లేని చోట్ల ఇస్లామీయ ధర్మసంస్థలను లేదా సీనియర్ ధర్మవేత్తలను సంప్రదించాలి. దంపతులైనా, వారి పెద్దలైనా, న్యాయమూర్తులైనా, లేదా మరెవరైనా సరే ఈ సమస్యను ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులోనే పరిష్కరించాలి.

## వివాహ విచ్ఛేదం (తఫ్రీఖ్)

వివాహ బంధం త్రెంచి భార్యాభర్తలను వేరుచేయడానికి ఉపయోగించే మరొక సాధనాన్ని "వివాహవిచ్ఛేదం (తఫ్రీఖ్)" అంటారు. వివాహవిచ్ఛేదం చేసే అధికారం ఖాజీకి లేదా ఇస్లామీయ న్యాయస్థానానికి మాత్రమే ఉంటుంది. ఇవి రెండూ లేనిచోట్ల ధర్మశాస్త్రం తెలిసిన ముస్లిం పెద్దలు ఈ పని చేయవచ్చు.

వివాహవిచ్ఛేదం నిర్ణయం తీసుకోవడానికి కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి. ఉదాహరణకు: భర్త తన భార్య లైంగికేచ్ఛ తీర్చలేని అశక్తుడయి ఉండటం; ఒకవేళ శక్తి ఉన్నా ఏదైనా భయంకరమైన వ్యాధికి గురయి ఉండటం; పిచ్చివాడయి పోవడం; భార్య పోషణభారం వహించలేక పోవడం; భార్య బాగోగులను పట్టించుకోకుండా ఆమెను పూర్తిగా విస్మరించడం; ఎక్కడికైనా పత్తాలేకుండా పోవడం. ఈ కారణాలలో ఏదొక్కటి ఉన్నాసరే ఖాజీ (న్యాయాధికారి) వివాహవిచ్ఛేదం దరఖాస్తును ఆమోదించి భార్యాభర్తలను వేరుచేయగలడు.

అలాగే భార్య ఉన్మత్తురాలైపోతే లేదా సంభోగానికి యోగ్యంకాని వ్యాధికి గురైతే లేదా సంభోగిస్తే ఆ వ్యాధి భర్తకు సంక్రమించే ప్రమాదం ఉంటుందని డాక్టర్ సర్టిఫై చేస్తే భర్త కూడా వివాహవిచ్ఛేదం కోసం ఖాజీ ముందు దరఖాస్తు పెట్టుకోవచ్చు.

## పత్తాలేకుండా పోయిన భర్త వ్యవహారం

భర్త పత్తాలేకుండా పోయి సుదీర్ఘకాలం గడచినా తిరిగి రాకపోతే, అతనసలు బ్రతికున్నాడో చనిపోయాడో కూడా తెలియని పక్షంలో అతని భార్య ఏం చేయాలి? ఎంతకాలం గడిచినా భర్త రాక కోసం వేచివుండాలా లేక సుదీర్ఘకాలం గడచిన తరువాత అతను చనిపోయి ఉంటాడని నిర్ధారించుకొని మరొక వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలా? ఈ సమస్య విషయంలో ప్రవక్త ప్రత్యక్ష అనుచరులు భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచారు.

అలాంటి భర్తను "మఫ్ఖూదుల్ ఖబర్" అంటారు. దీన్ని గురించి ఖుర్ఆన్‌లో ఎలాంటి ఆదేశం లేదు. సుప్రసిద్ధ హదీసుగ్రంథాలలో కూడా స్పష్టమైన ఆదేశం ఏదీ లేదు. అయితే దారుల్‌ఖుత్నిలో గ్రంథకర్త ఒక హదీసుని ఇలా పేర్కొన్నారు: "పత్తాలేకుండా పోయిన భర్త ఆచూకీ తెలియనంతవరకు అతని భార్య భార్యగానే ఉంటుంది' అని దైవప్రవక్త (స) అన్నారు." కాని ఈహదీసు ఉల్లేఖులు సివార్ బిన్ ముస్అబ్, ముహమ్మద్ బిన్ షుర్జీల్ హమ్దానీలు నమ్మదగినవారు కాదని హదీసువేత్తలు పేర్కొన్నారు.

కాగా హజ్రాత్ ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), ఇబ్నెఉమర్ (రజి), ఇబ్నె అబ్బాస్ (రజి)ల అభిప్రాయం ప్రకారం "పత్తాలేకుండా పోయిన భర్త కోసం అతని భార్య (రెండవ పెళ్ళి చేసుకోకుండా) నాలుగు సంవత్సరాలు వేచివుండాలి."

దీనికి భిన్నంగా హజ్రత్ అలి, హజ్రత్ ఇబ్నెమస్వూద్ (రజి)లు "పత్తాలేకుండా పోయిన భర్త తిరిగిరానంత వరకు, లేదా అతని మరణం ధృవపడనంత వరకు అతని



భార్య సహనం వహించాలి." ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి, సుఫ్యాన్ సూరీ (రహ్మలై)లు ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. ఈ కారణంగానే హనఫీ ఫిఖావేత్తలు "అలాంటి భర్త వయస్సు కలిగినవారు ఆ ఊళ్ళో లేక ఆ దేశంలో జీవించి ఉన్నంతవరకూ అతని భార్య వేచివుండాలి" అని ఓ ప్రతిపాదన చేశారు.

అలాంటి స్త్రీ పోషణ, మానమర్యాదల పరిరక్షణ ఏర్పాట్లు లేకుండా ఆమె సుదీర్ఘ కాలం నిరీక్షించడం ఇస్లాం స్వభావానికి విరుద్ధమని భావిస్తూ ఇమామ్ మాలిక్, ఇమామ్ హంబల్ (రహ్మలై) ఆమె నిరీక్షణ కాలం నాలుగు సంవత్సరాలు నిర్ణయించారు. అయితే పోషణ, మానమర్యాదల పరిరక్షణ ఏర్పాట్లు ఏమీలేనప్పుడు ఆమె ఒక సంవత్సరం నిరీక్షిస్తే చాలని కూడా మాలికీ ఫిఖావేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలతో హనఫీ ఫిఖావేత్తలు కూడా ఏకీభవించారు.

భర్త యుద్ధమైదానంలో తప్పిపోయినప్పుడు అతడ్ని వెతకడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసిన తరువాత భార్య ఒక యేడాది పాటు వేచివుండాలని; అల్లర్లలో తప్పిపోయినప్పుడు అల్లర్లు సద్దుమణిగిన తరువాత అతడ్ని వెతకడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసిన తరువాత ఇక అతని కోసం నిరీక్షించకుండా భార్య మరణగడువు నాలుగు నెలల పది రోజులు గడచిపోగానే పునర్వివాహం చేసుకోవచ్చని మాలికీ ఫిఖావేత్తలు అనుమతించారు. హనఫీ ఫిఖావేత్తలు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ ముందు జాగ్రత్త కోసం భార్య ఒక సంవత్సరం పాటైనా వేచి ఉండాలని అంటారు.

## పత్తాలేకుండా పోయిన భర్త తిరిగొస్తే....?

నిరీక్షణకాలం గడచిపోయి స్త్రీ పునర్వివాహం కూడా జరిగిపోయిన తరువాత పత్తా లేకుండా పోయిన భర్త తిరిగొస్తే ఏం చెయ్యాలి? అలాంటి పరిస్థితిలో ఆ స్త్రీపై ఆమె మొదటి భర్తకు ఎలాంటి హక్కులేదని హజ్రత్ ఉమర్ (రజి) అభిప్రాయపడ్డారు. ఇమామ్ మాలిక్ (రహ్మలై) తన హదీసు గ్రంథం "మువత్తా"లో ఈ విషయం పేర్కొన్నారు. మాలికీ ఫిఖావేత్తలు ఈ అభిప్రాయాన్ని స్వీకరించారు.

అయితే హజ్రత్ అలి (రజి) దీనికిభిన్నంగా "స్త్రీకి రెండవ పెళ్ళి జరిగి పిల్లలు పుట్టినాసరే ఆమె రెండవభర్తకు విడాకులు ఇచ్చేసి మొదటి భర్తను చేసుకోవలసిందేన"ని అభిప్రాయపడ్డారు. పైగా రెండవ భర్త కూడా ఆమెకు ఇచ్చిన మహర్ ధనం విడాకుల తరువాత వదలుకోవలసిందే. హనఫీ ఫిఖావేత్తలు ఈ అభిప్రాయాన్ని స్వీకరించారు.

పై రెండు అభిప్రాయాలలో హజ్రత్ ఉమర్ (రజి) అభిప్రాయమే సమంజసంగా ఉన్నట్లు గోచరిస్తోంది. ఒకవేళ రెండవ అభిప్రాయమే సరైన నిర్ణయంగా పరిగణించబడితే అందులోని షరతుల ప్రకారం ఏ స్త్రీ మొదటి భర్త రాక పట్ల భయపడకుండా రెండవ పెళ్ళి చేసుకోవడానికి, పిల్లల్ని కనడానికి సాహసిస్తుంది? ఆ షరతులు తెలిసిన ఏ పురుషుడు ఆమెను రెండవ పెళ్ళి చేసుకోవడానికి ముందుకొస్తాడు?

## శీలవతులపై అపనిందలా?

సాధారణంగా దుర్జనులు సజ్జనుల ప్రగతి విజయాలకు కారణభూతమైన సద్గుణ సంపత్తిని అలవరచుకోవడానికి బదులు, సజ్జనుల్లో కూడా తమ దుర్గుణాలు, దుర్లక్షణాలను వ్యాపింపజేయడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యంకాని పక్షంలో సజ్జనుల సద్గుణ సంపత్తి, నీతినడవడికల్ని ప్రజల్లో సందేహాస్పదం చేయడానికి వారిపై అపనిందలు మోపడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి దుర్జనులు ముస్లిమేతరుల్లో కూడా ఉంటారు, ముస్లింలలో కూడా ఉంటారు. ముస్లింలో ఉంటే మరింత ప్రమాదం. అలాంటివారిని గురించి ప్రారంభంలో ఈ క్రింది సూక్తులు అవతరించాయి:

"శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేని వారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అటువంటి వ్యక్తులు చెప్పే సాక్ష్యాన్ని ఇక ఎన్నటికీ స్వీకరించకండి. వారసలు దుర్జనులు. అయితే ఈనిర్వాకం తర్వాత పశ్చాత్తాపంతో దైవాన్ని వేడుకొని తమ నడవడికను సరిదిద్దుకున్నవారు మాత్రం దుర్జనులుగా పరిగణించబడరు. (అలాంటివారి విషయంలో) దేవుడు క్షమాశీలి, దయామయుడు." (ఖుర్‌ఆన్-24:4,5)

ఇది కపటముస్లింలు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి)పై వేసిన అపనిందకు సంబంధించిన విషయం. దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు బనీముస్తలిఖ్ యుద్ధం నుండి మదీనా తిరిగొస్తూ దారిలో ఒకచోట రాత్రివేళ విడిదిచేశారు. తెల్లవారుజామున హజ్రత్ ఆయిషా(రజి) బహిర్భూమికి వెళ్ళారు. అయితే కంఠహారం ఎక్కడో పడిపోవడంతో ఆమె దాన్ని వెతుక్కుంటూ మళ్ళీ వెనక్కిపోయారు. ఆమె తిరిగొచ్చేలోగా సైన్యం బయలుదేరి వెళ్ళిపోయింది. ఆమె అంబారీలో కూర్చున్నారనుకొని నలుగురు సైనికులు దాన్ని ఎత్తి ఒంటె మీద పెట్టారు. అలా ఖాళీ అంబారీతో సైన్యం వెళ్ళిపోయింది.

హజ్రత్ ఆయిషా (రజి) తాను కన్పించకపోతే వాళ్ళే వెతుక్కుంటూ వస్తార్లే అని తలచి ఆ ప్రదేశంలోనే దుప్పటి కప్పుకొని పడుకున్నారు. కాకతాళీయంగా ఒక సైనికుడు వెనకుండిపోయాడు. అతనామెను చూసి విచారం వెలిబుచ్చుతూ, ఎంతో గౌరవంతో ఆమెకు దగ్గరగా ఒంటె తెచ్చి కూర్చోబెట్టాడు. ఆమె ఒంటెక్కి కూర్చున్నారు. అతను పగ్గం పట్టుకొని నడిపించుకుంటూ మధ్యాహ్నానికల్లా సైన్యాన్ని చేరుకున్నాడు.

కపటవిశ్వాసులు ఈ దృశ్యం చూసి హజ్రత్ ఆయిషా (రజి) మీద లేనిపోని దుమారం లేవదీశారు. ఇది ఆనోటా ఈనోటా ప్రాకి మొత్తం సైన్యంలో కార్చిచ్చులా వ్యాపించింది. దీనిపట్ల దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు తీవ్ర ఆందోళన చెందారు. నెలరోజుల దాకా ముస్లింలపై విషాదఛాయలు అలుముకున్నాయి. తరువాత ఆమె పవిత్రురాలని ఖుర్‌ఆన్ సందేశం అవతరించింది.

"ఈ నిందారోపణ వినగానే విశ్వాసులైన స్త్రీపురుషులు అనుమానానికి గురికాకుండా సహృదయంతో ఎందుకు ఉండలేదు? మీరు అప్పటికప్పుడు 'ఇది నిరాధారమైన అపనింద'ని ఎందుకు ఖండించలేదు? వారు (తమ ఆరోపణను నిరూపించుకోవ



డానికి) నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? వారు సాక్ష్యం తీసుకురాలేదు, (తీసుకురాలేరు కూడా.) దేవుని దృష్టిలో వారే పచ్చి అబద్ధాలరాయుళ్ళు." (24:12,13)

"మీ మీద ఇహపరలోకాల్లో దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోయివుంటే, మీరు ఏ (నిరాధారమైన) మాటల్లో పడిపోయారో వాటి పర్యవసానంగా మీపై ఘోరమైన విపత్తు వచ్చిపడేది. ఈ అసత్యారోపణ మీలో ఒకరినుంచి మరొకరికి (కార్చిచ్చులా) వ్యాపిస్తూ పోయింది. వాస్తవం ఏమిటో తెలియని మాట మీనోట వెలువడింది. మీరు దాన్ని సాధారణ విషయమని భావిస్తుండేవారు. కాని దేవుని దృష్టిలో ఇది చాలా తీవ్రమయిన విషయం." (ఖుర్‌ఆన్-24:14,15)

"ఈ సంగతి వినగానే "ఇలాంటి మాటలు అనడం మనకు తగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చి అపనింద" అని మీరెందుకు అనలేదు? మీరు (నిజమైన) విశ్వాసులైతే ఇకముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతోవివేకవంతుడు."(ఖుర్‌ఆన్-24:16-18)

"విశ్వాసులలో అశ్లీల విషయాలు వ్యాపించాలని కోరుకునేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ వ్యథాభరితమైన శిక్షకు అర్హులవుతారు. (సమాజం మీద అశ్లీలం ఎంత దుష్ప్రభావం వేస్తుందో) దేవునికి తెలుసు, మీకు తెలియదు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలే లేకపోయివుంటే మీరు దేవుణ్ణి వాత్సల్య మూర్తిగా, దయామయునిగా చూడగలిగేవారు కాదు." (ఖుర్‌ఆన్-24:19,20)

"విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు తనను అనుసరించే వారికి (ఎల్లప్పుడూ) చెడు, అశ్లీలతలను గురించే దుర్బోధ చేస్తాడు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోతే మీలో ఏ ఒక్కడూ పరిశుద్ధుడు (పవిత్రుడు) కాలేడు. అయితే దేవుడు తాను తలచిన వారిని పరిశుద్ధం చేస్తాడు. ఆయన సర్వం వినేవాడు, సమస్తం ఎరిగినవాడు." (ఖుర్‌ఆన్-24:21)

"శీలవతులైన అమాయక ముస్లిం మహిళలపై లేనిపోని అపనిందలు మోపేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ శాపగ్రస్తులవుతారు. వారికోసం కఠినాతి కఠిన శిక్ష కాచుకొని ఉంది." (ఖుర్‌ఆన్-24:23)

"ఇలా అపనిందలు మోపేవారు తమ నోళ్ళు, కాళ్ళు, చేతులే తమ అకృత్యాల్ని గురించి సాక్ష్యమిచ్చే రోజొకటి వస్తుందన్న సంగతి మరచిపోకూడదు. ఆరోజు దేవుడు వారి అర్హతను బట్టి వారికి పూర్తిప్రతిఫలం ఇస్తాడు. అప్పుడు తెలుస్తుంది వారికి దేవుడే సత్యమని, దేవుడే నిజాన్ని నిజంచేసి చూపేవాడని." (ఖుర్‌ఆన్-24:24,25)

ఈసూక్తి (24:23) గురించి దైవప్రవక్త(స) హితోక్తి: "పవిత్రురాలైన స్త్రీపై అపనింద వేయడమంటే వందేళ్ళ సత్కర్మల్ని చేజేతులా నాశనం చేసుకోవడమే." (తబ్రాని)

## ఖజఫ్ (అపనింద)

24వ అధ్యాయంలోని 4,5 సూక్తులలో పేర్కొనబడినట్లు శీలవతులైన ముస్లిం మహిళలపై ఎవరైనా అపనింద వేస్తే దానికి వారు నలుగురు సాక్ష్యుల్ని తీసుకురావాలని దేవుడు ఆదేశించాడు. ఈ ఆదేశం ముస్లింలలో అనేక ప్రశ్నలను లేవదీసింది. ఒక స్త్రీ దుర్నడతను చూసి పరపురుషుడు సహనం వహించగలుగుతాడు. సాక్షుల్ని తీసుకు రాలేనివాడు ఆ ప్రస్తావననే ఎత్తడు. కాని స్వయంగా భార్యే ఆ పాడుపనికి పాల్పడటం కళ్ళారా చూసినప్పుడు భర్త ఏం చెయ్యాలి?

అతను నలుగురు సాక్ష్యుల్ని తీసుకురాలేడు. ఒకవేళ ఆమెను హతమార్చితే హంతకుడిగా శిక్షకు గురికావలసి వస్తుంది. సహిస్తే అమె మరింత బరితెగించవచ్చు. లేదా ఆ పాడుపని ఒకర్నుండి మరొకరికి నిశ్శబ్దంగా ప్రాకి సంఘంలో అతను తలెత్తుకొని తిరగలేని పరిస్థితి వస్తుంది. పోని విడాకులిచ్చి వదలించుకుందామంటే ఆమె, ఆమెప్రియుడు ఎలాంటి శిక్షకు గురికాకుండా యదేచ్ఛంగా తిరుగుతూ సంఘంలో అశ్లీలతను వ్యాపింపజేస్తారు. పైగా ఆమె కనే అక్రమ సంతానం భర్త పాలిట గుదిబండయి పోతుంది.

ఈ ప్రశ్నలు మొదట్లో హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ముందుకు వచ్చాయి. అప్పుడాయన వ్యాఖ్యానిస్తూ "ఒకవేళ ఇలాంటి వ్యవహారం దురదృష్టవశాత్తు నా ఇంట్లో నాకళ్ళ ముందు జరిగితే నేను సాక్ష్యులకోసం వెతికేపని చేయకుండా అప్పటి కప్పుడు ఖడ్గంతో ఈ సమస్యను పరిష్కరిస్తాను" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఆ తర్వాత కొన్నాళ్ళకే కొందరు భర్తలు ఇలాంటి వ్యవహారాలు దైవప్రవక్త (స) సన్నిధికి తెచ్చారు. అలాంటి భర్తలలో ఒకతను దైవప్రవక్త (స) ఆస్థానానికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: "దైవప్రవక్తా! ఒకవేళ ఎవరైనా తన భార్య పక్కలో పరపురుషుడు ఉండటం చూసినప్పుడు, ఆ సంగతి అతని నోట వెలువడితే మీరు అతనికి అపనింద శిక్ష విధిస్తారు. ఆమెను చంపేస్తే మీరతనిపై హత్యానేరం మోపి అతడ్ని హతమార్చుతారు. మిన్నకుండిపోతే లోలోన మండిపోతూ బాధపడతాడు. అలాంటి పరిస్థితిలో అతనేం చేయాలి?" దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "దేవా! ఈ సమస్యను నీవే పరిష్క రించాలి" అని దైవాన్ని ప్రార్థించారు. (బుఖారి, ముస్లిం)

## లిఆన్ (ప్రమాణం చేయడం)

అయితే ఈ సమస్యకు సంబంధించిన దైవాజ్ఞ రాకపూర్వమే హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్య (రజి) వచ్చి తాను కళ్ళారా చూసిన తన భార్య నిర్వాకం గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ఏకరవు పెట్టుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ వ్యవహారం సంగతి విని "సాక్ష్యం తీసుకురా. సాక్ష్యం తీసుకు రాలేకపోతే నీకు అపనింద శిక్ష విధించడం జరుగుతుంది" అని అన్నారు. అక్కడే కూర్చున్న ఇతర ముస్లింలు ఈ మాట విని తీవ్రఆందోళన వ్యక్తపరిచారు.



హజ్రత్ హిలాల్ (రజి) మాత్రం ఏ మాత్రం కంగారుపడకుండా "మిమ్మల్ని ప్రవక్తగా నియమించి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేను నా కళ్ళారా చూసి, చెవులారా విన్న సంఘటనను మీ దృష్టికి తెస్తున్నాను. నా విషయంలో దేవుడు నా వీపును కాపాడే ఆదేశం అవతరింపజేస్తాడని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని అన్నారు. అప్పుడు ఈ సూక్తులు అవతరించాయి:

"ఇక భార్యలపై అపనిందమోపిన భర్తలు, దానికి తాముతప్ప మరెవరూ సాక్షులు లేని పక్షంలో (ఇలా చేయవలసిఉంటుంది:) వారిలో ఒకరు నాలుగుసార్లు దేవుని మీద ప్రమాణంచేసి తన ఆరోపణ నిజమేనని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమయితే తనపై దేవుని అభిశాపం పడుగాకని పలకాలి. (ఖుర్ఆన్–24:6,7)

"అలాగే స్త్రీ కూడా నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యమివ్వాలి. అయిదోసారి, అతని ఆరోపణ నిజమైతే తనపై దైవాగ్రహం విరుచుకుపడుగాకని పలకాలి. ఈవిధంగా ఆమెకు శిక్ష తప్పుతుంది." (ఖురాన్–24:8,9)

## భర్త ఫిర్యాదు పునఃపరిశీలన

ఈ సూక్తులు అవతరించిన తరువాత దైవప్రవక్త (సల్లం) వాటి ప్రకారం తీర్పు చేయడానికి హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్య (రజి)ని, ఆయన భార్యను పిలిపించారు. వారిద్దరికి ఈ సూక్తుల్లోని దైవాజ్ఞ విన్పించి **"బాగా ఆలోచించుకోండి. ఇహలోక యాతన కంటే పరలోకయాతన చాలా కఠినంగా ఉంటుంది"** అని అన్నారు.

హజ్రత్ హిలాల్ ఈమాట విని "ఈమెపై నేను నిజమయిన నిందనే మోపాను" అన్నారు. ఆయన భార్య "ఇది పచ్చిఅబద్ధం" అన్నది. దైవప్రవక్త (సల్లం) వారిద్దరి మాటలు విన్నాక "ఇప్పుడు మీరిద్దరూ ప్రమాణం చేయాలి" అని ఆదేశించారు.

ఈ ఆదేశం వినగానే ముందుగా హజ్రత్ హిలాల్ (రజి) లేచి ఖుర్ఆన్ ఆజ్ఞ ప్రకారం ప్రమాణం చేయడం ప్రారంభించారు. ప్రమాణం సందర్భంలో దైవప్రవక్త (స) "మీరిద్దరిలో ఒకరు తప్పకుండా అబద్ధీకులని దేవునికి తెలుసు. మరి మీరిద్దరిలో ఎవరైనా చేసిన తప్పుకు పశ్చాత్తాపపడతారా?" అని మాటిమాటికి అడిగేవారు.

హజ్రత్ హిలాల్ (రజి) అయిదవ సారి ప్రమాణం చేయడానికి ముందు సభికుల్లో కొందరు ఆయనతో "హిలాల్! దైవానికి భయపడు. పరలోక యాతన కంటే ఇహలోక యాతన చాలా తేలిగ్గా ఉంటుంది. అయిదో సారి ప్రమాణం నీకు యాతన తెచ్చి పెడ్తుంది" అని అన్నారు. దానికాయన "ప్రపంచంలో నా వీపును కాపాడిన దేవుడు పరలోకంలో కూడా నన్ను (నరక)యాతన నుండి కాపాడుతాడు" అని అన్నారు. ఈమాట చెప్పి ఆయన అయిదో సారి కూడా ప్రమాణం చేశారు.

తరువాత ఆయన భార్య కూడా లేచి ప్రమాణం చేయడం ప్రారంభించింది. అయిదో సారి ప్రమాణం చేయడానికి ముందు సభికులు ఆమెతో కూడా "దైవానికి

భయపడు. పరలోక యాతన కంటే ప్రపంచయాతన భరించడం చాలా తేలిక. ఈ అయిదో సారి ప్రమాణం నీపై దైవశిక్ష పడటానికి కారణమవుతుంది" అని అన్నారు. ఈమాట వినగానే ఆ స్త్రీ ఓ క్షణం ఆగి సందిగ్ధంలో పడిపోయింది. దాంతో జనం ఇక ఆమె చేసిన తప్పు ఒప్పుకుంటుందని తలచారు. కాని ఆమె సందిగ్ధం నుంచి తేరుకొని "నేను శాశ్వతంగా నా తెగవాళ్ళను అవమానపరచలేను" అని అన్నది. ఆ తరువాత ఆమె అయిదవ సారి కూడా ప్రమాణం చేసింది.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) వివాహవిచ్ఛేదం చేసి వారిద్దరిని వేరు (తఫ్రీఖ్) చేయించారు. అప్పుడు ఆయన తీర్పుచెబుతూ ఇలా అన్నారు: "ఈమె (కడుపులోని) పిల్లవాడు తండ్రి కొడుకుగా కాకుండా తల్లి కొడుకుగా పరిగణించబడతాడు. ఇక నుండి ఈమెపై గాని, ఈమె పిల్లవాడిపై గాని నిందవేయడానికి ఎవరికీ అధికారం లేదు. ఈమెపై లేదా ఈమె కొడుకుపై నిందవేసేవారు ఖజఫ్ (అపనింద) శిక్షకు అర్హులౌతారు. ఈమె తలాఖ్ తీసుకోవడంగాని, వితంతువయి పోవడంగాని జరగక ముందే భర్త నుండి వేరుచేయబడుతోంది గనక ఇద్దత్ కాలంలో ఆశ్రయం, పోషణ ఖర్చులు పొందడానికి ఈమెకు ఎలాంటి హక్కులేదు."

తీర్పు ముగిసిన తరువాత దైవప్రవక్త (స) సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈమె ప్రసవించిన తర్వాత పిల్లవాడి రూపురేఖలు పరిశీలించండి. ఒకవేళ పిల్లవాడిలో హిలాల్ పోలికలుంటే హిలాల్‌కొడుకు అవుతాడు; నిందితుడి (నిందితురాలి ప్రియుడి) పోలికలుంటే అతని కొడుకే అవుతాడు" అని అన్నారు. కొంతకాలానికి ఆ స్త్రీ ప్రసవించింది. చూస్తే పిల్లవాడిలో నిందితురాలి ప్రియుడి పోలికలే కన్పించాయి. దైవప్రవక్త (స) ఈ సంగతి విని "ప్రమాణాల పద్ధతి లేకపోయివుంటే (లేక ముందే దైవగ్రంథం తీర్పు చేసివుండకపోతే నేనీ స్త్రీపట్ల చాలా కఠినంగా వ్యవహరించేవాణ్ణి" అనిఅన్నారు.

(ఈ సంఘటన సుప్రసిద్ధ హదీసు గ్రంథాలన్నిటిలోనూ పేర్కొనబడింది.)

## దైవప్రవక్త (సల్లం) చేసిన మరికొన్ని తీర్పులు

బుఖారి, ముస్లిం, అబూదావూద్, నసాయి వగైరా హదీసు గ్రంథాలలో సహెల్ బిన్ సాద్ సాదీ, ఇబ్నెఉమర్ (రజి)లు ఉల్లేఖించిన కథనాల ప్రకారం ఉవైమర్ (రజి)ని, ఆయన భార్యను ప్రమాణం చేయించడానికి మసీదుకు పిలిపించడం జరిగింది. ప్రమాణం చేయించే ముందు దైవప్రవక్త (సల్లం) వాళ్ళిద్దర్నీ హెచ్చరిస్తూ "మీరిద్దరిలో ఒకరు అబద్ధీకులని దేవునికి బాగా తెలుసు. మరి మీలో ఎవరైనా పశ్చాత్తాపపడుతూ తప్పు ఒప్పుకుంటారా?" అని అడిగారు. కాని వారిద్దరిలో ఎవరూ తప్పు ఒప్పుకోలేదు. అంచేత దైవప్రవక్త (సల్లం) ఇద్దరి చేతా ప్రమాణం చేయించారు.

ప్రమాణం చేసిన తరువాత ఉవైమర్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! ఇప్పుడు నేనీ స్త్రీని నా దాంపత్యంలో కొనసాగనిస్తే నేను అబద్ధీకుణ్ణవుతాను" అని అన్నారు.



ఈ మాట చెప్పి వెంటనే ఆయన దైవప్రవక్త (సల్లం) అనుమతి తీసుకోకుండానే తనభార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇచ్చివేశారు.

దైవప్రవక్త (సల్లం) ఆయనిచ్చిన విడాకుల్ని ఆమోదించి భార్యాభర్తల మధ్య తఫ్రీఖ్ (వివాహవిచ్ఛేదం) చేయించారు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఇది పరస్పరం ప్రమాణంచేసే దంపతుల మధ్య చేయించే వివాహవిచ్ఛేదం" అనిఅన్నారు.

ఈ హదీసు ఉల్లేఖించిన సహెల్ బిన్ సాద్ (రజి) దీనిపై వ్యాఖ్యానిస్తూ "ఇలా ప్రమాణం చేసే దంపతుల మధ్య వివాహవిచ్ఛేదం చేయించడం ప్రవక్త సంప్రదాయమైపోయింది. వివాహవిచ్ఛేదం తరువాత ఇక ఎన్నటికీ వారిద్దరు ఏకం కావడానికి వీల్లేదు" అని అన్నారు. ఇంకా ఆయన "అప్పుడా స్త్రీ గర్భవతిగా ఉండింది. ఆ గర్భం తాను చేసింది కాదని ఉవైమర్ అన్నాడు. అందువల్ల పిల్లవాడు తల్లికొడుకుగా పరిగణించడం జరిగింది. ఈవిధంగా ఆ పిల్లవాడు తల్లి ఆస్తికి, తల్లి అతని ఆస్తికి వారసులయ్యేలా సంప్రదాయం ఏర్పడింది" అని కూడా అన్నారు.

మరోఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) దంపతుల చేత ప్రమాణం చేయించిన తరువాత "ఇప్పుడు మీ విచారణబాధ్యత దేవునిపై ఉంది. మీ ఇద్దరిలో ఒకరు తప్పకుండా అబద్ధీకులని దేవునికి తెలుసు" అని అన్నారు. తర్వాత ఆయన భర్తతో "ఇక ఈమె నీభార్యగా ఉండదు. ఈమెపై పెత్తనం చేయడానికి నీకెలాంటి అధికారం లేదు. ఈమెపై ఎలాంటి దుశ్చర్యకైనా పాల్పడేందుకు నీకు హక్కులేదు" అనిఅన్నారు.

అప్పుడతను "మరి నా (మహర్) ధనం సంగతేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ ధనం తిరిగి తీసుకోడానికి నీకు అధికారం లేదు. ఒకవేళ నీవు చేసిన ఆరోపణ నిజమైనప్పటికీ ఆమె ద్వారా నీవు ధర్మసమ్మతంగా అనుభవించిన దాంపత్యసుఖానికి ఈ ధనం బదులవుతుంది. నీ ఆరోపణ అబద్ధమయితే అది మరింత దూరమయి పోతుంది" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## గర్భధారణ గురించి కొన్ని చిక్కు సమస్యలు

వేరొక ఉల్లేఖనం ప్రకారం ఒక పల్లెవాసి వచ్చి "నాభార్య నల్లపిల్లవాణ్ణి కన్నది. (నాకు ఆమెశీలం పట్ల అనుమానముంది. నన్నేం చేయమంటారు?) అని అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నీ దగ్గర ఒంటెలున్నాయా?" అని అడిగారు. దానికా వ్యక్తి ఉన్నాయన్నాడు. "వాటి రంగు ఎలా ఉంది?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). ఎర్రగా ఉందన్నాడు అతను. "వాటిలో బూడిద రంగు ఒంటెలు కూడా ఉన్నాయా?" అని ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం). ఉన్నాయన్నాడా పల్లెవాసి. "మరి ఆ రంగు ఎక్కడ్నుంచి వచ్చింది?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). "బహుశా వాటి తాత ముత్తాలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అన్నాడా వ్యక్తి.

"అదేవిధంగా నీఈ పిల్లవాడికి కూడా తాతముత్తాలలో ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది'' అని చెప్పారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం). ఇలా ఆ పల్లెవాసికి దైవప్రవక్త (స) పిల్లవాడి సంబంధాన్ని తిరస్కరించడానికి అనుమతి ఇవ్వలేదు. (బుఖారి, ముస్లిం)

స్త్రీ పెళ్ళయిన ఆర్నెల్లకే ప్రసవిస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది. కాని గర్భం ధరించి బిడ్డను కని పాలుపట్టడానికి ముప్పయి నెలలు పడ్తుందని 46:15 సూక్తిలో ఉంది. 2:233 సూక్తిలో తల్లులు తమబిడ్డలకు పూర్తిగా రెండేళ్ళు పాలుపట్టాలని ఉంది. 31:14 సూక్తిలో బిడ్డ పాలు మానడానికి 24నెలలు పట్టిందని ఉంది. దీన్నిబట్టి స్త్రీ కనీసం 6 నెలల్లో గర్భం ధరించి పూర్తిస్థాయి బిడ్డను కనడం సాధ్యమేనని తెలు స్తోంది. అంచేత షరీఅత్‌వేత్తలు ఏ స్త్రీ అయినా పెళ్ళయిన ఆర్నెల్లకు బిడ్డను కంటే, దాని కారణంగా ఆమెపై వ్యభిచారనింద మోపడానికి వీల్లేదని నిర్ణయించారు.

## డి.యన్.ఎ. పరీక్షల ద్వారా పరిష్కారం సాధ్యమా?

ఒక్కోసారి స్త్రీ గర్భధారణ ఆమెభర్త వల్ల ఏర్పడిందో, ప్రియుడి వల్ల ఏర్పడిందో తెలుసుకోవడం సాధ్యంకాదు. భర్త తనభార్య వ్యభిచరిస్తుండగా చూడకపోయినా ఆమె చేష్టలు, ఆమె ప్రియుడి రాకపోకలను బట్టి అతనికి తప్పకుండా అనుమానం వస్తుంది. అలాంటి పరిస్థితిలో అతను లిఆన్ (ప్రమాణం) చేయలేడు. పుట్టిన బిడ్డను అతను మనస్ఫూర్తిగా స్వీకరించనూ లేడు. మహాఅయితే అతను అనుమానం బలపడిన తర్వాత ఆమెకు విడాకులిచ్చి వదిలించుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తాడు.

అయినా కాన్పు తర్వాత బిడ్డ సమస్య అలాగే ఉండిపోతుంది. ఈ రోజుల్లో డి.యన్.ఎ. పరీక్షలొచ్చాయి. వీటి ద్వారా ఈ సమస్య చాలావరకు పరిష్కారం కావచ్చు. అయితే ఒక్కోసారి డి.యన్.ఎ. పరీక్షలు కూడా విజయవంతం కాకపోవచ్చు. అప్పుడు పరిస్థితి ఏమిటీ? ఈ సమస్యను దైవప్రవక్త (సల్లం) ఇలా పరిష్కరించారు:

"ఎవరి పడకపై పుట్టిన శిశువు వారిదే అవుతుంది. వ్యభిచారికి మాత్రం రాళ్ళు (కాచుకొని) ఉంటాయి. (అంటే శిలాశిక్ష పడుతుంది.)'' అన్నారు ఆయన. (బుఖారి)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) 'లిఆన్' (ప్రమాణం) గురించి మాట్లాడుతూ ఈవిధంగా తెలియజేశారు: "ఎవరైనా స్త్రీ తన భర్త కుటుంబానికి చెందని పిల్లవాడ్ని (అక్రమ సంతానాన్ని) ఆ కుటుంబంలోకి తెచ్చి దూర్చితే ఆమెతో దేవునికి ఎలాంటి సంబంధం ఉండదు. దేవుడు ఆమెను ఎన్నటికీ స్వర్గానికి పంపడు. అలాగే ఎవరైనా పురుషుడు తనవైపు పిల్లవాడు (ప్రేమగా) చూస్తున్నా ఆ పిల్లవాడితో ఉన్న జన్మ సంబంధాన్ని నిరాకరిస్తే ప్రళయదినాన దేవుడు అతని వైపు కన్నెత్తి కూడా చూడడు; యావత్తు మానవుల ముందు అతడ్ని అవమానం పాలుజేస్తాడు.'' (అబూదావూద్, నసాయి, దార్మి)



## అక్రమ పద్ధతులతో ఆలుమగలను విడదీయడం నేరం

దాంపత్యజీవితం మానవసంస్కృతికి మూలాధారం. భార్యాభర్తల మధ్య దాంపత్య జీవితం సవ్యంగాసాగితే సమాజంలో కూడా మంచి సభ్యతా సంస్కృతులు ఏర్పడతాయి. అందులో అపసవ్యత, అపశృతులు చోటుచేసుకుంటే సభ్యతా సంస్కృతులు కూడా వికటిస్తాయి. అంచేత అపోహలు, అపార్థాలు, మాయమాటలు, మంత్రతంత్రాలు లేదా మరే అక్రమపద్ధతుల ద్వారానైనా సరే భార్యాభర్తల్ని విడదీయడాన్ని ఖుర్‌ఆన్ అవిశ్వాసం (కుఫ్ర్)తో పోల్చింది. యూదుల చరిత్రను ప్రస్తావిస్తూ ఇలా పేర్కొన్నది:

"గ్రంథప్రజలలో చాలామంది చిత్తశుద్ధితో సత్యాన్ని విశ్వసించేవారే కాదు. వారి వద్దకు దేవుని వైపు నుంచి ఏ ప్రవక్తయినా వారి గ్రంథాన్ని ధృవీకరిస్తూ వచ్చినప్పుడు వారిలో ఒక వర్గం తనకసలు ఏమీ తెలియనట్లు దైవగ్రంథాన్ని అటకమీద ఎత్తిపెట్టింది. పైగా వారు, సులైమాన్ పాలనాకాలం పేరుతో దయ్యాలు చెప్పే విషయాల్ని పాటించ నారంభించారు. కాని సులైమాన్ ఎన్నడూ సత్యతిరస్కారం జోలికే పోలేదు. జనానికి భూతవిద్య నేర్పుతుండిన ఆ దయ్యాలే సత్యతిరస్కారానికి పాల్పడ్డాయి."

"అంతేకాదు, బాబిల్‌లో హారూత్, మారూత్ అనే ఇద్దరు (మానవాకారంలో వచ్చిన) దైవదూతలపై అవతరించిన విషయాల్ని కూడా వారు పట్టుకువ్రేలాడారు. కాని ఆ దైవ దూతలు జనానికి ఆ విషయాలు నేర్పేముందు "మేము ప్రజల్ని పరీక్షించడానికి పంప బడినవాళ్ళం మాత్రమే. అంచేత మీరు అవిశ్వాసానికి (అంటే సత్యతిరస్కారానికి) పాల్పడ కండి" అని వారికి స్పష్టంగా చెప్పేవారు. అయినా వారు భార్యాభర్తల్ని విడదీసే ఆ క్షుద్ర విద్యనే నేర్చుకోవడానికి ఉబలాటపడేవారు." (2:100-102)

యూదులు తౌరాత్ విద్యను వదిలేసి భార్యాభర్తలను విడదీసే క్షుద్రవిద్యను (చేతబడి) నేర్చుకోవడానికి ఒడిగట్టారు. ఈ విద్య ద్వారా వారు తాము కోరుకున్న స్త్రీని ఆమె భర్తనుండి విడదీసి తమవైపు తిప్పుకునేవారు. ఈ విద్య అవిశ్వాసానికి దారి తీసే ఘోరపాపమని తెలిసికూడా దాన్ని నేర్చుకోవడానికే ఉబలాటపడేవారంటే వారు నైతికంగా ఎంత దిగజారిపోయారో ఊహించవచ్చు. వారి నైతికపతనాన్ని బట్టబయలు చేయడానికే దేవుడు తన దూతల ద్వారా యూదులకు ఈ పరీక్ష పెట్టాడు.

ఈ పరీక్ష విభిన్నరూపాలలో ఇప్పటికీ సాగుతోంది. మానవ బద్ధవిరోధి షైతాన్ (ఇబ్లీస్) తన అనుచరమూక ద్వారా ఇలాంటి ఉపద్రవాన్ని సృష్టిస్తాడు.

ఒక హదీస్ ప్రకారం షైతాన్ (ఇబ్లీస్) తన కేంద్రకార్యాలయం నుండి నేల నాలుగుచెరగులా తన అనుచరమూకను పంపిస్తాడు. వారు తిరిగొచ్చి తమతమ నివేదికలు అతనికి సమర్పిస్తారు. తాను ఫలానా ఉపద్రవాన్ని సృష్టించానని ఒకడంటే, తాను ఫలానా ఘనకార్యం చేసివచ్చానని మరొకడు చెబుతాడు. కాని ఇబ్లీస్ ప్రతి వాడితో "నువ్వు చేసిందేమీ లేదు" అంటాడు. చివరికి ఒకడు వచ్చి తాను ఓచోట

భార్యాభర్తల్ని విడదీయించానని అంటాడు. ఇబ్లీస్ ఈమాట విని సంతోషంతో అతడ్ని గుండెలకు హత్తుకుంటూ "శభాష్, నువ్వు నిజంగా ఘనకార్యమే చేసివచ్చావు" అని అంటాడు. (ఇబ్నెకసీర్)

## స్త్రీకి స్త్రీయే శత్రువు

చేతబడి-హిప్నాటైజ్‌ల ద్వారానైనా, అబద్ధాలు-అపనిందల ద్వారానైనా లేదా మరే అక్రమపద్ధతుల ద్వారానైనా సరే భార్యాభర్తలను విడదీయడం షైతాన్ పురిగొల్పే దుష్టచర్యలే. భర్త నుండి భార్యను విడదీయడంలో స్త్రీలు కూడా తక్కువేమీ కాదు. ఆ స్త్రీలు అత్తలు కావచ్చు, ఆడపడచులు కావచ్చు, తోడికోడళ్ళు కావచ్చు, సవతులు కావచ్చు లేదా ఇరుగుపొరుగు అమ్మలక్కలయినా కావచ్చు. అందుకే స్త్రీకి స్త్రీయే శత్రువన్నారు పెద్దలు.

దీన్నిబట్టి భార్యాభర్తలను అన్యాయంగా, అక్రమంగా విడదీయడం ఎంతటి ఘోరమైన పాపమో అర్థమవుతోంది. సంసారంలో చిచ్చుపెట్టి దంపతుల్ని విడదీయ డానికి చేతబడే అవసరం లేదు. కల్లబొల్లి మాటలతో కాపురాలు చెడగొట్టే కలహ ప్రియులు; అపార్థాలతో ఆలుమగల మధ్య అగాధంతవ్వి ఆనందించే అమ్మలక్కలు కూడా ఉంటారు. భర్యాభర్తల మధ్య అన్యోన్యత, అనురాగాలు కొరవడితే ఇలాంటి కలహప్రియులు, అమ్మలక్కలు సులభంగా తమ పని నెరవేర్చుకుంటారు. కనుక వాళ్ళపట్ల అప్రమత్తంగా ఉండాలి.

# 28. జీవనభృతి, మనోవర్తి

"ప్రవక్తా! "మీరు మీ స్త్రీలకు విడాకులివ్వదలిస్తే వారి గడువు (ఆరంభం)లో వారికి విడాకులివ్వండి. గడువుకాలం సరిగ్గా లెక్కపెట్టండి. మీ ప్రభువయిన దేవునికి భయ పడుతూ వ్యవహరించండి. (గడువు కాలంలో) వారు స్పష్టంగా ఏదైనా చెడ్డపని చేస్తే తప్ప వారిని (మీ) ఇండ్ల నుంచి పంపి వేయకండి. వారు కూడా ఇల్లు వదలి వెళ్ళి పోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు. దేవుడు నిర్ణయించిన హద్దులు అతిక్ర మించేవాడు ఆత్మవంచనకు పాల్పడినవాడవుతాడు."

"ఆ తరువాత దేవుడు బహుశా ఏదైనా అనుకూల వాతావరణం సృజించవచ్చు. మీకా విషయం తెలియదు. వారి గడువు కాలం ముగిసే సమయం ఆసన్నమైనప్పుడు వారిని (వేధించకుండా) మంచి వైఖరితో (వివాహబంధంలో) ఆపి ఉంచండి, లేదా (విడాకులిచ్చి పంపివేయడం తప్పదనుకుంటే తగాదాలేమీ లేకుండా) మంచిగా వారి నుండి విడిపోండి. (అప్పుడు) మీలో న్యాయం పాటించే ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా పెట్టుకోండి. (వారు) దేవుని కోసం ఉన్నది ఉన్నట్లు సరిగ్గా సాక్ష్యమివ్వాలి."

"దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించినవారికి ఈమాటల ద్వారా ఉపదేశం చేయ బడుతోంది. దేవునికి భయపడుతూ వ్యవహరించేవాడికి దేవుడు కష్టాల నుంచి బయట



పడేందుకు దారి చూపుతాడు. అతనికి దేవుడు అతని ఊహ సైతం పోని దిశ నుండి ఉపాధినిస్తాడు. దేవుడ్ని నమ్ముకునేవాడికి దేవుడే చాలు. దేవుడు తన పని తప్పక నెరవేరు స్తాడు. ఆయన ప్రతిదానికీ ఓలెక్క నిర్ణయించి పెట్టాడు." (ఖుర్ఆన్. 66:1-3)

## గడువు (ఇద్దత్)కాలం ఎవరికెంత?

(1) రుతుమతి ఇద్దత్ మూడు రుతుకాలాలు.

(2) పుష్పవతికాని బాలికల, ముట్టుడిగిన స్త్రీల ఇద్దత్ మూడు నెలలు.

(3) గర్భిణీ ఇద్దత్ ప్రసవించే వరకుంటుంది.

(4) గర్భిణీకాని స్త్రీ వితంతువైనప్పుడు ఆమె ఇద్దత్ నాల్గు నెలల పదిరోజులు.

"మీ స్త్రీలలో ఎవరైనా రుతుస్రావం పట్ల నిరాశచెందిఉంటే, వారి (గడువు నిర్ణ యం గురించి) మీకేదైనా అనుమానం కల్గినప్పుడు వారి గడువు మూడు నెలలు. ఈఆజ్ఞ రుతుస్రావం ఆరంభంకానివారికి కూడా వర్తిస్తుంది. గర్భవతుల విషయానికివస్తే, వారి గడువుకాలం వారు ప్రసవించే వరకు ఉంటుంది." (ఖుర్ఆన్-65:1-4)

ఒకవేళ ఎవరయినా తన భార్యకు బహిష్టురోజుల్లో విడాకులిస్తే అలాంటి స్త్రీ ఇద్దత్ ఆ తరువాత మూడు రుతుకాలాలు ఉంటుంది. అంటే విడాకులు ఇచ్చిన రుతుకాలం వదలి మరో మూడు రుతుకాలాలు గడచిన తరువాతనే ఆమె ఇద్దత్ గడువు ముగుస్తుందన్న మాట.

## హజ్రత్ అస్లమియ్యా (రజి) ఇద్దత్ ఉదంతం

గర్భవతి విడాకులుపొందినా, వితంతువయినా ఆమె గడువుకాలం ప్రసవించే వరకే ఉంటుంది. ఆ తరువాత ఆమె మెట్టిల్లు వదలి రెండో పెళ్ళి చేసుకోవచ్చు.

ముస్లిం, బుఖారి హదీసుల ప్రకారం హజ్రత్ సాద్ బిన్‌ఖౌలా (రజి) చనిపోయిన కొన్నాళ్ళ తరువాత (విభిన్న ఉల్లేఖనాలలో పేర్కొన్నదానిని బట్టి నలభై రోజుల లోపు) ఆయన భార్య అస్లమియ్యా (రజి) ప్రసవించారు. అప్పుడు ఒకాయన, "(2:234 సూక్తి ప్రకారం) నీవు నాలుగునెలల పదిరోజుల (గడువు)కు ముందు రెండవ వివాహం చేసుకోలే"వని అన్నాడు. హజ్రత్ అస్లమియ్యా (రజి) ఈమాట విని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి విచారించారు. దైవప్రవక్త (స) ఆమెకు జవాబిస్తూ "నీవు ప్రసవించగానే రెండోపెళ్ళికి ధర్మసమ్మతమయి పోతావ"ని చెప్పారు.

## పోషణకాలం ఎవరెవరికి ఎంతెంత?

"(గడువుకాలంలో) వారిని మీరు నివసించే చోటనే ఉంచండి. ఆచోటు ఎలాంటిదయినా పరవాలేదు. వారిపై వత్తిడి తేవడానికి (పొమ్మనలేక పొగపెట్టి నట్లు) వారిని వేధించకండి. వారు గర్భవతులైతే ప్రసవించేవరకు వారికోసం ఖర్చు పెట్టండి." (ఖుర్ఆన్-65:6)

"ధనికుడు తన ఆర్థికస్తోమతను బట్టి పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన (పేద)వాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి. దేవుడు ఎవరికెంత ఇచ్చాడో అంతకుమించి వారిపై భారం మోపడు. దేవుడు మనిషికి లేమి తరువాత కలిమి కూడా ప్రసాదించవచ్చు." (ఖుర్‌ఆన్-65:7)

"మీలో ఎవరికైనా మరణకాలం ఆసన్నమైనప్పుడు వారిభార్యలు జీవించివుంటే, ఒక ఏడాదిపాటు వారి (పోషణ)ఖర్చులు భరించాలని, ఇంటినుండి వెడలగొట్టరాదని వారు విల్లు రాసిపోవాలి. ఆ స్త్రీలు తమంతటతాము ఇంటి నుండి వెళ్ళిపోయి తమకు నచ్చినపని (పునర్వివాహం) ధర్మసమ్మతంగా చేసుకోదలిస్తే దానికి మీపై ఎలాంటి బాధ్యత ఉండదు. దేవుడు సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు." (ఖుర్‌ఆన్-2:240)

## ఐచ్ఛిక జీవనభృతి సముచిత రీతిలో ఇవ్వాలి

"విడాకులు పొందిన మహిళలక్కూడా సముచిత రీతిలోఎంతో కొంత జీవనభృతి ఇచ్చిపంపాలి. ఇది దైవభీతిపరులు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం. మీరు విషయం అర్థం చేసుకుంటారని దేవుడు ఈ విధంగా తన ఆజ్ఞల్ని మీకు విడమరచి బోధిస్తున్నాడు." (ఖుర్‌ఆన్-2:241-242)

ఇది "ఆస్తిపంపకం జరుగుతున్నప్పుడు వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు వస్తే వారిక్కూడా ఎంతో కొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి." (4:8) అనే సూక్తిలా అనుమతి మాత్రమేగాని ఆజ్ఞ కాదు.

## విభిన్న రకాల జీవనభృతులు

ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తుల్ని బట్టి స్త్రీకి పురుషుడు ఇవ్వవలసిన జీవనభృతి ఈ విధంగా ఉంది:

(1) భర్త తన భార్యకు పోషణ తదితర జీవితావసర వస్తువులన్నీ స్తోమతను బట్టి సమకూర్చాలి. ఒకవేళ భర్త ఈ బాధ్యత నెరవేర్చకపోతే ఇస్లామీయ చట్టం అతనిపై వత్తిడి తీసుకొస్తుంది. పోషణబాధ్యత నిర్వహించడానికి నిరాకరిస్తే, లేదా పోషించే స్తోమత అసలు లేకపోతే అతని వివాహం విచ్ఛేదం గావించబడుతుంది.

(2) భర్త తనభార్యకు విడాకులిస్తే (మూడు రుతుక్రమాల) గడువు కాలం ముగిసేదాకా ఆమెను పోషించాలి. రుతుస్రావం ఆగిపోయినవారి లేదా రుతుస్రావం ఆరంభం కానివారి ఇద్దత్ కాలం మూడు నెలలు ముగిసేదాకా ఆమెను పోషించాలి.

(3) విడాకులిచ్చి గడువుకాలం తీరిన తర్వాత ఆమెకు ఎంతోకొంత ఇచ్చి సాగనంపాలి. ఇది అనుమతి మాత్రమే, విధిగా చెల్లించవలసిన ఆజ్ఞ కాదు. అంతేగాని, రెండో పెళ్ళి చేసుకునేదాకా ఆమెకు మనోవర్తి లేక భరణం రూపేణ ఎలాంటి సొమ్ము ఇవ్వనవసరం లేదు.



(4) గర్భవతులకు వారు ప్రసవించే వరకు వారి పోషణ ఖర్చులు భరించాలి. ప్రసవించిన తరువాత బిడ్డకు పాలుపట్టవలసి వస్తే అప్పుడు కూడా ఆమె పోషణ ఖర్చులు భరించాలి.

(5) భర్త మరణించి భార్య వితంతు వయినప్పుడు భర్త బంధువులు ఒక ఏడాది పాటు ఆమె పోషణ ఖర్చులు భరించాలి.

స్త్రీ జీవనభృతి గురించి ఇస్లాం ఆదేశాలు ఇలా ఉంటే, మన దేశ చట్టం (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)లో ఈవిధంగా ఉంది:

## భారతీయ శిక్షాస్మృతిలో భర్తపై మనోవర్తి భారం

"ఏ వ్యక్తి అయిననూ తగిన స్తోమత ఉండి, పోషించుకోలేని తన భార్యను పోషించడానికి అశ్రద్ధచేసిన లేక నిరాకరించిన యెడల ఒకటో తరగతి మేజిస్ట్రేట్ అలాంటి అశ్రద్ధ లేక నిరాకరణ రుజువయిన మీదట అలాంటి వ్యక్తిని అలాంటి భార్య పోషణ నిమిత్తం మొత్తం నెలకు రూ.500/-లకు మించకుండా, అలాంటి మేజిస్ట్రేట్ యుక్తమని తోచినట్లు నెలసరి రేటు చొప్పున భత్యం ఇవ్వమని ఉత్తరువు చేసి, మేజిస్ట్రేట్ ఎప్పటికప్పుడు ఆదేశించు అలాంటి వ్యక్తికి చెల్లించమని ఉత్తరువు చేయ వచ్చు." (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్: సెక్షన్ 125-1 (ఎ)

అయితే క్రిమినల్ కోడ్‌లోని ఇదే సెక్షన్‌లో మరోచోట విడాకులు పొందిన స్త్రీ కూడా ఆమె మాజీభర్త నుండి మనోవర్తి పొందడానికి అర్హురాలని పేర్కొంటోంది. ఇక్కడే ముస్లింలకు పెద్ద చిక్కొచ్చి పడింది. మాజీభర్త నుండి విడాకులు పొందిన స్త్రీ మనోవర్తి ఇస్లామీయ ధర్మశాస్త్రానికి, ముస్లిం పర్సనల్ లాకు పూర్తిగా విరుద్ధం.

ఇస్లామీయ రాజ్యంలో విడాకులిచ్చిన స్త్రీకి సులభంగా పునర్వివాహం జరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. విడాకులిచ్చిన స్త్రీ కష్టాలలో పడవలసిన అవసరమే ఉండదు. కాని ధర్మప్రసక్తిలేని లౌకికరాజ్యాలలో, ప్రత్యేకంగా పునర్వివాహ సదుపాయాలు సన్నగిల్లడంతో పాటు వరకట్న దురాచారం విచ్చలవిడిగా సాగుతున్న మనదేశంలో విడాకులివ్వబడిన మహిళలకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. హిందూ స్త్రీలకైతే పునర్వివాహానికి అవకాశమే లేదు. దీనికి తోడు స్వార్థపరులైన పురుషులు కట్నాల కోసం తమ భార్యలకు విడాకులివ్వడం ఎక్కువైపోయింది.

## షాహ్‌బాను కేసు, సుప్రీంకోర్టు తీర్పు

చివరికి ఈరోగం క్రమంగా ముస్లింలక్కూడా సోకింది. వీరి మూలంగానే ముస్లిం పర్సనల్ లాకు అప్రతిష్ఠ వచ్చిపడుతోంది. మరోవైపు ఇస్లాంవ్యతిరేక శక్తులు విడాకులు ఇవ్వబడిన స్త్రీలకు సైతం మనోవర్తి ఇప్పిస్తున్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ని ఆధారం చేసుకొని ముస్లిం పర్సనల్ లాని అంతమొందించడానికి ప్రయత్నిస్తున్నాయి. 1985లో షాహ్‌బాను కేసులో జరిగిందే ఇదే.

ఈ కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఖుర్ఆన్ భావాన్ని ప్రకికరించి షరీఅత్ ఉద్దేశానికి వ్యతిరేకంగా తీర్పిచ్చారు. దానివల్ల ముస్లిమేతర మేధావులతో పాటు మాజీ మంత్రి ఆరిఫ్ఖాన్‌లాంటి కొందరు సెక్యులర్ ముస్లింలు సైతం కోర్టుతీర్పుని సమర్థించారు. ఆనాడు కోర్టుతీర్పును సమర్థించినవారు రెండు విధాలుగా ఉండేవారు. కోర్టు తీర్పు ముస్లింపర్సనల్‌లా పరిధిలోనే ఉందని ఒకవర్గం అంటే, తీర్పులో కోర్టు పేర్కొన్న క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్ 125, 127 సెక్షన్లు మాత్రమే విడాకులివ్వబడిన స్త్రీల హక్కుల్ని ఎక్కువగా కాపాడగలుగుతాయని రెండోవర్గం వాదించింది. అసలు విషయం ఏమిటంటే వీరుభయులు కూడా ముస్లిం పర్సనల్ లాను వ్యతిరేకించేవారే.

## ముస్లింమహిళా హక్కుల రక్షణచట్టం

కోర్టుతీర్పు ముస్లిం పర్సనల్ లాకు వ్యతిరేకంగా ఉందని షరీఅత్ వేత్తలతో సహా అత్యధికమంది ముస్లింల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో 1986లో అప్పటి ప్రధాని కీ.శ. రాజీవ్ గాంధీ "ముస్లిం మహిళా హక్కుల రక్షణ బిల్లు" అనే పేరుతో ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. ఆ తరువాత ఇది చట్టంగా రూపొందింది.

అయితే సుప్రీంకోర్టు తీర్పును సమర్థించినవారు ఈ బిల్లును వ్యతిరేకించారు. వారిలో మొదటివర్గం ఈ బిల్లు ముస్లిం పర్సనల్ లాకే వ్యతిరేకంగా ఉందని కువిమర్శలు చేసింది. కాగా రెండోవర్గం ప్రతిపాదిత బిల్లు కంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125, 127 సెక్షన్‌లే ముస్లిం స్త్రీలకు ఎక్కువ రక్షణ కల్పిస్తాయని దుష్ప్రచారం చేసింది. ఈ రెండిటిలో ముస్లిం మహిళలకు ఏది ఎక్కువ ప్రయోజనకరమో కాస్త పరిశీలిద్దాం:

## ఏది ప్రయోజనకరమో చూడండి

(1) విడాకులుపొందిన స్త్రీ తననుతాను పోషించుకోలేని స్థితిలో ఉండి, ఆమె భర్త ఆర్థికంగా స్థితిపరుడై ఉంటే, ఆ స్త్రీ చనిపోయేదాకా లేదా పునర్వివాహం జరిగేదాక ఆమె జీవనభృతి పొందే హక్కును క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్ సెక్షన్ 125 ప్రసాదిస్తున్నది.

(2) ఏదైనా సంప్రదాయం క్రిందగాని, వ్యక్తిగతచట్టం (మహర్) క్రిందగాని ఆమె ఏకమొత్తాన్ని (అంటే మొత్తం డబ్బును) పొందివుంటే పైన చెప్పిన 125వ సెక్షన్ ఆమెకు వర్తించదని సెక్షన్ 127(3-బి)లో పేర్కొనబడింది.

(3) ముస్లిం పర్సనల్ లా జోలికి పోకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ 127(3-బి)సెక్షన్‌ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. (చూడండి, రాజ్యసభ ప్రసంగాలు సంపుటి 86, ఎల్.ఓ.ఎల్. 186 తేదీ 18-12-1973. అప్పటి హోం శాఖ మంత్రి రామ్ నివాస్ మిర్ధా చేసిన ప్రసంగం.)

(4) సుప్రీంకోర్టు షాహ్‌బాను కేసుపై తీర్పు ఇచ్చి, పార్లమెంట్ ముస్లింలకు కలగజేసిన ఈ చట్టబద్ధమైన రక్షణను వ్యర్థపరిచింది.



(5) ముస్లిం వ్యక్తిగత చట్టం ప్రకారం విడాకులివ్వబడిన స్త్రీల హక్కులను పార్లమెంట్ స్పష్టంగా రక్షించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1973)లో వాటిని పదిలపరిచేలా సెక్షన్ 125, 127(3-బి)లకు చేర్పులు ప్రతిపాదించే "బనాత్‌వాలా బిల్లు"ను భారతీయ ముస్లింలు పూర్తిగా సమర్థించారు.

(6) విడాకులు ఇవ్వబడిన స్త్రీల హక్కులను కాపాడాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 26-2-1986న లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది.

(7) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మరియు పార్లమెంట్ ఆమోదించిన బిల్లు ప్రకారం విడాకులు ఇవ్వబడిన ముస్లిం స్త్రీల హక్కులు ఎలా ఉంటాయో చూడండి:

## క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వివరాలు

1. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 125, 127 (3-బి) ప్రకారం-

(క) విడాకులు ఇవ్వబడిన స్త్రీ తననుతాను పోషించుకోలేని పక్షంలో

(చ) మాజీభర్త బ్రతికుండి ఆర్థికంగా మంచిస్థితిలో ఉంటే, ఆమె రెండోపెళ్ళి చేసుకునే వరకుగాని లేదా చనిపోయే వరకుగాని జీవనభృతికి అర్హురాలు. సెక్షన్ 125 (బి)లో ఒక అసాధారణమైన ప్రొవిజన్ ఉంది. అదేమిటంటే విడాకులు ఇవ్వబడిన స్త్రీకి జీవనభృతి ఇచ్చే బదులు, భర్త ఆమెను తనతో కలిసిఉండమని కోరవచ్చుట! దీన్నిబట్టి స్వయంగా ప్రభుత్వమే వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తోందని స్పష్టంగా తెలుస్తోంది.

## ముస్లింమహిళా హక్కుల చట్టం వివరాలు

2. విడాకులు ఇవ్వబడిన ముస్లిం మహిళల హక్కుల పరిరక్షణ బిల్లు-1986 ప్రకారం విడాకులు ఇవ్వబడిన స్త్రీ-

(క) ముందు షరతులేవీ లేకుండా ఇద్దత్ (షరీషత్ గడువు) కాలం వరకు మాత్రమే మనోవర్తి పొందడానికి అర్హురాలు.

(చ) సంప్రదాయం ప్రకారం సహేతుకమైన, సముచితమైన మొత్తం (సొమ్ము) పొందడానికి అర్హురాలు.

(ట) పిల్లల పోషణార్థం రెండేళ్ళ వరకు మాజీభర్త నుండి ఖర్చు రాబట్టవచ్చు.

(త) విడాకులు పొందేవరకు చెల్లించకుండాఉన్న మహర్ మొత్తం తీసుకోవచ్చు.

(ప) వివాహ సందర్భంలోగాని, వివాహమైన తర్వాతగాని బంధువులు, స్నేహితులు ఆమెకిచ్చిన బహుమతులు అన్నీ ఆమె ఉంచుకోవచ్చు.

## వక్ఫ్‌బోర్డు పాత్ర (వారసులకు ప్రత్యామ్నాయం)

(ర) ఒకవేళ విడాకులు ఇవ్వబడిన స్త్రీ తిరిగి పెళ్ళి చేసుకోకుండా ఇద్దత్ (గడువు) కాలం ముగిసిన తరువాత కూడా తనను పోషించుకోలేని పరిస్థితిలో ఉంటే,

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం ఆమె ఆస్తికి వారసులయ్యే బంధువులు ఆమె జీవన స్థాయికి తగినట్లు ఆమెకు జీవనభృతి ఇవ్వాలి.

వారసులంటే ఆమె సంతానం, తల్లిదండ్రులు, సోదరీసోదరులు, మేనమామలు, మేనత్తలు మొదలైనవారు. ఒకవేళ ఎవరూ బ్రతికి ఉండకపోతే- ఆమె పునర్వివాహం దాకాగాని లేదా మరణం దాకాగాని ఆమెకు జీవనభృతిని "వక్ఫ్‌బోర్డు" చెల్లిస్తుంది.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో అనాథ స్త్రీల హక్కుల రక్షణకు ఎలాంటి ఏర్పాట్లు లేనందున, పై పట్టికలో చూపిన విధంగా విడాకులు ఇవ్వబడిన ముస్లిం మహిళల కోసం ప్రతిపాదించబడిన హక్కులు తరతమ భేదం లేకుండా అనాథ (వితంతు) స్త్రీలకు కూడా సంక్రమిస్తాయి. ఎందుకంటే మాజీభర్త స్థానంలో ఇప్పుడు "సహజ ప్రత్యామ్నాయం"గా ఆమె బంధువులు అనే పదం చేర్చబడింది.

"విడాకులు ఇవ్వబడిన ముస్లిం మహిళల హక్కుల పరిరక్షణ చట్టం" ఈ విధంగా ముస్లింలకు రెండు లాభాలు చేకూర్చింది.

ఒకటి, విడాకులు ఇవ్వబడిన స్త్రీ తనను తాను పోషించుకునే శక్తి ఉన్నా లేకపోయినా ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆమె ఇద్దత్ (గడువు) వరకే మాజీ భర్త నుండి జీవనభృతి పొందడానికి అర్హురాలు. కాగా ఈ చట్టం ఆమెకు తననుతాను పోషించుకో లేనిస్థితిలో ఉన్నప్పుడు జీవనభృతిని మరణించేదాకా ఆమె బంధువుల చేత ఇప్పిస్తుంది. బంధువులకు ఆ స్తోమత లేకపోతే వక్ఫ్‌బోర్డ్ చేత ఇప్పిస్తుంది.

రెండు, ముస్లిం పర్సనల్ లాకు వ్యతిరేకంగా కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీలులేకుండా ఈ చట్టం కట్టుదిట్టం చేసింది. కోర్టులు రాజ్యాంగంలోని "అడ్డదారి" ద్వారా షరీఅత్‌వ్యతిరేక తీర్పిస్తే ఈ చట్టంతో దాన్ని ఆపడానికి ప్రయత్నించవచ్చు. అదీగాక భవిష్యత్తులో మతదురభిమానులు యూనిఫాం సివిల్‌కోడ్ పేరుతో ముస్లింలను ఇస్లామీయ షరీఅత్ చట్టాలకు దూరంచేసే ప్రమాదంకూడా లేకపోలేదు. కనుక ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ముస్లింలు తమ సమైక్యతను, సామూహిక శక్తిని ప్రదర్శించ గలిగినప్పుడే పర్సనల్ లాకు, షరీఅత్ చట్టాలకు రక్షణ ఉంటుంది.

## 29. పునర్వివాహం, పిల్లల సమస్య

విడాకులు ఇవ్వబడిన యువతులకు వారి పెద్దలు వీలయినంత త్వరగా మళ్ళీ పెళ్ళి చేసెయ్యాలి. అలాంటి యువతులకు ఈనాడు పెళ్ళిళ్ళు కావడం చాలా కష్టమయి పోయింది. సౌశీల్యం, ధర్మపరాయణతలు కోరుకునే యువకులు ఆ గుణగణాలు ఉండే యువతులు లభించినప్పుడు విడాకులివ్వబడినా వారిని చేసుకోవడానికి ముందుకు రావాలి. ఇదిఎంతో పుణ్యకార్యం. "తన మానమర్యాదలు కాపాడే పురుషు డెవరూ లేకుండా ఆమె ఒంటరి జీవితం గడపకూడదు" అని ఖుర్‌ఆన్‌లో ఉంది.



"మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చివేయడం, వారి గడువు (ఇద్దత్) తీరిపోవడం జరిగిన తరువాత, వారు తమ పూర్వపు భర్తలను లేదా ఇతర పురుషులను వివాహమాడదలచిన పక్షంలో, అందుకు వారుభయుల మధ్య ధర్మయుక్తంగా పరస్పరం అంగీకారం కుదిరితే, మీరు వారివివాహాన్ని అడ్డుకోకండి, దైవాన్ని, అంతిమదినాన్ని విశ్వసించేవారికి ఈ ఆదేశం ద్వారా హితోపదేశం చేయబడుతోంది. ఇది మీకోసం ఎంతో సంస్కారవంతమైన పవిత్ర విషయం. అన్ని విషయాలు దేవునికే తెలుసు, మీకు తెలియవు." (ఖుర్‌ఆన్–2:232)

## వితంతు పునర్వివాహం

విడాకులు ఇవ్వబడిన తరువాత లేక వితంతువయిన తరువాత స్త్రీ మళ్ళీ పెళ్ళి చేసుకోదలిస్తే దానికి ఎవరూ అభ్యంతరం పెట్టకూడదు. దీన్ని గురించి దివ్యఖుర్‌ఆన్‌లో స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి:

"మీ (పురుషుల)లో ఎవరైనా చనిపోయి, వారి భార్యలు బ్రతికివుంటే అలాంటి స్త్రీలు నాలుగు నెలల పదిరోజులు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈవిధంగా గడువుకాలం (ఇద్దత్) ముగిసిన తరువాత వారు తమకు నచ్చిన పని (పునర్వివాహం) తగిన రీతిలో చేసుకోవచ్చు. దానికి మీపై ఎలాంటి బాధ్యతలేదు. మీరు చేసే పనులన్నీ దేవునికి తెలుసు." (2:234)

"గడువుకాలంలో మీరు ఆ వితంతు స్త్రీని వివాహమాడ దలచినట్లు సూచన ప్రాయంగా తెలియజేసినా లేదా మీ ఉద్దేశ్యాన్ని మీ మనసులోనే దాచివుంచినా ఎలాంటి తప్పు లేదు. మీరీ విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావిస్తారని దేవునికి తెలుసు. అయితే ఒక విషయం గుర్తుపెట్టుకోండి – మీరు చాటుమాటుగా ఎలాంటి ఒప్పందం చేసుకోకండి. ఏది చేసినా ధర్మయుక్తంగానే చేయాలి. గడువుకాలం తీరనంతవరకు మీరు పెళ్ళి విషయం లో గట్టినిర్ణయం మాత్రం తీసుకోకూడదు. మీ హృదయాల్లో మెదిలే ప్రతి విషయం దేవునికి తెలుసు. కనుక ఆయనకు భయపడుతూ ఉండండి. అదీగాక దేవుడు (మీ చిన్న చిన్న పొరపాట్లు) మన్నించేవాడని, సహించేవాడని కూడా తెలుసుకోండి." (2:235)

ఈ నాలుగు నెలల గడువులో ఆ స్త్రీ పునర్వివాహానికేగాకుండా మేకప్‌కు, అలంకర ణకు కూడా దూరంగాఉంటూ భర్త ఇంట్లోనే ఉండాలి. ప్రవక్త ప్రవచనాలను బట్టి అలాంటి స్త్రీ గడువుకాలంలో నగలు, రంగువస్త్రాలు ధరించకూడదని, సాదావస్త్రాలే ధరించాలని; గోరింటాకు, సుర్మా, కాటుక పెట్టుకోకూడదని, కేశాలంకరణ కూడా చేసుకో కూడదని తెలుస్తోంది. ఒకవేళ భర్త చనిపోయే సమయంలో ఆ స్త్రీ గర్భిణీగా ఉంటే, ఆమె గడువుకాలం ప్రసవించే వరకుంటుంది; ప్రసవించగానే ఆమె గడువు తీరిపోతుంది.

## సంతానంలేని వితంతువు కష్టాలు

విడాకులిచ్చిన తర్వాత చంటిబిడ్డకు చనుబాల కోసం తల్లిని కూడా పోషించవలసి వస్తుందని కొందరు నిర్దాక్షిణ్యంగా బిడ్డకు తల్లిపాలు త్రాగనీయకుండా ఆ స్త్రీని ఇంటి

నుంచి వెడలగొడ్తారు. ఈ సందర్భంలో మరికొందరు దైవాజ్ఞలను అనుసరించకుండా లేనిపోని కొత్తసమస్యలు సృష్టిస్తారు. వీటి ప్రభావం అమాయకులైన పిల్లలపై పడి తల్లిదండ్రుల పట్ల ద్వేషభావం జనించడానికి కూడా ఆస్కారం ఉంటుంది.

సంతానంలేని పరిస్థితిలో భర్త మరణిస్తే ఆ స్త్రీ దుస్థితి వర్ణనాతీతం. భర్త తరఫు బంధువులు దైవం నిర్ణయించిన గడువుకు ముందే ఆమెను ఇంటి నుంచి వెడలగొడ్తారు. భర్త ఆస్తిలో భాగం ఇవ్వకపోగా కొంతమంది అజ్ఞానులు వివాహ సందర్భంలో ఆమెకు అటు తల్లిదండ్రులు ఇచ్చిన ఆభరణాలు, ఇటు భర్త ఇచ్చిన కానుకలు కూడా దోచుకొని ఆ అమాయకురాలిని కట్టుబట్టలతో తరిమేస్తారు.

తరువాత ఈ అభాగిని గత్యంతరంలేక తల్లిదండ్రుల పంచన చేరితే, అజ్ఞానం, ఆర్థిక దురవస్థలో ఉండే తల్లిదండ్రులు ఆమెను తమ పాలిట శనిగా, ఓ పెద్ద భారంగా భావించి సరిగా ఆదరించరు. ఈ రోజుల్లో కన్య వివాహం కావడమే అంతంత మాత్రం అయితే, ఇక వితంతు పునర్వివాహం గురించి ఆలోచించగలమా?

మిడిమిడి జ్ఞానంకల మరికొంతమంది కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకునో లేక ఆస్తిని వదలుకోలేకనో పునర్వివాహం చేసుకోకుండా తమ కుటుంబంలోని ఏదైనా పిల్లవాడ్ని పెంచుకొని, ఆస్తిని అనుభవిస్తూ భర్త గృహంలోనే ఉండిపొమ్మని ఆ స్త్రీని బలవంతం చేస్తారు.

## బిడ్డకు పాలిచ్చేవారికి పోషణ ఖర్చులివ్వాలి

మహిళాభ్యుదయానికి అంతరాయం కలగజేస్తున్నవారిని ఖుర్ఆన్ తీవ్రంగా నిరసిస్తోంది. విడాకులు పొందిన స్త్రీ చంటిబిడ్డకు పాలివ్వాలని బిడ్డ తండ్రి అడిగితే బిడ్డ పాలు తాగడం మానేవరకు కనీసం రెండు సంవత్సరాలైనా తల్లీబిడ్డలు ఇద్దర్నీ పోషించా లని ఖుర్ఆన్ ఆదేశిస్తోంది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"ఆ తరువాత వారు మీ కోసం (బిడ్డకు) పాలు పట్టవలసివస్తే, వారికి ప్రతిఫలం ముట్టజెప్పండి. మీరు పరస్పరం సంప్రదించుకొని ఇద్దరికీ ఆమోదయోగ్యమైన రీతిగా నిర్ణయం తీసుకోండి. ఒకవేళ (ప్రతిఫలం నిర్ణయంలో) మీరు ఒకరికొకరు ఇబ్బందులు కలిగించుకునే పరిస్థితి ఏర్పడితే మరెవరైనా స్త్రీ చేత బిడ్డకు పాలు పట్టించాలి."

"ధనికుడు తన స్తోమతను బట్టి ఈపోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన (పేద)వాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి. దేవుడు ఎవరికెంత ఇచ్చాడో అంతకు మించి వారిపై భారం మోపడు. దేవుడు మనిషికి లేమి తరువాత కలిమి కూడా ప్రసాదించవచ్చు." (65:6,7)

"తల్లులు తమ బిడ్డలకు గడువుకాలం పూర్తయ్యేవరకు పాలు పట్టదలచుకుంటే పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు బిడ్డతండ్రి ఆమెకు తగిన రీతిలో



తిండి, బట్ట సమకూర్చవలసి ఉంటుంది. అయితే వారుభయుల్లో ఏ ఒక్కరిపైనా శక్తికి మించిన భారం మోపకూడదు. బిడ్డను కన్నందుకు ఇటు తల్లినీ కష్టపెట్టకూడదు; బిడ్డజన్మకు కారకుడయినందుకు అటు తండ్రినీ వేధించకూడదు."

"బిడ్డకు పాలుపట్టే తల్లి పట్ల బిడ్డ తండ్రికి ఎంత బాధ్యత ఉందో అతని వారసుల క్కూడా అంతే బాధ్యత ఉంది. ఒకవేళ తల్లిదండ్రులు ఒకర్నొకరు సంప్రదించుకొని పరస్పరా మోదంతో బిడ్డకు పాలు మాన్పించ దలచుకుంటే అందులో ఎలాంటి తప్పులేదు. అలాగే మీరు మీ పిల్లలకు వేరే స్త్రీల చేత పాలు పట్టించాలనుకున్నా తప్పు లేదు. కాకపోతే పాలుపట్టే వారికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పాలి. మీరు దేవునిపట్ల భయభక్తులతో వ్యవహరించాలి. గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్–2:233)

## పితృప్రేమ, మాతృమమకారం మధ్య పిల్లలు

విడాకుల తరువాత పిల్లలు ఎవరికి చెందుతారు? పిల్లలు ఎక్కువగా తల్లివైపు మొగ్గుతారా లేక తండ్రి వైపు మొగ్గుతారా? ఇది ఈనాడు కూడా ఒక జటిల సమస్యగా ఉంది. ఈ రోజుల్లో భర్త, భర్త తరఫు బంధువులు విడాకులు పొందిన మహిళ నుండి పిల్లల్ని బలవతంగా విడిపించి తీసుకోవడం లాంటి సంఘటనలు మనం చూస్తున్నాము. కాని ఈ సమస్యకు ఇస్లాం సరయిన పరిష్కారం చూపింది. స్త్రీ రెండవ పెళ్ళి చేసుకోనంత వరకు పిల్లలు తల్లి దగ్గర ఉంటారని, రెండవపెళ్ళి చేసుకున్న తరువాత తండ్రి పంచన చేరుతారని అబూదావూద్ గ్రంథంలోని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది.

ఒకతను ఒక పిల్లవాడు కూడా కలిగిన తన భార్యకు విడాకులిచ్చాడు. అప్పుడతను పిల్లవాడ్ని తల్లి నుంచి తీసుకోదలిచాడు. ఇది ఆ స్త్రీకి ఏమాత్రం నచ్చలేదు. ఆమె దైవ ప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి "దైవప్రవక్తా! నాగర్భం ఈ పిల్లవాడి పాత్ర; నావక్షం ఇతని నీటితిత్తి; నా ఒడి ఇతని ఊయల. కాని ఇప్పుడితని తండ్రి నాకు విడాకులిచ్చాడు. ఇతడ్ని నా దగ్గర్నుండి లాక్కోవాలని చూస్తున్నాడు" అని ఫిర్యాదు చేసింది. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నువ్వు రెండవ పెళ్ళి చేసుకోనంతవరకు పిల్లవాడ్ని తీసుకోవడానికి నువ్వే అందరికన్నా ఎక్కువ అర్హురాలవుతావు" అని చెప్పారు.

పునర్వివాహం తరువాత పిల్లలు ఆమెకు సమస్యగా పరిణమిస్తారు. పిల్లల పోషణ బాధ్యత తండ్రి మీదే ఉంటుంది గనక స్త్రీ పునర్వివాహం తరువాత పిల్లల్ని తండ్రికి అప్పగించడమే మంచిది.

వేరొక హదీసులో దైవప్రవక్త (స) ఒక పిల్లవాడికి తండ్రి దగ్గర ఉండదలచుకుంటే తండ్రి దగ్గర, తల్లి దగ్గర ఉండదలచుకుంటే తల్లి దగ్గర ఉండవచ్చని చెప్పి పిల్లవాడి ఇష్టాయిష్టాలపై వదలిపెట్టారు. అప్పుడా పిల్లవాడు తల్లి దగ్గర ఉంటానని తల్లి చేయి పట్టుకున్నాడు. తల్లి తన కొడుకుని తీసుకొని వెళ్ళిపోయింది. (అబూదావూద్)

# 30. ఆర్థిక హక్కులు

ఖాసిం కొన ఊపిరితో అరగంట సేపు కొట్టుమిట్టాడి అంతిమశ్వాస విడిచాడు. దాంతో అతని కుటుంబం ఒక్కసారిగా గొల్లుమంది. ఖాసిం భార్య ఖైరున్ సంగతయితే సరేసరి. ఆమె భర్త భౌతికకాయం మీదపడి మరోసారి హృదయవిదారకంగా ఏడ్వడం ప్రారంభించింది. ఇదిలా ఉండగానే ఇంటి ఆవరణలో కొందరు బంధువులు గుసగుసలాడుకోవడం మొదలెట్టారు.

"ఇరవై రెండేళ్ళ పడుచు వయస్సులో ఉన్న ఈవిడ మరో పెళ్ళి చేసుకోదని గ్యారంటీ ఏమిటీ?" అంటూ రాగం తీశాడు ఒకతను.

"అయితే మాత్రం ఆమెకు భర్త ఆస్తిలో వాటా రాదంటారా?" ప్రశ్నించాడు మరొక వ్యక్తి ఖుర్‌ఆన్ ఆజ్ఞలను గుర్తుకు తెచ్చుకుంటూ.

"కాని ఖాసిం అన్నలు దానికి ఒప్పుకోకపోవచ్చు" అన్నాడు వేరొకడు అనుమానంగా.

## ఖైరున్ ఆస్తివాటాకు పడిన చిక్కుముడి

ఈ గుసగుసలతో ఖైరున్‌కు సంక్రమించవలసిన ఆస్తి వాటాకు చిక్కుముడి ఏర్పడింది. ఖాసిం శవాన్ని ఖననం చేసి వచ్చిన తరువాత సాయంత్రం పెద్దలు పంచాయితీ పెట్టారు. మొదట్లో ఖాసిం అన్నలు ఖైరున్‌కు గాని, ఖైరున్ పిల్లలకు గాని ఆస్తివాట ఇచ్చే ప్రసక్తి లేదని వాదించారు. కాని కొందరు పెద్దలు నచ్చజెప్పడంతో ఖాసింకు ఉన్న మొత్తం నాలుగు ఎకరాల పొలంలో రెండు ఎకరాలు మాత్రం పిల్లల పేర రాసివ్వడానికి అంగీకరించారు. ఖైరున్‌కు ఏమీలేదు. మిగిలిన రెండెకరాలు ఖాసిం అన్నలు స్వాధీనం చేసుకున్నారు.

ఖైరున్‌కు ఎంత అన్యాయం జరిగిందో ఈ సంఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. స్వార్థం, బలం, అజ్ఞానం ఉన్న చోట స్త్రీకి ఇలాంటి అన్యాయాలు జరగడం అందరికీ తెలిసిందే. సంతానం గనక లేకపోతే ఆ అభాగ్యురాలికి స్వార్థపరులు కట్టుబట్టలతోనే ఇంటి నుంచి వెళ్ళగొట్టేవారు.

ఇంచుమించు ఖైరున్‌కు ఎదురైన చేదు అనుభవం లాంటిదే దైవప్రవక్త (స) కాలంలో హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి) భార్యకు కూడా ఎదురయింది. ఆమె తన ఆడపిల్లలు ఇద్దర్నీ తీసుకొని దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి ఇలా మొరపెట్టుకున్నారు:

## సాద్ బిన్ రబీ (రజి) భార్యకు జరిగిన అన్యాయం

"దైవప్రవక్తా! ఈ పిల్లలిద్దరు సాద్ కుమార్తెలు. ఆయన మీతో కలసి ఉహద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. కాని ఈ పిల్లల పినతండ్రి మొత్తం ఆస్తిని స్వాధీనం చేసుకున్నాడు. వీరి కోసం చిల్లిగవ్వ కూడా వదలిపెట్ట లేదు. ఇప్పుడిక ఈ బాలికలను ఎవరు పెళ్ళి చేసుకుంటారు?"



దైవప్రవక్త (స) ఈ సంగతి విని ఓ క్షణం తలదించుకొని మౌనంగా ఉండిపోయారు. దివ్యావిష్కృతి అవతరణ సమయంలో ఆవహించే పరిస్థితి ఆయన్ని ఆవహించింది. కాస్సేపటికి ఆయన అప్పుడే అవతరించిన ఈ సూక్తులు చదివి విన్పించారు:

"ప్రజలు చనిపోతూ తమ పసిపిల్లలను నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళవలసి వస్తే, ఆ తరువాత వారి పరిస్థితి ఏమిటీ అని ఆలోచించి భయపడాలి. కనుక వారు (ఇతరుల అనాథ బాలల విషయంలో కూడా) దేవునికి భయపడుతూ సవ్యమైన మాటనే పలకాలి. అన్యాయంగా అనాథ బాలల ఆస్తుల్ని తింటున్నవారు నిజానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. వారు తప్పకుండా భగభగ మండే అగ్నిగుండంలో విసరి వేయబడతారు." (ఖుర్‌ఆన్-4:9,10)

## భర్త నుండి భార్యకు రావలసిన ఆస్తివాటాలు

దైవాజ్ఞలను పాటించని నేటి నామమాత్రపు ముస్లింలు సంతానంలేని వితంతు స్త్రీ మరో పెళ్ళి చేసుకుంటే ఆమెకు మొదటి భర్త నుంచి రావలసిన ఆస్తిని ఇవ్వరు. ఇది ఘోరమైన పాపం. ఆమె మరో పెళ్ళి చేసుకున్నప్పటికీ ధర్మశాస్త్రం ప్రకారం మొదటి భర్త ఆస్తి నుండి నాల్గవ (1/4) భాగం ఆమెకు రావాలి. మొదటిభర్త వల్ల పిల్లలు ఉంటే ఆమెకు ఎనిమిదవ (1/8) భాగం వస్తుంది.

"మీకు సంతానం లేకపోతే మీరు వదలిన ఆస్తిలో మీ భార్యలకు నాల్గోవంతు వాటా లభిస్తుంది. సంతానముంటే ఎనిమిదో వంతు మాత్రమే దక్కుతుంది. మీరు రాసిన వీలునామా నెరవేర్చి, మీరు చేసిన అప్పులన్నీ తీర్చడం జరిగిన తర్వాతే ఈ వాటాలు లభిస్తాయి." (ఖుర్‌ఆన్-4:12)

ఇస్లాం సమస్త జీవనరంగాలను పరివేష్ఠించివున్న సమగ్ర జీవనవ్యవస్థ. దేవుడు స్వయంగా తన ప్రవక్త (సల్లం) ద్వారా పంపిన ధర్మం ఇది. అందువల్ల ప్రతి ముస్లిం నమాజ్, రోజా వంటి ఆరాధనలను గురించే కాకుండా, సామాజిక బాధ్యతలు, ఆస్తి పంపకం, ఇతర ఆర్థికవిషయాలకు సంబంధించిన ఇస్లాం బోధనలను గురించి కూడా క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. అజ్ఞానం మనిషిని దైవాగ్రహం నుండి తప్పించ జాలదు. జ్ఞానార్జన కూడా ముస్లింల విధ్యుక్త ధర్మమే.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "మీ విధులేమిటో తెలుసుకోండి. అంటే మీరు ఆస్తి పంపకం పద్ధతుల్ని నేర్చుకోండి. ఇతరులక్కూడా నేర్పండి. ఆస్తి పంపకానికి సంబంధించిన జ్ఞానం సగం జ్ఞానంతో సమానం" అని తమ అనుచరులకు ఉపదేశించారు. (ఇబ్నెమాజ)

## మొట్టమొదట మరచిపోయే ధర్మజ్ఞానం

ఈ హదీసులో ఆస్తి పంపిణీ జ్ఞానాన్ని మొత్తం ఇస్లామీయ జ్ఞానంలో సగం జ్ఞానంగా పరిగణించబడింది. కాని ఈ జ్ఞానాన్నే నేటి ముస్లింలు మరచిపోయారు. లేదా

దానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇదే హదీసులో ఈవిధంగా తెలియజేశారు:

"ఆస్తి పంపకం గురించిన జ్ఞానాన్ని ప్రజలు మరచిపోతారు. నా అనుచర సముదాయం (ఉమ్మత్)లో మొట్టమొదట ఎత్తుకోబడే విషయం ఇదే."

ఈ హదీసుని గమనిస్తుంటే దైవప్రవక్త (సల్లం) చేసిన భవిష్యత్ ప్రకటన ఈనాటి ముస్లింలకు వర్తిస్తుందేమో అన్పిస్తోంది.

## మొత్తం ఆస్తిలో వీలునామా వాటా

ప్రారంభకాలంలో ఇస్లాం ఆస్తిపంపిణీ కోసం వీలునామా రాయడాన్ని విధిగా చేసింది. ఈవిధంగా వీలునామా ద్వారా వారసులకు సముచితమైన వాటాలు పంచాలని ఆదేశించింది. అయితే ఆ తర్వాత ఖుర్ఆన్ వారసులకు సంక్రమించ వలసిన వాటాలు నిర్ణయించి మొత్తంఆస్తిలో మూడో (1/3)వంతు లోపే వీలునామా రాయవచ్చని తెలియజేసింది. అంటే ఈ మూడోవంతు వీలునామా కూడా విధి (ఫర్జ్) కాదన్న మాట. అది అభిలషనీయమైనది (ముస్తహబ్) మాత్రమే. ఈ వీలునామా వారసులుకాని దూరపు బంధువుల్లో ఎవరైనా పేదవాళ్ళుంటే వారి కోసం నిర్దేశించ బడింది. దీన్ని మరేవయినా పుణ్యకార్యాల కోసమైనా వినియోగించవచ్చు.

"దేవుడు ప్రతి హక్కుదారునికి అతని హక్కు ఇచ్చేశాడు. కనుక మీరు ఏ వారసుని విషయంలోనూ వీలునామా రాయకూడదు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (హదీసు) ఈ హక్కుదారులలో స్త్రీలు (తల్లి, భార్య, కుమార్తెలు, సోదరీలు) కూడా ఉన్నారు. స్త్రీకి భర్తఆస్తిలో వాటాఉన్నట్లే తల్లిదండ్రుల ఆస్తిలో కూడా వాటాఉంది.

## సూత్రప్రాయమైన ఆర్థిక విషయాలు

"తల్లిదండ్రులు, ఇతర బంధువులు వదలిన ఆస్తి కొద్దిగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా అందులో పురుషులకూ వాటా ఉంది; స్త్రీలకూ వాటా ఉంది. ఇవి (దైవ) నిర్ణీత వాటాలు. (వాటిని తగ్గించడానికిగాని, పెంచడానికిగాని ఎవరికీ అధికారం లేదు.)" (ఖుర్ఆన్-4:7)

ఆ తర్వాత దేవుడు వాటాల విషయంలో ఇలా సూత్రప్రాయమైన ఒక ఆదేశం జారీచేశాడు: "మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనం రీత్యా ఎవరెక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఇవి దేవుడు నిర్ణయించిన వాటాలు. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు, ఎంతో వివేచనాపరుడు." (ఖుర్ఆన్-4:11)

## తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తె వాటా

"ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలతో సమానం" (ఖుర్ఆన్-4:11)

దీన్నిబట్టి తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు తప్పనిసరిగా భాగం ఉందని, అది కుమారులకు లభించే భాగంలో సగం అని స్పష్టంగా తెలుస్తోంది. కుమార్తెల కోసం



దేవుడు నిర్ణయించిన ఈ వాటా ఇవ్వకుండా ఎగవేయడంగాని, లేదా కొంత తగ్గించి ఇవ్వడంగాని చాలా అన్యాయం, ఘోరమైన పాపం అవుతుంది.

ఖుర్ఆన్ ప్రకారం మృతునికి తల్లిదండ్రులు లేకుండా ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు మాత్రమే ఉంటే అతని ఆస్తిలో కొడుకులకు 1/3 వంతు చొప్పున, కూతుళ్ళకు 1/6వంతు చొప్పున ఆస్తి లభించాలి. అంటే సంతానం ఎంతమంది ఉన్నా సరే కుమారునికి లభించే వాటాలో కుమార్తెకు సగం తప్పనిసరిగా సంక్రమించాలన్న మాట. కుమారులు, కుమార్తెల వాటాలు ఎల్లప్పుడూ 2:1 నిష్పత్తిలో ఉంటాయి.

అయితే మృతుడు రాసిన వీలునామా ధనం, శవసంస్కారం ఖర్చులు, అతని అప్పులు మొత్తం ఆస్తి నుండి తీసిన తరువాత మిగిలేదాన్ని మాత్రమే వారసులు పంచుకోవాలి. అప్పుల క్రిందికి మృతుడు తన భార్యకు చెల్లించాల్సిన మహర్ కూడా వస్తుంది. ఒకవేళ భార్య ఇంతకుముందే చనిపోయి ఉంటే ఈ మహర్ ఆమె కుమార్తె లకు దక్కుతుంది.

"(మృతునికి) ఇద్దరు లేక ఇద్దరికన్నా ఎక్కువమంది కుమార్తెలు ఉంటే, వారికి అతని ఆస్తిలో మూడింట రెండు వంతులు లభించాలి. ఒకవేళ ఒకే కుమార్తె ఉంటే, ఆమెకు ఆస్తిలో అర్థభాగం లభించాలి." (ఖుర్ఆన్-4:11)

## సోదరుల ఆస్తిలో సోదరి వాటా

"ఎవరైనా సంతానరహితుడుగా చనిపోతే, అతనికి ఒక సోదరి మాత్రం ఉన్న పక్షంలో అతని ఆస్తిలో ఆమెకు అర్ధభాగం లభిస్తుంది. సోదరి గనక సంతానం లేకుండా చనిపోతే ఆమె సోదరుడే ఆమె ఆస్తికి వారసుడవుతాడు."

"మృతునికి వారసులుగా ఇద్దరు సోదరీలు ఉన్నప్పుడు వారిద్దరికి అతని ఆస్తిలో మూడింట రెండు వంతుల ఆస్తి లభిస్తుంది. అనేకమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు గనక ఉంటే స్త్రీలకు ఒకవాటా, పురుషులకు దానికి రెట్టింపు వాటా లభిస్తుంది."

"మీరు దారితప్పి తిరగకుండా ఉండేందుకే దేవుడు ఈ విధంగా మీకు తన ఆజ్ఞలను విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సమస్త విషయాలు ఎరిగినవాడు." (ఖుర్ఆన్-4:176)

## ఇద్దరు బలహీనుల్ని గురించి తాకీదు

దైవప్రవక్త (సల్లం) అనుచరులకు హితోపదేశం చేస్తూ "నేను మిమ్మల్ని ఇద్దరు బలహీనుల హక్కులను గురించి తాకీదు చేస్తున్నాను. వారు అనాథబాలలు, స్త్రీలు" అని చెప్పారు. (నసాయి)

కొందరు తమ ఆస్తిని తమ జీవితకాలంలో తమకిష్టమైన వారసులకు తమకిష్టమై నంత కట్టబెట్టవచ్చని భావిస్తారు. ఇది కూడా తప్పుడు భావనే. నలుగురు సంతానం

ఉన్నప్పుడు ఇద్దరికి మాత్రమే ఇచ్చి మిగతా ఇద్దరికి అసలు ఏమీ ఇవ్వకుండా చేయడం లేదా వారికి రావలసిన వాటాలో తగ్గించి ఇవ్వడం అన్యాయం. దీనికి దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి వస్తుంది. అలాగే కుమార్తెల విషయంలో కూడా వారికి రావలసిన వాటా ఇచ్చి న్యాయంగా ప్రవర్తించాలి.

## వీలునామా వారసులకు నష్టం కల్గించరాదు

హజ్రత్ సాద్ బిన్ వఖాస్ (రజి) ఒకసారి జబ్బుపడితే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళారు. అప్పుడు హజ్రత్ సాద్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు ఆస్తి చాలా ఉంది. ఒక్కతే కూతురు. అందుకని నేను నా ఆస్తిలో రెండు భాగాలు (2/3) దైవమార్గంలో దానం చేయాలనుకుంటున్నాను" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "అలా చేయడం మంచిది కాద"ని చెప్పారు. హజ్రత్ సాద్ (రజి) "సరే సగం దానం చేస్తాను" అన్నారు. దైవప్రవక్త (సల్లం) దానికీ ఒప్పుకోలేదు. "అయితే మూడోవంతు (1/3) దానం చేస్తాను" అన్నారు సాద్ (రజి) మళ్ళీ. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అ... మూడోవంతు అయితే చేయవచ్చు. కాని అది కూడా ఎక్కువే" అన్నారు.

మృతుడు రాసే వీలునామా వారసులకు నష్టం కలిగించనిదయి ఉండాలి. అంటే అతను రాసే వీలునామా ఎట్టి పరిస్థితిలోనూ మొత్తం ఆస్తిలో మూడోవంతుకు మించకూడదన్న మాట. మూడోవంతు కూడా ఎక్కువేనని దైవప్రవక్త (సల్లం) చెప్పిన మాటను దృష్టిలో పెట్టుకొని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) "ప్రజలు మూడోవంతుకు బదులు నాల్గోవంతు వీలునామా రాయాల"ని చెబుతుండేవారు.

"మృతుడు రాసిన వీలునామా నెరవేర్చి, అతని అప్పులు తీర్చిన తర్వాతనే ఆస్తి పంపిణీ జరగాలి. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు." (ఖుర్ఆన్-4:12)

దైవప్రవక్త (సల్లం) ఈ సూక్తి గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు:

"ఎందరో పురుషులు, స్త్రీలు ఇలాంటి వారున్నారు- వారు అరవై ఏళ్ళ వయస్సు వచ్చే వరకూ మొత్తం జీవితాన్ని దేవుని విధేయతలో గడుపుతారు. కాని తీరా మరణకాలం ఆసన్నమయినప్పుడు వారు తమ వీలునామా ద్వారా (వారసులకు) నష్టం కలిగిస్తారు. (లేదా అర్హుల కోసం వీలునామాలో ఏదీ రాయరు.) ఈ కారణంగా వారు నరకానికి అర్హులయి పోతారు." (అబూదావూద్)

ఇలాంటి వీలునామా చెల్లదు. దాన్ని అమలుపరచాల్సిన అవసరం లేదు. మృతుని ఆస్తిలో మూడువిధాల వారసులకు తప్పనిసరిగా నిర్ణీతవాటాలు లభించాలి. వారు (1) కొడుకులు, కూతుళ్ళు, (2) తల్లిదండ్రులు, (3) భార్యాభర్తల్లో బ్రతికి ఉండేవారు.



ఈవిధంగా ఇస్లాం 1400 సంవత్సరాల క్రితమే స్త్రీకి తండ్రి ఆస్తిలో హక్కు కల్పించింది. అంటే స్త్రీని బానిసకన్నా నీచంగా, పశువుకన్నా నికృష్టంగా చూస్తుండిన మధ్య యుగంలోనే ఆమెకు ఇస్లాం ఆస్తి హక్కు ఇప్పించింది. ఇస్లాంకు పూర్వం ఏ మతం కూడా స్త్రీలకు ఆస్తి హక్కు ఇవ్వలేదు.

## కళ్ళుతెరచిన ఆధునికులు, అయినా ఆచరణ శూన్యం

స్త్రీ ఆస్తిహక్కు ఆవశ్యకతను ఇటీవల కాలంలోనే ఆధునికులు గుర్తించ గలిగారు. మన దేశంలో హిందూచట్టం క్రింద తండ్రి ఆస్తిలో కుమార్తెకు కల్పించబడిన ఆస్తిహక్కు చట్టంలోనే గాని, ఆచరణలో కన్పించడం లేదన్నది ఓ బహిరంగ రహస్యం. దీనికి కారణం ఈ చట్టం హిందూమత బోధనల ప్రాతిపదికపై గాకుండా పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో నిర్మించబడింది.

పాశ్చాత్య నాగరికతతో ప్రభావితులైనవారు 'ఖుర్ఆన్ స్త్రీకి పురుషునితో పాటు సమానంగా ఆస్తిహక్కు ఇవ్వడానికి బదులు సగమే ఇచ్చి ఆమె స్థాయిని దిగజార్చిందని విమర్శిస్తారు. కాని భర్త నుండి 'మహర్' రూపంలో వచ్చే ఆస్తిని, భార్య పోషణభారాన్ని వీరు విస్మరిస్తున్నారు. చివరికి అభ్యుదయవాదులనబడే ముస్లింలు కూడా ఖుర్ఆన్ స్త్రీకి ఇచ్చిన ఆస్తి వాటాను విమర్శిస్తున్నారు. కాని అలా విమర్శించేవారు తమ కుమార్తెలకు ఖుర్ఆన్ నిర్ణయించిన సగం వాటా కూడా ఇవ్వడానికి వెనుకాడతారు. దీని దుష్పర్యవసానమే ఈ రోజుల్లో ఆడపిల్లల తండ్రులకు కట్నకానుకల రూపంలో ఓ పెద్ద శాపంగా పరిణమించింది.

ఆర్థిక వ్యవహారాల ప్రమేయంలేని ధార్మిక భావన వల్లనే నేడు ముస్లింలు అనేక జటిల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ వైఖరి వారికి ఇహలోకంలోనే గాక పరలోకంలోనూ నష్టదాయకంగా పరిణమించే ప్రమాదం ఉంది. కనుక ముస్లింలు తమ జీవితం లోని ప్రతిసమస్యను ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఇప్పటికైనా గుర్తిస్తారని ఆశిద్దాం.

## అతివలకు ఆర్థిక సమానత్వం లేదట!

"మీ సంతానం విషయంలో దేవుడు మిమ్మల్ని ఇలా ఆదేశిస్తున్నాడు: ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలతో సమానం." (ఖుర్ఆన్-4:11)

ఇక్కడ ఆస్తిలో ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలకు సమానమం అని ఖుర్ఆన్ ఆదేశిస్తోంది. అంటే తండ్రి ఆస్తి నుండి కుమారునికి లభించే వాటాలో కుమార్తెకు సగమే లభిస్తుందన్న మాట. ఇస్లాంలో మహిళలక్కూడా ఆర్థిక సమానత్వం ఉందని చెప్పి, మళ్ళీ ఇక్కడ స్త్రీ పురుషుల్లో ఈ తేడా ఏమిటనే సందేహం వస్తుంది కొందరికి. అయితే దేవుని దృష్టిలో స్త్రీపురుషు లిద్దరూ సమానమైనా ఈ ఆర్థిక వ్యత్యాసానికి ముఖ్యంగా మూడు కారణాలున్నాయి.

(1) కుటుంబపోషణ భారాన్ని ఇస్లాం పురుషుడి మీదనే మోపింది. భర్త సంపాదించ కుండా సోమరిపోతులా తిరిగి లేదా సంపాదనంతా స్వార్థానికో, వ్యసనాలకో ఖర్చుచేసి భార్యాపిల్లలను నిర్లక్ష్యంచేస్తే ఇస్లామీయ ప్రభుత్వం అతని మీద చట్టపరమైన చర్య తీసుకుంటుంది. పరలోకంలోనూ దైవశిక్షకు గురికావలసి వస్తుంది.

(2) పురుషుడు ఒకే వంశానికి చెందినవాడై ఉంటాడు. కాని స్త్రీ రెండు వంశాలకు చెందినదై ఉంటుంది. ఆమె ఇటు పుట్టింటి ఆస్తిలోనూ, అటు మెట్టింటి ఆస్తిలోనూ భాగస్తురాలవుతుంది. పురుషునికి ఒక్క తన వంశపు ఆస్తి మాత్రమే సంక్రమిస్తుంది.

(3) అంతేకాకుండా వివాహం సందర్భంలో స్త్రీకి వరుడి నుంచి కూడా మహర్ రూపంలో కొంత ఆస్తి లభిస్తుంది. నేడు మన దేశంలో ముస్లింలు అతి ముఖ్యమైన ఈ దైవాజ్ఞను నిర్లక్ష్యం చేయడే గాకుండా, సహవాస దోషంతో కట్నకానుకల రూపంలో వేలాది, కాదు లక్షలాది రూపాయలు నిలువు దోపిడి చేస్తున్నారు. ఇది తీవ్రమైన నేరం, ఘోరమైన పాపం.

ఈ విధంగా ఇస్లాం పుట్టింటి బంధువుల నుండి ఆస్తివాటా ద్వారా, భర్త నుండి మహర్ ద్వారా, మెట్టింటి బంధువుల నుండి ఆస్తివాటా ద్వారా స్త్రీకి మొత్తం మీద పురుషునితో పాటు ఆర్థిక సమానత్వం ప్రసాదించింది. ఈ కారణంగానే స్త్రీల వాటాను పురుషుల వాటా కంటే తక్కువగా నిర్ణయించబడింది.

ఆర్థిక రంగంలో మహిళల పట్ల ఇంతటి ఉదారత కనబరచిన ఖుర్‌ఆన్ మహత్తును గురించి కాస్త ఆలోచించాలి యోచనాపరులు. ఈ ప్రపంచంలోనే దైవం ప్రసాదించిన ప్రకృతి ధర్మాలు విస్మరించి కొందరు తమ సొంత ఆలోచనలతో మహిళా ఆర్థిక స్వాతంత్ర్యానికి సూచనలు చేస్తుంటే, మరికొందరు ముస్లింలు స్త్రీలకు రావలసిన చట్టపరమైన ఆస్తి హక్కుల్ని కూడా హరిస్తున్నారు.

కాని ఇలాంటి ముస్లింలు చివరికి తమ కుమార్తెల వివాహంలో కట్నాలు, కానుకల రూపంలో లక్షలాది రూపాయలు ఇచ్చుకోవడం మాత్రం తప్పడం లేదు. ఇస్లాం దృష్టిలో అవాంఛనీయమయిన ఇలాంటి కట్నాలు, కానుకలిచ్చి దైవాగ్రహానికి గురికావడం కన్నా వాటినే కుమారులతో పాటు కుమార్తెలకు కూడా ఆస్తిహక్కుగా ఇచ్చి ఇహపర శుభాలను పొందడం మేలుకాదా?

## 31. విద్యార్జనా హక్కు

మహిళా హక్కుల్లో మరో ముఖ్యమైనది విద్యార్జనా హక్కు. ఈనాడు మన దేశంలో ఇతర వర్గాలన్నిటికంటే ముస్లిం మహిళల్లోనే అక్షరాస్యత చాలా తక్కువగా ఉంది. నా స్నేహితురాలు రేష్మాకు నేను ఎన్నో సార్లు నచ్చజెప్పి చూశాను. కాని ఆమె చదువు మీద ఆసక్తే చూపలేదు. తరువాత నేనామెను కలుసుకోక యేడాది దాటింది. మొన్నీమధ్య ఓ ముఖ్యమైన పనిమీద వారూరికి వెళ్ళినప్పుడు ఆమెను కలుసుకోవడం జరిగింది.



తలుపు తట్టగానే రేష్మా ఓ తెలుగుపత్రిక చేత్తో పట్టుకొని వచ్చి తలుపు తీసింది. ఆమె చేతిలో దినపత్రిక చూసి నేను ఆశ్చర్యపోయాను. కుశల ప్రశ్నలయ్యాక ఈ మార్పు ఎలా వచ్చిందని అడిగాను. దానికి రేష్మా “నా విద్యార్జనా ఉద్యమం నా కొడుకు వల్లెవేసిన ఒక పాఠంతో ప్రారంభమయింది” అంటూ ఓ కథ చెప్పుకొచ్చింది. అదేమిటో మీరూ కాస్త వినండి, చాలా ఆసక్తికరమైన కథ.

### విద్యలేనివాడు వింతపశువు

“మమ్మీ! ఇక్కడుంచిన నా పచ్చట్ట పుస్తకం ఏమయిందే?” టేబుల్ మీద చిందర వందరగా పడివున్న పుస్తకాలు కదుపుతూ అడిగాడు ఏడేళ్ళ ఏజాజ్.

“అక్కడే ఉంటుంది చూడరా కాస్తనిదానంగా” అన్నది రేష్మా వంటగదిలోకి పోతూ.

“ఆ.... ఉందిలే” అంటూ ఏజాజ్ ఆ పుస్తకం తీసుకొని, అందులో ఓ పాఠం వల్లె వేయడం మొదలెట్టాడు....

“కొండెములు చెప్పరాదు; నీతిలేనివాడు కోతికంటే పాడు; విద్యలేనివాడు వింత పశువు; నీరు పల్లమెరుగు, నిజము దేవు......”

“ఆ.... చాల్లేరా ఇక చదివిన మటుకు. ఇదిగో, ఈ ప్యాకెట్ తీసికెళ్ళి పక్కింటి పిన్ని గారికి ఇచ్చిరా” అన్నది రేష్మా కొడుకుని పురమాయిస్తూ.

ఏజాజ్ ప్యాకెట్ తీసుకొని అటు పోగానే రియాజ్ క్యాంపు నుంచి ఇంటికొచ్చాడు.

“ఏమండీ వచ్చారా! నిన్న ఏదో టెలిగ్రాం వచ్చింది. ఇదిగో చూడండి ఏముందో” అన్నది రేష్మ భర్త చేతికి టెలిగ్రాం అందిస్తూ.

రియాజ్ టెలిగ్రాం చూసి “మీ మేనమామ కూతురు ఫాయెజా ఫర్హత్ పెళ్ళట. అయినా శుభలేఖ పంపకుండా టెలిగ్రాం ఏవిటీ!” అన్నాడు టెలిగ్రాం భార్యకు తిరిగిచ్చేస్తూ.

“శుభలేఖ పంపడానికి తగిన టైం లేకపోయిందేమో, టెలిగ్రాం ఇచ్చారు. ఇంతకూ పెళ్ళెప్పుడటండీ?” అడిగింది రేష్మ ఆతురతతో.

“ఈరోజే పెళ్ళి. ఈపాటికి నికాహ్ అయిపోయి పెళ్ళికూతురు అత్తవారింటికి పోవడానికి సిద్ధంగా ఉంటుంది” అన్నాడు రియాజ్ చిరునవ్వుతో.

“అరెరె! ఈ పెళ్ళికి నేనైనా పోయిరావలసిందండీ. నిన్ననే పక్కింటి సాబిరా చేత చదివించుకొనిఉంటే బాగుండేది. పనుల్లో పడి అలసత్వం చేశాను” అన్నది రేష్మా.

“అందుకే నువ్వు చదువుకొని ఉంటే ఈ చిక్కులు వచ్చేవికావు కదా!” అన్నాడు రియాజ్ చదువురాని తన భార్యతో.

"ఆ... మొదలెట్టారూ? సందు దొరికితే చాలు, ఎత్తిపొడుస్తుంటారు" అన్నది రేష్మా బుంగమూతి పెట్టి.

"రేష్మా! ఇందులో ఎత్తిపొడుపు మాటేముంది? కాస్త ఆలోచించు. ఉన్నత చదువులు చదివిన ఒక ప్రభుత్వాధికారి భార్యకు, అందునా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వంటి ఉన్నతాధికారి భార్యకు కనీసం తన పేరు కూడా రాసుకోవడం రాదంటే నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించావా?" అన్నాడు రియాజ్ బాధాతప్త హృదయంతో.

"ఇంతకూ మీరనేది ఏవిటండీ?"

"నీకు చదవడం, రాయడం రావాలన్నదే నా కోరిక. రోజుకో గంట చదవడానికి కూర్చో రేష్మా! కావాలంటే స్వయంగా నేనే నీకు చదువు చెప్తాను."

## బడికి పోయే బామ్మను చూడు

"ఏవిటీ, నేను చదువుకోవడమా! ఏ ఊళ్ళు ఏలడానికండీ నాకీ చదువు? ఈమాత్రం విషయానికే మీరింత విచారిస్తున్నారా? అయినా ఈ వయస్సులో నాకు చదువేమిటండీ! అది పిల్లల పని" అన్నది రేష్మా భర్త మాటలు త్రోసిపుచ్చుతూ.

"రేష్మా! నువ్వు అనవసరంగా తప్పించుకోజూస్తున్నావుగాని, విద్యకు, వయస్సుకు సంబంధం ఏమిటీ? ఇటీవల సౌదీఅరేబియాలో ఓ ఎనభై ఏళ్ళ బామ్మగారు ఎంచక్కా చిన్నపిల్లలతో కలసి బళ్ళో చదువుకోవడం ప్రారంభించిందట.

"రేష్మా! నీకు తెలియదేమోగాని, మన ప్రభుత్వం వయోజనవిద్య కోసం లక్షలాది రూపాయలు ఖర్చుపెడ్తోంది. ప్రత్యేకంగా స్త్రీవిద్య పట్ల ఎంతో శ్రద్ధ వహించి పనిచేస్తోంది. స్త్రీ ఒడియే ఆమె పిల్లలకు మొదటి బడి. చదువుకున్న స్త్రీల ఒళ్ళో పెరిగే పిల్లలకే కదా సరైన విద్యాశిక్షణలు లభిస్తాయి." రియాజ్ ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

రేష్మా అన్నిటికీ మౌనంగా తలూపి ఓ చిరునవ్వు చిందించింది. తరువాత-

## చదువులేని మొద్దు కదలలేని ఎద్దు

"సరేలెండి. ఆ చదువేదో తర్వాత చూద్దాం. అవతల నేను వంటపని చూసుకోవాలి" అంటూ మెల్లిగా భర్త దగ్గర్నుంచి జారుకుంది.

రియాజ్ ఎంతో బాధపడ్డాడు. అతను చేసిన ఉపన్యాసమంతా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లయింది. అయినా అతను నిరాశ చెందలేదు. అవకాశం చిక్కినప్పుడల్లా భార్యకు నచ్చజెప్తూ తన ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నాడు.

ఓరోజు రియాజ్ అందంగా బైండింగ్ చేసిన ఒకటో తరగతి పుస్తకం తెచ్చి భార్యకు ఇస్తూ ఇలా అన్నాడు:

"రేష్మా! ఈ పుస్తకం చూడు. ప్రత్యేకంగా ఇది మధ్యవయస్కుల కోసం ఎంతో



పరిశోధించి రాయబడిన పుస్తకం ఈ పుస్తకం ద్వారా నువ్వు ఎలాంటి కష్టం లేకుండా సులభంగా చదువు నేర్చుకోవచ్చు."

రేష్మా పుస్తకం తీసుకొని ఎంతో ఆసక్తి ఉన్నదానిలా పేజీలు తిరగేసింది.

"చాలా బావుందండీ పుస్తకం. బామ్మా మనవళ్ళకు పనికొస్తుంది, దాచిపెడ్తాను" అంటూ తీసికెళ్ళి పుస్తకాల బీరువాలో పెట్టేసింది.

పాపం రియాజ్ నిర్ఘాంతపోయాడు. ఏం చేయాలో పాలుపోలేదు. అయినప్పటికీ అతనిలో పట్టుదల సడలలేదు. రోజులు గడచిపోతున్నాయి. రేష్మాలో మార్పు మచ్చుకైనా కన్పించలేదు. దాని సూచనలు కూడా లేవు.

## అజ్ఞానం అపార్థాలకు దారితీస్తుందా?

ఒకరోజు రియాజ్ ఆఫీసుకు పోయిన తరువాత, రేష్మా అతని కోటు బటన్ కుట్టడానికి ముందేసుకుంది. బటన్ కుట్టుంటే యాదృచ్ఛికంగా ఆమె చేయి కోటుజేబు మీద పడింది. చేయి తగలగానే జేబులో ఏదో గట్టి వస్తువు ఉన్నట్లు అన్పించింది. తీసిచూస్తే ఓ అందమైన కవర్ కన్పించింది. అందులో నుంచి సెంటువాసన కూడా గుబాళిస్తోంది. దాంతో రేష్మా మనసులో రకరకాల అనుమానాలు పుట్టుకొచ్చాయి.

"రియాజ్ తనను మోసగిస్తున్నాడా? ఏ వన్నెలాడి అయినా ఆయన్ని వలలో వేసుకుందా? ఏమో ఎలా తెలుస్తుంది? కవర్‌లోని కాగితం తీసి చూస్తే అందులో ఒక్క అక్షరం కూడా తనకు అర్థం కాదాయె! పోనీ ఇతరుల చేత చదివించుకుందామంటే పరువు కాస్తా బజారు పాలవుతుంది. ఇప్పుడేం చెయ్యాలి?"

"హే భగవాన్! ఏవిటీ తన పరిస్థితి!! ఈ ఉత్తరం ఏమయి ఉంటుంది? ఔను, ఏమయి ఉంటుందో తనకెలా తెలుసు? తనో చదువురాని మొద్దు. రియాజ్ ఈ కారణంగానే ఎవరైనా చదువుకున్న అమ్మాయిని ప్రేమిస్తున్నాడా? అజ్ఞానం కూడా ఇలాంటి అగ్నిపరీక్షకు గురిచేస్తుందా?"

రేష్మా మెదడు వేడెక్కి పోయింది. భవిష్యత్తును గురించి తలచుకొని భయపడి పోయింది. మళ్ళీ ధైర్యం తెచ్చుకొని భర్తను అనవసరంగా అనుమానించడానికి బదులు ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని నిశ్చయించుకుంది. ఉత్తరాన్ని యధాతథంగా కవర్‌లోనే పెట్టి పెట్టెలో భద్రపరిచింది.

సాయంత్రం అస్ర్ నమాజ్ చేసుకొని భర్త కోసం ఎదురుచూడసాగింది. సరిగ్గా ఆరు గంటలకు రియాజ్ గుమ్మంలో అడుగుపెట్టాడు. అతడ్ని చూడగానే రేష్మా చాటెడు ముఖంతో స్వాగతం చెప్పింది.

"ఏవండీ! నేనీ రోజు నుంచి చదువు నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. మీరు నాకు చదువు చెప్తారు కదూ?" అన్నది గోముగా.

“ఆహా! ఎంతకాలానికి ఇంత మంచివార్త వింటున్నాను!! నువ్వు చదవాలే గాని నేను ఒక నెల సెలవు పెట్టయినా సరే నీకు చదువు చెప్పనూ?” అన్నాడు రియాజ్ సంతోషంతో ఎగిరిగంతేస్తూ.

“సెలవు పెట్టొద్దులెండి. మీరు లోగడ అన్నట్లు రోజుకో గంటసేపు చెబితే చాలు. ఆపైన నేను కష్టపడి చదువుకుంటాగా!” అన్నది రేష్మా.

ఆరోజు నుంచి రియాజ్ ఉదయం, సాయంత్రం ఓ గంటసేపు రేష్మాకు చదువు చెప్పడం ప్రారంభించాడు. రేష్మా కూడా మనసు లగ్నం చేసి ఎంతో పట్టుదలగా నేర్చుకోసాగింది.

వారం తర్వాత, భర్త ఆఫీసుకు వెళ్ళిపోగానే రేష్మా పెట్టెలోనుంచి కవర్‌తీసి ఉత్తరం చదవడానికి ప్రయత్నించింది. కాని ఒక్కపదం కూడా చదవలేకపోయింది. అప్పటికి అక్షరాలు మాత్రమే నేర్చుకుంది. అంచేత ఈసారి మరింత కష్టపడి చదవసాగింది.

## జ్ఞానకాంతితో అపార్థ చీకటి మటుమాయం

అలా దాదాపు మూణ్ణెల్లు ఏకబిగిన చదివింది. పదకూర్పు, వాక్యనిర్మాణం చాలా వరకు తెలిసిపోయింది. ఆ తరువాత ఓరోజు భర్త ఆఫీసుకు వెళ్ళిపోయాక కవరు తీసి అందులోని ఉత్తరం సులువుగా చదవగలిగింది.

“మై డియ్యర్ రియాజ్! మీరు కోరిన ప్రకారం వయోజనవిద్యా దృష్టితో ప్రత్యేకంగా రాయబడిన ఒకటో తరగతి పుస్తకం ఈరోజు మీకు పంపుతున్నాను. ఈ పుస్తకం ద్వారా మీ శ్రీమతి నాలుగైదు నెలల్లోనే చదవడం, రాయడం బాగా నేర్చుకుంటారని ఆశిస్తున్నాను. స్త్రీలను విద్యావంతులను చేయడానికి మన డిపార్టుమెంటు చేపట్టిన కార్యక్రమాలు ఈ జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ రంగంలో మన రాష్ట్రం త్వరలోనే ఇతర రాష్ట్రాలను అధికమించవచ్చు. ఇంతే సంగతులు-

మీ స్నేహితుడు, కె.ఆర్. శర్మ.

ఉత్తరం చదివిన తరువాత రేష్మా కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి. అనవసరంగా తాను రియాజ్‌ని అనుమానించింది. కాని ఆయన తన శ్రేయస్సు కోసం ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తున్నారు! ఈ ఆలోచనతో ఆమె హృదయం భర్త పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

రేష్మా ఇప్పుడు దినపత్రిక కూడా చదవడానికి ప్రయత్నిస్తోంది. ఒకరోజు రియాజ్ క్యాంపుకు పోవాల్సి వచ్చి మధ్యాహ్నామే ఆఫీసు నుంచి ఇంటికొచ్చాడు. అప్పుడు రేష్మా ఆరోజు దినపత్రిక తిరగేస్తూ ఉండటం చూసి రియాజ్ ఆనందభరితుడయ్యాడు.

“వెరీగుడ్! ఇప్పుడు నువ్వు వార్తాపత్రికలు కూడా చదవగల స్థాయికి ఎదిగావు. శభాష్ రేష్మా! శభాష్!!” అంటూ భార్యను అభినందించాడు రియాజ్.



“ఏదో కాస్త ఇప్పుడిప్పుడే ఇలా..... ఏవండీ! మీరు కాస్త స్పెషల్ కోచింగ్ ఇస్తే, వచ్చే సంవత్సరం నేను మెట్రిక్ పరీక్షకు అప్పియరవుదామనుకుంటున్నా” అన్నది రేష్మా.

“ఏ ఊళ్ళు ఏలడానికో” అన్నాడు రియాజ్ కొంటెగా చూస్తూ.

“నేను ఊళ్ళు ఏలడానిక్కాదండీ, ఊళ్ళు ఏలేవారిని తయారుచేయడానికి.”

“ఆహా! మీ ఆడవాళ్ళు తలచుకుంటే ఊళ్ళు ఏలేవారినేమిటి, హృదయాల్ని ఏలేవారిని కూడా తయారుచేయగల్గుతారు” అంటూ నవ్వాడు రియాజ్.

రేష్మా కూడా శృతి కలిపింది భర్త చూపుతున్న అభిమానానికి పొంగిపోతూ.

+++

విన్నారు కదా రేష్మా సంగతి! ఇప్పుడామె దైవప్రవక్త (సల్లం) ప్రవచనానికి కార్యరూపమిచ్చి తన కొడుకు చదివిన పాఠం సామెతలా తాను వింతపశువు కాదని నిరూపించు కుంది. నేను హైదరాబాదుకు తిరిగిరాగానే ఖుర్‌ఆన్‌తో పాటు కొన్ని ధార్మిక పుస్తకాలు రేష్మాకు పోస్టుచేశాను.

రేష్మా కార్యరూపం ఇచ్చిన ప్రవక్త ప్రవచనం ఏమిటో మీరు గ్రహించి ఉంటారను కుంటాను. స్త్రీ అయినా, పురుషుడయినా **“విద్య నేర్చుకోవడం ప్రతి ముస్లిం విధి.”** (మిష్కాత్). జ్ఞానార్జనా విధి విస్మరించిన ముస్లింలు ధార్మిక విధులన్నిటినీ పాటించలేరు. పాటించే కొన్ని విధుల విషయంలో కూడా వారు జీవితాంతం స్థిరంగా ఉండలేరు.

## దైవభీతే మనిషిని చెడులకు దూరంగా ఉంచుతుంది

ధార్మిక విధుల నిర్వహణకు సాధనమవుతుందన్నదే విద్యార్జన లక్ష్యం. ఈ లక్ష్యం ధార్మికవిద్య నేర్చుకోవలసిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. మనిషి ధార్మికవిద్య ఎంతగా నేర్చుకుంటే అంతగా అతనిలో దైవభీతి జనిస్తుంది. దైవభీతే అతడ్ని పాపకార్యాలకు దూరంగా ఉంచి పుణ్యకార్యాల వైపు ప్రోత్సహిస్తుంది. ఈ కారణంగానే ఖుర్‌ఆన్ “దేవుని దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు” (35:28) అని చెబుతోంది.

దేవుడు తనకు భయపడేవారినే నీతిమంతులుగా తీర్చిదిద్దుతాడు. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

“విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే దేవుడు మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు; మీ తప్పులు మన్నిస్తాడు. దేవుడు అపార దయామయుడు.” (8:29)

“దేవునికి భయపడుతూ మసలుకునేవాడికి దేవుడు కష్టాలనుంచి బయటపడేందుకు ఏదైనా దారిచూపుతాడు. (ఒకవేళ ఆర్థిక ఇబ్బందులుంటే) అతనికి దేవుడు అతని ఊహాసైతం పోని దిశనుండి ఉపాధినిస్తాడు. దేవుడ్ని నమ్ముకునేవాడికి దేవుడే చాలు.” (65:2,3)

“దేవుడు తనకు భయపడేవారికి తగిన సౌలభ్యం కలిగిస్తాడు. ఇది దేవుని ఆజ్ఞ. దాన్ని ఆయన మీ దగ్గరికి అవతరింపజేశాడు. ఎవరు దేవునికి భయపడతాడో దేవుడు అతనిలో ఉండే చెడులన్నిటినీ తొలగించి అతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు.” (ఖుర్ఆన్-65:4,5)

## దైవాజ్ఞలతో పాటే దైవభీతి హితబోధ

దేవుని సూక్తుల్ని, ఆయన ప్రవక్త (సల్లం)ను ఖాతరుచేయకుండా అవిశ్వాస వైఖరి అవలంబించేవారిని హెచ్చరిస్తూ ఖుర్ఆన్ ఇలా అంటోంది: “విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. (దేవునికి అంకితమైన) ముస్లింలుగా ఉన్న స్థితిలో తప్ప (ఇతర స్థితిలో) చనిపోకండి.” (3:102)

హజ్ విధులను ప్రస్తావిస్తూ ఇలా పేర్కొంటోంది: “హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు ప్రయాణసామగ్రి వెంట తీసికెళ్ళండి. **అన్నిటికంటే శ్రేష్ఠమైన ప్రయాణ సామగ్రి దైవభీతే.** కనుక విజ్ఞులారా! నా పట్ల భయభక్తులు కలిగి ఉండండి.” (2:197)

“ధర్మయుద్ధం (జిహాద్) గురించి కొన్ని సూచనలిస్తూ ఇలా చెబుతోంది: “నిషిద్ధ మాసానికి బదులు నిషిద్ధమాసమే సరిపోతుంది. నిషేధితాలన్నిటినీ అందరూ సమానంగా గౌరవించవలసిందే. దీనికి భిన్నంగా ఎవరైనా (నిషిద్ధమాసంలో లేదా పవిత్ర స్థలం దగ్గర) మీపై దాడిచేస్తే మీరు కూడా వారిపై దాడిచేయండి. అయితే దేవునికి భయపడుతూ మసలుకోవాలి. **దేవునికి భయపడేవారికే ఆయన అండగా నిలుస్తాడు.**” (2:194)

ఆరాధనా దిశ మార్పును గురించి ప్రస్తావిస్తూ ఇలా ఆదేశిస్తోంది: “మీరు ఎక్కడున్నా, ఏ ప్రాంతానికెళ్ళినా అక్కడ నుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపుకే అభిముఖులుకండి. మీకు వ్యతిరేకంగా ఇతరులు ఎలాంటి మాట అనడానికయినా ఆస్కారమివ్వకుండా మీరు దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. ఇక దుర్మార్గుల విషయానికొస్తే, వారు ఎల్లప్పుడూ మీకు వ్యతిరేకంగా ఏదోఒకటి వాగుతూనే ఉంటారు. కనుక మీరు వారికి భయపడకూడదు. నాకే భయపడాలి.” (2:150)

విడాకుల తరువాత బిడ్డకు పాలు పట్టే విషయంలో తగిన ఆజ్ఞలు జారీచేస్తూ ఇలా హితవు చేస్తోంది: “మీరు దేవునిపట్ల భయభక్తులతో వ్యవహరించాలి. గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు.” (2:233)

విడాకుల ఆజ్ఞలను ఉల్లంఘించే, భార్యలను వేధించేవారిని గురించి ఇలా హితోప దేశం చేస్తోంది: “**దేవుని ఆజ్ఞల్ని నవ్వులాటగా చేసుకోకండి.** ఆయన మీకు ప్రసాదించిన మహాభాగ్యాలను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. మీ శ్రేయస్సు కోసం అవతరింపజేసిన దివ్యగ్రంథాన్ని, (అందులోని) వివేకవంతమైన విషయాలను గౌరవించడం నేర్చుకోవల సిందిగా ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు. (ప్రతి విషయంలోనూ) దేవుని పట్ల భయభక్తులు కలిగివుండండి. ఆయన సర్వం ఎరిగినవాడని తెలుసుకోండి.” (2:231)



దేవుని హితోక్తులు విన్నా కరగని రాతిగుండెల ముస్లింలను హెచ్చరిస్తూ ఖుర్ఆన్ ఇలా అంటోంది: “**విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయం ఆసన్నం కాలేదా?** ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయేవేళ ఇంకా రాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమై పోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. మీరు అలా కాకూడదు సుమా!” (57:16)

## జ్ఞానులే దేవునికి భయపడతారు

ఈ సూక్తులను బట్టి చదువుసంధ్యలకు ఖుర్ఆన్ ఎంత ప్రాముఖ్యం ఇచ్చిందో తెలుస్తోంది. అసలు ఖుర్ఆన్ అవతరణే ‘చదువు’ అనే మాటతో ప్రారంభమయింది.

“(ముహమ్మద్!) సర్వసృష్టికర్త అయిన నీ ప్రభువు పేరు స్మరించి పఠించు. ఆయనే మానవుడ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు. నీ ప్రభువు మహోన్నతుడు. ఎంతో ఉదారుడు. ఆయన మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు. (కనుక మానవుడు అజ్ఞానిగా ప్రవర్తిస్తూ అపమార్గం పట్టడానికి) ఎంతమాత్రం వీల్లేదు. మానవుడు తనను తాను గొప్పవాణ్ణని, నిరపేక్షాపరుణ్ణని భావించి విర్రవీగుతున్నాడు. (కాని) అతను చివరికి నీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది.” (ఖుర్ఆన్. 96:1-8)

ఇస్లాంకు సంబంధించిన జ్ఞానం లేకపోతే మనిషికి ధర్మం ఏదో- అధర్మం ఏదో, పాపం ఏదో పుణ్యం ఏదో, మంచేదో చెడేదో ఎలా తెలుస్తుంది? షిర్క్, తౌహీద్‌ల సమగ్ర రూపం, వాటిమధ్య వ్యత్యాసం ఎలా తెలుస్తుంది? దేవుని హక్కులేమిటో, దాసుల హక్కులేమిటో ఎలా తెలుస్తాయి? ఆస్తి పంపకం, ఉపాధి సముపార్జనలో, ఇతర ఆర్థిక వ్యవహారాలలోని దైవాజ్ఞలు ఎలా తెలుస్తాయి? వైవాహిక విలువలు, విడాకుల పద్ధతులు ఎలా తెలుస్తాయి? నిజమయిన ఆరాధనా విధానాలు ఎలా తెలుస్తాయి? ఇస్లాం గురించి సరైన అవగాహన లేకపోతే ఇస్లాంవ్యతిరేక శక్తుల పట్ల ఎలా వ్యవహరించగలం?

అందుకే ఇస్లాం జ్ఞానార్జనకు పెద్ద పీట వేసింది. “(సత్య)జ్ఞానం ఉన్నవాళ్ళు, జ్ఞానం లేనివాళ్లు ఒకటేనా అని అడుగు వారిని. (మా) హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు.” (ఖుర్ఆన్-39:9)

## జ్ఞానార్జనకై దైవప్రవక్త (సల్లం) ప్రోత్సాహం

దైవప్రవక్త జ్ఞానార్జన ఆవశ్యకతను గురించి చెబుతూ ఇలా ప్రవచించారు:

“సాధారణ నక్షత్రాలపై పౌర్ణమి చంద్రుడికి ఎలాంటి ఘనతా ఔన్నత్యాలున్నాయో, సాధారణ భక్తులపై పండితులకు అలాంటి ఘనతా ఔన్నత్యాలే ఉన్నాయి. పండితులు దైవప్రవక్తల వారసులు. దైవప్రవక్తలు తమ వారసత్వంలో ధనకనక వస్తువులకు బదులు విద్యను వదలిపెట్టారు. కనుక ఎవరైతే జ్ఞానం సంపాదించాడో అతను పెద్దఎత్తున

ధనాన్ని సంపాదించినట్లే." (అహ్మద్, తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)

"ఎవరైనా చదువు నేర్చుకునే ఉద్దేశ్యంతో ఏదైనా మార్గాన నడుస్తుంటే అతను స్వర్గ మార్గాన నడుస్తున్నట్లే. విద్యార్థి సంతోషం కోసం దైవదూతలు (అతను నడిచే దారిలో) రెక్కలు పరుస్తారు. అతని శ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. పండితుల కోసం భూమ్యాకాశాల్లోని సృష్టిరాసులన్నీ పాపమన్నింపు ప్రార్థన చేస్తాయి. చివరికి సముద్రాలు, సముద్రాలలోని చేపలు, పుట్టలలోని చీమలు సయితం వారి శ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థిస్తాయి." (తిర్మిజి, దార్మి)

దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు విద్యావశ్యకతను తెలుపుతూ "మీరు కూడా విద్య నేర్చుకోండి, మీ స్త్రీలకు కూడా నేర్పండి" అని చెప్పారు. (దార్మి)

రెండవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ప్రజలను ఉద్దేశించి "మీ స్త్రీలకు నూర్ సూరా (ఖుర్ఆన్‌లోని 24వ అధ్యాయం) తప్పకుండా నేర్పండి. అందులో కౌటుంబిక, సామాజిక జీవితాలకు సంబంధించిన అనేక విషయాలు ఉన్నాయి" అని రాజ్యమంతటా ఒక ఉత్తర్వు జారీచేశారు.

## నేటి విద్యాజాగృతిలో లోపించిన విషయం

ఈనాడు స్త్రీ విద్యను గురించి ముస్లింలలో కొంత జాగృతి వచ్చిన మాట నిజమే. విద్యావశ్యకతను గ్రహించిన ముస్లింలు తమ బాలురతో సహా బాలికలకు కూడా ఉన్నత చదువులు చదివిస్తున్నారు. బాగానే ఉంది. కాని దైవం, ధర్మం, నీతి, నిజాయితీలతో ఎలాంటి ప్రమేయంలేని పచ్చి లౌకికచదువులు మాత్రమే చదివిస్తున్నారు. దీనివల్ల వారి పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు, టెక్నిషియన్లు కాగల్గుతున్నారు కాని, ధర్మపరాయ ణులు, దైవభీతిపరులు, నీతిమంతులు, రుజువర్తనులు మాత్రం కాలేకపోతున్నారు.

పైగా మత ప్రమేయంలేని ఈ లౌకిక చదువులకు తోడు నేడు ప్రపంచవ్యాప్తంగా వీస్తున్న పాశ్చాత్య నాగరికతా ప్రభంజనం కూడా వారిని చుట్టుముట్టి తన కబంధహస్తాల లోకి తీసుకోవడానికి ఉరకలు వేస్తోంది. ఒకే కళాశాలలో బాలబాలికలు కలసిమెలసి చదివే "సహవిద్య" (Co-Education) విధానం కూడా ఈ పాశ్చాత్య నాగరికతలోని భాగమే. పరిస్థితి ఇలాగే కొనసాగితే వారి భావితరాల ధార్మిక వ్యక్తిత్వం (Relegious Identity) క్రమంగా అడుగంటిపోయి వారు పచ్చి పదార్థపూజారులుగా, ప్రాపంచిక వ్యామోహపరు లుగా మారే ప్రమాదం ఉంది.

కనుక పరిస్థితి చేజారక ముందే ముస్లింలు తమ భావితరాలకు ధర్మవిద్య గరిపే విషయం గురించి ఆలోచించి తగిన కార్యాచరణ విధానం రూపొందించుకోవాలి. కేవలం వ్యాపారదృష్టితో చూడకుండా తమ అధీనంలో ఉండే విద్యాసంస్థలలో ధర్మవిద్యను కూడా ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాలి. సొంత విద్యాసంస్థలు లేనిచోట్ల



చదివే పిల్లల కోసం ధర్మవిద్యను కూడా నేర్పే ఏర్పాట్లు చేసుకోవాలి. దాంతోపాటు స్త్రీల వయోజన విద్యను కూడా ప్రోత్సహించాలి.

## విద్యార్జనా ధ్యేయం దైవప్రసన్నతయి ఉండాలి

మన తెలుగునాట పూర్వం విద్యాబుద్ధులు, విద్యాశిక్షణలు, చదువుసంస్కారాలు అనే మాటలు విరివిగా వాడబడుతుండేవి. ఈ మాటల వెనుక విద్యార్జనా ఉద్దేశ్యం మనిషిని నీతిమంతుడుగా చేయాలన్నదే. ఈ పదాలు ఇప్పుడు పాతబడి పోయాయి. కాని ఇస్లాంలో విద్యార్జనా ధ్యేయం దైవప్రసన్నతయి ఉండాలి. దైవప్రసన్నత పొందే ఉద్దేశ్యం కాకుండా మరో ఉద్దేశ్యంతో విద్యార్జన చేసేవారికి ఆ విద్య పరలోకంలో నష్టాన్నే తెచ్చిపెడ్తుంది. ఈ విషయం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"పండితులతో పోటీకి దిగే ఉద్దేశ్యంతోనో, తక్కువగా చదువుకున్నవాళ్ళతో వాదించే ఉద్దేశ్యంతోనో లేదా ప్రజలను తనవైపుకు ఆకట్టుకునే ఉద్దేశ్యంతోనే విద్య నేర్చుకున్నవాడ్ని దేవుడు నరకంలో పడవేస్తాడు." (తిర్మిజి, ఇబ్నెమాజ)

"దైవప్రసన్నత పొందడానికి ఆర్జించవలసిన విద్యను ఎవరైనా ప్రాపంచిక ప్రయోజ నాలు పొందే ఉద్దేశ్యంతో ఆర్జిస్తే అలాంటి మనిషి ప్రళయదినాన స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేడు." (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ)

## శుష్కప్రియాలు, శూన్యహస్తాలు

మనిషి దైవప్రసన్నత పొందే ఉద్దేశ్యంతోనే విద్యనార్జించినప్పటికీ దాని ప్రకారం అతని ఆచరణ లేకపోయినా ప్రయోజనం లేదు. ప్రయోజనం సంగతి అలా ఉంచితే పరలోకంలో ఆ విద్యే అతనికి ఘోరమైన నష్టం కలిగిస్తుంది. మాటలకు, చేతలకు పొంతనలేని ధర్మవిద్య వల్ల ప్రపంచంలో కొద్దిపాటి పేరుప్రతిష్ఠలు లభించవచ్చు. కాని పరలోకంలో అలాంటి విద్య నరకయాతనలు తెచ్చిపెడ్తుంది. ఈ విషయంలో ఖుర్ఆన్ బోధనలు చూడండి:

"విశ్వాసులారా! మీరు చేయనిదాన్ని గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? చేయని దాన్ని గురించి చెప్పుకోవడం దేవునికి చాలా అప్రియమైన విషయం." (61:2,3)

"తౌరాత్ (ఆజ్ఞలు పాటించే) బాధ్యత మోపబడినవారు ఆ బాధ్యత నిర్వహించలేదు. వారిని **పుస్తకాలు మోసే గాడిద**తో పోల్చవచ్చు. (తౌరాత్‌జ్ఞానం తెలిసి కూడా అంధులయి) దైవసూక్తుల్ని నిరాకరించినవారు అంతకంటే దిగజారిపోయారు. ఇలాంటి దుర్మార్గులకు దేవుడు సన్మార్గం చూపడు." (62:5)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దైవాన్ని ఈవిధంగా వేడుకున్నారు:

"దేవా! నీవు ప్రసాదించిన జ్ఞానం నాకు ప్రయోజనకరమైనదిగా చెయ్యి. నాకు ప్రయోజనం చేకూర్చే విద్య ప్రసాదించు. నా జ్ఞానాన్ని అధికం చెయ్యి." (తిర్మిజి)

"దేవా! నిష్ప్రయోజనమైన విద్య (తెచ్చే కీడు) నుండి నేను నీ శరణుకోరుతున్నాను." (ముస్లిం); "దేవా! మాకు సత్యాన్ని సత్యంగా భావించే, దాని ప్రకారం ఆచరించే సద్బుద్ధి ప్రసాదించు. అలాగే అసత్యాన్ని అసత్యంగా భావించే, దాని (కీడు) నుండి కాపాడుకునే సద్బుద్ధి కూడా ప్రసాదించు." (ఇబ్నెమాజ)

ఆచరణశూన్యులయిన ధర్మవేత్తలు, లోకుల మెప్పు కోసం ధర్మప్రసంగాలు చేసే వక్తలు మరణానంతరం పరలోకంలో తీవ్రమైన నరకయాతనలకు గురవుతారని అనేక హదీసులు హెచ్చరిస్తున్నాయి.

## హజ్రత్ ఆయిషా సిద్దీఖా (రజి) విద్యా సామర్థ్యాలు

దైవప్రవక్త (సల్లం) కాలంలో విద్యార్జన పట్ల స్త్రీలు చూపిన శ్రద్ధాసక్తులు ఆ తరువాత కాలంలో ముస్లింల చరిత్రను మరింత ప్రకాశవంతం చేశాయి.

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా సిద్దీఖా (రజి) ధార్మిక విద్యలో గొప్ప ప్రవీణురాలుగా వినుతికెక్కారు. ఆమె 18 సంవత్సరాల వయస్సులో వితంతువయి, 66 సంవత్సరాల వయస్సులో ఇహలోకం వీడిపోయారు. అబూహురైరా (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)ల తర్వాత ఆమె నుండే ఎక్కువ హదీసులు, అంటే 2210 హదీసులు వెలువడ్డాయి. ఆ సాధ్వీమణి విద్యాబోధన పనికి అంకితమయి ఈ హదీసులను పిల్లలకు బోధించడానికి ఇంట్లోనే ఒక పాఠశాల కూడా నెలకొల్పారు.

శ్రేష్ఠ ఖలీఫాలైన అబూబకర్, ఉమర్, ఉస్మాన్ (రజి)ల పాలనా కాలాల్లో ఆమె ఫత్వాలు (ధార్మిక తీర్పులు) కూడా ఇచ్చేవారు. ప్రవక్త అనుచరుల్లో గొప్పగొప్ప సహాబీలు కూడా ఏదైనా జటిలసమస్య ఎదురైనప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికెళ్ళి దాన్ని పరిష్కరింప జేసుకునేవారు. ఆమె ఖుర్ఆన్ భాష్యం, హదీసు, ఫిఖా విద్యలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఇస్లాంకు సంబంధించిన అనేక విషయాలు, ముఖ్యంగా కౌటుంబిక, సామాజిక విషయాలు ఆమె ద్వారానే ముస్లిం సముదాయినికి చేరాయి.

## హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) విద్యా విశిష్ఠతలు

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)ను దైవప్రవక్త (సల్లం) హిజ్రీశకం 2లో వివాహమాడారు. విద్యాజ్ఞానాల్లో హజ్రత్ ఆయిషా (రజి) తరువాత హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)యే ప్రఖ్యాతి గాంచారు. ఆమె నుండి 378 హదీసులు వెలువడ్డాయి. ఈమె కూడా విద్యాబోధనకు అంకితమై ఇంట్లోనే ఒక పాఠశాల స్థాపించారు. ఆ పాఠశాలలో ఆమె బాలబాలికలకు ఖుర్ఆన్ పఠనం, ఖుర్ఆన్ భాషాశాస్త్రం, హదీసువిద్య నేర్పుతుండేవారు.

ఆమె ఖుర్ఆన్ పారాయణం ఎంతో శ్రావ్యంగా చేసేవారు. ఆ పఠన రీతి దైవప్రవక్త (సల్లం) పఠన రీతితో పోలి ఉండేది. హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) దగ్గర ఖైరా అనే ఓ దాసీ ఉండేది. హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఆ దాసీకు కూడా మంచి విద్యాశిక్షణలు గరిపి గొప్ప పండితురాలిగా తీర్చిదిద్దారు. ఆ దాసీ ఖైరా తన కాలంలో గొప్ప వక్తగా



కూడా ఖ్యాతిచెందారు. ప్రముఖ తాబయి (ప్రవక్త ప్రత్యక్ష అనుచరుని శిష్యుడు) అయిన ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఆ దాసి కుమారరత్నమే.

ఈవిధంగా పూర్వం ఎంతో మంది స్త్రీలు ఖుర్ఆన్, హదీసు విద్యలు నేర్చుకొని ఇతరులకు కూడా నేర్పారు. తమ విద్యాజ్ఞానాలతో అనేక మంది జీవితాలను మలచి భావితరాలకు రాచబాటలు వేశారు.

# 32. మాతృమూర్తిగా మహిళ విలువ

ఇస్లాం మాతృమూర్తిగా స్త్రీకి ఇచ్చినంత విలువ మరే మతం కూడా ఇవ్వలేదంటే అతిశయోక్తి కాదు. పురుషుడి స్వర్గం స్త్రీ పాదాల క్రిందకు తెచ్చి పెట్టింది ఇస్లాం.

ఒక స్త్రీ కొందరికి కుమార్తె, కొందరికి సోదరి, కొందరికి పిన్ని, కొందరికి పెద్దమ్మ, కొందరికి మేనత్త, కొందరికి భార్య, కొందరికి కోడలు, కొందరికి అత్త అవుతుంది. ఇవన్నీ ముఖ్యమైన స్థానాలే. కాని తల్లిగా స్త్రీ స్థానం వీటన్నిటి కంటే ఎంతో ముఖ్యమైనది, తల్లి స్థానానికి ఎవరూ విలువకట్టలేరు. ఇస్లాం మాతృమూర్తికి అసాధారణమైన గౌరవం, హోదాలు ప్రసాదించి ప్రపంచంలో స్త్రీ స్థాయిని అత్యున్నత శిఖరాలకు చేర్చింది.

మనిషి సాధారణవ్యక్తి అయినా, ప్రముఖవ్యక్తి అయినా, దైవప్రవక్తయినా, దైవప్రియు డయినా, రాజయినా, మంత్రయినా, జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా, మరెలాంటి వాడైనాసరే అతను పొందవలసిన స్వర్గం అతనితల్లి పాదాల క్రింద ఉంచబడింది. ఇతర మతాలలో కూడా తల్లికి ఉన్నత స్థానం ఉన్నా అది సంతానం నైతిక బాధ్యత మాత్రమే. కాని ఇస్లాంలో తల్లి పట్ల వినయవిధేయతలు, గౌరవ మర్యాదలు నీతి-న్యాయాల పరమయిన బాధ్యతలుగానే కాకుండా చట్టపరమైన బాధ్యతలుగా కూడా పరిగణించబడ్డాయి.

## ఖుర్ఆన్‌లో మాతృమూర్తి విలువ

ఇస్లాం ప్రకారం దేవుని హక్కులు, దాసుల హక్కులు అని రెండు విధాల హక్కులు ఉన్నాయి. దాసుల హక్కులలో మానవుల హక్కులతో పాటు మూగజీవాల హక్కులు కూడా ఉన్నాయి. మానవుల హక్కులలో తల్లిదండ్రుల హక్కులు అగ్రస్థానం వహిస్తాయి. దేవుడు, దైవప్రవక్తల తరువాత గౌరవాదరణలకు తల్లిదండ్రులే ఎక్కువ హక్కుదారులు. వారి శ్రమ, కృషి మూలంగానే పిల్లవాడు పెరిగి పెద్దవాడైపోతాడు. ఆ పిల్లవాడు విద్యాశిక్షణలు పొంది ఇహపరలోకాలలో సాఫల్యం పొందడానికి యోగ్యుడవుతాడు.

ప్రవక్త అనుచరులలో ఒకాయన దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటికన్నా ఎక్కువ ప్రీతికరమైన ఉత్తమోత్తమ ఆచరణ ఏదీ?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "సమయా నికి నమాజు చేయడం" అని సమాధానమిచ్చారు. "ఆ తరువాత ఏదీ?" అనడిగారు ఆ అనుచరుడు. "తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండటం" అన్నారు దైవప్రవక్త (స). "ఆ తరువాత ఏదీ?" అని ప్రశ్నించారు ఆయన. "దైవమార్గంలో జిహాద్

(ధర్మపోరాటం) జరపడం" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం) (బుఖారి, ముస్లిం)

తల్లిదండ్రులిద్దరిలోనూ తల్లి స్థానానికి ఓ ప్రత్యేకత ఉంది. పిల్లవాడి పుట్టుక, పోషణల విషయంలో తండ్రి శ్రమ, త్యాగాల కన్నా తల్లి శ్రమ, త్యాగాలే ఎక్కువగా ఉంటాయి. అందువల్ల న్యాయం రీత్యా సంతానంపై తండ్రి హక్కులకన్నా తల్లి హక్కులే అధికంగా ఉంటాయి. ఖుర్‌ఆన్ ఈ విషయం స్పష్టంగా పేర్కొన్నది.

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులైఉంటే వారిని'ఉఫ్'అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడ కండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి. (దైవాన్ని) 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్స ల్యంతో పెంచిపోషించారో అలా నీవు వీరిని కరుణించు' అని ప్రార్థించండి." (17:24)

"తల్లిదండ్రులకు సేవచేయాలని మేము మానవుడ్ని ఆదేశించాము. అతని తల్లి బాధ మీద బాధ భరిస్తూ అతడ్ని గర్భంలో పెట్టుకొని మోసింది. అతడ్ని పాలు విడిపించడా నికి రెండు సంవత్సరాలు పట్టింది. (అందువల్ల మేమతనికి ఈవిధంగా ఉపదేశించాం:)

"నాపట్ల కృతజ్ఞుడయి ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే రావలసి ఉంది. అయితే నీకు తెలియని దాన్ని నాకు సాటికల్పించమని వత్తిడి చేస్తే మటుకు నీవు వారిమాట ఎన్నటికీ వినకు. ప్రపంచంలో వారిపట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే రావలసి ఉంది. అప్పుడు నేను మీరు (ప్రపంచంలో) ఎలా నడచుకునేవారో మీకు తెలియజేస్తాను". (ఖుర్‌ఆన్–31:14,15)

## తండ్రి కంటే తల్లి స్థానమే ఉన్నతమైనది

ఒకతను దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "నేను సేవ చేయడానికి నా తల్లి దండ్రులలో ఎవరెక్కువ హక్కుదారులు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని ప్రశ్నించాడు. దానికి కూడా దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి తిరిగి "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి" అనే జవాబిచ్చారు. అతను మళ్ళీ "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ తండ్రి" అని చెప్పారు. (బుఖారి)

మరొకతను వచ్చి "దైవప్రవక్తా! మీరు నన్ను ఏ విషయం గురించి ఆదేశిస్తారు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగివుండు" అని చెప్పారు. ఆ వ్యక్తి అదే ప్రశ్న మూడు సార్లు అడిగాడు. మూడు సార్లు కూడా దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగివుండ"మనే చెప్పారు. నాల్గవ సారి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తండ్రిని కూడా చేర్చారు.



అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఓ రోజు తన ప్రియ సహచరులతో ముచ్చటిస్తూ ఇలా చెప్పారు: "నేను (రాత్రి) స్వర్గదృశ్యాలు చూస్తున్నట్లు కలగన్నాను. అక్కడ నేను ఎవరో మనిషి ఖుర్‌ఆన్ పఠించడం విన్నాను. నేను 'ఈ కంఠస్వరం ఎవరిది?' అని అడిగాను. దానికి 'ఇది హారిసా బిన్ నోమాన్ (రజి) కంఠస్వరం' అని సమాధానం వచ్చింది. ఇదీ తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్య ఫలం. ఇదీ అసలు తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్యఫలమంటే." (మిష్కాత్)

ఒకతను దైవప్రవక్త (స) వచ్చి "నా వల్ల పెద్దపాపం జరిగిపోయింది. దీనికి నిష్కృతి ఏదైనా ఉందా?" అనడిగాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లి ఉందా?" అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి లేదన్నాడు. "పోనీ నీ పిన్నమ్మగాని, పెద్దమ్మగాని ఉందా?" అని అడిగారు దైవప్రవక్త (స). అతను ఉందన్నాడు. "అయితే ఆమె పట్ల మంచిగా ప్రవర్తిస్తూ ఉండు" అంటూ దైవప్రవక్త (స) అతనికి హితబోధ చేశారు. (తిర్మిజి)

ఈ హదీసులో దైవప్రవక్త (సల్లం) అతడ్ని 'నీ తండ్రి ఉన్నాడా' అని అడగడానికి బదులు 'నీతల్లి ఉందా' అనడిగారు. ఆ వ్యక్తి తన తల్లి లేదని చెప్పిన తర్వాత కూడా అతనితండ్రి ప్రస్తావన ఎత్తలేదు. తండ్రికి బదులు తల్లి సోదరిని గురించి అడిగారు. దీన్ని బట్టి తల్లి తరువాత తల్లిస్థానం ఆమె సోదరి అలంకరిస్తుందని తెలుస్తోంది.

తల్లి విశ్వాసి అయినా, అవిశ్వాసి అయినా తల్లే అవుతుంది. కనుక సంతానం ఆమె హక్కులను తప్పకుండా నెరవేర్చవలసి ఉంటుంది.

హజ్రత్ అబూబకర్ (రజి) కుమార్తె హజ్రత్ అస్మా (రజి) దైవప్రవక్త (సల్లం)ను "దైవప్రవక్తా! నా తల్లి నన్ను చూడటానికి వచ్చింది. ఆమె అవిశ్వాసి. మరి నేనామె పట్ల మంచిగానే ప్రవర్తించాలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీవు నీతల్లి హక్కును కూడా నిర్వహిస్తూ ఉండాలి" అని చెప్పారు. ( బుఖారి)

## తనయుల స్వర్గం తల్లి పాదాల క్రింద ఉంది

ఒకతను దైవప్రవక్త (సల్లం)తో "నేను జిహాద్ (ధర్మపోరాటం) చేయాలనుకుంటు న్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నీ తల్లిదండ్రులు ఉన్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "నా తల్లి మాత్రమే బ్రతికుంది" అన్నాడు. "అయితే నీ తల్లి పట్ల సత్ప్రర్తన కలిగివుండు. నీవు నీ తల్లికి శక్తివంచన లేకుండా సేవ చేయగల్గితే జిహాద్ పుణ్యమే కాదు, హజ్-ఉమ్రాలు చేసినంత పుణ్యం కూడా లభిస్తుంది" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం) (అబూయాలా-తబ్రాని)

దైవప్రవక్త (సల్లం) ఒక సందర్భంలో "తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది" అని చెప్పారు. (తబ్రాని)

ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి దైవమార్గంలో జిహాద్ (ధర్మయుద్ధం) చేయడానికి అనుమతి ఇవ్వమని అడిగాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి

బ్రతికే ఉందా?" అని అడిగారు. దానికా వ్యక్తి "బ్రతికే ఉంది" అన్నాడు. "అయితే నీ తల్లి కాళ్ళు పట్టుకో. ఆమే నీ స్వర్గం" అన్నారు దైవప్రవక్త (స) (తర్గీబ్ వ తర్హీబ్)

ఈ విషయమే మరొక హదీసులో ఇలా ఉంది: ఒకతను వచ్చి "నేను జిహాద్‌లో పాల్గొనాలని అనుకుంటున్నాను. మీ సలహా ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) నీతల్లి బ్రతికే ఉందా?" అని అడిగారు. ఆ వ్యక్తి "నా తల్లి బ్రతికే ఉంది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నువ్వామెకు సేవచేస్తూ ఉండు. ఆమె పాదాల క్రింద (నీ) స్వర్గం ఉంది" అని చెప్పారు. (నసాయి)

హజ్రత్ ఉలైస్ ఖర్నీ (రహ్మాలై) యమన్ దేశ నివాసి. దైవప్రవక్త (సల్లం) ప్రభవించిన వార్త, ఇస్లాం సందేశం ఆయన దగ్గరకు చేరినప్పుడు ఆయన వెంటనే ఇస్లాం స్వీకరించారు. ఆయనగారి తల్లి అప్పటికి బ్రతికే ఉంది. కాని ఆ వృద్ధురాలు చాలా బలహీనంగా ఉండటం వల్ల కొడుకు సేవ మీద ఆధారపడవలసి వచ్చింది. హజ్రత్ ఖర్నీ (సల్లం) దైవప్రవక్త (సల్లం) బోధనల ప్రకారం జీవితాంతం తల్లి సేవలో ఉండి పోయారు. దైవప్రవక్త (సల్లం) పట్ల హృదయంలో అమితమైన ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ ఆయన దైవప్రవక్త (సల్లం)ను దర్శించి ఆ మహనీయునికి సహాబీ (ప్రత్యక్ష అనుచరుడు) అయ్యే భాగ్యానికి నోచుకోలేక పోయారు.

హజ్రత్ ఉలైస్ ఖర్నీ (రహ్మాలై) వైఖరి దైవప్రవక్త (సల్లం)కు ఎంతగానో నచ్చింది. ఆయన ఒకసారి అనుచరులకు హితోపదేశం చేస్తూ "తాబయీన్ (ప్రవక్త ప్రత్యక్ష అనుచరుల్ని దర్శించిన ముస్లింల)లో ఒకతను ఉన్నాడు. అతని పేరు ఉలైస్. అతనికి ఒక తల్లి ఉంది. అతని శరీరం మీద ఒక తెల్లని మచ్చ కూడా ఉంటుంది. మీరు మీ పొరపాట్లకు అతడ్ని మన్నింపు ప్రార్థన చేయమని అడగండి" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ఓసారి నాలుగు ఘోరపాపాలను గురించి ప్రస్తావించారు. అందులో మొట్టమొదటి ఘోరపాపం తల్లి పట్ల అవిధేయత చూపడమే. (బుఖారి, ముస్లిం)

## 33. సంతాన శిక్షణ

స్త్రీ కార్యాచరణ పరిధిలో భర్త పట్ల విధేయత తరువాత సంతాన శిక్షణకు ఎంతో ప్రాముఖ్యం ఇవ్వబడింది. "మీరు ఉత్తమ తల్లులను ఇవ్వండి, నేను మీకు ఉత్తమ జాతిని ఇస్తాను" అన్న నెపోలియన్ బోనాపార్టీ మాట కూడా సంతాన శిక్షణ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తోంది. అంతేకాదు, "ఊయల ఊపే చేతులు ఊళ్ళు ఏలుతాయి" అన్న సామెత కూడా తల్లి బాధ్యతలను గుర్తుచేస్తోంది.

దీన్ని బట్టి భావితరాల భవితవ్యం స్త్రీ చేతిలోనే ఉందని తెలుస్తోంది. పిల్లల ప్రాథమిక పాఠశాల తల్లి వడియే. కనుక స్త్రీ తలచుకుంటే సమాజాన్ని సంస్కరించగలుగుతుంది. అలాగే ఆమె తలచుకుంటే సమాజాన్ని చెడగొట్టగలుగుతుంది కూడా.



## భావితరాల మంచీచెడులు తల్లి చేతిలోనే ఉన్నాయి

భావితరాల మంచిచెడులన్నీ తల్లి చేతిలోనే ఉంటాయి. ఆమె తలచుకుంటే వారిని నీతిమంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దగలుగుతుంది. కాదనుకుంటే వారిని చెడగొట్ట గలుగుతుంది కూడా. హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలాని (రహ్మాలై) చిన్ననాటి సంఘటన చాలామందికి తెలిసే ఉంటుంది. ఆమె ఆయన్ని విద్యార్జన కోసం పట్నానికి పంపుతూ అబద్ధం చెప్పకూడదని ఉపదేశించింది.

హజ్రత్ అబ్దుల్ ఖాదర్ (రహ్మాలై)ని దారిలో దోపిడీదొంగలు అడ్డగించి నీ దగ్గర ఏముందని అడిగితే, నాదగ్గర పది రూకలు ఉన్నాయని చెప్పారాయన. దొంగలు ఆయన జేబులు వెతికిచూస్తే డబ్బు కన్పించలేదు. అప్పుడాయన చొక్కా క్రింద దాచుకున్న డబ్బుతీసి దొంగల నాయకుడికి ఇచ్చారు. దొంగల నాయకుడు ఆశ్చర్య పోతూ, డబ్బేమీ లేదంటే మేము వెళ్ళిపోయేవాళ్ళం కదా! అనంటాడు.

దానికి హజ్రత్ అబ్దుల్ ఖాదర్ (రహ్మాలై), తన తల్లి అబద్ధమాడకూడదని ఉపదేశించింది అని చెబుతారు. దాంతో దొంగల నాయకుడు, అతని అనుచరులు ఎంతో ప్రభావితులయి చోరవృత్తిని శాశ్వతంగా మానేస్తారు. ఆవిధంగా వారు దోపిడీ దొంగతనాలు మానేసి నీతి మార్గాన మరలడానికి మూలకారణం హజ్రత్ అబ్దుల్ ఖాదర్ (రహ్మాలై) మాతృమూర్తేనని వేరే చెప్పనవసరం లేదు.

మరో దోపిడీదొంగ గాధ కూడా వినండి. అతడ్ని రాజభటులు ఉరితీయడానికి సిద్ధమై, నీ చివరికోరిక ఏమిటని అడుగుతారు. దానికా దోపిడీదొంగ తన తల్లితో మాట్లాడాలి పిలిపించండి అంటాడు. ఆమె వచ్చిన తర్వాత, దగ్గరికి రా ఒక రహస్యం చెప్పాలి నీకు అనంటాడు. తల్లి దగ్గరకు రాగానే అతనామె చెవిని కసుక్కున కొరికేస్తాడు. రాజభటులు ఆశ్చర్యపోతూ "నీవు ఉరితాడు క్రింద నిలబడి తల్లి చెవి కొరికేసి ఆమెను అంత బాధపెట్టాలన్న ఆలోచన నీకెందుకు వచ్చింది?" అని అడుగుతారు.

దానికా దొంగ సమాధానమిస్తూ "మొదట్లో నేను చిన్న చిన్న దొంగతనాలు చేసి వస్తువులు తీసుకొస్తుంటే ఈమె ఎంతో సంతోషించేది. ఈమె ఇచ్చిన ఈ ప్రోత్సాహమే నన్ను భయంకరమైన దోపిడీలకు సైతం పాల్పడేలా చేసింది. అలాంటప్పుడు శిక్షలో కూడా ఈమెకు భాగం ఎందుకు లభించకూడదు?" అని అంటాడు.

ఫుర్ఖాన్ భావామృతం



**శ్రమ నాది, ప్రతిఫలం మీది**

ఎవరైనా ఫుర్ఖాన్ భావామృతంతో పాటు ఖుర్‌ఆన్ భావామృతం కూడా దగ్గర పెట్టుకుంటే వారు ఖుర్‌ఆన్ జ్ఞానార్జన కోసం తోటకు వెళ్ళి, చెట్టెక్కి, పండు కోసి, తోలుతీసి తినవలసినంత శ్రమ పడవలసిన అవసరముండదు; తోలువలచిన పండు చేతిలో ఉన్నట్లే భావిస్తారు. ఆ శ్రమంతా రచయితే నెత్తిమీద వేసుకొని పాఠకులకు 'రెడీమేడ్' జ్ఞానం అందజేయడానికి శాయాశక్తులా కృషిచేశాడు. (కూర్పు: అబుల్ ఇర్ఫాన్, ఫోన్. 9441515414)

## సంతానశిక్షణ గురించి ఖుర్‌ఆన్ బోధనలు

సంతానశిక్షణ విషయంలో ఖుర్‌ఆన్ బోధనలు ఏమిటో పరిశీలిద్దాం. హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) తన కుమారునికి హితోపదేశం చేస్తూ ఇలా చెబుతారు:

"లుఖ్మాన్ తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుచేసుకో. అతను తన కుమారునితో 'బాబూ! దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటికల్పించకు. దేవునికి సాటికల్పించడం ఘోరపాపం, దారుణమైన అన్యాయం' అన్నాడు." (31:13)

"కుమారా! ఏదయినా బండరాయిలో గాని, ఆకాశంలోగాని, భూమిపైగాని, లేదా మరెక్కడైనా సరే ఆవగింజంత వస్తువు దాగివున్నా దేవుడు దాన్ని బయటికి తీయగలడు. ఆయన ఎంతో సూక్ష్మగ్రాహి, సమస్తం తెలిసినవాడు."

"(కనుక) కుమారా! నీవు ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాల నుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవెంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు. భూమిపై (మిడిసిపాటుతో) నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడే వాణ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడిలో మధ్యేమార్గం అవలంబించు. నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాలకంటే గాడిదస్వరం అత్యంత కఠోరమైనది". (31:16-19)

దైవప్రవక్తలు ఇబ్రాహీం, యాఖూబ్ (అలైహి)లు తమ సంతానానికి ఇచ్చిన శిక్షణ కూడా చూడండి: "ఇబ్రాహీంను అతని ప్రభువు 'నిన్ను నీవు (మాకు) సమర్పించుకో' అని ఆదేశించగానే అతను (ఏమాత్రం తటపటాయించకుండా) 'నన్ను నేను సర్వలోక ప్రభువుకు సమర్పించు కుంటున్నా'నని అన్నాడు. తరువాత అతను తన కుమారులక్కూడా ఈ (స్వయం సమర్పణ) విధానాన్నే ఉపదేశించాడు."

"యాఖూబ్ కూడా తన కొడుకులకు హితవు చేస్తూ 'దేవుడు మీ కోసం ఈ జీవన విధానాన్నే నిర్ణయించాడు. కనుక చనిపోయే వరకూ దైవవిధేయులు (ముస్లిములు)గానే జీవించాలి' అన్నాడు." (2:131,132)

"అతను తుది శ్వాస వదలుతున్నప్పుడు తన కొడుకులను పిలిచి 'నేను వెళ్ళిపోయిన తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తారు?' అని అడిగాడు. దానికి వారంతా 'మీరు, మీ తాత ముత్తాలయిన ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్ (అలైహి)లు ఆరాధించిన ఏకేశ్వరుడ్ని మాత్రమే మేము ఆరాధిస్తాము. ఆయనకే మేము విధేయులయి (ముస్లిములయి) ఉంటాము' అని సమాధానమిచ్చారు." (2:133)

## తల్లి గర్భం నుండే శిక్షణ ప్రారంభం

ఇస్లాంలో తల్లిదండ్రులు కలుసుకున్నప్పటి నుంచే సంతానశిక్షణ ప్రారంభమవు తుంది. వారప్పుడు దైవప్రవక్త (సల్లం) నేర్పిన ఈ దుఆ (వేడుకోలు) పదాలు పఠిస్తారు:



"దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానాన్ని కూడా షైతాన్ కీడు నుండి కాపాడు." (బుఖారి)

ఈసా ప్రవక్త (అలైహి) మాతృమూర్తి హజ్రత్ మర్యం (అలైహి) గురించి ఖుర్‌ఆన్ ఇలా అన్నది: ఇమ్రాన్ (వంశపు) స్త్రీ దేవుడ్ని వేడుకుంటూ "ప్రభూ! నాగర్భంలోఉన్న శిశువును నీకు అంకితం చేస్తున్నాను. ప్రాపంచిక వ్యవహారాలకు ఈ శిశువును దూరంగాఉంచుతాను. నా నుండి దీన్ని స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు అన్నీ ఎరిగినవాడవు" అని అన్నది. (3:35)

మర్యం (అలైహి) సంరక్షకుడు, దైవప్రవక్త అయిన హజ్రత్ జకరియ్యా (అలైహి) గురించి (కూడా) వినండి: "అప్పుడు జకరియ్యా తన ప్రభువును వేడుకుంటూ 'ప్రభూ! నీ దగ్గర్నుండి నాకు ఉత్తమ సంతానం ప్రసాదించు. నీవే (నా) మొరాలకించేవాడివి' అని అన్నాడు." (3:38)

## బిడ్డజన్మ తరువాత తీసుకునే జాగ్రత్తలు

పిల్లవాడు పుట్టగానే అతని కుడి చెవిలో అజాన్, ఎడమ చెవిలో ఇఖామత్ పఠించాలి. హజ్రత్ ఫాతిమా (రజి)కు "ఇమామ్ హుసైన్ (రజి) పుట్టగానే దైవప్రవక్త (స) వచ్చి ఆయన కుడిచెవిలో అజాన్, ఎడమచెవిలో ఇఖామత్ పఠించారు." (తబ్రాని)

పిల్లవాడు పుట్టిన వెంటనే అతని చెవుల్లో దేవుని స్తుతి, దైవప్రవక్త (సల్లం) ప్రస్తావన పడగానే షైతాన్ అక్కడ్నుంచి పారిపోతాడు. పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతనికి పేరుపెట్టాలి. (తప్పుడు అర్థం వచ్చే పేరు కాకుండా మంచి పేరు పెట్టాలి.) తరువాత తల వెంట్రుకలు గొరిగించి 'అఖీఖా' (జన్మదినోత్సవం) చేయాలి." (తిర్మిజి)

పేరు పెట్టే విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: "ప్రజలారా! ప్రళయదినాన మీరు మీపేరు, మీతండ్రి పేరుతో పిలవబడతారు. అంచేత మీరు మంచిపేర్లు పెట్టుకోండి." (అబూదావూద్)

పిల్లవాడికి అదే రోజున ఖత్నా (వడుగు) కూడా చేయవచ్చు. బిడ్డకు తల్లిపాలే అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆహారం. కనుక వీలైనంతవరకు తల్లిపాలే పట్టాలి. పోతే పిల్లవాడు మాట్లాడటం మొదలెట్టగానే ముందుగా అతని చేత 'లాఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మద్ రసూలుల్లాహ్' అని చెప్పించాలి.

## హదీసువెలుగులో సంతానశిక్షణ

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పిల్లలను అమితంగా ప్రేమించేవారు. "మన పెద్దలను గౌరవించని, మన పిన్నలపట్ల వాత్సల్యం చూపనివాడు మనలోనివాడు కాదు" అన్నారు ఆయన. (-హదీసు). పిల్లలకు విద్యాబుద్ధులు గరిపే విషయమయి ఆయన ఇలా అన్నారు:

"తండ్రి తన సంతానానికి ఇచ్చే కానుకలలో మంచి విద్యాబుద్ధులు గరపడమే గొప్ప కానుక. దానికి మించిన శ్రేష్ఠమైన కానుక మరేదీ లేదు." (తిర్మిజి)

"తండ్రి తన కొడుకుకు విద్యాబుద్ధులు గరపడం కంటే మించిన గొప్ప ఉపకారం అతని నుండి మరేదీ లేదు." (తిర్మిజి)

ప్రళయదినాన మనిషితో అందరికన్నా ముందు జగడమాడేవారు అతని సంతానమే. వారు దేవునితో "దేవా! ఇతడ్ని గురించి మా ఫిర్యాదు తీసుకో. ఇతను మమ్మల్ని అధర్మ సంపాదనతో పోషించాడు. మాకు విధిగా నేర్పవలసిన విషయాలు ఇతను మాకు నేర్పలేదు. అందువల్ల మేము అజ్ఞానులుగా ఉండిపోయాము" అని అంటారు. (తిర్మిజి)

"ఒక వ్యక్తి తన సంతానానికి విద్యాబుద్ధులు గరపడం (అనే సత్కార్యం) మూడున్నర సేర్లు ధాన్యం లేదా ఖర్జూరపండ్లు వగైరా దానం చేయడం కంటే ఎంతో శ్రేష్ఠమయిన విషయం" (తిర్మిజి)

పై హదీసులలో తండ్రి ప్రస్తావన వచ్చింది. దీనర్థం సంతానశిక్షణకు తండ్రి మాత్రమే బాధ్యుడని కాదు, తండ్రితో పాటు తల్లి కూడా బాధ్యురాలే. ముఖ్యంగా పిల్లల ప్రాథమిక దశలో వారి శిక్షణ గురించి ఎక్కువగా తల్లే బాధ్యురాలవుతుంది. దైవప్రవక్త (సల్లం) బోధించిన మరికొన్ని హితోక్తులు చూడండి:

"మీ పిల్లలు ఏడేళ్ళ వయస్సుకు చేరుకోగానే వారిని నమాజు గురించి ఆదేశించండి. పదేళ్ళ వయస్సు నిండిన తరువాత (కూడా) నమాజు చేయకపోతే వారిని కొట్టండి. పదేళ్ళు నిండిన తరువాత వారి పడకలు వేరుచేయండి." (అబూదావూద్)

# 34. ముస్లిం పర్సనల్ లా

ఇస్లాం విశ్వజనీన దైవధర్మం; సర్వకాలాలకు ఉపయోగపడే నిత్యనూతన వ్యవస్థ, సమస్త జీవితరంగాల్లోనూ మనిషికి మార్గదర్శనం చేసే సమగ్ర జీవనవిధానం. ఈ కారణం గానే ముస్లింలు తాము నమ్మిన ధర్మంపై ఇతర మతఅనుయాయుల కన్నా అమితమైన అభిమానం, అచంచల విశ్వాసం వెలిబుచ్చుతారు. అంతేకాదు, జీవితంలోని ఏ రంగంలో నైనా సరే ఇస్లాం ప్రమాదంలో పడినట్లు అన్పిస్తే వారు సహించరు. ప్రతి దేశంలో, ప్రతి కాలంలోనూ దాని పరిరక్షణకై వారు నడుంబిగించి ఉద్యమాలు నిర్వహించారు. ఈనాడు కూడా వారు ఇస్లాం పరిరక్షణ కోసం పనిచేస్తున్నారు.

కాని విచారకరమైన విషయం ఏమిటంటే ఈనాడు మన దేశంలో ముస్లింలు, ప్రత్యేకంగా ముస్లిం మహిళలు కనీసం "ముస్లిం పర్సనల్ లా" అంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారు. అందువల్లనే వారు ఆధునిక యుగంలో కూడా దాని ప్రాశస్త్యం, ఔన్నత్యాల విషయంలో ముస్లిమేతరుల్ని తృప్తిపరచలేకపోతున్నారు.



మొగల్ చక్రవర్తుల పాలనలో మనదేశంలో ఇస్లామీయ చట్టమే దేశచట్టం (Law of the Land)గా ఉండేది. సివిల్ వ్యవహారాల్లోనేగాక, క్రిమినల్ వ్యవహారాల్లో కూడా ఆనాడు ఇస్లామీయ చట్టాల ప్రకారమే తీర్పులు ఇవ్వడం జరుగుతుండేవి. ముస్లిమే తరులకు మాత్రం వివాహం, వారసత్వం మొదలైన వ్యవహారాల్లో వారు తమ సంప్రదాయాల ప్రకారం నడుచుకునే పూర్తి స్వేచ్ఛ ఉండేది. అంటే వారికి వారి వ్యక్తిగత చట్టం (పర్సనల్ లా) ఉండేదన్న మాట.

## బ్రిటిష్ పాలనలో ముస్లిం సివిల్ చట్టాలు

ఆ తరువాత బ్రిటిష్ పాలకులు వచ్చి ఇస్లామీయ క్రిమినల్ చట్టాలను క్రమంగా తొలగించి, కేవలం సివిల్ చట్టాలను మాత్రమే ఉంచారు. కాని ఇస్లామేతర నాగరికత ప్రభావం వల్ల, ప్రత్యేకంగా హిందూ సమాజం ప్రభావానికి లోనయిన కొందరు ముస్లింలు, మహిళలకు రావలసిన వారసత్వపు వాటాను వారికి ఇచ్చేవారు కాదు. అంచేత ముస్లిం పెద్దలు, ధర్మవేత్తల కోరికపై ఆంగ్లేయులు 1937లో "ముస్లిం పర్సనల్ లా (షరీఅత్) అప్లికేషన్ యాక్ట్ 1937" అనే దాన్ని ప్రవేశపెట్టారు. దీన్నే ముస్లిం పర్సనల్ లా లేక 'షరీఅత్ యాక్ట్ 1937' అంటారు.

ఆ తరువాత 1939లో ముస్లిం వివాహ విచ్ఛేద చట్టం 1939 (Issolation of Muslim Marriages Act 1939) అమల్లోకి వచ్చింది. ఈ చట్టం అందులో పేర్కొన బడిన కారణాల మీద ముస్లిం మహిళకు తన భర్త నుండి విడిపోవడానికి కోర్టుకుపోయే అవకాశం కల్పించింది. ముస్లిం పర్సనల్ లా ప్రకారం తీర్పులివ్వడానికి వీలుగా న్యాయస్థానాల కోసం ఇంగ్లీషులో 'ప్రిన్సిపల్స్ ఆఫ్ మొహమ్మడన్ లా,' "ఔట్ లైన్స్ ఆఫ్ మొహమ్మడన్ లా" మొదలయిన పుస్తకాలు రాయబడ్డాయి.

ముస్లిం పర్సనల్ లా క్రోడీకరణ జరగనప్పటికీ ఇందులో ఇంకా కొన్ని లొసుగులు ఉన్నప్పటికీ, మౌలికంగా ఇస్లామీయ షరీఅత్‌నే న్యాయనిర్ణయాలకు కొలమానంగా స్వీకరించడం జరిగింది. అంచేత ఇస్లామీయ ఫిఖ్హ్‌కు చట్టస్థాయి ఉంది. న్యాయ స్థానాలు షరీఅత్ స్వభావానికి అనుగుణంగానే తీర్పులిస్తుండేవి.

## దేశస్వాతంత్ర్యం తరువాత దిగజారిన పరిస్థితి

ఈ పరిస్థితి దేశస్వాతంత్ర్యానికి పూర్వం, ఆతర్వాత చాలాకాలం వరకూడా కొన సాగింది. అయితే ఇటీవల ముస్లిం పర్సనల్ లాకు వ్యతిరేకంగా కామన్ సివిల్ కోడ్ ప్రవేశపెట్టాలని సెక్యులరిస్టులునబడేవారు కొందరు డిమాండ్ చేయడం, పాలకులు కూడా చూసీచూడనట్లు ఉండిపోవడం జరిగింది. ఈ అవకాశాన్ని వినియోగించు కుంటూ న్యాయస్థానాలు షరీఅత్‌కు భిన్నమైన తీర్పులివ్వడం ప్రారంభించాయి.

చివరికి దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు సైతం 1985లో షాబాను కేసులో ఇలాగే వ్యవహరించి ఆమెకు జీవితాంతం భరణం లభించాలని

తీర్పిచ్చింది. ఆ తీర్పుకు నిరసనగా ముస్లిములంతా ఆందోళన జరపడంతో ప్రభుత్వం 1986లో (విడాకులు పొందిన) "ముస్లింమహిళా హక్కుల పరిరక్షణ చట్టం" చేసింది.

ఇస్లామీయ షరీఅత్ ప్రకారం విడాకులు పొందిన స్త్రీ ఇద్దత్ కాలం (మూణ్ణెల్లు) గడచిన తరువాత పునర్వివాహం చేసుకోకుండాగాని, లేదా తననుతాను పోషించుకోలేని స్థితిలోగాని ఉంటే ఆమె ఆస్తికి వారసులయ్యే బంధువులు ఆమెకు జీవన భృతినివ్వాలి. బంధువులు ఆమెను పోషించలేని స్థితిలో ఉన్నప్పుడు ఆమె పోషణ భారం బైతుల్‌మాల్ (ప్రభుత్వ ధనాగారం)పై పడుతుంది. ముస్లిం మహిళా హక్కుల పరిరక్షణ చట్టం ఈ విషయాన్ని పేర్కొంటూ, ఒకవేళ ఆ స్త్రీ బంధువులెవరూ లేకపోతే, ఉన్నా ఈ భారం వహించే స్తోమత వారికి లేకపోతే ఆమె పునర్వివాహందాకా లేదా మరణందాకా వక్ఫ్ బోర్డు ఆమెకు జీవనభృతి చెల్లించాలని నిర్దేశిస్తోంది.

## కొత్త చట్టం చేసినా తప్పిపోని ప్రమాదం

అయితే చట్టం చేసినంత మాత్రాన ముస్లిం పర్సనల్ లాకు ఇక ఢోకా లేదని చెప్ప లేము. న్యాయస్థానాలు ముస్లిం వ్యక్తిగత చట్టాన్ని పూర్తిగా త్రోసిపుచ్చి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125,127 సెక్షన్‌ల ఆధారంగా విడాకులుపొందిన స్త్రీకి ఆమె జీవితాంతం ఆమె మాజీభర్త భరణం చెల్లించాలని తీర్పిచ్చే ప్రమాదం ఇప్పటికీఉంది. ఎందుకంటే ఈ సెక్షన్‌ల నుంచి ముస్లింలను మినహాయించినట్లు ముస్లిం మహిళా హక్కుల పరిరక్షణ చట్టంలో పేర్కొనబడలేదు. షాబాను కేసులో తీర్పిచ్చిన ఓ న్యాయమూర్తి ఒక చోట ప్రసంగిస్తూ ముస్లిం పర్సనల్ లా, షరీఅత్‌లతో నిమిత్తం లేకుండానే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125,127 సెక్షన్‌ల క్రింద ముస్లిం మహిళలకు మనోవర్తి ఇప్పించవచ్చని అన్నారు.

ఈ కోడ్‌లోని 125వ సెక్షన్ విడాకులు పొందిన స్త్రీకి ఆమె మాజీ భర్తే శాశ్వతంగా భరణం చెల్లించాలని ఆదేశిస్తోంది. 125 (1) (బి) విశదీకరణలో విడాకులు పొందిన స్త్రీ మళ్ళీ పెళ్ళయ్యే వరకూ "భార్యే"నని నిర్వచించబడింది. ఈ రెండు విషయాలు పర్సనల్ లా మౌలిక స్వభావానికి విరుద్ధమన్న సంగతి గమనార్హం.

## క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని లొసుగులు

సెక్షన్ 125(3)లో ఇంతకంటే విచిత్రమైన అసాధారణమైన ప్రొవిజన్ ఉంది. విడాకులు పొందిన స్త్రీని పోషించేందుకు ఆమె మాజీభర్త తనతో కలిసి కాపురం చేయమని కోరడానికి ఈ సెక్షన్ అనుమతిస్తుంది. అంటే ఆ మాజీ భర్త దైవాదేశాలను విడనాడి భరణం బెడదకు ప్రతిక్రియగా తన మాజీభార్యను హింసించడానికి, ఆమెను అక్రమసంబంధం ఊబిలో దించడానికి ఈ ప్రొవిజన్‌ను ఉపయోగించుకునే ఆస్కారం ఉందన్న మాట! ఇంకా సెక్షన్ 125లోని అక్రమసంతానం, ఉంపుడుగత్తె వగైరా పదాలను కూడా దృష్టిలో పెట్టుకుంటే ఈ ఉత్తర్వు వైవాహిక బంధం నుండి విడిపోయిన స్త్రీ పురుషుల్ని ఎలా పచ్చివ్యభిచారం వైపుకు గొనిపోతున్నదో వివరించనవసరం లేదు.



క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 127వ సెక్షన్ మనోవర్తిలో సందర్భానుసారం మార్పు, లేదా రద్దుచేయడానికి కోర్టుకు అధికారాలిస్తోంది. ప్రభుత్వం ముస్లింలను దృష్టిలో పెట్టుకొని 1973లో ఈ సెక్షన్‌కు (3-బి) అనే సబ్ సెక్షన్ చేర్చింది. ఏదైనా సంప్రదాయం క్రిందగాని, వ్యక్తిగత చట్టం (పర్సనల్‌లా) క్రిందగాని (ఉదాహరణకు "మహర్" క్రింద) విడాకులు పొందిన స్త్రీ ఏకమొత్తం పొందివుంటే శాశ్వత జీవనభృతికి ఆస్కారమిచ్చే 125వ సెక్షన్ ఆమెకు వర్తించదని సెక్షన్ 127 (3-బి) నిర్దేశిస్తోంది.

ముస్లిం వ్యక్తిగత చట్టం జోలికి పోకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే పార్లమెంటు ఈ సెక్షన్‌ని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ప్రవేశపెట్టింది. కాని ముస్లిం పర్సనల్ లాకు కల్పించబడిన ఈ చట్టబద్ధమైన భద్రతను షాబాను కేసులో సుప్రీంకోర్టు వ్యర్థపరచింది.

ముస్లిం మహిళా హక్కుల రక్షణ చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సెక్షన్ 125ను రద్దుచేయకపోవడమే గాక ఇందులో మరోలొసుగు కూడా ఉంది. విడాకులు పొందిన దంపతులు పరస్పరం ఒప్పుకుంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం కూడా మనోవర్తి చెల్లింపుకు ఈచట్టం వీలుకల్పిస్తోంది. షరీఅత్ ఆజ్ఞల్ని ధిక్కరించేవారికి ఇదొక దొడ్డిదారి. అయినా ఇస్లాంవ్యతిరేక శక్తులు ఈమాత్రం చట్టాన్ని కూడా సహించలేకపోతున్నారు.

## రాజ్యాంగం 44వ అధికరణ ఎత్తివేయాలి

ఇలాంటి పరిస్థితుల్లో మన న్యాయస్థానాలు ఎల్లవేళలా ముస్లిం పర్సనల్ లాకు అనుకూలంగా తీర్పులిస్తాయని నమ్మకం ఏమిటి? పైగా దేశపౌరులందరికీ యూనిఫాం సివిల్‌కోడ్ ఏర్పాటుకు ఆస్కారమిస్తున్న రాజ్యాంగపు 44వ ఆర్టికల్ వరలేని ఖడ్గంగా ముస్లింల నెత్తిపై ఇంకా వ్రేలాడుతూనే ఉంది. యూనిఫారం సివిల్ కోడ్ వస్తే దేశంలో ఇక ఏ మతవర్గానికి పర్సనల్‌లా ఉండదు. వివాహం, విడాకులు, ఆస్తిపంపకాలు వగైరాలన్నీ షరీఅత్‌కు వ్యతిరేకంగా నిర్వహించబడే అవకాశం ఇందులో ఉండవచ్చు.

ఒకవేళ ముస్లింల నుంచి తీవ్ర ప్రతిఘటన వస్తే ఐచ్ఛిక ఉమ్మడి పౌరస్మృతి రూపంలోనైనా ఈ ఉపద్రవం తప్పేలాలేదు. అప్పుడు పర్సనల్ లా రద్దుకాకపోయినా దాన్ని ఇష్టపడనివారిని, వారు ముస్లింలైనా సరే ఈ ఉమ్మడిపౌరస్మృతి తన పరిధిలోకి తీసుకుంటుంది. ముస్లిం పర్సనల్ లా నామమాత్రంగా మిగిలిపోతుంది.

## ముస్లింల నిరంతర కర్తవ్యం

అందువల్ల ముస్లింలు, ప్రత్యేకంగా ముస్లిం మహిళలు వివాహం, విడాకులు, విడాకుల తరువాత ప్రారంభమయ్యే ఇద్దత్ (గడువు), ఇద్దత్ కాలంలో మాత్రమే మాజీ భర్త వహించే పోషణబాధ్యత, ఆస్తిహక్కులు మొదలయిన విషయాలను గురించి తెలుసు కొని ముస్లిం పర్సనల్ లాని, షరీఅత్ చట్టాలను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముస్లిం పర్సనల్ లాని కాపాడుకోవడమంటే తమ ధార్మిక వ్యక్తిత్వాన్ని (Relegious Identity) కాపాడుకోవడమేనని వారు గ్రహించాలి.

స్త్రీ అభ్యుదయవాదులమని చెప్పుకునే కొందరు ముస్లింమహిళలు తమకు ఎన్నో అన్యాయాలు జరుగుతున్నాయని, ముస్లిం పర్సనల్‌లాని సవరించాలని అంటున్నారు. ఇలా వారు ముస్లిం పర్సనల్‌లా మూలంగానే తమకీ కష్టాలు వస్తున్నట్లు అభిప్రాయపడు తున్నారు. కాని ఇది తప్పుడు అభిప్రాయం. ముస్లింలు ఏ సమాజంలో మనుగడ సాగి స్తున్నారో దాని దుష్ప్రభావం, సహవాసదోషాలు మాత్రమే వాటిక్కారణం. ఇస్లాం గురించి లోతుగా ఆలోచించడానికి బదులు పరిసరాల ప్రభావానికి లోనవుతున్నారు.

ఇస్లాంలో పురుషులతోపాటు స్త్రీల క్కూడా సముచితమైన హక్కులు ఇవ్వబడ్డాయి. ఆమెకు భర్త నుండి మహర్ రూపంలోనేగాక పుట్టింటి నుండి, మెట్టింటి నుండి కూడా ఆస్తి వాటా లభిస్తుంది. హైందవ సమాజంలో మొన్నటిదాకా స్త్రీకి ఆస్తి హక్కులు లేకుండేవి. ఇటీవలి కాలంలోనే స్త్రీకి తండ్రి ఆస్తి నుండి వాటా లభించింది. అయితే హిందూమతస్థుల్లో అది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది.

మన రాష్ట్రహైకోర్టు, వారసత్వపు ఆస్తుల నుంచి వచ్చిన ఆదాయంతో హిందూ వితంతువు పోషణబాధ్యత ఆమె సోదరులపై పడుతుందని తీర్పిచ్చింది. ఆచరణలో ఇది ఎంతవరకు సాధ్యం? ఒకవేళ ఆ పేదరాలి సోదరులకు ఆమెను పోషించే స్తోమత లేనిపక్షంలో లేదా ఆమెకసలు సోదరులే లేకపోతే ఆ నిర్భాగ్యురాలి గతేంకాను?

అదే ముస్లిం పర్సనల్ లా (ముస్లిం వ్యక్తిగత చట్టం), ముస్లింమహిళా హక్కుల రక్షణ చట్టం అయితే ఇలాంటి అనాథ స్త్రీ పోషణ బాధ్యత ఆమె సంతానం, పుట్టింటి బంధువులు వహిస్తారు. వారు లేకపోతే లేదా వారికి స్తోమత లేకపోతే ఆమె పోషణభారం వక్ఫ్‌బోర్డ్ భరిస్తుంది.

ముస్లిమేతర సమాజంలో మరో వైపు పురుషుడు తనకిష్టంకాని భార్యకు విడాకులు ఇవ్వందే రెండోభార్యను చేసుకోడానికి వీల్లేదు. ఒకవేళ విడాకులిస్తే ఆ భార్యకు జీవితాంతం లేదా పునర్వివాహందాకా నెలనెలా భరణ చెల్లించాల్సి వస్తుంది. ఈ బెడదల నుంచి తప్పించుకోవడానికి ఆ భర్తలకు ఇక ఒకే ఒక మార్గం కన్పించింది. భార్యను శాశ్వతంగా తన దారి నుంచి తొలగించుకోవడమే ఆ మార్గం. ఒకవేళ పట్టుబడే ప్రమాదం కన్పిస్తే పోలీసులకు పది పన్నెండు వేలు పడేసి హత్యానేరం నుంచి తప్పించుకోవచ్చు. కోరిన కట్నం, కానుకలతో ఎంచక్కా మరో స్త్రీని చేసుకోవచ్చు.

ఇవన్నీ చట్టవ్యతిరేక చర్యలు గనక సాధ్యం కాదని ఎవరైనా కొట్టివేసినా, సమాజంలో ఈనాడు సంభవిస్తున్న కటిక సంఘటనలు ఎవరూ కాదనలేరు. వివాహిత స్త్రీల ఆత్మహత్యా సంఘటనల్లో అత్యధిక భాగం ఈ కోవకు చెందినవే. ముస్లింలు సామాజిక స్పృహతో పరిస్థితి గమనిస్తే ముస్లిం పర్సనల్ లాకు ఎంత ప్రాముఖ్యం ఇవ్వాలో, దాని రక్షణబాధ్యత తమపై ఎంత తీవ్రంగా ఉందో వారికి మరింత అర్థమవుతుంది.



## నమ్మకం, నిరాకరణలు ఒక వరలో ఇమడని ఖడ్గాలు

ముస్లింలని చెప్పుకునేవారు ధర్మానుసరణలో, అంటే ఆచరణలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ ఖుర్‌ఆన్‌ని ప్రళయందాకా మార్పులకు గురికాని దైవగ్రంథమని పూర్తిగా విశ్వసించాలి. అలా పూర్తిగా విశ్వసించకుండా ఖుర్‌ఆన్‌లో కొన్ని మార్పులు తీసుకురావా లని చెప్పేవారు అలాంటి మార్పులకు సంబంధించిన సూక్తులు దైవసూక్తులు కాదని నిరూపించాలి. నిరూపించలేనివారు నోరు మూసుకొని కూర్చోవాలి.

"ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ గ్రంథం గురించి మీకేదయినా అనుమా నముంటే ఇందులోని అధ్యాయంలాంటి ఓ అధ్యాయం రచించి తీసుకురండి. ఈ పని కోసం ఒక్క దేవుడ్ని వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యవంతు లయితే ఈ పని చేసిచూపండి. మీరీ పని చేయలేకపోతే.... ఎంతమాత్రం చేయలేరు.... మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి." (ఖుర్‌ఆన్–2:23,24)

దైవశాసనాలను గురించి ఖుర్‌ఆన్ ఏమంటున్నదో చూడండి:

ఏమిటీ, మీరు గ్రంథంలోని కొంత భాగం విశ్వసించి మరికొంత భాగం తిరస్క రిస్తారా? అయితే మీలో అలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారికి శిక్షగా ఇహలోక జీవితంలో వారు అవమానం, అప్రతిష్ఠలపాలవుతారు; అటు పరలోకంలో తీవ్రమైన యాతనలకు గురవుతారు. దేవుడు మీ చర్యల్ని గమనించడం లేదని భావించకండి. (ఖుర్‌ఆన్–2:84,85)

"దేవుడు, ఆయన ప్రవక్త ఏదైనా వ్యవహారంలో ఒక నిర్ణయం చేసిన తరువాత, ఇక దాన్ని గురించి విశ్వాసులయిన స్త్రీ పురుషులెవరికీ ఎలాంటి స్వంత నిర్ణయం తీసుకునే అధికారం లేదు. దీనికి భిన్నంగా ఎవరైనా దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే వారు పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడిపోయినట్లే." (2:36)

"(ముహమ్మద్!) నీప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పు పట్ల ఏమాత్రం తటపటాయించ కుండా ఆసాంతం స్వీకరించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు." (4:65)

"వారు దేవుడ్ని, దైవప్రవక్తను విశ్వసించి విధేయులై పోయామని అంటారు. కాని ఆ తరువాత వారిలో ఒకవర్గం (అవిధేయత చూపుతూ) ముఖం తిప్పుకుంటుంది. అలాంటి **వారు (నిజమైన) విశ్వాసులు కానేకాదు.** వారి పరస్పర వివాదాలను పరిష్కరించే నిమిత్తం వారిని దేవుని వైపు, దైవప్రవక్త వైపు పిలిచినప్పుడు వారిలో కొందరు (నీదగ్గరకు) రాకుండా ముఖం చాటేస్తారు. అయితే విషయం తమకు అనుకూలంగా ఉంటే మాత్రం వారు అతివినయం వొలకబోస్తూ ప్రవక్త దగ్గరికి వస్తారు. వారి హృదయానికేదైనా (కాపట్య) రోగం అంటుకుందా? లేక అనుమానభూతం పట్టుకుందా? లేక దేవుడు, ఆయన ప్రవక్త తమకేదయినా అన్యాయం చేస్తారని భయపడుతున్నారా? నిజానికి ఇవేవీ కావు. వారసలు స్వతహాగానే పరమ దుర్మార్గులు." (24:47-50)

## దైవచట్టాలా? మానవచట్టాలా?

"కనుక ప్రవక్తా! నీవు దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారమే వారి వ్యవహారాలు పరిష్కరించు. వారి మనోకాంక్షల్ని అనుసరించకు. జాగ్రత్త! దేవుడు నీపై అవతరింపజేసిన సంవిధానం నుండి తప్పించడానికి వారు నిన్ను రకరకాలుగా ప్రలోభపెట్టవచ్చు. వారి కుయుక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలి. వారు గనక (నీకు) విముఖులైతే, ఒక విషయం తెలుసుకో, వారు చేసిన కొన్ని ఘోరపాపాలకు దేవుడు వారిపై ఆపద తెచ్చిపడవేయాలని ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు. **వీరు (దైవచట్టం కాదని) అనాగరిక పద్ధతులు కోరుతున్నారా?** దేవుడ్ని విశ్వసించినవారి దృష్టిలో దేవుని చట్టం తప్ప మరెవరి చట్టం శ్రేష్ఠమైనదవుతుంది?" (5:49,50)

"(ప్రవక్తా! చెప్పు:) 'మీమధ్య ఏ విషయంలో విభేదమొచ్చినా దాన్ని పరిష్కరించే పని దేవునిదే. ఆయనే నా ప్రభువు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. (ఏ సమస్య వచ్చినా) నేను ఆయన (హితవుల) వైపుకే మరలుతాను". (42:10)

దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే 'సత్యతిరస్కారుల'ని 5:44వ సూక్తిలో, 'దుర్మార్గుల'ని 5:45వ సూక్తిలో, 'దుర్జనుల'ని 5:47వసూక్తిలో ఉంది. జీవితంలోని ఏ రంగంలోనైనా దైవాజ్ఞలు, దైవచట్టాల ప్రకారమే మనిషి తన వ్యవహారాలు పరిష్క రించుకోవాలి. అలా చేయనివారిని ఈ సూక్తులలో ఇలా హెచ్చరించడం జరిగింది.

ఈ సూక్తుల్ని యూదులకు, క్రైస్తవులకు మాత్రమే వర్తింపజేయడానికి కొందరు ముస్లింలు ప్రయత్నించారు. కాని ప్రముఖ సహాబీ హజ్రత్ హుజైఫా (రజి) దీనికి చక్కని సమాధానమిచ్చారు. ఆయనతో ఒకతను "ఈ మూడు సూక్తులు ఇస్రాయీలీలకు సంబంధించినవి కదా?" అన్నాడు. దానికి హజ్రత్ హుజైఫా (రజి) ఇలా అన్నారు: "ఈ ఇస్రాయీలీలు మీకోసం ఎంత మంచి సోదరులు! చేదు విషయలన్నీ వారి కొరకునూ, తియ్యటి విషయాలన్నీ మీ కొరకునా!! అలా ఎన్నటికీ కాదు. దైవసాక్షి! మీరు వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు."

## దైవచట్టాలు-విధ్యుక్త సరిహద్దులు

ఖుర్‌ఆన్‌లో దేవుడు మానవుల కోసం చట్టాలు నిర్దేశించిన తర్వాత వాటి సరి హద్దులు అతిక్రమించకూడదని, అతిక్రమించేవారు శిక్షించబడతారని హెచ్చరించాడు.

4:24వ సూక్తిలో వివాహనిషిద్ధ స్త్రీల వివరాలు పేర్కొన్న తరువాత "ఇది దైవ శాసనం, దాన్ని పాటించడం మీ విధ్యుక్తధర్మం" అనిఉంది. 2:229 సూక్తిలో తలాఖ్, మహర్ వగైరా విషయాలు పేర్కొన్న తర్వాత "ఇవి దైవనిర్ణీత పరిమితులు, వాటిని అతిక్రమించకండి. దైవ పరిమితుల్ని అతిక్రమించేవారే దుర్మార్గుల"ని చెప్పబడింది.

4:11,12 సూక్తులలో సృష్టికర్త వారసత్వపు ఆస్తిపంపకం గురించిన ఆజ్ఞలు జారీ చేసినతర్వాత 4:13,14 సూక్తుల్లో "దేవుడు నిర్దేశించిన పరిమితుల్ని అతిక్రమించేవారిని



ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. అక్కడే వారు ఎల్లకాలం ఉంటారు. వారికి అత్యంత అవమానకరమైన శిక్ష సిద్ధంగా ఉంది" అని తీవ్రంగా హెచ్చరించడం జరిగింది.

# 35. పెడసరి ప్రశ్నకు గడసరి జవాబు

1986లో షాహ్‌బాను కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు యావద్దేశంలో తీవ్ర సంచలనం సృష్టించింది. రాజ్యాంగం ప్రసాదించిన మతస్వేచ్ఛకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ముస్లిం పర్సనల్‌లాని త్రోసిపుచ్చి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125, 127 సెక్షన్‌ల ఆధారంగా ఈ వ్యవహారంపై తీర్పిచ్చింది. దేశంలో అనేకచోట్ల ముస్లింలు తీవ్ర నిరసనలు తెలిపారు. చివరికి ప్రభుత్వం ముస్లింల సామూహికశక్తి ముందు తలవంచి "ముస్లిం మహిళాహక్కుల రక్షణ చట్టం" పేరుతో ఒక చట్టం చేసింది.

ఈ చట్టం ప్రకారం విడాకులు పొందిన ముస్లింస్త్రీ పోషణబాధ్యతను 'ఇద్దత్' కాలం వరకే ఆమె మాజీ భర్త వహించవలసి ఉంటుంది. ఆ తరువాత ఈ బాధ్యత ఆమె ఆస్తికి వారసులయ్యే బంధువులపై పడుతుంది. ఒకవేళ ఈ బంధువులు ఆర్థికస్తోమత లేని వారయి ఉంటే ఆమె మనోవర్తి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు భరిస్తుంది.

## ముస్లిం మహిళలపై మొసలి కన్నీరు

చట్టమయితే రూపొందింది. కాని అభ్యుదయవాదులనబడేవారు ఇప్పటికీ ముస్లిం మహిళలపై మొసలి కన్నీరు కారుస్తూ, ముస్లిం పర్సన్ లా వాళ్ళకేదో అన్యాయం చేస్తోందని గగ్గోలు పెడ్తున్నారు. ఒక్కోసారి ఈ ముస్లిం పర్సనల్ లా జాతిసమైక్యతకు అడ్డంకిగా ఉందని విమర్శిస్తూ, యూనిఫాం సివిల్ కోడ్ ప్రవేశపెట్టాలని గోలచేస్తున్నారు.

ఇలాంటి వ్యక్తులు ప్రభుత్వం యంత్రాంగంలో కూడా చాలామంది ఉన్నారు. వీరు తమ దగ్గరికి ఉద్యోగం కోసం వచ్చిన ముస్లిం అభ్యర్థులకు ఉద్యోగ స్వభావానికి సంబంధంలేని ముస్లిం పర్సనల్ లా, యూనిఫాం సివిల్ కోడ్‌లాంటి విషయాలపై యక్ష ప్రశ్నలు వేసి వారిని ఇరకాటంలో పెడ్తున్నారు. వారు ఆశించిన ఇస్లాంవ్యతిరేక సమాధానాలు చెప్పని అభ్యర్థులు ఎంతటి తెలివికలవారయినా అనర్హులే.

ఇలాంటి పరిస్థితే 1987లో ఓ ముస్లింయువతికి ఎదురైంది. అయితే ఆమె ఘాటైన సమాధానాలిచ్చి అధికారుల నోరుమూయించింది. ఈ ఇంటర్వ్యూలో ఆర్గురు అధికారులు పాల్గొన్నారు. వారిలో ఒకతని నుదుటిపై కాసంత కుంకుమ బొట్టుంది. ఈమెకు ఎక్కువ ప్రశ్నలు వేసింది ఆ మహానుభావుడే. ఇంటర్వ్యూ ఇలా సాగింది:

## యక్షప్రశ్నలతో వేధింపులు తగునా?

అధికారి: ఇటీవల పార్లమెంటులో ఒక సమస్యపై పెద్ద రభస జరిగింది. చివరికి రాజ్యాంగంలో కూడా సవరణ జరిగింది. ఆ సమస్య ఏమిటో మీకు తెలుసా?

అభ్యర్థిని: తెలుసు. అది ముస్లిం పర్సనల్ లాకు సంబంధించిన సమస్య.

అధికారి: యూనిఫాం సివిల్ కోడ్ ప్రవేశపెడ్తే వచ్చే నష్టమేమిటి? మనది భారతదేశం, ఇక్కడ ప్రజలందరూ ఒక్కటిగా ఉండాలి కదా?

అభ్యర్థిని: అలా ఉంటే మంచిదే. ఎవరు కాదంటారు? కాని మీరు ప్రజలందర్నీ ఒకేలా చూడదలచినప్పుడు, ఇక్కడ ఎవరికీలేని బొట్టు మీ నుదుటిపైనే ఎందుకుంది?

అధికారి: సరే, విడాకుల తరువాత స్త్రీకి ఆమె భర్త నుండి మనోవర్తి ఇప్పిస్తే మీ కభ్యంతరం ఏమిటి? ఇది మీ స్త్రీలకు లాభం చేకూర్చే విషయమేగదా?

## ధర్మజ్ఞానమే ధైర్యసాహసాలకు ఊతం

అభ్యర్థిని: విడాకులు పొందిన తర్వాత మాజీభర్త నుండి మనోవర్తి తీసుకోవడమంటే ఉమ్మేసి నాకినట్లే. ముస్లింమహిళలు ఉమ్మేసి నాకడాన్ని సుతరామూ ఇష్టపడరు. అదీగాక, ముస్లింమహిళ వివాహమైన తర్వాత తనభర్తకు భార్యగా ఉండటంతో పాటు తన తల్లిదండ్రులకు కుమార్తెగా, తన సోదరులకు సోదరిగా కూడా ఉంటుంది. ఆమెకు తల్లిదండ్రుల ఆస్తినుంచి కూడా వాటా లభిస్తుంది. విడాకులు పొందిన తర్వాత ఇలా అవమానకరమైన కూడు తింటూ తిరగడానికి ఆమె దిక్కులేని స్త్రీ కాదు.

అధికారి: ఈ ఇంటర్వ్యూలో మీరు పాసవుతారని ఆశిస్తున్నారా?

అభ్యర్థిని: మీరు న్యాయప్రియులే అయితే నేను తప్పకుండా పాసవుతాను. ఒకవేళ ఫెయిల్ అయితే అన్యాయపరుల నుండి నాకు విముక్తి కలిగిందని భావిస్తాను.

## బట్టబయలయిన ద్వంద్వ మనస్తత్వం

ఇదీ ముస్లిం పర్సనల్‌లా గురించి అపర అభ్యుదయవాదుల ద్వంద్వ మనస్తత్వం! ప్రభుత్వం ముస్లింమహిళా హక్కులచట్టం చేసింది కదా, ఇక ఢోకా లేదని ముస్లింలు మురిసిపోవచ్చు. కాని కామన్ సివిల్ కోడ్‌కు అవకాశమిస్తూ, రాజ్యాంగంలోని 44వ అధికరణ ముస్లింపర్సనల్ లా నెత్తిపై వరలేని ఖడ్గంలా ఇప్పటికీ వ్రేలాడుతూనే ఉంది.

కనుక ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఏ దృష్టిలో ఒక్కటే- మహిళల్లో అజ్ఞానం, అవిద్య దూరమయి ధార్మిక చైతన్యం రావాలి. మహర్ విషయంలో ఖలీఫా ఉమర్ (రజి) అభిప్రాయాన్ని ఘాటుగా విమర్శించిన ధీరవనిత నేటి స్త్రీలకు ఆదర్శం కావాలి.

# 36. యూనిఫాం సివిల్ కోడ్

(బెంగుళూరు నుండి వెలువడే ఇంగ్లీషు పక్షపత్రిక "దళిత్‌వాయిస్"కు ప్రధాన సంపాదకుడు, దళితనాయకుడుయిన వి.టి.రాజశేఖర్ రచనలకు తెలుగు అనువాదం:)

ప్రజలదృష్టిని అసలు సమస్యల నుండి తప్పించి పెడత్రోవ పట్టించడంలో భారతదేశ పాలకులు ఆందెవేసిన చేయి. ప్రచారసాధనాలు పాలకుల చేతిలోనే ఉండటం వల్ల ఏ విషయాన్నయినా వారు సృష్టించగల్గుతారు, అదృశ్యం కూడా చేయగల్గుతారు.



సమస్యకాని సాధారణ విషయాన్ని కూడా వారు సంచలనాత్మక వ్యవహారంగా మార్చగల్గుతారు. ఈనాడు ముస్లిం పర్సనల్ లాతో జరుగుతున్నది ఇదే.

ముస్లిం స్త్రీలకు స్వాతంత్ర్యం లభించాలన్న మాటతో ప్రారంభమైన వారి నినాదం ఆ తర్వాత క్రమంగా ముస్లిం పర్సనల్ లాను మార్చాలి అనేదాకా పోయింది. చివరికి ఇప్పుడు కామన్ సివిల్ కోడ్ (యూనిఫాం సివిల్ కోడ్) ప్రవేశపెట్టాలని గోల చేస్తున్నారు.

## ఎన్నటికీ రాజీపడనివారు ఇప్పుడు రాజీకొస్తారా?

మొదట వారు బ్రాహ్మణత్వంతో ఎన్నటికీ రాజీపడని శత్రువులయిన ముస్లింలను చికాకు పరచాలని, వేధించాలని సంకల్పించారు. అయితే ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే ముస్లిం పర్సనల్ లాను హిందువుల కోసం కూడా అమల్లోకి తీసుకురావడానికి సంకల్పించినట్లు కన్పిస్తోంది. వివాహం, వారసత్వానికి సంబంధించిన హిందూచట్టంలోని లోపాలను, ముస్లిం పర్సనల్‌లా ప్రయోజనాన్ని అగ్రవర్ణాలవారు గ్రహించారు.

ముస్లిం పర్సనల్‌లా లోని విడాకులు, స్త్రీల వారసత్వపు హక్కులు, వితంతు పునర్వివాహం లాంటి అభ్యుదయ విషయాల అనుకరణ ద్వారా హిందూచట్టంలో మెల్లిగా, క్రమబద్ధంగా జరుగుతున్న వివిధ మార్పులే దీనికి నిదర్శనం. హిందూచట్టం ఇంకా పరిణామ దశలోనే ఉన్నందున ముస్లిం పర్సనల్‌లా లోని అత్యధిక అంశాలను గ్రహించడమే దీని అంతిమ లక్ష్యమయి ఉంటుంది.

అయితే ముస్లిం పర్సనల్ లా ఔన్నత్యాన్ని సూటిగా అంగీకరించడం హిందువుల అహానికి దెబ్బ కాబట్టి వారు బహుశా కామన్ సివిల్ కోడ్ మేలయినదిగా భావించి దాన్ని స్వీకరించడానికి ముందుకు వచ్చి ఉండవచ్చు. ముస్లింలు ఒక్క అంగుళం కూడా తమ చట్టాన్ని వదలిపెట్టరనే విషయం వారికి బాగా తెలుసు.

## ప్రయోజనాలు పొందడానికేనట ఈ ఎరలు

ఒకవేళ ముస్లింలు కామన్ సివిల్‌కోడ్ రూపొందించడానికి అంగీకరించినా, అది తమ చట్టం పరిధిలోనే ఉండాలని వారు పట్టుపట్టవచ్చు. ముస్లింల పట్ల సదవగాహనకు సూచనగా వారిని సంతోషపెట్టడానికి హిందువులు కూడా వారి వాదనను అంగీకరించవచ్చు. వాస్తవానికి వారు ముస్లిం పర్సనల్‌లాలోని ప్రయోజనాలను పొందడానికే అలా వ్యవహరిస్తారు. ఈ రహస్యాన్ని చాలామంది ముస్లింలు గ్రహించలేక పోతున్నారు.

ఈ అభిప్రాయానికి కారణాలు ఈ క్రింది వాస్తవాలే:

1. 1955లో హిందూ వివాహచట్టం, 1956లో హిందూ వారసత్వపు చట్టాలు రూపొంద బడ్డాయి. అయితే అప్పటికే భారతీయ వారసత్వపు చట్టం అమల్లో ఉంది. ఒకవేళ ఆనాడే హిందువులు కామన్ సివిల్ కోడ్ కావాలనుకుంటే, వారు హిందూ వివాహచట్టాన్ని, భారతీయ వివాహచట్టమని, భారతీయ వారసత్వపు చట్టమని సూటిగా

పిలవచ్చుగా. కాకపోతే చట్టంలో అవసరమైన సవరణలు ఏవైనా ఉంటే చేయవలసి వచ్చేది. ఈ చట్టం భారతీయులందరి హక్కులను పరిరక్షించేది.

కాని వారు హిందూవివాహ చట్టమని, హిందూ వారసత్వపు చట్టమని ప్రత్యేకించి తమ కోసమే రూపొందించుకున్నారు. ఆ సమయంలో వారి "జాతీయ సమైక్యతా" భావన ఏమయింది? మతతత్వ చట్టాలను రద్దుచేయాలన్న ఆలోచన వారికప్పుడు ఎందుకు కలగలేదు? ప్రస్తుతం సాగుతున్న కామన్ సివిల్ కోడ్ గోల వెనుక అగ్రవర్ణాల ఉద్దేశ్యం ఏమిటో ఈ ధోరణి బట్టబయలు చేయడం లేదా?

## హిందూ వివాహచట్టంలోని లొసుగులు

2. ఇదివరకటి హిందూ వివాహ చట్టంలో విడాకులకు అవకాశమే ఉండేదికాదు. వారు విడాకుల పద్ధతినే ద్వేషించారు. ఈనాటికీ వారు తలాఖ్‌ను ద్వేషిస్తున్నారు. ఆ తర్వాత హిందూ వివాహచట్టంలో విడాకులకు స్థానమిచ్చారు. అయితే వారీ విడాకుల పద్ధతిని ఎంత కష్టతరం చేశారంటే తీర్పు వచ్చేటప్పటికీ దంపతులు ముసలి వారైపోయే వారు. ఇలా లక్షల దంపతుల జీవితాలు నాశనంచేసిన తర్వాత, కాస్త ఇస్లాం చట్టానికి దగ్గరగా వచ్చి "పరస్పర అంగీకారంతో విడాకులు" అనే అంశాన్ని చట్టంలో చేర్చారు.

అయితే పెళ్ళయి ఒక సంవత్సరం గడచి ఉభయులు ఇష్టపడితేనే ఇది సాధ్యం. కేవలం హిందువుల కోసమే ఈ అవకాశాన్ని కల్పించడం జరిగింది. విడాకులకు ఇష్టపడని కొందరు పట్టణస్త్రీలు ఈ అవకాశాన్ని బాగా వినియోగించుకుంటున్నారు. ఇలాంటివారు తమ అంగీకారం తెలపడానికి నిరాకరించి, విడిగా జీవితం గడుపుతూ తమభర్తల నుంచి భరణం పొందుతుంటారు. ఇలాంటి పరిస్థితి నుండి బయటపడేందుకు కొందరు హిందూపురుషులు రెండు మార్గాలు కనిపెట్టారు.

(క) వారు తమ భార్యలను కాల్చి చంపివేస్తారు. హత్యకు సంబంధించిన సాక్ష్యాధారాలు లేకుండా జాగ్రత్త పడతారు. పైగా ఈ నేరాన్ని ఆత్మహత్యగా చిత్రిస్తారు. "వరకట్న మరణాల"ని చెప్పబడేవన్నీ నిజానికి "విడాకుల మరణాలే."

(చ) రెండోమార్గం మరో స్త్రీని వివాహమాడటం. రెండోపెళ్ళి విషయమై న్యాయ స్థానాలు దృఢమైన సాక్ష్యాలు అడుగుతాయి. దాంతో అవి పురుషుని రెండవ వివాహాన్ని నిరూపించలేవు. ఒకవేళ నిరూపించినా దానివల్ల మొదటి భార్యకుగాని, రెండో భార్యకు గాని ఎలాంటి లాభంఉండదు. కారణం భారతీయ శిక్షాస్మృతి ప్రకారం రెండో పెళ్ళి చేసుకున్న నేరానికి భర్తను అరెస్టు చేస్తారు. దాంతో ఇద్దరు భార్యలూ బాధపడతారు. హిందూసమాజం పురుషాధిక్యతగల సమాజం. దీనికి వారి మతం అనుమతిస్తోంది.

## చట్టంకోరల నుంచి తప్పించుకునే మార్గాలు

అవిధేయురాలైన భార్యచేత పీడించబడిన వ్యక్తి పదేండ్ల వరకూ వ్యాజ్యాల్లో జీవితాన్ని నాశనం చేసుకోవడానికి బదులుగా నిరూపించడానికి వీలుకాని ఊహాలోకపు



నిర్బంధాన్నే మేలైనదిగా భావిస్తాడని జనం చెప్పుకుంటారు. అందుకే రెండవ వివాహం చేసుకున్న వ్యక్తి వివాహ సాక్ష్యాన్ని నిర్ధారించేందుకు చట్టాన్ని సడలించాలని ఎన్నో మహిళా మండళ్ళు డిమాండ్ చేశాయి. అదే గనక జరిగి, రెండవ వివాహం సంగతిని పురుషుడు సులభంగా నిర్ధారించగలిగితే అతని రెండవ భార్య తన పిల్లల వారసత్వం విషయంలో పెద్ద సమస్య సృష్టిస్తుంది. దీన్ని మొదటి భార్య అసహ్యించుకుంటుంది. ఎందుకంటే తండ్రి జీవితంలో రెండవ వివాహం నిర్ధారణ అయితే రెండోభార్య పిల్లలకు తండ్రి ఆస్తిలో వాటా లభించే అవకాశం ఉంది.

అందువల్ల భర్త, అతని రెండవ భార్య భారత శిక్షాస్మృతి ప్రకారం కలిగే పరిణామాలను దృష్టిలో పెట్టుకొని తమ వివాహాన్ని రహస్యంగా ఉంచుతారు. ఈవిధంగా రెండవ వివాహం చేసుకున్న వ్యక్తి హాయిగా చట్టం కోరల నుంచి తప్పించుకుంటాడు.

కనుక హిందూశాస్త్ర నిపుణులు దీనికి చూపే పరిష్కారం ఒక్కటే. రెండవ వివాహానికి సాక్ష్యాధారాల సేకరణను సులభతరం చెయ్యటం, రెండవ వివాహం చేసుకున్న వ్యక్తికి శిక్ష విధించడం, రెండో భార్యకు, ఆమె పిల్లలకు, మొదటి భార్యకు ఆమె పిల్లలతో పాటు సమానహక్కులు ఇవ్వడం జరగాలని మాత్రమే వారు సూచించగల్గుతారు.

ఇలా జరిగితే ఆ విధానంలో రెండవ వివాహం చేసుకున్నందుకు శిక్షను కాస్తా తీసేస్తే అది పూర్తిగా ముస్లిం పర్సనల్ లాను అవలంబించినట్లే అవుతుంది. అయితే దీన్ని ఒప్పుకోవడానికి హిందువులు సిగ్గుపడతారు. ఈ హిందూ వివాహచట్టంలో మనకు పరిష్కారం కన్పించదు. న్యాయశాస్త్రవేత్తల మేధస్సు ఇక్కడ పనిచేయదు.

## కష్టాల నుంచి విముక్తి కోసం ముస్లిం చట్టమే గతి

3. భార్య చేసే వ్యభిచారం వల్లగాని, ఆమె అహంకారం వల్లగాని, లైంగికక్రీడలో ఆమెకు ఆసక్తి లేకపోవడం వల్లగాని, రోగి కావడం వల్లగాని న్యాయమూర్తి, అధికారి, రాజకీయనాయకులు, సంఘసేవికలు అవడంతో భర్తకు తగిన సమయం ఇవ్వకపోవడం వల్లగాని, సినీహీరో ధర్మేంద్రలా వేరేస్త్రీ ప్రేమలోపడిపోవడం వల్లగాని, లేదా వేరే ఇతర కారణాల వల్లగాని బాధపడే హిందూ పురుషుడు వేరే పద్ధతి అవలంబిస్తున్నాడు.

ఇలాంటివారు తాము ఇస్లాం స్వీకరించామని కోర్టులో ఓ అఫిడవిట్ పడేసి ముస్లిం పర్సనల్‌లా రక్షణలో రెండవ భార్యను చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తులను నైరాశ్య స్థితిలో ఇలా ముస్లిం పర్సనల్‌లా రక్షిస్తోందని హిందువులు భావిస్తున్నారు. ఇలా కొందరు హిందువులు ఒక ప్రయోజనం కోసం తమ అంతరాత్మల్ని శీతలగిడ్డంగిలో ఉంచవలసి వస్తోంది, అది తమ ధర్మానికి వ్యతిరేకమైనదైనా సరే. ఇలాంటి వాటిలో తలాఖ్ ఒకటి.

## వివేకమంతా అగ్రకులాలవారికే ఉందా?

4. ముస్లిం పర్సనల్ లాలో విడాకులకు ముందు కొన్ని విషయాలను వ్యక్తిగత సామాజిక పరంగా, లాంఛన ప్రాయంగా పూర్తిచేయవలసి ఉంటుంది. అంటే పెద్దలను

సంప్రదించడం, కొన్నాళ్ళపాటు విడిగా పడుకోవడం, దంపతులిద్దరి పెద్దలు పరిష్కారం కోసం ప్రయత్నించడం అన్నమాట. ఇవన్నీ జరిగిన తరువాతనే తలాఖ్‌ను ప్రకటించవలసి ఉంటుంది. హిందూ వివాహచట్టం కూడా వీటిని అవలంబించింది. అయితే ఈ లాంఛనాలన్నీ న్యాయమూర్తే నిర్ణయించాలని హిందూ వివాహచట్టం పేర్కొంటున్నది. దంపతులు, వారి పెద్దల నిర్ణయాలను న్యాయస్థానం అంగీకరించదు.

పరిపాలనా వ్యవస్థలో అగ్రకుల ప్రాబల్యం కల ఐ.ఎ.ఎస్. బ్యూరోక్రట్లు, యంపీలు వివేకమంతా తమకే ఉందని; దంపతులు, వారిపెద్దలు పెద్దగా వివేకవంతులు కారని భావిస్తారు. పరస్పరం ఇష్టంలేని దంపతులు లక్షల మంది అనేక బాధలు పడిన తరువాత వారు పరస్పర అంగీకారంతో విడాకులు పొందవచ్చని చట్టంలో అవకాశం కల్పించబడింది.

## హిందూ కాపురాల పరిస్థితి

5. విద్యావంతులైన పట్టణ హిందువుల ఇళ్ళలో ప్రతి ఐదవ కాపురం చెడిపోయిన ఇల్లే. ప్రాథమిక దశలో ఉండే ప్రేమానురాగాల పాలపొంగు కాస్త తగ్గిపోయిన తరువాత అఫీసుకు వెళ్ళే దంపతుల్లో క్రమేణా దూరాలు పెరిగి (లేనిపోని అనుమానాలతో) ప్రేమానుబంధం విచ్ఛిన్నమవుతుంది. హిందువుల్లో మతప్రాబల్యం అంతగా లేకపోవడం, వారి జీవితాల్లో నైతికత క్రియాత్మకంగా ఎలాంటి పాత్ర వహించక పోవడం మూలాన త్వరలోనే హిందూభర్తలు రాసక్రీడలను, బహుభార్యత్వానికి లోనయిన ఆర్యదేవుళ్ళను అనుక రించడం మొదలెడతారు.

ఇక్కడే సమస్యలన్నీ ఉత్పన్నమవుతాయి. కాని "మధ్యతరగతి ప్రజల నైతికత" వివాహబంధాన్ని త్రుంచనీయకుండా వారికి అడ్డుపడుతుంది. ఎందుకంటే వారి మతం భర్తకుగాని, భార్యకు గాని ఏవిధంగానూ సహాయపడదు. ఇలాంటి హిందువులు సహజం గానే తలాఖ్ ప్రయోజనం పొందడానికి సిద్ధపడతారు.

6. ప్రచార ప్రసార సాధానాలన్నీ హిందువుల చేతుల్లోనే ఉండటం వల్ల ముస్లిం దంపతుల తలాఖ్ పద్ధతికి అత్యధిక ప్రాచుర్యం లభిస్తుంది. అయితే అదే సమయంలో దినపత్రికలు కూలిపోతున్న హిందూకాపురాల అసంఖ్యాక గాథలను కూడా వెలుగులోకి తెస్తాయి. భార్యాభర్తలు పోట్లాడుకోవడం, పోలీసుల దగ్గరకు వెళ్ళడం, ఒక్కోసారి ఈ తగాదాలు హత్యలక్కూడా దారితీయడం నిత్యకృత్యాలే. కాని ముస్లిముల్లో భార్యాభర్తలు పోట్లాడుకోవడం చాలఅరుదు. కారణం ఇస్లామీయ విలువల వ్యవస్థలోని విశిష్ఠతే.

కామన్ సివిల్ కోడ్ కోసం ఈనాడు హిందువులు చేస్తున్న డిమాండ్ విషయంలో వారి మనస్తత్వం వెనుక ఉన్న మర్మహేతువును విశ్లేషించిన తరువాత ఇప్పుడు మేము ముస్లింలలోని బహుభార్యత్వం, తలాఖ్‌లను గురించి కూడా చర్చించదలిచాము. నాణానికి రెండో వైపున్న చిత్రాన్ని వివరంగా చూపడానికి వీలుగా ఇతర చట్టాలను పోల్చుతూ వీటిని గురించి తెలుసుకుందాం.



## వారి కంపే వీరికి ఇంపు

మన దేశంలో ప్రతి ఆరవ పొరుగు వ్యక్తి ముస్లిం అయినప్పటికీ, విద్యావంతులైన హిందువులు ఇంకా 9వ శతాబ్దంలో ఇస్లాంవ్యతిరేక యూరోపియన్ ప్రచారకులు చేసిన రచనల ద్వారానే ఇస్లాంను గురించి, ముస్లింలను గురించి తెలుసుకోదలుస్తున్నారు. యూరోపియన్లు ముస్లింల నుండి అధికారం చేజిక్కుంచుకున్న తర్వాత వారి రచయితలు గతంలో తాము రాసిన రాతలన్నిటిని ఖండించడం ప్రారంభించారు. కాని హిందూ రచయితలు, విలేకరులు, న్యాయమూర్తులు, బ్యూరోక్రట్లు మాత్రం ఇంకా ఆ వ్యతిరేక ప్రచారాన్నే చదువుతున్నారు. అందువల్లనే వారు ప్రతి ముస్లిం నలుగురు భార్యలను వివాహమాడతాడని ఇప్పటికీ అంటున్నారు.

వీరు సాధారణంగా వాస్తవాలకన్నా దుష్ప్రచారాన్నే ఎక్కువగా నమ్ముతారు. వారు చిత్తశుద్ధితో గణాంకవివరాలు సేకరించి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సర్వేచేసి, ముస్లిం లతో కలసిమెలసి తిరిగితే ముస్లింలో ఒక్కరు కూడా నాలుగు వివాహాలు చేసుకోలేదని గ్రహిస్తారు. పైగా ఈనాడు 95 శాతం ముస్లింలు ఒక భార్యని కూడా సరిగా పోషించ లేనంత పేదరికంలో ఉన్నారు. ఈ యదార్థాలను ఎవరు పట్టించుకుంటారు?

వివాహం కేవలం లైంగికానుభూతి కోసమే కాదన్న విషయాన్ని హిందువులు అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తున్నారు. సామాజిక భద్రత, వృద్ధాప్యంలో ఆర్థిక పరమైన హామి, పరస్పర సహకారం, యుద్ధ వితంతువుల సంరక్షణ, మాతృత్వం, నైతిక విలువల పరిరక్షణ మొదలైన అవసరాలను కూడ వివాహం తీరుస్తుంది.

## అందంలేని పేదబాలికల దురవస్థలు

ఈనాడు మగపిల్లల కన్నా ఆడపిల్లల సంఖ్య పెరిగిపోవడంతో సమాజంలో పాక్షికంగా వరకట్నం జఠిల సమస్యయి పోయింది. బాలురకన్నా బాలికలసంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల వారి తల్లిదండ్రులు కోడళ్ళను తరచిచూసి ఎంచుకోవడానికి అలవాటు పడ్డారు. వారు తక్కువ వయస్సు, ఎక్కువ ఆస్తిగల అందమైన అమ్మాయిల కోసమే అన్వేషిస్తారు. దానివల్ల పేదబాలికలు, అంతగా అందంలేని అమ్మాయిలు, జీవితాంతం వివాహంకాకుండా ఉండవలసి వస్తోంది. చివరికీ అభాగినులు గత్యంతరంలేక పని మనుషులుగా, కూలీలుగా, వ్యభిచారిణులుగా- పట్టణాల్లోనైతే చదువుకున్నవారు కాల్‌గరల్స్‌గా, సేల్స్‌గరల్స్‌గా, లేదా ఉద్యోగినులుగా మారిపోతున్నారు.

పూర్వం ఇంగ్లాండులో పెళ్ళికాని అమ్మాయిలు బ్రతుకుతెరువు కోసం నేత పనిని వృత్తిగా అవలంబించేవారు. అందుకే వారిని "స్పిన్‌స్టర్స్" (కన్యలు) అని పిలిచేవారు. ఈ పదాన్ని ఈనాటికీ అదే అర్థంలో వాడటం జరుగుతోంది. పురుషాధిక్యత గల దోపిడీ సమాజంలోని కామాంధులయిన రాజకీయవేత్తలు, బ్యూరోక్రట్లు, పెట్టుబడిదారులు, పాత్రికేయులు తమ పరిసరాలను ఆకర్షణీయం (గ్లామరస్)గా మార్చుకోవడానికి ఈ దురదృష్ట పీడిత స్త్రీలకు ఉద్యోగాలిస్తున్నారు.

ఈ అభాగినులు యవ్వనంలో ఉన్నంతకాలం వారికి బాగా డిమాండు ఉంటుంది. వృద్ధాప్యం వచ్చిన తరువాత మాత్రం వారి గోడు పట్టించుకునేవారే ఉండరు. వీరిలో తెలివితేటలుగల స్త్రీలైతే తమ భవిష్యత్తు కోసం వ్యభిచారగృహాలు నడుపుతారు. తెలివి తేటలు లేనివాళ్ళు ఇళ్ళలో పనిమనుషులుగా, యాచకులుగా, ఫుట్‌పాత్ వ్యాపారులుగా మారుతారు. ఇలా ఈ స్త్రీలు జీవితాంతం దయనీయ స్థితిలోనే ఉంటారు. వారు ఏదో విధంగా బ్రతుకు వెళ్ళదీస్తారుగాని, మాతృత్వంలాంటి సహజ సిద్ధమైన వారి ఆకాంక్షలు మాత్రం ఎన్నటికీ తీరవు. ఈ కోరిక తీరాలంటే పెళ్ళికాకుండా తల్లులవడానికి వారు సిద్ధ పడాలి. వారి సమస్యను ఎవరు పరిష్కరిస్తారు? ఎవరు వారికి పసిబిడ్డనిస్తారు? వారికి జీవితాంతం ఎవరు రక్షణ కల్పిస్తారు?

ఇలాంటి అభాగినుల్ని దయనీయస్థితి నుండి కాపాడటానికే ఇస్లాంలో బహుభార్యత్వానికి స్థానం కల్పించబడిందని ముస్లిం ధర్మవేత్తలు అంటారు. (సర్.యం. జఫ్రుల్లాఖాన్ రాసిన "Islam-Its meaning for modern man, 1962" గ్రంథం చూడండి.)

ఒక వ్యభిచారిగా, ఉంపుడుగత్తెగా, ఉపపత్నిగా, మర్ధన మగువగా, అర్ధనగ్న సేవికగా, కాల్‌గరల్‌గా లేక ఇలాంటివే ఇతర పనులు చేసే స్త్రీగా మారడానికి బదులు ఒక పురుషునికి ధర్మపత్నిగా ఉండటం మేలుకాదా? స్త్రీ అవసరాల కోసమే ఇస్లాంలో ఉంచబడిన బహుభార్యత్వ అవకాశం ఎక్కువ ప్రయోజనకరమైనది. అదీగాక హిందూ సమాజంలో కంటే ముస్లిం సమాజంలోనే 'స్త్రీపట్ల ప్రవర్తన' మెరుగ్గా ఉందని చెప్పడానికి మాదగ్గర ఎన్నో ఆధారాలున్నాయి. ముస్లింలలో కుటుంబజీవనం పవిత్రమైన జీవితం.

## తా చెడ్డ కోతి వనమెల్లా చెరచున్

హిందూమతం స్త్రీల బాగోగుల పట్ల ఏనాడూ ఆసక్తి కనబరచలేదు. బ్రాహ్మడుడైతే తనను, అవును తప్ప అందరినీ శూద్రులు (బ్రాహ్మణ సేవకులు)గా భావిస్తాడు. బ్రాహ్మణ స్త్రీలతో సహా 98 శాతం బ్రాహ్మణేతరుల జనాభా శూద్రులయితే బ్రాహ్మణ బ్యూరోక్రట్‌కు, బ్రాహ్మణ న్యాయవాదికి, బ్రాహ్మణ విలేకరికి హేతుబద్ధమయిన కోణం నుంచి ఆలోచించే అవసరమే లేదు. ప్రచారసాధనాలు అతని జేబులో ఉంటేచాలు. అతనసలు ఇస్లాంలోని ఉన్నత నైతిక బోధనలను, ముస్లిం పర్సనల్‌లాను చూసి అసూయ పడుతున్నాడు. ఎందుకంటే ఈ బోధనలు తమను హిందూ గుప్పెట్లోకి పోకుండా కాపాడాయని ప్రతి ముస్లింకు తెలుసు. ప్రతిరోజూ హిందువుల బానిసలు (దళితులు) వారి పట్టు నుండి జారిపోయి, స్వేచ్ఛాజీవులై ఇస్లాం స్వీకరిస్తున్నారు.

అందువల్ల ఈ (ఇస్లాం) చట్టం ఎలాగైనాసరే రద్దయిపోవాలని అతను కోరుకుంటున్నాడు. ఇది రద్దయిపోతే ఇతర మతస్థుల్లా ముస్లింలు కూడా బాధపడతారు. లేదా ముస్లిం పర్సనల్ లా ఫలాలు పొందడానికి తాను కూడా ఈ చట్టాన్ని అవలంబించాలని భావిస్తున్నాడు. కాని ముస్లింలు తమ చట్టాన్ని ఎన్నటికీ మార్చుకోరు. ఇ.ఎం.ఎస్.



నంబూద్రిపాద్ వంటి సోషలిస్టు బ్రాహ్మణుల బెదిరింపులకు భయపడి తమ చట్టాన్ని కామన్ సివిల్ కోడ్ రూపేణ హిందువులకు ఇచ్చేందుకు కూడా వారు సిద్ధపడరు.

## ముస్లిం పర్సనల్లాయే బహుళప్రయోజక చట్టం

వివాహాన్ని విడదీయలేని పవిత్రబంధంగా కాకుండా విడాకులకు అవకాశముండే ఒక ఒప్పందంగా ప్రపంచంలో మొట్టమొదట గుర్తించిన ఏకైకచట్టం ముస్లిం పర్సనల్‌లా మాత్రమే. దంపతుల మధ్య పరస్పర సహాయసహకారాల వాతావరణం నెలకొనడానికి బదులు అవరోధాలు ఏర్పడితే ఈఒప్పందంలో దీన్ని విడాకుల ద్వారా రద్దుచేసుకునే అవకాశముంది. స్త్రీకి మొట్టమొదట ఆస్తిహక్కు కల్పించిన ఏకైకధర్మం కూడా ఇస్లామే.

ఈనాడు ప్రపంచ చట్టాలన్నీ వివాహాన్ని విడాకులకు అవకాశముండే ఒప్పందంగా మాత్రమే అంగీకరిస్తున్నాయి. ముస్లింల సామాజిక జీవితంలో ఉన్నత నైతిక ప్రమాణాలు కన్పిస్తాయి. కారణం వివాహం ఒప్పందం కావడమేగాక, బహుభార్యత్వానికి కూడా వారి చట్టంలో స్థానం ఉండటమే. మరోవైపు ఇస్లాం వ్యభిచారాన్ని తీవ్రంగా నిరసిస్తోంది.

## దోపిడీ సమాజంలోనే దురాచారాలు చెల్లుతాయి

భారత్‌లో స్త్రీలు ఏ దేశంలో లేనంత ఎక్కువ దోపిడీ దౌర్జన్యాలకు గురవుతున్నారు. కారణం హిందూమతం, దాని ఆచారాలు ఆ విషయాన్ని అనుమతించడమే. హిందూ మతం బహుభార్యత్వాన్ని, బహుభర్తృత్వాన్ని, భార్యను వదలివేయడాన్ని, వ్యభిచారాన్ని, మానభంగాన్ని అనుమతిస్తోంది. కావాలంటే మీరు ఒక దేవాలయానిక వెళ్ళి చూడండి. అక్కడ మీకు గోడలపై వీటికి సాక్ష్యాధారాలు కన్పిస్తాయి. రజనీష్ కథనం ప్రకారం హిందూయిజం అనే పదం లైంగికస్వేచ్ఛకు మారుపేరు. అగ్రకులాల హిందువులు అనేకమంది. ఈనాటికీ అలాంటి దేవుళ్ళనే పూజిస్తున్నారు.

అయితే ఆ దేవుళ్ళు చేసిన నేరాలనే ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఒక మనిషి చేస్తే దాన్ని వీరు నేరంగా పరిగణిస్తున్నారు. ఒకవేళ లార్డ్ మెకాలె గనక ఇండియన్ పీనల్ కోడ్ రాస్తూ ముహమ్మడన్ లాను ప్రాతిపదికగా తీసుకోకపోయి నట్లయితే వ్యభిచారం, మానభంగం, అశ్లీలం, జూదం, బహుభార్యత్వాలు భారతదేశంలో అసలు నేరాలుగా పరిగణించబడేవి కావు. క్షత్రియ వితంతువు సతీ సహగమనం చేసుకోవాలి. బ్రాహ్మణ వితంతువు తలగొరిగించుకొని దూరంగా నివసించాలి. అయితే శూద్ర వితంతువులకు మాత్రం ఎలాంటి నిర్బంధాలు లేవు.

ఇక వ్యభిచార విషయానికొస్తే హిందూమతం అనుమతించిన "దేవదాసీల" వ్యభిచార వ్యవస్థ ఈనాటికీ కొనసాగుతోంది. ఇందులో అంటరాని మహిళలే ప్రధాన బాధితులు. ఈ స్త్రీలను ఆలయ పూజారులు అనుభవిస్తున్నారు. వీరికి స్త్రీలు, డబ్బు మాత్రం అంటరానివి కావు. ఇలాంటి లైంగిక ఉన్మాదులు ముస్లింలకు (బహుభార్యత్వాన్ని గురించి) నీతులు బోధిస్తున్నారు.

## మంత్రగత్తెలా, మాయమాటలా?

ఏడవ శతాబ్దం నుండి ఇరవయ్యో శతాబ్దం మధ్యకాలంలో ఐరోపాలో లక్షల కొలది ముస్లిమేతర స్త్రీలను మంత్రగత్తెలని చెప్పి నీటిలో ముంచివేయడమో లేదా కాల్చివేయడమో జరిగింది. యూరోపియన్ చట్టాల్లో బహుభార్యత్వానికి గాని, విడాకులకు గాని ఎలాంటి అవకాశం లేదు. అందువల్ల భర్తలు గత్యంతరంలేక ఉంపుడుగత్తెలను ఉంచుకునేవారు. అదీగాకుండా ఇష్టంలేని భార్యల్ని వదిలించుకోడానికి వారిని మంత్రగత్తెలని ఆరోపించి బాధించేవారు.

అలా ఆరోపించబడిన స్త్రీ మంత్రగత్తె ఔనో కాదో నిర్ణయించడానికి ఆనాడు ప్రజలు చర్చి, ప్రభుత్వం, సమాజాల ఆమోదంతోనే ఆమె కాళ్ళుచేతులు కట్టి నీళ్ళలో విసిరేసేవారు. అలా ఆ స్త్రీ మంత్రప్రభావం నుండి బయటపడినట్లు చర్చీపెద్దలు సర్టిఫికెట్ ఇచ్చి (అమె శవాన్ని) ఆశీర్వదిస్తారు. ఒకవేళ నీళ్ళలో మునగకుండా (బ్రతికి) ఉంటే ఆమెలోని పైశాచికశక్తి వల్లనే అలా జరిగిందని నిర్ధారించి, మంత్రగత్తె అన్న నేరం మోపి ఆమెను మండే కట్టెలపై కూర్చోబెట్టి చంపేస్తారు. ఇలా ఏ విధంగా చూసినా మంత్రగత్తె అని ఆరోపించబడిన స్త్రీ తప్పకుండా చావాల్సిందే.

## భార్యను వదిలించుకోవడానికి ఎన్నెన్నో సాకులు

ఐరోపా సమాజంలోని పురుషులు తమకు ఇష్టంలేని భార్యలను ఇలాంటి పద్ధతులు అవలంబించి వదిలించుకునేవారని తెలుస్తోంది. భర్త 'నేను నీకు విడాకులిస్తున్నాన'ని చెప్పడానికి బదులు 'నా భార్య మంత్రగత్తె' అని నిందారోపణ చేసేవాడు. దీనివల్ల అతనికి రెండు లాభాలు కలిగేవి. ఒకటి, ప్రస్తుత భార్యను వదిలించుకోవడం. రెండు, మరొక భార్యను పొందడం.

ప్రతిచోటా, ప్రతికాలంలో పురుషుడు తన అక్రమ సంతానం పోషణ బాధ్యతలతో పాటు ఇతర ఎలాంటి బాధ్యతలు స్వీకరించకుండా తన కామదాహాన్ని తీర్చుకోవడానికి స్త్రీని దోపిడీకి గురిచేసినట్లు చరిత్ర చాటుతోంది. సోషలిష్టు దేశాలయిన చైనా, రష్యాలలో తప్ప ప్రపంచ ధనిక దేశమైన అమెరికాలో సైతం స్త్రీకి రెండవస్థానమే ఇవ్వడం జరిగింది.

పురుషుడు ఈనాడు చట్టసమ్మతమైన ఒకేభార్య బాగోగులతో పాటు ఆమె పోషణ బాధ్యతను మాత్రమే వహిస్తూ, తన చుట్టూ వివిధ రకాల స్త్రీలను తిప్పుకుంటున్నాడు. లేడీ సెక్రటరీలు, కొలీగ్స్, సేల్స్‌గరల్స్, గాయనీలు, నర్తకీలు, కళాకారిణులు మొదలైనవారు ఈ కోవకు చెందిన స్త్రీలే. ధనికుడు, వ్యభిచారి, సోమరిపోతు, బాధ్యతా రహితుడు అయిన విలాస పురుషుడే ఇలాంటి స్త్రీలోల జీవితాన్ని కోరుకుంటాడు.

## స్త్రీ రక్షణకు ఇస్లాం చేసిన కట్టుదిట్టాలు

కాని ఇస్లాం వీటన్నిటినీ నిషేధిస్తోంది. వివాహనికి ముందు లైంగిక చర్యలకు పాల్పడే వ్యక్తుల కోసం ఇస్లాం కొరడాదెబ్బల శిక్ష ప్రతిపాదిస్తోంది. తాను ప్రేమించిన



స్త్రీ అయినప్పటికీ వివాహం తరువాతనే పురుషుడు ఆమెతో లైంగిక సంబంధం కలిగి ఉండేలా ఇస్లాం కట్టుదిట్టం చేసింది. అది ఆమె కోరిన ధనం మహర్ రూపంలో ఇవ్వాలని ఆదేశిస్తూ ఆమెను, ఆమె సంతానాన్ని పోషించే బాధ్యతను పురుషుని మీద మోపుతోంది. ఒకవేళ ఆమెకు విడాకులు ఇవ్వబడినా ఆమె సంతానానికి పురుషుని ఆస్తిలో హక్కునిస్తోంది. వివాహం ద్వారా లైంగికానుభూతి పొందదలచుకుంటే తాను వివాహమాడే ప్రతి స్త్రీకి సంరక్షణ కల్పించాలని అతడ్ని ఆదేశిస్తోంది.

ముస్లిం పర్సనల్ లా లక్ష్యం కూడా ఇదే. ఈవిధంగా స్త్రీకి సహాయం చేయడానికి ముహమ్మద్ ప్రవక్త (సల్లం) ప్రభవించారు. అందువల్ల ముస్లిం పర్సనల్ లా స్త్రీకి రక్షణ కల్పించి గౌరవిస్తోంది. (అల్‌ఫ్రెడ్ గెల్లామ్-ఇస్లాం, పెంగుయిన్స్ 1954, పే.71)

ముస్లిం పర్సనల్‌లా వల్ల పురుషుడే గాకుండా అతని మొదటిభార్య కూడా కొంత బాధ పడవలసి వస్తుంది. అయితే దోపిడీలేని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కాస్తో కూస్తో త్యాగం చేయవలసి ఉంటుంది. ముహమ్మద్ ప్రవక్త (సల్లం) నైతికబోధనల వల్ల స్త్రీలు ఎంతగా ప్రభావితులయ్యారంటే వారు తమ భర్తలు పాపపంకిలమైన వ్యభిచార జీవితం గడిపే కంటే రెండవ భార్యతో సంసార చేయడాన్నే ఇష్టపడతారు.

## దృఢవిశ్వాసమే చట్టరక్షణకు కంచుకోట

ఇస్లామీయ చట్టాల్లో దాని నైతికతల్లో, ఆరాధనాల్లో గల తీక్షణతల నుండి తప్పించుకోడానికి ముస్లింలు తర్కాన్ని, హేతువుల్ని చూపరు. రమజాన్ నెలలో జూన్‌లాంటి మండు టెండలు కాసే మాసంలో రోజుకు 15,16 గంటలదాకా ఒక్క నీటిచుక్క కూడా తాగకుండా ఉపవాసల్ని పాటించడం దీనికి మంచి నిదర్శనమని చెప్పవచ్చు. 'ధర్మసమ్మతమైన విషయాలన్నిటిలోనూ దేవుని దృష్టిలో (నా దృష్టిలో) తలాఖ్ ద్వేషించదగిన విషయమ'ని, తలాఖ్‌కు వీలైనంత దూరంగా ఉండమని ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవచించారు.

అందువల్ల జార్జ్ బెర్నార్డ్ షా రాసిన "ఆన్ గెటింగ్ మ్యారిడ్" అనే పుస్తకంలోని ఉపోద్ఘాతం చదవమని నేను హిందూ న్యాయవాదులు, న్యాయవేత్తలు, మేధావులకు సలహా ఇస్తున్నాను. అప్పుడు కొత్తగా ఇంకేమైనా విషయాలుంటే వాటిని ప్రస్తావించవచ్చు.

ఇస్లామీయ బహుభార్యత్వం వల్ల సమాజంలో సంపద ఎల్లప్పుడూ విభజించ బడుతూ ఉంటుంది. రెండవ, మూడవ భార్యలు సాధారణంగా పేద కుటుంబాలకు చెందిన స్త్రీలయి ఉంటారు. ఆస్తి రూపేణ వారికి అత్యధికంగా 'మహర్' ధనం ఇవ్వబడుతుంది. ముస్లిందేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ రుగ్మతలు ఇంకా ప్రబలక పోవడానికి ఇదొక కారణం. కాబట్టి కమ్యూనిస్టేతర దేశాల్లో గల ధనిక-పేద తార తమ్యాలు ఇక్కడ అంతగా కన్పించవు.

# 37. యుద్ధరంగంలో స్త్రీల పాత్ర

తాను విశ్వసించిన ఇస్లామీయ జీవనవ్యవస్థ కోసం శత్రువుల బారినుండి ధర్మాన్ని, దేశ సరిహద్దుల్ని రక్షించుకోవడంలో పురుషునికి ఎంత అధికారం ఉందో స్త్రీకి కూడా అంతే అధికారం ఉంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో తప్ప సాధారణ పరిస్థితుల్లో స్త్రీ తన ఇష్ట ప్రకారం యుద్ధమైదానానికి పోవలసిన అవసరం లేదు. అంటే అత్యవసర పరిస్థితిలో కూడా ధర్మయుద్ధం వారికి తప్పనిసరి (విధి) కాదన్నమాట.

సాధారణ పరిస్థితిలో ఒకవేళ యుద్ధరంగంలో దిగవలసివస్తే స్త్రీ తన ప్రాణ, మానాల రక్షణ కోసం తప్ప శత్రుసంహారం కోసం ఖడ్గం పట్టడాన్ని ఇస్లాం అనుమతించదు. అయితే స్త్రీలు యుద్ధమైదానంలో సైనికులకు మంచినీళ్ళు సరఫరా చేయడం, ఆహారపదార్థాలు వండిపెట్టడం, వారు యుద్ధానికి వెళ్ళినప్పుడు సైనిక శిబిరాలను రక్షించడం, క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయడం, వారి మంచిచెడ్డలు విచారించడం మొదలైన పనులు చేయవచ్చు. ఇలాంటి సేవలు అందజేయడానికి రాదలచుకున్న స్త్రీలను దైవప్రవక్త (సల్లం) వారించలేదు. అంతేగాని పురుషుల్లా శత్రువులతో పోరాడటం కోసం స్త్రీలను సైన్యంలో భర్తీ చేయడం ఇస్లాం విధానం కాదు.

## అత్యవసర సమయాల్లోనే అతివలకు అనుమతి

జిహాద్ (శాంతిస్థాపనా పోరాటం) ప్రారంభకాలంలో పరిస్థితుల తీవ్రత దృష్ట్యా కొందరు స్త్రీలు ఐచ్ఛికంగా యుద్ధంలో పాల్గొన్న సంఘటనలు కూడా ఇస్లామీయ చరిత్రలో ఉన్నాయి. అప్పుడు స్త్రీల జిహాద్ ఉత్సాహం, పుణ్యార్జనా ఆసక్తుల కారణంగా వారిని యుద్ధంలో పాల్గొనడానికి అనుమతించారు. ఉదాహరణకు ఇక్కడ కొన్ని సంఘటనలను పేర్కొంటున్నాను:

ధర్మసంస్థాపనా ఉద్యమంలో జిహాద్ (ధర్మపోరాటం) చేయవలసి వచ్చినప్పుడు స్త్రీలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు అనన్యమయినవి. శత్రువులు రగిల్చిన సమర జ్వాలలకు ఏమాత్రం బెదరకుండా, వారితో శక్తివంచన లేకుండా పోరాడి, రణరంగంలో సయితం తాము పురుషులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించుకున్నారు.

అలాంటి వీర నారీమణులలో ఉమ్మెఅమ్మారా (రజి) ఒకరు. ఉహద్ యుద్ధంలో ఆ ధీరవనిత శత్రువుల బారినుండి దైవప్రవక్త (స)ను కాపాడటంలో అసామాన్య యుద్ధ నైపుణ్యం, అమితమైన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. వాటిని గురించి దైవప్రవక్త (స) నోటే వినండి: "కుడివైపు, ఎడమవైపు- నేను ఎటువైపు మరలినా నన్ను (శత్రువుల బారినుండి) కాపాడటంలో ఉమ్మెఅమ్మారే పోరాడుతూ ఉండటం చూశాను.

"రోమన్లతో జరిగిన యుద్ధానికి రెండురోజుల ముందు ఉమ్మెకలీం (రజి) వివాహం ఖాలిద్ బిన్ సయీద్ (రజి)తో జరిగింది. యుద్ధప్రకటన వినగానే ఆ నూతన వధువు భర్తతో పాటే కదనరంగంలోకి దూకి, ఏడుగురు రోమన్ సైనికుల్ని నేలకూల్చింది.



## ధర్మయుద్ధం పురుషులకు మాత్రమే విధి

ఇస్లామీయ రాజ్య సరిహద్దులు కాపాడేందుకు ధర్మయుద్ధం చేయవలసిన బాధ్యత పురుషులపై మాత్రమే ఉంది. ఇది వారి విధి (Obligatory duty). స్త్రీలు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, శక్తి ఉడిగిన వృద్ధులపై ధర్మయుద్ధం (జిహాద్) చేయవలసిన బాధ్యత ఎంతమాత్రం లేదు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"పరలోక జీవితం కోసం ప్రాపంచిక జీవితం అమ్మదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీ వైపు నుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడిత ప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు? విశ్వసించినవారు దైవమార్గంలో పోరాడుతారు. తిరస్కార వైఖరి అవలంబించినవారు షైతాన్‌మార్గంలో పోరాడుతారు. కనుక మీరు (దైవమార్గంలో) షైతాన్ అనుచరమూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిల పన్నాగాలన్నీ చాలా బలహీన మైనవని తెలుసుకోండి." (ఖుర్ఆన్. 4:74-76)

## జిహాద్ చేయడం స్త్రీల కర్తవ్యం కాదు

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "ధర్మయుద్ధం (జిహాద్) చేయడం స్త్రీలకు విధిగా చేయబడలేదా?" అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ.. స్త్రీలకు కూడా ధర్మయుద్ధం చేయడం విధిగా చేయబడింది. అయితే అది యుద్ధంలేని పోరాటం (జిహాద్) అయి ఉండాలి. హజ్, ఉమ్రాలు యుద్ధంలేని జిహాద్‌లు" అని సమాధానమిచ్చారు.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం కొందరు మహిళలు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి "పురుషులు మాత్రం జిహాద్ లాంటి అత్యున్నతమైన సత్కార్యాల పుణ్యం సంపాదిస్తున్నారు. (మాకేముంది?) దైవమార్గంలో జిహాద్ చేసేవారికి లభించే పుణ్యం మాకూ లభించాలంటే మేమేం చేయాలి?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "మీలో ఇళ్ళల్లోనే ఉండిపోయే స్త్రీలకు దైవమార్గంలో జిహాద్ చేసేవారికి లభించే పుణ్యం లభిస్తుంది" అని చెప్పారు. (హదీస్)

ఇస్లాం స్త్రీకి జీవిత సకల రంగాల్లోనూ స్వాతంత్ర్యం, సమానత్వం ప్రసాదించి న్యాయపరంగా సమాజంలో ఆమెకు సముచిత స్థానం కల్పించింది. ఏ సంస్థ అయినా అందులో పనిచేసే ఉద్యోగులు ఎవరికి నిర్ణయించిన విధులు వారు సక్రమంగా, సజావుగా నిర్వహించినప్పుడే ఆ సంస్థ పురోభివృద్ధి సాధిస్తుంది. అలాగే సమాజంలో

స్త్రీపురుషులకు తమ ప్రభువు నిర్ణయించిన విధుల్ని వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ సమాజం ఇహలోకంలోనే గాక, పరలోకంలోనూ విజయవంతం కాగల్గుతుంది.

ఇహలోకంలో పవిత్రమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, పరలోకంలో పురుషులతో పాటు సమాన పుణ్యఫలం సంపాదించుకోవడానికి ఇస్లాం స్త్రీలకు కొన్ని ముఖ్యమైన సాంఘిక విధుల్ని ప్రతిపాదించింది.

## పడతుల హక్కులు-బాధ్యతల ప్రత్యేకత

సమాజానికి మూలం కుటుంబం. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడి తద్వారా దేశం పురోభివృద్ధి చెందాలంటే ముందు నిర్మాణాత్మకమైన కుటుంబ వ్యవస్థ ఎంతో అవసరం. కుటుంబ వ్యవస్థలో ప్రధానపాత్ర స్త్రీ జాతిదే. అలాంటి స్త్రీ కుటుంబ బాధ్యతల్ని వదిలేసి మహిళాభ్యుదయం, సంఘసేవ అనే పేర్లతో నేటి రాజకీయాల్లో ప్రవేశించి పురుషుని భుజంతో భుజం కలిపి విచ్చలివిడిగా వ్యవహరిస్తే కుటుంబవ్యవస్థ ఛిన్నా భిన్నమయి చివరికి దేశమే నైతికపతనాగాధంలోకి కూరుకుపోతుంది.

కనుక ఇస్లాం స్త్రీకి ఆమె పనిచేసే పరిధిలో సమస్త స్వాతంత్ర్యాలు, హక్కులు ప్రసాదించి నైతిక విలువలకు ఎలాంటి భంగం రానీయకుండా సమాజ ప్రగతికి తోడ్పడు తుంది. ఇస్లాం పరిధుల్ని అతిక్రమించకుండా స్త్రీ జీవితరంగాలన్నింటిలోనూ నిస్సంకోచం గా జోక్యం కలుగజేసుకోవచ్చు.

ఏ దేశంలో స్త్రీ బానిసకంటే నీచంగా చూడబడుతుండేదో, ఏ దేశంలో స్త్రీ అనేక మంది సవతుల మధ్య అసంతృప్త జీవితం గడుపుతుండేదో, ఏ దేశంలో స్త్రీ చరాస్తిగా భావించి వారసులకు సంక్రమించబడుతుండేదో, ఏ దేశంలో స్త్రీశిశువు పుట్టగానే సజీవ సమాధిచేసి చంపేయబడుతుండేదో అలాంటి దేశంలో, ఆ అంధకారయుగంలో స్త్రీకి ఇంతటి స్వేచ్ఛ, సమానత్వాలు ప్రసాదించిన ఖుర్‌ఆన్ మహత్తును గురించి పాశ్చాత్య నాగరికతా వ్యామోహపరులైనవారు చల్లని మనస్సుతో, నిష్పక్షపాతంగా ఆలోచిస్తే వారికి సమాజంలో స్త్రీకున్న సహజస్థానం ఏమిటో తప్పకుండా తెలుస్తుందని ఆశించగలం.

# 38. ధర్మసంస్థాపనలో స్త్రీల పాత్ర

ఇస్లాం ఆజ్ఞలు పురుషులకు ఎలా వర్తిస్తాయో స్త్రీలకు కూడా అలాగే వర్తిస్తాయి. దైవాజ్ఞలు పాటించడంలో స్త్రీలు, పురుషులు అన్న తేడాలేదు. పురుషులు తమ కర్మలకు ఎలా బాధ్యులో స్త్రీలు కూడా తమ కర్మలకు దేవుని ముందు అలాగే బాధ్యులు.

ఇస్లాం సంపూర్ణ జీవితవిధానం (Complete code of human life) గనక దాన్ని విశ్వసించిన మనిషి తన దైనందిన జీవితంలో ఏ రంగంలో ఏపని చేసినా అతను ఇస్లాం పరిధిలోనే ఉంటూ దైవప్రసన్నత కోసం చేయవలసి ఉంటుంది. ఏ పని చేస్తే దేవుడు ప్రసన్నుడవుతాడు, ఏ పని చేయకపోతే ఆయన ఆగ్రహిస్తాడు, ఏఏ పనుల్లో మన ఇహపర సాఫల్యాలు ఉన్నాయి, ఏఏ పనులు మనకు నష్టదాయకం,



అనే విషయాలు ఖుర్‌ఆన్, హదీసుల్లో స్పష్టంగా తెలియజేయబడ్డాయి. వీటిని పురుషులే గాక స్త్రీలు కూడా పాటించ వలసి ఉంటుంది.

## స్త్రీలు వంటింటి కుందేళ్ళు కాదు

దైవప్రసన్నత పొందడానికి అన్నిటికంటే ముఖ్యమైన మార్గం ధర్మసంస్థాపనా కృషి. ఈ మహాకార్యంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా తమ వంతు పాత్ర నిర్వహించవలసి ఉంటుంది. ధర్మసంస్థాపనా కార్యం కేవలం పురుషుల బాధ్యత మాత్రమేనని భావించి ఈ రంగంలో పని చేయకుండా ఉండటం స్త్రీలకు తగదు. దైవప్రసన్నత కోసం ఇస్లాం ఆదేశాలను పాటించడానికి పురుషులు ఎలా పాటుపడవలసి ఉందో స్త్రీలు కూడా అలాగే పాటుపడవలసిన అవసరం ఉంది.

ఖుర్‌ఆన్ ఈ బాధ్యతను గురించి “పురుషులు ఎలా పనిచేస్తారో అలాంటి భాగమే వారికి లభిస్తుంది; స్త్రీలు ఎలా పనిచేస్తారో అలాంటి భాగమే వారికి దక్కుతుంది” అని తెలియజేసింది. కాకపోతే స్త్రీలు దైవం తమకు నిర్దేశించిన పరిధిలోఉంటూ ఈ బాధ్యత నిర్వహించాలి. వారు తమపరిధిలో ఉంటూనే పురుషులకన్నా ఎక్కువమందిని ప్రభావి తం చేయగల్గుతారు. వారి ప్రచార ఫలితాలు అనేకం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ముందుకు వస్తాయి. మరికొన్ని ఫలితాలు ఓ సుదీర్ఘకాలం తరువాత గోచరిస్తాయి.

## ముస్లింస్త్రీలు భర్తల్ని గుడ్డిగా అనుకరించరు

స్త్రీ తనకు కేటాయించిన పరిధిలో సర్వస్వతంత్రురాలు. ఆమెకు ఇస్లాం వెలుగులో ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకునే హక్కుంది. కనుక భర్తలు చెప్పే ప్రతిమాటకూ అనాలోచితంగా తలూపుతూ, వారి వెనకాల కళ్ళు మూసుకొని నడవడం స్త్రీలకు ఏ మాత్రం తగదు. భర్తలు రుజుమార్గాన పయనిస్తున్నంత వరకైతే వారి అడుగుజాడల్లో నిస్సంకోచంగా నడచుకోవచ్చు. అంతేగాని భర్తలు అపమార్గం పట్టిపోతే వారివెనుక నడిచి పరలోక దుష్పరిణామాలు చవిచూసే సాహసానికి పాల్పడకూడదు.

సమాజసేవకు సంబంధించిన బాధ్యతలను దేవుడు పురుషులపై ఎలా విధించాడో స్త్రీలపై కూడా విధించాడు. ఆయన ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల స్త్రీ పురుషులు ఇద్దరినీ “విశ్వాసులారా!” అని సంబోధించాడు. నమాజ్ గురించిన ఆజ్ఞలోగాని, ఉపవాసవ్రతాల ఆదేశాలలోగాని, హజ్‌యాత్ర విధిలోగాని లేదా పరస్పర హక్కులను గౌరవించడంలో గాని, ప్రతిచోటా, ప్రతి వ్యవహారంలోనూ స్త్రీలను, పురుషులను ఒకేవిధంగా సంబోధించడం జరిగింది. ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న ఈ సూక్తులు గమనించండి:

## శ్రేష్ఠ సమాజంలో స్త్రీల పాత్ర

“విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ ప్రజలకు మార్గదర్శనంచేస్తూ వారిని సంస్కరించ డానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడులనుండి వారిస్తారు. దేవుణ్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు.” (3:110)

ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతన జనింపజేసి వారిని నీతిమంతులుగా, సత్ప్రవర్తనులుగా తీర్చిదిద్దగోరుతోంది. అంధవిశ్వాసాలు, దురాచారాలతో సహా ప్రపంచంలోని వివిధ చెడుల్ని నిర్మూలించి ఓ సత్సమాజం నెలకొల్పదలచింది. ఈ ఆశయం కోసం ముస్లింలపై మంచిని పెంచే, చెడును త్రుంచే పని నిర్బంధం చేసింది. దీనికోసం వారిలో ఒక వర్గం వ్యవస్థీకృతసంఘంగా ఏర్పడాల్సిన అవసరముందని చెబుతోంది.

ఈ ఆశయం, అవసరాల దృష్ట్యానే దైవప్రవక్త (సల్లం) కాలంలో, ఆ తర్వాత సద్వర్తనులైన ఖలీఫాల కాలంలో ముస్లింలు ధర్మసంస్థాపన కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషిచేశారు. సమాజంలో ఏకొద్ది చెడు కన్పించినా వారు ప్రశాంతంగా నిద్ర పోయేవారు కాదు. ప్రజలలో దైవభీతి కలిగిస్తూ వారిని దుష్కార్యాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. తత్ఫలితంగా ఆనాడు సమాజంలో సర్వత్రా నీతి, న్యాయం, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. భక్తిపరాయణత, బాధ్యతాభావం, పరస్పర గౌరవాభిమానాలు ఎల్లడెల్లడలా విస్తరించాయి.

అదొక స్వర్ణయుగం. ముస్లిమేతర మేధావులు సైతం కీర్తించిన కాంతియుగం. కాని ఆ యుగం అంతరించింది. **ఆకాంతి కనుమరుగై పోయింది.** ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా అరాచకమే గోచరిస్తోంది. అవినీతి, అన్యాయం. అశ్లీలం, అత్యాచారాలు సర్వసామాన్యమైపోయాయి. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోనేగాక వారి సామూహికజీవితాల్లో కూడా ఈ చెడులు చేరాయి. చివరికి రాజకీయ వ్యవహారాలు, చట్టసభలు సైతం వివిధ చెడులతో దుర్గంధ భూయిష్టమయి పోయాయి.

అంతకంటే విచారకరమైన విషయం- ధర్మసంస్థాపనా బాధ్యత నిర్వహించవలసిన ముస్లింసమాజం కూడా ఈ చెడులలో కూరుకుపోయింది. ఇలాంటి పరిస్థితిలో ధార్మిక, సామాజిక స్పృహ కలిగిన ముస్లింలపై, వారు స్త్రీలైనా పురుషులైనా చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత మరింత అధికమైంది. ఈ పనిని గనగ నిర్వహించకపోతే సమాజ పతానానికి దేవుని సమక్షంలో ప్రధానబాధ్యులు వారే అవుతారు.

## మధ్యస్త సమాజంలో మహిళల ప్రాముఖ్యం

"ముస్లింలారా! మీరు ఇతర మానవులందరికీ సాక్షులుగా నిలబడేందుకు మేము మిమ్మల్ని ఓ మధ్యస్థ సమాజంగా రూపొందించాము." (ఖుర్ఆన్–2:142)

అంటే నీతి, న్యాయం, నిష్పక్షపాతాలకు కట్టుబడిఉంటూ, అతివాదాలకు పోకుండా ప్రతి విషయంలోనూ సమతులనం పాటించే సమాజమని అర్థం. ప్రళయ దినాన మానవులంతా పునర్జీవులై హష్ర్ మైదానంలో గుమికూడుతారు. దైవన్యాయ స్థానంలో కర్మవిచారణ జరుగుతుంది. దైవప్రవక్తలంతా తమకు అందజేయబడిన ధర్మబోధనలను ప్రజలకు అందజేశామని దేవుని ముందు సాక్ష్యమిస్తారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా తనకు అందజేయబడిన బోధనలను ప్రజలకు చేరవేశానని సాక్ష్యమిస్తారు. ఆయన అనుచరులు (ముస్లింలు) దాన్ని ధృవీకరిస్తారు.



దాంతో దైవప్రవక్త బాధ్యత తీరినట్లవుతుంది. ఆ తర్వాత ఈ బాధ్యత మీరెంత వరకు నిర్వహించారని దేవుడు ముస్లింలను అడుగుతాడు. ముస్లింలు తమకు దైవ ప్రవక్త (స) ద్వారా అందిన ఇస్లాం బోధనలను వాక్క్రియల ద్వారా తోటిమానవులకు అందజేశామని జవాబిచ్చుకోవలసి ఉంటుంది. ఈ సూక్తిలో సాక్ష్యం ఇవ్వడమంటే ఇదే. వారు తోటిమానవులకు ఇస్లాం బోధనలు పరిచయం చేయడమేగాక, స్వయంగా వాటిని ఆచరించి చూపాల్సిన అవసరం కూడా ఉంది. అంటే వారి మాటలకు చేతలకు పొంతనఉండాలి. భక్తిపరాయణత అంటే ఇలా ఉంటుంది; నీతీనిజాయతీలు అంటే ఇలా ఉంటాయి; న్యాయం, ధర్మం అంటే ఇలా ఉంటాయి అని ప్రజలు భావించేలా వారు పూర్తిగా ధార్మిక జీవితం గడపాలి.

ముస్లింలు ఓ సైద్ధాంతిక సమాజానికి చెందిన సభ్యులు. బాధ్యతాయుతమైన జాతిప్రజలు. వారు అంతిమ దైవసందేశహరుని (స) ప్రతినిధులుగా మసలుకుంటూ ప్రపంచాన్ని నీతి మార్గాన నడిపించవలసి ఉంది. చెడుగుల్ని అరికట్టాలి. అన్యాయం, అధర్మాలను అంతమొందించాలి. నీతీన్యాయాలు, శాంతీసుహృద్భావాల వాతావరణాన్ని నెలకొల్పాలి. దేవుని భూమి హింసాదౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు, అశ్లీలం, అరాచకాలతో నిండిపోతే దానికి దైవంఎదుట ముందుగా ముస్లింలే బాధ్యులవుతారు. 'నా భూమ్మీద ఇన్ని ఘోరాలు, దురంతాలు జరుగుతుంటే మీరేం చేస్తుండేవార'ని దేవుడు వారిని నిలదీస్తాడు. వారు తమవంతు కృషి ఏమేరకు చేశారని ప్రశ్నిస్తాడు. సత్యానికి సాక్షులుగా నియమించబడిన ముస్లింలు పరలోక న్యాయస్థానంలో ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది.

(పైన పేర్కొన్న 3:110, 2:142 సూక్తులు, వాటి వివరణలు ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్ నుండి వెలువడిన "ఖుర్ఆన్ భావామృతం" నుండి గ్రహించబడ్డాయి.)

## ధర్మప్రచార బాధ్యత ఇరువురిపై ఉంది

ఈ సూక్తుల ద్వారా దేవుడు మనకు ధర్మసంస్థాపనా బాధ్యతను, దాని ప్రాముఖ్యం వివరించాడు. ఇందులో దేవుడు పురుషుల్ని మాత్రమే సంబోధించ లేదు; సమస్త ముస్లింలను సంబోధించాడు. ధర్మసంస్థాపన కోసం కృషి చేయవలసిన బాధ్యత పురుషుల మీదనే గాకుండా స్త్రీలపై కూడా ఉందని దీనివల్ల విశదమవుతోంది.

"విశ్వసించిన స్త్రీలు, పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచి విషయాలు బోధిస్తారు. చెడు విషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ)ను స్థాపిస్తారు. (పేదల ఆర్థికహక్కు) జకాత్ నెరవేరుస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్తపట్ల వినయవిధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది. నిస్సందేహంగా దేవుడు సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు."

"విశ్వాసులైన ఈ స్త్రీపురుషుల కోసం సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలున్నాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. అక్కడే వారు కలకాలం (సుఖసంతోషాలతో)

ఉంటారు. నిత్యం కళకళలాడే ఆ స్వర్గవనాలలో వారికోసం అందమైన గృహాలు కూడా ఉంటాయి. అన్నిటికీ మించి దైవప్రసన్నతాభాగ్యం లభిస్తుంది. అదే గొప్ప విజయం, పరమమోక్షం.” (దివ్యఖుర్ఆన్–9:71,72)

ధర్మసంస్థాపనా బాధ్యత పురుషులపై ఎలా ఉందో స్త్రీలపై కూడా అలాగే ఉందని పై సూక్తి మరింత స్పష్టం చేస్తోంది. చరిత్ర పుటలు తిరగేయండి. ధర్మసంస్థాపనా విధిని పురుషులు ఎలా నిర్వర్తించారో, ఆ మార్గంలో మహిళలు కూడా వారికి ఏమాత్రం తీసిపోలేదని తెలుస్తుంది. ఆనాడు దైవమార్గంలో పురుషులే కాకుండా మహిళలు కూడా అనేక కష్టనష్టాలు సహించారు; ఎన్నో త్యాగాలు చేశారు.

## ధర్మప్రచారంలో మహిళల ముందంజ

ధర్మసంస్థాపనా కార్యకలాపాల పట్ల పురుషులకన్నా స్త్రీలకే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. దైవం స్త్రీల స్వభావంలో సృజించిన ప్రేమ, వాత్సల్యం, కరుణ, జాలి, సానుభూతుల కారణంగా ప్రకృతిధర్మానికి వారే పురుషులకన్నా ఎక్కువ దగ్గరగా ఉంటారు. ఈనాడు కూడా పురుషులకంటే స్త్రీలే అధిక సంఖ్యలో ఇస్లాం స్వీకరిస్తున్నారు. ఇస్లాంకు వ్యతిరేకంగా ఉధృత ప్రచారం జరుగుతున్న అమెరికా, ఐరోపా దేశాల్లో మహిళలు ఇస్లాం స్వీకరించి పరదా నియమాలు కూడా నిర్భయంగా పాటిస్తున్నారు.

మక్కాలో సత్యతిరస్కారులు ముస్లింలను వేధిస్తున్న రోజుల్లో హజ్రత్ అబూబకర్ (రజి) తన ఇంటి ఆవరణలోనే నమాజు, ఖుర్ఆన్ పారాయణం చేయడం ప్రారంభించారు. అప్పుడు బహుదైవారాధక స్త్రీలు, పిల్లలు ఆయన ఇంటి చుట్టూ గుమిగూడి దైవవాణి వినడం మొదలెట్టారు. సత్యతిరస్కారులు ఈ పరిస్థితి చూసి గగ్గోలుపెడ్తూ “మన స్త్రీలు, పిల్లలు (దీంతో ప్రభావితులయి) మతభ్రష్టులయి పోతారేమోనని అనుమానంగా ఉంది” అని చెప్పుకున్నారు. ఈ సంఘటనను బట్టి ప్రకృతి ధర్మమయిన ఇస్లాం పట్ల పురుషులకన్నా స్త్రీలే ఎక్కువగా ఆకర్షితులవుతారని తెలుస్తోంది.

## ప్రచారరంగంలో స్త్రీపాత్ర ప్రాముఖ్యం

దీన్నిబట్టి ప్రకృతికి అనుగుణమైన ఇస్లాం ధర్మానికి పురుషులకన్నా స్త్రీలే ఎక్కువగా, తొందరగా ఆకర్షితులవుతారని తెలుస్తోంది. అంతేకాదు, ధర్మప్రచార రంగంలో స్త్రీపాత్ర ప్రాముఖ్యం ఏమిటో కూడా తెలుస్తోంది. స్త్రీల మస్తిష్కాలకన్నా పురుషుల మస్తిష్కాలలోనే ఎక్కువ సమస్యలు తిష్ఠవేసి వారి మెదళ్ళను తొలుస్తుంటాయి. అందువల్ల మంచి విషయం కూడా తొందరగా వారి తలకెక్కదు.

“స్త్రీలైనా పురుషులైనా విశ్వసించినవారయి ఉండి సత్కార్యాలు చేస్తే తప్పకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి ఏమాత్రం అన్యాయం జరగదు.” (ఖుర్ఆన్–4:124)

ఇక్కడ స్త్రీలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ధర్మప్రచార రంగంలో పనిచేసే మహిళల్లో తగిన విజ్ఞతావివేచనలు ఉండి, సముచిత సందర్భం, అవకాశాలు లభిస్తే



వారు తోటి స్త్రీలను సులభంగా ఆకట్టుకో గలుగుతారు. స్త్రీ స్వభావంలో మంచితనం ఉంటే పురుషుని చెడ్డతనం ఆమెను ఏమాత్రం ప్రభావితం చేయజాలదు. ఒకవేళ స్త్రీ స్వభావంలోనే చెడ్డతనం ఉంటే పురుషుడు ఎంత మంచి వాడయినా అతని మంచితనం వల్ల స్త్రీకి ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

## ఇస్లాం స్వీకరించిన మొట్టమొదటి వ్యక్తి స్త్రీయే

మహనీయ ముహమ్మద్ (సల్లం)ని దైవప్రవక్తగా విశ్వసించి, ఆయనకు తన పూర్తి సహాయసహకారాలు అందజేసిన మొట్టమొదటి వ్యక్తి మహిళే. ఆ మహిళామణి ఆయన ధర్మపత్ని హజ్రత్ ఖతీజా(రజి)యే. ఆయన తొలిసారిగా దైవసందేశ భారం వహిస్తున్నప్పుడు ఈ సాత్వికురాలే అదురుతున్న ఆయన గుండెలకు స్వాంతన చేకూర్చారు. మొదటిసారి దైవవాణి అవతరించినప్పుడు మహనీయ ముహమ్మద్ (స) విషయం ఏమిటో అర్థంగాక తీవ్రంగా భయపడుతూ ఇంటికొచ్చి వాలారు. భయాందోళనలు కొంచెం తగ్గిన తర్వాత “ఖదీజా! ఏమైంది నాకు? ఇదంతా చూస్తుంటే నాకేదో ప్రాణాపాయం కలుగుతుందని భయంగా ఉంది” అంటూ జరిగిన సంఘటన ఆమెకు తెలియజేశారు.

ఆమె విషయం విని “భయపడకండి. శుభఘడియ వచ్చింది, సంతోషించండి. మీరు సత్యసంధులు, దయార్ద్రహృదయులు, పేదల పాలిట పెన్నిధి. సత్కార్యాలలో ప్రజలతో సహకరిస్తారు. అటువంటివారయిన మీకు దేవుడు ఎన్నటికీ ప్రాణాపాయం కలిగించడు” అని ధైర్యం చెప్పారు.

ఆ సాధ్వీమణి దైవదౌత్యానికి పూర్వమే ఆయన సత్యసంధత, నీతీ నిజాయితీలు చూసి తన జీవితభాగస్వామిగా చేసుకున్నారు. పైగా, ఆమె తన కోట్లాది రూపాయల ఆస్తులను ధర్మసంస్థాపనా మార్గంలో మంచి నీళ్ళులా ఖర్చుపెట్టి జీవితాంతం ఆయన అడుగుజాడల్లో నడచుకున్నారు. ఆ త్యాగమూర్తి అందజేసిన ధనసహాయం వల్లనే మక్కాలో ఇస్లామీయ ఉద్యమానికి కొండంత బలం చేకూరింది. దైవప్రవక్త (సల్లం) ఆమె జీవితకాలంలో మరొక స్రీని వివాహమాడలేదు. ఆమె మరణానంతరం ఇతర స్త్రీలను వివాహమాడినా ఆయన తరచుగా ఆమెనే జ్ఞాపకం చేసుకునేవారు.

## ఉమర్ (రజి) మెడలు వంచిన ఉవిద

హజ్రత్ ఉమర్ (రజి) చెల్లెలు హజ్రత్ ఫాతిమా (రజి) వృత్తాంతం కూడా తీసుకోండి. చెల్లెలు, బావ ఇస్లాం స్వీకరించారని తెలియగానే హజ్రత్ ఉమర్ (రజి) ఆగ్రహోదగ్రులయ్యారు. దైవప్రవక్త (సల్లం)నే హతమార్చడానికి వెళ్తున్న హజ్రత్ ఉమర్ (రజి) గిరున వెనక్కి తిరిగి చెల్లెలి ఇంటికి పరుగుతీశారు.

అక్కడికి వెళ్ళి తలుపులు దబదబా తట్టారు. తలుపులు విరిగిపోయేటట్లు బాదుతున్న శబ్దానికి ఇంట్లో వాళ్ళు భయపడ్డారు. “ఎవరండీ!” లోపలి నుంచే అడిగారు.

“ఉమర్ బిన్ ఖత్తాబ్” బయటి నుంచి సమాధానం వచ్చింది సింహగర్జనలా.

ఉమర్ పేరు వినగానే ఇంట్లోవారి గుండెలు గుభిల్లుమన్నాయి. ఖుర్ఆన్ విన్పిస్తున్న ఖబ్బాబ్ (రజి) వెంటనే పుస్తకం మూసేసి నిలబడ్డారు. ఆయనకు ఎదురుగా కూర్చొని ఖుర్ఆన్ వింటున్న ఉమర్ చెల్లెలు ఫాతిమా (రజి), ఆమె భర్త సయీద్ (రజి) కంగారు పడుతూ లేచి ఏదో మూల దాక్కోడానికి ప్రయత్నించారు.

బయట తలుపు తడ్తున్న శబ్దం మరింత అధికమయింది. హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఖుర్ఆన్‌ని అక్కడే వదిలేసి ఒక్క అంగలో పోయి లోపల గదిలో ఓ మూల దాక్కున్నారు. హజ్రత్ ఫాతిమా (రజి) పుస్తకం తీసి కన్పించకుండా తన వీపు వెనుక చేతిలో పట్టుకొని తలుపు వైపే చూడసాగారు భయం భయంగా.

హజ్రత్ సయీద్ (రజి) అదురుతున్న గుండెను చేత పట్టుకొని మెల్లిగా తలుపు తెరిచారు. అంతే, ఆకలిగొన్న పులిలా లోపలికి దూసుకొచ్చారు ఉమర్. లోపల నలు మూలలా పరికించి చూశారు. తన బావా, చెల్లెలు తప్ప మరెవరూ కన్పించలేదు.

"ఇప్పుడు నేను విన్న కంఠం ఎక్కడ్నుంచి వచ్చింది?" గర్జించారు ఉమర్.

"అబ్బే... ఇక్కడ అలాంటిదేమీ లేదే!" నసిగారు వారిద్దరు భయపడుతూ.

"దాచి పెట్టకండి. మీరు ఇస్లాం స్వీకరించిన సంగతి నాకు తెలియదనుకున్నారా?" అంటూనే సయీద్ (రజి) మీదికి లంఘించారు ఉమర్. పిడిగుద్దులతో ఆయన వళ్ళు హూనం చేయడం ప్రారంభించారు.

ఫాతిమా (రజి) సహించలేక భర్తను విడిపించుకోవడానికి అడ్డం వచ్చారు. దాంతో ఉమర్ మరింత రెచ్చిపోయి బావను వదలి చెల్లెలిపై చెయ్యెత్తారు. ఆ చెంప ఈ చెంప ఎడా పెడా వాయించసాగాడు.

హజ్రత్ ఫాతిమా (రజి) చెంపలు కందిపోయాయి. ఆమె చెవిపోగు కూడా తెగి పోయింది. తల నుంచి ధారపాతంగా రక్తం కారసాగింది. ఉమర్ తమనిక ప్రాణాలతో వదలిపెట్టడని భావించారు. దాంతో ఆమె హృదయంలోని విశ్వాస తరంగాలు పరవళ్ళు తొక్కాయి. ఆమె దెబ్బతిన్న చిరుతపులిలా ఉరిమిచూస్తూ అన్నకు ఎదురుతిరిగారు.

"అన్నయ్యా! ఆగు. నువ్వు ఖత్తాబ్ కొడుకువయితే నేను ఖత్తాబ్ కూతుర్ని. నేను నీకేమీ తీసిపోను. ఔను, మేము ఇస్లాం స్వీకరించాం. ఇక మేము ఇస్లాం నుంచి ఒక్క అంగుళమైనా వెనక్కితగ్గే ప్రసక్తి లేదు. నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అన్నారు హజ్రత్ ఫాతిమా (రజి) ఉద్రేకంతో ఊగిపోతూ.

ఉమర్ చేయి అప్రయత్నంగా ఆగిపోయింది. చెల్లెలి పలుకులు ములుకులుగా తగిలి ఆయన హృదయాన్ని కదిలించాయి. ఆమె చెంపల మీదుగా కారుతున్న రక్తం ఆయన మనస్సును క్షణంలో మైనంలా కరిగించివేసింది. అంతలో ఆయన దృష్టి చెల్లెలి చేతిలో ఉన్న పుస్తకంపై పడింది.



"ఇదేనా మీరు చదువుతున్నది? ఏది ఓసారి ఇటివ్వు, నేనూ చూస్తాను" అన్నారు ఉమర్ ప్రశాంతంగా.

"ఇది నీ చేతికిస్తే మళ్ళీ మాకు లభిస్తుందో లేదో!" అన్నారు ఫాతిమా (రజి) భయమూ, అనుమానం మేళవించి చూస్తూ.

"భయపడకు, తప్పకుండా తిరిగిస్తాను"

"అయితే ముందు నువ్వు స్నానం చేసి రా"

ఉమర్ లోపలికి వెళ్ళి స్నానం చేసి వచ్చారు. ఫాతిమా (రజి) తడబడుతున్న చేతులతో ఖుర్ఆన్‌ని ఆయన చేతికి అందించారు. ఉమర్ దాన్ని తెరచి జాగ్రత్తగా చదవడం ప్రారంభించారు. కొన్ని క్షణాల తర్వాత ఆయన వాలకంలో మార్పు రాసాగింది. చేతులు వణికి పోతున్నాయి.

"ఎంత మంచి విషయాలు! ఎంత పవిత్రమైన వాణి ఇది!!" ఉమర్ నోట అప్రయత్నం గా వెలువడ్డాయి మాటలు.

లోపల దాక్కున్న ఖబ్బాబ్ (రజి) ఈ మాటలు వినగానే బయటికి వచ్చారు.

"ఉమర్! దైవప్రవక్త (స) నిన్నుగాని, అబూజహల్‌నిగాని ఇస్లాం వడిలోకి వచ్చేటట్లు చేయమని దైవాన్ని ప్రార్థించారు. ఆ ప్రార్థన బహుశా నీ విషయంలోనే దైవం అంగీకరించి ఉండవచ్చు. ఇక ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టకు ఉమర్!" అన్నారు ఆయన.

"నేను ఇస్లాం స్వీకరించదలిచాను. నన్ను ముహమ్మద్ దగ్గరకు తీసికెళ్ళండి."

ఉమర్‌లో వచ్చిన ఈ మార్పు చూసి ఖబ్బాబ్ (రజి) పరమానంద భరితులయ్యారు. ఇక ఫాతిమా, సయీద్ (రజి)ల ఆనందానికైతే అవధుల్లేకుండా పోయింది.

## కష్టాలు అధికమించడంలో కాంతామణులే మిన్న

ధర్మసంస్థాపనా ఉద్యమం ప్రారంభమైన మొదటి మూడేళ్ళ కాలంలో యాభయి అయిదు మంది ఇస్లాం స్వీకరించగా వారిలో తొమ్మిది మంది స్త్రీలు కూడా ఉన్నారు. ఆ రోజుల్లో ఇస్లాం స్వీకరించిన వారిపై స్త్రీలు, పురుషులన్న విచక్షణ లేకుండా ఖురైష్ సత్యతిరస్కారులు జరిపిన హింసా దౌర్జన్యాలను గురించి వింటే శరీరం జలదరిస్తుంది. ఆవిధంగా ఏడెనిమిది సంవత్సరాలు దుర్భరమైన కష్టాలు సహించిన తర్వాత ఎనభై మూడు మంది ముస్లింలు మక్కాలో తమ ఇళ్ళు, వాకిళ్ళు వదలిపెట్టి అబిసీనియాకు వలసపోవలసి వచ్చింది. వారిలో కూడా పద్దెనిమిద మంది స్త్రీలున్నారు.

సహనం, సాహసాలను పుణికిపుచ్చుకున్న హజ్రత్ ఉమ్మె హబీబా (రజి)ను గురించి చాలామంది ముస్లింలకు తెలిసేఉంటుంది. ఆ ధీరవనిత మక్కాలో ముస్లింలపై హద్దు మీరిన దౌర్జన్యకాండ సాగుతున్న అతిక్లిష్ట సమయంలో ఇస్లాం స్వీకరించారు. అంతేకాదు,

ఇస్లాం స్వీకరించిన కారణాన అనేక కష్టాలు అనుభవించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చివరికి భర్త అబ్దుల్లాతో పాటు అబిసీనియాకు వలస కూడా పోయారు.

అయితే అబిసీనియా వచ్చిన తరువాత ఆమెపై మరో విపత్తు వచ్చిపడింది. ఆమె భర్త అబ్దుల్లా ధర్మభ్రష్టుడయి క్రైస్తవ మతంలో చేరిపోయాడు. దానివల్ల హజ్రత్ ఉమ్మె హబీబా (రజి) దిక్కులేని అనాథయి పోయి విచార సముద్రంలో ఏకాంత జీవితం గడప సాగారు. అయితే ఇస్లాం పట్ల ఆమె విశ్వాసం ఏమాత్రం సడల లేదు. పైగా అది మరింత అధికమయ్యింది. దైవప్రవక్త (సల్లం)కు సతీమణి అయ్యే వరకు దైవమార్గంలో ఆమె చేసిన త్యాగాలు, చూపిన సహన స్థయిర్యాలు అనన్యమయినవి.

మరో మహిళామణి ఉమ్మె సులైం బిన్త్ మల్హాన్ (రజి) కూడా ధర్మపరాయణత, ధర్మప్రచార కార్యకలాపాలలో ఖ్యాతిచెందారు. దైవప్రవక్త (స) ఓసారి ఆమెను గురించి ఇలా అన్నారు: "నేను స్వర్గంలో తిరిగిచూశాను. అక్కడ ఒక చోట ఎవరో నడుస్తున్న అడుగుల చప్పుడు విన్పించింది. నేనీ అడుగుల చప్పుడు ఎవరిదని అడిగాను. 'ఇది గమీసా (అనస్ తల్లి) అడుగుల చప్పుడ'ని సమాధానం వచ్చింది. (బుఖారి)

## స్థిరత్వం స్త్రీల సొత్తు

మదీనాలో ఇస్లాం ప్రవేశించిన తర్వాత హజ్రత్ ఉమ్మెసులైం (రజి) ఇస్లామే సత్య ధర్మమని తెలియగానే దాన్ని స్వీకరించారు. ఆ సమయంలో ఆమె భర్త ఏదో ఊరికి వెళ్ళి ఉన్నాడు. ఊరి నుంచి తిరిగొచ్చిన తరువాత ఆమె ఇస్లాం స్వీకరించిందని తెలిసి "ఏమిటీ, నువ్వు కూడా మతభ్రష్టురాలయి పోయావా?" అని అడిగాడు. దానికామె భయపడ కుండా "లేదు, నేను సత్యసంధుడయిన ముహమ్మద్ (సల్లం)ని విశ్వసించి ఆయన హితబోధ స్వీకరించాను" అని సమాధానమిచ్చారు.

హజ్రత్ ఉమ్మెసులైం (రజి) తాను ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉండటమేగాక, తన భర్తకు కూడా ఇస్లాం సత్యతను గురించి చెప్పడం ప్రారంభించారు. కాని అతను ఇస్లాం స్వీకరించలేదు. పైగా భార్య మీద అలిగి సిరియా వెళ్ళిపోయాడు. అక్కడే ఉండిపోయి కొన్నాళ్ళ తరువాత చనిపోయాడు.

అతను చనిపోయాక అబూతల్హా (రజి) ఆమెను వివాహమాడ దలిచారు. ఆయన అప్పటికింకా ఇస్లాం స్వీకరించలేదు. అందువల్ల హజ్రత్ ఉమ్మెసులైం (రజి) "మీరు విగ్రహారాధకులు. నేనేమో ఇస్లాం స్వీకరించినదాన్ని. అంచేత మీరు ఇస్లాం స్వీకరించ నంతవరకు నేను మిమ్మల్ని వివాహమాడలేను" అనిఅన్నారు. ఆ తర్వాత ఆమె ఆయన ముందు విగ్రహారాధనలోని చెడేమిటో, ఇస్లాంలోని మంచేమిటో వివరించారు.

ఇలా కొన్నాళ్ళపాటు ఆమె ఆయనకు ఇస్లాం గురించి రకరకాలుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. చివరికి ఆమె ప్రయత్నం ఫలించింది. హజ్రత్ అబూతల్హా (రజి) ఇస్లాం స్వీకరించారు. అప్పుడు హజ్రత్ ఉమ్మెసలీం (రజి) ఎంతగానో సంతోషిస్తూ మహర్ తీసుకోకుండానే ఆయన్ని వివామాడటానికి అంగీకరించారు.



## ప్రవక్త ప్రేమలో పతి మరణం ఖాతరుచేయని పడతి

ఉహద్ యుద్ధం సందర్భంలోనే మరో వనితా జ్యోతి వెదజల్లిన వెలుగురవ్వలతో ఇస్లామీయ చరిత్ర కాంతి ద్విగుణీకృత మయ్యింది. ఈ యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) అమరగతులయ్యారన్న వదంతి వ్యాపించడంతో ఆ మహిళామణి యుద్ధభూమికి పరుగు తీసింది. దారిలో వస్తూ కన్పించిన ప్రతి యోధుడ్నీ దైవప్రవక్త (సల్లం) క్షేమం గురించే విచారిస్తూ ముందుకు సాగింది.

ఒకచోట ఆమె కన్నతండ్రి అమరగతుడయ్యాడన్న వార్త విన్నది. మరోచోట రక్తం పంచుకున్న సోదరుడు చనిపోయాడని విన్నది, వేరొకచోట కట్టుకున్న భర్త అమరగతు డయ్యాడని విన్నది. అయినా ఆ ధీరవనిత తన సన్నిహితుల మరణవార్తలను సైతం ఖాతరు చేయకుండా "ముందు నాకు మన ప్రియప్రవక్త (సల్లం) క్షేమంగా ఉన్నారో లేదో చెప్పండి" అని అడిగింది. చివరికి దైవప్రవక్త (సల్లం) క్షేమంగానే ఉన్నారని తెలిసింది. అయినా ఆమె తృప్తి చెందలేదు. దైవప్రవక్త (సల్లం)ను కళ్ళారా చూసుకొని ఆయన క్షేమంగా ఉన్నారని గ్రహించిన తరువాత "దైవప్రవక్తా! మీరు క్షేమంగా ఉన్నారు, అంతే చాలు నాకు. ఇక నేను ఎలాంటి ఆపదనయినా తేలిగ్గా సహించగలుగుతాను" అంటూ ఆమె సంతృప్తి వెలిబుచ్చింది.

## రాజ్యాధినేతను నిలదీసిన ధీరవనితలు

ఇస్లామీయ విప్లవ పోరాటంలో మహిళలు భావప్రకటనస్వేచ్ఛ ద్వారా కూడా తమవంతు బాధ్యత నిర్వహించారు. ధర్మానుసరణలో ఏదైనా అవాంఛనీయమైన విష యాలు ఉన్నాయని తెలిస్తే రాజ్యాధినేతలను సైతం నిర్భయంగా విమర్శించేవారు.

రెండవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) యువకులకు వివాహం కావడం కష్టమైపోయేలా మహర్ (వధువు హక్కు) హద్దూపద్దూ లేకుండా పెరిగిపోతుండటంతో ఆయన 'మహర్'పై పరిమితి విధించదలచుకున్నట్లు ఒక సమావేశంలో ప్రకటించారు. తక్షణమే ఒక మహిళ అక్కడికక్కడే ఖలీఫాను నిలదీసింది. "స్వయంగా దైవగ్రంథమే స్త్రీలకు మహర్‌గా భారీఎత్తు ధనమివ్వడానికి అనుమతిస్తుంటే, దానికి పరిమిత విధిం చేందుకు మీకేం అధికారముంది?" అని ఆమె ఖలీఫాను నిశితంగా విమర్శించింది. దాంతో ఆయన తన ప్రతిపాదనను ఉపసంహరించుకోవలసి వచ్చింది.

మరొక మహిళ, ఎక్కడికో నడచిపోతున్న ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి)ని దారిలో ఆపి, ఆయనలో మరింత దైవభీతి కలిగించడానికి ఎలా ప్రయత్నించిందో చూడండి:

"ఓహో ఉమర్! ఎంత మారిపోయావు!! ఒకప్పుడు నువ్వు ఉకాజ్ బజారులో తిరుగుతుంటే చూశాను. అప్పుడు నిన్ను జనం ఉమైర్ అని పిలిచేవారు. నువ్వు చేతిలో కర్ర తీసుకొని మేకలు కాస్తుండేవాడివి. తర్వాత ఎంతో కాలం గడవలేదు, జనం నిన్ను ఉమర్ అని పిలవడం ప్రారంభించారు. ఆ తర్వాత కొంతకాలానికి ఇప్పుడు నువ్వు

అమీరుల్‌మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) అని పిలవబడుతున్నావు. ప్రజల విషయంలో కాస్త దేవునికి భయపడుతూ మసలుకో. ఒక విషయం గుర్తుంచుకో, దేవుని శిక్షకు భయపడేవానికి సుదూరవ్యక్తి కూడా దగ్గరిబంధువులా మారిపోతాడు. చావుకు భయపడేవాడు తాను కాపాడుకోవాలనుకున్న వస్తువునే పోగొట్టుకునే ప్రమాదం ఉంది.''

హజ్రత్ ఉమర్ (రజి) వెంట ఉన్న ఒకతను ఆ వృద్ధురాలి వైఖరి సహించలేక "నువ్వు మన అమీరుల్‌మోమినీన్ ముందు హద్దుమీరి మాట్లాడుతున్నావు" అన్నాడు.

హజ్రత్ ఉమర్ (రజి) అతడ్ని వారిస్తూ "ఆమెను చెప్పనివ్వు. అసలీమె ఎవరో నీకు తెలుసా? ఈమె ఫిర్యాదు మాటలు సప్తాకాశాలపై ప్రతిధ్వనించాయి. దైవసాక్షి! ఈమె ఇలా నన్ను రాత్రిపొద్దు పోయేదాకా నిలబెట్టినాసరే నేను నిలబడి వింటాను. కాకపోతే నమాజు వేళలప్పుడు మాత్రం నాఅశక్తతను తెలుపుకుంటాను" అని అన్నారు. ఈ మహిళే హజ్రత్ ఖౌలా-రజి. (ఖతాదా, బైహఖి)

హజ్రత్ ముఆవియా (రజి) ఒకసారి తనకేదైనా ఉపదేశించమని హజ్రత్ ఆయిషా (రజి)ను అడిగినప్పుడు ఆమె ఒక లేఖలో ఇలా ఉపదేశించారు: "ప్రజలను అసంతృప్త పరచి దేవుని ప్రసన్నత అన్వేషించే వ్యక్తికి ప్రజలు ఎలాంటి నష్టం కలిగించలేరు. ఒకవేళ ప్రజలను సంతోష పెట్టడానికి దేవుడ్ని అసంతృప్త పరచితే దేవుడు అతడ్ని ఆ ప్రజలకే అప్పగిస్తాడు.''

ఈవిధంగా ముస్లిం మహిళలు ఆనాడు తోటి మహిళల్లోనే గాకుండా పురుషుల్లో కూడా దైవధర్మాన్ని వ్యాపింపజేస్తూ, ఎంతో విజ్ఞతావివేచనలతో సందర్భోచితంగా ధర్మప్రచార బాధ్యతను నిర్వహించేవారు. ఆనాటి ముస్లిం వనితలు ఇంటి నాలుగ్గోడల మధ్య విద్యా శిక్షణ రంగాల్లో తమ ప్రతిభా విశేషాలను ప్రదర్శించడంతో పాటు బయటికెళ్ళినప్పుడు హితవులు, విమర్శలతో కూడా ప్రజలకు దైవసందేశం అందజేస్తూ ఎల్లప్పుడూ ధర్మ సరిహద్దులను కాపాడుతుండేవారు. అంతేకాదు, ధన కనక వస్తు త్యాగాలతో కూడా ఇస్లామీయ ఉద్యమానికి చేయూతనిచ్చేవారు. కనుక ఈనాడు కూడా ఈ మహాకార్యంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా తమ సేవలను, శక్తి సామర్థ్యాలను వినియోగించవలసిన అవసరం ఎంతయినా ఉంది.

## పారితోషికాల ద్వారా కూడా పని చేయవచ్చు

ధర్మప్రచార రంగంలో అన్నిటికంటే ముఖ్యమైన అంశం మన నీతినడవడికలే. ఈ నీతినడవడికలలో మొట్టమొదటి విషయం తోటి మానవులతో మన సత్సంబంధాలే. ధర్మసంస్థాపనా బాధ్యత నిర్వహిస్తున్నవారు ఇతరులతో తమ సంబంధాలను పటిష్ఠ పరచుకోవాలి. సంబంధాల పటిష్ఠత కోసం పారితోషికాలు ఇచ్చిపుచ్చుకోవడాలు కూడా ఉండాలి. వీటి ద్వారా కూడా ప్రజలను ఆకట్టుకోవచ్చు.

ఈ పారితోషికాలు రెండు రకాలు. ఒకటి, ఏకపక్ష పారితోషికాలు. రెండు, ద్విపక్ష పారితోషికాలు. ఏకపక్ష పారితోషికాలు సాధారణంగా ఈనాడు ధర్మప్రచార రంగంలో



పని చేసేవారికి వారి కార్యకర్తలు, ఇతరులు ఇస్తుంటారు. కాని ఈ ఏకపక్ష పారితోషికాలను దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారకుల కోసం నిషేధించారు. అంటే ఆ పారితోషికాలు మొత్తం వారు తమ సొంతానికి వాడుకోకూడదన్న మాట.

దైవప్రవక్త (సల్లం) ఒక అనుచరుడ్ని జకాత్ సొమ్ము వసూలు చేసి తీసుకురావడానికి ఒక ప్రాంతానికి పంపించారు. ఆ అనుచరుడు జకాత్ వసూలు చేయడానికి ఒక ఆసామి దగ్గరకు పోతే, ఆ ఆసామి జకాత్ సొమ్ము చెల్లించడంతో పాటు జకాత్ వసూలు పనిలో నిమగ్నమయినందుకు పారితోషికంగా ఆయన సొంతానికి కూడా కొంత సొమ్ము ఇచ్చాడు.

ఆ అనుచరుడు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తిరిగొచ్చి "ఇది ప్రభుత్వధనాగారం (బైతుల్ మాల్) కోసం ఇవ్వబడిన జకాత్ సొమ్ము. ఇది నాకు పారితోషికంగా ఇవ్వబడిన సొమ్ము" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) పారితోషికం సంగతి విని ఆగ్రహం చెందారు. "నువ్వు ఇంట్లో కూర్చోక పోయావా! ఇంట్లో కూర్చొని ఉంటే ప్రజలు పారితోషికాలు తెచ్చిస్తారు కదా!!" అన్నారు ఆయన.

## మీ ఇంటికొస్తే ఏంపెడ్తారు, మా ఇంటికొస్తే ఏంతెస్తారు?

పోతే ద్విపక్ష పారితోషికాలు. అంటే రెండు వైపుల నుంచి ఇచ్చిపుచ్చుకునే పారితోషికాలన్న మాట. ఈనాడు కొందరు స్త్రీలు దీన్ని ఏకపక్షం పారితోషికాలుగా చేయడానికి ప్రయత్నిస్తూ "మీ ఇంటికొస్తే ఏంపెడ్తారు, మా ఇంటికొస్తే ఏంతెస్తారు?" అనే ధోరణితో ప్రవర్తిస్తారు. మీరు మాత్రం అలాంటి వైఖరి అవలంబించకండి. రెండు వైపుల నుంచి ఇచ్చిపుచ్చుకునే పారితోషికాలు మాత్రమే ధర్మసమ్మతమైనవి.

ఇతరులతో మన స్నేహ సంబంధాలు పటిష్ఠపరచడంలో, ధర్మప్రచార మార్గాన్ని సుగమం చేయడంలో ఈ ద్విపక్ష పారితోషికాలు మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇలాంటి పారితోషికాలను దైవప్రవక్త (సల్లం) ప్రోత్సహించారు. ఇవి గొప్ప పుణ్యకార్యాలు కూడా. కనుక మీ ఇరుగుపొరుగువారికి, బంధుమిత్రులకు అప్పుడప్పుడు పండ్లు, మిఠాయి, బట్టలు లాంటి వస్తువులు పారితోషికాలుగా ఇవ్వడం మరచిపోకండి. అయితే ఇలా పారితోషికాలు ఇస్తూ మన ధర్మపరాయణతలో, నీడినడవడికల్లో మాత్రం కొరత రానీయకూడదు సుమా!

# 39. ముస్లిం మహిళ గుణగణాలు

స్త్రీ తనకు దైవం నిర్దేశించిన బాధ్యతల్ని నిర్వహిస్తూ గృహజ్యోతిగా వెలుగొందుతుంది. ఆమె ఇంటిపనులు చక్కబెడ్తుంది; కుటుంబ గౌరవాన్ని కాపాడుతుంది; సంతానానికి శిక్షణ ఇస్తుంది. ఇలా ఆమె తన బాధ్యతల్ని నిర్వహిస్తూ జీవితనౌక సాఫీగా సాగిపోవడానికి భర్తతో సహకరిస్తుంది. పురుషుడు, స్త్రీపోషణ భారం వహించడంతో పాటు ఆమె సముచిత అవసరాలు తీర్చడానికి కృషిచేస్తాడు; ఆమె మానమర్యాదలు

కాపాడుతుంటాడు. ఈవిధంగా భార్యాభర్తలు ఇద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా, తలలో నాలుకగా మసలుకుంటూ ఇంటిని స్వర్గధామంగా మార్చగలుగుతారు.

దేవుణ్ణి, దైవప్రవక్త (సల్లం)ను విశ్వసించి తదనుగుణంగా జీవితం మలచుకున్న దంపతులయితే ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ తమ ఇంటిని నిజంగానే స్వర్గ సీమగా మార్చుకోగలుగుతారు. పుణ్యార్జనలో స్త్రీపురుషులిద్దరూ సమానమే. పురుషుడు ఇంటి బయటికెళ్ళి ఉపాధి కృషి, సమాజసంస్కరణ, ధర్మయుద్ధం (జిహాద్), పరిపాలనా వ్యవహారాలు వంటి పెద్దపెద్ద పనులు చేపట్టినప్పటికీ, ఇంట్లో స్త్రీ నిర్వహించే వంట పనులు, పిల్లల పెంపకం, ఇతర గృహనిర్వహణ కార్యాలు వాటికి ఏమాత్రం తీసిపోవు. పురుషులు చేసే పనులకు ఎంత పుణ్యఫలం లభిస్తుందో, స్త్రీలు చేసే పనులక్కూడా అంతే పుణ్యఫలం లభిస్తుంది.

## పుణ్యార్జనకు ఇల్లే ప్రధాన వేదిక

ముస్లిం మహిళలకు ఇస్లాం నిర్దేశించిన సుగుణాలే వారి అమూల్య ఆభరణాలు. దేవుడు స్త్రీకి లజ్జ, బిడియాల అపూర్వ మణిమాలను అనుగ్రహించాడు. దాని భద్రత కోసం పరదా పద్ధతిని అభేద్యమైన కంచుకోటగా నిర్ణయించాడు. ఆమె సుఖశాంతుల కోసం ఆమె ఇంటిని సౌరభాలు వెదజల్లే రంగురంగుల పువ్వులతో, సుమధుర ఫలాలతో నిండిన సువిశాల ఉద్యానవనంగా పరిగణించాడు. ఇదే ఆమె కార్యాచరణ పరిధి.

ఈ పరిధిలోనే ఉంటూ ఆమె తన ధార్మికవిధులు నిర్వహించాలి. నమాజ్ చేయడం ఒక విధి. దాని కోసం ఆమె విధిగా మసీదుకు పోనవసరం లేదు. మసీదుకెళ్ళి జమాఅత్‌తో సామూహిక నమాజ్ చేస్తే పురుషులకు ఎంత పుణ్యఫలం లభిస్తుందో అంతే పుణ్యఫలం మహిళలకు తమ ఇంటి పట్టున ఉండి నమాజ్ చేసినా లభిస్తుంది.

## మానవతులకు నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు

అలాఅని ఆమె ఇంటి నుండి బయటికి అసలే పోకూడదని అర్థం కాదు. అవసరమయితే బయటికి కూడా వెళ్ళవచ్చు. అయితే బయటికి పోవడం అనివార్యమయితే బురఖా ధరించి వెళ్ళాలి. నగలు, ఇతర అలంకరణ వస్తువుల్ని పైకి కానరాకుండా దాచి మరీ వెళ్ళాలి. ధ్వని వచ్చే నగలు ధరించకూడదు. ఇవన్నీ ఇంట్లో ఉన్నప్పుడు భర్తకే పరిమితం చేయాలి. వీధుల్లో నడుస్తున్నప్పుడు పురుషుల మధ్య గుండా నడవకూడదు. రోడ్డుకు ఒక పక్కగా నడవాలి.

అంతేకాదు, ఏదైనా ఊరికి ప్రయాణమై పోవలసి వస్తే ఒంటరిగా పోకూడదు. మహ్‌రిమ్ బంధువులయిన భర్తగాని, కొడుకుగాని, సోదరుడుగాని, తండ్రిగాని, మామ గాని ఆమె వెంట ఉండాలి. ఇతర పురుషుల వెంట ఎన్నటికీ ప్రయాణం చేయకూడదు. అవసరమైతే తప్ప పరపురుషులతో మాట్లాడకూడదు.



మానవతుల కోసం దైవం నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు ఇవే. ఈ సూత్రాలే ముస్లిం సమాజంలో మహిళాభ్యుదయానికి మంచి పునాదిరాళ్ళు. వీటి వెలుగులోనే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) **"బిడియం అర్థ విశ్వాసంతో సమానం"** అని చెప్పారు. దీన్ని బట్టి ఇస్లాంలో బిడియానికి ఎంత ప్రాముఖ్యం ఉందో ఊహించవచ్చు.

విశ్వసించిన వనితల వికాసం కోసం ఇస్లాం నిర్దేశించిన ముఖ్యమైన రెండవ మార్గదర్శక సూత్రం- భర్త పట్ల వినయవిధేయతలు. దైవధర్మంలో మగువుల మేల్కొలుపుకై దైవప్రవక్త (సల్లం) చెప్పిన పై హితోక్తి ఒక్కటే చాలు. ఆయన ఓసారి తన అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు:

## పురుషుని మహాభాగ్యం పుణ్యవతి అయిన ఇల్లాలే

"పురుషునికి కావలసిన గొప్ప నిక్షేపం ఏమిటో నేను మీకు తెలుపనా? శీలవతి అయిన భార్య. ఆమెను చూసినప్పుడల్లా అతని హృదయం పరవశించి పోవాలి. అతను చెప్పే మాట విని నడుచుకోవాలి. అతను ఇంటి నుండి ఎక్కడికైనా వెళ్తే, ఆ సమయంలో ఆమె అతని పిల్లల్ని, ఇంటిని, ఇంటిమర్యాదల్ని కాపాడుతూ ఉండాలి." (హదీస్)

ముస్లింమహిళ ఉత్తమ గృహిణిగా తన ఇంటిని తీర్చిదిద్దుకుంటుంది. ఆమె తలచుకుంటే తన సుగుణసంపత్తితో కుటుంబజీవితాన్ని శాంతిసౌరభాలతో నింపి వేస్తుంది. కష్టకాలంలో ఆమె సహనం, సంయమనాలు పాటిస్తూ భర్తకు ఆప్తబంధువుగా, ప్రాణసఖిగా ఎంతగానో సహకరిస్తుంది; భర్త కష్టసుఖాలలో పాలుపంచుకుంటుంది.

దైవప్రవక్త (సల్లం) వేరొక సందర్భంలో ఉత్తమ ఇల్లాలిని గురించి ప్రశంసిస్తూ ఇలా అన్నారు: "ఈ ప్రపంచం జీవితం గడపడానికి ఇవ్వబడిన జీవనసామగ్రి. అందులో **అత్యంత శ్రేష్ఠమైన జీవన సామగ్రి ఉత్తమ ఇల్లాలే**." (ముస్లిం)

దేవుడు వెండి, బంగారాలు కూడబెట్టడాన్ని నిషేధించాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! దేవుడు వెండి బంగారాలు కూడ బెట్టడాన్ని నిషేధించాడు కదా. మేమిప్పుడు ఎలాంటి సంపదను మా దగ్గర పెట్టుకోవాలి?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"మీలో ప్రతి వ్యక్తీ కృతజ్ఞతా పూరితమైన హృదయాన్ని, దైవనామ స్మరణ చేసే నోటిని, పరలోక వ్యవహారాల్లో తనకు సహాయసహకారాలు అందజేసే విశ్వాసురాలయిన భార్యను కలిగిఉండాలి. (ఇవే గొప్ప సంపదలు.)" (ముస్లిం)

## ఖుర్‌ఆన్‌లో ముస్లింమహిళల గుణగణాలు

దివ్యఖుర్‌ఆన్‌లో దేవుడు విశ్వసించిన మహిళలకు ఉండవలసిన ఉత్తమ లక్షణాలు ఏమిటో సంక్షిప్త పదాలలో ఓ సమగ్ర రూపాన్ని చిత్రించాడు. కేవలం ఈ ఒక్క సూక్తిని అనుసరించినా స్త్రీ జీవితం సార్థకమవుతుంది.

"ముస్లిములయిన, విశ్వసించిన, విధేయులయిన, నిజాయితీపరులైన, సహనశీలు రయిన, అణుకువ వినయం కలిగివుండే, దానశీలురయిన, ఉపవాసవ్రతాలు పాటించే, మర్మాయవాలు కాపాడుకునే, దేవుడ్ని అత్యధికంగా స్మరించే స్త్రీ పురుషుల కోసం దేవుడు మన్నింపు, గొప్ప ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు." (ఖుర్‌ఆన్-33:35)

ఈ సూక్తి మూలభాషలో "ముస్లింలైన పురుషులు-ముస్లింలైన స్త్రీలు, విశ్వసించిన పురుషులు-విశ్వసించిన స్త్రీలు..." అంటూ ఇద్దరినీ విడివిడిగా ప్రస్తావించడం జరిగింది. స్త్రీలకు సంబంధించి మూలభాషలో వచ్చిన పదాలతో పాటు వాటి అర్థాలు ప్రస్తావిస్తూ వాటిని నేనిక్కడ విడివిడిగా వివరించడానికి ప్రయత్నిస్తాను:

**ముస్లిమా** (ముస్లింస్త్రీ):- దైవానికి తననుతాను పూర్తిగా సమర్పించుకొని ఆయన ప్రసాదించిన ఇస్లాం ధర్మాన్ని తన జీవిత సంవిధానంగా అంగీకరించిన స్త్రీ అని అర్థం. కేవలం అంగీకరించడమే కాదు, దానికి అనుగుణంగా నడచుకోవాలి.

**మోమినా** (విశ్వసించిన స్త్రీ):- దేవుడ్ని, దైవప్రవక్త (సల్లం)ను మనస్ఫూర్తిగా విశ్వ సించిన మహిళను మోమినా అంటారు. అయితే ఆ విశ్వాసం ఆమె దైనందిన జీవితంలో వ్యక్తమవ్వాలి. అప్పుడే ఆమె విశ్వాసానికి దేవుని దగ్గర గుర్తింపు లభిస్తుంది.

**ఖానితా** (విధేయురాలు):- దేవునికి విధేయురాలయి జీవితంలోని ప్రతి రంగం లోనూ ఆయన ఆజ్ఞలను శిరసావహించే స్త్రీని ఖానితా అంటారు. అంటే దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) ఆదేశించిన పనులే చేయాలి. వారు విధిగా నిర్ణయించినవాటిని తప్పక పాటిస్తుండాలి. అలాగే దేవుడు, ఆయన ప్రవక్త (స) నిషేధించిన వాటికి దూరంగా మసలుకోవాలి. ఆమె చేసే ప్రతిపనీ దైవప్రసన్నత కోసమే ఉండాలి. మరోమాటలో చెప్పాలంటే ఆమె చేసే పనులన్నీ ఖుర్‌ఆన్, హదీసుల పరిధిలోనే ఉండాలి.

**సాదిఖా** (సత్యసంధురాలు):- ఆమె మాటల్లో, చేతల్లో ఎల్లప్పుడూ సత్యసంధత తొణికిసలాడుతుండాలి. అసత్యం, ద్రోహం, విశ్వాసఘాతుకాలు ఆమె హృదయంలోకి కూడా రాకూడదు. ప్రతి వ్యవహారంలోనూ నీతి నిజాయితీలు ద్యోతకమవ్వాలి.

**సాబిరా** (సహనశీలి అయిన స్త్రీ):- జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎంతో సహనంతో ఎదుర్కొంటూ దైవధర్మంలో స్థిరంగా ఉండే స్త్రీని సాబిరా అంటారు. ధర్మానుసరణలో ఎదురయ్యే కష్టాలు చూసి భయపడకూడదు. నిరాశ చెంది దైవాభీష్టానికి వ్యతిరేకమైన ఎలాంటి పనులకూ పాల్పడకూడదు. తుఫాను బీభత్సంలో చిక్కుకొని, భయంకరమైన కెరటాలకు ఊగిపోయే జీవితనౌకను సహన స్థయిర్యాలు కలిగిన నావికురాలు దైవం మీద భారం వేసి అంతిమశ్వాస వరకూ దాన్ని తీరానికి చేర్చడానికే ప్రయత్నిస్తుంది కాని, భయపడిపోయి స్టీరింగుని వదలిపెట్టదు.

**ఖాషిఆ** (దైవభీతికల వినయవతి):- దేవుని పట్ల అమితమైన భయభక్తులు కలిగిన స్త్రీని ఖాషిఆ అంటారు. ఆమె తన హోదా, అంతస్తు, ఐశ్వర్యం, అందచందాలు చూసు



కొని ఏమాత్రం అహంకారానికి లోనుకాదు. దానికి భిన్నంగా తాను కేవలం దేవుని దాసి మాత్రమే నన్న భావనతో ఎంతో అణుకువతో వ్యవహరిస్తుంది. ఆమె తన దేహాన్ని, హృదయాన్ని దైవం ముందు వంచి ఎంతో భయభక్తులతో నమాజ్ చేస్తుంది. నమాజ్ నేర్పే పాఠాలకు వ్యతిరేకంగా ఏ పనీ చేయడానికైనా ఆమె భయపడిపోతుంది.

**ముతసద్ధిఖా** (దానశీలి):- జకాత్ విధి నెరవేర్చడంతో పాటు ఇతర దానధర్మాలు చేయడంలో ఎంతో ఉదారస్వభావంతో వ్యవహరించే వనితను ముతసద్దిఖా అంటారు. పిసినారితనాన్ని, హృదయ కాఠిన్యాన్ని ఆమె దరికే రానివ్వదు. ఆపదలో ఉన్నవారిని తన శక్తిమేరకు ఆదుకోవడం ఆమె సహజలక్షణం. ధర్మసంస్థాపనా మార్గంలో అవసర మైతే తన నగలన్నిటినీ వలిచి ఇవ్వడానికైనా వెనుదీయని త్యాగశీలి ఆమె.

**సాయిమా** (ఉపవాసవ్రత నిష్ఠాపరురాలు):- ఉపవాస వ్రతాలు పాటించే మహిళను సాయిమా అంటారు. ఆమె ఫర్జ్ ఉపవాసాలతో పాటు నఫిల్ ఉపవాసాలు కూడా పాటించ డంలో ఎంతో ఆసక్తి, ఉత్సాహం కనబరుస్తుంది.

**హాఫిజా** (పతివ్రతా శిరోమణి):- హాఫిజా అంటే తన మీద ఎలాంటి అశ్లీల ఛాయలు పడనీయకుండా మానమర్యాదల్ని కాపాడుకునే పరమ పతివ్రతా శిరోమణి అన్న మాట. అదీగాక, ఆమె పరపురుషుని కామవీక్షణలకు ఏమాత్రం గురికానటువంటి సంస్కార వంతమైన దుస్తులు ధరించి హుందాగా మసలుకుంటుంది. ఫ్యాషన్ల సాకుతో పోకిరి చేష్టల్ని ఆమె ఆహ్వానించదు. **పవిత్రత, పాతివ్రత్యాలు ఆమె స్థిరాస్తులు;** పరదా ఆమె చరాస్తి. ఈ రెండిటిని కాపాడుకోవడం తన ప్రథమ విధ్యుక్తధర్మమని ఆమె భావిస్తుంది.

**జాకిరా** (దైవనామ స్మరణి):- ఆమె నోట ఎల్లప్పుడూ దైవనామ స్మరణే జాలు వారుతుంటుంది. ప్రతి వ్యవహారంలోనూ సందర్భోచితమైన దైవనామ పదాలను ఉచ్చరిస్తుంది. దైవప్రేమ ఆమె మనసులో దృఢంగా నాటుకుపోయి ఆమె నోట బిస్మిల్లాహ్, అల్‌హమ్దులిల్లాహ్, ఇన్షాఅల్లాహ్, మాషాఅల్లాహ్ మొదలైన దైవనామపదాలే మాటిమాటికి వెలువడుతుంటాయి.

ఇవన్నీ స్త్రీలైనా, పురుషులైనా ప్రతి విశ్వాసిలోనూ ఉండవలసిన లక్షణాలు. ఈ గుణగణాలుండే స్త్రీని భార్యగా పొందిన పురుషుడు దైవప్రవక్త (సల్లం) మాటల్లో గొప్ప నిక్షేపం పొందినట్లే.

## 40. స్త్రీల ఆంతరంగిక విషయాలు

శీలవతులయిన ముస్లిం మహిళలు అంతర్గత పరిశుద్ధతతో పాటు, బాహ్య పరిశుద్ధత కూడా కలిగి ఉంటారు. అందువల్ల వారి కోసం దేవుడు ప్రత్యేకంగా కొన్ని ఆంతరంగిక విషయాలు నిర్దేశించాడు. వాటిని కూడా స్త్రీలు పాటించాలి.

శారీరక నైర్మల్యం కంటే హృదయ నైర్మల్యం ముఖ్యమైనప్పటికీ ఇస్లాం శారీరక నైర్మల్యానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. అందుకే దైవప్రవక్త (సల్లం) "పరిశుభ్రత

అర్థ విశ్వాసంతో సమానం” అన్నారు. అంటే విశ్వాసంరీత్యా ఇస్లాంకు సంబంధించిన విషయాలన్నీ ఒక ఎత్తయితే, శారీరక పరిశుభ్రత ఒక్కటే ఒక ఎత్తన్న మాట.

కొందరు హృదయంలో సరైన విశ్వాసం, నిజమైన దైవభక్తి ఉంటే చాలు, బాహ్య విషయాలు పాటించకపోయినా పరవాలేదంటారు. సరైన విశ్వాసానికి, నిజమైన దైవభక్తికి కొలమానం మానవుని సొంత అభిప్రాయం కాదు. మనం ఏ దేవుణ్ని విశ్వసించి, మన భక్తిప్రపత్తులు మనసులో భద్రపరచుకున్నామో ఆ దేవుని అభిప్రాయం, ఆయన ఆజ్ఞలే అసలైన కొలమానాలు. ఆ కొలమానాలు ఖుర్‌ఆన్, హదీసుల రూపాల్లో ఉన్నాయి. వాటిని విస్మరించి దారిన పోయే ప్రతి దానయ్య చెప్పే మాటలు వింటే మరణానంతర జీవితంలో మనం చాలా పశ్చాత్తాపం చెందవలసి వస్తుంది.

## సౌఖ్యం, అనురాగాల సాధానికి తొలిమెట్టు

దేవుడు మానవుణ్ని తన ప్రతినిధి (ఖలీఫా)గా ప్రపంచానికి పంపి అతనికి ఎన్నో భాధ్యతలు అప్పగించాడు. ఈ బాధ్యతలను సవ్యంగా నిర్వహించడానికి మొట్టమొదట మానసిక సుఖసంతోషాలు ఎంతో అవసరం. ఆ మానసిక సుఖసంతోషాలు తగిన తోడు- నీడ ఉన్నప్పుడే లభిస్తాయి. ఆ తోడు-నీడే అర్ధాంగి (Better half), జీవిత భాగస్వామిని (Life partner). పురుషుని దేహంలో సగం ఆక్రమించుకునే అర్ధాంగి, తన జీవితంలో భాగస్వామినిగా చేరిన జీవితభాగస్వామిని ద్వారానే అతనికి మానసిక సుఖసంతోషాలు లభిస్తాయి. ఈ 'తోడు-నీడ' పుట్టుక లక్ష్యం కూడా అదే.

“ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి.” (ఖుర్‌ఆన్-30:21)

## సతితో సంగమించడం కూడా సదఖాయే

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లం)తో ఆయన అనుచరులు కొందరు మాట్లాడుతూ ఇలా అన్నారు- “దైవప్రవక్తా! పుణ్యమంతా ధనికులే సంపాదించుకుంటున్నారు. మాలాగే వారు నమాజులు చేస్తున్నారు; ఉపవాసాలు కూడా పాటిస్తున్నారు. పైగా మా కంటే ఎంతో ఎక్కువగా దైవమార్గంలో ధనం దానం (సదఖా) చేస్తున్నారు.” దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ఇలా ప్రవచించారు:

“దేవుడు మిమ్మల్ని సదఖాపుణ్యం సంపాదించే యోగ్యులుగా చేయలేదా? 'సుబ్‌హానల్లాహ్ (దేవుడు పరిశుద్ధుడు)' అని స్మరించిన ప్రతిసారీ సదఖాపుణ్యం లభిస్తుంది. 'అల్లాహుఅక్బర్ (దేవుడు గొప్పవాడు)' అని స్మరించిన ప్రతిసారీ సదఖా పుణ్యం లభిస్తుంది. 'అల్‌హమ్దులిల్లాహ్ (స్తోత్రం దేవునికే శోభిస్తుంది)' అని స్మరించిన ప్రతిసారీ సదఖా పుణ్యం లభిస్తుంది. మంచి విషయాలు ప్రచారం చేయడం వల్ల సదఖా పుణ్యం



లభిస్తుంది. చెడు విషయాలు నిరోధించడం వల్ల సదఖా పుణ్యం లభిస్తుంది. చివరికి మనిషి తన భార్యతో సంగమించడం వల్ల కూడా సదఖా పుణ్యం లభిస్తుంది.”

అనుచరులు ఈ చివరిమాట విని “దైవప్రవక్తా! మాలో ఎవరైనా తనభార్య దగ్గర లైంగికేచ్ఛ నెరవేర్చుకుంటే దానికీ పుణ్యఫలం లభిస్తుందా?” అన్నారు ఆశ్చర్యపోతూ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) “మనిషి తన లైంగికేచ్ఛను ధర్మసమ్మతంకాని చోట (అక్రమ సంబంధంతో) నెరవేర్చుకుంటే అది పాపం కాదా?” అని ఎదురు ప్రశ్న వేశారు. దానికి అనుచరులు “ఆ... పాపమే అవుతుంది” అన్నారు.

“అదేవిధంగా మనిషి ధర్మసమ్మతంగా, సక్రమరీతిలో తన కోరిక నెరవేర్చుకుంటే దానికీ పుణ్యఫలం లభిస్తుంది” అని తెలియజేశారు దైవప్రవక్త (సల్లం)... (ముస్లిం)

## అడ్డుకున్నా నష్టమే, వదిలేసినా నష్టమే

కుంభవృష్టితో బలిసిపోయిన ఆ నది ఉప్పొంగుతూ, ఉరకలు పెడుతూ, నురుగులు కక్కుతూ, పరవళ్ళు తొక్కుతూ పారుతుంటే దాని రౌద్రస్వరూపం, రాక్షసాకారం, భీకర గర్జనలు గమనించేవారికి శరీరం గగుర్పొడుస్తుంది. దాన్ని దూరం నుంచే చూసిన ఒక ఊరి ప్రజలు పారలు, పలుగులతో ఓ పెద్ద అడ్డుకట్ట వేసి దాని దిశను మళ్ళించడం ద్వారా తమ ఊరిని కాపాడుకోవడానికి ప్రయత్నించారు. వారా ప్రయత్నంలో విజయం సాధించగలిగినా ఆ నది ఇతర ఊళ్ళపై పడి బీభత్సం సృష్టిస్తుంది. అంటే ఆ నదిని అడ్డుకున్నా నష్టమే, వదిలేసినా నష్టమే కన్పిస్తుంది. మరేం చెయ్యాలి?

ఇలా ఆ నది ప్రతిఏడూ ఊళ్ళకు ఊళ్ళనే సర్వనాశనం చేసిగాని శాంతించడం లేదు. వందలాది మనుషుల్ని, వేలాది మూగజీవాల్ని పొట్టన పెట్టుకుంటోంది. లక్షల ఎకరాల పంటభూములు నాశనమవుతున్నాయి. మరోవైపు ఎండకాలం వస్తే తాగడానికి చుక్కనీరు దొరకదు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటీ? ఆ ఊరి ప్రజలు తలలు పట్టుకున్నారు. అలాంటి ఊళ్ళు ఇంకా అనేకం ఉన్నాయి. అందరికీ ఇదే సమస్య. ఆయా ఊళ్ళ పెద్దలందరూ ఓ రోజు సమావేశమయి చర్చలు ప్రారంభించారు.

వేడివేడి చర్చలు సాగాయి. ఎవరికి తోచిన సలహా వారివ్వసాగారు. చివరికి ఒక ఇంజినీరు ఇచ్చిన సలహాతో అందరూ ఏకీభవించారు. ఆ నది ప్రవహిస్తున్న దారిలోనే ఒక చోట కొన్ని కొండలు ఉన్నాయి. వాటి మధ్య విశాలమైన ఒక మైదానం కూడా ఉంది. ఆ మైదానంలో ఓ పెద్ద జలాశయం (Reservoir) ఏర్పాటుచేసి, నదికి ఆనకట్ట నిర్మించాలి. నీటిని జలాశయంలోకి మళ్ళించి కాలువలు తవ్వుకుంటే కావలసినప్పుడల్లా కాలువల ద్వారా ఆ నీటిని ఉపయోగించుకోవచ్చు. నీటిపారుదల (Irrigation) పద్ధతితో పొలాలకు నీరు పెట్టుకోవచ్చు. మంచినీటి వసతులు కూడా కల్పించుకోవచ్చు. అంతేకాదు, ఆనకట్ట దగ్గర పవర్‌హౌస్ ఏర్పాటుచేసి విద్యుచ్ఛక్తిని కూడా ఉత్పత్తి చేయవచ్చు. ఇదీ ఆ ఇంజినీరు ఇచ్చిన సలహా.

అచ్చం **నదీప్రవాహం లాంటిదే యువతీయువకుల యౌవనం కూడా.** యౌవనాన్ని నిరోధించినా నష్టమే. విచ్చలవిడిగా వదలిపెట్టినా నష్టమే. ఈ నష్టం యువతీయువకులకే కాదు, సమాజానికి, దేశానికి కూడా నష్టమే. నదీప్రవాహానికి వేసిన ఆనకట్ట లాంటిదే యువతీయువకులకు చేసే వివాహం. వివాహం ద్వారానే మనం నష్టాన్ని అరికట్టి ప్రయోజనాలు పొందగలుగుతాము.

## ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గం

అయితే వివాహానికి పూర్వం, వివాహం తరువాత అనివార్య పరిస్థితుల్లో కొందరు ఉద్రేకం, వత్తిళ్ళకు తట్టుకోలేక మనశ్శాంతికి దూరమవుతారు. అప్పుడేం చెయ్యాలి? దానికోసం కొందరు ధర్మవేత్తలు తాత్కాలికమైన ఓ ప్రత్యామ్నాయ మార్గం తీశారు. ఈ విషయంలో ఖుర్‌ఆన్ ఏమంటున్నదో ముందుగా తెలుసుకుందాం.

“వారు తమ భార్యలు, బానిసస్త్రీల విషయంలో తప్ప (ఇతరస్త్రీల విషయంలో) తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (అంటే వ్యభిచారం తదితర అశ్లీల చేష్టలకు పాల్పడరు.) బానిసస్త్రీల విషయంలో వారిపై ఎలాంటి నింద లేదు. అది తప్ప మరేదయినా కోరేవారే హద్దుమీరిన వారవుతారు.” (23:5-7)

ఈ సూక్తిలో వ్యభిచారం, స్వలింగసంపర్కం, ముష్టిమైథునం వగైరా అక్రమ పద్ధతులన్నీ నిషేధించబడ్డాయి. దైవప్రవక్త (స) యువకుల్ని ఉద్దేశించి ఇలా బోధించారు:

“యువకుల్లారా! మీలో వివాహ బాధ్యతలు నెరవేర్చే శక్తి గలవారు తప్పకుండా వివాహం చేసుకోవాలి. వివాహం దృష్టిని క్రిందికి వాలిపోయేలా చేస్తుంది. మర్మాంగాన్ని రక్షిస్తుంది. వివాహ బాధ్యతలు నెరవేర్చలేనివారు అప్పుడప్పుడు ఉపవాసం పాటించాలి. ఉపవాసం కామోద్రేకాల్ని నిగ్రహింపజేస్తుంది”. (బుఖారి, ముస్లిం)

## పెద్దనష్టం భయముంటే చిన్ననష్టం భరించండి

అయితే హస్తప్రయోగం (Masturbation) విషయంలో షరీఅత్‌వేత్తల (ఫిఖహ్‌వేత్తల) మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) దీన్ని ధర్మసమ్మతంగా పరిగణించారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ షాఫయి (రహ్మాలై)లు దీన్ని నిషిద్ధం (హరాం)గా పరిగణించారు. హనఫీల దగ్గర ఇది నిషిద్ధం అయినప్పటికీ, తీవ్రమైన కామోద్రేకం కలిగినప్పుడు యాదృచ్ఛికంగా ఈ పని జరిగిపోతే దేవుడు క్షమిస్తాడని ఆశించవచ్చని అంటారు వారు.

అతిగా చేస్తే ముష్టిమైథునం కూడా ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని డాక్టర్లు చెబుతారు. కనుక హద్దుమీరకుండా వ్యవరించాలి. ఏమైనా పెద్ద నష్టాన్ని నిరోధించడానికి చిన్న నష్టాన్ని భరించవలసి ఉంటుంది. ముష్టిమైథునం కూడా ఒక విధమైన నష్టదాయకమే గనక కొందరు ధర్మవేత్తలు దానివల్ల పాపమూ లేదు, పుణ్యమూ లేదంటారు. (డాక్టర్ అబ్దుల్లా నాసెగారి “ఇస్లాంమె జిన్సీతర్బియత్” పుస్తకం చూడండి.)



## లైంగిక అశుద్ధావస్థలో పాటించాల్సిన విషయాలు

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: ఒకసారి హజ్రత్ ఉమ్మె సులైం (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి “దైవప్రవక్తా! సత్యం తెలపడంలో దేవుడు సిగ్గుపడడు. స్త్రీలకు స్వప్న స్ఖలనమయితే వారు కూడా విధిగా గుసుల్ (స్నానం) చేయాలా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) చేయాలి” అని సమాధానమిచ్చారు.

ప్రవక్త సతీమణి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) ఈమాట విని సిగ్గుతో ముఖం దాచు కుంటూ “దైవప్రవక్తా! స్త్రీలక్కూడా స్వప్న స్ఖలనమవుతుందా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “పిచ్చిదానా! స్త్రీకి కూడా వీర్య స్ఖలనమవుతుంది. లేకపోతే పిల్లవాడికి తల్లిపోలికలు ఎలా వస్తాయనుకున్నావు?” అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ “దైవప్రవక్తా! రాత్రివేళ నాకు వీర్యస్ఖలనం జరుగుతుంది. (ఆ సమయంలో నేను స్నానం చేయలేను, ఏం చెయ్యాలి?)” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “ఉజూ చెయ్యి. మర్మాంగం కడుక్కొని పడుకో” అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## బహిష్టు అయినప్పుడు గమనార్హమైన విషయాలు

బహిష్టు, ప్రసూతి దినాలలో నమాజ్ చేయకూడదు. ఉపవాసాలు కూడా పాటించకూడదు. అయితే ఆ దినాలు గడచిపోయిన తరువాత స్నానం చేసి తప్పిపోయిన రోజాలు (ఉపవాసాలు) మాత్రం ఖజా రోజాలుగా పాటించవలసి ఉంటుంది.

హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు ఒక స్త్రీ వచ్చి “బహిష్టు రోజుల్లో తప్పిపోయిన నమాజులను పరిశుభ్రమైన తరువాత (అంటే బహిష్టుగడువు తీరి స్నానం చేశాక) ఖజా నమాజులుగా చేసుకోవాలా?” అనడిగింది. హజ్రత్ ఆయిషా (రజి) ఈమాట విని “నువ్వు ఖార్జీ (వర్గం) మహిళవా? ప్రవక్త కాలంలో మేము బహిష్టయితే తప్పిపోయిన నమాజులకు ఖజా పాటించాలని మమ్మల్ని ఆయన ఆదేశించేవారు కాదు” అని అన్నారు. లేక “మేము అలా చేసేవాళ్ళం కాదు” అన్నారామె. (బుఖారి)

హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: ఒకసారి నేను, దైవప్రవక్త (స) ఒకే దుప్పటి కప్పుకొని పడుకున్నాము. కాస్సేపటికి నాకు హఠాత్తుగా రుతుస్రావం మొదలయింది. వెంటనే నేను మెల్లగా దుప్పట్లో నుంచి బయటికి వచ్చి బహిష్టు బట్ట కట్టుకున్నాను. దైవప్రవక్త (సల్లం) ఇది గమనించి “ఏమిటీ, నువ్వు బహిష్టు అయ్యావా?” అని అడిగారు. నేను ఔనన్నాను. అయినప్పటికీ ఆయన నన్ను పడక మీదికి పిలుచుకున్నారు. నేను వెళ్ళి ఆయన దగ్గర అదే దుప్పటి క్రింద పడుకున్నాను. (బుఖారి, ముస్లిం)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను బహిష్టు అయిన రోజుల్లో (కూడా) నన్నాయన దేహానికి దేహం ఆనిచ్చి స్పర్శించేవారు. అలాగే ఏతికాఫ్ (తపోనిష్ఠ)లో

ఉన్నప్పుడు కూడా ఆయన మసీదులో ఉండి తమ శిరస్సును నా వైపుకు పెడ్తే నేను బహిష్టు అయివుండి కూడా ఆయనకు తలంటేదాన్ని. (బుఖారి, ముస్లిం)

హ॥జత్ ఆయిషా (రజి) కథనం: నేను బహిష్టు అయిన రోజుల్లో (కూడా) దైవప్రవక్త నా ఒడిని తలగడగా ఉపయోగించుకొని ఖుర్‌ఆన్ పఠించేవారు. (ముస్లిం, బుఖారి)

## రుతుమతి స్నానం (గుసుల్)

సంగమించినా, స్వప్నస్ఖలనమయినా, బహిష్టయినా స్నానం (గుసుల్) చేయాలి. రుతుమతికి బహిష్టు దినాలు గడచిపోయినా రక్తస్రావమవుతుంటే, ఆ గడువు దినాలు గడచిపోయిన తరువాత ఒంటిమీది రక్తం కడుక్కొని ఉజూ చేస్తే సరిపోతుంది.

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు : "పురుషుడు స్త్రీ తొడల మధ్య కూర్చొని బలం ప్రయోగిస్తే చాలు, (వీర్యస్ఖలనం కాకపోయినా) విధిగా స్నానం చేయాలి." (బుఖారి, ముస్లిం)

ప్రవక్త సతీమణి హ॥జత్ ఆయిషా (రజి) కథనం: నేను, దైవప్రవక్త (సల్లం) ఒకే పాత్రలోని నీళ్ళతో స్నానం చేసేవాళ్ళము. ఆ పాత్ర నాకు, ఆయనకు మధ్య ఉంటుంది. ఆ పాత్రలో మా ఇద్దరి చేతులు ఒకదానికొకటి తగులుతుండేవి. ఆయన నాకంటే త్వర త్వరగా నీళ్ళు తీసుకొని పోసుకునేవారు. చివరికి నేను "నా కోసం కూడా కొంచెం నీళ్ళు మిగల్చండి, నా కోసం కూడా మిగల్చండి" అని అనేదానిని. అప్పుడు మేము లైంగిక అశుద్ధావస్థలో ఉండేవాళ్ళము. (బుఖారి, ముస్లిం)

భార్యాభర్తలు పూర్తిగా వివస్త్రయి కూడా స్నానం చేయవచ్చు. కాని ఆచ్ఛాదన యోగ్యమైన శరీరభాగం బట్టతో కప్పుకోవడం మంచిది. దైవప్రవక్త (సల్లం) దీన్ని గురించి ప్రస్తావిస్తూ "దేవుడు (మన ముందున్నాడని భావిస్తూ ఆయన) పట్ల సిగ్గు పడండి. మనం సిగ్గు పడటానికి అందరికన్నా ఆయనే ఎక్కువ హక్కుదారుడు" అని అన్నారు. (నసాయి)

హ॥జత్ ఆయిషా (రజి) కథనం: ఒక స్త్రీ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, బహిష్టు తరువాత స్నానం చేసే పద్ధతి ఏమిటని అడిగింది. దైవప్రవక్త (సల్లం) స్నానం చేసే పద్ధతి వివరించిన తరువాత "కస్తూరి వాసన గల గుడ్డ పేలికతో శుభ్ర పరచుకో" అని చెప్పారు. దానికి ఆమె (విషయం అర్థంగాక) "సువాసన గల బట్టతో ఎలా శుభ్రపరచుకోవాలి?" అని అడిగింది. "అంతే, దాంతో శుద్ధిచేసుకో" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆ స్త్రీ (అప్పటికీ విషయం అర్థంగాక) "ఎలాగండీ?" అని అడిగింది మళ్ళీ. దైవప్రవక్త (సల్లం) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ "సుబ్‌హానల్లాహ్! (నువ్వు ఆమాత్రం కూడా అర్థం చేసుకోలేవా?). సువాసన బట్టతో శుద్ధిచేసుకో, అంతే" అని అన్నారు.

అప్పుడు నేనా స్త్రీని పక్కకు లాక్కెళ్ళి విషయం ఏమిటో వివరిస్తూ "సువాసన బట్టతో రక్తస్రావమయిన శరీర భాగాన్ని తుడుచుకో" అని చెప్పాను. (బుఖారి)



## బహిష్టు, గర్భధారణ, ప్రసూతి దినాలలో నమాజ్-రోజాలు

బహిష్టు రక్తస్రావం గడువు కనిష్ఠంగా మూడు రోజులు, గరిష్ఠంగా పది రోజులు ఉంటుంది. ప్రసూతి రక్తస్రావం గడువు గరిష్ఠంగా నలభై రోజులు ఉంటుంది. కనిష్ఠ గడువు లేదు. బహిష్టు, ప్రసూతి దినాలలో నమాజ్ చేయకూడదు; ఉపవాసాలు పాటించ కూడదు; ఖుర్‌ఆన్ పఠించడం, వ్రాయడం, దాన్ని తాకడం నిషిద్ధం. అలాంటి స్త్రీతో రమించడం కూడా నిషిద్ధమే. బహిష్టు, ప్రసూతి దినాలు గడచిపోయిన తరువాత తప్పి పోయిన రమజాన్ ఉపవాసాలు ఖజా ఉపవాసాలుగా పాటించవలవి ఉంటుంది. తప్పి పోయిన నమాజులకు మాత్రం ఖజా లేదు.

రుతుస్రావం మూడు పగళ్ళు, మూడు రాత్రుళ్ళకు కొన్ని నిమిషాలు తక్కువగా ఉన్నా అది రుతుస్రావం క్రిందికి రాదు. అలాగే రుతుస్రావం పది పగళ్ళు, పది రాత్రుళ్ళకు కొన్ని నిముషాలు ఎక్కువగా ఉన్నా అది కూడా రుతుస్రావం క్రిందికి రాదు. అంటే ఆ పదిరోజులు గడచిపోయినా రక్తస్రావమవుతుంటే దాన్ని రుతుస్రావమని భావించకుండా వెంటనే స్నానం చేసి నమాజు ప్రారంభించాలి. రమజాన్ నెల వస్తే ఉపవాసాలు కూడా పాటించాలి. ప్రసూతి రక్తం నలభై రోజుల తరువాత కూడా స్రవిస్తుంటే దాన్ని కూడా ప్రసూతి రక్తస్రావమని భావించకూడదు.

ఇలా గరిష్ఠ దినాల గడువు దాటినా రక్తస్రావమవు తున్నప్పటికీ దాన్ని మైల రక్తంగా పరిగణించకుండా నమాజ్, రోజా, ఖుర్‌ఆన్ పఠనం, భర్తతో సంయోగం మొదలైన దైనందిన కార్యకలాపాలు కొనసాగించాలి.

## రుతువ్యాధి స్త్రీలకు ప్రవక్త ఆదేశాలు

హ॥జత్ ఆయిషా (రజి) కథనం: అబూహుదైష్ కుమార్తె ఫాతిమా (రజి) ఓరోజు ప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నాకు నిరంతరాయంగా రుతుస్రావమవుతోంది. నేను పరిశుద్ధురాలయ్యే సూచనలు కన్పించడంలేదు. ఇలాంటి స్థితిలో (నేనేం చేయాలి?) నమాజు మానెయ్యాలా?" అని అడిగింది. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"అలాచెయ్యకు. ఇదసలు రుతుస్రావంకాదు, ఒక విధమైన నరం నుండి కారు తున్న రక్తం. రుతుక్రమం గడువుదినాల్లో మాత్రమే నమాజ్ మానేసి, ఆతర్వాత ఒంటి మీది రక్తం కడుక్కొని నమాజులు ప్రారంభించు. కాకపోతే నీ రుతుక్రమం దినాలు మళ్ళీ వచ్చేవరకు ప్రతి నమాజు కోసం కొత్తగా ఉజూ చేయాలి." (బుఖారి, ముస్లిం)

గర్భిణీ స్త్రీలు, పాలతల్లులు రమజాన్ ఉపవాసాలు విధిగా పాటించనవసరం లేదు. అయితే ఆ ఉపవాసాలను ఇతర నెలల్లో ఖజా ఉపవాసాలుగా పాటించాలి.

వాటిని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "గర్భిణీ స్త్రీలు, పాలతల్లులు రమజాన్ నెల ఉపవాసాలు విధిగా పాటించనవసరం లేదు." (జబ్నెమాజ)

## ఓ ప్రియా! నా ప్రియా!!

ప్రతి విషయానికీ ఒక హద్దంటూ ఉంటుంది. విరహావేదనకు కూడా ఒక హద్దుంది. ఆ హద్దుమీరితే ఇస్లాంలో కూడా నష్టమే. ఖలీఫా హ॥జత్ ఉమర్ (రజి) ఈ నష్టం సంభవించే సూచనలు కన్పించగానే దానికి శాశ్వతంగా తెరదించే చర్యలు చేపట్టారు.

ఆయన రోజులాగే ఆరోజు రాత్రి కూడా యథాప్రకారం ప్రజల మంచిసెబ్బరలు తెలుసుకోవడానికి రాజధాని నగరంలో గస్తీ తిరగసాగారు. అలా గస్తీ తిరుగుతుంటే ఒక చోట ఆయనకు ఓ స్త్రీ కంఠం వినవచ్చింది. ఆ కంఠస్వరంలో ఈ విధంగా ఒక విరహగేయం తొంగిచూసింది:

"ముద్దూముచ్చట్లతో నన్నాందపరిచే చెలికాడు లేకుండా పోయాడే!!
అయ్యో! ఈ విషయమే నన్ను రాత్రుళ్ళలో నిద్ర లేకుండా చేసింది.
దేవుని దగ్గర పట్టుబడిపోతానన్న భయమే గనక లేకపోయి ఉంటే,
ఈపాటికి ఈ మంచం పట్టెలు సయితం కదిలిపోయి ఉండేవి!!"

హ॥జత్ ఉమర్(రజి) ఈ గేయం విని చలించిపోయారు. ఆ యువతి భర్త జిహాద్ చేయడానికి వెళ్ళి చాలాకాలం గడిచింది. అందుకే ఆ కావ్యకన్యలో జాలువారిన ఈ విరహవేదన. ఖలీఫా ఉమర్ (రజి) మరునాడు కుమార్తె హ॥జత్ హఫ్సా (రజి) ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు విచారించిన తర్వాత "స్త్రీ తన భర్త ఎక్కడికైనా వెళ్ళిపోయినప్పుడు భర్త ఎడబాటును ఎంత కాలందాకా సహించ గల్గుతుంది?" అని అడిగారు.

హ॥జత్ హఫ్సా (రజి) తండ్రి నోట వెలుపడిన ఈమాట విని క్షణంపాటు సిగ్గుపడి తర్వాత నేలచూపులు చూస్తూ "నాలుగు నెలలదాకా సహించగల్గుతుంది" అని చెప్పారు.

హ॥జత్ ఉమర్ (రజి) ఆ తర్వాత "ఏ సైనికుణ్ణయినా తనభార్య దగ్గరకు పోనీయకుండా నాలుగు నెలలకు మించి ఆపిఉంచకూడదు" అని ఉత్తర్వు జారీచేశారు.

## అందమైన భార్యవల్ల విధినిర్వహణలో అలసత్వం

అందమైన భార్య దొరకడంతో ఆ యువకుడు ముఖ్యమైన విధి నిర్వహించడంలో కాస్తంత అలసత్వం ప్రదర్శించాడు. దాంతో అతని తండ్రికి కోపం వచ్చి ఆ భార్యకు విడాకులిప్పించాడు. ఆ యువకుడు ఎవరోకాదు, హ॥జత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కుమార రత్నం హ॥జత్ అబ్దుల్లా (రజి)యే.

పాపం! అబ్దుల్లా (రజి) అందంతో పాటు ఆత్మసౌందర్యం కూడా ఉన్న అర్ధాంగిని వదలుకోవలసి వచ్చినందుకు ఎంతో బాధ పడిపోయారు. ఆయన బాధాతప్త హృదయం నుండి ఈ క్రింది కవితా ఝరి జాలువారింది.

"ఇలాంటి అందమైన భార్యకు విడాకులిచ్చిన నాలాంటివాడ్ని నేనెవర్నీ చూడలేదు.
ఏ పాపం ఎరగకపోయినా విడాకులతో భర్తకు దూరమైన స్త్రీని కూడా చూడలేదు.



సద్గుణసంపత్తితో తులతూగే సతి ఆమె, నీతిన్యాయాలు నిండిని నాతి ఆమె.
నా హృదయంలో చెరగని ముద్ర వేసిన ఆ చెలిని నేనెలా మరచిపోగలను?"

కాకతాళీయంగా హ॥జత్ అబూబకర్ (రజి) అటుగా పోతుంటే ఈ కవితా పలుకులు ఆయన చెవిన పడి మనస్సును మైనంలా కరిగించాయి. ఆయన హృదయాంబోధిలో వాత్సల్య కెరటాలు ఎగిసిపడ్డాయి. "సరే వెళ్ళి విడాకులు ఉపసంహరించుకొని భార్యను తెచ్చుకో" అన్నారు ఆయన.

అబ్దుల్లా రొట్టె విరిగి నేతిలో పడిపోయింది. సతితో సంసారవనం మళ్ళీ సస్యశామల మయింది. చిలకా గోరింకల కిచకిచలు తిరిగి ఊపందుకున్నాయి.

## ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే...

ఆలుమగల కలియకతో అలుపూ సలుపూ పరార్! కాదా మరి!! అయితే కొంచెం జాగ్రత్త వహించాలి. ఆచ్ఛాదనంతా అవతల పారేసి మరీ సమైక్యతా రాగం తీయకూడదు సుమా! దైవప్రవక్త (స) సతీమణి హ॥జత్ ఆయిషా (రజి) ఏమన్నారో విన్నారా మీరు?

"దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయేవరకూ ఆయన నా 'సతర్' (కనీస ఆచ్ఛాదనా యోగ్యమైన శరీరభాగం)ను, నేను ఆయన 'సతర్'ను చూడలేదు" అన్నారామె.

స్వయంగా దైవప్రవక్త (సల్లం) కూడా దిశమొలవతారాన్ని నిరసిస్తూ "మీలో ఎవరైనా తన భార్య దగ్గర అవసరం తీర్చుకుంటున్నప్పుడు గాడిదల్లా పూర్తిగా వివస్త్రులై పోకూడదు" అని తాకీదు చేశారు. (నిసాయి)

సతీసతుల సంయోగం సౌఖ్యానికి పరాకాష్ఠ. కాని వ్యామోహంలో తొందరపాటు వ్యర్థం. (Haste in lust is a waste.) దానికి ముందు తతంగం (Fore play) పూర్తి చేశాకే అసలు రంగంలోకి దిగాలి. ముద్దులు, ముచ్చట్లు, చుంబనాలు, గుంభనాలు, కౌగిట్లు, క్రీగంట్లతో దారి సుగమంచేయాలి. ఆ తరువాతే కదంబకార్య క్రమానికి శ్రీకారం. అలాకాకుండా ఏకంగా పైనబడి పనికి ఉపక్రమించడం తెలివైన పతి లక్షణం కాదు.

అంతేకాదు, పగలు పెళ్ళాన్ని చితకబాది రాత్రి కాగానే పడక మీదికి లాక్కోవడం కూడా మొగుడికి మంచిది కాదు. దానివల్ల ఇద్దరి మధ్య మురిపెం పాయి ముభావం చోటుచేసుకుంటుంది. దైవప్రవక్త (సల్లం) అలాంటి చేష్టలను నిరసించారు.

## ప్రవక్త ప్రవచనాలే పతీపత్నులకు శిరోధార్యాలు

అబూమన్సూర్ వైల్మి ఈవిధంగా ఉల్లేఖిస్తున్నారు: "మీలో ఎవరూ తన భార్య మీద ఏకంగా పశువు ఎక్కినట్లు ఎక్కకూడదు. ఇద్దరి మధ్య ముందుగా ఒక దూత ఉండాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం). అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! దూతంటే ఎవరూ?" అని అడిగారు. "దూతంటే మాట్లాడుకోవడం, ముద్దాడుకోవడం" అన్నారు దైవప్రవక్త (సల్లం).

వైల్మి ఉల్లేఖించిన మరోఉల్లేఖనం ప్రకారం "మూడు విషయాలు బలహీనతల్లో చేరివున్నాయి" అన్నారు దైవప్రవక్త (స). వాటిలో ఒక దాన్ని గురించి ఇలా తెలిపారు: "మనిషి తన భార్యతో లేదా దాసీతో సంభోగిస్తున్నప్పుడు ఆమెతో ముద్దూ ముచ్చటా ఏమీ చేయకుండానే ఒక్కసారిగా లైంగిక క్రీడకు దిగుతాడు. ఈవిధంగా అతను తనతో ఆమె తృప్తిచెందక ముందే ఆమెతో తృప్తిచెందుతాడు" అని అన్నారు.

ముస్నద్ ఫిర్దౌస్‌లో పేర్కొనబడిని ఈ రెండు హదీసులు ప్రమాణంరీత్యా బలహీనమైన హదీసులయినప్పటికీ విషయం రీత్యా ఎంతో సమంజసంగా ఉన్నాయి. ఇమామ్ గజాలీ (రహ్మాలై) కూడా తన గ్రంథం "ఇహ్యావుల్ ఉలూమ్"లో ఈ విషయం ప్రస్తావిస్తూ భర్త తన కోరిక తీర్చుకున్నప్పుడు తన భార్యక్కూడా ఆ కోరిక తీర్చుకునే అవకాశమివ్వాలని అన్నారు. కొందరు స్త్రీలకు స్ఖలనం ఆలస్యంగా జరుగుతుంది. అందువల్ల భర్త తన కోరిక తీర్చుకున్న వెంటనే భార్య నుండి వేరుకాకూడదన్నారు ఆయన.

## శాంతికి సంభోగమే సర్వస్వం కాదు

పతీపత్నులు ఎదురెదురుగా కూర్చొని 'అందమే ఆనందం, ఆనందమే జీవిత మకరందం' అని పాడుకుంటూ కాలక్షేపం చేయకూడదు సుమా! పాలపొంగు లాంటి ఈ ఉద్రేకాలు రతిక్రీడతో చల్లబడిపోయి 'టెన్షన్' తగ్గిపోయి మనశ్శాంతి లభిస్తుందన్నది నిజమే. కాని ధర్మపరాయణులకు సంభోగమే సర్వస్వంకాదు. 'మందు-మగువ' సిద్ధాంతం మత్తులో పడి రాద్ధాంతం చేసే పదార్థపూజారులకు మాత్రమే అది సర్వస్వం.

సంభోగంవల్ల స్త్రీపురుషులకు తాత్కాలిక మనశ్శాంతి మాత్రమే లభిస్తుంది. అంతకంటే విలువైనది, శాశ్వతమైనది ఆత్మశాంతి. అంటే ఆధ్యాత్మిక మహాభాగ్యం. సంభోగంతో మానసిక వత్తిడి తగ్గిపోయిన తరువాత ఆధ్యాత్మిక మహాభాగ్యానికి దోహదపడే విధుల నిర్వహణ కోసం ధర్మపరాయణులు తక్షణమే ఉపక్రమించాలి. పూర్వం దైవప్రవక్త (సల్లం) కాలంలో, ఆ తరువాత శ్రేష్ఠ ఖలీఫాల కాలంలో ముస్లింలు అత్యవసర సమయం వచ్చినప్పుడు భార్యల కొంగులను వదిలేసి విధినిర్వహణ కోసం పరుగెత్తేవారు.


హదీస్ హితోక్తులు




**సంక్షిప్తంలో సమగ్ర స్వరూపం**

వివిధ ఉర్దూగ్రంథాల నుండి ఎంపికచేసి అత్యాధునిక విషయ సూచికతో వెలువడిన గ్రంథమిది. లోగడ తెలుగులో వెలువడిన గ్రంథాలలోని దాదాపు హదీసులన్నీ ఇందులో చూడవచ్చు. అంటే విషయ పరిజ్ఞానంరీత్యా సంక్షిప్తంలో సమగ్రం అన్నట్లు వేలాది పేజీల లోని సమాచారమంతా దాదాపు 2125 హదీసులతో కేవలం 624 పేజీలలో, కాంప్యాక్ట్‌డిస్క్‌లా ఈగ్రంథంలో ఇమిడిపోయిందన్న మాట. రచన: అబుల్‌ఇర్ఫాన్, పేజీలు: 624, వెల: రూ.200-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2, ✆ 9441515414**




# 41. కాంతామణులే కింగ్‌మేకర్స్

జాతుల నిర్మాణం-ప్రగతులలో, వాటి భవితవ్యాలను తీర్చిదిద్దడంలో స్త్రీలే కీలకపాత్ర వహిస్తూ వచ్చారు. వీరు పౌరులను తయారుచేసే ప్రొడక్షన్ మేనేజర్లు వంటివారు. పురుషుడు ఎల్లప్పుడూ స్త్రీ మానమర్యాదలను కాపాడుతూ వచ్చాడు. సమాజసంస్కరణలో, దాని శిక్షణలో పురుషునికన్నా స్త్రీయే ఎక్కువగా పాలుపంచుకున్నది. సమాజపతనంలో కూడా స్త్రీ పాత్రే అత్యధికంగా ఉంటూవచ్చింది.

## జాతుల నిర్మణంలో స్త్రీజాతి పాత్ర

కనుక ఏదైనా జాతిని విచ్ఛిన్నం చేసి పతనంలోకి నెట్టాలనుకుంటే స్త్రీలను ఇండ్లలో నుంచి బయటికితీయండి. వారి ముసుగులు తొలగించండి. పరదాలు వలిచేయండి. వారి చేతులకు ఫైళ్ళు ఇవ్వండి. ఆఫీసుల్లో కుర్చీలపై కూర్చో బెట్టండి. బాల్ బ్యాటిచ్చి క్రీడామైదానంలోకి దించండి. తుపాకులిచ్చి సైన్యంలో భర్తీ చేయండి. బిజినెస్ అభివృద్ధి కోసం వారిని రిసిప్షినిస్టులుగా, క్యాష్ కౌంటర్లుగా, ఎయిర్ హోస్టెస్లుగా, సేల్స్‌గరల్స్‌గా నియమించండి. వారి ఒడుల్లో నుంచి మమతామమకారాలు తీసేయండి. వారి హృదయాల్లో నుంచి నమ్రత, మృదుత్వాలను తోడిపారేయండి. ఇంకా.....

వారికి నైతిక పరిధుల్ని ఛేదించే పద్ధతుల్ని నేర్పండి. వారి సౌందర్యారాధనను రెచ్చ గొట్టండి. వారిలో అంగాంగ ప్రదర్శనా పిపాసను రేకెత్తించండి. స్లీవ్‌లెస్ బ్లౌజుల్లో వారిని పొగడండి. టాప్‌లెస్ లేడిస్‌కు టాప్ ప్రయారిటీ ఇవ్వండి.

ఎవరైనా అలా చేయగలిగితే ఇక చూడండి. ఆ జాతికి దుర్దినాలు ప్రారంభమైనట్లే. కొంతకాలం పాటు ఈజాతి ప్రగతీ వికాసాలు, స్వేచ్ఛాభ్యుదయాలు అనే మనోహరమైన పారిభాషా పదజాలం చాటున ఎంత వైభవంగా వెలిగిపోయినా చెదపురుగు పట్టిన కలప దూలంలా లోలోన పుచ్చిపోయి ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా కుప్పకూలి పోతుంది. ప్రకృతి చట్టం పగ, ప్రకోపాలతో తన పంజా చాచి దాని చరిత్రను సమాధిచేసి శాశ్వతంగా అంతమొందిస్తుంది.

ఈ "కొంతకాలం" అంటే దశాబ్దాలు గడవవచ్చు. శతాబ్దాలు కూడా దొర్లిపోవచ్చు. దేవుని దృష్టిలో ఇది పెద్ద కాలం కాదు.

"నీ బెదిరింపు నిజమయితే అదసలు ఎప్పుడు నెరవెరుతుంది?" అంటారు వారు. వారికి చెప్పు: "నా చేతిలో ఏమీలేదు. లాభంగాని, నష్టంగాని అంతా దేవుని నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది. ప్రతి జాతికీ ఒకనిర్ణీత గడువుకాలం ఉంది. ఆ గడువు ముగిసి పోగానే ఇక ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయడంగాని, నిర్ణీత గడువుకు ముందు ఒక్క క్షణం తొందరచేయడంగాని జరగదు". (ఖుర్‌ఆన్-10:48,49)

"(షుఐబ్!) నీవు చెప్పేది నిజమే అయితే మాపై ఆకాశపు తునక ఏదైనా తెచ్చి పడెయ్యి." (ఖుర్‌ఆన్)

"(లూత్!) నీవు చెప్పేది నిజమయితే మాపై దేవుని శిక్ష తీసుకురా." (ఖుర్ఆన్)

"చివరికి (ఓరోజు)సూర్యుడు ఉదయించీ ఉదయించగానే భయంకరమైన విస్ఫోటం వారిమీద విరుచుకుపడింది. మేమా పట్టణాన్ని అమాంతం ఎత్తి కుదిపేశాము. వారి మీద కాలిన మట్టిరాళ్ళ వర్షం కురిపించాము." (ఖుర్ఆన్-15:73,74)

చివరికి మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము మా అనుగ్రహంతో షుఐబ్‌ని, అతనితో పాటు విశ్వసించినవారిని రక్షించాము. అన్యాయం, అక్రమాలకు పాల్పడిన దుర్మార్గులపై తీవ్రమైన విస్ఫోటం విరుచుకుపడింది. దాంతో వారు తమ ఇండ్లలోనే పడి సర్వనాశన మయ్యారు. అసలు వారక్కడ ఎన్నడూ నివసించనే లేదన్నట్లు తెల్లవారుజామున ఎలాంటి చలనంలేకుండా నిస్తేజంగా పడి ఉండిపోయారు." (ఖుర్ఆన్-11:94)

"**బుద్ధిజ్ఞానం కలవారికి వీరి చారిత్రకగాథలలో ఎంతో గుణపాఠంఉంది.** ఈవిషయం పుక్కిటిపురాణం కాదు (ఈచెవిన విని ఆచెవిన వదలివేయడానికి). ఇది గతగ్రంథాలను ధృవీకరిస్తున్న (అంతిమదైవ) గ్రంథం. ప్రతి విషయాన్నీ విపులీకరించి చెప్పే దివ్యవాణి. విశ్వసించేవారికి ఇదొక హితోపదేశం, కారుణ్యప్రదాయిని." (ఖుర్ఆన్-12:111)

ఈ దుష్పరిణామాల నుంచి జాతులను కాపాడటానికే ఇస్లాం స్త్రీకి సముచిత స్థానం ఇచ్చి, ఆమెను సమంజసమైన కార్యాచరణ పరిధిలో ఉంచి ఆరోగ్యవంతమయిన సమాజానికి పునాదులు వేసింది. ఆమెకు ఎంతో విలువైన, గౌరవప్రదమైన హోదా ఇచ్చి ఇంటికి యజమానురాలిగా, సర్వాధికారిణిగా చేసింది. షరీఅత్ పరిధిలో ఉంటూ ఏ పనయినా చేయడానికి ఆమెకు స్వేచ్ఛ ఉంది.

## ఆడసింహం ఆగ్రహిస్తే తోడేళ్ళమందకు దడదడే

స్త్రీస్వేచ్ఛ గురించి 19వ శతాబ్ది నుంచే నినాదాలు వినవస్తున్నాయి. కాని 1400 ఏండ్ల క్రితమే ఇస్లాం స్త్రీ స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపింది. ఆనాడు పశువుకన్నా నికృష్ట జీవితం గడుపుతుండిన స్త్రీలకు ఇస్లామే ప్రతిష్ఠాకరమైన స్థానం ప్రసాదించింది. ఇస్లాం స్త్రీపాదాల దగ్గర స్వర్గం సృజించింది. ఆమె ప్రసన్నతను పరలోక భాగ్యానికి పెట్టుబడిగా చిత్రించింది. ఆమె మానమర్యాదల పరిధిని దేవుని అధీనంలో భద్రపరిచింది.

ఇస్లాం స్త్రీకి ఇంతటి గౌరవం, విలువ, భద్రతలు ఇవ్వడానికి కారణం- సత్సమాజ నిర్మాణంలో ఆమె కీలకపాత్ర పోషించవలసి ఉంటుంది. ఆమె తన ఒడిలో భావితరాలను పెంచవలసి ఉంటుంది. తగిన నైతిక శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఆమె స్తన్యం శిశువు లేతనరాల్లో జీవరక్తమై ప్రవహిస్తుంది. స్త్రీ తన బిడియం, అభిమానాల చీరచెరగు కప్పుకొని వుంటే; దైవప్రసాదిత విలువల్ని, సూత్రాలను అర్థం చేసుకుంటే; ఆ లక్ష్యసాధన కోసం తన సర్వస్వాన్ని ధారపోసే అభిలాష, ఆసక్తులు ఉంటే మొత్తం తోడేళ్ళ మందను మట్టుపెట్టేందుకు ఈ ఆడసింహం ఒక్కటే చాలు.



## కొడుకుల వీరమరణం తల్లికి గర్వకారణం

రెండవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా కాలంలో ఖాదిసియా యుద్ధం జరిగింది. హజ్రత్ ఖన్సా బిన్తె అమ్ర్ (రజి) తన నలుగురు కుమారుల్ని ప్రోత్సహించి ఆ యుద్ధానికి పంపారు. అప్పుడు ఆ నారీమణి వారికి చేసిన హితోపదేశం చూడండి:

"నా ప్రియకుమారులారా! మీరు సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. ఇష్టపూర్వకంగానే హిజ్రత్ (వలస) చేశారు. దైవసాక్షిగా చెబుతున్నాను. మీరే విధంగా ఒక తల్లి కడుపులో పుట్టారో అదేవిధంగా మీరు ఒకే తండ్రి సంతానం కూడా. నేను మీ తండ్రికి ఎలాంటి ద్రోహం చేయలేదు. మీ మామయ్యను కూడా అవమానపరచలేదు. మీ జన్మ నిష్కళంక మైనది. మీ వంశం కూడా నిష్కళంకమైనదే."

"బాగా అర్థం చేసుకోండి. దైవమార్గంలో పోరాడటం అన్నిటికన్నా గొప్ప పుణ్యకార్యం. అశాశ్వతమైన ఈ ప్రపంచజీవితం కన్నా శాశ్వతమైన పరలోకజీవితం ఎంతో శ్రేష్ఠమైనది. దేవుడు ముస్లింలను ఉద్దేశించి 'మీరేదైనా వర్గాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు స్థిరంగా ఉండి ధైర్యంగా పోరాడండి. దేవుణ్ణి ఎక్కువగా స్మరిస్తూ ఉండండి. మీకు విజయం సిద్ధిస్తుంది' అని అన్నాడు."

"కనుక రేపు ఉదయం లేవండి. క్షేమంగా లేస్తే ఎంతో నేర్పుగా, చాకచక్యంతో యుద్ధం చేయాలి. మీరు దైవసహాయం అర్థిస్తూ శత్రువులపై విరుచుకుపడాలి. యుద్ధం పరాకాష్టకు చేరి సమరజ్వాలలు మింటికెగిసి, నిప్పురవ్వలు యుద్ధమైదానంలో వ్యాపించడం చూడగానే మీరు యుద్ధజ్వాలల్లోకి దూకి అప్రతిహతంగా ఖడ్గం తిప్పాలి. వీలైతే సేనాపతి మీద కూడా వ్రేటు వేయాలి. ఈ యుద్ధంలో మీకు విజయం లభిస్తే సరే-మంచిదే. ఒకవేళ మీరు అమరగతులైపోతే ఇది అంతకన్నా మంచిది. దాని వల్ల మీకు పరలోక ఔన్నత్యం, సౌభాగ్యాలు లభిస్తాయి."

మరునాడు ఉదయం తెల్లవారగానే యువయోధులు నలుగురూ యుద్ధానికి బయలుదేరారు. అక్కడ శత్రువులతో వీరోచితంగా పోరాడి చివరికి అమరగతులయ్యారు. కొడుకులు అమరగతులయ్యారన్న వార్త విని హజ్రత్ ఖన్సా (రజి) ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడానికి బదులు దేవునికి కృతజ్ఞతలు అర్పించారు.

హజ్రత్ అస్మా బిన్తె అబూబకర్(రజి) తన కుమారుడు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)కు చేసిన హితోపదేశం కూడా చూడండి:

"నా ప్రియకుమారా! నీవు గనక సత్యం వైపుంటే పురుషపుంగవునిలా ధైర్యంగా పోరాడి అమరగతి భాగ్యం పొందు. ఏవిధమైన అవమానం సహించకు. బాబూ! నీవు దైవమార్గంలో ప్రాణాలర్పించు. నేను దైవచిత్తమయితే సహనం వహిస్తాను. ఇక కొంచెం ముందుకు రా. చివరిసారిగా నిన్ను ముద్దాడుతాను" అన్నారు ఆమె.

ఆ నారీమణి ఒడిలో పెరిగిన అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అన్యాయం, దౌర్జన్యాల ముందు తలవంచడానికి తిరస్కరించి ఉరికంబంఎక్కుతారు. అలాంటి యోధుడ్ని కనడం తనకు గర్వకారణంగా భావించిన ఆ వీరమాత ఉరికంబంపై అసువులు బాసిన కొడుకును చూసి "ఇంకా ఈ రౌతు గుర్రం నుంచి దిగలేదా?" అని అంటుంది.

యజీద్ బిన్ ముఆవియా పరిపాలనలో చెలరేగిన హింసాదౌర్జన్యాలకు, అన్యాయం-అక్రమాలకు భయపడి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని ఆయన అనుచరులు కూడా వీడిపోయారు. అయినప్పటికీ అబ్దుల్లా (రజి) చెక్కుచెదరని ధైర్యంతో అన్యాయాన్ని ఎదిరించడానికి ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారంటే అది ఆ వీరమాత ఇచ్చిన శిక్షణే.

ఆశయం పట్ల అచంచల విశ్వాసం, దాని సాధన పట్ల అపార శ్రద్ధే గనక ఉంటే స్త్రీ తన కొడుకులందరూ దైవమార్గంలో బలైనప్పటికీ ఆవేదనా హృదయంతో "నాకు మరోకొడుకు ఉండినట్లయితే అతడ్ని కూడా దైవమార్గంలో ఇచ్చేదాన్ని కదా!" అంటుంది.

## తల్లుల శిక్షణలో తనయుల నిజాయితీ

ఇలాంటి ధ్యేయనిష్ఠే కలిగిన మరోమహిళా ఒడిలో హజ్రత్ అబ్దుల్‌ఖాదర్ జీలాని (రహ్మలై) పెరుగుతారు. ఆ సాధ్వీమణి శిక్షణలో అపార శీలసంపద ఆర్జించిన హజ్రత్ జీలాని చిరుప్రాయంలోనే సత్యపరాయణులయ్యారు. విద్యార్జనా ప్రయాణంలో ఆయన బందిపోటుదొంగల ముందు అబద్ధం చెప్పడానికి నిరాకరిస్తూ, తన దుస్తుల్లో దాచిన డబ్బు తీసి వారికి ఇచ్చేస్తారు. తత్ఫలితంగా ఆ బందిపోటుదొంగలు ఆ బాలుని సత్యసంధత ముందు ఓడిపోయి పశ్చాత్తాపంతో రుజుమార్గం అవలంబిస్తారు.

ఈ భావోద్రేకాలే ఒక బాలికను పాలలో నీళ్ళు కలపడానికి నిరాకరింపజేస్తుంది. ఖలీఫా ఉమర్ (రజి) ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి రాత్రివేళ గస్తీ తిరిగేవారు. ఓరోజు ఇలా గస్తీ తిరుగుతుంటే ఒక ఇంటి నుంచి ఈ మాటలు విన్పించాయి:

"లేమ్మా! లేచి పాలలో కొంచెం నీళ్ళు కలుపు" అన్నది ఒక మహిళ.

"అమ్మా! పాలలో నీళ్ళు కలపకూడదని మన ఖలీఫాగారు ప్రకటన చేయించిన సంగతి నీకు తెలియదా?" అన్నది ఒక బాలిక సమాధానంగా.

"ఇక్కడ ఖలీఫా మనల్ని చూడటం లేదుకదా! ఖలీఫా మనుషులు కూడా లేరు. త్వొరగా పాలలో నీళ్ళుకలుపు. ఇక్కడకొచ్చి ఎవరు చూడబోయారు?" అన్నది తల్లి.

"అమ్మా! మనం ఇక్కడ పాలలో నీళ్ళు కలుపుతున్న సంగతి ఖలీఫాకు తెలియకపోవచ్చు. కాని దేవునికి తెలియదా? ఆయన ఎల్లవేళలా అందరినీ చూస్తున్నాడు. నేను మాత్రం పాలలో నీళ్ళు కలపలేను."

హజ్రత్ ఉమర్ (రజి) ఈ సంభాషణ విని వెళ్ళిపోయారు. మరునాడు ఉదయం ఆయన కొడుకు ఆసిమ్‌ని పిలిచి "ఫలానావీధిలో ఒక బాలిక తల్లితోపాటు నివసిస్తోంది.



నువ్వక్కడికి వెళ్ళి ఆ అమ్మాయికి పెళ్ళి కాకపోతే ఆమెను చేసుకో. దేవుడు తలచుకుంటే ఆ అమ్మాయి ద్వారా నీకు ఓ శుభప్రదమైన చిరంజీవి ప్రసాదించవచ్చు" అని చెప్పారు.

ఆ తరువాత ఆసిమ్‌తో ఆ బాలిక వివాహం జరిగింది. ఆమె పవిత్రఉదరం నుంచి ఉమ్మెఆసిమ్ పుట్టింది. ఆమెకు జన్మించిన మహనీయుడే హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై). ఖలీఫాగా ఎన్నుకోబడి ఎంతో న్యాయంగా, నిజాయితీగా దేశాన్ని పాలించి అయిదవ శ్రేష్ఠఖలీఫాగా ఖ్యాతి చెందారు ఆయన.

## యోధుని రక్తం కంటే స్త్రీ స్తన్యమే విలువైనది

ఇస్లాం చల్లని వీచికలు కోసం భారతదేశ తలుపులు తెరచి ఈ దేశ చరిత్ర గతినే మార్చిన ముహమ్మద్ బిన్ ఖాసిం గురించి తెలియని వారెవరు? స్వార్థరాజకీయాలు, మతదురభిమానాలు పదిహేడేళ్ళ ఆ నవయుకుడి సచ్చరితను వక్రీకరించడానికి ఎంత ప్రయత్నించినా వాస్తవాలు ఇప్పటికీ వెలుగుచూస్తూ పలువురిని ఆశ్చర్య పరుస్తున్నాయి.

అంతేకాదు, అతని శిక్షణ వెనుక ఉన్న అదృశ్యహస్తం ఓ స్త్రీ మూర్తిదన్న విషయం తెలిస్తే వారు మరింత ఆశ్చర్యపోతారు. కాని "యోధుని రక్తం కన్నా స్త్రీ స్తన్యమే ఎంతో విలువైనద"ని గ్రహిస్తే వారిలా ఆశ్చర్యపోరు. ఇస్లాం ముస్లిం మహిళలకు ఇలాంటి నినాదం ఇచ్చి వారి వెన్ను తట్టింది.

## పట్టుదల పడతుల వారసత్వం

స్త్రీ తలచుకుంటే తన ధ్యేయపథంలో ఒక్క అంగుళమైనా వెనుకంజ వేయదు. స్థిరత్వం స్త్రీల సొత్తు. పట్టుదల పడతుల వారసత్వం. ఈ రెండు లక్షణాలు పురుషుని కన్నా స్త్రీకే ఎక్కువ. అందుకే అజ్ఞానకాలం నాటి ఉమర్ (రజి) తన చెల్లెలు ఫాతిమా (రజి) ఇస్లాం స్వీకరించిన నేరానికి ఆమెను చెవిపోగు తెగి రక్తంకారేలా కొట్టి అలసిపోతారు. అయినా ఆ ధీరవనిత విశ్వాసం కించిత్తయినా సడలలేదు. పైగా ఆమె దెబ్బతిన్న సింహంలా గర్జిస్తూ "ఔను నేను, నాభర్త ఇస్లాంస్వీకరించాం. ఇక దీన్నుంచి వెనక్కి మరలే ప్రసక్తే లేదు; నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అని తెగేసి చెప్పారు. ఆ నారీమణి ప్రదర్శించిన స్థయిర్యం, స్థిరత్వాలే ఉమర్ (రజి)ని ఇస్లాం స్వీకరించేలా చేశాయి.

పరమకిరాతకుడయిన అబూజహల్ దగ్గర బానిసగా పనిచేస్తున్న మరో స్త్రీ హజ్రత్ సుమయ్యా (రజి) ఇస్లాం ధర్మం స్వీకరించినందుకు ఆ దుర్మార్గుడు ఆమెను చిత్రహింసలు పెట్టి, చివరికి బరిసెతో పొడిచి చంపేశాడు. అయినా సహనమూర్తి అయిన ఆ సాధ్వీమణి ఆ చిత్రహింసలు సహించి విశ్వాస స్థితిలోనే ఊపిరి విడిచారు. ఆమె కుమారరత్నమే హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి).

అలాగే మరోఅవిశ్వాసి దగ్గర బానిసగా ఉన్న హజ్రత్ జునైరా (రజి) ఇస్లాం స్వీకరించినందుకు ఆ దుర్మార్గుడు కూడా ఆమెను అనేక బాధలు పెట్టాడు. చివరికి హజ్రత్ అబూబకర్ (రజి) ఆమెను కొని బానిసత్వం నుంచి విముక్తి కల్గించారు.

అయితే ఆతర్వాత ఏకారణం వల్లనో ఆమె దృష్టిపోయింది. దాంతో బహుదైవారాధకులు 'లాత్,ఉజ్జా దైవాలు ఆమెను అంధురాలిగా చేశాయ'ని గేలిచేయసాగారు. హజ్రత్ జునైరా (రజి) ఈమాట విని "వారు అబద్ధం చెబుతున్నారు. లాత్, ఉజ్జాలకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించే శక్తి లేదు" అన్నారు దృఢవిశ్వాసంతో. దేవునికి ఈమాట నచ్చింది కాబోలు, ఆమెకు దృష్టి తిరిగొచ్చింది. (సీరత్ ఇబ్నె హిషాం)

## భర్తను పోషించిన భార్య

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) భార్య హజ్రత్ జైనబ్ బిన్త్ అబూమావియా (రజి) ప్రముఖ హస్తకళాకారిణి. భర్తకు చాలా కాలందాకా ఎలాంటి జీవనోపాధి లభించక పోవడంతో హజ్రత్ జైనబ్ (రజి) హస్తకళ ద్వారా తాను సంపాదించే సంపాదనంతా భర్తా పిల్లల కోసం ఖర్చుచేసేవారు. దానివల్ల దానధర్మాలు చేయడానికి ఆమె దగ్గర చిల్లిగవ్వ కూడా మిగిలేది కాదు. ఈ విషయం ఆమెను తరచుగా బాధిస్తుండేది. దీన్ని గురించి అడగడానికి ఓరోజు ఆమె దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు.

ఆమె కలుసుకోవడానికి ముందే దైవప్రవక్త (సల్లం)కు ఈ సంగతి తెలిసి "ఆమెకు రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. ఒకటి, బంధుత్వానికి (భర్తాపిల్లల పోషణకు) సంబంధించినది. రెండు, దానానికి (సదఖాకు) సంబంధించినది" అని చెప్పారు.

ఇలా హజ్రత్ జైనబ్ (రజి) తన సంపాదనతో ఇటు కుటుంబాన్ని పోషిస్తూనే అటు దానధర్మాల పుణ్యఫలానిక్కూడా అర్హులయ్యారు. ప్రఖ్యాత హదీసువేత్త (ముహద్దిస్) హజ్రత్ అబూఉబైదా (రహ్మలై) ఈ సాధ్వీమణి కుమారరత్నమే.

## ఉత్తమ తల్లులే ఉత్తమ జాతిని ఇస్తారు

ఇలాంటి వీరమాతల పాలు తాగి వారి ఒడుల్లో పెరిగే సంతతి పులుల సైన్యంగా మారుతుంది. భౌతిక బలాన్ని, భారీకాయాలను చూసుకొని విర్రవీగే ఏనుగుల సైన్యాన్ని ఇవి ఒక్క గాండ్రింపుతోనే అదరగొట్టి పారదోల్తాయి. ఈ రహస్యాన్ని గ్రహించే నెపోలియన్ బోనాపార్టీ "మీరు నాకు ఉత్తమ తల్లుల్ని ఇవ్వండి, నేను మీకు ఉత్తమ జాతిని ఇస్తాను" అని అన్నాడు. సచ్ఛీలం, సద్వర్తనం, సామాజికస్పృహ కలిగిన స్త్రీలకు జన్మించిన జాతి మాత్రమే శత్రుసేనలతో పోరాడగల సామర్థ్యం పొందగలుగుతుంది.

## పండితకుమారునికి పామరతల్లి హితోపదేశం

షాఫయి ఫిఖా వ్యవస్థాపకుడు హజ్రత్ షాఫయి (రహ్మలై)ని ధర్మవగాహనలో ప్రగతి శిఖరాలకు చేర్చి, ఆయన పేరుప్రతిష్ఠలను ప్రపంచవ్యాప్తం చేసిన వ్యక్తి ఎవరో తెలుసా? ఆయన మాతృమూర్తే. హజ్రత్ షాఫయి (రహ్మలై) మదీనాలో ఉన్నతస్థాయి ధర్మవిద్య నభ్యసించిన తరువాత విద్యాసంపత్తితో పాటు కానుకల రూపేణ వచ్చిన అపార సిరిసంపదలతో మక్కా తిరిగివచ్చారు. ఆయన్ని స్వాగతించడానికి ప్రజలు కూడా తండోపతండలుగా వచ్చారు. వారిలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు.



హజ్రత్ షాఫయి (రహ్మలై) జనసమూహాన్ని చూసి సంతోషసాగంలో తేలియాడుతూ, అభినందనల జడివానలో తడిసిపోతూ, వెంట తెచ్చుకున్న ఖరీదైన వస్తువుల్ని చూసుకొని మురిసిపోతున్నారు. కాని ఆ తల్లిముఖం విచారం, ఉదాసీనతలతో చిన్నబోయిఉంది. ఆమె ఎందుకో కొడుకు తెస్తున్న ప్రాపంచిక సంపదను ఏహ్యాభావంతో చూడసాగింది.

ఆబాలగోపాలమంతా ఆనందసాగరంలో ఓడలాడుతుంటే తన తల్లి పెదాలపై మచ్చుకు దరహాసం కూడా లేకపోవడం షాఫయి (రహ్మలై)ని ఆశ్చర్యపరచింది. బంధుమిత్రుల ప్రశంసలు, అభినందనలతో అప్పటికే చాలాసేపు గడచిపోయింది. ఇకబయలు దేరుదామని తలచి "ఇక వెళ్దాం పదమ్మా!" అన్నారు ఆయన తన తల్లితో.

"ఎక్కడికి వెళ్దాం నాయనా?" అన్నది ఆమె కొడుకు కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఇంటికి వెళ్దాం పదమ్మా!" అన్నారు ఇమామ్ షాఫయి (రహ్మలై) తల్లి అడిగిన ప్రశ్న అర్థంగాక అదోలా చూస్తూ.

## తల్లి దీవెనల ఫలితం

"నాయనా! నీకు గుర్తుందా? నిన్ను పరదేశం పంపేటప్పుడు మనింట్లో రెండు దుప్పట్లు తప్ప మరేమీ లేవు. చదువు మీదున్న నీ ఆసక్తి చూసి ఆ దుప్పట్లే నీకు అప్పగించాను. హదీసు సిరులతో తిరిగొస్తావన్న కొండంత ఆశతో నిన్ను పంపాను. అంతేగాని, ఈ ప్రాపంచికసిరులు తీసుకురమ్మని నేనెన్నడూ నీకు చెప్పలేదే! మీ బాబాయి కొడుకుల కన్నా గొప్ప ఆస్తిపరుడవని గర్వపడుతూ వాళ్ళను అల్పులుగా భావించడానికి వీటిని తెచ్చుకున్నావా? ఇది అహంకారపు ధనం నాయనా! మనకిది తగదు" అన్నది ఆమె.

ఈమాటలు విన్న షాఫయి (రహ్మలై)కు కాస్సేపటిదాకా నోటమాట పెగల్లేదు. "తన తల్లి హృదయం ఎంత గొప్ప హృదయం! ప్రాపంచిక సంపదంటే ఎంత నిర్లక్ష్యం! ధర్మవిద్య పట్ల ఎంత గౌరవం, అభిమానం! ధర్మవిద్యలో తానింత గొప్పవాడయ్యాడంటే అది తన తల్లి దీవెనల ఫలితమే"


శాంతి సమరం న్యాయం



**శాంతి కావాలంటే దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా సమరభేరి మోగించాల్సిందే! శాంతిరక్షణ కోసం న్యాయవంతమైన పాలనావ్యవస్థే శరణ్యం.**

ఇస్లాం వెలుగులో వీటి వివరాలు తెలుసుకోదలచిన వారు ఈ పుస్తకం తప్పకుండా చదవాలి. ఇందులో శాంతికి అసలైన సోర్స్, మానవుని జీవిత పరమార్థం, శాంతి ఉద్యమం ప్రారంభదశ, యుద్ధఘట్టాలు, శ్రేష్ఠసమాజం, ఇస్లాంలో న్యాయవ్యవస్థ, నేరవిచారణ విధానం వగైరా శీర్షికలు ఉన్నాయి.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:224, వెల: రూ. 85/-)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్, ఫ్లాట్ నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్, ✆ 66 710 795, 944 1515 414**

అమ్మా అంటూ ఆయన తల్లిని పెనవేసుకొని ఆమె చేతుల్ని చుంబించారు.

"చెప్పమ్మా! ఇప్పుడు నువ్వు ఏం చెబితే అదే చేస్తానమ్మా!" అన్నారు ఆయన.

"చెప్పేదేముంది నాయనా! పేదవాళ్ళు, ఆకలి గొన్నవాళ్ళు, వస్త్రహీనులు వచ్చి ఈ సిరులన్నీ పట్టుకెళ్ళమని బహిరంగంగా ప్రకటించు" అన్నది ఆయన తల్లి.

హజ్రత్ షాఫయి (రహ్లై) తల్లి చెప్పినట్లే చేశారు. కొన్ని క్షణాల్లోనే గుర్రాలతో సహా తాను తెచ్చుకున్న సామగ్రినంతా పేదలకు, అనాథలకు పంచేశారు.

## ఊయల ఊపే చేతులు ఊళ్ళు ఏలుతాయి

ఇలా హజ్రత్ షాఫయి (రహ్మ) తల్లిఆదేశం శిరసావహించి ఉత్తచేతులతో, కట్టు బట్టలతో తల్లి వెంట తన పూరిపాకాలో ప్రవేశించారు. ఆనాటి నుంచి ఆయన ఎలాంటి ప్రాపంచిక వ్యామోహానికి గురికాకుండా కష్టనష్టాలు సహిస్తూ, జ్ఞానాంబరంలో పండిత సుధాకరుడయి, ప్రజల చీకటి హృదయాలపై వెలుగు రవ్వలు వెదజల్లసాగారు.

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది ముస్లింలు ఇమామ్ షాఫయి (రహ్మలై) రూపొందించిన ధర్మదృక్పథాన్ని అనుసరిస్తున్నారంటే దానికి మూలకారణం ఆయన మాతృమూర్తి ఇచ్చిన అసాధారణ శిక్షణే. ఆయన వ్యక్తిత్వంలో ఇమామ్ మాలిక్ (రహ్మ) తదితర గురువులు నిర్మించిన జ్ఞాన మహాసౌధానికి ఆ తల్లి వేసిన పటిష్ఠవంతమైన పునాదులే. అందుకే 'ఊయల ఊపే చేతులు ఊళ్ళు ఏలుతాయి' అన్నారు పెద్దలు.

## సంఘసేవలోనూ స్త్రీల పాత్ర ఉంది

ఖలీఫా ఉమర్ (రజి) నగరంలో ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి మారు వేషంలో ఓరోజు రాత్రి గస్తీ తిరుగుతూ ఓ పూరిపాక దగ్గరకు వచ్చారు. ఆ పూరిపాకాలో ఉంటున్న పౌరుడితో ఆయన మాట్లాడసాగారు. కాస్సేపటికి హఠాత్తుగా ఆ పూరిపాక నుంచి స్త్రీ ఏడుపు వినవచ్చింది.

హజ్రత్ ఉమర్ (రజి) పూరిపాక వైపు చూస్తూ "ఎవరామె ఏడుస్తోంది?" అనడిగారు.

"ఆమె నా భార్యేనండీ! పురిటినొప్పులతో బాధపడుతోంది" అన్నాడు గుడిసెవాసి.

"అయితే ఉండు, ఇప్పుడే వస్తాన"ంటూ హజ్రత్ ఉమర్ (రజి) పరుగు వేగంతో ఇంటికెళ్ళి తన భార్య హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (రజి)కు ఈ విషయం చెప్పారు.

"అయ్యయ్యో ఎంత బాధపడుతుందో! పదండి, నేను మీ వెంట వస్తున్నా" అంటూ హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) దుప్పెట కప్పుకొని సిద్ధమయ్యారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అప్పటికప్పుడు శ్రీమతిని వెంటబెట్టుకొని పూరిపాక దగ్గరకు చేరుకున్నారు. పోగానే శ్రీమతిని లోపలికి పంపించి ఆయన బయట గుడిసెవాసి దగ్గర కూర్చున్నారు.



కాస్సేపటికి హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) ఆ స్త్రీకి కాన్పు చేసి "అమీరుల్ మోమినీన్! మీ స్నేహితుడికి శుభాకాంక్షలు చెప్పండి, ఆయనకు కొడుకు పుట్టాడు" అని లోపలి నుంచి కేకవేసి చెప్పారు. నిరుపేద గుడిసెవాసి తన భార్యకు కాన్పుచేసిన స్త్రీ దేశాధినేత భార్య అని తెలియగానే బిత్తరపోయాడు.

పూర్వకాలపు మాతృమూర్తులు తమ పిల్లవాడు ఎప్పుడు ఎదిగి యువకుడయి పోతాడా, ఎప్పుడతడ్ని జిహాద్‌కు పంపుదామా అని తహతహ లాడిపోయేవారు. కాని ఈకాలం తల్లులు తమ పిల్లవాడు ఎప్పుడు పెద్దవాడయిపోతాడా, ఎప్పుడు ఉద్యోగం చేసి నాలుగుచేతులా సంపాదిస్తాడా అని ఎదురుచూస్తున్నారు.

## సదా గుర్తుంచుకోవాల్సిన నగ్నసత్యం

కాని నేటి ముస్లిం మహిళ ఓ నగ్నసత్యాన్ని సదా గుర్తుంచుకోవాలి. భావితరం భవితవ్యం ఆమె చేతుల్లోనే ఉంది. ఆ చేతులతో ఒకసారి గీచిన 'గీతలు' అవి ధర్మానికి సంబంధించినవయినా, అధర్మానికి సంబంధించినవయినా సరే సమాధికి చేరేదాకా చెరిగి పోవు. ఆమె తన శిక్షణా సాధనంతో చరిత్రదిశనే మార్చగలుగుతుంది. ఆ దిశ దైవానికైనా లేదా దుష్టశక్తికైనా అనుకూలమైనది కావచ్చు.

ముస్లిం మహిళలు స్వయంగా ఇమామ్ హుసైన్ (రజి), ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై), ముహమ్మద్ బిన్ ఖాసిం, సలాహుద్దీన్ అయ్యూబి, ఇమామ్ గజాలి, ఇబ్నె తైమియా లాంటి మహనీయులు కాకపోవచ్చు. కాని అలాంటి మహనీయుల్ని తయారుచేయగల శక్తిస్వరూపిణులు అయ్యే అవకాశం మాత్రం లేకపోలేదు.

ముస్లిం మహిళ ముందుకొచ్చి ఇలాంటి "కింగ్‌మేకర్" పాత్ర వహించగలిగితే అత్యున్నత మానవీయ విలువలు, అసామాన్య నైతిక ప్రమాణాలతో భాసిల్లే నవతరాన్ని తయారు చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే దీనికి ఒక్కటే షరతు. ఆమె ఖతీజా (రజి), ఫాతిమా (రజి), ఆయిషా (రజి), జైనబ్ (రజి)లను తన హీరోయిన్ లుగా, ఆదర్శప్రాయులుగా స్వీకరించాలి.

(-సమాప్తం-)

